# అవధూత లీల

భగవాన్ శ్రీశ్రీశ్రీ వెంకయ్యస్వామివారి జీవిత చరిత్ర

నిత్య పారాయణ గ్రంథము



సేకరణ

పెసల సుబ్బరామయ్య



భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి

# అవధూత లీల

భగవాన్ శ్రీశ్రీశ్రీ వెంకయ్యస్వామివారి జీవిత చరిత్ర
నిత్యపారాయణ గ్రంథము

సేకరణ
పెసల సుబ్బరామయ్య

ప్రకాశకులు :
శ్రీ సాయి మాస్టర్ సేవాట్రస్ట్
గొలగమూడి
(వయా) సర్వేపల్లి
నెల్లూరు జిల్లా (A.P)
PIN- 524 321

సర్వస్వామ్యములు : ప్రకాశకులవి

పద్నాలుగవ ముద్రణ : 2000 ప్రతులు

ప్రాప్తిస్థానము :
**శ్రీ స్వామికృప పబ్లికేషన్స్**


***పెనల సుబ్బరామయ్య***
గొలగమూడి పోస్ట్
(వయా) సర్వేపల్లి – 524 321
నెల్లూరు జిల్లా (A.P)

**వెల : రూ. 40–00**

ముద్రణ:
మనోజ్ ప్రింటర్స్
చప్పల్ బజార్, కాచిగూడ, హైదరాబాద్
సెల్ : 9246887388




భగవాన్ శ్రీవెంకయ్యస్వామి



భగవాన్ శ్రీవెంకయ్యస్వామి




స్వామి సేవకురాలు తులసవ్వ




చుండు నాగయ్యగారు పురఫ్ రోశిరెడ్డిగారు




మాతాజీ వక్కెమ్మగారు




భక్త శిఖామణి శ్రీఅక్కిం వెంకటరామిరెడ్డిగారు



శ్రీ నల్లపురెడ్డి ఆదినారాయణరెడ్డిగారు



శ్రీ కొమరగిరి రమణయ్యగారు



శ్రీ బరిగెల నాగయ్య



శ్రీమతి గుత్తా నరసమ్మ



శ్రీ స్వామి వారు వాడిన వస్తువులు
బండి, పాదుకలు, డోలి, పాలుకాచిన గిన్నెలు



భగవాన్ శ్రీవెంకయ్యస్వామి



## పూజ్య పాదులు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు

శ్రీ స్వామివారు మన మధ్య ఉండగనే వారి జీవిత చరిత్ర ప్రచురించమని, అందుకు మీకు శక్తిలేకుంటే శ్రీ స్వామివారి దివ్యలీలలతో కరపత్రములు వేయించి నెల్లూరులో ప్రతి ఇంటికి పంచమని శ్రీ స్వామివారి సేవకులనెంతగానో ప్రోత్సహించారు. అవి వారు చేయలేకపోయారు.

కనుక విద్యానగర్ సాయి మందిర ప్రారంభోత్సవమునకు వేసిన సావనీర్‌లో శ్రీ స్వామివారి ఫోటో మరియు వారి దివ్యలీలలు మొట్టమొదటిసారిగా కాగితంపై ప్రచురించి ప్రపంచమునకు శ్రీ స్వామివారిని గూర్చి తెల్పిన పుణ్యమూర్తి. ఇలాంటి పనుల ద్వారా శ్రీ స్వామివారి ఆగ్రహమునకు గురికావలసి ఉంటుందని అనేకులు చెప్పారు. అందుకు వారు “ఇంత మంది ప్రజలకు మేలు జరుగుతుంది. నేనొక్కడను నాలుగు జన్మలు వెనుకకు పోయి వస్తాను. నాకేమీ చింత లేదు” అన్న పుణ్యమూర్తి పూజ్యపాదులు ***ఆచార్య శ్రీ భరద్వాజ మాష్టారుగారు.*** శ్రీ స్వామివారు మన మధ్య ఉండగనే వారి జీవితాన్ని గూర్చి నాచేత విషయ సేకరణ చేయించి శ్రీ స్వామివారి మొదటి జీవిత చరిత్ర ప్రచురించి ఈ లోకానికే పూజ్యనీయుడైనారు.

# విషయసూచిక


| | | పేజి సంఖ్య |
|---|---|---|
| ముందుమాట | | iv |
| కృతజ్ఞత | | v |
| గ్రంథపారాయణ పద్ధతి | | vi |
| శ్రీస్వామివారిని సేవించే విధము | | vii |
| దీక్ష చేసేవారికి సూచన | | viii |
| గురు దర్శనము | | x |
| **అధ్యాయములు :** | | |
| 1 | శ్రీ వెంకయ్యస్వామి వారి జీవితం | 1 |
| 2 | అనికేతుడు | 9 |
| 3 | అవధూత లీలలు | 28 |
| 4 | సర్వజ్ఞమూర్తి | 33 |
| 5 | సర్వ సమర్థుడు | 56 |
| 6 | భూతనియంత | 68 |
| 7 | ఆపద్బాంధవుడు | 80 |
| 8 | అమృతవాక్కు | 88 |
| 9 | దయాసాగరుడు | 99 |
| 10 | పతితపావనుడు | 109 |
| 11 | అవధూత వైద్యం | 116 |
| 12 | సజ్జన వందిత | 124 |
| 13 | దక్షిణ | 127 |
| 14 | సాధుదూషణ | 131 |
| 15 | భిక్షాన్నం | 133 |
| 16 | జన్మజన్మల అనుబంధం | 136 |
| 17 | దివ్యానుభవాలు | 140 |

| | | |
|---|---|---|
| 18 | దేంతో పీకులాడే వాళ్ళు దాంట్లోకే | 150 |
| 19 | శ్రీస్వామివారి అభయం | 155 |
| 20 | ధర్మాచరణ | 160 |
| 21 | శ్రీస్వామివారి దివ్యబోధ | 165 |
| 22 | శ్రీస్వామివారి సూక్తులు | 189 |
| 23 | నమ్మినవారికి సొమ్ము – నమ్మకుంటే ......... | 192 |
| 24 | శ్రీస్వామివారి అభేదస్థితి | 197 |
| 25 | మహాసమాధి | 206 |
| 26 | సాధన | 216 |
| 27 | స్వామివారికి అతిప్రీతిపాత్రమైన పని అందరూ చేసి.... | 225 |
| 28 | నా స్వానుభవాలు (రచయిత) | 228 |
| 29 | మహాసమాధి అనంతరం లీలలు | 235 |


## ప్రార్థన

గురుమధ్యే స్థితం విశ్వం విశ్వ మధ్యే స్థితో గురుః
గురుర్ విశ్వంనచాన్యోస్తి తస్మై శ్రీ గురవేన్నమః

## శ్రీ స్వామివారికి దక్షిణ పంపేవారు

ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ & మెంబర్ సెక్రటరి

భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమము,

గొలగమూడి – 524 321. నెల్లూరు జిల్లా అని పంపవలెను.

వ్యక్తుల పేర్లతో పంపవద్దు.

# ముందుమాట

దీనజనోద్ధరణ కొరకు, భక్త సంరక్షణ కొరకు, ముముక్షువులకు మార్గం చూపడానికి ఆ పరమాత్మ మన మధ్య సద్గురువుగా అవతరిస్తారు. అట్టి సద్గురువులలో శాస్త్రాలలో నిర్దేశించబడిన సర్వవ్యాపకత్వం, సర్వసమర్థత, సర్వజ్ఞత్వాలు సంపూర్ణముగా ప్రకటమవుతాయి. అలా ప్రకటమయినవారే గొలగమూడిలో వెలసిన అవధూత శ్రీ వెంకయ్యస్వామివారు.

మహాత్ములు శరీరం చాలించిన తర్వాత గూడా నిత్యసత్యులై కోరిన చోట శరీరంతో కన్పించగలరు. అదృశ్యంగా అంతటా నిండియుండి ఎల్లవేళలా తమ భక్తుల ప్రార్థనలను, చేష్టలను సాక్షిగా గమనిస్తూనే ఉంటారు. మనము ఏమారి వారిని ప్రార్థించకున్నా, వారు మనలను అన్ని వేళలా రక్షిస్తారు. శ్రీ స్వామివారి మహాసమాధి అనంతరం జరుగుతున్న లీలలే అందుకు నిదర్శనం. శ్రీ స్వామివారికి మతభేదం లేదు. వారి సమాధిని అన్ని కులాల, మతాల వారూ దర్శించి బాధలను తొలగించుకుంటున్నారు.

నిరంతర సద్గురు స్మరణ వలన భవబంధాలు దగ్ధమై తనకు, గురువుకూ భేదం లేకుండా పోయి భక్తుడు ముక్తుడవుతాడన్నది శాస్త్ర వాక్యం. ఇలా శ్రీ స్వామివారిపై నిరంతరం మన మనస్సును నిలుపడానికి వారి జీవిత విశేషాలను స్మరించడం బలమైన ఆలంబనము. కనుకనే వారి రూపం, వాక్కులు జీవిత విధానమూ ఈ గ్రంథంలో వివరించాము. శ్రీ స్వామివారి జీవితం సాధువులకు ఆదర్శప్రాయమైన కొండపై నున్న జ్యోతివలె మార్గదర్శకమైనది. సర్వజీవుల మీద ప్రేమ, నిరాడంబరత, ధ్యేయము పై శ్రద్ధ, కార్యదీక్ష, వైరాగ్యము, ధర్మాచరణ, ఇంద్రియ నిగ్రహము వారు ఆచరించి మనకు చూపిన దివ్య మార్గాలు.

శ్రీ సాయినాధుని, శ్రీ రమణ మహర్షినీ మనం చూడలేదుగానీ, 1982 వరకూ మన మధ్య జీవించిన శ్రీ స్వామివారిని దర్శించగలిగామనుకుంటే మనమెంత అదృష్టవంతులమో తెలుస్తుంది. వారు శరీరంతో వుండగా తమ విశ్వరూపాన్ని, మహిమను చాలా గోప్యంగా వుంచారు. తమ కీర్తి వ్యాపనాన్ని చిత్రమైన రీతులలో అరికట్టేవారు. మహాసమాధి తరువాతనే భక్తులు తమ దివ్యానుభవాలను ఒకరితో ఒకరు చెప్పుకొని తన్మయత్వం పొందే భాగ్యం కలిగింది. సద్గురు స్మరణ వలన సర్వులూ ఇలాంటి దివ్యానుభూతులు పొంది వారి కృపకు పాత్రులు కావాలనే సత్సంకల్పంతో భక్తులు ఈ దివ్యానుభవాల సంపుటాన్ని కూర్చడానికి సహకరించారు.

# కృతజ్ఞత

ఈ జగన్నాటకంలో నాకూ ఒక పాత్రను కల్పించి, పవిత్ర జీవితం వైపు ప్రేరేపించిన పరమాత్మకు, వారి ప్రతిరూపమైన గురుదేవులు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాష్టర్‌గారు నా యందు తండ్రి కంటే ఎక్కువ ప్రేమను చూపి నన్ను శ్రీ స్వామివారి సన్నిధికి పంపి, వారి జీవిత చరిత్ర సేకరింపజేసి ప్రథమ గ్రంథముగా తీర్చిదిద్ది ముద్రించినందులకు వారి పవిత్ర పాదపద్మములకు సహస్ర సాష్టాంగ దండప్రణామములు.

ఈ విధమైన నా సేవను స్వీకరించిన శ్రీ సాయినాథునకు, శ్రీ వెంకయ్యస్వామివారికి సాష్టాంగ దండ ప్రణామములు.

పరమ పూజ్యులైన మా తల్లిగారు పెసల శేషమ్మగారికి మా సోదరుడు రమణయ్యగారికి కృతజ్ఞతాభివందనాలు. ఈ గ్రంథ ముద్రణకు సహకరించిన శ్రీ యం.వెంకటేశ్వర్లుగారికి (ఒంగోలు) ఎ.సోమిశెట్టి వెంకటేశ్వర్లుగారికి (సూళ్ళూరుపేట) శ్రీ స్వామివారి ఆశీస్సులు సదా ఉండాలని ప్రార్థిస్తున్నాను.

**పెసల సుబ్బరామయ్య**

# గ్రంథ పారాయణ పద్ధతి

ఈ సద్గ్రంథాన్ని క్రమపద్ధతిన పారాయణ చేస్తే శ్రీ స్వామివారి కృప విశేషంగా అనుభవమవుతుంది. అది శ్రీ దత్తాత్రేయ సాంప్రదాయం.

అవకాశమున్నప్పుడల్లా ప్రతివారూ సప్తాహ పారాయణ చేసుకొనేందుకు వీలుగా ఈ గ్రంథాన్ని రూపొందించడమైనది. లేక అమావాస్యనాడు శ్రీ స్వామివారిని పూజించి శుక్ల పాడ్యమి నుండే పారాయణ ఆరంభించి పూర్ణిమ వరకూ 15 రోజులు ఈ గ్రంథ పారాయణ పూర్తి చేయవచ్చు. ఏరోజెంత చదవవలసిందీ ఎవరికి వారే నిర్ణయించుకోవచ్చు. అవకాశాన్ని బట్టి పారాయణ సమయంలో శ్రీ స్వామివారి పటానికిగాని, శ్రీ దత్తాత్రేయ స్వామి పటానికిగాని, లేక వారి పూర్ణావతారమైన శ్రీ సాయి పటానికిగాని ధూపదీపాలర్పించి, పారాయణ చివర 108 సార్లు అక్షింతలు, తులసి పూలు మొదలైన వాటితో పూజించి, నైవేద్యమిచ్చి హారతివ్వాలి. లేక ఈ పారాయణను ఒక గురువారమారంభించి రెండు వారాలకు వచ్చే గురువారంతో పూర్తి చేయవచ్చు. చివరి రోజు శ్రీ స్వామివారికి టెంకాయ, పూలు సమర్పించి, ఆయన రూపాలుగా తలచి ఒకరికి గాని, ముగ్గురికి గాని వికలాంగులైన పేదలకు భోజనము పెట్టి, తమ శక్తి ననుసరించి దక్షిణ, తాంబూలమివ్వడం శ్రేయస్కరం. అది వీలుగాని వారు స్వామికని సంకల్పించి భోజనాన్ని ఇంటి వెలుపల విడచి, మిగిలిన అన్నదానాదులకయ్యే ఖర్చును శ్రీ పూర్ణాశ్రమానికి సమర్పించవచ్చు.

స్త్రీలు బహిష్టు సమయంలో మాత్రం ఈ గ్రంథాన్ని చదువరాదు. భక్తులకు హృదయంలో శోకం లేనప్పుడు మైల (సూతకం) పారాయణకు ఆటంకం కాదు.

అవకాశమున్నవారు ఒక్క వారంలో కూడా గ్రంథ పారాయణ చేయవచ్చు. ఎప్పుడైనా పారాయణలు 1, 3, 5 వంటి బేసి సంఖ్యలలో చేయడం శ్రేయస్కరం.

శ్రీ స్వామివారి భక్తులందరికీ ప్రతి సంవత్సరమూ శ్రీ స్వామివారి ఆరాధనోత్సవంలో దర్శన, సేవల వలన అత్యంతమైన శ్రేయస్సు కల్గుతుంది.

కొన్ని ఆవర్తాలు పారాయణ అయ్యాక ఈ గ్రంథంలో పేర్కొన్న ఇతర మహనీయుల చరిత్రలు కూడా పారాయణ చేయడమెంతో శ్రేయోదాయకం.

# శ్రీ స్వామివారిని సేవించే విధము

1. శ్రీ స్వామివారి జీవిత చరిత్ర పారాయణ.
2. వంటచేశాక మొదట కొంచెం అన్నము, కూర ఒక ఆకులోగాని కాగితంలోగానీ పెట్టి ఇంటి బయట గుమ్మం దగ్గర ఉంచి సకల జీవస్వరూపుడైన భగవాన్ శ్రీ వెంకయ్య స్వామివారికి సమర్పిస్తున్నాను అని నమస్కరించి ఆ అన్నం జీవులకు వదలి వేయడం.
3. శ్రీ స్వామివారి అగ్ని గుండమునకు టెంకాయ, కట్టెలు, సాంబ్రాణి, నవధాన్యములు సమర్పించడం. జీవితాంతము శ్రీవారు అన్నపానీయముల కంటే అధికంగా అగ్నిగుండాన్నే ప్రేమతో సేవించారు.
4. ఇంటిలో శ్రీ స్వామివారి పటాన్ని శ్రద్ధతో పూజించడం.
5. స్త్రీలు ఇంటికి దూరమైనపుడు పై పనులు మరొకరిచేత చేయించడం.
6. శ్రీ స్వామివారి అగ్నిగుండమునకు, సమాధి మందిరమునకు ఏకాగ్రమైన మనస్సుతో నూట ఎనిమిది ప్రదక్షిణలు చేయడం.
7. శ్రీ స్వామివారి సన్నిధికి వచ్చినపుడు లౌకిక వ్యవహారములు మాట్లాడటం మాని ప్రదక్షిణలు, నామస్మరణ, సద్గ్రంథ పఠనంలో కాలము గడుపుట.

తనకు సేవచేసేవారు ఇతరులను విమర్శించినా, కోపము మొదలగు దుర్గుణములకు లోనైనా, వారి సేవను శ్రీ స్వామివారు అంగీకరించేవారు కాదు.

సాటివారిని విమర్శిస్తుంటే ఆలకించినా దోషమే. ఒకప్పుడు ఒక సేవకుడు అలాంటి దుర్విమర్శలు విని వచ్చి శ్రీ స్వామివారికి జావపోయబోయాడు. "చెప్పుడు మాటలు విని వచ్చావు. నీవు పోసే జావ వద్దుపో" అన్నారు శ్రీ స్వామివారు.

**ప్రపంచంలో అన్నింటిలోకి అతి విలువైనది మనస్సు.**

**దానినెంతో పవిత్రంగా పై చెప్పిన దుర్గుణములు చేరకుండా శ్రీ స్వామివారి స్మరణకు మాత్రమే వినియోగిస్తే, శ్రీ స్వామివారు మన సేవలనంగీకరించి ప్రసన్నులౌతారని మనం గుర్తించాలి. అలా చేయలేనపుడు మన సేవలన్నీ వ్యర్థమే!**

తన అగ్ని గుండాన్ని చూపిస్తూ శ్రీ స్వామివారు "కోటిలింగాల పూజగదయ్యా, ఇక్కడ జరిగేది" అని అన్నారు. కనుక మనమెంత నియమనిష్టలతో పవిత్రంగా మెలగాలో, గుండాన్ని సేవించాలో యోచించాల్సి వుంది.

8. గొలగమూడిలో ఒక తల్లి తన బిడ్డ తప్పిపోయినపుడు "నేను నీకు సమర్పించే నైవేద్యాలేమయినట్లు, చేసే పారాయణ ఏమయినట్లు? నా బిడ్డనిలా అన్నం లేకుండా ఎండలో బాధపెట్టడం నీకు న్యాయమేనా?" అని శ్రీ స్వామివారిపై వాపోయినపుడు వెంటనే ఆమెకు మైకం వచ్చి అగ్నిగుండంలో అఖండదీపం దర్శనమైంది. సాయంకాలమునకు ఆమె బిడ్డ తిరిగి క్షేమంగా ఇల్లు చేరాడు. అగ్నిగుండము, అఖండదీపం రూపాలలోనే ఇచ్చట శాశ్వతంగా ఉంటూ మీ నైవేద్యాలు స్వీకరిస్తున్నానని శ్రీ స్వామివారు మనకు బోధించారు గదా!

# దీక్ష చేసేవారికి సూచన

1. "నోరు విప్పకూడదయ్యా" అని శ్రీ స్వామివారు సెలవిచ్చారు. దీక్షా సమయంలో ప్రత్యేకంగా మౌనం పాటించడం ముఖ్యం. అత్యవసరమైన అన్నపానీయాల విషయం తప్ప ఇతర విషయాలు వినడం, మాట్లాడటం, ఆలోచించడం మానాలి. కాలాన్నంతా శ్రీ స్వామివారి చింతనలో గడపాలి. అలా శ్రీ స్వామివారి చింతన చేసేందుకు శ్రీవారి లీలల పారాయణ, మననము ఎంతో శ్రేయోదాయకము.
2. పగటి నిద్ర మానాలి. ఇందుకు మిత ఆహారం తప్పనిసరి అవుతుంది.

అతినిద్ర కూడా తగదు.

3. అబద్ధం చెప్పటం, తగాదా పడటం అస్సలు పనికిరాదు.
4. నామజప పూర్వకంగా నవధాన్యాలు, కట్టెలు, టెంకాయ, నెయ్యి, సాంబ్రాణి, బియ్యం వగైరా అగ్నిగుండానికి సమర్పించాలి.
   శ్రీ స్వామివారు కృపజూపినా మనకు దక్కకుండా చేసే మన చెడ్డకర్మ అడ్డు వస్తుంది. దాన్ని నామజపం ద్వారా కరిగించివేయాలి. భగవన్నామస్మరణ యొక్క ప్రభావం గురించి పెద్దలు చెప్పారు. "నాగటి చాలంత గాయం తగులవలసి వుంటే భగన్నామ జపం ఫలితంగా అది సూదితో గీచినంత స్వల్పంగా తగ్గించబడుతుంది" అని అన్నారు. అది అక్షరాలా నిజమని ఎందరో భక్తుల అనుభవం కూడా. కనుక ఒక్కక్షణం కూడా ఏమారకుండా నామజపం చేయడం అవసరం.
5. రోజుకు 108 కి తగ్గకుండా వీలైనపుడంతా ఓపిక ఉన్నంత వరకు ప్రదక్షిణలు చేయడం.
6. అన్నింటి కంటే ముఖ్యం శ్రీ స్వామివారి చరిత్ర పారాయణ. చదువురాని వారు వినడం.
7. పూర్ణ విశ్వాసంతో ఓర్పుతో ఉండడం.

# గురుదర్శనము

నేను శ్రీ భరద్వాజ మాష్టరుగారిని హమేషా దర్శించేవాడను. కానీ వారు చెప్పినట్లు శ్రీ వెంకయ్యస్వామి వారిని మాత్రం దర్శించేదిలేదు. నాయందు ప్రేమతో ఒక్క సంవత్సరం అలా చెప్పి చెప్పి చివరకు 'శ్రీ స్వామివారిని దర్శించకుంటే నా దగ్గరకు రావద్దన్నారు'. నా ముఖం వివర్ణమైంది. అది గుర్తించిన ఆ ప్రేమమూర్తి 'శ్రీ స్వామివారు భూమి మీద దేవుడు, వెళ్ళి పరీక్షించుకో' అన్నారు. పరీక్షా విధానం కూడా వారే చెప్పారు. (1) ఎవరి నుండి ఏమీ గ్రహించని శ్రీ స్వామివారు నన్నడిగి తినేందుకు పెట్టించుకోవాలని, ఎవ్వరినీ తాకనివ్వని శ్రీ స్వామివారు నాచేత తన కాళ్ళకు నూనె పూయించుకోవాలని కోరుకోమన్నారు. నేను, నా స్నేహితుడు శ్రీ టి.వి.శేషగిరిరావుగారు వెళ్ళి శ్రీ స్వామివారి సన్నిధిలో కూర్చున్నాము. క్రొత్తవారు శ్రీ స్వామివారి పాదాలు తాకకుండా కాపలా ఉండే రోశిరెడ్డిగారు, గురవయ్యగారు ఎటో వెళ్ళారు. వెంటనే 'తినేందుకు ఏమైనా పెడతాయ్యా' అని శ్రీ స్వామివారు చేయిచాపారు. మేము తీసుకెళ్ళిన శెనగలు, బెల్లం పొడిచేసి తెచ్చేలోగా రోశిరెడ్డిగారు, గురవయ్యగారు వచ్చి ఆ పొడి వారు పెట్టబోతే అంగీకరించక నాచేత పెట్టించుకొని తిన్నారు. అదే విధంగా కాళ్ళకేకాకుండా శరీరమంతా నూనె నాచేత మర్ధించుకున్నారు. స్నానం కూడా నేనే చేయించాను. అది మొదలు శ్రీ స్వామివారి ఎడల భక్తి కుదిరింది.

శ్రీ సాయి సకల సాధుస్వరూపి గనుక గురుపూర్ణిమనాడు మేము చేయబోయే శ్రీ సాయి నామయజ్ఞానికి శ్రీ స్వామివారు రావాలని శ్రీ సాయినాథునకు విన్నవించుకున్నాము.

ఎన్నోమార్లు ఆహ్వానించినా 'ఇప్పుడు కాద'న్న శ్రీ స్వామివారు ఆనాడు మా ప్రార్థన మన్నించి మా గృహానికి విచ్చేయడమే కాకుండా శ్రీ శేషగిరిరావుగారింట్లో జరిగే నామయజ్ఞాన్ని ఆశీర్వదించి వచ్చారు.

నేను శ్రీ సాయి చరిత్ర పారాయణ చేస్తుంటే ఒకరోజు శ్రీ స్వామివారు నా స్వప్నంలో 'చమురు లేకుండా కాల్చు' అని ఆజ్ఞాపించారు. తెల్లవారి శ్రీ స్వామివారినడిగితే మౌనం వహించారు. కానీ చమురు

పదార్థాలు తిన్నప్పుడు నాకున్న ఆయాసం జబ్బు హెచ్చడంతో శ్రీ స్వామివారి సందేశం నాకప్పుడు అర్థమైంది.

1980 సం॥లో నేను కొన్నాళ్ళు శ్రీ స్వామివారి సన్నిధిలో ఉండి సేవిస్తానంటే "నీ అన్నం నీవు తింటూ ఉండ" మన్నారు. అట్లా ఎందుకు స్వామీ అంటే 'వాళ్ళు బాపనోళ్ళు తినకూడదు' అని శెలవిచ్చారు. కాలాంతరంలో ఆమాట అక్షరాలా నిజమై ఇంట్లో తప్ప మరెక్కడ భోంచేసినా అనారోగ్యమవడంతో ఆ నియమాన్నే పాటిస్తున్నాను.

1983 సం॥లో ఒక స్నేహితుని బలవంతంపై పై నియమాన్ని ఉల్లఘించడంతో చలి, దగ్గు, ఆయాసం మొదలైనది. షుమారు నెలరోజుల ఆయుర్వేదం, హెూమియో, అలోపతి వైద్యాలు విఫలమైనాయి. డాక్టరు గారి సలహాపై మద్రాసు వెళ్ళదలచాను. ముందుగా శ్రీ స్వామివారి సమాధి దర్శించి మూడు నిద్రలు చేసి వెళ్ళాలని కలిచేడులో బస్సు ఎక్కినది మొదలు నా బాధలన్నీ మటుమాయమైనాయి. శ్రీ స్వామివారి సమాధి చెంత మూడు నిద్రలు చేసి ఇంటికి ప్రయాణమైతే తిరిగి నా బాధలు మొదలైనాయి. పూజారి నాగయ్యగారి సలహాపై పగలంతా ఉద్యోగం చేసుకొని సాయంకాలానికి శ్రీ స్వామివారిని దర్శిస్తానని చెప్పుకోగానే నా బాధంతా నివారణైంది. అది మొదలు నిత్యం షుమారు 60 కి.మీ. వెళ్ళి ఉద్యోగం చేసి తిరిగి గొలగమూడి చేరుతున్నాను. 1989 సం॥ నవంబరు నెల నుండి శ్రీ స్వామివారి ఆజ్ఞ ప్రకారం వాలంటరీ రిటైర్‌మెంటు ఇచ్చి గొలగమూడిలో కాపురం ఉంటున్నాను. **బాధగూడ అనుగ్రహానికి గుర్తు** అని ఈ ఘటన వల్ల తెలుస్తుంది.

శ్రీ స్వామివారి సన్నిధిలో కూర్చున్నంత మాత్రాన నా ఆయాసం జబ్బు పోసాగింది. నిత్యం దోవ పొడవునా నామజపం చేస్తూ నాలుగు ఇడ్లీలు తెచ్చి శ్రీ స్వామివారికి కృతజ్ఞతతో సమర్పిస్తే తినేవారు. ఒకరోజు నా జేబులో పదిపైసలే వుంది. పదిపైసలతో ఒకే ఇడ్లీ తేవడమా, అప్పుచేసి నాలుగు తేవడమా అనే ఆలోచనలతో మార్గమంతా నామజపం చేయలేకపోయాను. ఇడ్లీ తెచ్చాక శ్రీ స్వామివారు కనీసం తాకను గూడా లేదు.

మరొక రోజు శ్రీ స్వామివారి బృందమంతటికీ ఇంట్లో చేయించి ఇడ్లీ తెస్తానని చెప్పి – పప్పు నీటిలో పోసింది మొదలు తెల్లవారి ఇడ్లీ చేసినంతసేపు ఏమారకుండా నామజపం చేసి ఇడ్లీ తెచ్చేలోగా శ్రీ స్వామివారు హెూటల్ నుండి తెచ్చిన ఇడ్లీ తినేశారు. ఆ విషయం తెలిసి చాలా బాధపడుతూ కూర్చున్నాను. నరసారెడ్డి భార్య నా చింతకు కారణం తెలుసుకొని నాలుగు ఇడ్లీలు ప్లేటులో పెట్టుకొని శ్రీ స్వామివారిని సమీపించింది. శ్రీ స్వామివారు ఆ నాలుగు ఇడ్లీలు తినేశారు. నాకెంతో సంతోషమైంది. కనుక మొదటి సన్నివేశములో ఇడ్లీలు తాకుటకు కూడా నిరాకరించుటకు, రెండవ సన్నివేశములో ఇడ్లీలు స్వీకరించుటకు కారణము నామజపమే. కనుక **అందరూ శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన నామజపం చేసి తరించాలని నా ప్రార్థన**.

**పెసల సుబ్బరామయ్య**

# శ్రీ స్వామి అష్టోత్తర శత నామావళి

1.ఓం సర్వసమర్థ సద్గురు శ్రీ స్వామి నాథాయ నమ: (9 సార్లు)
2. ఓం గురుదేవ దత్తాత్రేయాయ స్వామి నాథాయ నమ: (9 సార్లు)
3. ఓం విశ్వప్రాణాయ స్వామి నాథాయనమ: (9 సార్లు)
4. ఓం పంచభూతాత్మ స్వరూపాయ నమ:
5. ఓం ప్రాణలింగ స్వరూపాయ నమ:
6. ఓం విశ్వలింగాయ నమ:
7. ఓం చిదంబరాయ నమ:
8. ఓం బహిరంతర్వ్యాపినే నమ:
9. ఓం దేహస్థ పృథ్వి వ్యాపస్తేజో వాయురాకాశ స్వరూపాయ నమ:
10. ఓం చిద్రూపాయ నమ:
11. ఓం చైతన్య లింగాయ నమ:
12. ఓం సర్వవ్యాపినే నమ:
13. ఓం దిగంబరాయ నమ:
14. ఓం కేవలాయ నమ:
15. ఓం విశ్వసాక్షిణే నమ:
16. ఓం సర్వజీవ స్వరూపాయ నమ:
17. ఓం నామరూపరహితాయ నమ:
18. ఓం సర్వనామరూపిణే నమ:
19. ఓం విశ్వరూపాయ నమ:
20. ఓం విరూపాయ నమ:
21. ఓం విరూపాక్షాయ నమ:
22. ఓం నిర్గుణాయ నమ:
23. ఓం నిశ్చలాయ నమ:
24. ఓం చంచలాయ నమ:
25. ఓం అరిషడ్వర్గ వినాశకాయ నమ:
26. ఓం దృశ్యాయ నమ:
27. ఓం దృగ్రూపాయ నమ:
28. ఓం హృదయాయ నమ:
29. ఓం సర్వలోకాత్మకాయ నమ:
30. ఓం సర్వలోక సాక్షిణే నమ:
31. ఓం సర్వదేవతాస్వరూపిణే నమ:
32. ఓం ఆకాశగమనాయ నమ:
33. ఓం గమనాగమనరహితాయ నమ:
34. ఓం సర్వత్ర స్థితాయ నమ:
35. ఓం సన్మాత్రాయ నమ:
36. ఓం సర్వాధారాయ నమ:
37. ఓం నాథ నాథాయనమ:
38. ఓం యోగాయ నమ:
39. ఓం యోగీశ్వరాయ నమ:
40. ఓం యోగయోగ్యాయ నమ:
41. ఓం యోగ గమ్యాయ నమ:
42. ఓం సర్వయోగ స్వరూపాయ నమ:
43. ఓం సర్వయోగి స్వరూపాయ నమ:
44. ఓం సిద్ధిదాయ నమ:
45. ఓం సిద్ధాయ నమ:
46. ఓం సిద్ధయోగినే నమ:
47. ఓం సర్వ సిద్ధసేవితాయ నమ:
48. ఓం సర్వసిద్ధిసేవితాయ నమ:
49. ఓం విఘ్నరాజాయ నమ:
50. ఓం విఘ్నహంత్రే నమ:
51. ఓం విచిత్ర వేషాయ నమ:
52. ఓం చిత్తచాంచల్యవినాశకాయ నమ:


53. ఓం భేదవర్జితాయ నమ:
54. ఓం కృపా నిధయే నమ:
55. ఓం కరుణామూర్తయే నమ:
56. ఓం సమదర్శినే నమ:
57. ఓం ఆత్మ దర్శినే నమ:
58. ఓం పరమాత్మ స్వరూపాయ నమ:
59. ఓం వర్షరూపక యజ్ఞకృతే నమ:
60. ఓం సకాల వర్షధాత్రే నమ:
61. ఓం సద్ధర్మ సంరక్షకాయనమ:
62. ఓం సదాచార విగ్రహాయ నమ:
63. ఓం ఆచార వర్జితాయ నమ:
64. ఓం రోగనివారిణే నమ:
65. ఓం సర్వశాస్త్ర స్వరూపాయ నమ:
66. ఓం సర్వాచార సంసేవితాయ నమ:
67. ఓం వేద వేద్యాయ నమ:
68. ఓం వేదాత్మనే నమ:
69. ఓం వేదకర్త్రే నమ:
70. ఓం వేదసంరక్షకాయ నమ:
71. ఓం యజ్ఞాయ నమ:
72. ఓం యజ్ఞ పురుషాయ నమ:
73. ఓం యజ్ఞభోక్త్రే నమ:
74. ఓం యజమానినే నమ:
75. ఓం జ్ఞానయజ్ఞాయన:
76. ఓం ధ్యానయజ్ఞాయ నమ:
77. ఓం బోధయజ్ఞాయ నమ:
78. ఓం భక్తియజ్ఞాయ నమ:
79. ఓం సృష్టియజ్ఞాయ నమ:
80. ఓం చిదగ్ని కుండాయ నమ:
81. ఓం విభూతయే నమ:
82. ఓం లీలాకల్పిత బ్రహ్మాండమండలాయ నమ:
83. ఓం సంకల్పిత సర్వలోకాయ నమ:
84. ఓం ఆహారాయ నమ:
85. ఓం నిరాహారాయ నమ:
86. ఓం తీర్థపాదాయ నమ:
87. ఓం తీర్థపాలకాయ నమ:
88. ఓం త్రికాలజ్ఞానాయ నమ:
89. ఓం కాలరహితాయ నమ:
90. ఓం దృక్ దృశ్యభేద వివర్జితాయ నమ:
91. ఓం ప్రణవాయ నమ:
92. ఓం శబ్ద రూపిణే పరబ్రహ్మణే నమ:
93. ఓం దేవాలయాయ నమ:
94. ఓం సర్వ ధర్మ సంసేవితాయ నమ:
95. ఓం సర్వధర్మ సంస్థాపకాయ నమ:
96. ఓం ధర్మ స్వరూపాయ నమ:
97. ఓం అవధూతాయ నమ:
98. ఓం లీలామానుష విగ్రహాయ నమ:
99. ఓం లీలా విలాసాయ నమ:
100. ఓం స్మృతి మాత్రప్రసన్నాయ నమ:
101. ఓం గొలగమూడి ఆశ్రమవాసినే నమ:
102. ఓం భక్త భారభృతాయ నమ:
103. ఓం విశ్వప్రేరణాధికారిణే నమ:
104. ఓం సర్వప్రేరణాధికారిణే నమ:
105. ఓం సర్వసమర్థాయ నమ:
106. ఓం సచ్చిదానంద స్వరూపాయ నమ:
107. ఓం గురుభక్తిప్రదాత్రే నమ:
108. ఓం ఆత్మ జాన ప్రదాత్రే నమ:

ఓం నారాయణ - ఆదినారాయణ

# అవధూత లీల

## అధ్యాయము - 1

## శ్రీ వెంకయ్యస్వామి వారి జీవితం



భగవంతుడు రూపనామగుణరహితుడు. అట్టి భగవంతుని వ్యక్తరూపవమే ప్రేమ. ప్రేమ కార్యరూపేణా మాత్రవమే వ్యక్తమగును. అందునా నిరవధిక ప్రేమ, నిరంతర ప్రేమ, నిస్వార్థ ప్రేమగల హృదయమే భగవంతుని రూపమని చెప్పబడును. అట్టి ప్రేమామృత హృదయుడే మన భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారు.

నెల్లూరు జిల్లాలో తలుపూరు చెర్లోపల్లి చిన్న పల్లెటూరు. అనావృష్టి వల్ల పచ్చని గడ్డిపరకే కరువైందా ప్రాంతంలో. ఆకలితో వున్నవానికి అన్నం లభించినంత సంతోషంతో ఆ గ్రామస్తులంతా 'స్వామి వచ్చాడు, స్వామి వచ్చాడు' అంటూ రామాలయం దగ్గర గుంపు చేరుతున్నారు. వారి ఎదుట ఒక ముదుసలి నేల మీద తాటాకు వేసుకుని కూర్చొనియున్నాడు. ఆయన ఎదుట అగ్నిగుండం మండుతోంది. నూనె కుండవలె నున్నగా మెరుస్తున్న ఆ బక్క చిక్కిన శరీరానికి గోచిగుడ్డ తప్ప మరే యితరమైన ఆచ్ఛాదన లేదు. నున్నని గుండు, సొట్ట బుగ్గలు, బోసి నోరు, చురుక్కున చురకవేసే చురుకైన కన్నులు గల ఆ ముదుసలి వేళ్లు లెక్కించుకుంటూ, తనలో తాను మాట్లాడుకుంటూ మధ్య మధ్య అగ్నిగుండంలోని కట్టెలు సవరించుకుంటూ వున్నాడు. ఎంతో నిరాడంబరంగా, అనామకుడుగా వున్న ఆ ముదుసలి తాతను ఆయనే 'స్వామి' అంటే నమ్మదగినట్లుగా లేదు. ఆ గ్రామస్తులు వారితో ఏమో చెప్పుకోవాలని అనుకొంటున్నారు. కానీ వారి వైఖరి చూచి నోటమాట పెగలక చూస్తూ వుండిపోయారు. ఇంతలో ఆ ముసలాయన దృష్టి ఆ ప్రక్కనే పారేసిన కాగితాలు, పులివిస్తరాకులు మేస్తున్న పశువుల మీద పడింది. కొద్ది నిమిషాలు వాటిని జాగ్రత్తగా పరిశీలించి ఆయన 'అయ్యా!' అని పెద్దగా కేకవేశారు. 'ఏమిటి స్వామీ' అని ఒకరిద్దరు సేవకులు ముందుకు వచ్చారు. 'మనం ఆ చెర్లోకి పోవాలటయ్యా పోదాం పదండి' అని

శ్రీస్వామివారు ఆజ్ఞాపించారు. చెర్లోకెందుకు పోతున్నారో తెలియక సేవకులొకరి ముఖం ఒకరు చూసుకోసాగారు. శ్రీస్వామివారిని డోలీలో తీసుకుపోయారు. వర్షాలు లేనందున బీటలు వారి, కలికానికైన పచ్చిగడ్డి కరువైన ఆ ఎడారివంటి నేలపై శ్రీస్వామివారు ఒకచోట దిగి "ఇక్కడ నిప్పు చూడండయ్యా" అని ఆజ్ఞాపించారు. కొద్ది క్షణాలలో సేవకులక్కడ అగ్నిగుండం ఏర్పాటు చేశారు. అచ్చట కొన్ని గంటలున్నాక వారి ఆజ్ఞమేరకు శ్రీస్వామివారిని సేవకులు ఆ గ్రామంలోకి తరలించారో లేదో ఆకాశం మేఘావృతమై కుంభవృష్టి మొదలైంది. తెల్లవారేసరికి ఆ ప్రాంతంలోని చెరువులన్నీ నిండిపోయాయి. సంకల్ప మాత్రం చేత పంచభూతాలనాజ్ఞాపించగల ఆ మహనీయుని కీర్తిని ఆ గ్రామస్తులేగాక సర్వజీవులూ కృతజ్ఞతా పూర్వకమైన హృదయాలతో వేనోళ్ళ స్తుతించాయి. ప్రకృతిమాత వారి కరుణకు కృతజ్ఞతా పూర్వకంగా పచ్చగా పులకరించి నృత్యం చేసింది. ఆ కరుణామూర్తి ఆ స్తుతులను సంతోషంగా వింటాడా? తనకేమి పట్టనట్లే, తెలియనట్లే ఆ గ్రామం వదలి తన బృందంతో వెళ్లిపోయారు.

కాలచక్రం గిర్రున తిరిగింది. ఆనాడు తలుపూరు గ్రామాన్ని నిర్లిప్తంగా విడిచి వెళ్లినట్లే ఆ నిరాడంబర మహనీయమూర్తియైన శ్రీస్వామివారు 1982 ఆగష్టు 24వ తేదీన తమ భౌతిక దేహాన్ని విడిచారు. నెల్లూరు జిల్లా అంతటా ఆ విషాదవార్త కాలమేఘంలాగా అలుముకుంది. భూత నియంతయైన శ్రీస్వామివారు తమను విడిచి వెళ్ళాక ఇక ప్రకృతిమాతయొక్క ఆగ్రహం నుండి తమకు దిక్కెవ్వరన్న ప్రశ్న అందరి హృదయాలలోనూ అస్పష్టంగా మిగిలింది.

1982లో గోపారం ప్రాంతమంతా వర్షంలేక కరువైంది. పశువులు మేతకూ, నీటికి చాలా ఇక్కట్లు పడుతున్నాయి. పాలకొండ సుబ్బారెడ్డి బస్సులో పోతూ మనసులో, "స్వామీ! మీరు శరీరంతో వుండగా మా బాధలు చెప్పుకుంటే తీర్చేవారు. ఇప్పుడెవరితో చెప్పుకోవాలి? వర్షం లేక ప్రజలు అల్లాడుతున్నారే" అని తన్మయత్వంగా అనుకొన్నాడు. వెంటనే శ్రీస్వామివారు అతని మనోనేత్రానికి గోచరించి "అయ్యా నీ కోరిక లోకము కొరకు గదా! నీ కొరకు గాదు. మూడు రోజులలో వర్షం కురుస్తుంది" అని చెప్పారు. అదేవిధంగా వర్షం వచ్చింది. ఆ సంవత్సరానికంతటికీ ఆ ప్రాంతంలో కురిసిన వర్షం

అదొక్కటే అయినా చెరువులు నిండి, పంటలు పండాయి.

అలా తాము భౌతికంగా మన మధ్య వున్నా లేకపోయినా సర్వగతుడుగా, స్మృతిమాత్రప్రసన్నుడుగా, భక్తరక్షణా పరతంత్రుడుగా నాటికీ, నేటికీ మరియూ సూర్యచంద్రులున్నంత వరకు నిలిచే ఉంటానని శ్రీస్వామివారు మనకిచ్చిన అభయాన్ని వారు తమ మహాసమాధి అనంతరం కూడా ఆర్తులను ఆదుకొనే లీలల ద్వారా నిరూపించుకొనుచున్నారు.

జీవనదియైన పవిత్ర గంగానది తన పుట్టుక స్థానంలో చిన్న కాలువ వలె ప్రవహించినట్లు, ఇంతటి మహనీయ కరుణా సముద్రుడు తన జీవితారంభంలో లోకుల దృష్టికి ఒక విచిత్ర వ్యక్తిగా, పిచ్చి వెంకయ్యగా ప్రకటమైన దశకూడ గలదు.

# పిచ్చి వెంకయ్య

నెల్లూరు జిల్లాలోని నాగుల వెల్లటూరు గ్రామంలో వీధుల వెంట, సమీపంలోని చిట్టడవులలో, "చాకలియోగం, మంగలియోగం, డుబుడుక్ డుబుడుక్" అని అరుస్తూ పరుగులు పెట్టే యువకుడుగా మొదట ఆ మహనీయుడు లోకుల దృష్టి నాకట్టుకున్నాడు. పిచ్చి వెంకయ్యగా లోకుల నోళ్ళలో నానాడు. కానీ యీ లోకమనే పిచ్చాసుపత్రిలోని జనబాహుళ్యం యొక్క పిచ్చిని బాపటానికి దిగివచ్చిన సాటిలేని వైద్యుడని ఆయనను ఎవరు తెలుసుకున్నారు? పిచ్చి వెంకయ్య అని ఏ ప్రజలు ఆనాడు ఆయనను పరిహసించారో వాళ్ళే ఆ తర్వాత ఆయనను "భగవాన్ అవధూత శ్రీ వెంకయ్యస్వామి" అని కీర్తించడానికి ఆయన చెంతకు పరుగులుతీశారు. ఎవరిది పిచ్చి? సత్యం సూర్యునిలాగా మనమధ్య భాసిస్తున్నా, గుర్తించలేని మనదే పిచ్చేమో! ఒకవేళ వీరిలో అందరూ పిచ్చివారే అయినా, ఏ పిచ్చి మేలన్నది మనమాలోచించడమొక్కటే పిచ్చి తొలగడానికి మార్గం.

భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారి తండ్రి పేరు శ్రీ సోంపల్లి పెంచలయ్య, తల్లి శ్రీమతి పిచ్చమ్మ, జన్మస్థానము ఆత్మకూరు తాలూకా, నాగుల వెల్లటూరు, జనన తేది లభించలేదు. 1927 సం॥ "పెద్ద గాలి వాన" నాటికి వీరికి సుమారు 30 సం॥లు వయస్సుంటుంది.

వెంకయ్య చిన్నప్పుడు అందరి పిల్లలలాగానే వుండేవాడు. కొన్నాళ్ళు శ్రీ సిద్ధిరాజు రామయ్యగారి దగ్గర చదువుకు రాత్రిపూట వెళ్ళేవారట. ఈ చదువు అక్షరమాలతోనే ఆగిపోయింది. ఆటపాటలయందు కూడా తక్కిన బాలురకూ, వీరికి ఏమీ భేదముండేది కాదు.

శ్రీ కొమరగిరి రమణయ్య చెప్పినదానిని బట్టి ఐదు సంవత్సరముల వయస్సులోనే శ్రీస్వామివారు ఏకాంత ప్రియులు. ఆడుకొనుటకు పిల్లలు రమ్మని పిలువగా "ఒరేయ్, నేను దొంగతనం చేసి వచ్చాను. పోలీసులు వచ్చి నన్ను పట్టుకుంటారు పోండి" అని అందరినీ తరిమేసి తాను తలుపు చాటున ధ్యానస్థులయ్యేవారు.

కలేపండ్లకని పిల్లలందరూ అడవికి పోతే శ్రీస్వామివారు ఎవ్వరితోనూ కలవకుండా చెట్లచాటున వుండేవారు. ఎవరైనా చూడ్డానికొస్తే పైన చెప్పిన మాటలే చెప్పి తాను ఏకాంతంలో వుండేవారు.

17, 18 సంవత్సరముల ప్రాయములో కట్టెలు కొట్టి బండి మీద తీసుకెళ్ళి నెల్లూరులో అమ్ముకుని వచ్చేవారు. విస్తరాకులు కోసి, దోర్నములు కుట్టి నెల్లూరుకి తీసుకుపోయి అమ్మేవారు. సేద్యపు పనులు చక్కగా చేసేవారు. ఏ పని చేసినా యితరుల దృష్టి నాకర్షించి వారు ఆ పనిని ప్రశంసించేటట్లు చేసేవారు. కూలికి కూడా వెళ్లేవారు. తల్లిదండ్రులు వీరినెంతో గౌరవంగా చూచేవారు. కనుకనే యితర కూలీలలాగా కూలి గింజలను గుడ్డలో మూట గట్టి నెత్తిన బెట్టుకొని ఇంటికి తేనిచ్చేవారు గాదు. శ్రీస్వామివారి తమ్ముళ్ళనుగాని, చెల్లెలినిగాని పంపి ఒక చిన్నబుట్టలో ఆ కూలిగింజలను తెప్పించుకునేవారు.

శ్రీస్వామివారి బాల్యమును గూర్చి శ్రీస్వామివారి సోదరి శ్రీమతి మంగమ్మగారు ఇలా చెప్పారు. "శ్రీస్వామివారు చిన్నతనంలో వెంట్రుకలు ముడివేసుకొనేవారు. పంచ, చొక్కా, వేసుకునేవారు. సేద్యం పనులు ఎంత చక్కగా చేసేవారో చెప్పలేను. చేను దున్నేటప్పుడు కొండ్ర వెస్తే అంత చక్కగా వుండేది. రూళ్ళ కర్ర, పెన్సిలుతో కాగితం మీద గీత వేసినంత చక్కగా వుండేది. నాగటి చాలులో ఒక వైపు కోడిగ్రుడ్డు పెట్టి రెండవ వైపు నుండి చూస్తే కనిపించేటంత చక్కగా వుండేది.

"శ్రీస్వామివారు చిన్నపిల్లవాడుగా వుండగా ఒక్కప్పుడు మా ఇంటి

చుట్టూరా వేప, చింత, మునగ విత్తనాలు నాటారు. వాటిని గూర్చి మేమేమి పట్టించుకోకపోయినా అవి పెరిగి పెద్ద మానులయ్యాయి.

"చిన్నప్పటి నుండి కూడా తెలివిగా, గౌరవంగా వుండేవారు. నేను స్వామికంటే చిన్నదానినైనా నన్నెప్పుడు గూడా 'అమ్మే' అని గానీ, 'ఇట్లారా' అని గానీ ఏకవచన ప్రయోగం చేసి పిలిచి ఎరుగరు. 'అన్నం పెట్టు మంగమ్మా' అని అడిగేవారు. సాటి పిల్లలంతా 'వెంకన్నా, వెంకన్నా' అని పిలిచేవారు. నేను కూడా అలా పిలిస్తే శ్రీస్వామివారు 'అందరూ వెంకన్నా అంటే, నీవు అలాగే అనవచ్చా? నీవు అన్నా అనాలమ్మా, పేరు పెట్టి పిలవకూడదు' అని బుద్ధులు చెప్పేవారు. సాటి పిల్లలందరూ తమ తగవులు తీర్చమని శ్రీస్వామివారికి చెప్పుకునే వారు. పొలంలో పేడప్రోగుచేసే పిల్లలందరికి ఈయన నాయకుడు.

"పదహారు సం॥ల వయస్సులో శ్రీస్వామివారు జొన్న కోతకోస్తే చూడముచ్చటగా వుండేది. ఒక్క జొన్నకట్టా విరగదు. ఓదివేస్తే ఒక్క కఱ్ఱ అయినా చెల్లాచెదురుగా పడదు. కోతంతా ఒకే ఎత్తున కొలత పెట్టినట్లు కోసేవారు. ఇద్దరు మనుష్యుల కోత తానొక్కరే కోసేవారు. ఎంత చిన్న పనైనా శ్రద్ధగా సంపూర్ణంగా చేయగల్గడమే యోగమని ఆయన బోధించదలిచారు కాబోలు.

"నన్ను దూరాన దక్షిణదేశాన రాజపద్మాపురంలో వివాహమునకు ఇవ్వాలనుకున్నారు. శ్రీస్వామివారు అంగీకరించలేదు. అప్పటికి శ్రీస్వామివారికి పిచ్చి పట్టిందనే పేరు రాలేదు. 'మా ముగ్గురు మొగపిల్లలమధ్య ఒక్కగానొక్క ఆడ పిల్లయితే ఆమెనంత దూరాన ఇస్తావా?' అని తల్లితో తగవులాడి వారించ చూచారు. కానీ మా తల్లి పట్టిన పట్టు వీడక నన్ను రాజపద్మాపురంలోనే యిచ్చి పెండ్లి చేసింది. పెండ్లినాడు కూడా శ్రీస్వామివారు అలిగి పెండ్లి దగ్గర వుండకుండా పొలంలో జొన్నగూడు దగ్గర పడుకున్నారు.

"శ్రీస్వామివారికి చిన్ననాటి నుండి అబద్ధమాడడం గిట్టేది కాదు. అప్పుడు శ్రీస్వామివారికి 10 సం॥ల వయస్సు. ఒక రోజు ఇంటికి బిచ్చగాడొచ్చాడు. మా తల్లిగారు 'ఇంట్లో గింజలు లేవు పొమ్మ'న్నారు. శ్రీస్వామివారు 'అరగంట ఆగి వచ్చావంటే పాతర తీసి గింజలు (జొన్నలు) తీస్తారు. అప్పుడు పెట్టించుకుపో!' అన్నారు. తాను పచ్చిగడ్డి తెచ్చేటప్పుడు

బక్క పశువులు ఎండుటాకులు తింటూ కనిపించాయంటే, తన తలపై నున్న గడ్డిమోపు వాటి ముందు వేసి వట్టి చేతులతో ఇంటికి వచ్చేవారు. గడ్డి ఏదని అడిగితే మౌనం వహించేవారు.

“శ్రీస్వామివారికి 20 సం॥ల వయస్సులో తీవ్రంగా జ్వరం వచ్చింది. ఆ రోజులలో గ్రామాలలో వైద్యులు, ఆసుపత్రులు లేవు. కనుక అన్నం తినకుంటే రెండు పూటలకు జ్వరం తగ్గుతుందనేది అలవాటు. అలాగే వారం గడిచింది. శనగ ఏరడానికి పోయిన శ్రీస్వామివారి తమ్ముళ్ళు వేరుశనగపప్పులు తెచ్చిస్తే అవి తిని మంచం కరుచుకుని పడుకునేవారు. శ్రీస్వామివారు ఒకనాడు ‘మన యిల్లు వేలం వేయబోతున్నారు. మీరు ఎక్కడ వుంటారు?’ అని తల్లి తండ్రులను అడిగారు. ‘మనకేమి అప్పులు లేవు. వేలం ఎవరు వేస్తారు? జ్వరతొందర, పైత్యం వల్ల అట్లా మాట్లాడుతున్నాడు.’ అని తలచి వారు నిమ్మరసంతో తలంటి చన్నీటి శిరస్నానం చేయించారు. శ్రీస్వామివారు, పిలిస్తే కూడా చాలా ముభావంగా ‘ఊ – ఆ’ అని మాత్రమే సమాధాన మిచ్చేవారు. అందువల్ల ఆయనకు దయ్యం పట్టిందని, మతి చలించిందని అనేక భూతవైద్యాలు, నాటు వైద్యాలూ చేయించారు. లాభం లేకపోగా ఒక నెల తరువాత ‘చాకలి యోగం, జక్కల యోగం, మంగల యోగం’ అని అరుస్తూ ఊరంతా పరుగెత్తేవారు శ్రీస్వామివారు. జన సంచారానికి దూరంగా ఉండే చోట అరుస్తుండేవారు. రెండు, మూడు రోజులు కూడా ఇంటికి వచ్చేవారు కాదు. తల్లిదండ్రులు కూలివాని చేత అన్నం మూట పంపి ఆయనకోసం వెతకమనేవారు. అన్నం మూట చూపిస్తే ఆ కూలివానితో కూడా ఆయన ఇంటికి వచ్చేవారు. అన్నం తిని వెంటనే మళ్ళీ పరుగెత్తి వెళ్లేవారు. ఒకప్పుడు ఇంటిలోని వారు ఆయనను కట్టేస్తే, అన్నం నీళ్ళు అడుగకుండా అట్లాగే కూర్చున్నారు. అలా కట్టి కూర్చోపెట్టడం ఇష్టంలేక తల్లిదండ్రులు ఆయనను స్వేచ్ఛగా వదిలేశారు. చేలలోను, దొడ్లలోను తిరిగేవారు. ఎవరి దగ్గరంటే వారి దగ్గర అన్నం తినేవారు. అలా విచక్షణ లేకుండా అన్నం తినడం వల్ల ఆయన కులభ్రష్టుడయ్యాడని తలచి కులపెద్దలు వారి నాలుక కాల్చారంటారు కొందరు. కాల్చలేదంటారు కొందరు. ఎక్కడెక్కడో అడవిలో తిరిగినందువలన గుడ్డలు చీలికలు చీలికలుగా చినిగిపోయేవి. శ్రీస్వామివారి తల్లి క్రొత్తపంచెలు, చొక్కాలు తెచ్చి ఇంట్లో ఉంచితే, ఎప్పుడో

బుద్ధి పుట్టినప్పుడొచ్చి క్రొత్తవి ధరించి వెళ్ళిపోయేవారు. వయసులో ఉండే స్త్రీలు కనిపిస్తే చాలు పులిని చూచిన ఆవువలె పరుగెత్తేవారు.

"ఈ పిచ్చి దశలో అందరూ ఆయనను 'పిచ్చి వెంకన్నా' అనేవారు. 'చాకలి యోగం ఎవరిది వెంకన్నా?' అంటే తమ మేనమామగారి ఇంటి పేరు చెప్పేవారు. రాజపద్మాపురంలో ఉన్న చెల్లెలు మంగమ్మగారింట చాలా కాలం భోంచేస్తూ ఆ ప్రాంతంలో పరుగెడుతుండేవారు. ఒకనాడు కొందరు కొంటెవారు, 'వెంకన్నా ఏదైనా కథ చెప్పు నీకు సంకటి పెట్టిస్తాము' అన్నారు. 'అన్నం పెడితే కళ్ళు పోతాయిగానీ, సంకటే పెట్టించండి' అన్నారు శ్రీస్వామి వారు. అది విని 'ఈయనకు పిచ్చి అంటారే పిచ్చెక్కడయ్యా' అని అనుకున్నారు. పిచ్చి అనేందుకు ఆస్కారమే లేదు. ఎవరినీ తిట్టడు, కొట్టడు, అమర్యాదగా మాట్లాడడు. పెట్టేవారి దగ్గరే చేయి చాపుతాడు. కాకుంటే అదేపనిగా విరామం లేకుండా ఒంటరిగా తిరుగుతూ వుంటాడు."

ఇదే సమయంలో ఒక రోజు మంగమ్మగారి బిడ్డకు జ్వరమొచ్చి తగ్గకుంటే మంగమ్మగారు బిడ్డ బాధ చూచి ఏడుస్తూ వున్నది. "ఎందుకమ్మా ఏడుస్తావు? బిడ్డకు బాగుగా వుంటుందిలే! ఏమి భయపడవద్దు" అని బిడ్డ ముఖాన్ని అరచేయితోతుడిచారు శ్రీస్వామివారు. నాల్గవరోజుకు ఆ బిడ్డ ఏ వైద్యం లేకుండా స్వస్థుడయ్యాడు. ఈనాడు శ్రీస్వామివారికి జరిగే వైభవమైన పూజలు, సమాధి మందిరం చూచి "ఇట్లా అందరికీ దేవుడవుతాడని తెలిసి వుంటే నెత్తిన పెట్టుకొని చాకి వుందును. నా ఇల్లంతా గుల్ల చేసి అయినా ఎంతో బాగా చాకి వుందును. తెలియక మామూలుగా నా అన్నగానే చనువుగా చూచాను" అని కంట తడిపెట్టారు మంగమ్మ. "శ్రీస్వామివారు ఆహారం పుష్టిగా భోంచేసేవారు. ఇద్దరు మనుషుల పని తానొక్కడే చేసేవారు" అని చెప్పారు. శ్రీస్వామివారు ఉన్మత్తావస్థలో వుండగా కపిలబావిలోకి వాలియున్న చెట్టు కొమ్మలకు తన కాళ్లను పెనవేసి తల వ్రేలాడేసి వ్రేలాడేవారు. కాళ్ళు పట్టు తప్పి బావిలో పడిపోతే మరలా బావిలోని నీటిలో నుండి గట్టుకు ఎక్కి వచ్చి మరలా అలాగే వ్రేలాడేవారట.

ఇటువంటి సాధన సాయిబాబాకు వారి గురువు విధించినట్లు, అలానే మరి కొందరు మహనీయులు చేసిన వివరం "శ్రీ సాయి లీలామృతం" అనే గ్రంథంలో చూడవచ్చు.

శ్రీస్వామివారి తమ్ముడు చిన్నపనాయుడుగారు తాను స్వయంగా చూచిన విషయం ఇలా చెప్పారు.


"రెండెడ్ల బండి పోతూంటే శ్రీస్వామివారు ఆ బండి వెనుకగా వచ్చి కూర్చునేవారు. కాళ్ళు బండిపైన, తల, శరీరం క్రిందకు వ్రేలాడుతూండేది. ఎవరైనా చూస్తే బండెక్కి మామూలుగా కూర్చునేవారు."



ఓం నారాయణ - ఆదినారాయణ

# అవధూత లీల

## అధ్యాయము - 2
## అనికేతుడు



ఈ విధంగా "చాకలియోగం - మంగలియోగం" అని అరుస్తూ నిర్జన ప్రదేశాలలో పరుగులు తీస్తున్న సోంపల్లి పిచ్చెంకయ్య ఇరవై సంవత్సరాల వయస్సులో ఇల్లు వదలిపెట్టి ఎటో వెళ్ళిపోయారు. కొంత కాలం వీరి జాడే తల్లిదండ్రులకు తెలియలేదు. ఈ కాలంలో వీరిని ఏ సాధువయ్య అనుగ్రహించాడో ఎక్కడెక్కడ తపస్సు చేశారో అన్న విషయాన్ని గురించి శ్రీస్వామివారు ఒక్కొక్కరికొక్కక్క విధంగా చెప్పియున్నారు. మోపూరు దశయ్యతో శ్రీస్వామివారు చెప్పారట. "అయ్యా, నేను అడవులలో అక్కడక్కడా తిరుగుతూ వుంటే సాదయ్యగారు కలిశారు. 'కళ్ళు మూసుకోమ'న్నారు. అంతే మరుక్షణంలో పెంచలకోన బిలంలో ఉన్న సాదయ్యల మధ్య ఉన్నాను. కళ్ళు తెరిచేసరికి అదంతా పెద్ద ఋషీశ్వరుల సంఘం. అచ్చుట కొన్నాళ్ళున్నాక సాదయ్య మరలా 'కళ్ళు మూసుకోమ'న్నారు. నేను కళ్ళు మూసి తెరిచేసరికి మద్రాసు హైకోర్టు దగ్గర వున్నాను" అని.

ఇల్లు వదలి వెళ్ళిన పిచ్చెంకయ్య తిరిగి ఆ గ్రామస్థుల కంటపడేటప్పటికి 'శ్రీ వెంకయ్యస్వామి' అనే నామధేయముతో అందరికీ ఆపద్బాంధవుడుగా విరాజిల్లుచున్నారు. తన వారెందరు ప్రాధేయపడినా తిరిగి తన ఇంటికే వెళ్ళలేదు. సరిగదా తన గ్రామములోనే అడుగు పెట్టలేదు. అరుదుగా వెళ్ళినా ఊరి వెలుపల దొడ్లలోనూ, చేలలోనూ కొంతసేపు వుండి వెళ్ళిపోయేవారు.

మోకాళ్ళకు పైన కట్టిన చినిగిపోయిన పంచె, చినిగిపోయిన చొక్కా, చేతిలో ఉగ్గం పెట్టిన ముంత, పంగాలు కర్రతో ఏకాంత ప్రదేశాలలో సంచరిస్తూ, వయస్సులో ఉన్న స్త్రీలు కనిపిస్తే దూరంగా వెళుతూ ఉండేవారు. నిప్పంటించిన కపిల మోకు ముక్క ఒకటెప్పుడూ చేత పట్టుకొని ఉండేవారు. కపిల మోకుల ముక్కలన్నీ కట్టకట్టి నెత్తిన పెట్టుకొని తన వెంబడి తీసుకు

వెళ్ళేవారు. కొన్నాళ్ళు పెన్నానది వెంబడిగాని, సమీప అడవులలోను సంచరించేవారు.

అటు తరువాత చలమానాయుడు వారి సేవకు అంకితమయ్యాక పెన్నబద్వేలు కొండపై గుడిసె నిర్మించుకొని, అందులో చిన్న నూనె దీపం పెట్టి, తంబుర మీటుతుండేవారు. చలమానాయుడు సమీప గ్రామానికెళ్ళి భిక్షాన్నం తెచ్చేవారు. అనేకమంది గ్రామస్తులు పశువుల జబ్బుల నుండి, కలరా, మశూచి వంటి బాధల నుండి రక్షణ పొందేవారు. భక్తులకు ప్రశ్నలు కూడా చెప్పేవారు. ఆ ప్రశ్నలు చెప్పే పద్ధతి చాలా ప్రత్యేకంగా ఉంటుంది. వివాహానికి సంబంధాలు చూస్తూ, ఏ సంబంధం మంచిదని శ్రీస్వామివారి నడిగేవారు. ఒక్కొక్క సంబంధమునకు గుర్తుగా ఒక్కొక్క రాయి చొప్పున ఎన్ని సంబంధాలు చూస్తే అన్ని రాళ్ళు వరుసగా పెట్టమనేవారు. తంబుర మీటి, "తూర్పు నుండి రెండవది" అనిగానీ, "పడమర నుండి మూడవది" అనిగానీ చెప్పేవారు. అంటే తూర్పు నుండి రెండవరాయి ఏ సంబంధం సూచిస్తూ పెట్టుకున్నారో అది మంచిది అని అర్థం. సాధారణంగా ప్రశ్నలు చెప్పేవారి మాటలు నూటికి నలభై కూడా నిజం గావు. కాని శ్రీస్వామివారు చెప్పినట్లు జరుగలేదంటే కారణం శ్రీస్వామివారు చెప్పిన దానిని వారర్థం చేసుకోవడం పొరపాటై ఉంటుంది.

బద్వేలు వదలిన తరువాత శ్రీస్వామివారు కొన్ని సంవత్సరములు కోటితీర్థం వద్ద దేవాలయములో బస చేశారు. ఇక్కడ శ్రీస్వామివారు తంబుర ముందు పెట్టుకొని రాత్రింబవళ్లు రెండు చేతులలో రెండు ఈత పుల్లలు తీసుకొని నాదం మీటుతూ "ఓం నారాయణ ఆదినారాయణ" అనే మంత్రాన్ని పెద్దగా ఉచ్చరిస్తూండేవారు. తంబుర తీగలు తెగిపోయినా గానీ వారు పుల్లలు ఆడిస్తూ మంత్రం చెబుతూనే ఉండేవారు. మన లోకంలో లేకుండా నామం చేసేవారు ఎప్పుడో స్పృహ వచ్చినప్పుడు తంబుర తీగెలు మరలా ముడేసుకొనేవారు. అప్పుడప్పుడూ అగ్నిని కూడా వ్రేల్చేవారు. చలమానాయుడు మొదలైన సేవకులు భిక్షాన్నం తెచ్చేవారు.

అటు తర్వాత కొన్నాళ్ళు సంచారం చేస్తుండేవారు. సాయిబాబా ధరించిన కఫ్నీలాంటి చొక్కా (మోకాళ్ల క్రింద వరకూ వుండే జుబ్బా)

ధరించేవారు.  ఈ చొక్కాకి సిరాతో అరచేతి ముద్రలు, వేలి ముద్రలు అద్ది వుండేవి. కొన్ని కఫ్నీలపై "రామ రామ" అనే అక్షరములు అచ్చు వేసి వుండేవి. నిరంతరమూ సిరాతో కాగితముపై తమ బొటనవేలి గుర్తులు వేసి, ఆ కాగితములు భక్తులకు ప్రసాదించేవారు. అలా ప్రసాదించేటప్పుడు తమ కుడి అరచేతిని తమ నడినెత్తికి తాకించి తర్వాత ఆ ముద్రలు వేసిన కాగితానికి తాకించి భక్తులకిచ్చేవారు. నెల్లూరులోని అనేక గ్రామాలలో సంచరిస్తూ ఉండేవారు. చలమానాయుడు, పోలిరెడ్డి వగైరా సేవకబృందం స్వామితో పర్యటిస్తూ ఉండేవారు. నిరంతరం వేలిముద్రలతోపాటు అరుదుగా అగ్ని సేవనం కూడా చేసేవారు. రోజుకు ఎన్ని రీముల కాగితాలు, ఎంత సిరా వాడేవారో చెప్పలేము. శ్రీస్వామివారి కృపవలన వ్యాధులు నివారించుకున్నవారు ఎందరో ఈ నిరంతర యజ్ఞానికి కాగితములు, సిరా బిళ్ళలు బస్తాలకొద్ది సమర్పించేవారు.

అటు తరువాత వేలి ముద్రలు తగ్గించి ఎక్కువగా అగ్ని గుండం వేసి నిరంతరం రాత్రింబవళ్ళు గుండం చెంత ఉండి కట్టెలు సవరిస్తూ అర్థంగాని మాటలు మాట్లాడేవారు. రోజుకు కనీసం రెండు మూడు బండ్ల కట్టెలు కాల్చేవారు. ఎంత వర్షమైనా, మండుటెండైనా సరే అగ్ని చెంత కూర్చోనుండేవారు. వెంకయ్యస్వామి పందిరి అనే నానుడి ఒకటుంది. శ్రీస్వామివారు ఉదయం పదిగంటల ప్రాంతంలో సూర్యకిరణములు తన తలపై పడకుండా ఉండేందుకు ఒక కర్ర నాటి, దానికి తాటిమట్ట తగిలించేవారు. తాటిమట్ట తగిలించిన ఒక అరగంట వరకూ నీడ వుంటుందిగానీ, అటు పైన నీడ ప్రక్కకు జరిగి శ్రీస్వామివారు ఎండలోనే వుండేవారు. శ్రీస్వామివారు అగ్నిని వ్రేల్చేపనిలో నిమగ్నమైతే ఇక మన లోకంలో వుండరు గనుక యిది నీడా, ఎండా అనేది తెలిసేది గాదు. రెండు, మూడు పగళ్ళు, రాత్రులు అలాగే అగ్నిముందు కూర్చునియున్న రోజులున్నాయి. ఎప్పుడో ఆ గుండానికి సమీపంలోనే గోనె సంచిపై పడుకొని యోగనిద్రకు ఉపక్రమించేవారు. ఈ దశలో మొలకు పంచె కొన్నాళ్లు, కౌపీనం కొన్నాళ్లు ధరించేవారు. శరీరానికి చొక్కాగానీ, బనీనుగానీ ధరించేది లేదు. చివరి వరకు ఎపుడూ కాళ్ళకు పాదరక్షలు ధరించి ఎరుగరు.

అటు తరువాత నెల్లూరు తాలుకా, గొలగమూడి అను గ్రామం చేరి, సుమారు ఎనిమిది సంవత్సరాలు ఒకే చోట అగ్నిగుండం వేశారు. రోజుకు

సుమారు ఐదారు బండ్ల కట్టెలు కాల్చేవారు. ఈ ఎనిమిది సంవత్సరములు శ్రీస్వామివారు అగ్నిగుండం వేసిన స్థలంలోనే నేడు ఆయన సమాధిమందిరం వెలిసింది.

రమణయ్య అనే భక్తుడు దున్నపోతుల బండితో, అగ్నిగుండానికి నిరంతరం కట్టెలు తోలుతుండేవారు. మోపూరు దశయ్య, వెంకటయ్య మొదలగు సేవకులు శ్రీస్వామివారికి కట్టెలు, బొంతజెముడు చెట్లు కొట్టేవారు. పగటిపూట అప్పుడప్పుడు శ్రీస్వామివారు కూడా వీరితోటి అడవికి వెళ్ళేవారు. అయితే శ్రీస్వామివారు కట్టెలు కొట్టే తమ సేవకుల నుండి కొంతదూరంలో ఏకాంతంగా తిరిగేవారు. కొన్నాళ్ళు ఫలానాఫలానా చెట్లు మాత్రమే కొట్టమని శ్రీస్వామివారు చూపేవారు ఈ నిరంతర అగ్నిగుండం వలన కొన్ని మైళ్ళ దూరం అడవి సమూలంగా నిర్మూలనమైంది. "ఇదంతా పంట చేలవుతాయయ్యా, ఇక్కడంతా ఊరవుతుంది. గోవు పాదమంత స్థలం చిక్కదు" అని ఆనాడు శ్రీస్వామివారు చెప్పిన మాటలు ఈనాడు నిజమైనాయి.

శ్రీస్వామివారు ఎక్కువగా తమకు బుద్ధి పుట్టినప్పుడల్లా తమకు తోచిన గ్రామాలలో సంచరించేవారు. తరువాత వారి కాళ్లు ఏ కారణంగానో స్వాధీనంలో లేకుండా పొయ్యాయి. వైద్యం చేయించాలంటే శ్రీస్వామివారు సుతరాము ఒప్పుకోలేదు. "పూర్వం నేనొక ఆవును కొట్టాను. దాని ఫలితమే యిది. కనుక దానిని నేననుభవించి కర్మ దోషాన్ని పోగొట్టుకోవాలి. కనుక నేను మందు తీసుకోను" అని ఖండితంగా చెప్పారు.

శ్రీస్వామివారు నడవ లేనందున ఒక చోటే వుండేవారు. ఒక రోజు తన సేవకుడు రోశిరెడ్డితో, "నన్ను తాటాకు మీద కూర్చోబెట్టి కొంచెం దూరం లాక్కుపోయ్యా" అనడిగారు. అతడలానే చేశాడు. తాటాకుమీద తీసుకుపోవడం శ్రీస్వామివారికి బాధగా ఉంటుందని ఆరు అంగుళాలు ఎత్తుగల నాలుగు చక్రాల బండిని చేయించి దాని పై కూర్చోబెట్టి శ్రీస్వామివారు కోరిన చోటుకు భక్తులు లాక్కుపోయేవారు. ఒక్కొక్కప్పుడు బండి గతుకుల్లోపడి వళ్లంతా అదిరేది. తరువాత భక్తులు డోలిలో మోసుకుపోతామని అడిగి, స్వామి అంగీకరించగా, వారలా శ్రీస్వామివారిని మోస్తుండేవారు. ఈ విధంగా మహాసమాధికి రెండు సంవత్సరముల ముందు వరకూ శ్రీస్వామివారు నెల్లూరు, పొదలకూరు,

చిట్టేపాళెం, పెన్నబద్వేలు, కుల్లూరు, రాజుపాళెం, సోమశిల, కోటితీర్థం, ఇనుకుర్తి, ముదిగేడు, దేగపూడి, తలుపూరు, కలిచేడు, నవకోటిసిద్ధలయ్యకోన, చెర్లోపల్లి, తిరుపతి, కంచి, సంగం, నెల్లూరు, పెనవర్తి, మైపాడు, ఇందుకూరుపేట, గొలగమూడి మొదలగు ప్రదేశాలలో తరచుగా సంచరిస్తూండేవారు. శ్రీస్వామివారు ఏనాడూ గృహస్థుల నాశ్రయించలేదు. దేవాలయము, పాడుబడ్డ ఇళ్ళు, చావడి, పాఠశాల, వేపచెట్టు మొదలగు వాటిని ఆశ్రయించేవారు. నిష్కపటమైన భక్తిశ్రద్ధలతో గృహస్థులు మనస్ఫూర్తిగా ఆర్తితో ఆహ్వానిస్తే వారి గృహములకు వెళ్ళేవారు, కానీ, అక్కడ కూడా వారి ఇంటి బయటగానీ, కొట్టాలలోగానీ, వరండాలోగానీ ఉండేవారు.

వర్షమొచ్చి తడుస్తున్నప్పుడు చూరు క్రిందనైనా వదుక్కుంటారేగానీ ఇంట్లోకి రారు. ఎక్కడైనా ఇండ్లలోకి వచ్చి ధుని వేశారంటే ఆ ఇంటివారు చాలా అదృష్టవంతులన్నమాట.

శ్రీస్వామివారు ఒక్కరే తిరిగేటప్పుడు తీవ్రంగా ఆకలైనప్పుడు భగవంతుడు చూపిన ఇంటికి వెళ్ళి, వాళ్ళు పెట్టింది తిని, వెళ్ళిపోయేవారు. అయితే అన్నం ఉంచుకొని లేదని చెపితే ఫలానా చోట, ఫలానా ఉట్టి మీద ఫలానా కూర ఉన్నదని తాను చూచినట్లు చెప్పేవారు. కనుక పిచ్చి వెంకయ్య సామాన్యుడు కాడని అడిగినవారు తప్పక అన్నం పెట్టేవారు. దానికి వందరెట్లధికంగా ప్రతిఫలం పొందేవారు.

శ్రీస్వామివారు బాగా నడిచే రోజులలో ఏనాడూ పాదరక్షలు ధరించేవారు కాదు. అడవులలో తిరుగుతుండేవారు. ముండ్లు గ్రుచ్చుకుంటే తీయించుకొనేందుకు మల్లెముల్లు, సూది, దబ్బనం, చాకు, తమతో ఎప్పుడూ ఉంచుకొనేవారు. వారి కాళ్ళలో నుండి ఒక్కొక్కసారి భక్తులు రెండంగుళాల పొడవుగల ముళ్ళను కూడా తీసిన సందర్భాలున్నాయి. అది చూచిన వారు ఆశ్చర్యపోయేవారు.

శ్రీస్వామివారు గుండం వేసుకొనేటప్పుడు గుండానికి నాలుగు అంగుళాల దూరంలో తల ఉంచి పడుకోవడం చూచాను. అంత దగ్గరలో మనం ఉంటే ఆ సెగకు మనం ఓర్చుకోలేము.

తమ తోట దగ్గర ఒక గుంట త్రవ్వి పెన్న నీళ్ళను ఒక కాలువ ద్వారా ఆ గుంటలకు పెట్టి ఆ గుంటలోని నీళ్ళను ఏతము ద్వారా తమ తోటలకు పెట్టుకుంటారు రైతులు. శ్రీస్వామివారు అచ్చటకు వెళ్లి ఆ కాలువలోని నీటిలో సగం నీరు పెన్నకు వదిలేవారు. మిగిలిన సగం నీరు తోటకు మడవ కట్టాలంటే ఇద్దరు మనుషులవసరమయ్యేవారట. అంత ఎక్కువగా నీరు పారేవి.

వారు ఉన్మత్తావస్థలో తిరుగుతుంటే ఒకచోట దొంగతనం జరిగి పోలీసులు దొంగల కొరకు వెదుకుతూ శ్రీస్వామివారిని అనుమానించి పోలీసు స్టేషనులో పెట్టారు. రెండు రోజులు మాట పలుకు లేకుండా శ్రీస్వామివారు అచ్చట కూర్చున్నారు. తరువాత పోలీసులు వదిలేశారు. అక్కడి నుండి నేరుగా దక్షిణాదిన రాజపద్మాపురంలోనున్న తన చెల్లెలు మంగమ్మ దగ్గరకెళ్లి చెప్పుకొని ఒకేమాయిన ఏడ్చారట. శ్రీస్వామివారు ఏడిస్తే మంగమ్మ ఏడ్చేది. చూచేవారికేమి అర్థం కాలేదు. తరువాత విషయం తెలిసి "నిన్ను నిర్బంధించిన వారిని తీసుకొచ్చి కొడ్తాంలే వెంకయ్యా" అని ఓదారిస్తే పసిపిల్లవాడిలాగా ఏడ్పు మానారు.

అక్కడక్కడా తిరిగి సాయంకాలానికి అన్నానికి చెల్లెలి దగ్గరకు వెళ్లేవారు శ్రీస్వామివారు. 'వెంకన్న దండగ తిండి తింటున్నా'డని బావమర్దులు ఏ మాత్రం అసంతృప్తిగా వున్నాసరే, యిక అక్కడ నిలిచేది లేదు. శ్రీస్వామివారు వస్తే మౌనంగా అన్నం పెట్టి తలుపేసి మనం బయటకొస్తే తింటారు. మనం వారి అన్నం దగ్గర వుంటే "మీరు బయటకు పొండి తింటాను" అనేవారు.

సాయంకాలము దాకా చేలలోను, అడవిలోను తిరిగి, తిరిగి వచ్చేటప్పుడు రెండు శేర్లు గుత్తి వేరుశనగకాయలు ఏరి మూట గట్టుకొచ్చి చెల్లెలికిచ్చి అన్నం తిని వెళ్ళేవారు. వారికి ఋణపడరాదని కాబోలు శ్రీస్వామివారు అలా చేసేవారు.

ఇంటి నుండి బయటకు వెళ్లాక మరలా తమ స్వగ్రామమైన నాగుల వెల్లటూరు రాలేదట. ఒకసారి ఆయన ప్రక్క గ్రామాలలో వుంటే శ్రీస్వామివారి తమ్ముడు వెళ్ళి పిలిస్తే వచ్చారు. జొన్న కోత కోస్తుంటే శ్రీస్వామివారు కూడా కోతకు వంగి "చాకలి యోగం, మంగలి యోగం" అని అరుస్తూనే ఇద్దరు మనుషుల కోత కోశారు. నాలుగు రోజులు కోయవలసిన కోత రెండు రోజులలోనే అయిపోయిందట.

"స్వామి" అని ప్రఖ్యాతిగాంచాక వీరు ఫలానా చోట ఉన్నారని తెలిసి వీరి తల్లిగారు తినుబండారాలు చేసి తీసుకువెళ్ళి సమర్పిస్తే వాటిని తమతోనున్న వారందరికీ సమానంగా పంచమని, తరువాత చాలా స్వల్పంగా సేవించారు. ఒక రోజున శ్రీస్వామివారు మంగమ్మ గారింట రాత్రి భోజనం చేసి వెళ్ళి అంతలోనే మరలా వచ్చి "బావా! మంగమ్మ ఏదో మందు పెట్టింది. ఒళ్ళంతా సూదులతో గుచ్చినట్లు మంటలు, చురుకలుగా ఉంది. అన్నం పెట్టండి" అన్నారు. అప్పటికి అందరూ భోజనం చేసి పడుకొన్నారు. "ఇప్పుడెక్కడ వెంకయ్యా, అన్నం లేదు. ప్రొద్దున వండి పెడతాము" అన్నారు. అట్లయితే వడ్లుగానీ, రాగులుగానీ పెట్టమని అడిగారు. రెండు శేర్లు రాగులు పెట్టించుకు పోయి వాటిని తాను తినకుండా చీమలకు పోశారు. చీమల ఆకలి తీరితే ఆయన ఆకలి తీరుతుంది గాబోలు!

బద్వేలు గ్రామం వద్ద అంకాళమ్మ బోటు అనే చోట పెన్నానది ఇరవై అడుగుల వెడల్పు గలిగి పారుతుంది. శ్రీస్వామివారు అచ్చట ఆ నదికి స్వయంగా ఇసుక మోసి ఐదడుగుల ఎత్తున కట్టవేసేవారు. అలాంటప్పుడు జయరామరాజు, వెంకయ్య ఇసుక మోసి శ్రీస్వామివారికి సహాయం చేసేవారు. పెన్నా నది ప్రవాహం ఆగి నీళ్లు నిలిచాక, ఆ నీళ్ళ నుండి రెండడుగుల వెడల్పు కాలవ తీసి, ఆ నీటిని నదీ ప్రవాహ దిశకు వ్యతిరేక దిశలో కొంత దూరం పారించి, తిరిగి ఆ నీటిని నదీ ప్రవాహములో కలిపేవారు. ఆ విధంగా ఆ చిన్న కాలువ నీరు నదీ ప్రవాహములో కలిసే చోట కంప తుక్కు నీటిపై పెట్టి తన యొద్ద నున్న కాల్చిన కపిలమోకు నిప్పు ఆ కంపకు పెట్టేవారు. మంటవేస్తూ మనుషులనెవ్వరినీ దగ్గరకు రానిచ్చేవారు కారు.

ఆ నీటిని ముంతతో తీసుకుని మంటకు ఇరువైపులా తిరగబోస్తూ వుండేవారు. సేవకులతో అనేవారు, "అయ్యా! ఈ నీళ్ళ విలువ ఎంత అనుకున్నావు? తులం మున్నూరు కోట్లు. ఈ రోజు లోకం అంతటికీ ఖర్చుకు పోను ఇంకా డబ్బు మిగిలింది" అనేవారు. "ఎందుకు స్వామి ఇదంతా?" అంటే, "పెద్దమ్మవారు, దూములు (వైద్యమునకు అలివిగాని కలరా), పాపమూ తగ్గేందుకయ్యా" అనేవారు.

ఒకొక్కప్పుడు సేవకుల చేతిలో పైసా ఉండదు. "ఇప్పుడే తిరువళ్లూరు పోవాలి, కదలండి. నెల్లూరు, జొన్నవాడ, కంచి మొదలగు దేవస్థానములకు

పోవాల"ంటారు శ్రీస్వామివారు. "డబ్బు లేదు స్వామి!" అంటే "వస్తుంది కదలండయ్యా!" అని తొందర చేసేవారు. శ్రీస్వామివారు చెప్పినట్లే ప్రయాణానికి ఎవరో ఒకరు వచ్చి దక్షిణ రూపంలో అవసరమైనంత డబ్బు సమర్పించి పోయేవారు.

ఒక మిట్ట మధ్యాహ్నం తలుపూరులో భక్తులు అన్నం వండుతున్నారు. "వెంటనే కదలండి. ఒక్క క్షణం ఉండకూడదు" అని సేవకులు ప్రయాణమైన దాకా ఊరుకోలేదు. అన్నం ఉడుకుతుందంటే "అన్నం వస్తుందిలే పదండయ్యా" అన్నారు. అన్నం ఆశ వదిలేసి బస్టాండుకొచ్చారు. పొదలకూరు వైపు వెళ్ళే బస్సు వచ్చింది. "ఇది కాదయ్యా మన బస్సు. తరువాత బస్సుకు పోదాం" అన్నారు. "ఈ పాటికి అన్నం తిని వచ్చే వాళ్లముగదా స్వామీ" అంటే "అన్నం వస్తుందయ్యా ఉండండి" అన్నారు. "డబ్బు లేదు స్వామీ చార్జీలకు" అంటే "పై వాళ్ళు పంపుతారులే" అన్నారు. అన్నట్లే కొంత సేపటిలో పొట్టేపాళెం ఆదిలక్ష్మమ్మగారు స్వామి దర్శనార్థం కారులో వచ్చి గంపలో దోశలు, వడలు, పొంగలి, పులిహోరా మొదలైన పదార్థాలు తెచ్చి తృప్తిగా తినబెట్టి అవసరానికంటే ఎక్కువగా దక్షిణ సమర్పించి వెళ్ళారు.

ఒక్కొక్కప్పుడు ఒకే ఊరిలో రెండు, మూడు చోట్ల మకాం మార్పించేవారు. ఫలానా దిశ వైపు పోవాలంటే ఎంత యిబ్బందిగానీ, మార్గం దుస్తరంకానీ వెళ్ళి తీరాల్సిందే. అన్నం తిననీ, తినకపోనీ, ఎండనక, వాననక, వెళ్ళాలంటే వెళ్ళితీరాలి. శ్రీస్వామివారు నడిచేటప్పుడు కూడా అలానే తిరిగేవారు.

అడవిలో శ్రీస్వామివారు ఏంచేస్తారో చూడాలని అనేక మంది ప్రయత్నించారు. కాని ఎవరైనా తనను వెంబడించినట్లు తెలుసుకున్నారంటే వెంటనే ముండ్లలో అడ్డదిడ్డంగా నడిచేవారు. ఆ ముండ్లలో నడవలేక అలా ప్రయత్నించినవారు వెనుతిరిగి వచ్చేవారు.

పండ్లు తోమటం, పుక్కిలించడం అనేది లేదు. చప్పరిస్తున్న పొగాకు వుమ్మేసి వెంటనే గంజి త్రాగేవారు.

ఒక రోజు నా (రచయిత) ఆయాసము శ్రీస్వామివారి సన్నిధిన కూర్చున్న వెంటనే నివారణ అయినందున ఆనందోత్సాహంతో కనబడిన

ప్రతివారికీ స్వామి విషయం చెపుతున్నాను. శ్రీస్వామివారు ఒక రోజు ఏకాంతంగా అన్నారు "ఎట్లంటే అట్లా మాట్లాడుతావేమి?" అని. అంతటితో నోరు కట్టేసుకోమని ఆత్మబోధ చేశారు శ్రీస్వామివారు. మరొక గొలగమూడి నివాసి చెప్పారు "అయ్యా! నన్ను గురించి కథలు కథలుగా చెప్పుకుంటున్నారే, అది తప్పుగదయ్యా" అని శ్రీస్వామివారు అన్నారట. మరొకప్పుడు "వీళ్ళప్పుడే మూటవిప్పి బండ్లకెత్తుతున్నారు. వద్దని చెప్పమ్మా" అని తులశమ్మతో చెప్పేవారు.

పై విధంగా తన మహిమ గోప్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో కోట్లు, పడగలు, రాసులు అని పరిభాషతో మాట్లాడేవారు. దాని భావం జనానికి అర్థం కాక ఎక్కువ మంది తిరిగి వారిని దర్శించేవారు కాదు.

అప్పుడప్పుడూ నియమం లేకుండా బుద్ధి పుట్టినప్పుడు క్షౌరం చేయించుకొనేవారు. అందరూ మంగలికి 50 పైసలు యిస్తే శ్రీస్వామివారు రూ.1-00గానీ, రూ. 2-00లు గానీ ఇచ్చేవారు. 1980 తరువాత వారు కోరకున్ననూ సేవకులు అప్పుడప్పుడూ గుండు చేయించి, మీసాలు తీయించేవారు. శ్రీస్వామివారి భక్తులలో బరిగెల నాగయ్య ముఖ్యంగా ఈ సేవ తానే స్వయంగా చేసేవాడు. స్వామి వయస్సులో వుండి తిరిగేటప్పుడు గిరజాలు, మీసాలు ఉండే ఫోటో చూడవచ్చు.

మహా సమాధికి ముందు ఒక సంవత్సరం నిరంతరం తన రెండు పిడికిళ్లనూ బిగించి వేళ్ళు వూడదీయ నిచ్చేవారు కాదు. ఎంతటి రుగ్మతలో ఉన్నా, యోగస్థితిలో ఉన్నా కూడా ముందుకు జరిగి, మూత్ర విసర్జన చేసేవారు గానీ, తన పరుపుల మీద విసర్జించేవారు కాదు. శ్రీ రోశిరెడ్డిగారు శ్రీస్వామివారి మూత్రాన్నంతా ఒక్క బొట్టు వదలకుండా తీర్థంగా త్రాగేవారు.

కనుకనే రోశిరెడ్డి కంటి చూపులేకున్నా, అన్నం మానివేసి అటుకులు, ద్రవాహారంతో జీవిస్తున్నా, చివరిరోజుల వరకు కూడా ఊరిలో భిక్షకు వెళ్ళి భక్తులకోసం భిక్షాన్నం తెచ్చే తన సేవను దీక్షగా చేస్తూనే ఉన్నారు. సేవకులు స్వామి సేవ చేస్తే, ఈయన ఈ విధంగా సేవకులకు సేవ చేస్తున్నాడు. అచంచలమైన వారి విశ్వాసమే వారి బలం.

శ్రీస్వామివారికి నియమితమైన దినచర్య అంటూ ఏమీలేదు. ఒక్కొక్కప్పుడు రెండు రాత్రులు రెండు పగళ్ళు నిరంతరం "బండి ఆపండయ్యా"

అనిగానీ, మరేవో యితర మాటలు గానీ అరుస్తూ, ఒకే ఆసనంలో కదలక కూర్చునేవారు. వారు అరిచే మాటలను మరొకరు పెద్దగా చెప్తూ వుండాలి. ఒక్కొక్కసారి రాత్రింబవళ్ళు యోగనిద్రలో ఉండేవారు. అమాయకులు మాత్రం శ్రీస్వామివారు బలహీనమై నిరంతరం నిద్రలో ఉన్నారని తలచేవారు. అట్టి నిద్రలో కూడా వారు సర్వజ్ఞత్వం ప్రదర్శించి భక్తులనాదుకొనటం ఎందరికో అనుభవం.

ఉదాహరణకు 1978 లో ఒక రోజు శ్రీస్వామివారు ఒక రోజంతా (రాత్రి, పగలూ) నిద్రలో ఉన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు హఠాత్తుగా లేచి కూర్చుని, అప్పుడే నామస్మరణతో నడచివచ్చిన నాకు ఒక చీటి వ్రాయించి, ఆశీర్వాదముద్రవేసి ఇచ్చి వెంటనే ముసుగు కప్పుకొని మళ్ళీ నిద్రకు ఉపక్రమించారు. భక్తులు జావ త్రాగమని ప్రార్థించినా వినిపించుకోలేదు. ఐదు నిమిషాలకల్లా మా అవ్వగారు మరణావస్థలో వున్నారని, నన్ను వెంటనే రమ్మని మనిషి వచ్చాడు. నేను వెంటనే కలిచేడు వెళ్ళి, శ్రీస్వామివారి పాదతీర్థం, ఊదీ ఆమె నోటిలో వేస్తే మ్రింగింది. తులసి నీళ్ళు కూడా త్రాగింది. మందు పోస్తానంటే నోరు తెరవలేదు. శ్రీస్వామివారి పాదతీర్థం సేవించి ప్రాణం వదిలింది. ఆమె తన అంతిమ ఘడియలలో రాత్రింబవళ్ళు సాయినాథుని ప్రార్థన చేసుకున్న పుణ్యమూర్తి. కనుకనే శ్రీస్వామివారి రూపంలో శ్రీ సాయి తన ఆశీస్సుల నందించి సద్గతి ప్రసాదించారు.

పై సన్నివేశంలో శ్రీస్వామివారు నిద్రలో నున్నప్పటికి అది మన నిద్రలాంటిది కాదు. ఆ స్థితిలో వారికి మూడు మైళ్ళ నుండి తన ఆశీస్సుల కొరకు నేను పాదచారినై వస్తున్నానని తెలుసు. రెండు గంటలలో మా అవ్వ మరణించ బోతున్నదనీ తెలుసు. నన్ను పిలుచుకొని పోవడానికి మనుషులొచ్చే విషయం కూడా తెలుసు. ఆమె నిరంతరం సాయి నామము ఉచ్ఛరించిన పుణ్యమూర్తి కనుక అంతిమ ఘడియలలో ఆమెకు తన ఆశీస్సులతో సద్గతి ప్రసాదించాలని కూడా తెలుసు. కనుకనే వెంటనే నిద్ర లేచి భక్తులు బ్రతిమిలాడినా గంజి కూడా త్రాగకుండా చీటీ వ్రాయించి ఇచ్చి మళ్ళీ యోగ నిద్రకు ఉపక్రమించారు. నిజమైన యోగికి రాత్రింబవళ్ళు లేవని శాస్త్రం. అది శ్రీస్వామివారికి ఎంత చక్కగా సరిపోయిందో!

సాధన కాలంలో వీరి అనన్యమైన వైరాగ్యం చూచే వారిని ముగ్ధులను చేస్తుండేది. లడ్డు పెట్టినా వద్దనరు. కానీ కొంచెం కారం, పచ్చడి పెట్టించుకొని అందులో కలుపుకొని తినేవారు. ఒకప్పుడు భక్తులు శెనగపప్పు, బెల్లం, కొబ్బరి దంచి పొడిచేసి డబ్బాలో పోసి అందుబాటులో ఉంచితే శ్రీస్వామివారు తీసుకొని తినేవారు. ఒకరోజు శెనగల పొడి డబ్బా బదులు, భక్తులు వారి చెంత పొరపాటున తలస్నానమునకు వాడే సీకిరేణి పొడి డబ్బా ఉంచారు. సీకిరేణి పొడి తినేశారు శ్రీస్వామివారు. తెల్లవారి సేవకులు తమ పొరపాటుకు పరితాపం చెందారు. శ్రీస్వామివారు మహాసమాధికి ముందు పదిహేను సంవత్సరముల నుండి మంచినీరు త్రాగి ఎరుగరు. ఎప్పుడు త్రాగినా వేడినీటిలో చక్కెర కలిపి ఇస్తే త్రాగేవారు స్వామివారు. తననుకానీ, తనపాదములను కానీ ఎవ్వరినీ తాకనిచ్చేవారు కాదు. వారి పదిమంది సేవకులలో ఎప్పుడూ ముగ్గురికి మాత్రమే వారిని తాకేందుకు అనుమతించేవారు. వారికి పూజలు చేయనివ్వరు. వారికి ప్రదక్షిణలు చేస్తుంటే ఒకేఒక్క ప్రదక్షిణ చాలని చెప్పేవారు.

దక్ష అనే సంస్కృత పదానికి శ్రద్ధ అని అర్థము. మనకు ఎవరిపై శ్రద్ధ ఉంటుందో వారికి మన భావం వ్యక్తం చేసుకునే పద్ధతే ప్రదక్షిణలు చేయడం, దక్షిణ సమర్పించడం. మన శ్రద్ధను చూరగొన్న వారిని గూర్చి ఎంత తెలుసుకున్నా తనివి తీరదు. వారిపై నిజమైన ప్రీతిగలవారు వారి మనస్సంతా తమ ప్రీతిపాత్రుల చర్యలను, మాటలను తలుచుకుంటూ హృదయమంతా వారి ధ్యాసతో నింపుకొని పులకించిపోతారు. ఇట్టి మన అంతరంగాల బాహ్య ప్రకటనే ప్రదక్షిణ. ఈ విధంగా **మన మనస్సులు వారి చుట్టూ పరుగులు** 1
**తీసేట్లు చేసుకోండని, అప్పుడొక్క ప్రదక్షిణ చేసినా చాలని** శ్రీస్వామివారు అలా అనేవారు.

శ్రీస్వామివారికి తాటిఆకే ఆసనం, మట్టిముంతే పాత్ర, గోనె పట్టలే పరుపు, భూదేవే వారి ఊయల, రాగి అంబలి, తెల్లగడ్డ (చిన్న ఉల్లిపాయ), మిరప్పొడి ఇవే పంచభక్ష్యపరమాన్నాలు. పాత పంచలు, దుప్పట్లే వారి చీనాంబరాలు, ఎంత వైరాగ్యమూర్తో!

బాల్యం నుండి శ్రీస్వామివారికి పిచ్చెక్కిందని అందరూ తలచిన్నప్పటికి ఆయన స్వగృహంలో వున్న సుమారు 20 సం।। లలో గాని, తరువాత ఆయన పాదచారియై సంచారముచేసే సమయంలోగాని ఒక్కసారైనా ఆయన

యెవ్వరినీ, “ఇలాంటివారు, అలాంటివారు” అని పొగిడిగానీ, విమర్శించిగానీ యెరుగరు “నాభినందతి నద్వేష్టి” అన్న సూత్రం ఆయనలో యెప్పుడూ తొణికిస లాడేది. స్వామికి ఇష్టాయిష్టాలు లేవు. తమ చుట్టూ ఉన్న సేవకులు నిరంతరం లోకాభిరామాయణం, పరనింద చేస్తున్నా కూడా ఒక్కసారైనా, “ఏమయ్యా! యిలా మాట్లాడడం తప్పుగదా!” అని చెప్పి గూడా యెరుగరు.

ఏనాడైనా తనకు “ఫలానా కూర కావాలని గానీ”, “ఈ కూర బాగుంది, యిది బాగాలేదు” అనిగానీ, “ఫలానా పని యిలా చెయ్యాలి” అనిగానీ ఆయన చెప్పి యెరుగరు. ఏది లభిస్తే దానితో తృప్తిగా భోంచేసేవారు. గంజి లేదని మిఠాయి పెడితే, జిహ్వకు రుచి చూపకూడదని ఆ మిఠాయికి మిరప్పొడి కలిపి మరీ స్వీకరించేవారు! బాహ్య పరిస్థితులను లెక్కచేయక నిరంతరం ధ్యేయంవైపు సాగడమే వారి లక్ష్యమన్నట్లు నడుచుకునేవారు. ఎండ, వాన, గాలి వేటినీ లెక్కచెయ్యక నిరంతరాగ్నిని నియమంగా వ్రేల్చేవారు.

శ్రీస్వామివారు భోంచేసే విధానం గురించి దేవళ్ళ వెంకటయ్యగారిలా చెప్పారు. శ్రీస్వామివారు శిష్యబృందంతో కలిసి ఎక్కడైనా విడిది చేసినప్పుడు మొదట విస్తరి నిండా అన్నం పెట్టాలి. దానిని అంచు వెంబడి కట్టవలె చేసేవారు. స్వల్పంగా మాత్రమే మధ్యలో వుంచుకొనేవారు. మరలా అన్నం పెట్టించుకొని, మజ్జిగ వేసుకొని భోజనం పూర్తి అయిన తర్వాత విస్తరి చుట్టూ కట్టవలె వున్న అన్నాన్ని నేలపై, ఏవైపు దాన్ని ఆ వైపుకు మునివేళ్ళతో చల్లేసేవారు.

శ్రీస్వామివారు అన్నం తినేరోజుల్లో వారికి రెండు విస్తళ్ళ అన్నం వడ్డించవలసి వచ్చేది. ఒక బేసిన్ నిండుగా అన్నం తెచ్చి బోర్లించాలి. కాని గరిట, హస్తము, వగైరాలతో వప్పుకోరు. మొదట విస్తరి నిండా పెట్టిన అన్నాన్ని తమ సిరా పూసుకున్న చేత్తో తాకి తనకు ఆతిధ్యమిచ్చిన భక్తునికిచ్చేవారు. అది మనం ప్రసాదంగా తీసుకోవాలి. రెండవసారి విస్తరి నిండా అట్లానే వడ్డిస్తే దానిని తానే స్వయంగా ముద్దలుచేసి, పెద్ద ముద్దలు విస్తరి చుట్టూ పెట్టి, మిగిలిన అన్నాన్ని చిన్న ముద్దలుచేసి విస్తరి చుట్టూ యింకొక వరుస పెట్టి, అప్పుడు మిగిలిన అన్నం తినేవారు. అన్నం మరలా మారు ఎప్పుడూ వడ్డించుకునే వారుకారు. వెంకమ్మ లాంటి భక్తుల ఇండ్లకు వచ్చినప్పుడు మొదటి విస్తరిలోని అన్నం తాకి, వారికి ప్రసాదంగా ఇచ్చేవారు.

ఒక్కొక్కప్పుడు "అయ్యా! ఒక్కరవ్వ కారం పెడతావా" అని అడిగేవారు. అప్పుడు ఎండుమిరపకాయలు, ఉప్పుగల్లు, యర్రగడ్డ ఇస్తే ఆ మూడు అరచేతిలో నలుపుకొని అన్నంలో కలుపుకొని తినేవారు.

ఇది కొన్నాళ్ళు చూచి రోశిరెడ్డి ఒక భక్తురాలు దగ్గర ఎండు మిరపకాయలు, ధనియాలు, ఉప్పు వేయించి మెత్తగా దంచి పొడి చేయించి డబ్బాలో సిద్దంగా ఉంచుకొనేవారు. స్వామివారు కోరినప్పుడు పెట్టేవారు. అప్పుడప్పుడూ అరుదుగా శ్రీస్వామివారు "కొంచెం బెల్లం పెట్టయ్యా" అని అడిగి పెట్టించుకు తినేవారు. అందువలన రోశిరెడ్డి వేయించిన శెనగపప్పు, కొబ్బరి, బెల్లం మెత్తగా దంచి డబ్బాలో సిద్దంగా ఉంచుకొని శ్రీస్వామివారు అడిగినప్పుడు ఆ డబ్బా స్వామికిస్తే కొంచెం తీసుకుని తినేవారు. ఒక్కొక్కసారి స్వామి కరివేపాకుపొడి, చింతాకుపొడి, ధనియాలపొడి, కారప్పొడి అడిగి పెట్టించుకుని అన్నం కలిపి తినేవారు.

ఒకరోజు శ్రీస్వామివారు తన సేవకునితో "అన్నం వండి పెట్టయ్యా" అన్నారు. అలాగే తయారుచేసి, భక్తులు శ్రీస్వామివారికి సమర్పించారు. శ్రీస్వామివారు తన అరచేతిని నడినెత్తికి తాకించి తీసి అన్నానికి అద్దారు. ఇలా ముమ్మారు చేసి ఆ అన్నాన్ని స్వామి స్వల్పంగా కూడా తినకుండా ఒక భక్తునికిచ్చి, "అందరికి పెట్టయ్యా, జబ్బులు పోతాయి" అన్నారు. వారలాగే చేశారు.

ఒక్కొక్కప్పుడు "నాకు త్వరగా ఆకువక్క పెట్టయ్యా" అనేవారు. తెచ్చేలోగా అనేకసార్లు అడుగుతూ తొందర చేసేవారు. కొంచెం తిని, "చప్పగా ఉందయ్యా కారంగా చేసి ఇంకొంచెం పెట్టు" అంటూ మొదట పెట్టిన దంతా తినేసేవారు. ఈసారి సున్నం కాస్త ఎక్కువ వేసి పెడితే, "తినమ్మాతిను బాగుంది తిను" అని ఎవరో అదృశ్య వ్యక్తికి చెప్పినట్లు చెపుతూ తినేవారు. కొంచెం సేపటికి "ఇక ఆమెను పొమ్మని చెప్పయ్యా! అంతా నేను చూసుకుంటాను" అని అనేవారు.

ఒకరోజు ఆంజనేయస్వామిగుడిలో భక్తులు పాడే తత్వాలు ఆపమని "ఓం నారాయణ, ఆదినారాయణ" అనే మంత్రం తాను చెపుతూ, అందరిచేతా చాలా సేపు చెప్పించారు. అంత సేపు శ్రీస్వామివారు ఏనాడూ తానుగా చెప్పి నామం చేయించలేదు.

ఆయన జావ మాత్రం త్రాగే రోజులలో అప్పుడప్పుడూ అరుదుగా తెల్లగడ్డలు ఉడకబెట్టిగానీ, కాల్చిగానీ వొలిచి వత్తియిస్తే చప్పరించి మ్రింగేవారు. అవి కావాలని వారే అడిగేవారు కూడాను.

శ్రీస్వామివారికి జావపోసే సేవ ప్రతినిత్యం రోశిరెడ్డి చేసేవాడు. ఒకరోజతడు కట్టెలకుపోయిన సమయంలో మరొక స్వామిసేవకుడు, "ఈ రోజు స్వామికి జావ నేను పోస్తాను" అని తీసుకు పోయాడు. శ్రీస్వామివారు వద్దన్నారు. రోశిరెడ్డి కట్టెలు తెచ్చి అక్కడ వేసి అలవాటు ప్రకారం శ్రీస్వామివారికి జావ పోయబోయాడు. "స్వామికి జావ వద్దంట నీవెందుకు తీసుకుపోవడం" అని యితర భక్తులు అడ్డం చెప్పారు. రోశిరెడ్డి వారి మాట పట్టించుకోకుండా జావ తీసుకుపోయాడు. "నీవు తెచ్చావు గనుక త్రాగుతానయ్యా" అని చెప్పి శ్రీస్వామివారు జావ స్వీకరించారు. శ్రీస్వామివారికి ప్రతినిత్యం ఏ సేవకుడు ఏ సేవ చేస్తాడో అతడే ఆ సేవ చెయ్యాలి. వారు చెపితే తప్ప సేవకులు తమ నిత్యకృత్యం మార్చుకుంటే వప్పుకునేవారు కాదు.

శ్రీస్వామివారు అన్నం తినే రోజులలో కూడా రోశిరెడ్డి ఆ సేవ చేసేవాడు. ఒకరోజు మరొక సేవకుడు ఈ రోజు ఆ సేవ నేను చేస్తానని పట్టుపట్టడంతో రోశిరెడ్డి ప్రక్కకు తప్పుకున్నాడు. ఆ భక్తుడు అన్నం తెచ్చి శ్రీస్వామివారిని తినమంటే అక్కడ పెట్టి పొమ్మన్నారేగాని, తినలేదు. కొంత సేపయ్యాక శ్రీస్వామివారు రోశిరెడ్డిని పిలిచి, "పెడితే అన్నం నువ్వే పెట్టు లేకుంటే నన్ను బండిలో వేసి ఆశ్రమంలోంచి లాగేయ్" అన్నారు కోపంగా, నాటి నుండి ఇతర సేవకులెవ్వరూ శ్రీస్వామివారికి 'మేమన్నం పెడతా'మని వాదుకు వచ్చేవారుకాదు.

ఒకరోజు రోశిరెడ్డి ఉరఫ్ నాగతాతతో స్వామి ఇలా అన్నారు "కుడిచేతి అరచెయ్యి పట్టి రెండు పుడిసెళ్ళు నీళ్ళు తాగు". అంతే ఆనాటి నుండి నాగతాతగారికి దాహం నశించిపోయింది.

సామాన్యంగా గుండాన్ని సేవకులు సవరిస్తుంటే అడ్డుచెప్పని ఆయన ఒక్కొక్కప్పుడు దాని చెంత కెవరినీ రానిచ్చేవారు కాదు. తులశవ్వ నిత్యమూ ఆ గుండంలో సాంబ్రాణి వేసి నమస్కరించుకొనేది. ఒకరోజు శ్రీస్వామివారు చేతులడ్డం పెట్టి ఆమెను గుండం దగ్గరికి రానీయలేదు. బహుశా మన

స్థూలదృష్టికి గోచరించని రీతిని ఋషీశ్వరులో లేక దేవతలో గుండము వద్దకు వచ్చి యుంటారని ఈ సన్నివేశాన్ని బట్టి మనమూహించవచ్చు. ఇలాగే రోశిరెడ్డి గారిని కూడా ఒకరోజు గుండం సవరించబోతే మండుతున్న కట్టెలను తాకనివ్వక "అబ్బో! అబ్బో! ఇప్పుడు తాకవచ్చా?" అన్నారు.

ఒకసారి పచ్చి బొంతజెముడు చెట్లు ధునిలో వేసి అవి మండేందుకు ఎండుగడ్డి గుండంలో వేసి శ్రీస్వామివారు పకపకా నవ్వుతూ ఉన్నారు. కారణమడిగితే "బొంతలు పోట్లాడుకుంటున్నాయయ్యా" అన్నారు.

ఒకసారి స్వామివారు ఒక మైదానంలో ధునివేసుకొని కూర్చొని యున్నారు. శ్రీస్వామివారి విషయం తెలియక ఒక వ్యక్తి బీడీ కాల్చుకొనడానికి నిప్పుకోసం వచ్చాడు. స్వామి దగ్గర తంబుర వగైరా చూచి అతడు ఆ నిప్పుతో బీడీ కాల్చుకోవచ్చో? లేదో? నని అనుమానిస్తూనే కాల్చాలనే ఆతృతతో ఉన్నాడు. "ఏమయ్యా! బీడీ కాల్చుకుంటావా? కాల్చుకో!" అన్నారు శ్రీస్వామివారు. అది విని సేవకులు ఆశ్చర్యపోయారు. కారణం, ఆ రోజుల్లో ధునిలో ఒక్కపుల్ల వేయాలన్నా శ్రీస్వామివారు స్వయంగా వేసుకునేవారు గానీ ఎవరినీ తాకనిచ్చేవారుకాదు. కాని అవతలివారి భావాన్ని బట్టి తాము నడుచుకొనే వారని పై సంఘటన చెపుతుంది.

దక్షిణ రూపంలో వచ్చిన పైకాన్ని శ్రీస్వామివారు తన సేవకులకు వారి వారి కష్టము, అవసరాలకు తగినట్లు ఇచ్చేసేవారు. కాని తమ దగ్గర నిల్వ ఉంచేవారుకారు. పండుగలు మొదలైన సమయాలలో భక్తులు సమర్పించిన తినుబండారాలను వచ్చిన భక్తులందరికీ, తమ సేవకులకుగూడా ఎప్పటికప్పుడు పంచమనేవారు.

దశయ్య, రమణయ్య, రోశిరెడ్డి వారికి కష్టం ఎక్కువ కనుక వారికి కొన్ని తినుబండారాలు దాచి యుంచి ప్రత్యేకంగా యిచ్చేవారు.

రాత్రింబవళ్లు తమతో పాటే నిద్ర మేల్కొనే రోశిరెడ్డిగారిని ఒంటరిగా అర్ధరాత్రి సమయాన పిల్చి తమ చాప క్రింద దాచి పెట్టిన తియ్యటి పదార్థాలు ఇచ్చి పూరిపాక వెనుకకు పోయి తినమని చెప్పేవారు.

శ్రీస్వామివారికి మహాసమాధి చెందేనాటికి సుమారు 95-98 సం॥ల వయస్సు. చివరి పన్నెండు సం॥లు కేవలం ద్రవాహారంతోనే ఉన్నారు. కానీ

శరీరంపై ఎక్కడా గూడ వృద్ధాప్య చిహ్నములైన ముడతలు లేవు. ఎప్పుడూ ఎముకల కంటుకొని నున్నగా నిగనిగలాడుతున్న చర్మం చూస్తే తెలిసినవారికి యిది యోగ శరీరం అని తెలుస్తుంది.

శ్రీస్వామివారి నేత్రములలోని ప్రశాంతత, గాంభీర్యము కొట్టవచ్చినట్లు కనబడేవి. చురుకుగా చురుక్కున మెరిసే కన్నులు ఆ మహాయోగికి పెట్టక పెట్టిన ఆభరణాలు.

గురవయ్య ఎప్పుడూ శ్రీస్వామివారి తల దగ్గరే వుండి శ్రీస్వామివారు అరిచే అరుపులు తానూ అరుస్తూ నిరంతరం మేలుకొని వుండేవాడు. శ్రీస్వామివారు చేతులు వెనుకకు పెట్టి, తమ తల క్రిందనున్న దిండుపట్టుకొని, దృష్టిని ఆకాశంలో నిలిపి, అట్లానే చూస్తూ వుండేవారు. శ్రీస్వామివారి అట్టి స్థితిలో గురవయ్యకు ఒక విధమైన తన్మయత్వం కలిగి శ్రీస్వామివారిని వదిలి వెళ్ళాలని బుద్ధేపుట్టేది గాదు.

అట్టి సమయాలలో శ్రీస్వామివారిలో నుండి ఒక వెలుగు తనలోకి ప్రవహిస్తున్నట్లు గురవయ్యకి అనుభవమయ్యేది.

మహాసమాధికి మూడు సంవత్సరాల ముందు నుండి శ్రీస్వామివారు నిరంతరం సమాధి స్థితిలో నుండేవారు. కనుక పరుపు వేస్తే అభ్యంతరం చెప్పలేదు. గురవయ్యను కూడా పరుపు మీద కూర్చోమని లాగి కూర్చోపెట్టేవారు.

అంతకు ముందు వరిగడ్డిపై ఈతాకు చాపగానీ, తాటిఆకు గానీ వేసి వాటిపై పాత గోనెపట్టా కప్పి కూర్చోబెట్టేవారు. అదే వారు పడుకునే పాన్పు కూడా.

శ్రీస్వామివారు ముఖ్య భక్తురాలైన వక్కెమ్మ, భక్తితో నామజపం చేస్తూ ప్రోగుచేసిన దొండపొట్టుతో తయారు చేసిన పరుపు వేస్తే అంగీకరించారు. ఆ తరువాత ఆ పరుపు చినిగిపోయాక భక్తులు దూది పరుపులు వేశారు.

ఏ గ్రామానికి వెళ్ళినా రెండు రోజులు గడిచిందంటే శ్రీస్వామివారు మరొక ఊరికి పోవడం గానీ, లేకుంటే అదే గ్రామంలో మరొక చోటుకు తన మకాం మార్చడం గానీ జరిగేది. 'రాత్రి, పగలు నాకు తెలియటం లేదయ్యా!

అయ్యా! ఇప్పుడు ఎంత ప్రొద్దెక్కింది?' అనేవారు. రాత్రిపూట 10–3–1980 న శ్రీస్వామివారు తలుపూరు నారాయణదాసు ఆశ్రమంలో విడిది చేసి యున్నారు. గురవయ్యతో 'అయ్యా! ఇది ఏ ఊరు? అని అడిగారు. 'తలుపూరు గదా స్వామి' అంటే, 'ఆ సరే' అన్నారు. అంటే భగవద్గీతలో 'నతద్భాసయతే సూర్యో నశశాంకో నపావకః యద్గత్వా ననివర్తంతే తద్ధామ పరమం మమ' అన్న స్థితిలో శ్రీస్వామివారు వున్నారన్న మాట. దేనిని సూర్యచంద్రాగ్నులు వెలిగించలేరో, ఎట్టి స్థితిని పొందిన వారు మరలా అజ్ఞానములోనికి రారో అటువంటి స్థితే వారిది.

ఆయన నడవలేరు గనుక ముంతలో మూత్ర విసర్జన చేస్తే భక్తులు తీసేవారు. మల విసర్జన చేయాలంటే ఎవ్వరూ లేని ఊరుబయట ఏకాంత ప్రదేశానికి తీసుకుపోవాలి. నేలమీద గడ్డిగానీ, బందారాకు గానీ, తంగేడు ఆకుగానీ పరిచి దాని పైన ఈతచాప వేసి, పరుండబెట్టి మనం దూరంగా వచ్చేస్తే మల విసర్జన చేసేవారు. తరువాత వెంటనే బాగా వేడిగానున్న నీటితో స్నానం చేసేవారు. ఎప్పుడూ తన పడకపై మల మూత్ర విసర్జన చేయలేదు.

మహాసమాధికి ముందు ఒక సంవత్సరం రోజులు నిరంతరం తీవ్రధ్యాననిష్టలో వుండేవారు. స్నానానికి పెట్టిన నీరు ఏమాత్రం వేడితగ్గినా 'చలి చలి' అని కేకలేసేవారు. వేడి ఎక్కువైతే, 'అబ్బా! అబ్బా!' అని అరిచేవారు. సరైన మోతాదుగా వుంటే 'అద్దీ! అద్దీ!' అంటూ స్నానం చేసేవారు. ఒక్కొక్కప్పుడు 'ఇంక చాలమ్మ, యింక చాలు అంతే, అంతే' అనేవారు. అలాంటప్పుడు సేవకులు త్వరత్వరగా వళ్ళు తుడిచీ తుడవక మునుపే శ్రీస్వామివారిని పట్టి ఎత్తుకుపోయి, ప్రక్కపై పరుండ బెట్టేవారు. శ్రీస్వామివారి కౌపీనం పిండిన నీటిని భక్తులు భక్తితో కన్నులకద్దుకొని తీర్థంగా స్వీకరించేవారు. కొందరికి కళ్ళు మంటలు, మసకలూ వుంటే ఆ కౌపీనం పిండిన నీరు కళ్ళలో వేసుకొని తమ బాధలు పోగొట్టుకొనేవారు. మన ప్రజ్ఞలో నుండగా తమ వంటికి శ్రీస్వామివారు సబ్బు రుద్దనిచ్చేవారు కాదు. అందువలన భక్తులు ఆయనకు సీకాయ పొడి, మంగచక్కపొడి, శనగపిండితో వళ్ళు రుద్దేవారు. చివరి రోజులలో సబ్బు రుద్దినా అది ఏదైనదీ శ్రీస్వామివారు పట్టించుకునేవారు కాదు. ఆయన బాహ్యస్థితి తెలియని సమాధిస్థితిలో ఉండేవారు కనుక ఆయన అడ్డు చెప్పేవారు కాదు.

బాహ్య ప్రజ్ఞ కలిగినపుడు కాళ్ళకు, వంటికి శ్రీస్వామివారు అడిగి నువ్వుల నూనె మర్దన చేయించుకునేవారు. తన సేవకులను తప్ప ఇతరులను శ్రీస్వామివారు, తమను తాకేందుకు అంగీకరించేవారు కాదు. శ్రీస్వామివారిని స్పృశించే భాగ్యమునకు తపనపడే భక్తుల మనసు కనిపెట్టి ముల్లు తీయించు కొనే మిషతోను, నూనె మర్ధనా చేయించుకునే మిషతోనూ, తన స్పర్శ భాగ్యం ప్రసాదించేవారు.

చలికాలంలో శ్రీస్వామివారికి మంచుసోకుతుందని భక్తులు పందిరివేస్తే ఆయన పందిరి వదలి ఆరుబయటకు వెళ్ళి అక్కడ ధుని వేసుకుని కూర్చునేవారు. తలుపూరులో దోమలు ఎక్కువగా కుడుతుంటే తరచుగా స్వామి తమ వీపును దువ్వెనతో గీరమని సేవకులను కోరేవారు. వారి బాధచూచి భక్తులొకప్పుడు శ్రీస్వామివారికి దోమతెర కట్టారు. కానీ శ్రీస్వామివారు దాన్ని పీకి పారేసేవారు. శ్రీస్వామివారు కదలలేకుండా వున్న చివరి రోజులలో మాత్రం భక్తుల ప్రయత్నం సఫలమైంది. ఈ రెండు చర్యలూ శ్రీ సాయి చర్యలను ఎంతగానో పోలి వున్నాయి.

రాత్రిపూట సేవకులందరూ స్వామి చుట్టూరా చాలా దగ్గరగా పడుకునేవారు. ఎన్నడూ ఎవ్వరిని గానీ ఆయన 'లేచి పోయి దూరంగా పడుకోండి' అని ఆజ్ఞాపించి ఎరుగరు.

నిరంతరం సమాధి నిష్ఠులైయున్న శ్రీస్వామివారు తన ప్రక్కనున్న భక్తులు, సేవకులు చేసే అల్లరిగానీ, లోకాభిరామాయణము గానీ, పరదూషణగానీ, రాజకీయ విమర్శలనుగానీ చెవినబెట్టరు. ఆపమని ఎన్నడూ వారికి చెప్పేవారు కాదు. 'పోతూవుంటే పోనిచ్చేదే గదయ్యా' అన్నారు గదా ఒకప్పుడు!

చాలా అరుదుగా ఒక రోజు అన్నారు, 'ఈ రోజు ఎవ్వరూ మాట్లాడకూడదు సముద్రస్నానానికి పోవాలి, వక్కెమ్మను కూడా తీసుకుపోవాలి' అని.

కానీ చిత్రమేమంటే శ్రీస్వామివారు సముద్ర స్నానానికే బయలుదేరలేదు. కనుక వారి మాటలెవరికీ అర్థం కాలేదు. వారన్నట్లే ఆ రోజు వక్కెమ్మకు సముద్రస్నానం చేసి వచ్చినట్లు స్వప్న దర్శనమైంది. ఆ

స్వప్నం కాకతాళీయమైనది కాదని, తామే ఆమెకట్టి పవిత్రమైన అనుభూతి ప్రసాదించనున్నామని భక్తులకు తెలుపడానికే శ్రీస్వామివారు అలా అన్నారు. ఐతే ఆ రోజు ప్రత్యేకంగా ఎందుకు మౌనం పాటించాలని భక్తులెవరూ వారిని అడుగలేదు.




**ఓం నారాయణ - ఆదినారాయణ**

# అవధూత లీల

## అధ్యాయము - 3

## అవధూత లీలలు



పసిపిల్లలు, పిచ్చివారు, పిశాచుల వలె మహనీయులు వుంటారని ఆదిశంకరులు శెలవిచ్చారు. పూర్ణ పురుషులైన శ్రీస్వామివారి వంటి మహనీయుల చర్యలకు ఏదో ఒక బలవత్తరమైన కారణం వుంటుంది. ఆ కారణం మనకర్థంగాక వారిని పిచ్చివారని భ్రమిస్తాము. మన దృష్టిలో అర్థరహితమైన ఇలాంటి చర్యల ద్వారా వారు భక్త రక్షణ గావించారని కొద్దికాలం తరువాత ఆయా భక్తులు వివరించునపుడు మనకు తెలుస్తుంది. అలా వివరించబడని అనేక లీలలు మనమిచ్చట చూస్తాము.

ఒకరోజు శ్రీస్వామివారు 'మంటలు, మంటలు, ఆర్పండయ్యా! నీళ్ళు పోయండి' అని అరుస్తూ, దేగపూడి రామాలయం మీద, గోడల మీద ఎన్నో బిందెల నీళ్ళు పోయించారు. 'మంటలు చల్లారాయి స్వామి యిక ఆపండి' అంటే 'లేదయ్యా ఇంకా పోయాల పోయండి' అని చాలా సేపు మందిరం పైనకూడా నీళ్ళు పోయించారు. తన మహిమను అతి గోప్యంగా వుంచే శ్రీస్వామివారు ఏ భక్తులను అగ్నిప్రమాదం నుండి ఎక్కడ కాపాడుతున్నారో మనకు చెపుతారా!

ఒకప్పుడు శ్రీస్వామివారికి కాళ్ళు, చేతులు, వళ్ళు కాలింది. కారణమేమో ఎవరికీ తెలియలేదు. వారికి అప్పుడప్పుడూ మూర్ఛ వలె వచ్చేది. రాత్రిపూట ఆ మూర్ఛ వచ్చి మంటలో పడి కాలిందనుకున్నారు భక్తులు. భక్తులెవరో మంటల్లో చిక్కుకుంటే సాయిబాబావలె వారిని రక్షించడంలో తమ శరీరాన్ని కాల్చుకున్నారనుకున్నారు మరికొందరు. 'స్వామీ, ఎందుకు కాలింది?' అంటే, 'అయ్యా! పై వాళ్లు వచ్చి ద్రావకం పోసి పొయ్యారయ్యా!' అన్నారు. మోకాళ్ళకున్న గాయాలు మానుతుంటే కలబందముల్లుతో ఆ చెక్కు పెరికేస్తే మరలా రక్తం కారేది. మరలా మరలా చెక్కు కడుతూంటే తిరిగి అలాగే చేసేవారు శ్రీస్వామివారు. ఇలా మూడు నెలల వరకూ చేశారు.

ఎక్కువగా కాలిన కుడి భుజానికి డాక్టరు కట్టు కట్టబోతే శ్రీస్వామివారు వప్పుకోలేదు. భక్తులు బలవంతంగా మందు వేసికట్టు కట్టారు. శ్రీస్వామివారు అందరినీ ఏమార్చి ఆ కట్లను పేనా కత్తితో కోసేవారు. కత్తి తీసుకుంటే యిచ్చిందాకా గొడవచేశారు. భక్తులు కాపలాకాసారు. రెండు రాత్రుళ్ళు కట్టు తీయనియ్యలేదు. మూడవ రాత్రి కాపలా వున్న సేవకుడు నిద్ర తూగాడు. శ్రీస్వామివారు కట్టు కోసేసారు. ఆ పుండుపై నున్న రెండంగుళాల పుసికండను కోసి ఒక ముంత మీద పడేశారు. శ్రీస్వామివారి గాయం రక్తం కారుతున్నది. సేవకుడు లేచి లబోదిబో మన్నాడు. ఆ చర్మం బిళ్లను తులశమ్మ, వెంకమ్మ ఒక డబ్బాలో రహస్యంగా దాచారు. చిత్రంగా దాని నుండి ఒక వింతైన పరిమళం ఆశ్రమమంతా వ్యాపించింది. దానికి కారణం తెల్పమని తులశమ్మను, వెంకమ్మనూ భక్తులు వేధించారు. చివరకు అమాయకురాలు వెంకమ్మ ఒక భక్తునికి ఆ చర్మం బిళ్ళ చూపింది. అది మొదలు ఆ వింత పరిమళం అంతరించింది.

శ్రీస్వామివారు నడిచే రోజులలో ఒక్కొక్కప్పుడు రాత్రింబవళ్ళు నిద్రాహారాలు మాని నాదం మీటుతుండేవారు. రాత్రి నిద్ర తూగితే నాగజెముడు ముల్లుతో పై పళ్ళ చిగుళ్ళలలోకి గ్రుచ్చుకొని రక్తం కారుతుంటే ముంతలోని నీళ్లు పుక్కిలించి మరలా నాదం మీటడం మొదలెట్టేవారు.

ఒకప్పుడు శ్రీస్వామివారిని సేవకులు రెండెడ్ల బండి మీద తీసుకుపోతున్నారు. శ్రీస్వామివారు బండిలో పడుకున్నారు. కొంతసేపటికి ఆయన కన్నులుమూసుకొని ధ్యానస్థులైనారు. బండి కుదుపుల వలన శరీరం జరిగి వారి మోకాలు బండి చక్రానికి రాసుకొని బాగా అరిగిపోయి రక్తం కారుతున్నది. కొంచెం సేపటికి భక్తులది గుర్తించి బండి నిలిపి, వారిని లేపే ధైర్యం లేక తడబడుతూ రక్తం తుడవయత్నిస్తే ఆయన లేచి వారిని తుడవనివ్వలేదు. సమాధి స్థితిలో నున్న శ్రీ రామకృష్ణ పరమహంస గారిని పరీక్షించడానికి శ్రీ వివేకానందుడు వారి తొడపై నిప్పు కణిక పెట్టినా ఆయన కదలలేదని చదివాము. శ్రీస్వామివారు అట్టిస్థితిలో వుండడం మరలా భక్తులీనాడు స్వయంగా చూచారు.

అవి శ్రీస్వామివారు నడవలేని రోజులు. ఒక రోజు ఆయన అక్కిం వెంకట్రామిరెడ్డి గారింట్లో వున్నారు. సుమారు ఉదయం పది గంటలకు

పనులు చేసుకుంటున్న సేవకులు శ్రీస్వామివారు తమ స్థానంలో లేరని గుర్తించి వెతికారు. ఆయన ఒక బండి జల్లలో నున్నట్లు గుర్తించి భక్తులు పెద్దగా ఏడవసాగారు. శ్రీస్వామివారు వత్తిగిలి పడుకున్నారు. 12 అంగుళముల పొడవున్న ఒక ప్రేగు వారి ఆసనము నుండి బయటకు వచ్చియున్నది. దానిని ఒక కాకి పొడుస్తుంటే రక్తము కారుతున్నది. భక్తులు కాకిని అదిలించబోతే, శ్రీస్వామివారు 'అబ్బో! అబ్బో! పాపము తీసుకుపోతుంటే తోలేస్తే ఎట్లా?' అన్నారు. ఆ దృశ్యము చూడలేక వెంకట్రామిరెడ్డి శ్రీస్వామివారి కంటపడకుండా గాలిలో కర్రను త్రిప్పారు. కాకి వెళ్ళిపోయింది. కొంతసేపటికి ప్రేగు లోనికి పోయింది. భక్తులు ఆయనను ఎత్తుకురాబోతే ఆయన ఒప్పుకోలేదు. వారే పరిగాడుతూ వచ్చి తన స్థానములో కూర్చున్నారు.

ఎంతో మంది తన సన్నిధిలో వుండగా ఒక్కొక్క సమయములో ఒక్కొక్కరిని లేచి ఇంటికి వెళ్ళమనిగాని, మరొకచోట కూర్చోమనిగానీ, రోడ్డు దాకా నడచి వెళ్ళమనిగాని శ్రీస్వామివారు ఆదేశించేవారు. ఫిబ్రవరి, 1980లో శ్రీస్వామివారు తమ భక్తులయిన నారాయణదాసు ఆశ్రమంలో ఉండగా తమ సేవకులను తూర్పు వైపు గుట్టవరకు నలుగురిని పోయిరమ్మని ఆజ్ఞాపించారు. ఇద్దరు వెళ్ళివస్తే ఒప్పుకోలేదు. నలుగురు కలసి తూర్పు త్రోవన వెళ్ళి అదేత్రోవన వస్తుంటే 'ఉత్తరపు త్రోవన రమ్మను' అని మరొకరితో కబురుచేసారు. దీనిభావము ఎవరికీ తెలియలేదు.

ఒక్కొక్కప్పుడు శ్రీస్వామివారు తమలోతాము బ్రహ్మాండముగా నవ్వుకునేవారు. ఆ నవ్వును టేప్ చేసుకొనే భాగ్యముంటే ఎలా వుండునో!

పెంచలకోనలో వుండగా శ్రీస్వామివారి దగ్గరకు ఎవరో వ్యాధిగ్రస్తులు వస్తే గురవయ్యను గుడ్డతో వారికి మంత్రించమన్నారు. మంత్రించగానే గురవయ్యను శ్రీస్వామివారు మంత్రించారు.

శ్రీస్వామివారు శరీరంతో ఉండగానే పెన్నబద్వేలు దగ్గరవున్న అంకాళమ్మ బోటు అనే ప్రాంతము నుండి ఒక ఆమె తన మేకపిల్ల తప్పించుకుంటే వెతుక్కుంటూ శ్రీస్వామివారి విడిది ప్రాంతానికి వచ్చింది. ఆమెకు శ్రీస్వామివారు నట్టనడిగుండములో కూర్చొని కనిపించారు.

'ఈనాటితో శ్రీస్వామివారి పని అయిపోయింది. ఇక శ్రీస్వామివారిని చూడలేమ'ని ఆమె వెళ్ళిపోయింది. తెల్లవారి ఏటికి పోయినపుడు శ్రీస్వామివారు స్నానం చేసి పంచ ఆరబెట్టుకుంటూ కనిపించారట! ఈమె ఈ విషయం శ్రీస్వామివారు శరీరంతో ఉండగానే గొలగమూడి ఆశ్రమంలో అందరికీ చెప్పింది.

శ్రీస్వామివారు ఒకనాడు నాగజెముడు ముల్లు త్రొక్కివచ్చి తన బృందంలోని వారిని తీయమన్నారు. వారు శ్రీస్వామివారి పాదాన్ని కుట్టి గాయం చేసారేగాని ముల్లు తీయలేకపోయారు. కోడూరు వెంకమ్మకు శ్రీస్వామివారు తమ కాలిచ్చి ముల్లు తీయమన్నారు. ఆమె ఎంత చిగుళ్ళలో కుడుతున్ననూ శ్రీస్వామివారు అబ్బా అనైనా అనలేదు. కాలు కదల్చలేదు. చివరకు ఆమె మల్లె ముల్లుతో పెరికితే మూడు అంగుళాల ముల్లు వచ్చింది. అంత ముల్లుతో ఆయన ఎలా నడిచారో! ముల్లు తీసినందుకుగాను వెంకమ్మకు ఒక మల్లెముల్లు, సూది, బ్లేడు బహూకరించారు.

నెల్లూరులో ట్రాఫిక్ ఎక్కువ గనుక శ్రీస్వామివారిని ఎప్పుడూ భక్తుల ఇంటినుండిగానీ, దత్తాత్రేయ మందిరము నుండిగానీ బస్టాండుకు రిక్షాలో తీసుకుపోవడం అలవాటు. ఒకరోజు శ్రీస్వామివారి సేవకులు శ్రీస్వామివారిని ఒంటరిగా వెంకట్రావు ఇంటిలో వదలిపెట్టి సినిమాకు వెళ్ళివచ్చారు. తెల్లవారి బస్టాండుకు పోవడానికి రిక్షా తెస్తే శ్రీస్వామివారు ఎక్కకుండా అంత ట్రాఫిక్‌లోను వీరిచేత డోలిలో కూర్చొని మోయించుకున్నారు. రాత్రి చెప్పకుండా సినిమాకు పోయినందుకిది శిక్ష అని గుర్తించారు ఆ సేవకులు. శ్రీస్వామివారి సేవలో వారు చెప్పినట్లు గాక మరొక విధంగా, దోషంగా చేస్తే, శ్రీస్వామివారు మాత్రం మౌనంగా ఉండి ప్రధాన సేవకునికి తగిన శిక్ష అనుభవానికి వచ్చేటట్లు చేయడమేగాక, ఇది ఫలానా దానికి శిక్ష అని ఆత్మలో ఎరుక పరిచేవారు.

రాజపద్మాపురం వాస్తవ్యులు బిరిజేపల్లి మస్తాన్ నాయుడుగారు తాను చూచిన ఒక అసాధారణ లీలను వివరించారు.


శ్రీస్వామివారు ఒకరింటికి వెళ్ళి 'అమ్మా! తినేందుకేమన్నా పెట్టమ్మా' అని అడిగారు. 'ఆమె ఇంటిలో శ్రీస్వామివారికి సమర్పించేందుకేమీలేదు. శ్రీస్వామివారికి లేదని చెప్పడం ఎలాగా' అని ఆలోచిస్తోంది. శ్రీస్వామివారికి

ఆమె బాధ తెలియకుంటే గదా! వెంటనే 'అమ్మా! కొంచెం కారప్పొడి పెట్టమ్మా' అన్నారు. శ్రీస్వామివారు దాన్ని వంటకు వాడుకుంటారని తలచి ఆ ఇల్లాలు ఒక గ్లాసునిండా మిరప్పొడి తెచ్చి ఒక ప్లేటులో పోసి శ్రీస్వామివారికి అందించింది. ఆ ప్లేటులోని మొత్తం మిరప్పొడిని రెండు నిముషాలలో చప్పరించి, మొత్తము మ్రింగేసి చేతులు దులుపుకొని 'ఇక వ్రాసుకో అయ్యా!' అని ఆమెకొక ఆశీర్వాద చీటి వ్రాయించి ప్రసాదించి వెళ్ళారు.



# అవధూత లీల

## అధ్యాయము - 4
## సర్వజ్ఞమూర్తి



**సాధన ద్వారా సద్గురు కృపను పొంది, వారి
అనుగ్రహం వలన ఆత్మజ్ఞానం పొందిన మహనీయులే
సిద్ధ పురుషులు.** శాస్త్రాలలో భగవంతునకు చెప్పబడ్డ 2
సర్వజ్ఞత్వం, సర్వసమర్థత, సర్వ వ్యాపకత్వం అట్టివారిలో
సంపూర్ణంగా ప్రకటమవడం భక్తులకు అనుభవైకవేద్యము.
ఇట్టి మహనీయులు ప్రపంచంలో ఎక్కడ ఏమి జరుగుతున్నదో అనుక్షణము
తెలుసుకుంటూ అద్భుతరీతిన తమ భక్తులను అనేక సంకటముల నుండి
రక్షిస్తుంటారు. ఈ అధ్యాయంలో శ్రీస్వామివారి యొక్క సర్వజ్ఞత్వం,
సర్వసమర్థత్వం చూస్తాము.

గొలగమూడి వాస్తవ్యులు యస్.కె. మస్తాన్ అనే ముస్లిం భక్తుని తండ్రి ఒకరోజు షికారుకి బయటికి వెళ్ళాడు. అతడు వెళ్ళిన కొద్దిసేపట్లో బ్రహ్మాండమైన వర్షము కురిసి వెల్లువలు అయ్యాయి. ఇంటి నుండి బయటికి వెళ్ళిన వృద్ధుడు మూడు రోజులవరకు తిరిగి రాలేదు. ఆయన కోసం అన్నిచోట్ల వెతికారు. ఆయన ఆచూకీ చెప్పమని శ్రీస్వామివారిని అర్థించారు. 'ఆయన వేషం మార్చుకున్నారు. రేపు పంజరం తెస్తారు.' అని స్వామివారు చెప్పారు. ఆ మాటలు వారికి అర్థం కాలేదు. తెల్లవారి చెర్లో ఎవరో ఒక మనిషి శవము ఉందని తెలిసి వెళ్ళి చూచారు. ఆ శవము యొక్క మాంసము అంతా చేపలు తినగా కేవలము ఎముకలు మాత్రము ఉన్నాయి. ఆ ఎముకల పంజరమునకున్న గుడ్డలను బట్టి ఆయనే వారి తండ్రి అని గుర్తించారు. ఆ ఎముకల పంజరము తెచ్చి వారి సాంప్రదాయానుసారంగా సమాధి చేశారు.

'ఆయన వేషం మారింది.' అని శ్రీస్వామివారు చెప్పడంలో ఆయన చనిపోయి మరొక దేహము దాల్చాడని, పంజరము తెస్తారంటే ఎముకల గూడు మాత్రమే దొరుకుతుందని శ్రీస్వామివారు చెప్పిన మాటలకర్థం తెలిసింది.

మునికూటి రామయ్య (మహిమలూరు) గారింటిలో శ్రీస్వామివారు ఉండగా ఆ గ్రామస్థులు వారి ఇండ్లకు రమ్మని ఆహ్వానించారు. 'దారిలో ముండ్లమండలేసి బిగించారు. వచ్చేదానికి వీలులేదు' అన్నారు శ్రీస్వామివారు. మనలోని దుర్గుణాలే భక్తిమార్గంలో ముండ్లమండలని శ్రీస్వామివారి భావం కాబోలు!

మడపల్లిలో శ్రీస్వామివారు ఉండగా నాగులవెల్లటూరు రైతులు కొందరు శ్రీస్వామివారిని దర్శించారు. 'స్వామీ! జొన్న పైరు పెట్టుకొన్నాం. ఈ సంవత్సరము జొన్న బాగా పండుతుందా! అని అడిగారు'. 'కర్రకి ఇద్దరు కదయ్యా' అన్నారు శ్రీస్వామివారు. కాని పండుతుంది లేదా పండదు అని మాత్రము చెప్పలేదు. శ్రీస్వామివారు చెప్పినట్లు పదిరోజులలో కర్రకు రెండు పురుగులు పడి అందరి పైరు పాడైపోయింది.

శ్రీస్వామివారి చెల్లెలు మంగమ్మగారి అత్తగారు చాలా బీదవారు. పూట గడవడం లేదు. ఒకరోజు శ్రీస్వామివారు ఉన్మత్తావస్థలో ఉన్నప్పుడు మంగమ్మను తనతో రమ్మని వారి తల్లికి ముఖం వాచి అనారోగ్యంగా ఉండి చూడాలంటుందని శ్రీస్వామివారు పిలిచారు. మంగమ్మగారు మనసులో ఈ పిచ్చివానితో గూడ పోతే ఏ చెట్టుకో పుట్టకో వదిలేసి పోతాడేమోననుకున్నది. వెంటనే సర్వజ్ఞమూర్తి అన్నారు, 'ఏందమ్మా నిన్ను చెట్టుకో పుట్టకో వదిలేసి పోతానా! బలేదానివే?' అని.

శ్రీస్వామివారు తన బృందంతో చిట్టేపాళెంలో ఉన్నారు. ఆ సమయంలో గొలగమూడిలో ఉన్న స్వామిభక్తులు కొట్టుకూటి బుజ్జయ్యకు అనారోగ్యంగా ఉండి పథ్యం ఉండవలసి వచ్చింది. కనుక శ్రీ స్వామివారి చెంతకుపోతే పథ్యంకుదరదని పోలేదు. 'నాకు సత్కాలక్షేపము చేసేందుకు ఎవరూలేరు. శ్రీస్వామి సేవకుడైన రామనాయుడు నాచెంత వుంటే మంచి మాటలు చెబుతూ ఉండేవాడు. ఈ గ్రామంలో నాకు ఎవ్వరూ అలాంటి తోడు లేరు' అని మనసులో శ్రీస్వామివారిని స్మరించి బాధపడ్డారు. అదే సమయంలో శ్రీస్వామివారు రామనాయుణ్ణి గొలగమూడికి వెళ్ళమని ఆజ్ఞాపించారు. నిత్యము తనను వారివెంటుంచుకొనే శ్రీస్వామివారు ఇలా ఎందుకు పొమ్మన్నారో తనకు అప్పుడు బోధపడలేదు. అతడు వెంటనే వెళ్ళి బుజ్జయ్యను కలుసుకొన్నాక శ్రీస్వామివారు పంపిన కారణము తెలిసింది.

సోమశిల దగ్గర వున్న కొండ మీద శ్రీస్వామివారు ఒక చిన్న గుడిసె వేసుకొని చిన్న నూనె దీపాన్ని ప్రక్కన వుంచుకొని రాత్రంతా తంబుర మీటుతూ ఉండేవారు. వారి దగ్గర సేవచేసుకుంటున్న చలమానాయుడు గారిని ఒకనాడు సాయంకాలము, 'అయ్యా ఇద్దరు మనుషులకు ఎక్కువగా అన్నము తీసుకురా' అన్నారు. శ్రీస్వామివారి భక్తులకు వారి ఆజ్ఞ ఎరిగించగా వారు వడలు, పాయసముతో సహా అన్నము తయారు చేసి పంపారు. ఆనాటి రాత్రి 7 గంటలకు మార్గము తెలియక తంటాలుపడి తలుపూరు పెమ్మసాని మస్తానయ్య, వారి స్నేహితుడు స్వామి దర్శనార్థం వచ్చారు. వారక్కడకు చేరకముందే వారికోసం శ్రీస్వామివారు భోజనము చేయించడమే విచిత్రం.

ఒకప్పుడు తూపిలి పిచ్చమ్మ శ్రీస్వామివారి ఆశ్రమంలో తన స్నేహితులతో కలసి భజన కార్యక్రమం ఏర్పాటు చేయాలని తలచింది. అన్ని ఏర్పాట్లు చేసుకొన్నది. శ్రీస్వామివారు ఆశ్రమంలో లేరు. కనుక వారికి చెప్పలేదు. స్వామివారు దూరంలో వేరొకచోట వుండినారు. 'అయ్యా ఆశ్రమంలో భజన బలే జరుగుతుండ్లాయ్యా? అక్కడికి పోవద్దా? కదలండి' అని ఆ భజన రోజుకు శ్రీస్వామివారు తన బృందంతో కదలి వచ్చి భజన బృందాన్ని అనుగ్రహించారు.

మానవుల ప్రారబ్ధ కర్మలు రెండు రకాలుగా వుంటాయి. కొన్ని తపోశక్తిచే క్షాళన చేసుకోగలిగినవి, మరికొన్ని తప్పనిసరిగా ఆయా వ్యక్తులు అనుభవించి తీరవలసినవి. ఎవరి కర్మలు ఏ రకమైన వన్న విషయము ఒక్క సద్గురువులకే తెలుస్తుంది. మనము అజ్ఞానంతో మన బాధలు సంపూర్ణంగా శ్రీస్వామివారు నివారించలేదని వాపోతాము. అలా తప్పనిసరిగా అనుభవించవలసిన కర్మలుగూడ నిరంతర భగవన్నామస్మరణ వలన తగ్గించబడుతాయని పెద్దలు చెబుతారు. అందుకే సద్గురువులు తప్పనిసరిగా అనుభవించవలసిన కర్మలను మరొక జన్మకు వాయిదా వేయకుండా ఈ జన్మలోనే అనుభవిస్తారు. ఈ విషయము శ్రీస్వామివారే స్పష్టపరిచారు.

దాచూరి వాస్తవ్యులయిన కస్తూరి అంకయ్యగారు యిలా చెప్పారు. శ్రీస్వామివారికి మోకాళ్ళు పట్టుకొని వంగడము లేదు. ఎందరు బ్రతిమాలినా వైద్యం చేయించుకోరు. 'ఏ వైద్యం చేస్తే ఆ కాళ్ళు బాగవుతాయో ఆ వైద్యం స్వామివారే నేనడగకనే నాకు చెప్పాలి. ఆ వైద్యం నేను చేసి శ్రీస్వామివారికి

కాళ్ళు బాగుచేసి రావాలి' అనుకున్నాడు. పై కార్యం నెరవేరిందాకా శ్రీస్వామివారి సన్నిధిలో ఉండాలని తలచి అంకయ్యగారు గొలగమూడి వచ్చారు. ఆ రోజు అందరూ భజన చేస్తూవుంటే ఆయన శ్రీస్వామివారి ఎదురుగా కూర్చున్నారు. అంకయ్య మౌనంగా పై కోరిక స్మరిస్తూ వున్నారు.

సర్వజ్ఞమూర్తియైన శ్రీస్వామి ఇలా అన్నారు 'ఇతనికెందుకయ్యా! లెక్క తగ్గిపోతుంది ఆమాయన్నే కూర్చుంటే' భజనకు వెళ్ళి వచ్చి మరలా రాత్రి 2గం॥30ని॥ల సమయంలో స్వామి ఎదుట కూర్చున్నాడు. అదే కోరిక అతని మనసులో మెదులుతూ ఉంది. 'అట్లా అడగకూడదయ్యా' అన్నారు శ్రీస్వామివారు. అంకయ్య అట్లా వీలుపడదు చెప్పవలసినదే అనే భావము చూపిస్తూ సైగ చేసినట్లు తల ఊపారు. వెంటనే స్వామి కంఠం ఉచ్ఛస్థాయిలో గట్టిగా పలికింది. 'అట్లైతే మరలా రావాలయ్యా! తప్పు, అట్లా అడగకూడదు'.

ఇందుకూరుపేటలో ఆత్మకూరు వెంకయ్యగారింటికి ఒకప్పుడు శ్రీస్వామివారు వెళ్ళారు. శ్రీస్వామివారు వెంకయ్యగారి గంభీరమైన ఎద్దులను చూచి 'అయ్యా! దీనికి కాలు గండము వుంది'. అన్నారు. కాని నివారణోపాయ మేమి చెప్పలేదు. కొన్ని రోజులకు చదునైన రోడ్డున బండిలాగుతూనే ఎద్దుకాలు 'కిటక్' అని శబ్దమైంది. ఎద్దు కుంటనారంభించింది. ఎన్ని వైద్యములు చేసినా నయముకాలేదు. కొంత కాలానికి దాన్నమ్మేశారు.

సోమశిల ప్రాజెక్టుకు యిక పది సంవత్సరాలకు శంకుస్థాపన జరుగుతుందనగా దాని నిర్మాణము గురించి శ్రీస్వామివారు ఇలా చెప్పారు. ఒకనాడు శ్రీస్వామివారు ఒంటరిగా ఎక్కడికో వెళ్ళివస్తే 'ఎక్కడికి వెళ్ళారు స్వామీ' అంటే 'అక్కడొక దేవస్థానము కట్టబోతారు, దానిని గుర్తుబెట్టి వచ్చా' నన్నారు ఒక స్థలం చూపి, అదేనేడు సోమశిల ప్రాజెక్టు దగ్గర నిర్మించబడ్డ పెంచలస్వామి ఆలయం.

పాలకొండ సుబ్బారెడ్డితో (గోపారం) శ్రీస్వామివారు ఒకనాడు 'అయ్యా! సముద్రం పొల్లుకొస్తుంది. నీవు యిచ్చట వుండకూడదు. వెంటనే ఇంటికి వెళ్ళిపొమ్మ'న్నారు. వారు అలాగే శ్రీస్వామివారి ఆజ్ఞమేరకు ఇంటికి వెళ్లారు. ఇల్లు వదిలి చాలా కాలంగా శ్రీస్వామివారి సేవలో వున్నారని ఇంట్లో ఆగ్రహించి సుబ్బారెడ్డిగార్ని తీసికెళ్ళాలని వారి అన్నలు వస్తున్నారని సాయంకాలం

తెలిసింది. కానీ ఇద్దరూ ఒకరినొకరు కలుసుకోకుండానే వెళ్ళారు. సంసార సాగరమే ఎక్కువ ప్రమాదకరమైన సముద్రమని, మామూలుగా సముద్రమనబడేది నిజానికి పాపహరమైనదేనని వారి భావం.

ఒకనాడు కొమరగిరి రమణయ్య, సుబ్బారెడ్డి స్వామిగుండానికి కట్టెలు కొట్టేందుకు పోతున్నారు. రాత్రివేళ లాంతరు తీసుకుపొమ్మని 3,4 సార్లు మరీ మరీ చెప్పారు శ్రీస్వామివారు. శ్రీస్వామివారు చెప్పారు కనుక వారు లాంతరు తీసుకొని వెళ్ళారు. ఒక చెట్టుక్రింద నీడన పెద్ద నాగుపాము చుట్టవేసుకొని పడుకొని వుంది. లాంతరు వెలుతురు చూచి చెట్టులోనికి పోయింది. శ్రీస్వామివారు మనపై కరుణించి కాపాడాలని చూచినా మనకు వారి మాటపై విశ్వాసము లేనప్పుడు వారి ఆజ్ఞమేరకు తు.చ. తప్పక నడుచుకోలేనప్పుడు మన ఆపదలు మనకు తప్పవు. **సద్గురువులెన్నడూ పరాచికాలాడరని, ఏ బలమైన కారణం లేకుండా వారు మనల్నేమీ** 3
**ఆదేశించరని గుర్తుంచుకొని వారు చెప్పినట్లు చేసిన భక్తులు ఎంతగానో సుఖపడతారు. సద్గురు సేవలో యిష్టా యిష్టాలు త్యజించడమే నిజమైన త్యాగము, సాధన!**

చలమానాయుడు అనే ఒక భక్తుణ్ణి శ్రీస్వామివారు ఒకసారి 'అయ్యా! ఎక్కడికీ పోకుండా నా దగ్గర వుండు' అని ఆదేశించారు. తన అలవాటు ప్రకారం తన స్నేహితుని ఇంటికి వెళ్ళాడు. ఆయన పూర్తి నిషాలో వుండి ఇతని చెంప మీద ఒక్క చరుపు చరవడంతో చలమానాయుడు క్రింద పడ్డాడు. రెండు పండ్లు ఊడిపోయాయి. మెడ కూడ వాచింది. శ్రీస్వామివారి ఆజ్ఞలోని లోతు అతనికి అప్పుడర్థమైంది.

తిరుపతి కాపురస్తుడు బండి వెంకట మునిరెడ్డిగారు నియమం తప్పకుండా ప్రతి పౌర్ణమికి నారాయణ వనము వెళ్ళి సొరకాయల స్వామివారిని దర్శించేవారు. 'మహాత్మా, మిమ్ములను భౌతిక శరీరంతో వుండగా దర్శించలేక పోయాను. మీలాంటి సజీవులైన మహాత్ముల దర్శనము ప్రసాదించవలసినది' అని తరుచుగా ప్రార్థించేవారు.

వీరొకప్పుడు పనిమీద ఇనుకుర్తి వచ్చి శ్రీస్వామివారిని గూర్చి విని ఆ మరునాడే గొలగమూడికి వచ్చి శ్రీస్వామివారిని దర్శించారు.

అప్పుడు ఆ ప్రథమ దర్శనంతోనే శ్రీస్వామివారు ఇతనికి ఒకచీటి వ్రాసి యిచ్చి అందులో '21వ దినమున దొమ్మి (రైడింగు) జరుగుతుంది. అదేమి చెయ్యదులే' అని వ్రాయించారు. నిజంగానే 21వ రోజుకు పొలములో తగాదా వచ్చి కూనీలు జరిగేటంత పరిస్థితి ఏర్పడింది. కాని శ్రీస్వామి కృపవలన రెడ్డిగారికి కొండంత ఓర్పు కలిగి తనను ఎంత దూషించినను మారు మాట్లాడలేదు. సరిగ్గా 21వ రోజు అయ్యి వుండడంతో స్వామిపై భక్తి శ్రద్ధలేర్పడి తిరుపతి నుండి ఎంతో శ్రద్ధతో వచ్చి శ్రీస్వామి వారి సమాధిని దర్శిస్తూ ఉండేవారు.

'స్వామీ! వెంకట మునిరెడ్డి మనందరికి నూతన వస్త్రములు తెచ్చారు'. అని సేవకులు చెబితే 'అయ్యా! ఆయనకు ఎన్నో కష్టాలు తీరిపోతుండ్లా' అన్నారు శ్రీస్వామివారు.

సంగం వాస్తవ్యులు పల్లంరెడ్డి కృష్ణారెడ్డి ఒకసారి చేలో వరిసాగు చేసారు. చాలా బాగా పెరిగింది. కానీ వెన్ను తీసే సమయానికి నీళ్ళు చాలక అంతా తాలుపోయింది. 30 పుట్లు అవుతాయని అంచనా వేసారు. కాని తాలుపోయేటప్పటికి రెండు పుట్లు కావడమే కష్టమని అంచనావేసారు. కనీసం 10 పుట్లు పండకుంటే ఖర్చులుకూడా రావని, పదిపుట్లు పండితే శ్రీస్వామివారికి రూ|| 100/- సమర్పించుకుంటానని మ్రొక్కుకున్నాడు. సగం చేను పనగట్టి కుప్పవేసి కుప్పమీద మంచమేసి పడుకున్నాడు. బ్రహ్మ ప్రళయంగా గాలివాన వచ్చేటట్లయి గాలికి రెడ్డిగారు మంచంతో సహా క్రింద పడ్డాడు. స్వామివారి కృపవలన గాలివాన రాలేదు. తను మ్రొక్కుకున్నట్లు పదిపుట్లు పండింది. రూ|| 100/-లు తీసుకొని స్వామి దర్శనం కోసం వచ్చాడు. కాని దారి ఖర్చులవల్ల రూ|| 30/- లు ఖర్చయి రూ|| 70/- మాత్రమే స్వామివారికి సమర్పించదలచి ఎవరికి చెప్పకుండా ఆ పైకం శ్రీస్వామివారి చాపక్రింద పెట్టారు. 'అనుకున్నదంతా ఇవ్వలేదు. ఇంకా రూ|| 30/- లు ఇవ్వాలి. ఇవికూడా వద్దు, తీయమను' అన్నారు. శ్రీస్వామివారి ప్రక్కనున్న ఒకరు 'ఖర్చులకు కూడా లేవట తరువాత ఇస్తాడు స్వామీ' అంటే 'ఆయన ఇవ్వడు, ఆ బాకీ నువ్వు ఒప్పుకో' అన్నారు శ్రీస్వామివారు. ఆయన ఒప్పుకొన్న తరువాత శ్రీస్వామివారు రూ|| 70/-లు అంగీకరించారు. కానీ శ్రీస్వామివారు

చెప్పినట్లు క్రిష్ణారెడ్డిగాని, ఆయన స్నేహితుడు కానీ శ్రీస్వామివారికి ఆ రూ॥ 30/- లు యివ్వలేదు.

ప్రస్తుతం కలిచేడులో టీచరుగా వున్న అత్యుత నీలకంఠరాజుగారు వీరి భార్య నాగభాసురాదేవిగారు ఇలా చెప్పారు.

నీలకంఠరాజుగారు చీరాలలోను, ఆయన భార్య కలిచేడులోను ఉద్యోగం చేసేవారు. రాజుగారికి కలిచేడులో ఉద్యోగం దొరికితే ఇద్దరు ఒకేచోట ఉండవచ్చునని శ్రీస్వామివారినడిగారు. మూడు నెలలలోపు కలిచేడులోనే ఉద్యోగం వస్తుందని చెప్పారు. కలిచేడులో అదే ఉద్యోగంలో వున్న పి.ఇ.టి. సాబ్జాన్‌గారికి అచ్చటి నుండి బదలీయై వేరొక ఊరికి పోవాలన్న ఆలోచన లేదు. కనుక రాజుగారికి కలిచేడులో ఉద్యోగం రాదనుకున్నారు. కానీ కొన్ని కారణాలవల్ల సాబ్జాన్ గారు రాజీనామా చేసి పోవడం రాజుగారికి ఆ స్థానంలో స్వామివారు చెప్పినట్లు ఉద్యోగం రావడం జరిగింది. వీరిబిడ్డ పద్మజకు చాలా తరచుగా ఫిట్సు వచ్చేవి. శ్రీస్వామివారినడిగితే 9 సం॥ల వయస్సులో పోతుందన్నారు. అక్షరాల అలాగే జరిగింది.

పొంగూరు వాస్తవ్యులు పి.దశరథరామయ్యగారు స్కూల్లో చదువుకొనే రోజుల నుండి స్వామివారిని దర్శిస్తున్నారు. ఆ రోజుల్లో శ్రీస్వామివారు వీరిని 'సబ్ ఇన్‌స్పెక్టర్ అవుతావులే' అని ఆశీర్వదించారు. అదేవిధంగా కొంతకాలానికి వీరు సైన్యంలో చేరి కాశ్మీరులో ఖాకీ గుడ్డలు ధరించి ప్రభుత్వ ఉద్యోగం చేసారు.

ఒకసారి నెల్లూరు తహసిల్దార్ గొలగమూడి వచ్చి 'స్వామీ! మీరు మహాత్ములని అందరూ అంటారు. నాకు ఏదైన మీ మహాత్మ్యం చూపించండి' అని పదే పదే ప్రార్థించాడు. చాలా సేపు మౌనం వహించి చివరకు, 'ఈయనకు మధ్యాహ్నం అన్నం లేదు' అని వ్రాసి యివ్వమన్నారు. అందరూ తహసిల్దారుకు అన్నం లేకపోవడమేమిటని అనుకున్నారు. ఆయన ఇంటికి వెళ్ళేసరికి వారి భార్యకు కడుపునొప్పి అని, ఆసుపత్రికి వెళ్ళిందనీ, తలుపుతాళం వేసి వుందని తెలిసింది. ఆమె ఏ ఆసుపత్రికి వెళ్ళినదీ తెలియక సాయంకాలం మూడు గంటల వరకూ ఆయన వెతుకుతున్నారు. అప్పుడు అన్నం దొరకక టిఫిన్ చేసి, టీ త్రాగవలసి వచ్చింది! ఆ మరునాడు ఆ తహసిల్దారు వచ్చి శ్రీస్వామివారి

మహాత్మ్యం తనకు బాగా అనుభవమైందని సాష్టాంగ పడ్డారు. మహాత్ములను పరీక్షించడం ఎన్నో యిబ్బందులకు కారణమవుతుంది.

ఒకనాడొక దంపతుల జంట వచ్చి, టెంకాయ కొట్టి శ్రీస్వామివారి గుండమునకు సమర్పించి వెళ్ళారు. తరువాత శ్రీస్వామివారు 'అయ్యా ఆ టెంకాయ చిప్పలు గుండము నుండి తీసి వేయండి. వాటిని కుక్కలుకూడా తినవు' అన్నారు. అలాగే సేవకులు తీసివేశారు. శ్రీస్వామివారు చెప్పినట్లే ఆ కొబ్బరిచిప్పలను కుక్కలు కూడా ముట్టలేదు.

**శ్రీస్వామివారి యందు పూర్ణ విశ్వాసము గల్గి వారిని నిత్యము భక్తితో స్మరించేవారు, తమ కష్టాలను గూర్చి వారికి విన్నవించ నక్కరలేదు. ఆ సర్వజ్ఞమూర్తికి తెలియనిదేమున్నది. అవసరమైనప్పుడు తమ బిడ్డలకేది**
4 **చేయాలో వారికి తెలుసు. మన అభ్యర్థన లేకుండానే వారు మన బాధలకు నివారణోపాయం సూచించి, ఆ బాధలు తొలగించిన సన్నివేశాలు కోకొల్లలు.**

ఉదా:- ఒకప్పుడు శ్రీస్వామివారు శ్రీరామయ్యకు జాబు వ్రాయించారు. అందులో 'ఆవుల లక్ష్మీనరుసు ఇంటికి ఎదురుగా వున్న శ్రీరామయ్యగారి ఇంటి ఆవరణలో వుండే పీనుగుల పాతర ఎత్తి వేసుకోవాలి' అని వ్రాయించారు. వారచ్చట త్రవ్వి చూస్తే నిజంగానే ఎముకలు, బొగ్గులు బోలెడున్నవి. అవి త్రవ్వి తీసివేశాక వారింట్లో అప్పటి వరకు తాండవించిన అనారోగ్యము, మనస్పర్ధలు మొదలగు బాధలు పోయి శాంతి లభించింది.

**భక్త సంరక్షణే తన పరమ కర్తవ్యంగా తలచిన శ్రీస్వామివారు నిర్నిద్రులై అహర్నిశలు ఏమరుపాటులేక భక్తపాలన చేయుచున్నారు. మనకు రానున్న కష్టాలను తప్పించుకొనే మార్గం సూచించడమేగాక, ఆ**
5 **సూచనలు మనం పాటించేటట్లు మరలా మరలా మనను కన్నతల్లి కంటే ఎక్కువ ప్రేమతో హెచ్చరించేవారు. వారా సూచనలు పాటించడంలో అడ్డంకులు వస్తే తిరిగి శ్రీస్వామివారే వాటిని తీర్చవలసి వచ్చేది.**

ఉదా:- ఇనుకుర్తి వాస్తవ్యులు కారి రామస్వామిగారికి ముక్కులోంచి, నోటనుంచి రక్తము పడేది. డాక్టర్లవల్ల నయము కాలేదు. స్వామి దగ్గరకు వచ్చాడు. 'రేపు లేదు యెల్లుండికి పోతుంది. 44 రోజులలో గండం వుంది

పోతుంది. 72 సంవత్సరాల రెండు నెలల ఆయుస్సు. తిరుపతి, కంచి, తిరువళ్ళూరు పోయి ప్రతి చోట స్నానం చేసి, టెంకాయ కొట్టి, నిద్రచేసి రావాలి' అని శ్రీస్వామివారు చీటి వ్రాయించి యిచ్చారు. శ్రీస్వామివారు చెప్పినట్లే రెండవరోజుకు నోటినుంచి రక్తం పడడం నిలిచిపోయింది. అప్పుడప్పుడూ శ్రీస్వామివారి దర్శనం చేసుకొనేవారు. కానీ తిరుపతి, తిరవళ్ళూరు, కంచికి యాత్ర పోవటం మరచిపోయాడు. శ్రీస్వామివారు తలుపూరులో వుండగా వారిని దర్శిస్తే వెంటనే 'ఎవరి వద్దన్నా అప్పుతీసుకోనైనా (డబ్బులు లేకుంటే) యాత్రకు పొమ్మ'న్నారు. అలాగే అప్పు తీసుకుని ఇంటికెళ్ళకుండానే యాత్రకు వెళ్ళాడు. తిరిగి వచ్చాక కసుమూరు మస్తానయ్య దర్గాను దర్శించడానికి వెళ్ళాడు. దర్గా వెనుకనున్న మెట్ల వద్ద పెద్ద నాగుపాము హఠాత్తుగా అడ్డగించింది. భయంతో కళ్ళు మూసుకొని శ్రీస్వామివారిని ప్రార్థించాడు. కళ్ళు తెరిచేలోపల పాము వెళ్ళిపోయింది. మరురోజు శ్రీస్వామివారి దగ్గరకొచ్చి నమస్కరించిన వెంటనే 'నిన్నటితో నీ 44 రోజుల గండం పోయిందిగదా' అన్నారు శ్రీస్వామివారు. ఈ విధంగా తనప్రేమను భక్తులకెరుక పరచి వారి భక్తి విశ్వాసాలను పెంపొందజేసేవారు.

ఒకరోజు శ్రీస్వామివారు అకస్మాత్తుగా నెల్లూరు నుండి నరసింహుల కొండకు పోవాలి-బస్సెక్కమని తన సేవకులతో చెప్పారు. చేతిలో చార్జీలకు పైసా లేదు. శ్రీస్వామి వారికి చెపితే "ముందు మీరు ఎక్కండి, డబ్బు వస్తుంది" అన్నారు. అనుమానంతోనే వారు బస్సెక్కి కూర్చున్నారు. బస్సు కదులుతుండగా వెంకట్రావుగారు సైకిలు మీద ఆ మార్గాన పోతూ వీరిని బస్సులో చూచి మాట్లాడి యాభైరూపాయలు ఇచ్చి వెళ్ళారు.

మోపూరు దశయ్యకు, ప్రక్కింటి వారికి మధ్య వున్న ప్రహరీ గోడ పడిపోయి, నేల చదరమై ఎవరి హద్దు ఎంత వరకు అన్నది తెలియక పేచీవచ్చింది. ఇరువురూ శ్రీస్వామివారిని తీసుకువెళ్ళి వారిద్దరి మధ్య హద్దు చెప్పమన్నారు. శ్రీస్వామివారు 'అబ్బో! మునగచెట్టుకు కాకర చెట్టుకు తగవులాట వచ్చిందే' అన్నారు. ఆ మాటలకర్థం ఎవరికీ తెలియలేదు. శ్రీస్వామివారు నేలపై ఒక చోట తన కాలితో గీతగీస్తూ, 'ఇద్దరికీ ఇది హద్దు, నీవు అవతల, ఆయన యివతల వుండండి' అని ఆజ్ఞాపించారు. పూర్వము ప్రహరీ గోడ వున్న చోటే శ్రీస్వామివారు హద్దు చూపుతూ కాలితో గీయడం

అందరినీ ఆశ్చర్యపరిచింది. అదీగాక ఒకరి దొడ్లో మునగచెట్టు, మరొకరి దొడ్లో కాకర చెట్టు వుండటం, దాన్నే శ్రీస్వామివారు 'మునగ చెట్టుకు, కాకర చెట్టుకు తగవులాట' అని ప్రస్తావించడమే తమాషా.

ఒకరోజు శ్రీస్వామివారు కోడూరు వెంకమ్మగారింటికి వేంచేసి యున్నారు. అందరూ భోంచేశాక శ్రీస్వామివారు ఆహారం స్వీకరించడం అలవాటు. ఆనాడు కూడ అలాగే శ్రీస్వామివారిని భోజనానికి లేవమని ప్రార్థించింది. 'నలభై మంది అన్నానికొస్తుంటే ఏందీ పిచ్చామె యిట్లా నిలుచుని వుంది. పోమ్మా పిచ్చామే! అన్నానికి చూడమ్మా' అన్నారు శ్రీస్వామివారు. ఆమె ప్రక్కకు వెళ్ళింది. పది నిమిషాలలో నిజంగానే నలభై మంది వచ్చారు. వారికి అప్పటికప్పుడు అన్నం వండి, మిరపకాయలు కాల్చి, చింతపండు నలిపి పచ్చిపులుసు, అన్నం వడ్డించారు.

**మహాత్ములు ఎప్పుడు కూడా యిలా చేయమని ఎవరినీ నిర్బంధించరు. చాలా సూక్ష్మంగా సలహా యిస్తారు. ఆ సలహాను మనం**
6 **పాటిస్తే ఎంతో మేలు పొందుతాము, లేకుంటే చాలా కష్టనష్టములను ఎదుర్కొన వలసి వస్తుందని ఈ క్రింది సన్నివేశం ఋజువు చేస్తుంది.**

ఒకరోజు శ్రీస్వామివారి సేవకులు మహిమలూరులో ఒకరి దగ్గర అన్నం వండుకునే ఒక చిన్న పాత్ర తెచ్చుకున్నారు. సాయంత్రము దానిని యిచ్చి వచ్చుటకు మూడు మైళ్ళ దూరంలోని గ్రామానికి జయరామరాజు బయలుదేరాడు. శ్రీస్వామివారు 'ఇప్పుడు వద్దు రేపు ప్రొద్దునపో' అన్నారు. 'ప్రొద్దు లేదని కాబోలు శ్రీస్వామివారలా చెపుతున్నారు. త్వరగా వెళ్ళి రాగలనని' బయలుదేరాడు జయరామరాజు. దారిలో ఒక కోడెత్రాచు తోకపై నిలబడి బుసలు కొట్టుచు అతడిని అడ్డగించింది. ఒకటిన్నరగంట సేపు ఎటుపోతే ఆ వైపు వచ్చేది. తాను నిలబడితే అదీ నిలబడేది. చివరకు పశ్చాత్తాపము చెందుచూ 'స్వామీ! మీరు చెప్పిన మాట విననందుకు నాకు ప్రాణహాని కల్గింది' అని చెంపలేసుకొని అతడు గురువును ప్రార్థించాడు. వెంటనే ఆ పాము పడగ దించి చెట్లలోనికి వెళ్ళిపోయింది.

పాలకొండ సుబ్బారెడ్డి (గోపారం) శ్రీస్వామివారిని సమీప మందలి ఏటికి స్నానానికి తీసుకు వెళ్ళేవారు. ప్రతిరోజు వచ్చేటప్పుడు త్రోవలో రైతులు

పనికిరాక పారేసిన నువ్వు చెత్త ఒక మోపుగా కట్టి ఈయనను తెమ్మనేవారు. కొన్నాళ్ళకు అచ్చట నువ్వు చెత్తంతా ఖాళీ అయింది. వెంకమ్మగారి ఇల్లంతా చెత్త మోపులతో నిండిపోయింది. 'ఈ చెత్తంతా ఎందుకు స్వామీ?' అంటే, 'అయ్యో! నెల నాళ్ళకు వాన వెల్లువలు పెట్టుతుంది గదయ్యా?' అన్నారు. అదే విధంగా ఒక నెలకు ముసురుపట్టి వర్షములు కురిసినవి. భూమిపై మొద్దులు వేసివాటి పైన చెత్తవేసి దానినే తమ నిరంతరాగ్నిహోత్రంగా కాల్చేవారు. వర్షపు నీళ్ళు క్రింద పారుతుండేవి. పైన వేసిన కప్పువల్ల మంట ఆరేది కాదు.

ఎందరో భక్తులు శ్రీస్వామివారి చెంతన చేరి సేవ చేస్తూ వారిలీలలు విని భక్తి విశ్వాసాలతో పులకరిస్తున్న కాలంలోనే మరొక వంక అమెరికన్ శాస్త్రజ్ఞులు అంతరిక్ష నౌకలో చంద్ర మండలంపై కాలూని వచ్చారు. అదొక పెద్ద ఘనకార్యంగా లోకమంతా చెప్పుకున్నది. ఆ రోజుల్లోనే ఒకసారి నూతేటి ఆదెయ్య అనే భక్తుడు, 'మనుషులు చంద్రమండలం పోయి వచ్చారు' అని ఆశ్చర్యంగా శ్రీస్వామివారికి చెప్పారు. 'అదెంతయ్యా! ఒక బ్రిడ్జంతలేదు' అన్నారు శ్రీస్వామి. దూరంలోను, సైజులోను విశ్వాంతరాళంలోని యితర గ్రహాలతోను, నెబ్యులాలతోను పోలిస్తే నిజంగా చంద్రమండలం చాలా అల్పమైనదే. విశ్వమూర్తియైన శ్రీస్వామివారు అలా అనడంలో ఆశ్చర్యమేముంది?

ఒకరోజు గౌని పెంచలమ్మ శ్రీస్వామివారికి ఆకులు, వక్క సమర్పించింది. అచ్చటనున్నవారు 'ఇప్పుడు వద్దులే' అని వాటిని ప్రక్కకు నెట్టారు. ఆమె నొచ్చుకొని బాధపడుతూ దూరంగా వెళ్ళి పడుకున్నది. ఆమె ప్రేమను గుర్తించిన సర్వజ్ఞమూర్తి ఆకు, వక్క తెచ్చి పెట్టమని మరలా మరలా ఆమెను చూపించారు. సేవకులు పెంచలమ్మను సమీపించి 'స్వామి నిన్నడిగి ఆకు, వక్క తెమ్మంటున్నారు' అని చెప్పి తీసుకుపోయారు. అది తెలిసి అందరూ ఆశ్చర్యంతో ముగ్ధులయ్యారు.

ఒకప్పుడు సేవకులు ఉప్మా చేసి శ్రీస్వామివారికి వడ్డించారు. శ్రీస్వామివారు కొద్దిగా తిని మిగిలిన దానిని కొద్దిగా కుక్కకు పెట్టమని నాలుగు రోజులు వరుసగా మల్లిక వెంకయ్య చేతికిచ్చారు. కానీ శ్రీస్వామివారి ఉచ్ఛిష్ఠం చిక్కిందేచాలని వెంకయ్య కుక్కకు పెట్టకుండా చాటుకుపోయి మొత్తం తినేశాడు. అంతేకాక శ్రీస్వామివారు ఆ విషయం గుర్తించలేదని, తనను

వారించలేదని అతడెంతగానో పొంగిపోయాడు. 5వ రోజు శ్రీస్వామివారు 'కుక్కను మించిన రెండుకాళ్ళ కుక్క కాజేస్తుంది!' అంటూ వెంకయ్య చేతికివ్వకుండా ఉప్మాను గుండంలో పడేశారు. వెంకయ్య హతాశుడై చెంపలేసుకున్నాడు.

పాలకొండ సుబ్బారెడ్డిగారు మడపల్లెలో కోడెను కొని పట్టుకొస్తుంటే దారిలో అది బెదిరి తప్పించుకు పోయింది. ఇరువై అయిదు రోజులు వెతికారు కాని దొరకలేదు. చివరికతడు శ్రీస్వామివారిని దర్శించి కోడెను గూర్చి అడిగితే 'వెదకవద్దు, అదే వస్తుంది' అన్నారు. అట్లాగే తానింటికి వెళ్ళేసరికి కోడె ఎక్కడుండేది తెలిసి వారి మనుషులు తోలుకొచ్చి వున్నారు. శ్రీ సాయి చరిత్రలో చాంద్ పాటిల్‌కు యెంత వెతికినా కనపడని తన గుఱ్ఱపు జాడను శ్రీ సాయి అతనికి సులువుగా సూచించారు.

మరోసారి శ్రీస్వామివారు పాలకొండ సుబ్బారెడ్డిగారికి భూస్థితి యేర్పడుతుందని చీటి వ్రాయించారు. కొన్నాళ్ళ తరువాత రెడ్డిగారికి బంజరు భూమి పట్టాయిచ్చారు. కుట్ర వలన ఒక కరణం ఆ పట్టాను రద్దుచేశాడు. ఎలాగైతేనేం చివరకు రెడ్డిగారికి పట్టా ఖాయమైంది. ఫలితంగా కరణం ఉద్యోగం ఊడింది. శ్రీస్వామివారి మాటే నిజమైంది.

1978 - 79 ప్రాంతంలో శ్రీస్వామివారు తలుపూరులో విడిది చేసియున్నారు. నెల్లూరు దొడ్ల సుబ్బారెడ్డిగారి దగ్గరి బంధువుల ఐదేళ్ళ చిన్నబిడ్డ నోట రక్తం కక్కుతూ చాలా బాధలో ఉన్నది. ఎంతో మంది డాక్టర్లు ప్రయత్నించి విఫలమైనారు. చివరకు శ్రీస్వామివారి మహిమ విని ఆ బిడ్డను తీసుకు వచ్చారు. బిడ్డను కంఠం నుండి క్రింది పాదముల వరకు చేతితో మృదువుగా వత్తినట్లు సరదీశారు శ్రీస్వామివారు. బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం కల్గింది. అందువల్ల మరుసటి వారం వారు దక్షిణగ రూ॥ 250/- సమర్పించబోయారు. ఎంతసేపు అర్థించినాగానీ శ్రీస్వామివారు స్వీకరించలేదు. చివరకు 'నాలుగు నెలల తరువాత ఇవ్వండి తీసుకుంటాను' అన్నారు. సరిగ్గా నాలుగు నెలలకు వారి బిడ్డ మరణించటం గమనార్హం. కనుక వారు మరలా వచ్చి దక్షిణ సమర్పించే ప్రసక్తే లేకపోయింది. దీనినే శ్రీస్వామివారు ముందుగా సూచించారు.

**శ్రీస్వామివారిని సంపూర్ణ విశ్వాసంతో శరణు వేడిన వారి సంపూర్ణ**

**బాధ్యత శ్రీస్వామివారే తీసుకుంటారు. ఐతే హృదయంలో వెంట్రుకవాసి తేడా లేకుండా మన ప్రాణాలు వారి చేతుల్లో పెట్టి నిశ్చింతగా ఉండగలగడమే అందులో రహస్యము. సద్గురువుకు పగ్గాలప్పచెప్పాక చింతకు తావేలేదని సాయినాథుడు చెప్పిన మాట మనం ఇచ్చట గుర్తుంచుకోవలసి యుండును.** 7

ఒకసారి కె. బుజ్జయ్యకు డబ్బులు అవసరమయ్యాయి. తన గొఱ్ఱెలను కసాయికి అమ్మేయ్యాలనుకున్నాడు. నాటి రాత్రి శ్రీస్వామివారు స్వప్నంలో కన్పించి 'గొఱ్ఱెలను కసాయివానికి అమ్మడం ఎంత పాపం? ఏమి సంగతి?' అని పలికారు. అతనికి వెంటనే మెలుకువ వచ్చింది. 'శ్రీస్వామి చెప్పింది నిజమే కానీ తనకు డబ్బు అవసరము ఎలా తీరాలి? శ్రీస్వామియే శరణ్యం' అని గొర్రెలను నెల్లూరు తోలుకుపోయారు. కసాయి దగ్గర నిలబెడితే అనేక మంది చూచి వెళ్ళారు కాని ఒక్కరు కూడా కొనలేదు. కొంతసేపటికి ప్రక్కవూరివారు వచ్చి 'మేము మేపుకుంటాము ధర తగ్గించి ఇవ్వమ'న్నారు. వెంటనే బుజ్జన్న అంగీకరించి అమ్మేశారు. ఆ విధంగా శ్రీస్వామివారు వాటిని కసాయి బారి నుండి రక్షించారు. ఈ విధంగా తనను శరణుపొందిన భక్తులను పాపభారం నుండి విముక్తి చేశారు.

ఒకప్పుడు శ్రీస్వామివారు సముద్ర స్నానానికి మైపాడు వెళ్ళారు. బుజ్జయ్యకు రెండు గంటల తరువాత ఆ సంగతి తెలిసి, శ్రీస్వామివారిని కలుసుకోవచ్చని మైపాడు వెళ్ళాడు. శ్రీస్వామివారు స్నానం చేసి గట్టున కూర్చున్నారు. ఎన్నిమార్లు ఇంటికి పోదామని సేవకులు పిలిచినప్పటికీ ఆయన కదలలేదు. బుజ్జయ్య వచ్చి వారిని కలుసుకొని స్నానం చేశాక వెంటనే లేచి వచ్చారు. వారు వచ్చే సంగతి తెలిసే శ్రీస్వామివారు కదల్లేదని అప్పుడు భక్తులకు తెలిసింది.

దాచూరు వాస్తవ్యులు కస్తూరి అంకయ్య తన మనవడికి ఏమి పేరు పెట్టమంటారని శ్రీస్వామివారినడిగితే 'అయ్యా! ఈయన పూర్వజన్మలో సుబ్బన్న అనే పేరుగల వర్తకుడు. అదే పేరు పెట్టమ'ని చెప్పి ఆ బిడ్డకు ఆశీర్వాద చీటీ వ్రాస్తూ రెండున్నర సంవత్సరముల వయసులో నీటి గండమని వీరరాఘవస్వామి ఆ గండం తీసివేస్తారని వ్రాయించి ఇచ్చారు.

మూడున్నర సంవత్సరముల వయసు గల వాళ్ళ అన్న బాలాజీ

మరియు సుబ్బన్నలు కలసి తమ ఇంటి సమీపంలో ఉండే దిగుడుబావిలో నీరు త్రాగుటకు తమాషాగా పోయారు. నీరు త్రాగుతూ కాలుజారి సుబ్బన్న నీళ్ళలో పడిపోయాడు. బాలాజీ కేకలు పెడుతూ బావి నుండి పరుగెత్తాడు. ఇంటిలోని వారి తండ్రి పరుగున వచ్చి మొలలోతు నీళ్ళలో మునిగిపోకుండా నీటిపై తేలుతున్న బిడ్డను తీసుకురావడంతో అతడికి గుడ్డలన్నీ తడిశాయి. అంతలోతు నీళ్ళలో పడినప్పటికి గుక్కెడు నీరుకూడా త్రాగకుండా నీటి పైన బిడ్డ ఎలా ఉండగలిగాడు అనేది ఊరందరికి ఆశ్చర్యమైంది. ఒక రోజు శ్రీ వెంకయ్య స్వామివారు వ్రాయించిన చీటీ చూస్తే సరిగ్గా ఆనాటికి ఆ గడువు పూర్తయింది అని తెలిసింది.

పెరంకొండ నుండి వచ్చిన నాయుడుగారు ఇలా చెప్పారు. శ్రీస్వామివారు మరికొందరు భక్తులు పంచలింగాల కోనకు పోయి విశ్రాంతి కొరకు ఒకచోట కూర్చుందామని శ్రీస్వామివారిని ఆగమని అర్థించారు. 'అబ్బా! ఇక్కడ కూర్చోకూడదు, పడుకోకూడదు, ప్రమాదం' అని అచ్చట నుండి వచ్చేసారు. తిరుగు ప్రయాణంలో చూస్తే అదే ప్రదేశంలో పెద్ద కొండచరియ విరిగిపడి పెద్ద బండలున్నాయట! శ్రీస్వామివారు తెలిపిన ప్రమాదం అప్పుడు అర్థమైంది. ఏ కొండచరియ ఎప్పుడు విరగబడే విషయం గూడా శ్రీస్వామివారికి తెలుసు.

1977లో తుఫాను (సైక్లోను) వల్ల దివి తాలూకా అంతా కొట్టుకుపోయిన సమయంలో స్వామివారు మద్రాసు రాష్ట్రంలో మన్నారుకండ్రిగలో ఉన్నారు. నెల్లూరు జిల్లాకు తుఫాను (సైక్లోను) ప్రమాదమని రేడియో తెలియపరచింది. ఈ విషయం శ్రీస్వామివారికి చెబితే, 'అయ్యా! మన గుండాలు కాపలా గదా! మనకేం నష్టం లేదులే. కానీ నెల్లూరుకు ఒక సంవత్సరం ఆరు నెలల పన్నెండు రోజులకు గాలివాన గండం వుంది అని వ్రాయించారు. అదే విధంగా ఆ టైములో నెల్లూరుకు నష్టం జరగలేదు.

8 **త్రిమూర్త్యాత్మకుడైన సద్గురుని ఆజ్ఞలకు దేవతలు కూడా కట్టుబడి ఉంటారనే సత్యం ఈ క్రింది సంఘటన నిరూపిస్తుంది.**

ఇనుకుర్తి వాస్తవ్యులు కారి రామస్వామి వారి కుమార్తెకు ఏదో శక్తిపూని పూజచేస్తూ మన స్వాధీనం లేకుండా ఉండేది. వారి ఇంట్లో పుట్టలు

మొలిచాయి. కసుమూరు మస్తానయ్య దర్గా దగ్గర, అనాసముద్రంపేట దగ్గర, నాగూరు నాగపట్నం దర్గావద్ద ఐదు సంవత్సరాలు ప్రదక్షిణలు చేశారు. ఫలితంలేదు. శ్రీస్వామివారి దగ్గరకు వచ్చారు. అప్పుడాయన 'జొన్నవాడ కామాక్షమ్మ ఈమె వంటిమీదకు వస్తూన్నది' అని తెలిపినారు. ఆ దేవి ఈమె ఒంటి మీదకు వచ్చినపుడు సాటివారికి భూత భవిష్యత్ వర్తమానాలు చాలా ఖచ్చితంగా చెప్పేది. చాలామంది వచ్చి చెప్పించుకుంటూ ఉండటం వల్ల ఇల్లంతా రద్దీ అయింది. కొన్నాళ్ళు అయిన తరువాత ఒక్క శుక్రవారం తప్ప తక్కిన రోజులు పూనకం రాకుండా చీటీ వ్రాయించారు శ్రీస్వామివారు. అదే విధంగా శుక్రవారం రోజు మాత్రమే అమ్మణ్ణి పూని ప్రశ్నలు చెప్పేది. ఇప్పుడు కూడా చాలా రద్దీ అయింది. వివాహం కావలసిన అమ్మాయి కనుక ఈ ప్రశ్నలు చెప్పటం చాలా ఇబ్బంది అని, కనుక ఎప్పుడూ ఆ దేవి తన కుమార్తె వంటి మీదకు రాకుండా చేయమని ఆ తండ్రి శ్రీస్వామివారిని ప్రాధేయ పడ్డాడు. ఆయన అలానే వ్రాయించారు. అది మొదలు ఆ దేవి ఆమెనావహించలేదు. ఇప్పుడామెకు శ్రీస్వామివారి ఆజ్ఞమేరకు వివాహం చేశారు. బిడ్డలు కూడా కలిగారు.

**కాలాంతరంలో ఎప్పుడో రాబోయే ప్రమాదాలు, ఆపదలు వాటి నివారణోపాయం ముందుగానే చెప్పి ఆ మాట ద్వారానే వారిని రక్షించేవారు.** ౯

పాలకొండ సుబ్బారెడ్డికి శ్రీస్వామివారు ఒక రోజున చీటి వ్రాసి ఇచ్చారు. అందులో 'మీ గ్రామస్తులకు ప్రక్క గ్రామస్తులకు పెద్ద తగాదా వస్తుంది. నీవు పోయి ఒక్క మాట చెపితే సరిపోతుందయ్యా' అని వ్రాసి ఇచ్చారు. 'స్వామీ! అంత పెద్ద తగవులాటలో నా మాట వింటారా? నేను చెప్పగలనా?' అంటే 'ఇక్కడ నుండి పోతున్నావు గనుక ఒక్క మాటతో సరిపోతుంది' అన్నారు.

శ్రీస్వామివారు చెప్పిన గడువు ప్రకారం ప్రొద్దు గ్రుంకాక మసక చీకటిలో రెండు ఊర్ల జనం కత్తులు, కటార్లు తీసుకొని ఊరి వెలుపలికి వచ్చి మోహరించారు. శ్రీస్వామివారు చెప్పిన మాట గుర్తు వచ్చి ఈయన వెళ్ళి 'ఒకరికి చెప్పవలసిన పెద్దవారు మీరే ఈ విధంగా తలపడితే ఏం

బాగుంటుంది' అన్నారు. ఆ మాటలో ఏం ప్రభావం వుందో నాయకులు తమ పట్టును వదలి వెనుకకు వెళ్ళారు. శ్రీస్వామివారి ఆజ్ఞ కదా మరి.

వక్కెమ్మగారికి స్వప్నంలో ఒక స్త్రీ కాటుక భరిణె ఇస్తున్నట్లు, ఈమె వద్దని నెట్టివేసినట్లు కనిపించింది. అప్పుడా స్త్రీ దోసిట్లో నూనె పోసుకుని బలవంతంగా వక్కమ్మ నెత్తిన అంటింది. తెల్లవారేసరికి నిజంగానే తన తలమీద బొబ్బలు లేచి బాధిస్తున్నాయి. శ్రీస్వామివారికి చెపితే 'మంచిది గదమ్మా! వక్కమ్మ ఇక వచ్చేదిలేదే. గుంజలాగా వుండేదే గదా!' అన్నారు. 'నెత్తిన బొబ్బలు వచ్చాయి స్వామీ' అంటే మరలా కూడా 'ఇక వచ్చేది లేదు కదయ్యా' అన్నారు శ్రీస్వామివారు.

శ్రీస్వామివారు మహా అద్భుత నటనా సామ్రాట్టు అని చెప్పవచ్చు. తన గుట్టు రట్టు కాకుండుటకు వారు మహాద్భుతంగా నటించేవారు. 'యద్భావం తద్భవతి' అన్నట్లు మరియు శ్రీస్వామివారి మాటలలో చెప్పాలంటే 'వాళ్ళుండే దాన్ని బట్టి గదయ్యా మనముండేది' అన్నట్లే మెలిగేవారు. తమ సమస్యలకు పరిష్కార మార్గము తెల్పమని అర్థించిన వారిలో కొందరికి తన తంబుర మీటి, వేళ్ళు గణించుకొని, ఆకాశంలోకి చూచి ఏదేదో భంగిమలు చేసి ఒకటి రెండు మాటలు చెప్పేవారు. కానీ కొంత మంది వచ్చీ రాకముందే వాళ్ళడుగకుండానే వారి విషయాలన్నీ విపులంగా చెప్పేవారు. భూత భవిష్యత్ వర్తమానాలు తేదీలతో సహా చెప్పేవారు.

ఉదా:- నూతేటి శ్రీ రామయ్య భార్య, వేలూరు గోవిందయ్యగారి భార్య గర్భవతులు. శ్రీ రామయ్య, గోవిందయ్యగార్లు తమకు ఏ బిడ్డలు పుట్టుతారో శ్రీస్వామివారిని అడగాలని వచ్చారు. వీరు వచ్చీ రాకముందే వారేమి అడగకనే 'మీకు ఇద్దరికి మగపిల్లలే పుట్టుతారు, ఇక పోండి' అని ఒకే ఒక్కమాట చెప్పి పంపేశారు. వారికలాగే జరిగింది.

పరమ కరుణామూర్తియైన శ్రీస్వామివారు వారికామాట చెప్పిన తీరు చాలా చీదరింపుగాను, కోపముగాను ఉందట. ఎందుకలా చీదరించుకోవడం? **ఇంతకుముందు వారికిచ్చిన ఎన్నో అనుభవముల ద్వారా శ్రీస్వామివారిని సరిగా అంచనా వేసుకోలేని వారి దుర్బల స్థితిని చీదరించుకున్నారు. ఏ బిడ్డను కావాలంటే ఆ బిడ్డను ప్రసాదించగల వారి**

**దివ్యస్థితిని గుర్తించలేక ఏ బిడ్డ పుడుతుందని అడగటం ఎంత హీనస్థితి! 10**

కొద్ది సంవత్సరాల క్రిందట అమెరికన్ శాస్త్రజ్ఞులు అంతరిక్షంలోకి స్కైలాబ్ అనే పరికరాన్ని అంతరిక్ష నౌకలో పంపారు. అది కొంతకాలం ఆకాశంలో భూమి చుట్టూ తిరిగింది. దాని జీవితకాలం పూర్తయిందని మన దేశంలో ఎక్కడైనా పడవచ్చని శాస్త్రజ్ఞులు ప్రకటించడం వలన ప్రజలందరూ ఎంతో భయ భ్రాంతులయ్యారు. ఆ సమయంలో ఒక భక్తుడు ఒక రోజు 'స్కైలాబ్ ఎక్కడ పడుతుందని' శ్రీస్వామివారిని అడిగాడు. అప్పుడాయన 'అది అక్కడెక్కడో సముద్రంలో పడుతుందిలేయ్యా' అన్నారు. అట్లాగే జరిగింది. అది ఎక్కడో పసిఫిక్ మహాసముద్రంలో పడింది.

గొలగమూడి కరణం సుబ్బారావుగారి కుమారుడు శ్రీస్వామివారి భక్తుడు. అతడు ఇంటర్ పరీక్షకు వెళ్తున్నాడు. హాల్ టిక్కెట్ శ్రీస్వామివారికి ఇచ్చి ఆశీర్వదించమన్నాడు. 'పరీక్ష పాసవుతావు' అని ఆశీర్వదించి చీటి వ్రాయించారు శ్రీస్వామి. శ్రీస్వామికృపవలన పాసవుతానని చాలా సంబర పడ్డాడు. కాని ఫలితాలు ప్రకటించిపుడు పేపరులో అతని నెంబరు లేదు. చాలా దిగులుపడి అతడి తల్లి శ్రీస్వామి నడిగింది. 'స్వామీ! మీరు పాసవుతాడని చెప్పితిరి. పిల్లవాని నెంబరు పేపరులో లేదే! ఫెయిలయ్యాడే!' అని. 'లేదమ్మా, ఆయన పాసయినాడు' అని శ్రీస్వామివారు నిక్కచ్చిగా చెప్పారు. మార్కుల లిస్టు చూస్తే శ్రీస్వామివారు చెప్పినట్లే పాసయి వున్నాడు. శ్రీస్వామివారి మాట అబద్ధమెలా అవుతుంది?

1968 లో శ్రీస్వామివారు 'శ్రీ రామయ్యా! నీకు ఇల్లు లేదే!' అన్నారు. అది ఎట్లాగా అని శ్రీస్వామివారితో తర్కిస్తే 'నీ ఇల్లు అనంతప్ప కొంటుండ్లా' అని చెప్పారు. ఆ రోజు శ్రీరామయ్య అన్నీ వున్న గొప్ప రైతు. ప్రక్క ఇంటి అనంతప్ప చాలా పేదవాడు. ఇది కేవలం శ్రీస్వామివారి పిచ్చి మాటలనుకొన్నాడు శ్రీరామయ్య. కాని కాలాంతరంలో 1983 నాటికి ఇద్దరి పరిస్థితులు తారుమారైనాయి. అనంతప్ప భాగ్యవంతుడై, శ్రీరామయ్య ఇల్లు అమ్ముతుంటే కొనేశాడు. 20 సంవత్సరముల తరువాత, ఎవరి ఇల్లు ఎవరు కొంటారో ఆ పేర్లను కూడా శ్రీస్వామివారు ఖచ్చితంగా చెప్పారంటే వారు సర్వజ్ఞమూర్తియని తెలియటం లేదా! సృష్టిలో ప్రతి చిన్న విషయమూ ముందు నిర్ణయం ప్రకారము

జరిగి తీరుతుంది. కానీ ఆ నిర్ణయాన్ని ప్రస్తుత మన ప్రయత్నంతో మార్చవచ్చు. **అయితే అలా మార్చేందుకు తగు ప్రయత్నం చేసే సంస్కారంగలవారు**
11 **నూటికొక్కరు కాదుకదా వెయ్యికొక్కరు కూడా ఉండరు. వేల మందిలో ఏ ఒక్కరో అలా చేయగలరంటాడు శ్రీ కృష్ణపరమాత్మ భగవద్గీతలో. అయితే సద్గురువులందరికీ ఆ నిర్ణయాలు మార్చగల శక్తి ఉంటుంది. మనం వారి కృపను పొందితే తప్ప వారానిర్ణయాలను మార్చరు.**

దారా పుల్లయ్య భార్య చిన్నమ్మ తన అరవయ్యో ఏట కంటి ఆపరేషన్ చేయించుకున్నది. ఇంకా కన్నునొప్పిగానే ఉన్నది. ఆపరేషన్ ఎలా చేశారో, కంటి చూపు వస్తుందో లేదో అని భయపడి శ్రీస్వామి వారిని ప్రార్థించింది. స్వామి స్వప్న దర్శనమిచ్చి 'ఏమీ భయపడవద్దు. ఆపరేషన్ చేసినంతసేపు నేనక్కడే వున్నానుకదా?' అన్నారు. స్వామి చెప్పినట్లే కన్ను నొప్పి తగ్గి చక్కగా కనబడుతుంది. తన ప్రార్థన మన్నించి స్వప్న దర్శనమిచ్చిన ప్రేమమూర్తికి 'నేనెంతో ఋణపడి వున్నాన'ని చెపుతుంది.

12 **నిజమైన భక్తి, ప్రేమలకు శ్రీస్వామివారు ఎంత గొప్పగా విలువనిచ్చేవారో క్రింది విషయం వల్ల తెలుస్తుంది.** ఒక రోజు నేను (రచయిత) నా ఇంటిలో ఇడ్లీలు తయారు చేయించి స్వామివారికి తెస్తున్నాను. శ్రీస్వామివారు వాటిని సేవించేంత వరకు విడవకుండా నామజపం చెయ్యాలని చేస్తూ తెచ్చాను. కాని శ్రీస్వామివారు నేను వచ్చేటప్పటికి బజారు నుండి తెప్పించిన ఇడ్లీని తిన్నారు. ఈ విషయం తెలిసి నేను చాలా బాధ పడ్డాను. స్వామి సేవకులు నేను తెచ్చిన ఇడ్లీలను స్వామివారికి పెట్టలేదు. కారణము అంతకుముందే స్వామివారు ఇడ్లీ తిన్నారు. నరసారెడ్డి భార్య ఈశ్వరమ్మ అనే భక్తురాలు నేను తెచ్చిన ఇడ్లీలను స్వామివారికి నివేదించి కొంచమైన తినమని అర్థించింది. అ కరుణామయుడు కొంచెమే కాకుండా నేను తెచ్చిన నాలుగు ఇడ్లీలు పూర్తిగా తిన్నారు. అప్పుడు నా మనసు ఎంతో ఆనందించింది. సర్వజ్ఞమూర్తియైన శ్రీస్వామివారు ఈ విధంగానే అనేక మంది భక్తులను సంతృప్తి పరిచేవారు.

కొందరు భక్తులు వచ్చి శ్రీస్వామివారి అనుమతి లేకుండానే వారి మాటలు టేప్‌చేశారు. తరువాత టేప్ ఆన్ చేస్తే ఎలాంటి శబ్దాలు లేవు.

కోట వాస్తవ్యుడు వెంకట రమణయ్య ఫోటోగ్రాఫరును తీసుకువచ్చి శ్రీస్వామివారి ఫోటో తీయమన్నాడు. ఎన్నిమార్లు ప్రయత్నించినా క్లిక్ చేయబోయే సమయానికి శ్రీస్వామివారు కదిలేవారు. ఇక ఇట్లా కాదని రమణయ్య 'నేను ధ్యానంలో కూర్చుంటాను. నీవు రెడీగా వుండి శ్రీస్వామివారు పోజు ఇచ్చినప్పుడు ఫోటో తీయి' అని ఫోటోగ్రాఫరుకు చెప్పి ధ్యానంలో కూర్చున్నాడు. కొంతసేపటికి ఆ దయామయుడు తన తలను పైకెత్తి పడుకొనే పోజు ఇచ్చాడు. వెంటనే ఫోటో తీశాడు. నేడు సమాధి మందిరములో పిడికిళ్ళు బిగించియున్న శ్రీస్వామివారి ఫోటో అదే. శ్రీస్వామివారికి తీసిన ఫోటోలన్నింటిలోకి దీనిలో చాలా ప్రసన్నత, చిరునవ్వు తాండవిస్తున్నాయని ప్రతి ఒక్కరు ప్రశంసిస్తున్నారు. నిజమైన ప్రేమకు శ్రీస్వామివారు ఎంతో గొప్పగా స్పందిస్తారు.

కాటంరెడ్డి సుబ్బారెడ్డి, కల్లూరుపల్లి గ్రామం, నెల్లూరు తాలూకా తన తండ్రిగారైన సుబ్బరామిరెడ్డి గారికి శ్రీస్వామివారితో గల అనుభవాలను ఇలా వివరించారు.

1966 వ సంవత్సరములో మా తల్లిగారు పోయాక, మా నాన్నగారి మనస్సు వికలమై బాధతో వుంటే స్నేహితులు శ్రీస్వామివారి దర్శనానికి తీసుకొని వచ్చారు. ఆ ప్రథమ దర్శనంలోనే వారికి ఎట్టి శాంతి సుఖాలను ప్రసాదించారోగాని అది మొదలుకొని శ్రీస్వామివారిని మా నాన్న తరచుగా దర్శించేవారు. 1969 నుండి ఇంటి బాధ్యతలు నాకు అప్పగించి శ్రీస్వామి వారి చెంతనే వుండి సేవించ నారంభించాడు. నేను అప్పుడప్పుడు బియ్యము, డబ్బులు ఇచ్చివచ్చే వాడిని.

మా నాన్న ఒక రోజు అగ్నిగుండానికి టెంకాయ కొట్టబోతే 'అయ్యా ఆయనకు అంటు కొట్టకూడదు' అని శెలవిచ్చారు. ఆయనకేమీ బోధపడలేదు. కొద్దిసేపటికి మా తమ్ముని భార్య చనిపోయినట్లు మా నాన్నకు వార్త అందింది.

ఇదే విధంగా మా నాన్న ఇంటికి వెళ్ళి పిల్లలను చూచి వస్తానని శ్రీస్వామివారిని శెలవు కోరాడు. 'అయ్యా, ఎట్టా పోయినవాడివి అట్టాగే రావాలి, కంట తడిపెట్ట కూడదు' అని శెలవిచ్చారు శ్రీస్వామివారు. మా నాన్న ఇల్లు చేరిన వెంటనే రెండు గంటలకు మా తమ్ముడు చనిపోయాడు.

కంట తడిపెట్టకూడదు అని శ్రీస్వామివారు చెప్పిన మాటలకు అర్థం అప్పుడు తెలిసింది.

మా తమ్ముడు, మరదలు చనిపోక ముందు, నాకు సంతతి లేదని శ్రీస్వామివారు చెప్పారు. అప్పటికి నాకు పెళ్ళి అయి ఎనిమిది సంవత్సరములు అయినది. ఇంక బిడ్డలు పుట్టే ఆశలేదు. తమ్ముడు, మరదలు చనిపోయాక ఆ చనిపోయిన వాళ్ళిద్దరు మరలా వస్తారు. నాకు సంతానముగా పుట్టుతారు అని శ్రీస్వామివారు చెప్పారు. మొదట చెప్పిన శ్రీస్వామివారి మాటలకు ఇవి పూర్తిగ విరుద్ధముగా వుండడంతో నేను శ్రీస్వామివారిని బాగా అవహేళన చేశాను. మా నాన్నగారు శ్రీస్వామివారి గొప్పతనాన్ని గూర్చి ప్రస్తావన తెచ్చినప్పుడల్లా నాకు ఒళ్ళు కంపరమెత్తి శ్రీస్వామివారిని తక్కువ చేసి మాట్లాడేవాడిని. శ్రీస్వామివారు చెప్పినట్లు నాకు సంతతి కలిగింది. కాని నాకు శ్రీస్వామివారి యందు విశ్వాసము మాత్రము కలుగలేదు.

ఒకరోజు శ్రీస్వామివారు 'అయ్యా! అడుగో, నీ కొడుకు నెత్తిన దబర పెట్టుకొని వస్తున్నాడు. కూలోళ్ళకి చేలోకి అన్నము ఎత్తుకొని పోతున్నాడు' అన్నారు. 'ఏడి స్వామి మాకు కనపడటము లేదే అంటే 'అడుగోనయ్యా దబర నెత్తిన పెట్టుకొని' అని మాత్రమే అన్నారు. శ్రీస్వామి వారి మాటలను పరీక్షించదలచి ఆ రోజు మానాన్న ఇంటికి వచ్చి విచారిస్తే అదే టైములో నేను చేలోకి అన్నము తీసుకెళ్ళినమాట యదార్థమేనని తేలింది. ఆ మహనీయునకు ఈ విశ్వంలో ఎవరు ఏమి చేయుచున్నా సర్వము కనబడుతూనే వుంటుంది.

శ్రీస్వామివారంటే భక్తి శ్రద్ధలు లేని నా ప్రవర్తనను గూర్చి శ్రీస్వామివారికి విన్నవిస్తే 'ఆయన నీకంటే గొప్ప వాడవుతాడులేయ్యా!' అని అభయమిచ్చారు. ఈనాడు నాకు భక్తి శ్రద్ధలు ఏర్పడటము వారి ఆశీస్సుల ప్రభావమేనని నమ్ముచున్నాను.

తలుపూరులో మా నాన్నకు బియ్యము ఇచ్చి వస్తూవుంటే శ్రీస్వామివారు నాకు ఒక చీటీ వ్రాయించి ఇచ్చారు. అందులో 'ఈయనకు కోళ్ళపాపం ఆవరించింది. మూడు రోజులు కోమటి ఇంట అన్నం తింటే ఆ పాపం పోతుంది' అని వ్రాయించారు. ఆరోగ్యముగా వున్న నాకు ఈ మాటలు

అర్థముకాలేదు. నేను కోళ్ళు కోసుకొని వారమునకు నాలుగుసార్లు తినే విషయము మా నాన్నే శ్రీస్వామివారికి చెప్పి ఆ విధంగా చెప్పించారని ఆయనతో తగాదా వేసుకున్నాను. 'నీవే ఆ పాపపు పని చేయవద్దని చెప్పివుంటే, నీ మాట పై గల గౌరవము కొద్ది మానివేసి వుండేవాణ్ణి. నేను నీ కంటే ఎక్కువగా స్వామిని గౌరవిస్తానని అనుకొన్నావా?' అని శ్రీస్వామివారిని తూలనాడాను. మా నాన్న ఉగ్రుడై నన్ను మందలించారు.

'స్వామీ! కోళ్ళ పాపము విషయము పిల్లవాడు నమ్మడము లేదు' అని శ్రీస్వామివారితో మా నాన్న మొర పెట్టుకొంటే, 'అయ్యా ఒక నెల రోజులకు ఆయనకే తెలిసి మన దగ్గరికి వస్తాడులే బాధపడవద్దు' అని ఓదార్చారు.

ఒక నెలరోజులకు నిజంగానే కోడి మాంసము తింటే నాకు కడుపు నొప్పి, విరోచనాలు అయ్యేవి. డాక్టర్లకు చూపిస్తే పేగు పొక్కింది, ఆపరేషను చేయాలన్నారు. మూడు నెలలు మందులుతిన్నా, బాధ తగ్గలేదు. పసిరికల రోగివలె తయారయ్యాను. మా నాన్న బలవంతముచేసి నన్ను శ్రీస్వామివారి దగ్గరకు తీసుకెళ్ళారు. నన్ను చూచి శ్రీస్వామివారు పకపకమని చిత్రంగా నవ్వారు. "అయ్యా! ప్రొద్దు కూకుతుంది. మూడు ముద్దలు మిరియాల పొడి కలిపిన అన్నము పెట్టండి, పోతుంది" అన్నారు. అదే విధంగా తినిపించారు. పదిరోజులలో నా బాధ పూర్తిగా ఉపశమించింది. ఒక నెల రోజులలో కోడి మాంసము చూస్తేనే ఇష్టము లేని స్థితికి తీసుకొచ్చారు శ్రీస్వామివారు. ఇప్పుడు పూర్తిగా మానివేశాను. ఇంత జరిగినా నాకు వారి యెడల భక్తిశ్రద్ధలు ఏర్పడలేదంటే అది నా కర్మఫలం అనుకోవాలి.

ఒకప్పుడు మా నాన్నకు విరోచనాలై చనిపోయే స్థితిలో వున్నాడు. ఆరుమైళ్ళలోవున్న నెల్లూరుకు తీసుకుపోయేందుకు బండిలో ఊరి వెలుపల కొచ్చాము. మా నాన్న ఆసుపత్రికి వెళ్ళేందుకు అంగీకరించక 'నా మీద ఏ మాత్రము ప్రేమ వున్నా నీవు శ్రీస్వామివారి దగ్గరకు వెళ్ళి చీటీ వ్రాయించుకురా! నేను చచ్చినా, బ్రతికినా ఆయనే నాకు దిక్కు' అని మొండికేసి యింటికి వచ్చేశారు. గత్యంతరము లేక తలుపూరులో వున్న శ్రీస్వామివారి దగ్గరకు వెళ్ళాను. ఆ రాత్రి అక్కడనే వుండవలసి వచ్చింది. ఉదయము శ్రీస్వామివారు మా నాన్న విషయము విని పకపక నవ్వి 'ఆయనకేమయ్యా ఆయన ఆసుపత్రికిపోడే, ఈయన పోయేసరికి అన్నము తింటూ వుంటాడులే'

అని చెప్పి వారి పరిభాషలో కోట్లు, మణుగులు అని ఆశీర్వచన చీటి వ్రాయించి ఇచ్చారు. నేను ఇల్లు చేరేసరికి మా నాన్న చనిపోయి వుంటాడని అనుకొన్నాను. కాని నిజంగా మా నాన్న శ్రీస్వామివారు చెప్పినట్లే అన్నం తింటున్నాడు. ఇంత గొప్ప అనుభవము జరిగినా నా కర్మకొద్దీ శ్రీస్వామివారు అంటే నాకు నమ్మకము కలుగలేదు.

ఒకప్పుడు మా బఱ్ఱెలు తప్పిపోగా పదిరోజులు వెతికి వెతికి ఆశ వదలి వేశాము. మా నాన్న శ్రీస్వామివారికి చెప్పితే 'అయ్యా! వాళ్ళకు కాళ్ళ తిప్పట కర్మ వుండి తిరిగారు. నాలుగవ మైలులో బఱ్ఱెలను కట్టేసి మేపుతున్నారు. రెండు రూపాయలు ఇస్తే తోలి పెడ్తారు' అని శెలవిచ్చారు. శ్రీస్వామివారి మాట యందు అచంచల విశ్వాసము గల మా నాన్నగారు ఎందరు చెప్పినా వినకుండా స్వామివారు చెప్పినట్లే రెండు రూపాయలు మాత్రమే ఇచ్చి మా సేద్యగాడ్ని నాలుగవ మైలులో వెతకమని పంపించారు. మా బఱ్ఱెలు సురక్షితంగా ఉండడమేగాక శ్రీస్వామివారు చెప్పినట్లు రెండు రూపాయలు మాత్రమే తీసుకొని వారు బఱ్ఱెలను వదలిపెట్టారు.

సంగటి తినని మా నాన్నకు మాత్రము ప్రత్యేకంగా వరి అన్నము తెప్పించి పెట్టేవారు శ్రీస్వామివారు.

సృష్టిలో నిర్ణయమైన ఎంత స్వల్పమైన వివరాలు కూడా సర్వజ్ఞమూర్తియైన శ్రీస్వామివారికి తెలియును అనే విషయమై పెనవర్తి గ్రామము, మోపూరు దశయ్యగారి చెల్లెలు వనమ్మ ఇలా చెపుతుంది:

ఒకరోజు అందరూ వినేటట్లు శ్రీస్వామివారు దశయ్యతో 'అయ్యా వనమ్మ వేరేబోతుంది. అప్పుడు అన్నీ మనమియ్యాలయ్యో' అన్నారు. భర్త పోయాక ఆమె తన అన్నగారింట్లో వుంది. ఇక ఆమె వేరే కాపురం పెట్టే ప్రసక్తేలేదు. శ్రీస్వామివారు అలా ఎందుకన్నారో ఎవరికీ అర్థం కాలేదు.

వారం రోజుల తర్వాత దశయ్యకు, వనమ్మకు మనస్పర్ధలు వచ్చి వనమ్మ అలిగి వాళ్ళ ఇంట్లోనే వేరే వంట చేసుకొని తింటుంది. పదార్థాలన్నీ దశయ్యగారివే. నాలుగవ రోజు దశయ్య కుమారుడు, వనమ్మ అలా వేరే వంట చేసుకు తింటే తాను అన్నమే ముట్టనని, 'మా నాయన మాటలు మరచిపోయి యథాప్రకారం కలిసి వుండాల'ని బ్రతిమలాడడంతో ఆమె

తిరిగి అందరితోటి కలిసి నివసించసాగింది. ఆ తర్వాత ఆమె శ్రీస్వామివారి దర్శనార్థం రాగానే శ్రీస్వామివారు 'వనమ్మ వేరే బోవడ మైపోయిందే.. మళ్ల మామూలేనే' అని పక పక నవ్వారు. శ్రీస్వామివారు సర్వజ్ఞులని అందరూ గుర్తించారు.


ఈ లీల ద్వారా శ్రీస్వామివారు మనకు మంచి బోధ చేస్తున్నారు. మన భవిష్యత్తు చాలా సూక్ష్మమైన అంశముల వరకు నిర్ణయించబడి వుంటుందని, ఎప్పుడు ఎవరు ఎవరితో తగాదాపడే విషయం వరకు, ఏ గింజ ఎవరి నోటిలో ఎలా పడాలి అనే విషయం వరకు నిర్ణయించబడి వుంటుందని కబీరు చెప్పిన వాక్యం నిజమని తెలుస్తుంది. కనుక ఆ సూక్ష్మాతి సూక్ష్మమైన నిర్ణయాలు శ్రీస్వామివారికి తెలుసు కనుకనే చెప్పగలిగారు. **ఎవరు ఏమి మాట్లాడినా, ఏమి చేసినా పూర్వం నిర్ణయించబడినట్లు మాత్రమే మాట్లాడగలరు, చేయగలరు. అంతకుమించి ఏ మార్పుగా కూడా ప్రవర్తించలేరు. ఒక్క సద్గురు సంకల్పంచే నడిపించబడువారు మాత్రమే గురుని సంకల్పానుసారం నడవగలరు. కనుక ఎవరేమన్నా, ఏమి ఇచ్చినా,** 13
**ఇవ్వకపోయినా దూషించినా, భూషించినా రాగద్వేష రహితులమై ఉదాసీన భావంతో శ్రీస్వామివారు చెప్పినట్లు 'నోరు విప్పకుండా వుంటే కర్మఫలితం క్షయించి సంసార చక్రము నుండి విముక్తులమవుతాము. శ్రీస్వామివారి కృపను పూర్ణముగా పొందగలము'. 'ఉదాసీనోగతవ్యథః' అన్నారు గదా!**

**ఓం నారాయణ - ఆదినారాయణ**

# అవధూత లీల

## అధ్యాయము - 5

## సర్వ సమర్థుడు



**అజ్ఞానం వలన దేహ పరిమితమైన మనకు మన దేహంలోని అన్ని అవయవాలు ఇంద్రియాలు కూడా మన అధీనంలో వుండవు. గురుకృప వలన దేహ భ్రాంతి నతిక్రమించిన శ్రీస్వామివారి వంటి జ్ఞానులు విశ్వమంతా తామేయై యుండడమేగాక పిపీలికాది బ్రహ్మపర్యంతం**
**14 సర్వమూ తమ యధీనములో నుంచుకొనగలరు. కనుకనే వారవసరమని తలచినప్పుడు మన కర్మ సూత్రాలను గూడా సడలించి భక్తరక్షణ గావించగల సర్వసమర్థులైయుంటారు. అయితే అట్టివారి కృపను పొందే విధంగా మన జీవిత విధానం నడుపుకోవాలి. ఆ విధంగా జీవించిన ధన్య జీవులెందరో అట్టివారి కృపకు పాత్రులయ్యారు.**

రోశిరెడ్డిగారు చాలా కాలంగా శ్రీస్వామివారి సేవకంకితమై ఇంటి ముఖం చూడకుండా శ్రీస్వామివారిని సేవిస్తున్నారు. వృద్ధాప్యంలో చూపు సరిగా లేకున్నా శ్రీస్వామివారి సేవ మానలేదు. ఎవరో అజ్ఞానులు 'ఈ ముసలాడు పనీపాటా లేకుండా దండుగ తిండి తింటున్నాడు' అని అన్నారట. అది విన్న రోశిరెడ్డి 'ఎందుకీబ్రతుకు ఇంత విషం మ్రింగి చచ్చినా మేలే!' అని అనుకున్నాడు మనసులో. ఆ రాత్రి శ్రీస్వామివారు రెడ్డిగారిని ఏకాంతంగా పిలచి మోకాళ్ళు వత్తించుకుంటూ, 'ఎవరో ఏదో అన్నారని పోవాలంటావా? భిక్ష తెచ్చుకొని తింటూ యిచ్చటనే వుండు' అని ఆదేశించారు. శ్రీస్వామివారి సర్వజ్ఞత్వం చూచి రెడ్డిగారు మరింత ఆశ్చర్యపడ్డారు.

మరొకప్పుడు 'ఐదు రోజులు అన్నం తినకుండా వుండేవారెవరో చూపు' అన్నారు శ్రీస్వామివారు. 'ఎవరో ఎందుకు? నేనే వుంటాను' అని ఐదు రోజులు ద్రవాహారంతో వున్నారు రోశిరెడ్డి. అది మొదలు కొన్నాళ్ళు శని, సోమవారాలు పూర్తిగా ఉపవాస ముండేవారు. మిగిలిన రోజులలో ఒక పూట మాత్రమే భోజనం చేసేవాడు. ఆ తర్వాత చాలా కాలం పూర్తిగా అన్నం

మాని అటుకులు, పాలు మాత్రం తీసుకుంటూ ప్రతిరోజూ భిక్ష తేవటం తన నియమంగా పెట్టుకొని ఆచరిస్తూ వుండేవారు. ఆయన శ్రీస్వామివారి సన్నిధి చేరుకున్నారు.

శ్రీస్వామివారు ఒకప్పుడన్నారు, 'వెంకయ్యది ఒకే మాట గదయ్యా!' అని. శ్రీస్వామివారి విషయం తరచి చూస్తే ఈ విషయం ఎంతగానో సరిపోతుంది.

రోశిరెడ్డి నిరంతరం తన భార్యాబిడ్డలను వదలి శ్రీస్వామివారి సేవలో గడుపుతూ శ్రద్ధగా శ్రీస్వామివారిని సేవిస్తూండేవారు. ఒకరోజు శ్రీస్వామివారు 'అయ్యా, మీ గ్రామం వెళ్ళి నిమ్మచెట్లు గుచ్చిపెట్టిరా' అన్నారు. రోశిరెడ్డి తన గ్రామం వెళ్ళి నిమ్మతోట వేయాలని ప్రయత్నిస్తే భార్యాబిడ్డలు అభ్యంతరం చెప్పారు. 'నీవు చెట్లునాటి నీ త్రోవన నీవు శ్రీస్వామివారి వద్దకు వెళ్ళిపోతే వాటికి నీరు, కంచె ఎవరు చూస్తారు? అది మా వల్ల కాదు. కనుక చెట్లు నాటవద్దు' అన్నారు. కానీ రోశిరెడ్డి గురువు మాటలయందు అచంచల విశ్వాసం గలవారు గనుక శ్రీస్వామివారు చెప్పినట్లు కొంత సొమ్ము అప్పు తెచ్చి నిమ్మ చెట్లు నాటి శ్రీస్వామివారిదగ్గరకు వచ్చారు. తర్వాతాయన భార్యాబిడ్డలు కంచెవేసి, నీరుపోసి చెట్లను బ్రతికించుకున్నారు. ఆ తోటను పెంచటం తమ శక్తికి మించిన పనిగా భావించి శ్రీస్వామివారిదగ్గరకు వచ్చి ఇలాంటి భారమైన పని మాపై ఎందుకు పెట్టావు స్వామీ? అని మొత్తుకున్నారు. అప్పుడు శ్రీస్వామివారు 'ఆ తోటకు అమ్మణ్ణి కాపలా వున్నది. అది ఒకటిన్నర లక్షల రూపాయల ఆస్తి. మీరు ఆ తోటలో కాపురముండి ఆ ప్రదేశానికి శిరిమెళ్ళ అనేపేరు పెట్టుకోండి!' అని చెప్పారు. వారు అయిష్టంగానే ఆ తోటను పెంచారు. ప్రస్తుతం శ్రీస్వామివారు చెప్పినట్లు ఆ తోట ఆ ప్రాంతంలోని తోటలన్నింటికంటే మెరుగైనది. ప్రస్తుతం ఆ తోటను మూడు లక్షలకు అడుగుతున్నారు. అయినా వీరు అమ్మదలచలేదు.

కలిచేడు వాస్తవ్యులు ఈశ్వరమ్మ (నరసారెడ్డిగారి భార్య) క్రొత్తగా ఇల్లు కట్టి శ్రీస్వామివారి పాదస్పర్శతో పవిత్రం చేసి గృహప్రవేశం చేయాలని శ్రీస్వామివారిని అర్థించింది. ఆయన సరేనన్నారు . కానీ ఆమెను పరీక్షించదలచి కాబోలు, మూడు నెలలు శ్రీస్వామివారు ఆ ప్రాంతానికే రాలేదు. శ్రీస్వామివారు రానందున గృహప్రవేశం చేయక శబరి వలె ఆమె శ్రీస్వామివారి

కొరకు నిరీక్షిస్తున్నది. ప్రస్తుతం ఇల్లు లేదు. గనుక తన సామానంతా బంకులో పెట్టి వర్షంవస్తే బంకు క్రింద మంచం వేసుకొని పడుకునేది. గ్రామస్తులంతా ఆమెను చూచి నవ్వుకున్నారు. ఆమె మాత్రం తన పట్టు విడువలేదు. శ్రీస్వామివారు ప్రక్క గ్రామంలో వున్నారని తెలిసి మరలా వెళ్ళి ఆహ్వానించింది. 'రేపు సూర్యోదయ కాలం బాగున్నది. నేను వస్తాను. గృహప్రవేశం చేయమ'న్నారు శ్రీస్వామివారు. ఇంతకొద్ది వ్యవధిలో సంబారాలు సమకూర్చుకొనలేను స్వామీ! అన్నది ఆమె. 'అన్నీ అవే వస్తాయిపో!' అన్నారు శ్రీస్వామివారు. ఆమె ఆ రాత్రి ఇంటికి సున్నం వేయటం, అలికి ముగ్గులు పెట్టే ప్రయత్నంలో వున్నది. అనుకోకుండా వారికి ఎన్నాళ్ళనుండో బాకీవున్న కూలీలు తమవద్ద డబ్బుకు బదులు బియ్యము వున్నాయని, బాకీలోకి జమవేసుకోమనీ బియ్యము, కొంత పైకమూ ఇచ్చి వెళ్ళారు. అప్పుచేసే బాధ తీరింది. ఆ రాత్రి శ్రీస్వామివారు తమ శిష్యులతో తెల్లవార్లూ త్రోవల వెంబడి నడచి, అయిదు గ్రామాలలో తిరిగి, వేకువ ఝాము మూడు గంటలకు ఆమె ఇంటికి వచ్చారు. శ్రీస్వామివారు స్వహస్తాలతో కర్పూరం వెలిగించి పొయ్యి మంటవేశారు. ఆమె పదిశేర్లు బియ్యం వండింది. తన స్నేహితురాలు తనకు 200 విస్తరాకులు ఇచ్చింది. వాటిని బంతికి వాడితే సరిగ్గా రెండు వందలూ అయిపోయాయి. వంటకాలు గూడా ఖాళీ అయ్యాయి. శ్రీస్వామివారికి ఆమెకూ మాత్రం అన్నంలేదు. బెల్లం పొంగలి మరచిపోయి ప్రక్కన పెట్టి వుంటే, అదే శ్రీస్వామివారికి నైవేద్యంగా సమర్పించి, గురూచ్ఛిష్టంగా ఆమె కూడా కొంత తీసుకున్నది. పది కిలోల బియ్యంతో రెండు వందలమందికి సంతర్పణ చేయించారు శ్రీస్వామివారు!

పూసల మీరయ్య (పెనవర్తి) ప్రస్తుతం బెంగుళూరులో పని చేస్తున్నారు. వీరి భార్య శ్రీస్వామివారి ప్రథమ ఆరాధనకు గొలగమూడికి వచ్చింది. శ్రీస్వామివారి నిత్యపూజ కొరకు భక్తులు ప్రతినెలా కొంత దక్షిణ పంపే పథకం ఏర్పాటు చేసియున్నందున దానికి తాను ప్రతినెలా రూ.10/- లు పంపుతానని తన భర్తపేరు వ్రాయించింది. కానీ తరువాత 'స్వామీ, మావారి అనుమతి లేకుండానే వ్రాయించాను. వారు కూడా సమ్మతించి పైకం తమకు పంపేటట్లు చేయండి' అని ప్రార్థించింది. ఆమె ఇంటికి వెళ్ళి తన భర్తకు శ్రీస్వామివారికిస్తానన్న దక్షిణ విషయం చెప్పింది. కానీ ఆయన 'శ్రీస్వామివారు

నన్నే అడిగితే ఇస్తాను' అన్నాడు.

కొన్నాళ్ళకు శ్రీస్వామివారు అతనికి జోలె వేసుకొని స్వప్న దర్శనమిచ్చి, 'ఏమైనా వేయమ'ని అడుగుతున్నారు. 'ఏమి వెయ్యమంటారు, స్వామీ?' అంటే 'ఏది వుంటే అది వెయ్యి' అన్నారు. తరువాత ఈ భక్తుడు ఇంతకు ముందు నెలలకు తాను దక్షిణగా పంపవలసిన మొత్తం పైకం శ్రీస్వామివారికి సమర్పించి శ్రీస్వామివారి సమాధిని దర్శించారు.

పల్లంరెడ్డి కృష్ణారెడ్డిగారు (సంగం) ఒకప్పుడు వినాయక చవితి శ్రీస్వామివారి సన్నిధిలో చేసుకోవలెనని గొలగమూడికి వచ్చి ఒక కిలో శెనగగుగ్గిళ్ళు, రెండు కిలోల బియ్యంతో బెల్లం పొంగలి, ఒక కిలో మినపప్పు వడలు చేయించారు.

ప్రతిరోజు శ్రీస్వామివారి సేవకుడు అనికేపల్లికి పోయి మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో భిక్షాన్నం తీసుకురావటం అలవాటు. కానీ ఆ రోజు బస్సు తప్పిపోయి భిక్షకు వెళ్ళిన మనిషి రాలేదు. అప్పుడు పొంగలి ఉడుకుతోంది. శ్రీస్వామివారు కొంచెం అన్నం తెమ్మన్నారు. 'స్వామీ! అన్నం లేదు. పొంగలి ఉడుకుతున్నది' అంటే 'పరవాలేదు తీసుకురా' అన్నారు. సుండలు, పొంగలి, వడలు విస్తరిలో శ్రీస్వామివారికి సమర్పించారు. శ్రీస్వామివారు కొంచెం తిని, 'ఇక మీరు తినండయ్యా!' అని ఇచ్చేశారు. భిక్షాన్నానికి వెళ్లిన మనిషి రానందున కృష్ణారెడ్డిగారు చేయించిన ప్రసాదం 25 మంది ముక్కమునగా తినగా ఇంకా తెల్లవారికి మిగిలింది. ఏసుక్రీస్తు ఏడు రొట్టె ముక్కలు, ఏడు చేపలు ఏడు వేలమంది పురుషులు, స్త్రీలు, పిల్లలకు పంచగా ఏడు గంపల నిండా ముక్కలు మిగిలినట్లున్నది కదా! (మత్తయి 14 : 17 – 21)

వీరు ఒకరోజు శ్రీస్వామివారిని గొలగమూడిలో సేవించుకొని ఇంటికి వెళ్ళేందుకు శెలవు కోరారు. శ్రీస్వామివారు 'నేను కూడ వస్తుండ్లాయ్యా' అన్నారు. శ్రీస్వామివారిని తమ ఇంటికి తీసుకు వెళ్ళేందుకు రెడ్డిగారికొక ఇబ్బంది వుంది. సాధుసత్పురుషులకు ఆతిథ్యం ఇవ్వడం వారి ఇంట్లో వుండే ముసలాయనకు గిట్టదు. ఒకవేళ తీసుకుపోతే ఆయన శ్రీస్వామివారిని తూలనాడుతుంటే నిస్సహాయంగా మాట్లాడకుండా వుండాలి. కనుక

శ్రీస్వామివారిని తీసుకువెళ్ళి నాలుగు మాటలు పెట్టించేకంటే ఊరకుండటం మేలు. కానీ 'స్వామీ! మీరు మా ఇంటికి రావద్దు' అని ఎలా చెప్పగలడు. మనసులో మదన పడుతున్నాడు. వెంటనే సర్వజ్ఞమూర్తి, 'ఎప్పుడైనా వస్తుండ్లాయ్యా' అన్నారు. దాంతో రెడ్డిగారు మరొక్కప్పుడు చూస్తాంలే అని వెళ్ళిపోయారు.

1982లో శ్రీస్వామివారు మహాసమాధి చెందారు. 1986 ఏప్రిల్ నెలలో ఆ రెడ్డిగారింట్లో వున్న ముసలాయన పరమపదించారు. ఆ ముసలాయనకు 15వ రోజు పెద్దకర్మ చేస్తూ బంధువులను, బీద సాదలను భోజనాలకు పిలిచారు. 170 కిలోల బియ్యంతో సుమారు ఐదు వందల (170 × 3 = 510) మందికి భోజనాలు సిద్ధం చేయించారు. స్వామి పటానికి కర్పూరహారతిచ్చి వడ్డన సాగించబోయే సమయంలో వారి గ్రామంలోని ఒక సాధువు వారింటికి వచ్చారు. వెంటనే రెడ్డిగారు కర్పూరహారతి పనిని నిలిపివేసి శ్రీస్వామివారు వచ్చారు అన్నం పెట్టండి ముందు అని హారతికి ముందే వారికి భోజనము పెట్టి పంపించారు. అటు తర్వాత శ్రీస్వామివారి పటానికి హారతిచ్చి అందరికీ వడ్డన సాగించారు.

అనుకున్న దానికంటే రెట్టింపు జనం రావడంతో అన్నం, కూరలు చాలవేమోనని, అప్పుడు వండితే అకాలమౌతుందని రెడ్డిగారు చాలా గాబరా పడ్డారు. పనిబాటలవాళ్ళ ఇండ్లకు కూడా అన్నం ఇవ్వకుండా నిలిపేశారు.

కానీ 500 మందికి తయారు చేసిన భోజనాలు వెయ్యి మందికి పైగా భోంచేసారు. పోగా పదిగంపల అన్నం, దానికి తగ్గ కూరలు 400 మందికి సరిపోయే విధంగా మిగిలిపోయాయి. ఈ అద్భుతం చూచిన క్రిష్ణారెడ్డిగార్కి వాస్తవం మెరుపులా స్ఫురించింది. పూర్వం శ్రీస్వామివారు 'ఏ పొద్దయినా వస్తుండ్లాయ్యా!' అన్నమాటను ఈనాడు ఈ సాధువు రూపంలో వచ్చి భోంచేసి తన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నారని తెలుసుకున్నాడు.

క్రిష్ణారెడ్డిగారు శ్రీస్వామివారిని హృదయ పూర్వకంగా సేవించేందుకు, ఏ ముసలాయన ఐతే అడ్డంగా వున్నారో, ఆయన మరణించాకనే శ్రీస్వామివారు వచ్చి వారి సేవలందుకొని సకల సాధు సత్పురుషులూ తన రూపమేనని నిరూపించారు.

అలనాడు ఏసుక్రీస్తు 7 చేపలతో 7 వేల మందికి భోజనం పెట్టగా ఇంకా ఏడు గంపల కూర మిగిలినట్లుంది గదా ఈ లీల!

**మనం శ్రీస్వామివారిని హృదయ పూర్వకంగా సేవిస్తూ మన సర్వభారములు ఆయన పై పడవేసి విశ్రాంతిగా వుంటే వారే మన బాధ్యతలన్నీ ఎలా వహిస్తారో ఈ క్రింది లీలల ద్వారా తెలుస్తుంది. వారు 15**
**మనలనే కాకుండా మన వారందరి బాధ్యతలు సర్వజ్ఞుడుగా, సర్వ వ్యాపిగా, సర్వ సమర్థుడుగా వారే నెరవేర్చడం చూస్తాము.**

చాలా కాలంగా శ్రీస్వామివారి సేవలో వున్నారు రోశిరెడ్డిగారు. ఒకనాడు శ్రీస్వామివారు 'మీ చిన్న కుమారుని పేర చీటి వ్రాసి ఇవ్వు' అని రోశిరెడ్డిని తొందర చేశారు. ఆయన వ్రాసి ఇచ్చిన చీటీని శ్రీస్వామివారు తన తొడ క్రింద పెట్టుకొని కూర్చున్నారు. తన కుమారుని ఏదో ఆపద నుండి రక్షిస్తున్నారని అనుకున్నాడేగానీ ఏమైనదీ తెలియలేదు. మూడవనాడు ఎవరి పిలుపు లేకుండా రాజంపేట తాలూకా నుండి తన కుమారుడు శ్రీస్వామివారి దర్శనార్థం వచ్చాడు. నిండు బరువు బండి, రాజం పేట దగ్గర, కొండ నెక్కుచూ ఎద్దులు అనికేసుకొని బండి నిలిపే వీలులేక వెనుకకు దొర్లుతూ 40 అడుగుల లోతు నిట్టనిలువు కొండచరియ వెంబడి వాగులో పడిపోయింది. బండి, ఎద్దులు, మనిషికీ ఏ మాత్రం దెబ్బ తగులలేదు. ఇది కేవలం శ్రీస్వామివారి కృపయని శ్రీస్వామివారికి కృతజ్ఞతలు తెల్పి వెళ్ళడానికే తాను వచ్చానని చెప్పాడు. శ్రీస్వామివారు చీటి వ్రాయించిన సమయంలోనే అచ్చట ప్రమాదం జరగడం అందరినీ ఆశ్చర్యపరచటమే గాక శ్రీస్వామివారు సర్వాంతర్యామి, సర్వవ్యాపకుడు, సర్వ సమర్థుడు అని అందరికీ నిరూపణ అయింది.

ఉమెన్స్ లైబ్రరీలో పనిచేసే జయమ్మగారి భర్త జయచంద్రారెడ్డి షిర్డి సాయిబాబా భక్తులు. వీరు తనకు శ్రీస్వామివారు ప్రసాదించిన ప్రథమ దర్శనం గురించి ఇలా చెపుతున్నారు.

"శ్రీస్వామివారిని గూర్చి 'శ్రీ సాయి లీలామృతం' లో చదివాను. కాని శ్రీస్వామివారిని దర్శించలేదు. వారి మండలారాధన రోజుకూడా తెలియదు. సరిగ్గా ఆ ముందురోజు నాకొక వింతైన స్వప్నమొచ్చింది. నెల్లూరులో

గాంధీబొమ్మ దగ్గర నాకొక అపరిచితుడయిన పెద్దాయన కనిపించి నెల్లూరు ప్రాంతంలో గొలగమూడిలో నున్న అవధూతగారిని చూచావా? చూడకుంటే దర్శించు, నెల్లూరుకు దక్షిణంగా పో! అక్కడ మిలటరీ వాళ్ళు నీకు మార్గం చెప్తారు అని చెప్పాడు. నేను స్వప్నంలోనే అవధూతగారి దర్శనార్థంపోతూ, వేదాయపాలెం సమీపంలో మిలటరీవాళ్ళ గుడారాలు చూచి, అక్కడ సెంట్రీని గొలగమూడికి మార్గమడిగి తెలుసుకున్నాను. గొలగమూడికి వస్తున్నాను. కొండాయపాళెం దాటాకా ఒక సన్నని మనిషి గోచి పెట్టుకొని, కర్ర, ఒక ముంత చేతబట్టుకొని వున్నాడు. పాత గుడ్డలు, కొన్ని వస్తువులను చిన్న చిన్న మూటలుగా కట్టి ఆ మూటలను దండవలె మెడకేసుకొని యున్నారు. వీరే స్వామి అనిపించింది. సాష్టాంగదండ ప్రణామం చేశాను. స్వప్నం అంతమైంది. తెల్లవారి నా స్నేహితులు, 'శ్రీస్వామివారి మండలారాధనకు పోతున్నాము, రమ్మని' పిలువగా గొలగమూడి వచ్చి శ్రీస్వామివారి సమాధిని, ధునిని పూజించుకోవడమే గాక మా గురువుగారైన భరద్వాజ మాష్టరుగారిని దర్శించుకున్నాను." ఈ విధంగా తన భక్తుని తన మండలారాధనకు రప్పించుకున్నారు సర్వజ్ఞమూర్తి. వెయ్యి గొర్రెలలో నున్నా మన గొర్రెను కాలుబట్టి లాక్కువస్తానని చెప్పియున్నారు గదా శ్రీస్వామివారు.

గొలగమూడి వాస్తవ్యులు తూపిలి వెంకయ్య కుమార్తెఉమామహేశ్వరిని అనికేపల్లిలో ఇచ్చారు. అనేక కారణాల వలన భర్త ఏలుకోలేదు. పోగా విడాకులు వ్రాసివ్వమని వత్తిడి తెచ్చాడు. చాలా ఘోరంగా కొట్టేవాడు, తిట్టేవాడు. వీధిలోకి పిలిచి తన భార్య ఉమను పెద్దమనుషుల ఎదుట విచారణ జరిపించాడు. చివరకు ఆమె వేసారి విడాకులు వ్రాసిచ్చింది. మంగళసూత్రం తీసివేసింది. అది మొదలు పిచ్చెమ్మ తన కొమార్తె (ఉమ)ను స్వామివారి ఆశ్రమంలో సేవ చేయడానికి తులశవ్వకు అప్పగించింది. ఆ మహాభక్తురాలి సహచర్యంలో ఉమ భగ్న హృదయంతో తన సర్వస్వం స్వామియే అని ఒక్క సంవత్సరం సేవ చేసింది. తిరిగి మరొకరికిచ్చి వివాహం చేస్తామన్నా వద్దని నిరాకరించింది. ఈలోగా ఎందరు చెప్పినా మంగళసూత్రం ధరించలేదు. 'నాకు భర్తలేదు, పోండి' అని కేకలేసేది. తులశవ్వ ఈమె మంగళసూత్రం తెప్పించి స్వామివారి ఆసనం క్రింద పెట్టించింది. స్వామికృప చేతనైనా మెడలో ధరిస్తుందని ఆమె భావం. కాని చిత్రంగా శ్రీస్వామివారు భార్యభర్తల మనసులు

మార్పు చేశారు. ఒకరిపై ఒకరికి మరులు కలిగేటట్లు చేశారు. భర్త పిలిస్తే కాపురం చేస్తానని ఉమ, భార్య వస్తే ఏలుకుంటానని భర్త ఒకరికొకరు మధ్యవర్తుల ద్వారా వార్త పంపుకున్నారు. ఒక శుభ ముహూర్తమున ఎవరి ప్రమేయమూ లేకుండానే ఉమ శ్రీస్వామివారి సేవకుడు గురవయ్యనడిగి, తన మంగళసూత్రం తీసుకొని మెడలో ధరించి తల్లికి కూడా చెప్పకుండా రెండు మైళ్ళు దూరంలో నున్న అనికేపల్లిలోని భర్త దగ్గరకు వెళ్ళింది. భార్య వచ్చిందే పదివేలని భర్త ఆదరంతో స్వీకరించాడు. ఇప్పుడు ఉమకు ఇద్దరు ఆడబిడ్డలు కలిగారు. చిలకా గోరింకల్లాగ కాపురం చేస్తున్నారు. సర్వ ప్రేరకుడైన సద్గురునకు మాత్రమే ఇట్టి చిత్రమైన సన్నివేశాలను కూర్చడం సాధ్యముగదా!

ఒకప్పుడు శ్రీస్వామివారు పెన్నకు ఆవలి గట్టున విడిది చేసి యున్నారని భక్తురాలు వక్కెమ్మకు తెలిసింది. ఆతృతగా శ్రీస్వామివారి దర్శనార్థం బయలుదేరింది. ఏటిలో నీళ్ళు లోతుగా పారుతున్నాయని, పోవద్దనీ మిత్రులు సలహా ఇచ్చారు. అది విని 'పోలేకున్నాను గదా' అని ఏడ్చుకున్నది. చివరకు ఆమెకు శ్రీస్వామివారి చెంతకు వెళ్ళిపోవాలని తీవ్రంగా అనిపించి వెళ్ళిపోయింది. ఏటిలో పోతుంటే నీరు చీలమండలం వరకే వున్నవి. 'ఆ చెప్పినాయన ఎందుకబ్బా ఇట్లా అబద్ధం చెప్పాడు?' అని ఆమె అనుకున్నది. కాని ఆమె శ్రీస్వామివారి దగ్గరకు వెళ్ళినప్పుడు సేవకులు, 'నీవు ఏరు దాటి ఎలా వచ్చావు?' అని ఆశ్చర్యంతో అడిగారు. నిజంగానే ఏరు నిండుగా పారుతున్నదనీ, శ్రీస్వామివారి మహాత్మ్యం వలననే నీరు లేనట్లయిందనీ అప్పుడు ఆమెకు అర్థమైంది.

కన్నవరం రాజయ్యకు 1982లో నీరసం, గుండె దడ, అవ్యక్తమైన భయము వుండేవి. నెల్లూరులో డాక్టరుకు చూపించాలనుకున్నాడు. శ్రీస్వామివారిపటానికి మొర పెట్టుకొంటున్నాడు. ఆ భావావేశంలో వెక్కి వెక్కి ఏడ్చేశాడు. తెల్లవారి నెల్లూరు వెళ్ళి ఇంజక్షన్ తీసుకుంటే ఇంటి కొచ్చేసరికి రియాక్షన్ ఇచ్చింది. వారిని శ్రీస్వామివారి దగ్గరకు తీసుకువచ్చి, వంటికి విభూతి పూసి కొంత తినిపించి వెంటనే కారులో నెల్లూరు తీసుకుపోతున్నారు. కారుకు ముందు పదిబారల దూరంలో 'చేతిలో దుత్త, పంగాలకర్ర ధరించి శ్రీస్వామివారు పోతున్నారు చూడండి!' అని అందరికీ చెపుతున్నాడు రాజయ్య. కాని ఆయనకు తప్ప మరెవ్వరికీ స్వామి కనబడడం లేదు! ఆసుపత్రి టైము

అయిపోయింది. గనుక డాక్టర్లు వుండరనుకున్నారు. కానీ ఒక గంటకు ముందే వెళ్ళిపోవలసిన డాక్టరు ఒంటరిగా కుర్చీలో కూర్చొనియున్నాడు. ఈయనకు ఇంజక్షన్, మందూ ఇచ్చి ఇలా చెప్పాడు. 'ఎప్పుడో ఇంటికి పోవలసింది. నేనెందుకు ఇలా కూర్చోనుండిపోయానో నాకే తెలియదు! మీ కొరకే దేవుడు ఇలా కూర్చోబెట్టాడేమో!' అన్నాడు.

1981లో వెంకటమునిరెడ్డి (తిరుపతి) గారి స్నేహితుడు వి. బోడయ్య శ్రీస్వామివారి మహిమను గూర్చి విన్నారు. తరువాత అతనికి కొన్ని నెలలు టైఫాయిడ్ వల్ల చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. పద్దెనిమిది రోజులు అతడికి అన్నం పెట్టలేదు. డాక్టరుగారు ఇక లాభం లేదని రాయవేలూరు, సి.యం. ఆసుపత్రికి పొమ్మని చెప్పారు. బోడయ్య చాలా బీదవాడు. సి.యం. ఆసుపత్రికి పోయే శక్తి లేదు. కనుక చాలా దిగులు పడ్డాడు. అప్పుడు తన స్నేహితుని నుండి విన్న వెంకయ్యస్వామి గుర్తుకు వచ్చి మనసులోనే తన బాధను వారితో విన్నవించుకున్నాడు. వెంటనే శ్రీస్వామివారు భౌతికంగా ఇతని మంచం దగ్గర కనిపించి, 'నీకేమీపరవాలేదు,మూడురోజుల్లో తగ్గుతుంది' అని చెప్పి అదృశ్యమయ్యారు. వెంటనే బోడయ్యకు ఎక్కడలేని శక్తివచ్చి డాక్టరుకు చెప్పకుండానే 18 మైళ్ళు దూరం అర్ధరాత్రి నడిచి తన స్వగ్రామం చేరుకున్నాడు. నాటి నుండి ఏ చికిత్సా లేకుండా స్వస్థుడైనాడు. తరువాత ఒకవారం రోజులకు శ్రీస్వామివారిని దర్శించి తన చిత్రమైన అనుభవం గూర్చి అందరికీ చెప్పాడు.

ఒకరోజు తలుపూరు, నారాయణదాసు ఆశ్రమంలో వుండగా శ్రీస్వామివారు 'అయ్యా! పై వాళ్ళంతా వచ్చి పెంచలకోనలో మీటింగు పెట్టుకొనియున్నారు. పెంచలయ్య వాళ్ళకేమీ జవాబు చెప్పలేక మనలను రమ్మని మూడునాళ్ళ నుండి తిరుగుతున్నాడు. మనమీరోజుపోయి ఎవరికి చెప్పేమాట వాళ్ళకు సరిచెప్పి పెంచలయ్యకు ఎలాంటి ఆటంకము లేకుండా చేసి రావాలి గనుక ప్రయాణం కమ్మని' తన బృందాన్ని తీసుకొని పెంచలకోన చేరారు. దేవాలయం ముందు కూర్చొని రాత్రి 8 గంటల నుండి వేకువఝామున 5 గంటల వరకు మన కంటికి కనబడని వ్యక్తులతో మాట్లాడుతున్నారు. ఆ మాటలకర్థం మనకు తెలియదు. చివరకు 'అయ్యా! ఎవరికి చెప్పవలసిన మాట వాళ్ళకు చెప్పాము. పెంచలయ్యకు పీకులాట తప్పింది. ఇక పదండి' అని తన బృందాన్ని ప్రయాణం చేశారు.

ఆ రోజు బుధవారము, ఒక శని, ఆదివారములు తప్ప మిగిలిన రోజులలో బస్సు పెంచలకోనలోకి ఆ రోజులలో వచ్చేదిలేదు. ఆ విషయం శ్రీస్వామివారికి చెపితే బస్సు వస్తుంది మీరు త్వరగా ప్రయాణం కమ్మని మూటలు సిద్ధం చేయించారు. 15 నిమిషాలలో నిజంగానే బస్సు వచ్చింది.

ఈ రోజు బుధవారం గదా బస్సెందుకు తీసుకొచ్చారని డ్రైవరు నడిగితే 'గోనుపల్లె నుండి కదిలి పది బారలు వెళ్ళాక దేవుణ్ణి చూచి రావాలనిపించి బస్సు వెనుకకు త్రిప్పి తీసుకువచ్చాము. శ్రీ వెంకయ్యస్వామివారిని తీసుకుపోయేందుకే భగవంతుడు అలా చేసి వుంటాడు' అని చెప్పారు. శ్రీ వెంకయ్యస్వామివారు సంకల్పసిద్ధులని ఆ డ్రైవరు గుర్తించినట్లు లేదు.

ఇదే విధంగానే కలువాయి రూట్‌లో శ్రీస్వామి వాళ్ళు నాలుగు బారల దూరంలో వస్తుంటే డ్రైవరు వీళ్లను చూచి కూడ బస్సు నిలుపలేదు. పదిబారలు వెళ్ళాక బస్సు అకారణంగా ఆగిపోయింది. శ్రీస్వామి బృందం బస్సు ఎక్కగానే తిరిగి బస్సు సలక్షణంగా కదలిపోయింది.

**మహనీయులు తమ కృపను చిత్రమైన రీతులలో ప్రసరింపచేస్తారు. వారి మాటలు వారు చేస్తున్న పనులు అజ్ఞానులమైన మనకు అర్థరహితాలుగా కనిపిస్తాయి. కానీ వారి మాటలయందు అచంచల** 16
**విశ్వాసం గల్గి, వారెప్పుడూ తమాషా మాటలు మాట్లాడరని ఎరిగినవారు వారి మాటలను యథాతథంగా ఆచరించి ఎనలేని మేలును పొందుతారు. అలా ఆచరించని వారు కృపను పొందలేరు.**

ఒకప్పుడు కొట్టకూటి బుజ్జయ్యగారు కొన్ని కోర్టు కేసులతోను, తండ్రిగారి అనారోగ్యాన్ని గురించి, ఆలోచిస్తున్నందున మనసు చికాకుగా వుండి శాంతి కొరకు శ్రీస్వామివారి చెంతకొచ్చి అల్లంత దూరాన నిలుచున్నారు. వీరేమీ చెప్పుకొనక ముందే శ్రీస్వామివారు 'అయ్యా! మనసులో ఏమీ పెట్టుకోకుండా చకచకా ఇంటికిపో, అన్నీ నేను చూసుకుంటాను' అని అభయమిచ్చారు. అదేవిధంగా బుజ్జయ్యగారు వెళ్ళిపోయారు. శ్రీస్వామివారు చెప్పినట్లే అన్నీ చక్కబడి పోయాయి.

ఆ తరువాత కొన్నాళ్ళకు బుజ్జయ్యగారు తన బావగారు క్రిమినల్ కేసులో చిక్కి కోర్టుకు తిరిగేటప్పుడు ఆ కేసులో సహాయం చేయమని

శ్రీస్వామివారికి విన్నవించుకున్నారు, అప్పుడు శ్రీస్వామివారు 'అయ్యా! కొండాయపాళెం దాకా బస్సులోపోయి, అక్కడ నుండి నడచి నెల్లూరుకుపోయి కేసుకు సంబంధించిన విషయాలు మాట్లాడి, నెల్లూరు రంగనాయకుల దేవస్థానంలో పూజ చేయించి మధ్యాహ్నం 12 గంటలకు తిరిగివచ్చేయ్' అని ఆజ్ఞాపించారు.

శ్రీస్వామివారి మాటయందు ధృఢమైన విశ్వాసంగల బుజ్జయ్యగారు అదేవిధంగా బస్సులోను, నడచి కొంత దూరము పోయి కేసు విషయం మాట్లాడి రంగనాయకుల దేవస్థానంలో పూజ చేయించి త్వరత్వరగా నడచి వస్తున్నారు. బస్సులేదు. పరుగెత్తి వచ్చినాగాని 12 గంటలకు గొలగమూడి చేరే అవకాశమే లేదు. శ్రీస్వామివారిని స్మరిస్తూ త్వరత్వరగా నడుస్తున్నాడు. ఫత్తేఖాన్‌పేట దగ్గర ఒక మిత్రుడు కనిపించి పలుకరించి విషయం తెలుసుకొని వెంటనే తాను మానుకున్న ప్రభుత్వ క్యాంపును తిరిగివేసుకొని కారు తీసుకొని బయలుదేరి బుజ్జయ్యగార్ని కూడా కలుపుకొని, కారులో ఎక్కించుకొని గొలగమూడి సమీపంలో వదలి వెళ్ళిపోయారు. 12 గంటలకు ముందుగానే శ్రీస్వామివారి చెంతకు చేరాడు.

కేసులన్నీ మంచువలె కరిగిపోయాయి. నెల్లూరు నుంచి పరుగెత్తి వచ్చినా 12 గంటలకు రాలేడు కానీ శ్రీస్వామివారి మాటయందు పూర్ణ విశ్వాసం వుంచాడు గనుకనే వారి మిత్రులు వారిని కారులో తీసుకువచ్చి సకాలంలో చేరేటట్లు శ్రీస్వామియే ఏర్పాటు గావించారు. తన భక్తుని భారం తనదని గదా శ్రీస్వామివారు చెప్పింది.

**శ్రీస్వామివారు కొన్ని కొన్ని పనులు చేయించే పద్దతి చాలా చిత్రంగా వుంటుంది. ఖచ్చితంగా ఫలానా టైంలోనే చేయమనడం, ఫలానా**
17 **దేవాలయంలో పూజ చేయించి ఫలానా వాళ్ళతో మాట్లాడి రమ్మని చెప్పడం చూస్తే అజ్ఞానమనే అంధత్వంలోనున్న మనకేమీ తెలియకపోగా అది వారి పిచ్చిపద్ధతి అని భ్రమిస్తాము.**

అప్పుడు కొండాయపాళెం దొరతోటలో కాపురమున్న దొడ్లరామిరెడ్డిగారు తాను కోర్టులో కేసు గెలిచాక శ్రీస్వామివారికి మ్రొక్కుబడి పెట్టుకున్న ప్రకారం చెల్లించాలని 'స్వామీ! మీ దయవలన కేసు గెలిచాను. ఏదైనా గట్టి ఇల్లు


మీకు కట్టించాలనుకొన్నాను. ఎచ్చట కట్టమంటారు. ఎలా కట్టమంటారో తెల్పండి' అని ప్రార్థించాడు. శ్రీస్వామివారు 'నాకు ఇల్లు వద్దు గానీ ఆంజనేయస్వామి గుడికి ప్రహరీ కట్టించు' అన్నారు. ఆ భక్తుడు సరేనని వెళ్లాడుగానీ చాలా రోజుల వరకు పనిచేయించలేదు.

శ్రీస్వామివారు ఒకరోజు కొట్టకూటి బుజ్జయ్యను, కాటంరెడ్డి సుబ్బరామిరెడ్డిని పిలిచి 'అయ్యా, మీరు రాత్రి రెండు గంటలకు బయలుదేరి నడచిపోయి ఆయన ఆంజనేయస్వామి గుడికి ప్రహరీగోడ కట్టిస్తానన్నాడు. ఆ విషయం మాట్లాడి రండి' అని ఆజ్ఞాపించారు. శ్రీస్వామివారి మాటల ఎడల అచంచల విశ్వాసం గల ఈ భక్తులు అదేవిధంగా రెండు గంటలకు లేచి 6 మైళ్ళు నడచి వెళ్ళి దొడ్ల రామిరెడ్డిగారిని నిద్రలేపి విషయం చెప్పారు. 'నాకు ఇంకా కొన్ని కోర్టు కేసులున్నవి. అవి కూడా పూర్తయితే కట్టిస్తాను. శ్రీస్వామివారు పంపారు గనుక రూ. 400/- లు ఇస్తాను. మీరు మిగిలిన పైకం చందాలు దండి కట్టించండి' అని చెప్పారు. 'మేము శ్రీస్వామివారు చెప్పినట్లు చేస్తాము. ఈ పైకం మీకు వాపసు చేయమంటే మరలా తెచ్చి ఇచ్చేస్తాము. అందుకు సమ్మతమైతే ఇవ్వండి' అన్నారు బుజ్జయ్యగారు. అందులకు సమ్మతించి వారు నాలుగు వందల రూపాయలు ఇచ్చి పంపారు. ఈ విషయం శ్రీస్వామివారికి చెపితే, 'ఆయనే వచ్చి కట్టిస్తాడులేయ్యా మీరు పని మొదలు పెట్టండి' అన్నారు. శ్రీస్వామివారి ఆజ్ఞమేరకు గోడపని ఒకరికి కాంట్రాక్టుకు ఇచ్చి నిదానంగా పని జరుపుతున్నారు. 4వ రోజు రామిరెడ్డిగారే వచ్చి పని చూచాక ఆయన మనస్సును శ్రీస్వామివారు ఎలా మార్చారో ఏమో 'మిగిలిన పైకం కూడా నేనే పంపుతాను. ఎక్కువ మంది మనుష్యులను పెట్టి త్వరగా పని పూర్తిచేయమని' చెప్పి వెళ్ళాడు. అటు తరువాతాయన ఒక్కరే ఆ ప్రహరీ ఖర్చంతా భరించి శాశ్వతంగా గోడ నిర్మించారు. రాత్రి రెండు గంటల వేళ ఇద్దరు మనుష్యులను నడచి వెళ్ళమని చెప్పడంలో అంతరార్థం స్వామివారికే తెలియాలి!

# అవధూత లీల

## అధ్యాయము - 6

## భూతనియంత



నిర్మలం, నిష్కలం, నిత్యం, నిర్వికల్పం, నిరంజనం అయినట్టి ఆ పరమాత్మ తాను అనేకమవ్వాలనే దివ్య సంకల్పంతో ధరించిన రూపమే ఈ స్థూలజగత్తు. మన శరీరం మనస్సుకధీనమైనట్లు, మన మనస్సు ఆత్మకధీనము. సద్గురువు త్రిమూర్త్యాత్మకుడైన సాక్షాత్తు పరబ్రహ్మమే గనుక ఈ విశ్వమంతా వారి అధీనమై ఉంటుంది. **ఈ విషయం సద్గురువు ద్వారా
ప్రకటమయ్యే దివ్యలీలల ద్వారా భక్తులకు తెలుస్తుంది. అనంతమైన ఈ
18 ప్రకృతిని శాసించగల సద్గురువు సామర్థ్యమును చవిచూచిన భక్తులకు,
గురువు యందు విశ్వాసం ధృఢపడి శ్రద్ధాభక్తులతో వారిని సేవించి
తరించగలరు.**

మనజీవిత సంఘటనలను శాసించగల దైవశక్తి ఒకటున్నదన్న విశ్వాసం మనకు కల్గించాలని, తద్వారా నిత్య జీవితములో వివేకము, వైరాగ్యము గల్గి ధార్మిక జీవితము త్రికరణ శుద్ధిగా మనచేత ఆచరింపజేయాలనే సద్గురుని యొక్క తపనే ఇట్టి లీలలకు మూలము.

**వారు మన నుంచి ఆశించునది అట్టి పవిత్ర జీవన విధానమే.
మనం అలా జీవించినప్పుడే మనం నిజంగా వారికి దక్షిణ సమర్పించిన
19 వారమవుతాము. అలా చేయనప్పుడు లీలా రూపంలో మనపై వర్షించిన
సద్గురుకృప అడవిగాచిన వెన్నెలవలె వ్యర్థమగును.**

ఒకప్పుడు శ్రీస్వామివారు తలుపూరులోని శివాలయంలో వేంచేశారు. ఒకే ఒక భక్తుడు వారికి తోడు వున్నాడు (శెట్టిగారు). మేఘావృతమై కొద్దిచినుకులు, చీకట్లు, ప్రళయమువలె ఉరుములు వచ్చినవి. శ్రీస్వామివారిని లోనికి తీసికెళ్ళడానికి ఎవరూ లేరు. వర్షమొస్తే తడుస్తారు అని ఆ భక్తుడు భయపడుతున్నాడు. అప్పుడు శ్రీస్వామివారు చాప తెచ్చి తమ ముందు

వేయమని ఆజ్ఞాపించారు. 'స్వామీ! వాన వచ్చేటట్లుంది. ఇంకా ముందుకు జరిగితే నేను ఒక్కడినే మిమ్ము లోపలికి మోసుకుపోలేను' అన్నాడు. 'ఉండయ్యా మబ్బు కట్టాల' అన్నారు శ్రీస్వామివారు. చాప మీద కూర్చొని కొంతసేపు తన దృష్టి మబ్బుకేసి నిగిడ్చి చూచారు. అంతే! ఆ మేఘములు, ఉరుములు, చినుకులు పోయి మామూలు పరిస్థితి ఏర్పడింది.

తలుపూరులో నారాయణదాసు అను శ్రీస్వామివారి భక్తులు ఒకరున్నారు. ఒకరోజు 1977 సంవత్సరములో అతడి ఆశ్రమంలో శ్రీస్వామివారు వేంచేసి యున్నారు. స్వామి సేవకుడు బరిగెల నాగయ్య శ్రీస్వామివారిని, 'స్వామీ వాన ఎప్పుడు కురుస్తుంది?' అని అడిగాడు. 'అయ్యా! ఈ సంవత్సరము మూడు వానలే కదయ్యా! ఒకటిన్నర నెలకు ఒకసారి, రెండు నెలల ఇరువది రోజులకు ఒకసారి, మూడు నెలల అయిదురోజులకు ఒకసారి పైవాళ్ళు కురిపించే వాన ఇంతేనయ్యా' అన్నారు శ్రీస్వామివారు. 'ఒకటిన్నర నెల వర్షం లేకుంటే గొడ్డు పిల్లా చచ్చిపోతారే' అన్నాడు నాగయ్య.

అట్లా అయితే 'మనమన్నా కష్టపడి కురిపించుకోవద్దయ్యా' అన్నారు శ్రీస్వామివారు. శ్రీస్వామివారిని నాగయ్య గంజి త్రాగమంటే, 'అయ్యా! అనుకున్న పని పూర్తి అయితే గదయ్యా నీళ్లు త్రాగవలసింది?' అన్నారు శ్రీస్వామివారు. తరువాత వారు సిద్దలయ్య కొండ దగ్గర మూడురోజులు, కలిచేడులో మూడురోజులు నిరాహారియై, 'బండి ఆపండయ్యా' అని అహర్నిశలు అరుస్తూనే వున్నారు. రాత్రింబవళ్ళు నిద్రపోకుండా కూర్చునే వున్నారు. ఆసనమైనా మార్చలేదు. మొదటిరోజు ఎలా వున్నారో చివరిరోజు వరకూ అలానే కూర్చున్నారు. అంతకు ముందు ఎప్పుడూ ఆయన పడుకొని వుండటం చూస్తూవున్న భక్తులందరూ శ్రీస్వామివారికి వృద్ధాప్యము, బలహీనత వచ్చేశాయని, ఇక కోలుకొనే ప్రసక్తే లేదని అనుకునేవారు. ఈ దృశ్యం చూచేసరికి కనువిప్పై, శ్రీస్వామివారిలోని కార్యదీక్ష, శక్తి తెలిసి వచ్చాయి. ఆరవరోజు సాయంత్రం నాలుగు గంటలకు తమకు స్నానం చేయించమని కోరారు. వారికి స్నానం చేయించి కూర్చోబెట్టగానే పక పక నవ్వుతూ, 'గడ్డ గడ్డ పెళ్ళగించుకున్నదయ్యా' అన్నారు. మరుక్షణం నుండి కుంభవృష్టి మొదలై చెరువులు నిండే వరకు ఆగలేదు.

ఋషులు తమ తపస్సు, యజ్ఞ యాగాదుల వలన సకాల వర్షాలను కురిపించి జగద్హితం చేసేవారని పురాణాలలో చదివాము. అది నిజమేనని శ్రీస్వామివారిని చూస్తే తెలుస్తుంది. అలా చేయగల సమర్థులనే 'భూసురులు' అనేవారు కాబోలు.

శ్రీస్వామివారు అంత శక్తిమంతులే అయితే వర్షం కురిపించడానికి ఆరురోజులు ఎందుకు పట్టింది? అన్న ప్రశ్న రావచ్చు. స్థానిక ప్రజల యొక్క సమిష్టి పాప కర్మల ఫలితమే అనావృష్టికి కారణమని పెద్దలంటారు. వారందరి కర్మను తమ తపశ్శక్తితో దహించి వేయడానికి వారికి కొంత కాలం అవసరమవుతుంది.

ప్రజలు నిస్వార్థమైన శ్రద్ధాభక్తులతో ప్రేమపూర్వకంగా భగవంతునికి పూజలు చేయకపోవడం, ప్రజలలో భక్తి భావము, ధర్మాచరణ నెలకొనడానికి అవసరమైన ధర్మకార్యాలను నిర్వహించనందువలన అనావృష్టి వంటి అరిష్టాలు ఏర్పడతాయని శాస్త్రం.

రెండెద్దుల బండిలో శ్రీస్వామివారిని ముదిగేడు నుండి సిద్దలయ్య కొండకు తీసుకువస్తున్నారు సేవకులు. మార్గమధ్యంలో బ్రహ్మాండంగా మేఘావృతమై, సన్నగా వర్షం మొదలైంది. సేవకులు, 'స్వామీ! పెద్ద వర్షం వస్తుంది. మనమందరమూ సామానుతో సహా తడిసిపోతాము అని విన్నవించారు. శ్రీస్వామివారు మౌనంగా తన అరచేతిని ఆకాశం వైపు చూపుతూ, కాస్త ఆగు అన్నట్లుగా చేతిని పైకెత్తి కొంతసేపు వుంచారు. అంతే! వర్షం నిలిచిపోయింది. శ్రీస్వామివారు సిద్దలయ్య కొండ చేరిన వెంటనే బ్రహ్మాండంగా వర్షం కురిసింది. ఇలాంటి లీలలు భక్తులు ప్రత్యక్షంగా చూడబట్టే ఎన్ని కష్టాలైన ఓర్చుకొని నిరంతరం తిరుగుతుండే శ్రీస్వామివారిని రాత్రింబవళ్ళు సేవించి ధన్యులయ్యారు.

తలుపూరులో 'డి' మైను అను ఒక మైకా గని వుంది. శ్రీస్వామివారు అక్కడ ఉన్నప్పుడు మబ్బులుపట్టి బాగా వర్షం వాసన వస్తూన్నది. 'స్వామీ! వర్షం వచ్చేస్తుంది. మన వస్తువులన్నీ తడిసిపోతాయి. ఇక్కడ ఇల్లు కూడా లేదే!' అని అన్నారు సేవకులు. వెంటనే శ్రీస్వామివారు తంబుర తీసుకొని దానిని కాసేపు మీటి 'ఏమి వీరరాఘవులూ? మేము ఇచ్చుట వుండామని

తెలియదా? మా సామాను, మేము ఏమై పోవాలి? ఏమిటయ్యా? నీ ఇష్టం వచ్చినట్లుందే! మేమేం కావాలి! మా మనుషులేం కావాలని ఇట్లా చేస్తున్నావు?' అని దబాయించారు. అయిదు నిమిషాలకల్లా మేఘాలు చెల్లాచెదురై స్పష్టంగా సూర్యుడు కనపడ్డాడు. ఇలానే ఒకప్పుడు శిరిడిలో గాలివాన ప్రారంభమైంది. త్వరగా ఇల్లు చేరవలసిన భక్తులు ఆందోళన పడుతుంటే సాయి మసీదు నుండి బయటకు వచ్చి, 'ఓ అల్లా! నా బిడ్డలు క్షేమంగా త్వరగా ఇల్లు చేరాలి. వర్షమిక చాలించు' అని గద్దించగానే వర్షమాగిపోయింది.

ఒకప్పుడు మద్రాసు రాష్ట్రము నుండి వచ్చిన భక్తులు రెండు సంవత్సరముల నుండి వారి ప్రాంతములలో పూర్తి వర్షములు లేవని శ్రీస్వామివారికి విన్నవించుకున్నారు. 'భగవంతునికి అర్జీ వ్రాయండయ్యా' అని చెప్పి శ్రీస్వామివారు చీటి వ్రాయించి తన తొడ క్రింద పెట్టుకొని అయిదు రోజులు అన్నపానీయాలు, నిద్ర మాని అలాగే కూర్చున్నారు. అయిదవ రోజు ఆ ప్రాంతంలో వర్షంపడి చెరువులు నిండిన తరువాతనే శ్రీస్వామివారు గంజి త్రాగారు. అరగంటలో వర్షం కురిసి చెరువులు నిండాయి.

కలిచేడు సిద్దులయ్య కొండ దగ్గర శ్రీస్వామివారు వున్నారు. కట్టుమూడి పల్లెలో వర్షం లేక నార్లు ఎండిపోతున్నాయి. రైతులు వచ్చి శ్రీస్వామివారికి మొరపెట్టుకున్నారు. 'దేవునికి అర్జీపెట్టుతామయ్యా రేపు మధ్యాహ్నంనకు రెండు పదునుల వర్షం కురుస్తుంది' అని చీటి వ్రాయించి ఆశీర్వాద ముద్రవేసి ఆ రైతులకిచ్చారు. తెల్లవారి వర్షం కురిసి చెరువులు నిండి మూడవరోజు నుండి నాట్లు ప్రారంభించారు. ఆ గ్రామస్తులంతా శ్రీస్వామివారి శక్తి సామర్థ్యాలను కొనియాడారు.

తలుపూరులో ఒకరోజు మధ్యాహ్నం తాటిబొలుగు అను విషసర్పం శ్రీస్వామివారి తొడ క్రిందకు వచ్చింది. ఆ సంగతి చెపితే అదేమి చేస్తుందిలే దానిని మీరేమీ చేయవద్దు అన్నారు శ్రీస్వామివారు. తరువాత దానంతట అదే వెళ్ళిపోయింది.

అది మండువేసవి, 1974 ప్రాంతం. ఒకనాడు గొలగమూడి ఆశ్రమం నుండి కప్పుకు మంటలు అన్నివైపులా అలుముకుంటున్నాయి దట్టంగా పొగ ఆకాశానికి లేచింది. పడమటి గాలి బ్రహ్మాండంగా వీస్తోంది. దగ్గరలో

నీళ్ళు సమృద్ధిగా లేవు. శిష్యుడు రమణయ్య శ్రీస్వామివారికి నమస్కరించి నిచ్చెన సహాయంతో ఇంటిపైకెళ్ళి చిన్నకుండెడు నీళ్ళు ఆ మంటపై చల్లాడు. ఫైర్ఇంజన్‌కు కూడా అలవికానంతగా ప్రజ్వరిల్లిన ఆ మంటలు దుత్తెడు నీళ్ళతో పూర్తిగా చల్లారిపోయాయి.

ఒకరోజు శ్రీస్వామివారు కలిచేడులో నరసారెడ్డిగారింటికి వచ్చారు. నరసారెడ్డి భార్య ఈశ్వరమ్మ వంటచేసే చోటుకు వెళ్ళి ఆ వసారాకు రేకులు వేయించమన్నారు శ్రీస్వామివారు. 'ఆర్థికంగా అశక్తురాలనుకదా, తమకు తెలియనిదేమున్నది' అని విన్నవించింది. 'వాళ్ళే చూసుకొంటారులే' అని మాత్రం అన్నారు శ్రీస్వామివారు. అయిదురోజుల తరువాత ఆమె సజ్జవడలు చేస్తున్నది. నూనె బాండలికి వున్నట్లుండి వేలెడు రంధ్రంపడి నూనె మండుతున్న పొయ్యిలో కారుతూంది. వెంటనే ఆమె ఇంటిలో నుండి ఒక బేసిన్ తెచ్చి ఆ బాండలిలో మిగిలిన నూనెను అందులో పోసుకున్న తరువాత ఆమెకొక విషయం ఆశ్చర్యంగా తోచింది. అంత నూనె మండే పొయ్యిలోకి కారినపుడు మంటలెంతగానో ఎగసి వసారా, ఇల్లు తగులపడవలసింది గదా! అయినప్పటకీ ఆమె బేసిను తెచ్చి నూనె వంచుకొనేంతవరకు మంటలు పైకి లేవక పోవటమేమిటి? వెంటనే ఆమెకొక విషయం తోచింది. అందుకే కాబోలు శ్రీస్వామివారు వసారాపై రేకులు కప్పించుకోమన్నారు. అయినప్పటికి ఆయన అభయమిచ్చినందువల్లనే ఇప్పుడు ప్రమాదం వాటిల్లలేదని ఆమె గుర్తించింది.

బోయినపల్లి గ్రామం వద్ద కొందరు భక్తులు 'గోవిందమ్మ (బ్రహ్మంగారి భార్య) నీటితో దీపాలు వెలిగించిందట, ఎంతటి మహాత్మురాలు' అని అనుకొంటుండగా శ్రీస్వామివారు అది విని చెంబుతో నీరు తెప్పించి వారికిచ్చి 'మీరు కూడా వెలిగించుకోండి' అన్నారు. ఆ నీరు పోసి వారు వెలిగిస్తే దీపాలు వెలిగాయి. శ్రీస్వామివారు శరీరంతో వున్నంత కాలమూ ఇలాంటి విషయాలు బయటికి చెపితే శ్రీస్వామివారు అంగీకరించక వాటిని గుప్తంగా వుంచమని ఆదేశించేవారు.

పెనవర్తి వాస్తవ్యుడు పోలు మస్తానయ్య ఇలా చెప్పారు.

'ఒకసారి పెనవర్తి నుండి తలుపూరుకు నారాయణరెడ్డిగారి కారులో వెళుతున్న శ్రీస్వామివారు వున్నట్టుండి, 'అయ్యా! గొంతుకోయవలసి వస్తుందే'

అన్నారు. కాసేపట్లో శ్రీస్వామివారు హఠాత్తుగా పెట్టిన పెద్ద కేకకు బ్రేకు వేయకనే కారాగిపోయింది! వెంటనే చెంగున ఒక మేక కారు ముందునుండి రోడ్డుకు అడ్డంగా పరుగెత్తింది. కారు ఆ క్షణంలో నిలవక పోయినట్లయితే దాని గొంతు తెగేదే! నాటి వరకూ శ్రీస్వామి వారి యందు ఏమాత్రం నమ్మకం, లక్ష్యం లేని నేనూ ఈ సంఘటనతో శ్రీస్వామివారు భక్తుడనయ్యాను'.

ఒకరోజు రాత్రి రోశిరెడ్డి పందిరికి చెక్కిన కాగితములు తీయబోయాడు. అతని చూపుడు వేలును పాము కరిచింది. శ్రీస్వామివారు ఆ వేలును తన తొడపై వుంచి ఆ పైన తన అరచెయ్యి వేసి అదిమిపెట్టి అయిదు నిమిషాలు వుంచారు. బాధపూర్తిగా తగ్గింది. 'నీ వళ్ళు సంజీవిని అయింది' పొమ్మన్నారు. అది మొదలు ఏ విషజంతువు కరిచినా రోశిరెడ్డికి విషం ఎక్కడం లేదు.

ఒకప్పుడు యార్లపాడు అనే గ్రామంలో వ్యక్తులు నిష్కారణంగా మరణించనారంభించారు. కారణం తెలియక గ్రామ ప్రజలందరూ భయభ్రాంతులయ్యారు. ఏదో దుష్టశక్తి ఊరిలో ప్రవేశించి అలా విలయతాండవం చేస్తూందని అందరూ తలచారు. ఊరిలోని ప్రతివారు ప్రొద్దు క్రుంకినప్పటి నుండి ఇండ్లలో నుండి బయటికి రాను ధైర్యంలేక భయంతో తలుపులు బిగించుకొని ఇండ్లలోనే వుండిపోతున్నారు. కొందరు గ్రామస్తులు శ్రీస్వామివారిని పదే పదే అర్థించి వారి గ్రామానికి తీసుకుపోయారు. శ్రీస్వామివారు ఆ గ్రామం చేరేటప్పటికి రాత్రి సమయం అయినందువల్ల ఎవరి తలుపు తట్టినా ఆ దుష్టశక్తేనని తలచి భయపడి తలుపులు తీయలేదు. చివరకు ఒక ముసలామె తెగించి తలుపుతీసి చూసింది. నిజంగా శ్రీస్వామివారు వచ్చారని అందరికీ చెప్పడంతో గ్రామస్తులందరూ శ్రీస్వామివారి చుట్టూ ప్రోగై స్వాగతం పలికారు.

అప్పుడు శ్రీస్వామివారు వారిని కరుణించి, ఆ ఊరిలోనే ఒకచోట పవిత్రమైన తమ అగ్నిని స్థాపించి, కొద్దిరోజులు ఆ గ్రామంలోనే వున్నారు. అటు తరువాత ఊరిలో మరొక్క మనిషి కూడా మరణించలేదు.

మోపూరు దశయ్య, కొమరగిరి రమణయ్య జమ్మిమాను కొట్టారు. దాన్ని రెండెడ్లబండి అడుగున కట్టి తోలుకు రావాలి. ఆ మాను కొన ఒకవైపున

బండికి కట్టారు. ఇంకోవైపున మొదలు కట్టేందుకు ఎంత ప్రయత్నించినా మొదలు లేవలేదు. ఇంతలోనే శ్రీస్వామివారు వస్తే వారికి చెప్పారు. 'పలావు తినే వాళ్ళను పిలవండయ్యా లేస్తుంది' అన్నారు. ఆ మాటలకర్థం శ్రీస్వామివారికే తెలియాలి, శ్రీస్వామివారు వెళ్ళిపోయారు. అయినా చివరిసారిగా ప్రయత్నిస్తామని వారు మోకు లాగారు. ఆశ్చర్యంగా అది ఎంతో సులభంగా లేచిపోయింది.

ఒకరోజు శ్రీస్వామివారి భక్తురాలు వక్కెమ్మ శ్రీస్వామివారి సన్నిధిలో వున్నది. వెల్లువకు కొట్టుకొచ్చిన కంప తెచ్చి శ్రీస్వామివారు పెన్నానది నీటిపై వేశారు. ఆ కంపకు తన కపిల మోకు నిప్పును అంటించి మంట పెట్టారు. నదిలోని నీటిని శ్రీస్వామివారు తన ముంతతో ముంచి మంటపై చల్లుతున్నారు. ఆ మంటలు చల్లారే బదులు అంతకంతకూ ప్రజ్వలించసాగాయి. ఇటువంటి లీలే శ్రీ అక్కల్‌కోట స్వామివారి చరిత్రలో కూడా మనకు దర్శనమవుతుంది.

ఎరుకల రాజు (కుల్లూరు రాజుపాళెం) గారి బావిలో వేసవికాలం నీరుండదు. వర్షాకాలం నీరున్నా పురుగుపట్టి వాసన. ఒకరోజు శ్రీస్వామివారు ఆ బావిలో మునిగి వచ్చారు. అది మొదలు ఆ నీరు పురుగులు, వాసనపోయి తరుగు లేకుండా వుంది.

ఒకప్పుడు మంగుపల్లెలో కలరా దేవత స్వైరవిహారం చేసి జనాన్ని గుంపులు గుంపులుగా చంపుతూంది. ఏరు గట్లనిండుగా ప్రవహిస్తున్నందున గ్రామస్తులెవ్వరూ శ్రీస్వామివారి దగ్గరకు రాలేక పోయారు. శ్రీస్వామివారు ఒక కాగడా వెలిగించి చలమానాయుడి చేతికిచ్చి, 'అటు ఇటూ చూడకుండా నీదృష్టి కాగడాపై పెట్టి నడవమన్నారు'. చలమానాయుడు ముందు, శ్రీస్వామివారు వెనక, నడచి ఆ గ్రామం చేరారు. ఏటిలో నీరు చలమానాయుడికి మోకాటిలోతే ఉన్నవి. **శ్రీస్వామివారు ఊరి వెలుపలొక కర్రనాటి దానికొక**
20 **చీటి వ్రాయించి కట్టి తిరిగి వచ్చేశారు. అది మొదలు ఆ గ్రామంలో ఒక్కరుకూడా మరణించలేదు. శ్రీస్వామివారిని నమ్ముకున్నవారికి వారి రక్షణ అడగకనే లభిస్తుందని గమనించాలి.**

**'వెంకయ్య పేరుమీద పిడికెడన్నం పెట్టిన వారికి, తెచ్చిన వారికి,**
21 **వారి మంచి చెడ్డలన్నీ మనం చూడొద్దయ్యా!' అని శ్రీస్వామివారు అభయమిచ్చియున్నారు. ఈ విషయం శేషయ్యనాయుడుగారి ఎడల ఎలా**

నిజమైందో చూద్దాం.

శ్రీస్వామివారు ఒంటరిగా అడవులలో తిరుగుతుండే రోజులలో శ్రీస్వామివారు తరచు చెర్లోపల్లి గ్రామస్థులైన యస్. శేషయ్యనాయుడుగారింటికి వచ్చేవారు. అర్ధరాత్రప్పుడు వచ్చినా శేషయ్యగారి తల్లిగారు ఆ మహనీయునికి భక్తితో కడుపునిండా అన్నం పెట్టేది.

1976లో చెర్లోపల్లి శేషయ్యనాయుడుగారు త్రోవన వస్తుంటే శ్రీస్వామివారు ఆయనను పిలిచి 'నీకు ఒక సంవత్సరం నాలుగు నెలల ఆరు రోజులకు గండం ఉంది. తిరువళ్ళూరు వీరరాఘవస్వామి తప్పిస్తారు' అని చీటి వ్రాయించి ఇచ్చారు. కొన్నాళ్ళ తరువాత తన పొలంలో కయ్యినిండా నీళ్ళు పెట్టి, రొంపి దుక్కి దున్నుటకు ఎద్దులను నాగలికి కట్టి తోలగా ఒక ఎద్దు కయ్యలోకి దిగిన వెంటనే క్రిందపడి తన్నుకుంటోంది. ఆత్రుతగా చేలోకి దిగిన నాయుడుగారికి కాళ్ళకు చివుక్కుమన్నట్లయిందట. కానీ లెక్కచేయక ఎద్దును ప్రక్కకు లాగుతుండగా చేలో కరెంటు ఎర్తయినట్లు గుర్తించి కేకలు వేసి మెయిన్ ఆపించారు. ఒక ఎద్దు మాత్రమక్కడికక్కడే చనిపోయింది. మరొక ఎద్దు తప్పించుకున్నది. కానీ తనకు మాత్రము ఏ అపాయం జరగలేదు. ఎద్దు చావుకు కారణం బోధపడక మెయిన్ ఆన్‌చేసి టెస్టరుతో పొలంలో నీటిని పరిశీలిస్తే చేనంతా కరెంటు ఎర్తయివుంది. ఆలోచించాక కొంతకాలం క్రిందట శ్రీస్వామివారు వ్రాయించి ఇచ్చిన చీటీ వెతికితే దొరికింది. అందులో శ్రీస్వామివారు వ్రాయించిన 1 సంవత్సరం 4 నెలల, 6 రోజుల గండం ఆ రోజుకు రావలసియున్నది. గనుక ఆ మరణగండం నుండి కేవలం శ్రీస్వామివారి కృపవలన బయట పడ్డానని నాయుడుగారు తెలుసుకున్నారు.

**అణిమాది అష్టసిద్ధులు శ్రీస్వామివారికి దాస్యము చేసేవి.** ఉదా:- **22**

పాలకొండ సుబ్బారెడ్డి ఒకరోజు చాకలిగుంట దగ్గర జమ్మిమాను కొట్టేశాడు, శ్రీస్వామివారునడిచే రోజులవి. 'మనం వెంటనే వెళ్ళాలి, మాను ఎత్తుకోండి' అన్నారు శ్రీస్వామివారు. అది చాలా బరువుగా వుంది. శ్రీస్వామివారు చెప్పారు కనుక ప్రాణాలు బిగబట్టి సుబ్బారెడ్డి ఎలాగో నెత్తికెత్తుకున్నాడు. కానీ నిలువునా కూలిపోయేటంత బరువుగా వుందది. నాలుగు బారలు నడిచాక శ్రీస్వామివారు 'బరువుగా వుందయ్యా? ఆడ

వేయి' అన్నారు. బ్రతుకు జీవుడా అంటూ క్రింద పడేశాడు. శ్రీస్వామివారు తన చేతికర్ర తీసుకొని ఆ మానును ఈవైపుకు, ఆవైపుకు పొడిచారు. 'ఇప్పుడు ఎత్తుకో' అన్నారు శ్రీస్వామివారు. అప్పుడు ఎత్తుకుంటే నిజంగానే తేలిగ్గా వుందా మాను. 'స్వామి తలచుకుంటే ఏమైనా చేయగలడురా' అని అనుకున్నాడు సుబ్బారెడ్డి.

నరసాపురం రైతు తన పొలంలో బావి ఎంత లోతు త్రవ్వినా నీరు పడలేదు. శ్రీస్వామివారిని శరణు పొందాడు. శ్రీస్వామివారు ఆ బావిలో టెంకాయ కొట్టి కొద్దిగా త్రవ్విబయట కొచ్చేశారు. తెల్లవారేసరికి బావినిండా నీరూరింది. ఈ వింత చూచిన ఊరి జనమంతా ఆశ్చర్యంతో శ్రీస్వామివారికి నివాళులర్పించారు.

నాగులవెల్లటూరు వాస్తవ్యుడు నూతేటి శ్రీరాములునాయుడు తన పొలంలో బావి త్రవ్విస్తున్నాడు. పద్దెనిమిది అడుగులు త్రవ్వాక కఠినమైన బండ పడి త్రవ్వుటకు అలివి కాలేదు. ఆ ప్రాంతములో బావి 30 అడుగులు త్రవ్వితేగాని నీళ్ళుపడవు. స్వామివారికి విన్నవించారు. 'నాలుగు రోజులు నిండు కుండ అన్నం కొంచెం తీసి బావిలో వేసి, మరి నాలుగురోజులు పని ఆపి అవతల ఏ మౌతుందో చూడు' అన్నారు శ్రీస్వామివారు. ఆయన అలాగే చేసి ఎనిమిదవ రోజు పని మొదలు పెడితే అంత కఠినమైన బండ మెత్తగా తెగనారంభించి పని అతి సులభంగా పూర్తయింది.

గోపారం, పాలకొండ సుబ్బారెడ్డిగారు ఒకప్పుడు బావి త్రవ్వించాలని స్వామివారిని అడిగితే 'సముద్రం' అని వ్రాసుకోమన్నారు. వారు చెప్పినట్లే ఆ బావిలో ఊట అయిదు హార్స్ పవర్ ఇంజన్ పెట్టి కొడితే కూడా తరగడం లేదంటే అది నిజంగా సముద్రమే కదా!

మల్లిక వెంకయ్య శ్రీస్వామివారి గుండమునకు కట్టెలు కొట్టేవారు. ఒకనాడు సిద్ధలయ్య కొండ దగ్గర మునికన్నెలు వెంకయ్యను తమతో రమ్మని పీడించినవి. వారు, 'నీకు మరొక గొప్ప గురువును చూపుతామని' ఆశ చూపినవి. కానీ వెంకయ్య తాను తన గురువును వదలి రానని, వారిని వెంటనే వెళ్ళిపొమ్మని చెప్పారు. వారు వెళ్ళిపోయారు. వారు ఇదే విధంగా కనిపించి అనేకసార్లు వేధించేవారు. ఒకరోజతడు స్వామి సన్నిధిలో నుండగనే కన్నెకలు ధైర్యంచేసి శ్రీస్వామివారి సమీపానికి వచ్చి అతణ్ణి పిలుస్తున్నాయి.

శ్రీస్వామివారు వెంకయ్యను తన దగ్గరకు పిలచి ఆయన గుండెపై ఒక్క చరుపు చరిచి 'నీకికవాటి బాధ లేదులే పో' అన్నారు. నాటి నుండి ఆ ముని కన్నెకలు వెంకయ్య చెంతకు రాలేదు.

ఒకరోజు శ్రీస్వామివారు, 'వెంకయ్యా! ఏ గాలిగానీ, భూతంగానీ, పిశాచంగానీ నీ ఆజ్ఞ పాటించకుంటే, 'నేను చెప్పినట్లు నడుచుకుంటావా లేక గురుదేవుని అగ్ని స్థంభం పట్టుకుంటావా?' అని గట్టిగా దబాయించి నిలేసెయ్. నేను చెప్పిన నియమాలు నీవు పాటించినంత వరకూ వాటిని చూచి నీవేమీ భయపడనక్కరలేద'ని అభయమిచ్చారట.

ఒకప్పుడు కంటేపల్లిలో పశువులలో గాలికుంటు వచ్చి అందరి ఎద్దులూ జబ్బున పడ్డాయి. శ్రీస్వామివారి గుండమునకు కట్టెలు సమకూర్చే వెంకయ్యకు ఎవరూ బండి, ఎద్దులు ఇవ్వలేదు. వెంకయ్య తన గురుదేవుడనుగ్రహించిన మంత్రం స్మరించి పోలేరమ్మను ఆవాహనం చేశాడు. ఆమె వచ్చి అతని ఎదుట నిలచి, తన జుట్టు ముడి విప్పి తల విరయబోసి, ఆ వెంట్రుకలకున్న అసంఖ్యాకమైన కన్నులను ప్రదర్శించింది. ఆ దృశ్యంతో అతడు భయపడి పారిపోతాడని ఆమె భావం. కానీ వెంకయ్య అలాంటి క్షుద్రశక్తులకు బెదిరే ఘటం కాదు. 'నీ ఆటలు నా వద్ద సాగవు. నీవు వెంటనే కంటేపల్లి పొలిమేర దాటి పోతావా? లేక గురుదేవుని అగ్ని స్థంభం పట్టుకుంటావా?' అని నిలేశాడు. ఆమె చెంపలేసుకొని, 'మూడవరోజు ఉదయానికల్లా పోతాను, ఇందుకు భూదేవి, ఆకాశం, సూర్యచంద్రులు సాక్షి' అని ప్రమాణం చేసింది. అదే విధంగా మూడవ రోజుకు ఆమె ఆ గ్రామం నుండి నిష్క్రమించడంతో అన్ని పశువులకు వెంటనే స్వస్థత చేకూరింది. స్వామి గుండమునకు కట్టెలు తోలేందుకు బండ్లుకట్టారు.

**ఈ సృష్టిలో సద్గురువులకు సాధ్యముగానిదేదీ లేదని ఈ క్రింది లీల తెలుపుచున్నది.** 23

స్వామి కోటితీర్థంలో బసచేసి యున్నారు. ఒక భక్తుడు స్వామితో 'సిద్ధలయ్య కొండమీద దేవాలయంలో ఒక రాయి పగిలితే ఒక సాధువు దాన్ని అతికించాడు అని అంటున్నారు' అన్నాడు. 'నిజమే అతుకుతుంది, నేను కూడా ఒకసారి ఈ దేవాలయంలో శివలింగం ముందు మంట పెట్టి

తలుపులేసి సందు గుండా చూచాను. నేల పై పరచిన రాళ్ళు పగిలి ఆ ముక్కలు పైకి పోయినవి. అది చూచి నేను ఉదయం గ్రామస్తులు చూచి ఏమనుకుంటారో? అని అనుకోగానే మరలా ఆ ముక్కలన్నీ క్రమంగా క్రిందికి వచ్చి యథాప్రకారం అతుక్కున్నాయి' అన్నారు శ్రీస్వామివారు. అంటే
24 **సంకల్పమాత్రం చేత రాళ్ళు అతుక్కొనుటకు వీలున్నదని శ్రీస్వామివారు చెప్పారన్నమాట.**

అవి శ్రీస్వామివారు నడిచే రోజులు, ఆశ్రమ ప్రాంగణంలో ఇద్దరు పట్టి లేపితే కూడా లేవని పెద్దబండ వుండేది. ఒకరోజు శ్రీస్వామివారు ఒక్కరే ఆ బండను ఎత్తి నెత్తిన పెట్టుకొని పడమర దిశగా వెళ్ళిపోయారు. మూడు గంటల తరువాత తిరిగి వచ్చారు. భక్తులు 'బండ ఏది స్వామీ?' అంటే 'అబ్బే ఇక్కడ వుండకూడదయ్యా' అన్నారు.


ఇదే విధంగా ఒకప్పుడు ఒక భక్తుడు ఇల్లు కట్టుకునేందుకు ఒక వేపదూలం తెచ్చి వుంచుకున్నాడు. ఆ రాత్రి శ్రీస్వామివారు ఒక్కరే వెళ్ళి ఆ దూలం ఎలా తెచ్చారో తెలియదుగానీ, తెల్లవారేసరికి ఆ దూలం శ్రీస్వామివారి గుండంలో మండుతూ ఉన్నది. ఆ భక్తుడొచ్చి లబో దిబో మొత్తుకున్నాడు. శ్రీస్వామివారు అతని చేతికొక గొడ్డలిచ్చి ఆ కాలే దూలాన్ని రెండుగా చీలగొట్టమన్నాడు. అతడట్లే చీలగొట్టగా దూలంలోని తొఱ్ఱలో త్రాచుపాముంది. అలాంటి దూలం ఇంటికి వాడితే ఆ ఇల్లు సర్వనాశనమని వాస్తు శాస్త్రము చెపుతుంది.

ఒకనాడు సత్తెమ్మకు స్వప్నంలో, నోటి నుండి బ్రహ్మాండమైన అగ్నిజ్వాలలు కక్కుతూ శ్రీస్వామివారు దర్శనమిచ్చారు. శ్రీస్వామివారు నడిచే మార్గంలో వుండే పేడను తీసివేసి ఆమె శుభ్రం చేస్తోంది. శ్రీస్వామివారు ఆమెతో 'నా పేరు మీద పిడికెడు మెతుకులు పెట్టిన వారి మంచి చెడ్డలన్నీ నేను సరిచేసి రావాలమ్మా' అంటున్నారు.

మల్లిక వెంకయ్య శ్రీస్వామివారి తొలి ఆరాధనకు కట్టెలు తోలుతున్నాడు. ఉదయం 4 గంటల ప్రాంతంలో చీకటిలో ఎద్దులు పామును త్రొక్కాయో ఏమోగాని, ఒకచోటొక నాగుపాము పడగవిప్పి తోకపై నిలబడి బండి నడ్డగించింది. వెంకయ్య బండి నిలిపి గొడ్డలి తీసుకొని దానిని నరకడానికి

సమీపించాడు. కానీ అది బుసకొట్టుతూ, రొదపెడ్తూ తోకమీద లేచి అటూ ఇటూ చిర్రు బుర్రు లాడింది. కానీ ఎద్దులనుగానీ, వెంకయ్యనుగానీ ఏమీ చేయలేదు. వెంకయ్య దానిని నరికే ప్రయత్నం మాని శ్రీస్వామివారు తనకు నేర్పిన మంత్రం స్మరించాడు. వెంటనే ఆ నాగు పడగదించి దక్షిణంగా వెళ్ళిపోయింది.


ప్రస్తుతం పెనవర్తి వడ్డిపాళెం వాస్తవ్యుడిలా చెప్తున్నాడు. నెల్లూరు పొట్టేపాళెం సమీపంలోని పెన్నానదిలో రైతులు పుచ్చ చెట్లు వేశారు. శ్రీస్వామివారు అచ్చట ఒక ఇసుక తిన్నెపై తన మామూలు ప్రకారం అగ్నిగుండం వేసి మకాం వేశారు. ఈ ముసలాయన ఉన్నాడు. ఇక తోట కాపలాకు డోకాలేదని సంతోషించారు రైతులు, ఏటికి పై భాగాన వర్షం పడి ఏరు కొద్దిగా పారుతుంది. ముసలాయనా! ఏటికి నీరు ఎక్కువగా వచ్చేస్తాయి. ఊర్లోకి రమ్మని ఎంత చెప్పినా స్వామి కదల్లేదు. రైతులు వెళ్ళిపోయారు. అటు తర్వాత ఏరు గట్లు తన్నుకొని పారింది. మూడవరోజు రైతులు వచ్చి చూస్తే స్వామి యథాస్థానంలోనే వున్నారు. ఆయన చుట్టూ 10 గజముల వరకు పొడి ఇసుక వుంది. నది గట్టున చెట్లకు వెల్లువ తుట్టెలు పట్టి నది సుమారు 15, 20 అడుగుల లోతు పారినట్లు తెలుస్తుంది. ఏట్లో శ్రీస్వామివారి చుట్టూరా పొడి ఇసుక చూచి రైతులు ఆశ్చర్యచకితులై శ్రీస్వామివారికి ప్రణమిల్లారు. అలనాడు మోసెస్‌కు నది మార్గం ఇచ్చినట్లు వుంది!



# అవధూత లీల

## అధ్యాయము - 7

## ఆపద్బాంధవుడు



**అజ్ఞానమనే కటిక చీకటిలో అహంకారమనే మొసళ్ళతో పోరాడే మనకు 'కర్మ దాటనెవరి తరము! నొసట వ్రాసిన బ్రహ్మరాత తప్పింప ఎవ్వరికీ శక్యముకాదు' అనే మెట్ట వేదాంతం బాగా వంటబట్టి మహనీయులెంతటి దయామయులో మనకు అనుభవం కాకుండా చేస్తుంది.**
25 **పూర్వ పుణ్యం వలన సద్గురు కృపకు పాత్రులైన వారెంతటి చెడ్డ కర్మనైనా, ఎట్టి బ్రహ్మరాతనైనా సునాయాసంగా తప్పించుకొని గమ్యం చేరగలరని శ్రీస్వామివారు, శ్రీ శిరిడీ సాయి వంటి మహనీయుల చరిత్రలేగాక మన సమకాలికులైన సోదర భక్తుల అనుభవాలు నిరూపిస్తున్నవి. సద్గురుకృప యనునది మనం ప్రార్థించిన సమయములలోనే గాదు మనం ఏమరుపాటుగా నున్నప్పుడు కూడా వెన్నంటి మనలను రక్షిస్తుందని ఈ క్రింది నిదర్శనములు తెలుపుచున్నవి.**

కొట్టికూటి బుజ్జయ్యగారి చెల్లెలు పద్మమ్మ పెండ్లి నిశ్చయమైంది. కంచి వరదరాజ స్వామివారి సన్నిధిలో చేయమని శ్రీస్వామివారు ఆజ్ఞాపించారు. అలానే ఏర్పాట్లు చేసుకొని ఆ పెండ్లివారు శ్రీస్వామివారిని ఆ వివాహానికి దయచేసి దంపతులను ఆశీర్వదించమని ప్రార్థించారు. స్వామివారు తన బృందంతో ఆ వివాహానికి వచ్చి మంగళసూత్రము, తలంబ్రాల బియ్యము స్వహస్తాలతో తాకి ఆశీర్వదించి దగ్గరుండి ఆ వివాహం జరిపించారు. శ్రీస్వామివారు తన డబ్బులు ఒక రూపాయి ఇచ్చి కర్పూరం తెప్పించి వెలిగించి తమ ప్రక్కన పెట్టుకున్నారు. ఇంకెవ్వరి ఇండ్లకుగాని, వివాహాలకుగాని వారి జీవిత కాలంలో శ్రీస్వామివారు వెళ్ళియుండలేదు. ఒకప్పుడు శ్రీస్వామివారు పద్మమ్మతో అన్నారు 'అమ్మా ఎన్ని కష్టాలొచ్చినా కంట తడిపెట్టకూడదమ్మా!' అని. తరువాత వారికి అనేక కష్టాలొచ్చినా శ్రీస్వామివారి కృప వలన అవి గడచి గట్టెక్కి శాంతితో జీవిస్తున్నారు.

ఒకప్పుడు శ్రీస్వామివారు తలుపూరు నుండి గొలగమూడికి వస్తూ నెల్లూరు మద్రాసు బస్టాండు చేరాక 'అయ్యా! మనం ఆసుపత్రికి పోవాలి' అని శ్రీస్వామివారే జూబిలీ ఆసుపత్రికి తీసుకుపొమ్మని చేతితో త్రోవ చూపారు. ఎప్పుడూ వైద్యశాలకు పోని శ్రీస్వామివారు ఇలా ఎందుకు పోతున్నారో ఎవరికీ అర్థంకాలేదు. వారు ఆసుపత్రికి పోగానే ఆస్పత్రిలో శ్రీస్వామివారిని అనన్యంగా స్మరిస్తున్న బుజ్జయ్య, అనారోగ్యంగా వున్న వారి చెల్లెలు నంబూరు పద్మమ్మ కొండంత సంతోషంతో శ్రీస్వామివారిని దర్శించి నమస్కరించుకొన్నారు. శ్రీస్వామివారక్కడ కొంతసేపు వుండి 'ఇక్కడికి లెక్క సరిపడింది. మనం పోదాం పదండి' అన్నారు. కొద్దిరోజులలో ఆమె ఆరోగ్యం చక్కబడి ఇల్లు చేరి శ్రీస్వామివారి కృపను కొనియాడింది.

కమ్మంపాడు గ్రామస్తులు లలితమ్మగారికి పెండ్లయిన నాలుగు సంవత్సరాల వరకూ బిడ్డలు లేరు. వీరికి నరాల బలహీనతవల్ల వంట్లో చాలా బాధగా వుండేది. డాక్టర్ల మందులు, ఇంజెక్షన్లు ఉపకరించలేదు. ఆమె శ్రీస్వామివారి దర్శనానికి వచ్చినప్పుడు ఆమె ఏమీ చెప్పకమునుపే, 'ఆమెకు జబ్బయ్యా? పోతుందిలే, గూడూరు కరణం చనిపోయాడు. ఆయనను ఈమె కడుపున వేశాను' అని చెప్పి వేలి ముద్రల కాగితం, దారం ఇచ్చి పంపారు. మరలా ఆమె ఏ మందులూ వాడకుండానే ఆరోగ్యం చేకూరి గర్భం ధరించి, ఒక సంవత్సరం లోపున మగబిడ్డను ప్రసవించింది. ఇప్పటికీ ఆమె యాభైమైళ్ళ నుండి వచ్చి శ్రీస్వామివారి సమాధిని దర్శిస్తూంటుంది.

ఒకరోజు రోశిరెడ్డిని ఏదో పురుగు కరిచింది. కాలు ఎర్రగా వాచి నడవలేక పోయాడు. నదికి స్నానానికి పోయి శ్రీస్వామివారిని స్మరించి, 'నీవు తప్ప నాకు దిక్కెవరు తండ్రీ?' అని ఇసుక వేసి తన కాలును రుద్ది నీటితో కడిగి, శ్రీస్వామివారి సన్నిధి కొచ్చారు. సాయంకాలానికి కాలు మామూలుస్థితికి వచ్చింది. ఆ రాత్రి శ్రీస్వామివారు రోశిరెడ్డితో 'స్నానానికి పోయిన దగ్గర చూచుకో, అర్థమవుతుంది' అని హెచ్చరించారు. శ్రీస్వామివారు సర్వాంతర్యామియై నిరంతరం తన మొరాలకిస్తున్నారని రోశిరెడ్డి గ్రహించాడు. స్నానానికి వెళ్ళినపుడు ఏటి వద్ద తాను చేసిన ప్రార్థన శ్రీస్వామివారు విన్నారని, వారి స్మరణతో ఇసుక వేసి కాలును రుద్దినందువలనే ఆ బాధ తగ్గిందనీ శ్రీస్వామివారి భావమని అతడు గుర్తించాడు.

బుజ్జయ్య అనేక కోర్టు వ్యవహారాలలో కలత చెంది శ్రీస్వామివారి దగ్గరకొచ్చి అల్లంతదూరాన నిలుచున్నాడు. 'మనసులో ఏమీ పెట్టుకోవద్దు. నీవు చక్కా ఇంటికిపో, అన్నీ నేను చూచుకుంటాను' అని అభయమిచ్చారు శ్రీస్వామివారు. వారన్నట్లే బుజ్జయ్యకు సర్వ చిక్కులు తొలగిపోయాయి.

గొలగమూడి కరణం సుబ్బారావుగారు చెపుతున్నారు:

ఒకప్పుడు ఒక ప్రభుత్వోద్యోగి మీద ప్రభుత్వానికి ఫిర్యాదులు వచ్చాయి. అవి ఋజువైనందున కలెక్టరు అతనిని సస్పెండ్ చేస్తానని పేరోల్ కూడా పంపారు. అట్టి కష్టకాలంలో శ్రీస్వామివారి ఆశీస్సుల కొరకు అతడు వచ్చాడు. 'ఆయనకు చాకలి మూటంత పాపముంది. ఆయన ఇక్కడుంటే మనకొక రువ్వ (పైసా) నష్టం, వెంటనే పొమ్మని చెప్పయ్యా!' అన్నారు శ్రీస్వామివారు. వారు కదలలేదు. అదేమాట శ్రీస్వామివారు పదేపదే చెప్పి వారిని పంపేశారు. ఆఫీసరుగారు అరగంట సేపు ఆగి శ్రీస్వామివారిని దర్శించారు. 'స్వామీ! మీరు కృప చూపకుంటే మా గతి ఏముంది?' అని ప్రాధేయపడ్డారు. 'నీ అడ్రసు వ్రాసిచ్చిపో! కాగితం వ్రాసి పంపుతాను' అని అభయమిచ్చారు శ్రీస్వామివారు. వారలాగే చేశారు. శ్రీస్వామివారి కృపవలన వారికి సస్పెన్షన్ తప్పి ట్రాన్స్‌ఫర్ మాత్రం అయింది.

**ఒకసారి శ్రీస్వామివారు రోశిరెడ్డితో చెప్పారు 'వెంకయ్యది**
26 **ఒకటేమాట గదయ్యా' అని. వారి అమృతవాక్కున కెంత గొప్ప శక్తి ఉంటుందో వారిచ్చే చిన్న సూచన వెనుక ఎంతటి బలవత్తరమైన కారణం ఇమిడి ఉంటుందో అనుభవించిన వారికే ఎరుక.**

శ్రీస్వామివారి సేవకులలో ఒక్కొక్కరికి ఒక్కొక్క పని వప్పగించబడి వుండేది. ప్రతినిత్యం వారందరూ తమ పనులు తాము భక్తితో చేసుకొనేవారు. అగ్నిహోత్రానికి కట్టెలు కొట్టి తీసుకురావడం వై.రమణయ్య పని. ఒకరోజు నిద్రలేస్తూనే శ్రీస్వామివారు రమణయ్యను పిలిచి, 'ఈ రోజు ఇక్కడ నీళ్ళూ, నిప్పూ చూడయ్యా' అన్నారు. ఇదేమిటి ఈ రోజు డ్యూటి మార్చారే! అని అతడనుకున్నాడు. కొంతసేపటికి ఆ మాట లెక్కచేయకుండా కట్టెలు కొట్టడానికే వెళ్ళాడు. అతడు పెద్దమాను ఎక్కి కొమ్మలు నరుకుతుండగా పెద్ద కొమ్మ విరిగి అతని గుండెలకు తగిలి క్రింద పడ్డాడు. భుజం దగ్గర ఎముక విరిగింది.

కానీ అతడు 4 అంగుళాల ప్రక్కనే వున్న బండమీద పడివుంటే తలపగిలి అక్కడే మరణించేవాడు. శ్రీస్వామివారికి విన్నవించగా రమణయ్యకు ఆసుపత్రి ఆపు (దిక్కు) అని చీటి వ్రాయించారు.

చాలా రోజుల నుండి నిరంతరం స్వామి సేవలో ఉండిన బరిగెల నాగయ్య కుడివైపున ప్రక్కటెముకల క్రింద నొప్పి విపరీతంగా వచ్చి గిలగిల తన్నుకొంటున్నాడు. అక్కడున్న భక్తులు డాక్టరు వద్దకు వెళ్ళమంటే 'నా డాక్టరు నా స్వామియే. నాకు వారే శరణ్యం' అని శ్రీస్వామివారిని స్మరిస్తూన్నాడు. ఏమిచేసినా తగ్గలేదు. భరించలేని బాధ. 'ఏమి స్వామీ, కలియుగంలో భూలోకం వదలి వైకుంఠం చేరావా? లేక నన్ను మరచావా, స్వామీ?' అని ఒక్క పళంగా ఆవేదనతో, దుఃఖంతో శ్రీస్వామివారిని స్మరించాడు. వెంటనే నొప్పి తీసేసినట్లయి కళ్ళు మూతలు పడినాయి. శ్రీస్వామివారు స్వప్నదర్శనమిచ్చి 'నేనెక్కడికి పోయానయ్యా? నీ వెంబడే ఉండ్లా' అని పలికారు.

శ్రీస్వామివారి సేవలోనున్న జయరామరాజు ఒకనాడు తన అనుభవాన్ని వేలూరు సుబ్రహ్మణ్యం నాయుడు (నాగులవెల్లటూరు) గారికి ఇలా చెప్పాడు. 'నేనొకరోజు నా ఎద్దులను మేతకు అడవికి తోలుకుపోతున్నాను. 'వాటిని తోలేసిరాయ్యా' అన్నారు శ్రీస్వామివారు. 'నేను వస్తే ఎట్లా స్వామీ? మేపే వాళ్ళు లేరు' అన్నాను. 'పరవాలేదులే తోలేసి వచ్చెయ్' అన్నారు. నేను శ్రీస్వామివారి మీద భారం వేసి వాటినట్లా తోలేసి పశువులు మేపే పిల్లలకు చెప్పి వచ్చి శ్రీస్వామివారి చెంత కూర్చున్నాను. కొంత సేపటికి శ్రీస్వామివారు ఉన్నపళంగా లేచి, కర్ర తీసుకుని 'థేయ్, థేయ్' అని అరుస్తూ పది బారల దూరం పోయి, తిరిగివచ్చి కూర్చున్నారు. 'ఏమిటి స్వామీ, అక్కడేమీ లేకున్నా అదిలిస్తున్నారు?' అని అడిగాను, 'నీ ఎద్దులేయ్యా' అన్నారు గానీ మరే వివరాలూ చెప్పలేదు. తెల్లవారి పశువుల కాపర్లీ విధంగా చెప్పారు. 'నిన్న చిరుతపులి వచ్చి మీ ఎద్దు మీద పడబోయింది. ఆ వేలిముద్రలు వేసే స్వామి వచ్చి కర్ర తీసుకుని తరిమారు. లేకుంటే మీ ఎద్దు చిరుత నోట పడియుండును! నిన్న స్వామి కర్ర తీసుకుని 'థేయ్ అని అదలించిన దానికర్థం నాకప్పుడు తెలిసింది'. ఈ జయరామరాజుకు ఇలాంటివెన్నో అనుభవాలున్నాయి. కనుకనే వీరు శ్రీస్వామివారి సేవకు అంకితమయ్యాడు.

ఒకరోజు శ్రీస్వామివారు తమ యెడమ అరచేతిని పైకెత్తి, కుడిచూపుడు వేలును దాని మీద వుంచి, 'పుల్ల గుచ్చుకుందయ్యా!' అన్నారు. నిజంగా శ్రీస్వామివారికి పుల్లగుచ్చుకోలేదు. శ్రీస్వామివారు అలా యెందుకన్నారో భక్తులకు తెలియలేదు. ఒక గంట తర్వాత గాని వారికి అసలు విషయం తెలియలేదు. అప్పుడు కొట్టికూటి బుజ్జయ్య అనే భక్తుడు అరమైలు దూరంలో వున్నాడు. సరిగ్గా అతని అరచేతిలో అదేచోట శ్రీస్వామివారు అలా అన్న సమయంలో తేలు కుట్టిందని తెలిసింది, అంతేగాక శ్రీస్వామివారిని స్మరించిన క్షణంలోనే ఏ మందూ అవసరంలేకుండా ఆ బాధంతా తగ్గిపోయింది.

ఒకప్పుడు శ్రీస్వామివారు కలిచేడులో ఉన్నారు. శ్రీస్వామివారి సేవకుడు రోశిరెడ్డికి కన్ను ఆపరేషన్ అయి నొప్పిగా ఉన్నది. ఒకరోజు 'అయ్యా! నీవు ఇంటికి పోయిరావాలి. నలభై లక్షలు కడితే త్రోవలో రామలక్ష్మణులు రక్షిస్తారు. ఊరికిపోతే అమ్మణ్ణి కాపాడుతుంది. రేపు ఉదయం నాకు చెప్పకుండా వెళ్ళి మరలా వచ్చేయ్' అని చీటీ వ్రాయించారు శ్రీస్వామివారు. అతడలాగే వెళ్ళాడు. రాజంపేట రైల్వేస్టేషనులో ప్లాట్‌ఫారం మీద నడుస్తున్నాడు. లైటు ఫోకస్ వల్ల కళ్ళు కనిపించక ప్లాట్‌ఫారం నుండి జారి నాలుగడుగుల లోతులో ఉన్న రైలు పట్టాల మీద పడినప్పటికి ఏ మాత్రమూ దెబ్బతగల్లేదు. ఊరికి చేరాక అతడక్కడ వున్న నాలుగు రోజులు గ్రామదేవత ఎల్లమ్మ అతనికి దర్శనమయింది. పట్టాల మీద పడ్డప్పుడు శ్రీస్వామివారు 'దోవలో రామలక్ష్మణులు కాపాడుతారు' అన్నమాట అర్థమైంది.

గొలగమూడి చెత్తయ్యకు ఒకప్పుడు చేలో నుసుకులేస్తుంటే తేలు బురదలో ఉండి అరికాలులో కుట్టింది. 'ఓం గురుదేవా!' అని కాలు గట్టిగా పట్టుకొని శ్రీస్వామివారిని స్మరించాడు. వెంటనే బాధలేకుండా పోయి మరలా తిరిగి యధాప్రకారం చేలో పని చేయగలిగాడు!

గొడ్డటి శేషయ్యగారి బర్రెకు నిండా జబ్బుగా ఉండి శ్రీస్వామివారి దగ్గరకొచ్చాడు. శ్రీస్వామివారు అంబలి త్రాగుతున్నారు. సేవకులు 'ఇప్పుడు కాదు, శ్రీస్వామివారు గంజి త్రాగుతున్నారు దూరంగా ఉండు' అన్నారు. కానీ శేషయ్యగారు చాలా ఆత్రుతగా ఉన్నారు. శ్రీస్వామివారు ఆయన వంక చూచి వెంటనే 'అయ్యా నీవు పొయ్యేసరికి బర్రెకు బాగుంటుందిలే, పో'

అన్నారు. అదే విధంగా తాను ఇల్లుచేరేసరికి బర్రె ఆరోగ్యంగా గడ్డి మేస్తున్నది.

గొలగమూడి వాస్తవ్యులు తూపిలి వెంకయ్య చాలాకాలంగా శ్రీస్వామివారి బృందమునకు శ్రద్ధతో గుడ్డలు ఉతికేవారు. 1981 వేసవిలో ఒకనాడు అర్ధరాత్రి మెలుకువ వచ్చి ఇక మంచం మీద ఉండలేక ఎవరో లేపినట్లుగా లేచి బీడీ కాల్చుకోడానికి ఇంట్లోని దీపం వద్దకు వెళ్ళాడు. అర్ధరాత్రివేళ మసక చీకటిలో నట్టింట కూర్చునియున్న మనిషిని చూచి బేరుమని అరిచాడు. ఈ అరుపుకు నట్టింటవున్న మనిషి కూడా అరిచాడు. దాంతో అందరూ కూడారు. చూస్తే ఆ ఇంటిలోని పాత్ర సామానంతా తన చుట్టూ పరచుకొని, ఒక ప్రక్క ఖరీదైన గుడ్డలన్నీ పోగు పెట్టుకొని కూర్చునియున్న దొంగ కనిపించాడు. ఆ దొంగను పట్టుకొని కట్టేశారు. వాడి దగ్గర పెద్ద కర్ర కూడా వుంది. 'ఏమిరా యింత సులభంగా చిక్కిపోయావు?' అంటే దొంగ చెప్పాడు.

'నేను ఇంటిలో ప్రవేశించబోయేటప్పుడే ఎవరో వీపున చరిచినట్లయి నిర్వీర్యమైనాను. కానీ ఎట్లాగో బలం కూడగట్టుకొని అన్ని వస్తువులు మూట కట్టుకున్నాను కానీ, 'ఎక్కడవక్కడ పెట్టేయ్' అని ఎవరో గద్దించి చెప్పినట్లుంది. ఆ ఆజ్ఞ మీరలేక కట్టిన మూటవిప్పి ఇలా పరచి పెట్టాను. కళ్ళు కనపడక, లేచేందుకు శక్తిలేక ఇలా కూలబడ్డాను. లేకుంటే ఒక్క వేటుకు చాలుతారా మీరంతా?' అన్నాడు.

పెమ్మసాని శ్రీహరినాయుడుగారు తన బండిలో శ్రీస్వామివారిని వారు కోరిన మజిలీకి తీసుకువెళ్ళేవాడు. ఆయన భార్య శ్రీస్వామివారి విడిదికి వెళ్ళి నమస్కరించింది. 'అమ్మా! నీకు పసుపు కుంకుమ గండమున్నది. తిరువళ్ళూరు వీరరాఘవస్వామి తప్పిస్తాడు' అని చెప్పారు. ఆ రాత్రి వారింటికి శ్రీస్వామివారు వచ్చి ధుని వెలిగించి తెల్లవారి వాళ్ళ బండిలోనే ప్రక్కనగల ఒక మైకాగనికి వెళ్ళారు. శ్రీహరినాయుడు ఆ రోజు తన ఎద్దుకు గడ్డి వేయబోయారు. మూమూలుగా సాధువైన ఆ ఎద్దు ఎందుకో వారిని బిరజాల దగ్గర తన కొమ్ములు దూర్చి, ఎత్తి అవతల వేసింది. బిరజాలలో కొమ్ము గుచ్చుకొని చర్మంచీలి పొత్తికడుపు వరకు ఆరు అంగుళముల పొడుగున గాయమై చాలా రక్తము పోయింది. ఆసుపత్రిలో కుట్లు వేయించుకొన్నాడు. శ్రీస్వామివారి అభయం వల్ల ప్రాణహాని తప్పింది. శ్రీస్వామివారి కార్యక్రమములకు భక్తితో

తన సేవను అనేక రూపములలో సమర్పిస్తుంటారు.

నెల్లూరు వాస్తవ్యులు మాకాని వెంకట్రావు మద్రాసు వెళ్ళడానికి శ్రీస్వామివారి అనుమతి కోరాడు. మామూలుగా 'వెళ్ళిరమ్మను' అనిగానీ లేక 'బంగారంగా పోయి రమ్మను' అనిగానీ అనే శ్రీస్వామివారు ఆ రోజు 'తిరువళ్ళూరు వీరరాఘవస్వామి, కంచి వరదరాజులస్వామి నిన్ను రక్షిస్తారు పో' అన్నారు. వెంకట్రావు మద్రాసు వెళ్ళి రద్దీగా వున్న బస్సు ఎక్కడంలో ఒక కాలు ఫుట్‌బోర్డు మీద వుంచి ఒక చేతితో కమ్మి పట్టుకున్నాడు. రెండవ కాలు ఎత్తక మునుపే బస్సు కదలడం వలన కాలు నేలరాచుకుంటున్నది. అతడు పడిపోయాడు అనుకున్నారందరూ. వెనుక వాళ్ళు అరుస్తున్నా డ్రైవరుకు వినిపించలేదు. అతడు గూడ ఆశ వదలుకున్నాడు. వెంటనే ముందు టైరు పగిలి బస్సు వున్న పళంగా ఆగిపోయింది. అలా జరగకుంటే వెంకట్రావుగారి చేయి పట్టుతప్పి, క్రింద పడి ప్రాణాపాయమై వుండేది. టైరు పగలటం వారి అదృష్టమని ప్రయాణీకులంతా అనుకున్నారు. శ్రీస్వామివారి ఆశీర్వచనం అప్పుడు అర్థమైంది వెంకట్రావుగార్కి.

ఒకప్పుడు శ్రీస్వామివారు తన బృందంతో కలిసి తిరుపతి వెళ్ళారు. శ్రీస్వామివారి సేవకుడు రోశిరెడ్డిని పొరపాటున తిరుపతిలో వదిలేసి మిగిలిన బృందమంతా కలిచేడు చేరారు. రోశిరెడ్డిగారు రైలులో టిక్కెట్టులేని ప్రయాణం చేస్తూ వున్నారు. డబ్బులు లేకుండా గూడూరు నుండి కలిచేడుకు పోవటం ఎలాగా అని అతడాలోచిస్తుండగా ఎవరో ఒక అపరిచితురాలు పళ్లెంలో అరటిపండ్లు, రూ॥ 1.00 పెట్టి సమర్పించింది. 'స్వామీ! పేదరాలను, స్వీకరించండి' అని ప్రార్థించింది. అలా తనకు శ్రీస్వామివారు ప్రసాదించిన ఆ రూపాయి చార్జిగా పెట్టుకొని కలిచేడు వచ్చి శ్రీస్వామివారిని కలుసుకున్నాడు.

వల్లపురెడ్డి తులశమ్మ కుమారుడు నారాయణరెడ్డిగారికి క్షయ వ్యాధి. ఆయన పరిస్థితి చాలా ప్రమాదకరంగా వుంది. ఇక ఆయన బ్రతకరని అందరూ వెళ్లి చూచి వస్తున్నారు. ఇల్లు వదలి చాలా కాలంగా శ్రీస్వామివారి సేవలో ఉండే తులశమ్మగారిని వెళ్ళి కుమారుని చూచి రమ్మన్నారు స్నేహితులు. ఇంటికి వెళ్లి కుమారుణ్ణి చూచి వస్తానని ఆమె శ్రీస్వామివారి అనుమతి కోరింది. 'ఆయనకేమమ్మా? బాగా వుంటాడు. నీవు పోవద్దు' అన్నారు శ్రీస్వామివారు.

అందువల్ల ఆమె పోలేదు. శ్రీస్వామివారు చెప్పినట్లే నారాయణరెడ్డిగారి ఆరోగ్యం బాగుపడి వివాహం చేసుకొన్నాక బిడ్డలు కల్గారు.


గొలగమూడి కరణంగారైన సుబ్బారావు కుమారుడు తన స్నేహితునితో కలసి నడిచి వస్తున్నాడు. అతనిని వెనుక నుండి ఒక ట్రాక్టరు గుద్దింది. అతని పొట్టమీద ట్రాక్టరు ముందు చక్రం ఎక్కింది. ఒక ప్రక్కటెముక విరగడంతో గవర్నమెంటు ఆసుపత్రిలో చేర్చారు. డాక్టరు మూడు నెలలకు నడువగలడని చెప్పారు. అతడి స్నేహితుడికి, నాలుగు చక్రాల మధ్య పడి, వళ్ళు దోక్కున్నదిగానీ పెద్ద దెబ్బలు తగల్లేదు. అదే సమయంలో శ్రీస్వామివారు ఆశ్రమంలో 'ప్రమాదం, ప్రమాదం' అని పెద్దగా కేకలు పెట్టుతూ 'దీపం వెలిగించండి' అని పట్టపగలు దీపారాధన చేయించారు.

భక్తులకిదేమి అర్థం కాలేదు. తెల్లవారి, పై ప్రమాదం సంగతి విన్నప్పుడు శ్రీస్వామివారి మాటలకర్థం తెలిసింది. శ్రీస్వామివారి సేవకులు పై ప్రమాదం గురించి శ్రీస్వామివారికి విన్నవిస్తే 'పదిహేను రోజులలో నయమై వస్తాడు. దేవుడు రక్షించాడు' అని చీటీ వ్రాయించి, తాము వాడుకున్న కౌపీన వస్త్రం ఇచ్చి, దాన్ని అతడి ప్రక్కమీద పరచమని, తానిచ్చు విభూతిని సేవించమని పంపించారు.

ఆశ్చర్యమేమంటే –


1. ట్రాక్టరు వెనుక చక్రం అతనిమీద కెక్కకుండా తప్పడము.

2. మూడు నెలలకు నడుస్తాడని డాక్టర్లు చెబితే శ్రీస్వామివారు చెప్పినట్లే అతడు పదిహేను రోజులకే నడిచాడు. అతనిని డిస్‌చార్జి చేశారు.



## అధ్యాయము - 8

## అమృతవాక్కు



27

**ఆ పరమాత్మ యొక్క దివ్యశక్తే ఈ విశ్వంలో అన్ని రూపాలు ధరించింది. ఆ శక్తే మన శరీరంలో గూడా పనిచేస్తుంది. అది సక్రమంగా పనిచేస్తే మనము ఆరోగ్యంగా వుంటాము. మన పూర్వ కర్మలననుసరించి ఆ శక్తి మనలో అస్తవ్యస్తంగా పని చేస్తుంది. అదే రోగానికి కారణం. మహనీయులలో ఈ శక్తి వారి తపోప్రభావం వలన ఎంతో శక్తివంతంగా పనిచేస్తుంది. కనుకనే వారు తక్కిన ప్రకృతిని ఎంతో చిత్రంగా శాసించగల్గుతారు. దుస్సాధ్యమైన రోగాలను కూడా వారు నివారించగలరు. అట్టి సహాయాన్ని పొందిన ఆర్తులు వారి ఎడల కృతజ్ఞతా భావంతో భక్తి విశ్వాసాలను పెంపొందజేసుకొని ధర్మమార్గంలో నడుస్తారు.** భగవంతుడు వున్నాడన్న విశ్వాసం పచ్చి లౌకికులైన మానవులకెలా గల్గుతుంది? అలాంటి విశ్వాసాన్ని కల్గించి మానవాళిని ధర్మపథంలో నడిపించాలనే మహనీయుల తపనే ఇట్టి లీలలకు కారణము.

పిచ్చి వెంకయ్య అనే బిరుదు పోయి, భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి అనే బిరుదు వచ్చింది శ్రీస్వామివారికి. ఎక్కడైనా జంతువుల్లో దొమ్మ, నెరిణి జబ్బులున్నా, మనుషులకు కలరా, మశూచీ వంటి వ్యాధులు వచ్చినా ఆ గ్రామం తరపున ఒకరిద్దరొచ్చి శ్రీస్వామివారికి తమ బాధలు నివేదించేవారు. శ్రీస్వామివారు ఆశీర్వదించి సాంబ్రాణి, దారం ఇచ్చి, పశువులన్నింటిని మందగా తోలి, పొగ వేయించేవారు. ఆ గ్రామంలో పశువులుగానీ, మనుషులుగానీ చనిపోయేవారు గాదు. భక్తులను శ్రీస్వామివారు తేళ్లు, పాముల బాధనుండి విముక్తులను చేసిన ఉదాహరణలు లెక్కలేనన్ని. నేటికీ శ్రీస్వామివారి సమాధి ప్రదక్షిణములతోనే విషజంతువుల బాధ నివారణవుతుంది. అనేక మంది దీర్ఘకాలిక రోగములనుండి

విముక్తులవుతున్నారు.

బుజ్జయ్యగారికి మెడపైన రక్తనాళం ఎముక క్రింద వత్తుకొని రక్త ప్రసరణ సరిగా లేక వళ్ళంతా జల్లు జల్లుమని తిమ్మెర్లు వుండేవి. మద్రాసులోని రామమూర్తి వగైరా డాక్టర్లు చికిత్స చేశారు. కాని పూర్తిగా నయంకాలేదు. ఈ బాధను శ్రీస్వామివారికి విన్నవించగా వారిని వంగమని శ్రీస్వామివారు తమ స్వహస్తాలతో మెడను స్పర్శించారు. ఆనాటి నుండీ వారి బాధ పూర్తిగా నివృత్తి అయింది.

సంజీవయ్య (నాగులవెల్లటూరు) గారి అబ్బాయి ఓబయ్య స్వామితోటి చిన్ననాడు ఆడుకున్న స్నేహితుడు. వీరు చాలాకాలంగా ఉబ్బసంతో బాధపడుతున్నారు. వీరు తన జబ్బును గూర్చి శ్రీస్వామివారికి విన్నవించుకున్నారు. శ్రీస్వామివారు వీరి శరీరమంతా తమ అరచేత్తో రుద్దినారు. నాటి నుండీ మరలా ఆయనకు ఉబ్బసం రాలేదు.

పెనవర్తి వాస్తవ్యులు వల్లపురెడ్డి తులశమ్మకు క్యాన్సరు వ్యాధి, అమెరికన్ ఆస్పత్రిలో చేర్చారు. డాక్టరు బేరమ్మగారు ప్రయోజనం లేదని, రోగి ఏ నిమషాన్నయినా మరణించవచ్చని చెప్పి వెంటనే ఇంటికి తీసుకుపొమ్మన్నారు. మరురోజు వరకు ఉంచమంటే కూడా ఉంచకుండా బంధువులామెను శ్రీస్వామివారి దగ్గరకు తీసుకొచ్చారు. ఆమెను మూడు రోజులు శ్రీస్వామివారి దగ్గర ఉంచారు. శ్రీస్వామివారు 'ఆమెను మూడు రోజులు ఇంట్లో ఉంచి తీసుకురండి' అని ఆజ్ఞాపించారు. అట్లాగే చేసారు. ఆ వ్యాధి ఏమైందోగాని తరువాతామె సుమారు ఇరవై సంవత్సరాలు నిరంతరం శ్రీస్వామివారి సేవకు అంకితమైంది. ఈమెను గూర్చి ఒకప్పుడు శ్రీస్వామివారు 'అయ్యో! అమ్మ బొమ్మపాటున గదా ఉండేది!' అని అన్నారు. తులశమ్మను శ్రీస్వామివారు ఎప్పుడూ 'అమ్మా' అని పిలిచేవారు. బొమ్మపాటు అంటే బ్రహ్మం యొక్క సమీపమని శ్రీస్వామివారి భావం. అమ్మ అంటే ప్రకృతిమాతకు సంకేతం. భగవంతునిచేత ప్రసాదించబడిన నూతన జీవితాన్ని ఆమె భగవంతుని సన్నిధిలోనే, సేవలోనే గడపాలని వారి ధర్మ నిర్ణయం.

తులశమ్మగారికి అంతకాలం శ్రీస్వామివారి సేవాసాన్నిధ్యాలు ఎందుకు లభించాయో ఒకసారి శ్రీస్వామియే శెలవిచ్చారు. 'అయ్యా! అమ్మ మనకు

నాలుగు జన్మల నుండి అన్నం పెడుతున్నదయ్యా!' అన్నారు. అలా ప్రీతితో కొన్ని జన్మలు సద్గురు సేవ చేసిన వారికే నిరంతరమైన సద్గురు సాన్నిధ్యము, సేవా లభిస్తాయి.

పల్లంరెడ్డి కృష్ణారెడ్డిగారు తరచుగా శ్రీస్వామివారి దర్శనార్థం రావటం కద్దు. సంగం గ్రామస్తులొకరు కృష్ణారెడ్డిగారితో కలిసి పిల్ల పెత్తనం కొరకు గొలగమూడి వచ్చి శ్రీస్వామివారిని చూచాడు, 'ఏమి స్వామి ఈయన? ఇట్లా వున్నాడే?' అనుకొని ఆశ్రమం వద్ద నిలుచున్నాడు. అంతలోనే ఒకరికి తేలు కుట్టి విపరీతమైన బాధతో శ్రీస్వామివారి దగ్గర కొచ్చారు. శ్రీస్వామివారు 'అదేమి చేస్తుందయ్యా? పోతుంది', అన్నారు. మాటమాత్రంతో అతడా బాధ నుండి విముక్తుడయి మామూలుగా నడిచి ఇంటికి పోయాడు. ఇది చూచి పై పెద్ద మనిషికి బుద్ధి వచ్చి భక్తిభావంతో నమస్కరించాడు. ఈయన వెళ్ళిన ఐదు నిమిషాలకు శ్రీస్వామివారు 'తేలు కుడ్తే భలే బాధ గదయ్యా!' అన్నారు.

కలిచేడు నరసారెడ్డి ఎద్దుకు పాము కరిచింది. దానికి కడుపు ఉబ్బి, మేత తినక చొంగ కారుస్తున్నది. చనిపోయేస్థితిలో ఉంటే దాన్ని బండి మీద శ్రీస్వామివారి దగ్గరకు తీసుకుపోయారు. శ్రీస్వామివారు పాము కరచిన గాయముపై చేయి పెట్టి తమ శ్వాస గట్టిగా లాగి వదిలారు. అంతవరకు మేత తినని ఎద్దు వెంటనే లేచి, పేడవేసి, గడ్డి తినటం మొదలు పెట్టింది. స్వామివారి యోగశక్తికి అందరూ అబ్బురపడ్డారు.

ఒకరోజు శ్రీస్వామివారు 'నరసారెడ్డికి పాము గండమున్నది. తిరువళ్ళూరు వీరరాఘవస్వామి రక్షిస్తారు' అని చీటి వ్రాయించారు. కొంత కాలం తరువాత, గాది అడుగున కొద్దిగా వడ్లుంటే అవి తీసేందుకు ఒకరోజు రెడ్డి గాదిలోకి దిగాడు. తన కాలికి ఏదో మెత్తగా కప్పలాగా తగిలింది. కాలు మరొక తావుకు మార్చాడు. ఎన్ని తావులకు మార్చినా అట్లాగే తగిలింది. ఏమిటి ఇన్ని కప్పలున్నాయని లాంతరు తెప్పించి చూచాడు. తాను పెద్ద త్రాచుపామును త్రొక్కుచున్నట్లు తెలుసుకుని ఒక్కసారిగా బయటకు దూకాడు. పామును కొట్టివేశాడు. త్రాచుపామును త్రొక్కినప్పటికి అది కరవలేదంటే అది కేవలం పూర్వం శ్రీస్వామివారు వ్రాసి ఇచ్చిన చీటి ప్రభావమేనని గుర్తించాడు.

ఒకప్పుడు గుత్తా నరసమ్మకు మోకాలు నొప్పి చేసి బాధ పెట్టింది. కాలు ముడవలేక పోయింది. శ్రీస్వామివారి విభూతి పూసినా తగ్గలేదు. 'స్వామీ! మనకు అన్నం వండే నరసమ్మకు మోకాలు నొప్పి చేసి వంచలేకుండా ఉన్నది' అని శ్రీస్వామివారికి చెబితే 'ఇంకెప్పటికీ రాకుండా చీటి వ్రాసి ఇవ్వండయ్యా!' అన్నారు. శ్రీస్వామివారి సేవకులు అలాగే చీటి వ్రాసి ఆమెకు ఇచ్చారు. అది మొదలు ఆమెకు బాధ పూర్తిగా నివారణైంది.

ఒకరోజు శ్రీస్వామివారు తనకు మంత్రించమని గోలచేస్తున్నారు. ఆరోగ్యంగా ఉన్న శ్రీస్వామివారు అలా ఎందుకు అంటున్నారో భక్తులకర్థం కాలేదు. కొంతసేపటికి తూపిలి పిచ్చెమ్మకు పాము కరచి శ్రీస్వామివారి దగ్గరకు తీసుకువచ్చారు. సర్వజ్ఞులైన శ్రీస్వామివారు తన భక్తురాలి బాధను తొలగించుటకే మంత్రించమన్నారని అందరూ గుర్తించారు. ఏ మందూ లేకుండా శ్రీస్వామివారి విభూతితోనే నయమైంది.

గొలగమూడి కరణం సుబ్బారావు గారి భార్య శకుంతలమ్మ గారు చాలా కాలం ఉబ్బసంతో బాధపడుతుండేది. ఎందరో డాక్టర్ల దగ్గర వైద్యం చేయించారు. వేలకొద్దీ డబ్బు ఖర్చు చేశారు. ఈషణ్మాత్రం తగ్గలేదు. ఇక లాభం లేదని ఆంజనేయస్వామికి ప్రదక్షిణలు చేయించాలని అనికేపల్లి నుండి గొలగమూడి వచ్చి శ్రీ వెంకయ్యస్వామివారికి విన్నవించుకున్నారు.

'20 రోజులలో తగ్గిపోతుంది. మీరు గొలగమూడిలో నివసించే ఇల్లు వదలి పోవద్దు. మీ స్థిరనివాసమైన అనికేపల్లి వదలి గొలమూడిలోని పూరిపాకలోనే స్థిరంగా ఉండండి. నేను చెప్పినదాకా గట్టి ఇల్లు కట్టవద్దు' అని చెప్పారు శ్రీస్వామివారు. అలానే చేస్తే శ్రీస్వామివారు చెప్పిన టైముకు అన్ని సంవత్సరాలు బాధించిన ఉబ్బసం అంతులేకుండా పోయింది.

1981వ సంవత్సరంలో తుఫాను వల్ల గొలగమూడిలోని ఆ పూరిపాక కూలిపోయింది. ఆ స్థలంలోనే ఇల్లు కట్టే ప్రయత్నంలో శ్రీస్వామివారికి చెప్పకుండానే ఇల్లు వేసుకున్నదాకా అనికేపల్లిలోని వారి పాత మిద్దెలో తాత్కాలికంగా ఉండేందుకు వెళ్లారు. మరలా జబ్బు చేసింది. ఈసారి ఆపరేషన్ చేయించవలసివచ్చింది. మరలా శ్రీస్వామివారికి చెప్పుకుంటే 'ఈ పూరింటిలోనే ఉండండి. ఆరోగ్యం బాగుంటుంది'. అని వ్రాయించి ఇచ్చారు. వారు అలానే

చేశారు. శ్రీస్వామివారి కృపవలన మరలా ఆ జబ్బు కనిపించలేదు. కనుకనే కృతజ్ఞతతో ప్రతినిత్యం పూజాద్రవ్యములు తెచ్చి స్వామివారు దేహత్యాగం చేసినచోట శ్రీస్వామివారు ప్రతిష్టించిన పాదుకలను పూజిస్తుంటారు. అట్లా నియమంగా భక్తి శ్రద్ధలతో ఉండేటట్లు చేయాలంటే అది ఒక్క సద్గురునికే తగును కదా!

పెద్ద గోపారం నుండి 1979 ప్రాంతంలో ఒకామె శ్రీస్వామివారి దర్శనార్థం వచ్చింది. ఆమెకు 22 సం॥ల కుమారుడుండేవాడు. అతనికి 2 సం॥లకు పూర్వం మనస్సు స్థిమితం తప్పి పిచ్చిపట్టింది. ఆ యువకుని తమ వద్ద ఉంచమని ఆజ్ఞాపించారు. క్రమేణా పిచ్చి తగ్గి స్వస్థుడయ్యాడు. ఆమె ఈనాటికి తన ఇంటిలోనే శ్రీస్వామివారికి నిత్యం దీపారాధన చేసి పూజిస్తుంది.

కలిచేడు ఈశ్వరమ్మకు కడుపులో గడ్డ లేచి తొమ్మిది నెలల గర్భంవలె యుండేది. డాక్టర్లు ఆపరేషన్ చేయాలన్నారు. అంత వరకు శ్రీస్వామివారితో ఆమెకు గల అనుభవముల కారణంగా అచంచల విశ్వాసంతో శ్రీస్వామివారినే తరుణోపాయం వేడింది. 'అమ్మా నీవు రూ॥ 100/- కడితే రేపటికి బాధ నివారణవుతుంది' అని శ్రీస్వామివారు సెలవిచ్చారు. పూర్ణవిశ్వాసానికి నిదర్శనంగా ఆమె ఇంటికి కూడా పోకుండా ఊరిలో ఎవరినో అడిగి తెచ్చి రూ॥ 100/- వెంటనే సమర్పించింది. నాటి రాత్రి శ్రీస్వామివారు తనకు ఆపరేషన్ చేసినట్లు స్వప్నమొచ్చింది. తెల్లవారి క్రమంగా బాధ తగ్గి ఆరోగ్యం చేకూరి ఆపరేషన్ అవసరం లేకుండానే పొట్టవాపు తగ్గిపోయింది.

రోశిరెడ్డికి చేతి వేలిమీద పాము కరచింది. ఆ వ్రేలును శ్రీస్వామివారు తమ తొడపై పెట్టమని తమ కుడి అరచేతితో కొంచెంసేపు నొక్కి వుంచారు. బాధ పూర్తిగా తగ్గింది. 'రోశిరెడ్డీ! నీ వళ్ళు సంజీవి అయిందయ్యా' అన్నారు శ్రీస్వామివారు. ఆనాటి నుండీ రోశిరెడ్డిగారిని ఎన్నోమార్లు విషజంతువులు కరచినా గాని విషమెక్కదు.

కొట్టుకూటి హరనాథనాయుడు (గొలగమూడి) గారికి నోటి వెంట రక్తం పడేది. ఇంగ్లీషు మందులు వాడితే తగ్గింది. కానీ కొన్నాళ్ళకు మరలా రక్తం పడటం ప్రారంభమైంది. ఈసారి వైద్యులకు వైద్యుడైన శ్రీ వెంకయ్య స్వామిగారిని ఆశ్రయించాడు. 'ఏ మందూ లేకుండా తగ్గితే టెంకాయ కొడతాను' అని మ్రొక్కుకున్నాడు. చిత్రంగా అది మొదలుకొని ఏ మందూ

లేకుండానే రక్తం పడడం ఆగిపోయింది.

ఒకప్పుడు శ్రీ వెంకయ్యస్వామివారు పెన్న బద్వేలులో మకాం చేశారు. ఆ సమయంలో మహిమలూరు వాస్తవ్యులు మునికూటి రామయ్యగారికి కడుపునొప్పి, దడ, బలహీనతా, వళ్ళు నొప్పులూ వచ్చాయి. వాటిని తగ్గించడం డాక్టర్లవల్ల కాలేదు. పెన్నబద్వేలు వాస్తవ్యులు ఒకరు వారింటికి వచ్చి శ్రీస్వామివారి మహిమను గూర్చి చెప్పి, పెన్నబద్వేలుకు వచ్చి వారిని దర్శించి బాధ నుండి విముక్తులవమని చెప్పారు.

ఆనాటి రాత్రి శ్రీస్వామివారు రామయ్య గారికి స్వప్నదర్శనమిచ్చి, 'నేను పెన్నబద్వేలులో ఉన్నాను. నా దగ్గరకురా నయం చేస్తాను' అని చెప్పారు. అదే ప్రకారం అతడు శ్రీస్వామివారిని దర్శించి స్వప్నంలో కన్పించి చెప్పినది వీరేనని గుర్తించి ఆశ్చర్యపోయారు.

శ్రీస్వామివారు అతనిని ఒక నెలరోజులు తమ సన్నిధిలో ఉండమని ఆజ్ఞాపించారు. అతడలానే చేస్తే యేమందులూ లేకుండానే స్వస్థుడైనాడు. అది మొదలు తమ ఇంటి దగ్గర శ్రీస్వామివారికి ఒక పూరిపాక కేటాయించి శ్రీస్వామివారికి ఆతిథ్యమిస్తూ, పేదవాడైనా చాల భక్తిశ్రద్ధలతో శ్రీస్వామివారిని సేవించాడు.

శ్రీస్వామివారు మునికూటి రామయ్య గారింట్లో వుండగా ఒకరోజు వారిని కొంచెం బియ్యం తెమ్మని, ఆ బియ్యాన్ని అచ్చటనున్న మంచినీళ్ళ బాన దగ్గరవేసి, 'అయ్యా! ఇది మిద్దియిల్లౌతుంద'ని ఆశీర్వదించారు. కటిక పేదవాడైన రామయ్యగారు కొద్దికాలంలో నిజంగా శ్రీమంతుడై మిద్దెకట్టుకున్నాడు. మహాసమాధి అనంతరం కూడా స్వప్నంలో శ్రీస్వామివారు ఇచ్చిన ఆజ్ఞమేరకు నెలకోసారి శ్రీస్వామివారి సమాధి దర్శనార్థం గొలగమూడి వస్తుంటారు.

నారాయణరెడ్డి తల్లిగారైన తులశమ్మగారు నరసమ్మగారికి ఇలా చెప్పారు. 'ఒకడు కడుపు నొప్పితో చాలాకాలం బాధపడ్డాడు. ఎన్నో వైద్యాలు చేయించాడు గాని నెమ్మదించలేదు. ఎవరో చెప్పగా విని శ్రీస్వామివారి సన్నిధికి వచ్చి కొన్నాళ్ళున్నాడు. నొప్పికాస్త తగ్గింది. కానీ పూర్తిగా పోలేదు. ఒకనాటి రాత్రి అతనికి స్వప్నంలో తాటిమాను ప్రమాణం పైకిలేచి మండే అగ్నిగుండం

పై భాగంలో శ్రీస్వామివారు కూర్చుని దర్శనమిచ్చారు. ఆ దృశ్యం చూచి భయంకరంగా అరిచాడు. అందరూ అతనిని తట్టి లేపి స్థిమితపరచారు. తెల్లవారే సరికి అతని బాధ ముప్పాతిక తగ్గింది. శ్రీస్వామివారు అతనితో, 'అయ్యా! నీ నొప్పి ఇంతకు పెరగదు, తగ్గదు, నీవు ఇంటికిపో' అని ఆజ్ఞాపించారు. అతడట్లే వెళ్ళిపోయాడు.

నెల్లూరు వాస్తవ్యులు తాళ్ళూరు శ్రీనివాసులు గారికి గుండెనొప్పి వగైరా వుండేవి. చిన్ననాటి నుండి భయం వుండేది. శ్రీస్వామివారిని దర్శించిన తరువాత తన శారీరక బాధలేగాక మానసిక బాధలు గూడా మటుమాయమైనాయి. కనుకనే ఎల్లప్పుడూ వచ్చి శ్రీస్వామివారి సమాధిని దర్శిస్తుంటారు.

ఒకప్పుడు వీరికి చెయ్యి విపరీతంగా నొప్పి పుట్టింది. వీరి అక్కగారు, భార్య మాతుల్లా ఆసుపత్రికి పోవాలని వీరిని తీసుకొస్తున్నారు. శ్రీస్వామివారిపై అచంచల విశ్వాసం గల శ్రీనివాసులు ఆసుపత్రి దగ్గరకొచ్చాక 'నేను శ్రీస్వామివారి దగ్గరకుపోతాను. ఈ మందులు నాకు పనిచేయవు' అని నేరుగా గొలగమూడిలోని శ్రీస్వామివారి సన్నిధి చేరాడు. చిత్రంగా బస్సు ఎక్కినది మొదలు నొప్పి లేదు. నాకు (రచయిత) ఒక నెలరోజులు బాధించిన దగ్గు, చలి శ్రీస్వామివారి దగ్గరకు రావాలని బస్సు ఎక్కినది మొదలు లేకుండా పోవటం శ్రీనివాసులు అనుభవంవలెనే వుంది. విశ్వాసం కొండలనే కదిలిస్తుందంటారు, నిజమేగదా మరి!

డేగపూడి గ్రామ వాస్తవ్యులు మద్దినేని కామాక్షమ్మగారు చాలాకాలంగా శ్రీస్వామివారిని భక్తితో సేవించేది. ఒకప్పుడామె నడుమునొప్పితో చాలా బాధపడుతూ శ్రీస్వామివారికి అనేకసార్లు చెప్పింది. అనేక ఆకుపసరులు, పట్లు వేయమని శ్రీస్వామివారు చెప్పారు. అవి వేసినా నయం కాలేదు. ఒకనాడు శ్రీస్వామివారికి చెప్పుకుంటే 'ఎల్లుండికి తీసేసినట్లు బాధపోతుంది' అని చీటీ వ్రాయించారు. ఆ తర్వాత మరలా ఆ నొప్పి రాలేదు. ఒకరోజు శ్రీస్వామివారి చెంత నిలుచుంటే శ్రీస్వామివారు 'అమ్మా! వీరరాఘవులు స్వామి నీ తమ్ముడు, భజన చేసుకో! జబ్బులురావు. చేప, మాంసం తినవద్దు' అని సెలవిచ్చారు.

వీరి కుమారునకు వివాహమై పది సంవత్సరములైనా సంతానం లేదు.

శ్రీస్వామివారినడిగితే ఆయనకు ముగ్గురు బిడ్డలు పుడతారని చెప్పారు. 'ఇన్నాళ్ళ వరకు పుట్టలేదుగదా ఇంకేం పుడతారు స్వామీ' అంటే 'కులంగాని కులం వారు వస్తుంటే ఆపుచేశాను. ఇప్పుడు వెంకటగిరి కోమిటోళ్ళ పిల్లల్ని వదులుతున్నాను' అని వ్రాయించి ఇచ్చారు. అలానే అతనికి కొద్దికాలానికి బిడ్డ పుట్టాడు. కానీ తల్లికి చనుపాలు లేవు. శ్రీస్వామివారిని ప్రార్థించారు. రాత్రి స్వప్నంలో శ్రీస్వామివారు దర్శనమిచ్చి తన కౌపీనం (గోచీగుడ్డ) తాడులాగా పేని ఇచ్చి దానిని తల్లికి తాకించమన్నారు. తెల్లవారి నుండి తల్లికి చనుపాలు పడినవి. ఆనాటి నుండి ఆ కుటుంబమంతా శ్రీస్వామివారి సేవ చేస్తున్నారు.

శ్రీస్వామివారు తిరిగే రోజులలో ముదిగేడులోని తిమ్మారెడ్డిగారింటికి తన బృందంతో వేంచేసేవారు. కోడూరు వెంకమ్మవాళ్ళు ఎన్నిమార్లు తమ గృహమునకు రమ్మని ఆహ్వానించినా ఇప్పుడు గాదులే అని శ్రీస్వామివారు దాటేసేవారు. ఒకరోజు రాత్రివేళ వచ్చి శ్రీస్వామివారు వెంకమ్మగారింట్లో ఎద్దుల గాటిలో కూర్చునున్నారు. వెంకమ్మ బావగారు ఎద్దులకు గడ్డి వేయబోయి శ్రీస్వామివారిని చూచి అందరినీ నిద్రలేపి శ్రీస్వామివారికి చాపలు పరచి స్వాగతం పలికారు. అది మొదలు శ్రీస్వామివారు అప్పుడప్పుడు వచ్చి వారింట్లో ఒక నెల రోజులు ఆతిథ్యం స్వీకరించేవారు.

ఒకప్పుడు వెంకమ్మకు ఆకలి లేకుండాపోయి ఏ ఆహారం చూచినా కక్కు వచ్చేది. ఐదు సంవత్సరములపాటు బలహీనమై మంచాన పడిపోయింది. ఆమె వయస్సు ఇరవై సం॥లకు లోపలే వుంటాయి. ఎందరో డాక్టర్లు, నాటు వైద్యులు, మంత్రగాళ్ళు చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. శ్రీస్వామివారు వీరింటికి వచ్చినప్పుడల్లా వెంకమ్మ తల్లి శ్రీస్వామివారికి విన్నవించేది. కానీ శ్రీస్వామివారు పెన్న బద్వేలులో వుండి వెంకమ్మను తన దగ్గరకు తీసుకురమ్మని జాబు వ్రాయించారు. వారామెను అలాగే తీసుకువెళ్ళారు. శ్రీస్వామివారిని చూచినది మొదలు ఆమెకు విపరీతమైన ఆకలి మొదలైంది. ఒక శేరు బియ్యం అన్నం పెడితే చాలలేదు. రెండు శేర్లు బియ్యం వండితే మొత్తం తినేసేది. రాత్రింబవళ్లు ఈమెను నిద్రపోనీయకుండా శ్రీస్వామివారు తన చెంతనుంచుకొని వేలిముద్రలు వేయిస్తుండేవారు. మూడవ రోజు శ్రీస్వామివారు ఆమెను బొత్తిగా అన్నం తిననివ్వలేదు. మూడవరోజు రాత్రి

ఒక అరటిపండు, పిడికెడు పేలపిండి మాత్రం తినిపించారు. అది మొదలు ఆమెకు ఆరోగ్యం చక్కబడి మామూలు ఆకలి మొదలైంది. శ్రీస్వామివారు శరీరంతో వుండగానే వారి సేవలకంకితమై నేటికీ వారి సమాధిని భక్తితో సేవిస్తూంది.

గౌని పెంచలమ్మ (గొలగమూడి) ఆయాసము, దగ్గుతో చాలాకాలంగా విపరీతంగా బాధపడింది. అన్ని వైద్యములూ విఫలమైనాయి. ఒకనాడు శ్రీస్వామివారికి విన్నవించుకొంటే 'ఆరు రూపాయలు పెట్టు' అన్నారు. ఈమెవద్ద ఆ పైకం లేనందున మారు మాట్లాడక నిలుచున్నది. 'ఏమమ్మా! జబ్బు పోవాలనుకుంటున్నావా? వెయ్యి రూపాయలు గుండములో పోయి పోతుంది' అన్నారు. దానికి కూడా పలక్కుండా నిలుచున్నది. మరొకరోజు ఈమె ఐదు రూపాయలు శ్రీస్వామివారికి సమర్పించి మరలా తన బాధను గూర్చి విన్నవించుకున్నది. 'నేను కాదు నీకు బాగుచేసేది. అమ్మ బాగుచేస్తుందిపో!' అని ఆ ఐదు రూపాయలు తిరిగి ఆమెకిచ్చి ఆమెను తులశవ్వ దగ్గరకు పంపారు. ఆ విషయం విని తులశవ్వ నవ్వుకున్నది. 'వారు అప్పుడప్పుడు అట్లాగే చెపుతారు. నిజానికి నీ జబ్బు పోగొట్టారుపో' అని చెప్పింది అవ్వ. క్రమేణా రెండు వారాలలో ఆమె బాధ పూర్తిగా తగ్గిపోయింది. ఆ దగ్గు, ఆయాసం మరి ఎన్నడూ కనపడలేదు.

పల్లంరెడ్డి కృష్ణారెడ్డిగారికి ఒకే ఒక బర్రె ఉండేది. దానికి జబ్బుచేసి పొట్ట ఉబ్బి చావుబ్రతుకుల్లో ఉంది. 'శ్రీస్వామివారిని నమ్ముకున్నందుకు ఈ ఒక్క బర్రెను కూడా చంపేస్తున్నాడే!' అని బాధపడి పడుకొని నిద్రపోయాడు. స్వప్నంలో శ్రీస్వామివారు బర్రె దగ్గర కూర్చుని కన్పించారు. మెలకువ వచ్చి లేచి బర్రెను చూస్తే నెమరు వేస్తున్నది. లేవగొడితే ఒక బక్కెట్టు మూత్రం విసర్జించి మేత తినడము మొదలుపెట్టింది. పొట్ట ఉబ్బరం ఎలా పోయిందో ఆశ్చర్యం.

శ్రీస్వామివారు తలుపూరు 'మాదిగ నాం' గని దగ్గర విడిది చేశారు. ఒకనాడు అచ్చట నుండి వెళ్ళాలని సామాన్లన్నీ కట్టుకున్నాక 'నొప్పం (నొప్పి) వచ్చింది పోయేందుకు లేదు' అని శ్రీస్వామివారు కదలలేదు. ఒక గంటలో కడుపునొప్పితో మెలికలు తిరిగిపోతున్న బిడ్డనెత్తుకొని ఒక తల్లి వచ్చింది. శ్రీస్వామివారు చీటీ వ్రాయించిన వెంటనే నిమిషాలమీద ఆ పిల్లవాడు

స్వస్థుడైనాడు.

తలుపూరు గ్రామం, వింజం మీనమ్మ ఇలా చెపుతుంది.

నా కుమారుడు చిరంజీవి ప్రసాద్ 11 నెలల పిల్లవాడు. కొద్దిగా నడిచే రోజులు. 1972లో ఎడమకాలు చచ్చు వచ్చి కదిలించలేకపోయాడు. నెల్లూరు డాక్టర్లు వెన్నుపూసలో నీరు తీయాలని మందులు వాడమని వ్రాస్తే వాడుతున్నాము. 4వ రోజు శ్రీస్వామివారు మా ప్రక్క ఇంట్లో విడిది చేసియున్నారు. అందరూ పిల్లవానిని వారికి చూపించమన్నారు.


అప్పటి వరకు శ్రీస్వామివారి బృందం అంటే పొట్ట గడుపుకునే సోమరి బృందం అని తూలనాడేదాన్ని. అందరి బలవంతంపై బిడ్డను తీసుకెళ్ళి నిలుచున్నాను. ఉదయం నుండి ఎంతోమంది వచ్చివుంటే మాట చెప్పని శ్రీస్వామివారు నేను వెళ్ళిన వెంటనే 'ఈ పిల్లవానికి 16వ రోజుకు కాలుపోతుంది. ఆయుస్సు 6, కాదు, 7 ఆ! ఆ! 9, లేదు 16 సంవత్సరములు అంతే' అని వ్రాయించి చీటీ ఇచ్చారు. నాకు దు:ఖం పొర్లుకొచ్చి ఏడుస్తూ 'నా బిడ్డను ఈ పాడు ముసలాడి దగ్గరకు ఎందుకు తీసుకొచ్చాను. భలే దీవించాడే' అని ఏడుస్తూ వచ్చేశాను.

16వ రోజు ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నాను. ఆ రోజు నిద్రలేస్తూనే నా బిడ్డ పరుగెత్తుకుంటూ నా దగ్గరకు వస్తుంటే నా ఆనందం చెప్పనలవి కాదు. పనంతా వదిలేసి బిడ్డను తీసుకొని భార్యాభర్తలం ఇద్దరం 30 మైళ్ళ దూరంలో గొలగమూడిలో వున్న శ్రీస్వామివారి సన్నిధికి వచ్చి క్షమించమని ప్రాథేయపడి వారికి పొంగలి, టెంకాయ నైవేద్యం సమర్పించి వెళ్ళాము. అది మొదలుకొని నా బిడ్డ ఏ మందూ లేకుండా ఆరోగ్యంగా వున్నాడు. వాడి ఆయుష్షు విషయం కూడా ఏదో తెలియని విధంగా ఆశీర్వాదమేననుకుంటాను. కారణం శ్రీస్వామి వారు 'చనిపోయే వాళ్ళను గూర్చి ఆయుస్సు తీరిందని ఎప్పుడూ చెప్పి ఎరుగరు. బంతి భోజనానికి పోతాడనో, పెళ్ళికి పోతాడనో' చెప్పేవారు.

బిరిజేపల్లి రమణయ్య ఇలా చెప్పారు. రాజపద్మాపుర కాపురస్తుడు ఒక బక్క ఎద్దును సేద్యం కొరకు తోలుకొస్తున్నాడు. ఆ గ్రామ సమీపంలో ఆ ఎద్దు నడవలేక పడిపోయి ఎంతకొట్టినా, తోకబట్టి లేవనెత్తినా లేవలేదు.

దూరంగా ఉన్న శ్రీస్వామివారు తమ సేవకుని పిలిచి 'అయ్యా! ఈ మార్గాన్నే పోయి ఎద్దును కొట్టే ఆయనను కొట్టవద్దని చెప్పు' అన్నారు. సేవకుడు వెళ్ళి చెపితే అతడు వినిపించుకోకుండా దాన్ని బాదుతున్నాడు. అతడు వెనుతిరిగి వచ్చి శ్రీస్వామికి విన్నవిస్తే శ్రీస్వామివారు స్వయంగా అచ్చటికి వెళ్ళి ఆ ఎద్దును తాకి 'లెయ్' అన్నారు. దానికాశక్తి ఎలా వచ్చిందో చివుక్కున లేచి నిలిచింది. 'అయ్యా! నాలుగు రోజులు బండి కట్టబోకు. తరువాత బాగానే సేద్యం చేస్తుంద'ని ఆశీర్వదించారు. ఆ ఎద్దు బక్కగావున్నా కొండంత పని అంతులేకుండా చేసేది.

ఒకరోజు శ్రీస్వామివారు నెల్లూరు రంగనాయకులపేట దేవాలయంకు వెళ్ళారు. గర్భగుడి మూసే టైం అయినప్పటికి శ్రీస్వామివారి ఎడల పూజారులకు గల భక్తివల్ల గుడి తలుపులు తెరచివుంచి భోజనాలకు వెళ్ళారు. శ్రీస్వామివారు అచ్చట మాట్లాడిన తీరు చిత్రంగా వుంది. 'ఒరేయ్ రంగనాయకులా! పిలిస్తే పలకవేమీ? కావరమా? గ్రుడ్లు వత్తేస్తా! జాగ్రత్త! ఏమిటి నీ పద్ధతి? చెప్పినట్లు చేస్తావా లేక పండ్లు ఊడకొట్టమంటావా? ఏమనుకున్నావ్? మనం చెప్పినట్లు వింటాడంట, వచ్చిన పని అయింది. మనం పోదాం పదండి' అని అందరినీ తీసుకొని వచ్చేశారు. ఇదే విధంగా పెంచల నృసింహస్వామిని కూడా ఉగ్రులై తిట్టేవారు. శ్రీస్వామివారి ఆజ్ఞలు వారు పాటిస్తామని మాట చెప్పాక శాంతించి వచ్చేసేవారు. వీరు ఏమి ఆజ్ఞాపించారో, వారు ఏమి చేస్తానన్నారో శ్రీస్వామివారికే తెలియాలి.




ఓం నారాయణ - ఆదినారాయణ

# అవధూత లీల

## అధ్యాయము - 9

## దయాసాగరుడు



**పరమ కారుణ్యమూర్తియైన శ్రీస్వామివారు తమను సంపూర్ణంగా నమ్ముకున్న భక్తులు ఈ విశ్వములో ఎచ్చట ఉండి స్మరించిననూ వెంటనే వారిని చిత్రమైన రీతులలో ఆదుకొనేవారు. భరించలేని భయంకరమైన వ్యాధులతో** 28
**బాధపడుతూ, బాధ భరించలేక శ్రీస్వామివారిని ప్రార్థించినప్పుడు అట్టివారి బాధను శ్రీస్వామివారు తన శరీరం పైకి తీసుకొని తానే అనుభవించి ఆ భక్తుని బాధ తీర్చేవారు.**

ఒకప్పుడు శ్రీస్వామివారికి ఆయాసం వచ్చి చాలా బాధపడుతున్నారు. భక్తులు తెల్లగడ్డల (చిన్న ఉల్లిపాయల) రసం తీసి సుమారు చిన్నగ్లాసెడు త్రాగించారు. శ్రీస్వామివారికి నాడి అందకుండా పోయింది. శ్రీస్వామివారు శరీరం వదిలేస్తున్నారని అందరూ అర్ధరాత్రిపూట వరకు కూర్చుని ఏడ్చి, నిద్రపోయారు. కొంతసేపటికి వారు నిద్రలేచి చూస్తే శ్రీస్వామివారు లేరు. అందరూ అన్నిచోట్ల వెదుకుచున్నారు. అరగంటకు శ్రీస్వామివారు అప్పుడే స్నానం చేసి నవ్య నూతనంగా చిరునవ్వు లొలికిస్తూ వస్తున్నారు. ఆ దృశ్యం చూచి అంతా విస్తుపోయారు. ఏ భక్తుని బాధ వారు ఆ విధంగా తీసుకున్నారో ఎవరికి తెలుస్తుంది.

ఒకప్పుడొక కుష్టువ్యాధి పీడితుడు శ్రీస్వామివారి సన్నిధిలో ఉన్నాడు. శ్రీస్వామివారు బాధతో మూలుగుతున్నారు. అర్ధరాత్రివేళ రోశిరెడ్డి శ్రీస్వామివారి భాధను చూడలేక శ్రీస్వామివారి పాదములు వత్తటానికి కాళ్ళు పట్టుకున్నాడు. 'అబ్బో, అబ్బో! ఇప్పుడు నన్ను తాక కూడదు. దూరంగా పోయ్యా' అన్నారు శ్రీస్వామివారు. ఒక గంట తరువాత రోశిరెడ్డి కాలి బొటన వేలి క్రింద నిష్కారణంగా వ్రయ్యగా చీలి కుష్టువ్యాధివలె వ్యాపించింది. కుష్టురోగి బాధను శ్రీస్వామివారు తీసుకొని యుండగా తాను శ్రీస్వామివారిని తాకిన

ఫలితమిదియని గుర్తించి రోశిరెడ్డి నాలుగు రోజులు కేవలం గురుస్మరణ చేశాడు. నాలుగవ రోజుకు తన కాలు ఏమందూ లేకుండానే మామూలుగా బాగయింది.

గౌని పెంచలమ్మకు (గొలగమూడి) వళ్ళంతా విపరీతమైన జిల (దురద). నెలల తరబడి బరికిబరికి వళ్ళంతా మంటలు వచ్చాయి. ఎన్నో వైద్యాలుచేసినా ఉపయోగంలేక మానుకున్నది. తన బాధను గురవయ్య ద్వారా శ్రీస్వామివారికి విన్నవించుకున్నది. ఆమెను రూ. 1000/- గుండంలో పోయమన్నారు. ఆమె అంత పెద్ద మొత్తం లేదని చెప్పింది. 'అయితే పదిరూపాయలు వేయమ'ను అన్నారు శ్రీస్వామివారు. తన దగ్గర పదిపైసలు కూడా లేవని మరురోజు మొరపెట్టుకున్నది. "ఆమెను ఐదు నిముషాలు నా ఎదురుగా నిలుచోమనయ్యా" అన్నారు శ్రీస్వామివారు. ఆమె అలా నిలుచున్న ఐదు నిమిషాలకు ఆమెను వెళ్ళిపొమ్మన్నారు. ఆ క్షణం నుంచి ఆమె దురదలు శాశ్వతంగా నివారణయ్యాయి. అయితే ఆ క్షణం నుంచి శ్రీస్వామివారు విపరీతమైన వంటి దురదతో వారం రోజులు బాధపడుతూ దువ్వెనతో ఒళ్ళంతా బరికించుకున్నారు.

శ్రీరాముడు, శ్రీకృష్ణుడువంటి అవతార పురుషులందరూ మామూలు మానవులుగానే వ్యవహరించారు. అదేవిధంగా చూచినట్లయితే శ్రీస్వామివారు శిబిచక్రవర్తిని మించిన త్యాగశీలి. కారణం తన నాశ్రయించిన వారికి తన శరీరాన్నే సమర్పించారు గదా!

శ్రీస్వామివారు కొందరికి ప్రత్యేకంగా కొన్ని వర్ణస్తుల ఇండ్లలో భోంచేస్తే జబ్బు పోతుందని చెప్పేవారు. బ్రాహ్మణింట్లో రెండు పూటలు అన్నం తిను అని గానీ, కోమటోళ్ళన్నం మూడుపూటలు తిను అని చెప్పేవారు. అట్లాగే ఇతర వర్ణస్తుల ఇండ్లలో తినమని చెప్పేవారు. వారి మాటయందు విశ్వాసముంచి అలా చేసిన వారు ఊహించనంతటి మేలు పొందారు. వారిమాట నిర్లక్ష్యము చేసిన వారా పెన్నిధిని పోగొట్టుకున్నవారైనారు.

నూతేటి శ్రీరామానాయుడు శ్రీస్వామివారు తిరిగే రోజులలో శ్రీస్వామివారిని దర్శించారు. శ్రీస్వామివారు అప్పుడే అన్నం తెచ్చుకొని తినబోతున్నారు. శ్రీరామయ్యను తినమని శ్రీస్వామివారు బలవంతం చేసినా తినలేదు. తను తింటే ఆ అన్నం శ్రీస్వామివారికి చాలదని తలచాడు. "అయ్యా!

ఇవి వట్టి మెతుకులనుకున్నావా? ముందు రోజులలో గదా తెలిసేది" అని అన్నారు శ్రీస్వామివారు. శ్రీరామయ్య దోసిలినిండా అన్నం పెట్టి, "అట్లా పోయి తిని, ఆ కుమ్మరోళ్ళింట్లో నీళ్ళు త్రాగిపో" అన్నారు శ్రీస్వామివారు. వారలానే చేశారు. ఎన్నో సంవత్సరముల తర్వాత గూడా నేటికీ శ్రీస్వామివారి సేవ కంకితమై శ్రీస్వామివారి సేవకులకు నిత్యం అనికేపల్లి నుండి భిక్షాన్నం తెచ్చిస్తున్నాడు. ఇది ఆనాడు శ్రీస్వామివారు "ముందు రోజులలో కదయ్యా తెలిసేది" అని ఆశీర్వదించిన ఫలితమే కాబోలు!

కలిచేడు వాస్తవ్యుడు, 'కళ్యాణరాం మైకాగని' సర్వేయర్ పోలిరెడ్డిగారికి కో-ఆపరేటివ్ సొసైటీలో కొన్ని చిక్కులు వచ్చాయి. అదే సమయంలో వారు పని చేసే గనిలో మేనేజరు పని ఖాళీ వుంది. కానీ సొసైటీ గొడవల వలన వారు గని ఓనర్ గారైన రాజాగారిని మేనేజరు పని తనకిమ్మని అడిగినా ప్రయోజనముండదని అడుగలేదు. సర్వజ్ఞమూర్తియైన శ్రీస్వామివారికా సొసైటీ గొడవలో ధర్మాధర్మాలన్నీ తెలియనివా!

ఒకరోజు పోలిరెడ్డిగారు శ్రీస్వామివారిని దర్శించి నమస్కరించారు. వారేమీ చెప్పుకోకుండానే శ్రీస్వామివారు "అయ్యో! ఈయన పాతాళ లోకానికధిపతి కావాలి. వాళ్ళెందుకో అడ్డు తగులుతున్నారు. దేవుడయ్యన్నీ తీసేస్తాడు. ఈయనకొక చీటి వ్రాసి ఇవ్వండి" అని చెప్పి తన ఆశీస్సుల చీటీ వ్రాసి వారికి ప్రసాదించారు. వీరే ప్రయత్నమూ చేయకుండానే వీరినే గని లోపల మేనేజర్‌గా నియమించారు. నాటి నుండి రెడ్డిగారికి శ్రీస్వామివారి యందు భక్తి శ్రద్ధలు దృఢమై నేటికీ ప్రతినెలా యాభై రూపాయలు ఆశ్రమానికి దక్షిణగా పంపుతుంటారు.

చెర్లోపల్లి వాస్తవ్యురాలు కూచి ఈశ్వరమ్మ చెప్పారు. ఒకనాటి రాత్రి తొమ్మిది గంటలకు అందరూ నిద్రపోతున్నారు. శ్రీస్వామివారు కూర్చుని యున్నారు. సమీపంలో రమణయ్య కూర్చొని కునికిపాట్లు పడుతున్నారు. శ్రీస్వామివారి కొరకు పెసర గుగ్గిళ్ళు తెచ్చిన ఈశ్వరమ్మ అంతదూరాన నిలబడి, 'అయ్యయ్యో! అందరూ నిద్రపోతున్నారే! ఈ గుగ్గిళ్ళు ఉపయోగపడే యోగ్యత లేక పోయింది!' అని మనసులో అనుకుంటూ వున్నది. శ్రీస్వామివారు చేయిచాచి "నాకు పెసర గుగ్గిళ్ళు పెట్టమ"ని రమణయ్యని అడుగుతున్నారు. "ఇది రాత్రి స్వామీ! ఉదయాన్నే తయారుచేయించి పెడ్తాము" అన్నాడు

రమణయ్య. శ్రీస్వామివారు "నాకు ఇప్పుడు కావాలి" అని గట్టిగా అడుగుతున్నారు. ఇది విని ఈశ్వరమ్మ సంతోషంగా తన గుగ్గిళ్ళ సంగతి చెప్పి శ్రీస్వామివారికి సమర్పించింది.

కలిచేడు వాస్తవ్యులు నరసారెడ్డి భార్య ఈశ్వరమ్మ కడు పేదరాలు. శ్రీస్వామివారంటే ఆమెకెంత ప్రేమో చెప్పలేము. శ్రీస్వామివారు ఆ ప్రాంతములో ఎప్పుడు పర్యటించినా వారి ఇంటి ముందున్న మసీదు ముందుండే వేపచెట్టు క్రింద విడిదిచేస్తారు. ఆమె తన ఇంట్లో ఒక కిలో డబ్బానిండా చక్కెర దాచి పెట్టి దానిని ఎంతటి ఇబ్బందిలోనైనా ఇంటివాడుకకు వాడేదికాదు. ఎవ్వరూ దాన్ని తాకేందుకు వీలు లేదు. ఆ స్వామి చక్కెరను అంత పూజ్య భావంతో దాచి ఉంచేది. శ్రీస్వామివారు వచ్చి దిగిన వెంటనే మొదట వేడినీళ్ళలో చక్కెర కలిపి సమర్పించేది. ఆయన కూడా వీటినెంతో ప్రీతితో స్వీకరించేవారు. శ్రీస్వామివారు నడిచే రోజులలో వారింటిలో తరచుగా ఆతిథ్యము స్వీకరించేవారు. క్రమేణా శ్రీస్వామివారి బృందంలో సంఖ్య పెరిగింది. ఆమెకు తన బృందం వలన ఆర్థికమైన భారము అనుకున్నారో ఏమోగాని అరుదుగా వారింటికి దయచేసేవారు.

ఆమె ఒకరోజు తన అలవాటు ప్రకారం శ్రీస్వామివారి పాదాలు తాకి నమస్కరించుకోబోయింది. కానీ శ్రీస్వామివారి సేవకులు ఆమెను దూరంగా ఉండమని గదమాయించారు. ఆమె దూరంగా కూర్చుని "స్వామీ మీ దివ్య స్పర్శన భాగ్యం లేకుండా నన్నీవిధంగా దూరం చేస్తున్నారా?" అని మనసులో బాధపడింది. వెంటనే శ్రీస్వామివారు "అమ్మో కాలులో ముల్లున్నది, తీస్తావా?" అంటూ కాలు అందించారు. చాలాసేపు ముల్లుకోసం వెతికింది. కాని ముల్లులేదు. "ముల్లులేదు స్వామీ" అని చెపితే "లేదా అమ్మా అయితే వద్దులే" అని కాలు తీసుకున్నారు.

డోలిలో తిరిగే శ్రీస్వామి కాల్లో ముల్లుగుచ్చు కోవడమేమిటి! వారు ముల్లు తీయమన్న కారణం అప్పుడందరికీ అర్థమైంది. శ్రీస్వామివారు అతీతమైన యోగములో ఉండేటప్పుడు అందరూ వచ్చి పరిచర్యల పేరుతో తనను తాకితే బాధగా ఉంటుందని తనను ఎవ్వరూ తాకకుండా కొందరు సేవకులను కాపలా పెట్టింది శ్రీస్వామియే. మరిప్పుడు వాళ్ళ మాట కాదని తన పాదములు తాకి నమస్కరించుకోనిస్తే వాళ్ళు నొచ్చుకుంటారని యుక్తిగా

ముల్లు తీసే ప్రసక్తితో ఆమె కోరిక తీర్చారు శ్రీస్వామివారు.

తూపిలి పిచ్చెమ్మ శ్రీస్వామివారి గుడ్డలు ఉతుకుతూ నిత్యమూ తమ బర్రెపాలు శ్రీస్వామివారికి సమర్పిస్తూ, శ్రీస్వామివారిని సేవించేది. ఆమె ఒకప్పుడు బిడ్డల అనారోగ్యము, భర్త యొక్క కోడిపందాలు, త్రాగుడులాంటి అనేక చిక్కులతో బాగా వేసారిపోయింది. తులశవ్వగారు ఆమెను పాత ఇల్లు వదలి ఆశ్రమం ప్రక్కగా చిన్న పాక వేసుకొని వుండమన్నది. కాని ఆశ్రమం ప్రక్కన ఆమెకు లభించిన స్థలం దయ్యాలకు నిలయమని, అక్కడ నివాసం వద్దని వాస్తు తెలిసినవారు సలహా ఇచ్చారు. శ్రీస్వామివారిని అడిగితే "గవర్నమెంటు డబ్బులిస్తారు. ఇల్లు వేసుకుంటారు" అని చెప్పారు. కానీ ఆ స్థలం మంచిదో కాదో చెప్పలేదు. కొన్నాళ్లు గడిచాక, గాలివాన సహాయనిధి నుండి నిజంగానే అనుకోకుండా అప్పటికప్పుడు ఆమెకు ప్రభుత్వం డబ్బు ఇచ్చింది.

కనుక ఆ దయ్యాల స్థలంలోనే కొట్టం వేశారు. ఇంట్లో చేరారు. కాని శ్రీస్వామివారు వచ్చి పాదం పెడితే అన్ని పీడలూ పోతాయని పిచ్చమ్మ ఆశపడి శ్రీస్వామివారిని అర్థించింది. "ఇప్పుడు శ్రీస్వామివారు గనుక ఆమె ఇంటికి వెడితే ఇకనుంచీ అందరిళ్ళకూ రమ్మని జనం పోరుపెడతారు" అని అభ్యంతర పెట్టారు కొందరు సేవకులు. కానీ ఐదవ రోజున శ్రీస్వామివారు "నన్ను కొత్త ఇంటికి తీసుకుపోండయ్యా!" అని తొందర చేశారు. కానీ భక్తులు శ్రీస్వామి వారిని ఆంజనేయస్వామి గుడికి తీసుకెళ్లారు. అప్పుడు శ్రీస్వామివారు "ఇక్కడికి కాదు" అని దక్షిణం వైపు పిచ్చెమ్మ ఇల్లు చూపారు. కాని శ్రీస్వామివారి సేవకులు పడమర వైపునున్న తూము దగ్గరకు తీసుకుపోయారు. శ్రీస్వామివారు బలవంతం చేసి అందరినీ దక్షిణం వైపుగా నడిపించి, నేరుగా పిచ్చమ్మ ఇంటికి తీసుకుపోయేంతవరకు గోల చేశారు. అచ్చటికి చేరగానే "మన మిచ్చట మూడు రోజులుండాలయ్యా!" అన్నారు. ఆ సమయంలో పిచ్చెమ్మ చాకిరేవులో వున్నది. కొంతసేపటికి ఇల్లుచేరి, శ్రీస్వామివారిని చూచి, తాను చూస్తున్నది స్వప్నమా నిజమా అని, తన కోరిక తీర్చిన శ్రీస్వామివారికి ఏ విధంగా ఉపచారాలు చేయాలో తెలియక ఉక్కిరి బిక్కిరైంది. **భగవంతుడు భక్తికి బందీ గదా!** 29

పెన్న బద్వేలు ప్రాంతంలో శ్రీస్వామివారు వుండేటప్పుడు వక్కెమ్మగారు

శ్రీస్వామివారి బృందానికి వంట చెరకు, విస్తరాకులు సమకూర్చుతూ చెట్లక్రింద ఏకాంతంగా కూర్చుని ధ్యానంలో వుండేది. అలాంటప్పుడు ఆమెకు భోజనం విషయమే గుర్తుండేది కాదు. ప్రేమమూర్తియైన శ్రీస్వామివారు, “వక్కెమ్మ అన్నం తినమరిచి పోయిందయ్యా! ఆమెను పిలిచి అన్నం పెట్టండి” అని సేవకులను హెచ్చరించేవారు.

వక్కెమ్మ అప్పుడప్పుడూ వచ్చి శ్రీస్వామివారిని దర్శించి ఇంటికి వెళుతుండేది. ఒకప్పుడు శ్రీస్వామివారామెలో ఎలాంటి మార్పు తెచ్చారోగాని స్వామిని వదలిపెట్టి ఇంటికి పోలేకపోయింది. ఆమెవచ్చి నమస్కరిస్తే **“వక్కెమ్మ చచ్చిపోయిందనుకున్నానే” అన్నారు శ్రీస్వామివారు. మనలో ఉండే ఆశావ్యామోహాలు, బంధుప్రీతి మొదలగు చాపల్యాలను శ్రీస్వామివారు యోగశక్తితో క్షాళనము చేసేవారు. మన ఆధ్యాత్మిక పురోభివృద్ధి పట్ల**
30 **వారికి గల శ్రద్ధ, వారి శక్తి సామర్థ్యములు మనమర్థము చేసుకొని తగు విధంగా సాధన సాగిస్తామని పై విధమైన మాటల ద్వారా వారు చేసిన పని మనకెరుక పరచేవారు.**

ఇదే విధంగా నిరంతరము స్వామి సేవలో ఉండే గుత్తా నరసమ్మకు అప్పుడప్పుడూ ఇంటికి వెళ్ళి తన వాళ్ళందరినీ చూచి రావాలని ఉండేది. శ్రీస్వామివారినడిగితే పంపేవారు కాదు. ఒకరోజు “నరసమ్మ చచ్చిపోయింది” అని చీటి వ్రాసి తన ఆశీర్వాద ముద్రవేసి నరసమ్మకిచ్చారు శ్రీస్వామివారు. అది మొదలుకొని ఆమెకు ఇంటిధ్యాసే లేకుండాపోయింది.

శ్రీస్వామివారి బృందంలోని వారంతా పనులమీద వెళ్ళారు. “శ్రీస్వామివారికి జావపోయి. నేను స్నానం చేయలేదు” అని తులశమ్మ వక్కెమ్మను పంపింది. వక్కెమ్మ ఎన్నడూ శ్రీస్వామివారికి గంజి పోయడం వంటి సేవ చేయలేదు. అంతేగాక, తాను హరిజన కులానికి చెందినందువలన అట్టి సేవ చేయడానికి తానర్హురాలు అవునో కాదోనని శంకించింది. భయంతోనే జావ తీసుకొని శ్రీస్వామివారి వెనుక నిలబడింది. సర్వజ్ఞులైన శ్రీస్వామివారు “రా వక్కెమ్మా! భయమెందుకమ్మా! రా! జావ రేకలో పోయి” అని పిలిచారు. సత్పురుషుల పట్ల భక్తిశ్రద్ధలు, పవిత్రమైన నడవడి లేకపోవడమొక్కటే కులహీనత అని శ్రీస్వామివారి భావం.

నిజానికామె తత్వం అలాంటిదే, ఒకసారి నెల్లూరు బస్టాండులో ఆమె నిద్రిస్తుండగా ఒక దొంగ ఆమె కుడిచెవికున్న కమ్మ విప్పుకుంటున్నాడు. అది గుర్తించి ఆమె కదలకుండా పడుకొని విప్పుకోనిచ్చింది. ఆ పని అవగానే ప్రక్కకు వత్తిగిలి ఎడమ చెవి కమ్మ గూడా విప్పుకునేందుకు అవకాశం కల్పించింది. తెల్లవారి ఆ కమ్మల గురించి అడిగిన ఆశ్రమవాసులతో ఆమె "నాకంటే దరిద్రుడెవడో వచ్చి కమ్మలు తీసుకుంటుంటే పోనీలే అని తీసుకుపోనిచ్చాను" అని చెప్పింది.

గోపవరంలో ఒకకుక్క ఒక రైతుకున్న మందలోని గొఱ్ఱెలను ప్రతి నిత్యం ఒకటి చొప్పున చంపి తినేస్తుండేది. అతని కడుపు మండి ఆ కుక్కను చురకత్తితో నరికేశాడు. ఆ తరువాత అదేమి చిత్రమోగాని, అతనికి పుట్టిన ప్రతిబిడ్డా కుక్కవలె అరిచి చనిపోయేవాడు. అతను తన బాధను శ్రీస్వామివారికి మొరపెట్టుకున్నాడు. "పుడుతాడు, పుడుతాడు, పుడుతాడు" అని శ్రీస్వామివారు ముమ్మారు పలికారు. వారి అమృత వాక్యం ప్రకారం ముగ్గురు మగపిల్లలు పుట్టి జీవించారు.

మందల వెంకయ్యకు శ్రీస్వామివారితో పరిచయంలేదు. 1956లో ఒక రోజు ఉదయాన్నే శ్రీస్వామివారు వీధిలో వెంకయ్యకు ఎదురుపడి తమ రెండు చేతులతో తల గీరుకుంటూ నాన్చే మాటలలో "నీకొక మాట చెప్పాలి, ఆనక (తర్వాత) అటురా! ఊ ఆ (సరేనా?)" అని చెప్పి వెళ్ళారు. ఆ గ్రామస్తులొకరు శ్రీస్వామివారిని తమ ఇంటికి తీసుకుపోతుండగా ఆయన వెంట వెంకయ్య వెళ్ళాడు. శ్రీస్వామివారు ముంత, పంగాలకర్ర (పైన రెండుగా చీలియున్న కర్ర) తీసుకొని పోతున్నారు. వెంకయ్య ఆయనతో కూడా నడిచాడు. శ్రీస్వామివారు వెంకయ్య గారింటికి వచ్చి నాలుగు ప్రక్కలా చూచి "ఇక్కడ మనం చూడవలసిందేమిలేదు. అన్నీ బాగానే వున్నాయి. తెల్ల ఇల్లు కడతాడు. ఇంతవరకూ తెల్ల ఇల్లు కడతారు" అని చేతితో నేల మీద హద్దు గీచి చూపించారు. వారు నివసించే పూరింటిలోకి వెళ్ళి ఈశాన్యం వైపు అంకణంలోని దూలం క్రింద జానెడు వ్యాసం, జానెడు లోతు గుంట త్రవ్వించి, ఆ గుంటలో పాలు తెప్పించి పోశారు. శ్రీస్వామివారు పోసిన పాలు గుంట నుండి పొర్లి ఈశాన్యం వైపు పారినాయి. "అంతేలే, ఇంకేముంది? అంతా బాగుంది" అంటూ వెళ్ళారు శ్రీస్వామివారు. వెంకయ్య గారి ప్రార్థనపై

ఆనాటి మధ్యాహ్నం శ్రీస్వామివారు వారి ఇంట్లో భోంచేశారుకూడాను.

అప్పటిలో మిద్దె కట్టే స్తోమత వెంకయ్యకు లేదు. కాని కొన్నాళ్ళకు సిరిసంపదలు కలసి వచ్చి పొలం కొనడమేగాక, శ్రీస్వామివారు చెప్పినట్లు మిద్దెఇల్లు కూడా కట్టుకున్నారు. చిత్రమేమంటే వాస్తువాళ్ళు వచ్చికూడా ఖచ్చితంగా శ్రీస్వామివారు చూపినంతవరకే ఇంటి ప్లాను కుదర్చటమే. "శ్రీస్వామివారి అనుగ్రహము వలన ఇంతటివాడనయ్యాను" అని కృతజ్ఞతలు తెలుపుతున్నాడు.

దేవుడయ్య (చిలకలమట్టి) చాలా బీదవాడు. కాని గొప్పభక్తుడు, త్యాగశీలి. శ్రీస్వామివారు వారి గ్రామం వెళ్ళిన 5, 6 పర్యాయములు గూడా శ్రీస్వామివారి బృందమంతటికీ ఎంతో భక్తి శ్రద్ధలతో వీరొక్కరే ఆతిథ్యమిచ్చేవారు. వారి ధర్మబుద్ధికి శ్రీస్వామివారు ఎంతో సంతోషించారు. ఇలాంటి ధర్మపరులు ధనికులుగా వుండడం ప్రపంచానికెంతో ప్రయోజనమనుకున్నారు కాబోలు, శ్రీస్వామివారు ఒకనాడు దేవుడయ్యగారి చేత రాగి అంబలి కాయించి ఒక క్రొత్త కుండలో పోసి మూతపెట్టి అంబలి కుండను దేవుడయ్యగారింటిలో ఈశాన్యదిశలో ఒక గజం లోతులో భూమిలో పూడ్పించారు. ఆనాటి నుండి వారు సిరిసంపదలతో, దానధర్మాలతో ఎంతో ప్రఖ్యాతి గాంచి ఉన్నత స్థితి పొందారు.

తిరుపతి జానకిరామయ్య (నెల్లూరు) కుమార్తె రమణమ్మ శ్రీస్వామివారిని గూర్చి విని దర్శించాలని ఉబలాట పడింది. కాని ఆమెకు వారిని దర్శించే భాగ్యం కలుగలేదు.

ఒకప్పుడు శ్రీస్వామివారు నెల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఇప్పుడు ధర్మసత్రం వున్న ప్రదేశంలో విడిది చేశారు. ఆ రోజుల్లో ఆ ప్రాంతమంతా చిట్టడవి, ఇంకా భవనాలు కట్టలేదు.

శ్రీస్వామివారి దర్శనార్థం పోతూ కొందరు స్నేహితురాళ్ళు రమణమ్మను కూడా పిలిచారు. తాను అప్పటికి భోజనం చేయకున్నాగాని మధ్యాహ్నాం ఒంటిగంటప్పుడు వెంటనే బయలుదేరింది. 'మేమంతా భోంచేశాము. నీవు కూడా భోంచేసి వచ్చివుంటే బాగుండును, అకాలమవుతుంది' అన్నారు స్నేహితురాళ్ళు. 'స్వామి పెట్టడా నాకన్నం?'

అని ధీమాగా అన్నది ఆమె. 'స్వామి బృందం పన్నెండు గంటలకే భోంచేసి వుంటారు, ఇప్పుడెక్కడ వస్తుంది అన్నం?' అన్నారు వారు. శ్రీస్వామివారు మరొక చోటికి మకాం మారాలి పదండన్నారు. అందరూ భోంచేశాక శ్రీస్వామివారిని కదలమన్నారు. శ్రీస్వామివారు పక పక నవ్వుతూ 'బిడ్డలు రావద్దయ్యా? బిడ్డలు ఇక్కడుంటే మనం పోతే ఎట్లా?' అన్నారు. అంతలోనే రమణమ్మ, ఆమె స్నేహితురాళ్ళూ వచ్చారు. అందరికీ తమ ఆశీస్సుల చీటీలు వ్రాయించి, రమణమ్మకు మాత్రం.... 'ఈమె మనం బువ్వ పెడతామని వచ్చిందయ్యా! బువ్వ పెట్టండి' అన్నారు. 'అన్నం అయిపోయింది. స్వామీ!' అంటే, 'అయ్యో, అన్నం వుండ్లా? అన్నం వండిన పాత్రలో చూడండయ్యా?' అన్నారు. నిజానికి అన్నం తిని ఖాళీ పాత్ర కడగకుండా పడేసి పెట్టారు. శ్రీస్వామివారు చెప్పారు కనుక ఆ అన్నపు పాత్ర తుడిచి చూస్తే ఇద్దరు మనుషులకు సరిపడేటంత అన్నమున్నది. దానిని రమణమ్మ తృప్తిగా భోంచేసింది. వారి స్నేహితురాళ్ళు కూడా ప్రసాదంగా స్వీకరించారు. 'ఈమె సామాన్యమైనది కాదు. పదో చూపు మనిషి' అని శ్రీస్వామివారు ఆమెకు చీటీ వ్రాయించారు.

'వక్కెమ్మ 99 వాకిళ్ళు ఎక్కాలి' అని శ్రీస్వామివారు ఒకసారి చీటీ వ్రాయించారు. అది విని వక్కెమ్మ పట్టరాని దుఃఖంతో ఏడుస్తూ శ్రీస్వామివారి పాదాల మీద పడి, 'స్వామీ, మీకు ఇష్టంలేకుంటే నన్ను అడవిలో ముష్టిచెట్టుగానైనా పుట్టించండి. కాని మరలా మనిషి జన్మవద్దు' అని రెండు గంటలసేపు వారి పాదాలను తన కన్నీటితో అభిషేకించింది. ఆ కరుణామూర్తి 'ఆమె ఇక వచ్చేది లేదని దేవునిపై ఆనపెట్టి వ్రాసివ్వయ్యా!' అని వ్రాయించారు.

తలుపూరు గ్రామస్తులు వి. సుందరరామిరెడ్డిగారు ఇలా చెప్పారు.

'1977వ సం॥లో శ్రీస్వామివారి బృందం కొన్నాళ్ళు ఉండేందుకుగాను, శ్రీ యస్.వి.కె. రెడ్డిగారి పద్మావతిగనిలోని ముప్పై అంకణముల విశాలమైన పూరిపాకను ఇప్పించాను. ఒకరోజు ఉదయాన్నే శ్రీస్వామివారు 'ఇక ఇక్కడ క్షణం ఉండకూడదు. వెంటనే మరొక చోటుకు వెళ్ళిపోవాలని' తొందర చేయసాగారు. శ్రీస్వామివారి సేవకులు మధ్యాహ్నం రెండు గంటల వరకు తాత్సారం చేసి శ్రీస్వామివారినచ్చట నుండి కదిలించలేదు. శ్రీస్వామివారు మరొక తావుకు వెళ్ళాలని, ఇబ్బంది వస్తుందని

తొందర చేస్తూనే వున్నారు. ఇంతలో పూరిపాక ఎలా అంటుకుందో మంటలు రేగాయి. శ్రీస్వామివారిని దూరంగా కూర్చోబెట్టారు. శ్రీస్వామివారు ఆ మంటవైపు చూపుతూ 'అంతా బంగారం కరుకులయ్యా చూడండి. అంతా బంగారమే' అని అరుస్తున్నారు. పూరిపాకంతా తగులబడి పోయింది.


'తగలబడినందుకాయనేమీ బాధ పడవద్దని చెప్పు. ఆయనకు ఇరవై కోట్లు ఆదాయం వస్తుంది' అని ఒక చీటి వ్రాయించి నా చేత పంపారు. అనతి కాలంలోనే శ్రీ యస్.వి.కె. రెడ్డిగార్కి అనుకోని విధంగా చాలా గొప్ప ఆర్థికాభివృద్ధి కలిగింది. అదంతా శ్రీస్వామివారి ఆశీస్సుల ఫలితమే.

శ్రీస్వామివారు ఒకప్పుడు వి. సుందరరామిరెడ్డిగారి తోటలో విడిది చేసియున్నారు. అక్కడున్న ఎండుటాకులు, తుక్కు జవిరి శ్రీస్వామివారి అగ్నిగుండంలో వేశారు. ఆ తుక్కులో డైనమైట్లలో వాడే కేపు ఉండి అది మంటలో వేయగానే బ్రహ్మాండమైన శబ్దంతో పేలింది. అక్కడున్న వారంతా భయభ్రాంతులై తలోవైపు చెల్లాచెదురుగా పరుగెత్తారు. కానీ అగ్నిగుండం ముందే కూర్చొనియున్న శ్రీస్వామివారు ఒక్క అంగుళం కూడా కదలలేదు సరికదా భయచిహ్నాలు వారి ముఖంలో కనిపించలేదు. అక్కడున్న వారంతా శ్రీస్వామివారి స్థితికి అబ్బుర పడ్డారే కానీ వారి నిజస్థితి తెలుసుకున్నారా?



# అవధూత లీల

## అధ్యాయము - 10
## పతితపావనుడు



పరమ దయానిధియైన ఆ పరమాత్మ దీనజనోద్ధరణ కొరకు మహనీయుల రూపంలో సృష్టివున్నంత వరకు అవతరిస్తూనే వుంటారని దత్త మహిమ చెపుతుంది. ఈ మహనీయుల కృప ఎంత అపారమో, అమోఘమో ఆయా మహనీయుల చరిత్రలలో చూడవచ్చు. ఇట్టి అవ్యాజమైన 31
వీరి కృప ఆపదలలో ఆదుకోవడం, అలివిగాని వ్యాధులను నయం జేయడమేగాక పతితులను పావనులనుగా మార్చడమొక అద్భుతలీల. నారదమహర్షి దర్శనముచేత క్రూరుడైన వాల్మీకి మహర్షియైనట్లుగా మన స్వామివారు అనేక మంది దుర్మార్గులను, త్రాగుబోతులను సజ్జనులుగా మార్చిన సన్నివేశములలో కొన్ని మాత్రమే ఇచ్చట పొందుపరచుచున్నాము.

సహవాస దోషం వల్లగాని, తీరని సమస్యలను గూర్చి ఆలోచిస్తూ మనశ్శాంతి లేక ఇతర కారణాల వల్లనూ కొందరు త్రాగుడు, జూదము మొదలగు వ్యసనాలకులోనై తమ జీవితాలనేగాక తనవారి జీవితాలనూ అశాంతిలో ముంచేస్తారు. అలాంటి బలహీనతల నుండి బయటపడాలని హృదయపూర్వకంగా కోరని వారు బయట పడలేరు. అట్టివారిని శ్రీస్వామివారి లాంటి మహనీయులే కాపాడగలరు. సర్వప్రేరణాధికారి, సర్వభూత హృదయాంతర్వర్తియైన సద్గురునకు అసాధ్యమైన కార్యమేమున్నది!

గొలగమూడిలో ఆశ్రమానికి సమీపంలోని ఒక చెట్టు మీద ఒక కొంగ గూడు కట్టుకొని తన పిల్లలతో జీవిస్తూంది. ఒకరోజు ఆ ప్రాంతంలో నివసించే ఒక పాములవాడు ఆ కొంగను కొట్టాలని తన విల్లును సిద్ధంచేస్తున్నాడు. అది చూచిన ఆశ్రమవాసులు అతణ్ణి మందలించారు. ఎన్నిసార్లు మందలించినా అతడు మరలా వారందరినీ ఏమార్చి తన విల్లును పక్షిపై గురిపెట్టాడు. చివరికి భక్తులావిషయం శ్రీస్వామివారితో చెప్పారు. ఆయన 'అది తగలదులేయ్యా'

అన్నారు. ఆయన చెప్పినట్లే ఆ కిరాతకుడు వేసిన బాణం కొంగకు తగలలేదు. పక్షి తప్పించుకుని ఎగిరిపోయింది. ఎన్నడూ గురితప్పని ఆ పాములవాడు ఏమనుకున్నాడోగాని ఒక్కసారిగా తన విల్లు విరిచి పారేసి మరలా ఎప్పుడూ విల్లు చేపట్టలేదు. శ్రీస్వామివారి రక్షణ ఆ కొంగకే కాదు. దానిని చంపజూచిన పాములవానికి కూడానని గుర్తించాలి.

అధికంగా త్రాగుడుకు అలవాటు పడిన బేతు జయరామయ్య నాయుడు 1978 ప్రాంతంలో వచ్చి శ్రీస్వామివారి పాదాలు పట్టుకొని 'ఈ నిషా ఎప్పుడూ ఇలాగే ఉండేటట్టు చేయండి' అని ప్రార్థించాడు. అతనిని శ్రీస్వామివారి పాదాలు వదలి పెట్టమని స్వామి సేవకులు ఎంత చెప్పినా అతడు వదలలేదు. చివరకు శ్రీస్వామివారు 'అట్లాగే పోయ్యా' అన్నారు. ఆనాటి నుండి అతని వ్యక్తిత్వం పూర్తిగా మారిపోయింది. త్రాగుడు మానేశాడు. ఎవ్వరితో మాట్లాడకుండా మౌనంగా కాలం గడిపేవాడు.

తూపిలి వెంకయ్య (గొలగమూడి) నిరంతరం కోడి పందాలు, త్రాగుడుతో ఇల్లు గుల్ల చేశాడు. అతని భార్య పిచ్చెమ్మకు శ్రీస్వామివారి ఎడల ఎంతో భక్తి శ్రద్ధలు. కనుకనే ఆశ్రమంలోని బృందానికి, శ్రీస్వామివారికి శ్రద్ధతో గుడ్డలు ఉతికిస్తుంది. తన భర్త యొక్క ప్రవర్తనను గూర్చి అనేకసార్లు శ్రీస్వామివారికి విన్నవించుకొంటే శ్రీస్వామివారు మౌనం వహించారు. తమ బర్రెపాలు తీసి ప్రతి నిత్యమూ శ్రీస్వామివారికి సమర్పించుకోవటం పిచ్చెమ్మకు అలవాటు. ఒకనాడు తనకు ఇంట్లోపని తీరనందున తన భర్తద్వారా పాలు పంపింది. అప్పుడే శ్రీస్వామివారు పాలు త్రాగి 'కుక్కురూకూ' అని కోడికూత వేసినట్లు అరిచారు. ఆ పాలు సమర్పించిన అతనికి కోడిపందేల వ్యసనమున్నదని తెల్పడానికే శ్రీస్వామివారు అలా అరిచారని గుర్తించి అందరూ నవ్వారు. చిత్రంగా అది మొదలు వెంకయ్య త్రాగుడు మొదలైన వ్యసనాలన్నీ వదులుకున్నాడు.

ఒకప్పుడు శ్రీస్వామివారు గొలగమూడిలో 8 సం॥ లు నిరతాగ్నిహోత్రం సాగించారు. వారి సేవకులు సమీపంలోని అడవిలోని మానులన్నీ నరికి దున్నపోతుల బండితో తోలుకొచ్చేవారు. ఆ గ్రామ సోత్రియందారుడు సుబ్బారావుగారి మనుషులు స్వామి సేవకులను చెట్లు నరక్కుండా అడ్డగించాలని ప్రయత్నించారు. కాని వాళ్ళు మానలేదు. ఒకరోజు సుబ్బారావే

స్వయంగా స్వామి సేవకులను మందలించి అడవి నరకకుండా చూడాలని వచ్చాడు. అంతదూరంలో శ్రీస్వామివారిని చూచాక ఆయన మనసేవిధంగా మారిందోగాని "ఓరేయ్! ఈయన పిచ్చోడు గదరా! పాపం కొట్టుకోనీలే" అని అంటూ "అయ్యా! వేపమానులు తప్ప మిగిలినవన్నీ కొట్టుకోండి" అని దానపత్రం వ్రాసిచ్చినట్లు చెప్పేశాడు!

శ్రీస్వామివారి మహిమను కండ్లారా చూచిన గొలగమూడి వాస్తవ్యులు కొట్టుకూటి వెంకమనాయుడుగారు ఇలా చెపుతున్నారు.

"శ్రీస్వామివారు గ్రామాంతరం పర్యటనకు వెళ్ళకుండా ఎనిమిది సంవత్సరములు ఇప్పుడు సమాధి మందిరముండే పుణ్యభూమిలో నిరతాగ్నిహోత్రం సాగించిన రోజులవి. గొలగమూడికి నైరుతి–పడమర దిక్కునున్న అడవినంతా శ్రీస్వామివారు తన సేవకులచేత కొట్టించి రోజుకు సుమారు మూడు నాలుగు బండ్ల కట్టెను కాలుస్తున్నారు. అడవంతా చాలావరకు పలుచబడి పోయింది. వీరి అగ్నిహోత్రం అట్లాగే కొన్నాళ్ళు కొనసాగితే ఇక గొలగమూడి, కంటేపల్లి గ్రామస్తులకు వంటచెరకే కష్టమవుతుందని కొందరు తలచారు.

"ఒకరోజు కంటేపల్లి యువకులు కొందరు శ్రీస్వామివారి బృందానికి అడవిలో కట్టెలు కొట్టకుండా దేహశుద్ధి చేసి పాఠం చెప్పాలని కర్రలు తీసుకొని కదులుతున్నారు. అదే సమయంలో శ్రీస్వామివారి యందు కాస్త భక్తి శ్రద్ధలు గల నేను మేకలను వెతుక్కుంటూ కంటేపల్లి వెళ్ళియున్నాను. ఆ కుర్రాళ్లంతా శ్రీస్వామివారిని నానా బూతుమాటలు తిడుతూ ఇంకా కొందరు కుర్రవాళ్ళను ప్రోగు చేసుకొంటున్నారు. ఆ మహనీయుని అలా తిట్టవద్దని నేనెంత చెప్పినా వారంతకంతకూ రెచ్చిపోతున్నారు. ఆ గుంపంతా కర్రలు తీసుకొని ఒక విధమైన ఉద్రేకంతో స్వామివారు చెట్లు నరికించే అడవి వైపు మహావేగంగా పోతున్నారు. ఈ ఉద్రేకంలో ఆ వెధవలు శ్రీస్వామివారిని, వారి సేవకులను కొడతారేమోనని నాకు భయమేసి వారి వెనకాలే పరుగెత్తాను.

"ఆ గుంపు శ్రీస్వామివారికి ఒక ఫర్లాంగు దూరమునకు వచ్చేటప్పటికి చిత్రంగా అందరి నోళ్ళు స్తబ్ధుగా మూతపడ్డాయి. వారి నడక వేగం తగ్గింది. వాళ్లంతా స్వామివారి దగ్గరకు వెళ్ళి త్వరగా అక్కడున్న ఖాళీ బండికి కట్టెలు పేరుస్తున్నారు.

“ ‘ఈ కట్టెంతా వీళ్ళు దౌర్జన్యంగా వాళ్ళ ఇళ్ళకు తోలుకుపోతారు గాబోలు. శ్రీస్వామివారి అగ్నిగుండానికి ఈ రోజు కట్టెలు ఎట్లాగా’ అని నేను ఆలోచించే లోపల పది నిమిషాల్లో బండి నిండిపోయింది. వారిలో కొంతమంది యువకులు శ్రీస్వామివారి చెంతకు వెళ్ళి ‘స్వామీ ఇవేనా ఇంకేమైనా కట్టెలు ఉన్నాయా? చెప్పండి. రేపు మా బళ్ళలో తోలి పెడతాము’ అని అడిగారు. శ్రీస్వామివారు అమాయకంగా ఈ పెద్దమానులు మా వాళ్లు నరకలేకున్నారు. వీటిని రేపు మీరు నరికి తోలుకొస్తారాయ్యా’ అన్నారు. ‘అట్లాగే స్వామి’ అని చెప్పి అక్కడ మిగిలియున్న కొన్ని పెద్ద పెద్ద కొమ్మలను తలా ఒకటి భుజాన పెట్టుకొని ఆ కట్టెల బండి వెంట గొలగమూడి శ్రీస్వామివారి ఆశ్రమానికి నడచి వచ్చి కట్టెలన్నీ దించేశారు. ‘స్వామీ! రేపు మీరు చెప్పిన మానులన్నీ తోలుకు వస్తాము. మాకు సెలవిప్పించండి’ అని చెప్పి ఎంత వేగంగా వచ్చారో అంత వేగంగా కిమ్మనకుండా వెళ్ళిపోయారు. వారిలో గల్గిన ఈ చిత్రమైన మార్పునకు నాకు తల తిరిగిపోయింది. శ్రీస్వామివారి మహత్తు నోటితో చెప్పనలవిగాదు”.

మాలెపాటి చెంచమ్మ (నాగులవెల్లటూరు) ప్రథమంగా శ్రీస్వామివారిని దర్శించి, ‘మరలా పుట్టకుండా చేయండి స్వామి’ అని అర్థించింది. ‘అబ్బో ఈమె పదో చూపులో మనిషి, ఈమెకు అన్నీ సరిపడతాయి’ అన్నారు శ్రీస్వామివారు. ఆమెను తమ దగ్గరే వుండమనేవారు. కాని ఆమె తన సంసారాన్ని వదలదే. శ్రీస్వామివారికి చెప్పకుండానే ఆశ్రమం నుంచి వెళ్ళిపోయింది. తర్వాత ఆమె శ్రీస్వామివారిని దర్శించినప్పుడల్లా ఆమె ఇంటికి వెళ్ళడానికి శ్రీస్వామివారు అనుమతించేవారు కాదు. కాని ఆమె శ్రీస్వామివారికి చెప్పకుండానే వెళ్ళేది. ఒకరోజు శ్రీస్వామివారు ఆమెకు స్వప్నంలో మంత్రోపదేశం చేశారు. మరొకప్పుడు స్వప్నంలో పెద్ద వెలుగులో చంద్రమండలంలో కూర్చొని శ్రీస్వామివారు దర్శనమిచ్చి ‘ఇది గదమ్మా, లోకం మార్పు!’ అని శ్రీస్వామివారు ఆమెకు చంద్రుని చూపారు.

ఎన్నాళ్ళకూ ఆమె తన సేవకు రానందున ఒకప్పుడు శ్రీస్వామివారు చిత్రంగా వీరి మనసు మార్పు చేయగా ఒకనాడు కట్టుబట్టలతో ఆమె శ్రీస్వామి సన్నిధికి వచ్చింది. శ్రీస్వామివారు ఆమె మనఃప్రవృత్తిలో చాలా మార్పు చేశారు గాబోలు.

ఇప్పుడామెకు ఏ సాధనలూ చేయాలని కోరికలేదు. ఏ లౌకిక వ్యవహారాలు, బంధాలు ఆమెకు గుర్తురావు. నిరంతరం గురు ధ్యానంలో వుంటున్నారు. మనస్సు తనకు పూర్తిగా ఆధీనం కాలేదని ఆమె బాధ. ఒకరోజు శ్రీస్వామివారు స్వప్నంలో 'మంచి పొగరుమోతు గుఱ్ఱం వుందనుకో, అది మాట వినదు. దాన్ని నాకిస్తే సరిపోతుంది గదా!' అని పలికారు. అంటే ఆమె మనస్సుని శ్రీస్వామివారు పరీక్ష చేసి అన్యచింతలు మానమని సలహా ఇచ్చారన్నమాట. కోరినవారికి ఇంతకంటే ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం ఎక్కడ లభించగలదు?

నూతేటి శ్రీరామయ్య (నాగులవెల్లటూరు) చాలాకాలంగా శ్రీస్వామివారి భక్తులు. కుటుంబాన్ని వదలి బాధ్యత తన కుమారునికి అప్పగించి శ్రీస్వామివారి సన్నిధిలో వుండాలని గొలగమూడి వచ్చారు. అంతకుముందు రెండు రోజుల నుండి శ్రీస్వామివారు గంజి కూడా త్రాగకుండా మౌనంగా వున్నారు. శ్రీరామయ్య వస్తూనే శ్రీస్వామివారికి నమస్కరించి మనసులో 'నీ కృపవలన ఇంకా భూమి మీద నిలచియున్నాను. లేకుంటే ఈవరకు మసియైయుందును' అని అనుకున్నాడు. వెంటనే శ్రీస్వామివారు కళ్ళు తెరచి ఫక్కున నవ్వారు. శ్రీరామయ్య వస్తూనే శ్రీస్వామివారు నవ్వారు ఏమిటో అని అందరూ ఆశ్చర్యపోయారు. ఆ నవ్వులో ఎట్టి ప్రభావముందోగాని ఆనాటి నుండి శ్రీస్వామివారి సేవకంకితమై చివరి శ్వాసవరకు శ్రీస్వామివారి ఆజ్ఞ మేరకు అనికేపల్లి నుండి ప్రతినిత్యమూ భిక్షాన్నం తెచ్చేవాడు.

ఎల్లంరాజు ఈశ్వరరాజు (రాజంపేట) విద్యానగర్‌లోని శిరిడీ సాయిబాబా మందిర ఆవిష్కరణ సందర్భంగా ప్రచురించిన 'సద్గురు దర్శనం' అనే గ్రంథం చదివారు. అందులో శ్రీస్వామివారిని గూర్చి వ్యాసము చదివిన తరువాత శ్రీస్వామివారిని చూడాలని గొలగమూడి వచ్చారు. శ్రీస్వామివారి పాద తీర్థం స్వీకరిస్తే ఎంతో మధురంగా వుండి 'షాకు' కొట్టినట్లుండి, చెప్పలేనంత తన్మయత్వం కలిగింది. అది మొదలు 'ఎంత దూరం నుండైనా శ్రీస్వామివారి దర్శనం కోసం వస్తూ వుంటాను' అని చెబుతున్నారు. నేటికీ వీరు శ్రీస్వామివారి సమాధిని దర్శిస్తుంటారు.

సుబ్బారెడ్డి (బద్వేలు) ఇలా చెప్పారు: శ్రీస్వామివారి ధునికి కట్టెలు తోలడానికి ఉన్న రెండు దున్నపోతులూ ప్రక్క చేలో పడ్డాయి. నిషాలోవున్న


ఆ యజమాని దున్నపోతుల్ని బందెల దొడ్డికి తోలుకుపోతున్నాడు. శిష్యులు ఎంత చెప్పినా, బ్రతిమిలాడినా దున్నలను వదలలేదు. దోవలో శ్రీస్వామివారు ఎదురై 'ఎక్కడికి? దున్నలను తోలుకుపోతున్నావు?' అని అడిగినా గాని అతడు సమాధానం చెప్పలేదు. శ్రీస్వామివారు అతనివైపు తీక్షణంగా చూస్తూ చేతితో నిలవమని సైగ చేశారు. వెంటనే మనిషి మాత్రమేగాక రెండు దున్నలూ గూడా బ్రేకులు వేసిన కారువలె ఆగిపోవటం చిత్రం. 'ఇదేమీ నా సొంతపని కాదు, లోకం పని. కావాలంటే గుండంలో భాగం వ్రాయించుకో, ఇట్లా ఎప్పుడూ చెయ్యవద్దు. అమ్మ నడిగి అన్నం తిను' అన్నారు శ్రీస్వామివారు. ఆ త్రాగుబోతు వ్యక్తి దున్నలను వెనక్కు తోలుకు వచ్చి శ్రీస్వామివారి పనికి సహాయం చేయటమేగాక అది మొదలు ప్రతిరోజూ శ్రీస్వామివారి దగ్గరే తిరుగుతుండేవాడు.

తిరుపతి జానకిరామయ్య కుమార్తె రమణమ్మ తన అక్క కుమార్తెతోటి శ్రీస్వామివారి దర్శనార్థం గొలగమూడి వచ్చింది. వాళ్ళు అర ఫర్లాంగు దూరాన వుండగానే వాళ్ళను తమ వద్దకు రావద్దని చెప్పమని మనిషిని పంపారు శ్రీస్వామివారు. విపరీతమైన కోపంతో వస్తువులన్నీ ధునిలో పడేస్తూ, శ్రీస్వామివారు ధునిలో దూకబోతున్నారు. వాళ్ళు అల్లంత దూరాన వుండగానే శ్రీస్వామివారు పంపిన మనుషులు వాళ్ళను దూరంగా వుండమని నిలిపేశారు. కొంచెంసేపైన తరువాత తానొక మాట మాట్లాడిపోవాలని శ్రీస్వామివారికి కబురంపింది రమణమ్మ. దయామయుడైన శ్రీస్వామివారు ఆమెను సుమారు అరవై అడుగుల దూరం నుండి మాట్లాడమన్నారు. ఆమె వచ్చి, 'స్వామీ! మీరే శిక్షవేసినా పడతాను, నేను మాత్రం మిమ్ములను వదలి వెనక్కుపోలేను' అని భోరున ఏడ్చింది. 'అయ్యో! ఈమె శిక్షలో వుంటుందట, ఎట్లాగయ్యా? సరే! నలుగురు మనుషులను తీసుకుపోయి ఆంజనేయస్వామి దేవాలయంలో భజన చేసుకుని తెల్లవారి అమ్మ దగ్గరకు రమ్మను' అని సెలవిచ్చారు. ఆమె అలానే చేసి శ్రీస్వామివారి ఆశీస్సులు పొంది వెళ్ళింది. కాని ఆమె అక్క కుమార్తె మాత్రం వెంటనే తిరిగి వెళ్లిపోయింది.

ఒకనాడు శ్రీస్వామివారి దర్శనార్థం పట్టుచీరలతో ముస్తాబైన ముగ్గురు స్త్రీలు వచ్చి నిల్చున్నారు. శ్రీస్వామివారు మూడుసార్లు కూర్చోమని చెప్పినా ఇద్దరు మాత్రం చీరలకు మట్టి అవుతుందని తాటిమట్టలపై కూర్చోలేదు.

ఒకామె వెంటనే తాటాకు పై కూర్చున్నది. ఆ కూర్చున్న ఆమెకు మాత్రం చీటీ వ్రాయించారు. నిలుచున్న ఇద్దరినీ పైవాళ్ళు ఒప్పుకోలేదని శ్రీస్వామివారు చీటీ వ్రాసి ఇవ్వకుండా త్రిప్పి పంపేశారు. **శ్రీస్వామివారు అనుగ్రహ మూర్తియే అయినా ఇతర ఆలోచనలు లేకుండా ప్రేమతో ఆయన మాటలు శిరసావహించేవారే వారి కృపను పొందుతారు. చెర్లోనుండైనా మంచినీరు తీసుకోవాలంటే బిందెతో ఆ నీటిలోకి వంగాలి గదా!** 32


ఒకరోజు శ్రీస్వామివారు వేలూరు సుబ్రహ్మణ్యంగారితో 'అయ్యా గ్రామదేవత బంగారమ్మ సముద్రస్నానం పోయి వచ్చింది. ఇకమీదట మీ ఊళ్లో అందరూ పాలపొంగళ్ళు పెట్టుకోవాలని దండోరా వేయించు' అని సెలవిచ్చారు. 'నేనలాగే కావించాను. అది మొదలు మా గ్రామంలో అంతవరకూ వున్న జంతు బలులు మాని బంగారమ్మకు పాల పొంగళ్ళు నివేదిస్తున్నారు' అని చెప్పారు సుబ్రహ్మణ్యం.



# అవధూత లీల

## అధ్యాయము - 11

## అవధూత వైద్యం



**పరబ్రహ్మ స్వరూపులైన సద్గురువులు తమ సంకల్ప**
33 **మాత్రం చేత ఎలాంటి భయంకరమైన వ్యాధులైనా నయం చేయగల్గడం, చనిపోయినవారిని బ్రతికించడం** లాంటి దివ్యలీలలు గురుచరిత్ర, సాయిచరిత్ర వంటి మహనీయుల చరిత్రలలో చూస్తాము. దత్తాత్రేయ పరంపరలోని అవధూత సాంప్రదాయంలో **రోగికి విషతుల్యమైన పదార్థములతో**
33A **రోగము కుదర్చుడమనేది ఒక దివ్యలీల.** వారి మాటయందు విశ్వాసముగల వారికది అమృతతుల్యమై ఆరోగ్యము చేకూరుస్తుంది. ఈ అవధూత సాంప్రదాయంలో మహనీయులైన శ్రీస్వామివారు ఇట్టి విషతుల్యమైన పదార్థములతో రోగనివారణ చేయడం ఎందరికో అనుభవము.

వేలూరు రామానాయుడు (నాగులవెల్లటూరు) కి క్షయవ్యాధి. నెల్లూరు డాక్టర్లవల్ల నయం కాలేదు. మద్రాసువెళ్ళి చూపించాలని తలచి శ్రీస్వామివారి ఆశీస్సుల కొరకు వచ్చాడు. శ్రీస్వామివారు 'అయ్యా, నీ ఊపిరితిత్తులలో చిండబ్బు వెడల్పున మచ్చలున్నాయి. అవేమీ చేయవు. నీవు మద్రాసు పోబళ్ళేదు. బొంతజెముడు పాలు త్రాగు, పోతుంది' అని సెలవిచ్చారు. ఈ విషయం ఇంట్లో చెబితే అందరూ నవ్వి, 'అట్లా చేస్తావేమో కండ్లు పోతాయి. పొట్టపొక్కి చస్తావు' అని అన్నారు. 'డాక్టర్ల చేతులో పడి ఆపరేషన్ చేయించుకున్నాగానీ ఎక్కువ కాలం బ్రతికేదిలేదు. శ్రీస్వామివారి మాట కాదని చచ్చేకంటే శ్రీస్వామి వారు చెప్పినట్లు చేసి చావటం మంచిది' అని తలచి అతడు శ్రీస్వామివారి సన్నిధికి వచ్చి నిజంగానే బొంతజెముడు పాలు త్రాగాడు. అటు తరువాత ఏ మందూ లేకుండానే అతని జబ్బు నయమై ఇప్పటికీ ఆరోగ్యంగా ఉన్నాడు.

శ్రీస్వామివారు వెంకటరెడ్డిపల్లెలో విడిది చేసియున్నారు. బద్వేలు బాపనపల్లి కాపురస్తుడొకడు తీవ్రమైన చలిజ్వరంతో బాధపడుతున్నాడు. ఆనాడు

ఆ ప్రాంతంలో వైద్యంచేసే నాటువైద్యుల వల్ల నయంకాలేదు. అతడు శ్రీస్వామివారిని శరణువేడాడు. శ్రీస్వామివారు ఆయనకు దోసెడు పచ్చి వేరుశనగకాయ పప్పులు పెట్టి తినమన్నారు. అతడు భయంతో అనుమానిస్తుంటే 'అయ్యా! నీ జబ్బంతా పోతుంది. తినాలయ్యో' అన్నారు. అతడవి తిన్నాక ఒక ముంతడు పుల్లనీళ్ళిచ్చి త్రాగమన్నారు. అతడు భయపడుతూనే త్రాగాడు. ప్రక్కనున్న నదిలోని తడి ఇసుకలో నాలుగడుగుల లోతు గుంటతీసి ఆ గుంటలో అతణ్ణి కూర్చోబెట్టి మెడవరకు ఇసుకతో పూడ్చి అరగంట తరువాత తీసుకురమ్మని ఆజ్ఞాపించారు. ఇంత తీవ్రమైన చలి జ్వరంతో అతణ్ణి ఇసుకలో పూడ్చితే చావడం ఖాయమని అందరూ వెనుకాడారు. కాని శ్రీస్వామివారు పదేపదే గట్టిగా చెప్పి అతణ్ణి అలాగే ఇసుకలో పూడ్పించారు. గుంటలో నుండి బయటకు తీసినదగ్గర నుండి అతని వ్యాధి అంతులేకుండా పోయి మామూలు భోజనం చేశాడు. శ్రీస్వామివారు చేసిన ఈ విచిత్రమైన లీలవంటివెన్నో శ్రీ గురుచరిత్రలోను, శ్రీ సాయిబాబా జీవిత చరిత్రలోనూ, శ్రీ అక్కల్‌కోటస్వామి చరిత్రలోనూ చూడవచ్చు. అవధూత లందరికీ మూలపురుషుడైన శ్రీ దత్తాత్రేయ స్వామి యొక్క లీలలలో ఇది ప్రధానమైనది.

శ్రీస్వామివారి దివ్య మహిమను గూర్చి ముదిగేడు గ్రామస్థులు వినియున్నారు. ఆ గ్రామస్థుల ప్రార్థనను మన్నించి శ్రీస్వామివారు మొదటి సారిగా ముదిగేడు గ్రామం వేంచేశారు. ఆ గ్రామంలో చాకలి రోశయ్య బుగ్గలూటీ కురుపుతో చాలాకాలంగా బాధపడుతున్నాడు. అవతల నుండి ఇవతల వరకు పూర్తిగా రంధ్రం పడింది. ఎప్పుడూ చీము కారుతూ దుర్వాసన వచ్చేది. ద్రవాహారం తప్ప ఎలాంటి ఆహారము తినలేడు. ఆ రంధ్రానికి పెట్టిన దూది తీస్తే బొళ బొళ చీము కారేది. ఏ డాక్టర్లు, నాటు వైద్యులూ మాన్పలేక పోయారు.

అతని దయనీయమైన స్థితిని గూర్చి విన్న శ్రీస్వామివారు తన కాలి ఎడమబోటినవేలితో భూమిలోని మట్టిని కాస్తలేపి దానిని గుడ్డలో మూటకట్టి ఇచ్చి 'ఆ మట్టి నూరి రంధ్రానికి పెట్టి కట్టు. మణికట్టు లావు చేతెడు పొడవు వుండే మూడు చిటి కేసిరి కొమ్మలు తెచ్చి వాముల దొడ్డి కంప బడీగా నాటి నీళ్ళు పొయ్యయ్యా! నీ కురుపు మానుతుంది' అని సెలవిచ్చారు. వారం రోజులలోపు ఆ కొమ్మలు చిగిర్చే సరికి ఆ కురుపు పూర్తిగా మానిపోయింది.

ఆ దివ్యలీల ముదిగేడు గ్రామస్తుల హృదయాలలో నిద్రాణంగా వున్న భక్తి శ్రద్ధలను ఉజ్వలంగా జాగృతం చేసింది. అనేక మంది భజనలతోను, ఆతిథ్యాలతోను శ్రీస్వామివారిని శ్రద్ధగా సేవించారు.

కొల్లా జయరామరాజు చెలిది వ్యాధితోను, చలిజ్వరంతోను బాధపడుతున్నాడు. ఈ విషయం శ్రీస్వామివారికి విన్నవించుకోగా శ్రీవారు అతని చేత ఒక్కశేరు పచ్చి వేరుశనగకాయలు బలవంతంగా తినిపించి, మజ్జిగ త్రావించి ఏట్లో మునిగి రమ్మని ఆజ్ఞాపించారు. అతడలానే చేశాడు. తన చెలిది వ్యాధి, చలిజ్వరము పూర్తిగా పోవడంతో అతనికి శ్రీస్వామివారిపై మరింత భక్తి శ్రద్ధలు వృద్ధి చెందాయి.

టైఫాయిడ్ వచ్చిన ఒక భక్తునిచేత సాయి పాలలో ఉడకబెట్టిన పిస్తాపప్పు తినిపించి, విరేచనాలతో బాధపడుతున్న మరో భక్తునిచేత వేరు శెనగపప్పు తినిపించి, నీరు త్రావించి వారి రోగాలను మాన్పడానికి పైలీల పోలివుంది. నిషిద్ధమైన ఆహారంతో రోగాలను తగ్గించడం అవధూతలందరకు మూలపురుషుడైన దత్తాత్రేయ స్వామి యొక్క లీల. అందుకే అవధూత లందరూ దత్తాత్రేయ స్వామియొక్క రూపాలని శ్రీ దత్తభాగవతం చెబుతుంది.

ఒకప్పుడు ఐదు సం॥ల వయస్సు గల బిడ్డకు పొట్టలోపల గడ్డలేచి విపరీతంగా ఉబ్బి ఎన్ని వైద్యాలు చేసినా తగ్గలేదు. ఆ బిడ్డను వారు శ్రీస్వామివారి చెంతకు తీసుకువచ్చారు. ఆ పాపను శ్రీస్వామివారు తమ చేతులపై బోర్లా పడుకోబెట్టుకొని దిగుడు బావిలోని నీటి యొద్దకు తీసుకుపోయారు. ఆ బిడ్డను బావిలోని నీటి నుండి ఒక మీటరు ఎత్తునకు పైకెత్తి నీటి మీద బోర్లా పడేశారు. వెంటనే బిడ్డను గట్టుకు తెచ్చి పొట్టమీద కాలేసి మృదువుగా త్రొక్కారు. ఆ బిడ్డ పొట్టలోని చీము నెత్తురు నోటిగుండ, ఆసనం గుండా వెళ్ళిపోయింది. ఏ మందులు లేకుండానే ఆ బిడ్డ కొద్ది రోజులలో ఆరోగ్యవంతురాలైంది.

శ్రీస్వామివారు తాటిపర్తిలోవుండగా 1975 లో ఒక పిచ్చి పట్టిన యువకుని త్రాళ్ళతో బంధించి శ్రీస్వామివారి వద్దకు తీసుకు వచ్చారు. అతనికి గుండం నుండి వచ్చే పొగ పట్టమని ఆజ్ఞాపించారు. నలుగురు మనుషులు బలవంతంగా పట్టుకొని 1-30 గం॥ల సేపు గుండంలోని పొగపట్టారు. తెల్లవారింది మొదలు క్రమేణ తగ్గి ఒకవారం రోజులలో పూర్తి స్వస్థత

చేకూరింది.

ఒకప్పుడు శ్రీస్వామివారు వేలూరు రామానాయుణ్ణి పదిహేను రోజులపాటు తిరువళ్ళూరు మొదలగు ప్రదేశములకు తీర్థయాత్రలకు వెళ్ళిరమ్మన్నారు. నాయుడలాగే పోతూవుంటే శ్రీస్వామివారు అతనిని పిలిచి రెండు వస్తువులు చెప్పి 'ఇవి కొని మీ మొలత్రాటిలో కట్టుకో! నీకు కనిపించిన జబ్బులు నీవు పొమ్మంటే పోతాయి' అని అభయమిచ్చారు. వారలాగే చేశారు. రైలు పెట్టెలో చలిజ్వరంతో వణికిపోతున్న బిచ్చగత్తెను చూచి నాయుడుగారు ఆ జ్వరాన్ని పొమ్మని చెప్పిన మరుక్షణమే ఆమె స్వస్థురాలవ్వడం ఆయన్నెంతో ఆశ్చర్యం పరచింది. ఇదే విధంగా అనేక చోట్ల అనేక మందికి మాటమాత్రం చేత జబ్బులు పోగొట్టి శ్రీస్వామివారు చెప్పిన గడువు ప్రకారం ఇల్లుచేరి శ్రీస్వామివారిని దర్శించాడు. శ్రీస్వామివారిని దర్శించిన అరగంటకు ఒకరు తమ ఎద్దుకు జబ్బుచేసి చావు బ్రతుకుల్లో వుంటే వచ్చారు. వెంటనే రామానాయుడు ఆ ఎద్దును సమీపించి 'పో జబ్బా' అని పూర్వంవలెనే ఆజ్ఞాపించాడు. కాని ఆ ఎద్దు చనిపోయింది. ఇన్ని జబ్బులు నయం చేసిన తన శక్తి ఇప్పుడెందుకిలా వ్యర్థమైందో అతనికి అర్థంగాలేదు. వెంటనే శ్రీస్వామివారిని దర్శించి జరిగిన విషయం చెప్పాడు. అప్పుడు శ్రీస్వామివారు 'ఇక ఆ వస్తువులు నీ మాటకు పనిచేయవు' అని అన్నారు. యాత్ర నుండి తిరిగివచ్చి శ్రీస్వామివారిని దర్శించిన వెంటనే వారికి ప్రసాదించబడిన దివ్యశక్తి అంతరించిందన్నమాట. అందరి జబ్బులు తగ్గించింది శ్రీస్వామివారి మాటేనని ఆ వస్తువులు కాదని మనం గుర్తించాలి.

ఒకరోజు స్వామివారు తన సేవకునకు మంత్రించే గుడ్డనిచ్చి ఇకమీదట బాధలకు గురియైన వారికి మంత్రించమన్నారు. పదమూడు మందికి తేళ్ళు, పాములు కుట్టినవారికి మంత్రించాడు. వరసగా అందరికీ మంత్రించిన వెంటనే బాధ నివృత్తి అయింది. ఆ తరువాత మంత్రించిన వారికి క్రమంగా కొంత టైము తీసుకొని కొంత బాధ అనుభవించాక గాని తగ్గలేదు. 'ఏమి స్వామీ! మొదట తగ్గినట్లు వెంటనే తగ్గడం లేదు' అని అడిగితే **'అయ్యా లక్ష పాపాలకు ఒకసారి తేలు కుడుతుంది. ఆ పాపఫలం కొంతైనా అనుభవించకుండా వెంటనే తగ్గిస్తే పైవాళ్ళు నీవులేని సమయంలో మరలా కుట్టిస్తారు. అప్పుడు పూర్తిగా అనుభవించాల్సి వస్తుంది. ఇప్పుడే కొద్దిగా** 34

**అనుభవిస్తే సరిపోతుంది గదా!' అని అన్నారు శ్రీస్వామివారు. కర్మఫలమెలా పనిచేస్తుందో సద్గురువెలా ఆ బాధనుండి విముక్తులను చేస్తారో చూడండి.**

శ్రీస్వామివారు శరీరంతో ఉన్నప్పటి నుండి 1986 వరకు మల్లిక వెంకయ్య నిరంతరం శ్రీస్వామివారి గుండానికి బొంతజెముడు చెట్లుకొట్టి తోలుతున్నాడు. బొంతపాలు మనశరీరంపై పడితే అంతవరకు బొబ్బలేచి పుండు పడుతుంది. పశువులు బొంతజెముడు చెట్లకు రాసుకుంటే వాటి శరీరానికి పాలు తగిలిన చోట చెక్కులేచి పుండు పడుతుంది. అలాంటిది వెంకయ్య ఆ చెట్లు కొట్టేటప్పుడుగాని, వాటిని బండిలోకి మోసేటప్పుడుగాని బొంతజెముడు పాలు ఆయన ఒళ్ళంతా పడుతాయి. కాని ఎక్కడా ఏ మాత్రమూ పొక్కదు. ఎన్నోమార్లు ఆ పాలు వెంకయ్య కండ్లలో పడుతుంటాయి. కళ్ళు ఎర్రబడి వాస్తాయి. పెన్సిలిన్ కంటి మందు వేస్తే రెండవరోజుకు కన్ను మామూలుగా అయింది. కానీ బొంతపాలు కంటిలో పడితే కళ్ళు పోతాయని ప్రతీతి.

ఒకప్పుడు శ్రీస్వామివారు రావూరు తాలూకా ముదిగేడు గ్రామంలో విడిదిచేసియున్నారు. ఒకరోజు తీవ్రమైన తెల్లబట్ట వ్యాధితో బాధపడుతున్న ఒకామెను శ్రీస్వామివారి చెంతకు తీసుకువచ్చారు. ఆ రోజులలో వీలైన వైద్యాలన్నీ చేయించి విఫలమై వచ్చారు. రెండు మూడు రోజులు శ్రీస్వామివారి చెంత వేచియున్నా వారేమీ చెప్పలేదు. మూడవ నాటి రాత్రి అందరూ నిద్రపోయేటప్పుడు శ్రీస్వామివారి సన్నిధిలో మరణించడం మేలని తలచి ఆమె శ్రీస్వామివారి అగ్నిగుండంలో దూకింది. ఆమెకు ఏమాత్రమూ వళ్ళుగానీ, గుడ్డలుగానీ కాలలేదు. ఆనాటితో ఆమె జబ్బు శాశ్వతంగా నివారణయింది.

పాలకొల్లు సుబ్బమ్మగారికి థైరాయిడ్ కాన్సర్ వల్ల రాయవేలూరులో ఆపరేషన్ చేయించారు. ఆపరేషనంటే చాలా భయపడి సుబ్బమ్మ శ్రీస్వామి వారిని అనన్యంగా స్మరించింది. ఆపరేషనైనంత వరకూ శ్రీస్వామివారు ఆమె ప్రక్కన కూర్చుని యున్నట్లు స్పష్టంగా ఆమెకొక దర్శనం ప్రసాదించారు. శ్రీస్వామివారు వున్నారన్న ధైర్యంతో ఆపరేషన్ చేయించుకున్నది. శ్రీస్వామివారి కృపవలన ఆమె ఆరోగ్యం చక్కబడి ఆ తరువాత పదమూడు సంవత్సరములు జీవించింది.

నాగులవెల్లటూరు నివాసి కూచి పట్టాభిరామయ్య చిన్ననాడు ఐదు సంవత్సరముల వయస్సు వరకు చలిజ్వరము, బేదులతో బాధ పడేవాడు.

వీరి తల్లిదండ్రులు చేయని వైద్యముగానీ, మంత్ర, తంత్రాలుగానీ లేవు. ఇక బిడ్డ బ్రతకడనే నిశ్చయానికి వచ్చి, చివరి ఆశగా బద్వేలు తిప్పమీద వున్న శ్రీస్వామివారి దగ్గరకు తీసుకుపోయారు. 'అబ్బో ఆయనకేమయ్యా, మిద్దెమీద మిద్దె కడుతాడు. బాగుంటాడులే' అంటూ పచ్చి వేరుశనగ గింజలు తినిపించి గుడ్డతో మంత్రించారు. అంతే ఆనాటి నుండి పూర్తి ఆరోగ్యవంతుడయ్యాడు.

శ్రీస్వామివారి మాటపై పట్టాభిరామయ్య కెంత విశ్వాసమో ఈ క్రింది సన్నివేశం నిరూపిస్తుంది. వారు 1971 సం॥లో స్వామివారిని అడగకుండానే మిద్దె ఇల్లు కట్టనారంభించారు. గోడలు పూర్తయి ఎనిమిది నెలలు గడచినా పరిస్థితులు కలసిరాక స్లాబు పోయలేక పోయాడు. చివరకు తన పొరపాటు గ్రహించి శ్రీస్వామివారికి మొరపెట్టుకున్నాడు. అప్పుడు శ్రీస్వామివారు 'అయ్యా, అది పీనుగులమట్టు, ఆ స్థలం వదలి నాలుగు మూరలు దక్షిణం పడమర జరిగి కట్టుకో అంతా బాగుంటుంద'ని సెలవిచ్చారు. పదివేల రూపాయలు ఖర్చుచేసి కట్టిన గోడలను తీసేసి శ్రీస్వామివారుచెప్పిన విధంగా నిర్మించనారంభిస్తే త్వరగా పని పూర్తయింది. పిల్లాపాపా కులాసాగా ఉన్నారు.

నూతేటి శ్రీ రామయ్యగారి నిమ్మచెట్లు ఎన్నాళ్ళకూ కాపుకురాలేదు. శ్రీస్వామివారికి విన్నవించుకున్నారు. 'చెరువు దగ్గర వాగులో నీళ్ళు తెచ్చి ఆ నీళ్ళు క్రింద పడకుండా ప్రతిచెట్టు పైనా ఒక ఉగ్గిన్నెడు పోయండి. చెట్లుబాగా కాపుకాస్తాయి' అని శ్రీస్వామివారు సెలవిచ్చారు. వారదే విధంగా చేశారు. కొన్ని నీళ్ళు మిగిల్తే వాటిని బావిలో పోశారు. పై చెట్లేగాక ఆ బావినీరు పారిన చెట్లన్నీ ఒకేతూరి కాపుకొచ్చాయి.

పసుపులేటి లక్ష్మమ్మకు పుట్టిన బిడ్డలందరూ చనిపోయారు. అప్పుడప్పుడూ శ్రీస్వామివారిని దర్శించేది. ఎప్పుడు వెళ్ళినా కొన్నాళ్ళు తన దగ్గర వుండమని కోట్లు లాభం వస్తుందని చెప్పేవారు. ఒకరోజు శ్రీస్వామివారు ఆమెను ఒక నెల రెండు రోజులు భజన చేసుకొంటే దేవుని లెక్కలోకి వస్తావని స్వప్నంలో చెప్పారు. ఆమె అదే విధంగా శ్రీస్వామివారి చెంతచేరి భజన చేస్తోంది. శ్రీస్వామివారు చెప్పిన వాయిదా దాటిపోయినా శ్రీస్వామివారు ఆమెకు శెలవు ఇవ్వలేదు. మంచానవున్న తన తల్లిని సేవించాలని శ్రీస్వామివారికి ఆమె విన్నవిస్తే 'ఎవరికైనా అర్ధరూపాయి ఇచ్చి సేవ చేయించమను. నీకు ఇచ్చట లక్షలు లాభం వస్తుంద'న్నారు. ఆమె అన్న వస్తే

కూడా అదే విషయం చెప్పి పంపారు. వాళ్ళ అన్న వెళ్ళాక ఈమె మరలా శ్రీస్వామి సేవకులచేత చెప్పించింది. అందుకు శ్రీస్వామివారు 'ఆమె కాళ్ళకు కురుపులు లేచి ఆడ పడుందని వాళ్ళకు చెప్పి పంపు' అన్నారు. నిజానికి ఆమె కలాంటి కురుపులే లేవు.

కానీ చిత్రంగా తెల్లవారేసరికి చీలమండపై నిమ్మకాయంత కురుపులు తయారైనవి. ఆ సంగతి శ్రీస్వామివారికి చెపితే 'చూడవయ్యా! భజన చేసుకుంటూ ఈడ పడుండమంటే దుర్బుద్ధి మాటలు మాట్లాడుతుంది' అన్నారు. ఇంటికి వెళ్ళాలనుకున్నందుకు తగిన శాస్తి జరిగిందని ఆమె పశ్చాత్తాప పడింది.

ఆ సాయంకాలం శ్రీస్వామివారు ఆమెను ప్రేమగా పలుకరిస్తూ 'ఏమమ్మా కురుపులు లేచాయా? పోతాయిలే!' అని ఆమె కురుపులను తన అమృత హస్తములతో స్పృశించారు. రెండవ రోజుకు ఏ మందులు లేకుండానే కురుపులు మాయమయ్యాయి. అది మొదలు ఆమె అనేక పర్యాయములు శ్రీస్వామివారిని దర్శించి సేవిస్తుంది.

తలుపూరు కరణం జి.వి. రమణయ్యగారు ఇలా వ్రాస్తున్నారు.

గత ఇరవై సం॥లుగా కడుపు నొప్పితో బాధపడుతూ ఎందరో డాక్టర్లకు, నాటు వైద్యులకు చూపాను. వారి మందులేవి ఉపకరించలేదు. ఒకరోజు ఏదో విషయమై శ్రీస్వామివారిని ప్రశ్న అడగాలని అరటిపండ్లు, తాంబూలం, దక్షిణ తీసుకొని వెళ్లాను. శ్రీస్వామివారు ఎంత బ్రతిమాలినా అరటిపండ్లు స్వీకరించక వాటిని అగ్ని గుండములో వేయించారు. చిత్రంగా నేను ప్రశ్న అడిగే బదులు నా కడుపునొప్పి విషయం విన్నవించాను.

'ఊరికి ఉత్తరంగా నుండు ఒకరింట్లో రాత్రి ఝాము పొద్దుపోయాక (9-30) భోజనానికి వస్తానని ముందుగా చెప్పకుండా వెళ్ళి భోంచేయి, 'నీకడుపునొప్పి పోతుంది' అన్నారు. అది అవధూతల వైద్య విధానమని వారి అమృతవాక్కు ప్రభావం వలన వ్యాధులు నయమవుతాయని తెలియని నేను ఏదోచెప్పాడులే అని అశ్రద్ధ చేశాను. నా కడుపునొప్పి నన్ను వదలలేదు. సరికదా శ్రీస్వామివారి మాట మాత్రం ఎలా వ్యర్థం కానిస్తారు! ఒకరోజు ఇంట్లో ఎవ్వరూ లేక రాత్రి గం॥ 9-30 ని.లకు బొగ్గులపొయ్యి అంటిస్తున్నాను. అప్పుడు మా గ్రామాన ఉత్తరంగా ఉన్న పూజారి మా ఇంటికి వచ్చి నేను

వంట చేస్తుండటం చూచి నన్ను వాళ్ళింటికి తీసుకెళ్ళి భోజనం పెట్టాడు. అక్కడ తినినది పచ్చడి, మజ్జిగ అన్నం మాత్రమే. కాని ఆనాటి నుండి నా కడుపునొప్పి అదృశ్యమై ఏమి తిన్నా జీర్ణము చేసుకొనగల్గుతూ ఆరోగ్యంగా ఉన్నాను. వారి దివ్యవాక్కు, వారి అనుగ్రహబలాన్ని నేనేమని కొనియాడగలను!




**ఓం నారాయణ - ఆదినారాయణ**

# అవధూత లీల

## అధ్యాయము - 12

## సజ్జన వందిత



జ్ఞానిని జ్ఞానే గుర్తించగలడని రమణ మహర్షి వాక్యము. వజ్రము యొక్క విలువ సిసలైన వజ్రాల వర్తకునికే ఎరుక గాని పుచ్చు వంకాయలమ్ముకునే వారికెలా తెలుస్తుంది. శ్రీస్వామివారు చాలా బాగా ప్రశ్నలు చెపుతాడని లోకులు అనుకునే రోజులలో ఋషికేశ్ నుండి శ్రీ చిదానందస్వామిగారు, శ్రీ దేవానందస్వామిగారు వచ్చి శ్రీస్వామివారిని పరబ్రహ్మ స్వరూపులుగా గుర్తించి పాదాభివందన మాచరించారు. అలాగే ఆచార్య శ్రీ భరద్వాజగారు, శ్రీస్వామివారిని దర్శించినది మొదలు తన పరిచయస్థులందరినీ శ్రీస్వామివారిని అవశ్యం దర్శించమని, వారు భూమిపై ఆవిర్భవించిన దైవస్వరూపమని, వారిని కీర్తించేవారు. ఇదేవిధంగా చాలామంది అవధూతలు వచ్చి శ్రీస్వామివారిని దర్శించి వారి ఆశీస్సులు పొంది వెళ్ళారని శ్రీస్వామివారి సేవకులు చెపుతున్నారు. కానీ వాళ్ళు ఆ అవధూతల పేర్లు, అడ్రస్సు, శ్రీస్వామివారితో వారి సంభాషణలు గ్రంథస్థము చేయలేదు.

గోపారం కాపురస్థుడు పాలకొండ సుబ్బారెడ్డిగారు ఇలా చెపుతున్నాడు.

ఆ రోజుల్లో శ్రీస్వామివారి దగ్గరకు జనం ఇంత ఎక్కువగా వచ్చేవారు కాదు. వారి మంటలు, గోనె సంచులు, తాటాకులు చూచి ఆయనొక పిచ్చి వాడనుకొనేవారు. అనుభవముగల కొద్దిమంది మాత్రమే శ్రీస్వామివారిని దర్శించే రోజులవి.

ఋషికేశ్ నుండి శ్రీ యుతులు చిదానందస్వామి, దేవానందస్వామి మాధవానందస్వామివార్లు ఒకరోజున శ్రీ వెంకయ్యస్వామివారి దర్శనార్థం వస్తున్నారని తెలిసి, వారిని చూడాలని జనం తండోపతండాలుగా వచ్చియున్నారు. సాయంత్రం గం॥ 4.30 అయినా ఆ యతివరులు రాలేదని జనమంతా నిరుత్సాహపడుతున్నారు. అది చూచి శ్రీ వెంకయ్యస్వామివారు

'వస్తున్నారయ్యా! ఇంకా గంటలు కాలేదు' అన్నారు. శ్రీస్వామివారు చెప్పినట్లు కొద్ది నిమిషాలలో శ్రీచిదానందస్వామి, తదితరులు కారులో వచ్చారు. వచ్చిన వెంటనే నారాయణ నామస్మరణతో శ్రీస్వామివారి పాదాలమీద పడ్డారు. ఇది చూచిన జనమంతా భగవన్నామ స్మరణతో ఆ ప్రదేశమంతా ప్రతిధ్వనింప చేశారు. 'వచ్చిన స్వాముల కంటేగూడా మన స్వామే గొప్పవాడన్నమాట!' అని అనుకున్నారు. ఏదో తీపి పదార్థము తెచ్చి శ్రీస్వామివారిని తినమని ఆ స్వాములు ముగ్గురూ ప్రాధేయపడ్డారు. 'అయ్యా! దాన్ని తినడం విషం తిన్నట్లే గదా! ఇంతమంది ఇక్కడున్నారు. వీరందరికీ పెడితే నాకు పెట్టినట్లే!' అన్నారు శ్రీస్వామివారు. ఆ మాట వింటూనే శ్రీ చిదానందస్వామి చెంపలేసుకున్నారు.

అప్పుడు వారిని శ్రీస్వామివారు ఆశీర్వదించి 'త్వరలో సముద్రం దాటిపోతావు' అని చెప్పారు. అదే విధంగా శ్రీచిదానందగారు తమ ఆశ్రమం చేరేసరికి అమెరికా నుండి వారి కొరకు ఆహ్వాన మెదురు చూస్తున్నది!

నంద్యాల ప్రాంతం నుండి వచ్చిన ఒక భక్తుడు మరియు వారితో వచ్చిన సుబ్బన్న అనే ఒక సాధువు శ్రీస్వామివారిని తలుపూరు నారాయణదాసు ఆశ్రమంలో దర్శించారు. ఈ సాధువు చాలా సిద్ధులు గలవారు. ఉదా:– అన్నానికి కూర్చుంటే పది మంది అన్నం పెట్టినా సరే, ఇరవై మంది అన్నం పెట్టినా సరే చాలు అని అనడు. పెడుతూ వుంటే తింటూనే వుంటాడు. 'మిగిలిన భక్తులకు తేవాలగదా, ఇక చాల్లే సుబ్బన్నా!' అంటే 'ఆ! చాల్లే' అంటూ విస్తర దగ్గర నుండి లేస్తారు. మనం పిలిచి అన్నం పెడితే తింటారు. లేకుంటే ఎన్నాళ్ళయినా అన్నం పెట్టమని అడిగేవారుకాదు. దేవాలయాలు, గ్రామ చావడి, పాడుపడ్డ ఇండ్లే వీరి నివాసాలు. ఒక్క క్షణం ఏమారకుండా నడుస్తూంటారు. నడిచే తీరు విచిత్రంగా వుంటుంది. ఎడమకాలు బొటనవ్రేలికి, కుడికాలు మడిమ తగిలేటట్లు అడుగు వేస్తూ, ముందుకు సాగుతూ, గొణుగుకుంటూ, అడుగు లెక్కవేస్తూ నిర్విరామంగా నడిచిన చోటే అటు ఇటు నడుస్తూంటారు.

వీరు శ్రీస్వామివారిని గూర్చి శ్రీస్వామి భక్తులతో అన్న మాటలు గమనించదగినవి.

'స్వామిలాగేవున్నాడు, చాలా జాగ్రత్తగా వుండండి' అని సెలవిచ్చారు.

శ్రీస్వామివారినడిగి మీరేమైనా వ్రాయించుకోండని శ్రీస్వామివారి సేవకులంటే 'వచ్చేటప్పుడే దోవన ఎదురై ఇద్దరం మాట్లాడుకున్నాము. ఇంకేమి అడగబళ్ళేదులే' అని సెలవిచ్చారు.

శ్రీస్వామివారు సోమశిల దగ్గర వేంచేసి యున్నప్పుడొక దిగంబర యోగి శ్రీస్వామివారి దర్శనార్థం వచ్చారు. శ్రీస్వామివారు 'అయ్యా! ఆయనకు కొంచెం గోచి పెట్టండయ్యా' అని సెలవిచ్చారు. ఆ దిగంబరయోగి 'పిల్లవాడు పెద్దవాడేగాని ఎగదీసుకోవడం పోలేదే' అని విన్నవించారు.

ఈ సంభాషణ యొక్క నిజమైన అర్థం వారిద్దరికే తెలుసు. ఈ విధంగా అనేక మంది సాధకులు, యోగులు, సాధువులు శ్రీస్వామివారి దర్శన, ఆశీస్సుల కొరకు వచ్చి వారి వారి పనులు చక్కబెట్టుకొని వెళ్ళేవారు.


శ్రీస్వామివారి మహత్తర సంకల్పం వలన ఇట్టి సంఘటనలు గానీ, సంభాషణలుగానీ గ్రంథస్థం చేయబడకపోవడం మన దురదృష్టం. నేటికీ వీరు ఆధ్యాత్మిక భిక్ష కోరినవారికి పరివర్తన తెచ్చి అవసరమైనప్పుడు పి.మాధవరావుగారు, నందగిరి సుందరరావుగారిలాంటి వారికి భౌతిక దర్శనం గూడా ప్రసాదించి ఆత్మపథంలో చేయూత నిచ్చి నడిపించుచున్నారు.

ఒకప్పుడు ఇద్దరు పేరుమోసిన మంత్రగాళ్ళు శ్రీస్వామివారి వద్దకొచ్చారు. గొలగమూడి ఆశ్రమంలోని గంగరావి చెట్టు క్రింద కూర్చున్నారు. ఉదయం కూర్చుని మధ్యాహ్నం 4 గం॥ వరకు అచ్చుట నుండి కదలలేదు. ఎవరితోనూ మాట్లాడలేదు. ఆనాడు శ్రీస్వామివారు అధికంగా మంట వేస్తూ వున్నారు. 4 గం॥ల ప్రాంతంలో వారికి శ్రీస్వామివారు అన్నం పెట్టించారు. 'వీళ్ళు చాలా అలసిపోయారు, చెరి రెండు రూపాయలివ్వండి' అన్నారు. భక్తులలాగే ఇచ్చారు.

వారు వెళ్ళేటప్పుడు కొందరు భక్తులతో అన్నారు: 'శ్రీస్వామివారి గొప్పతనం విని, అసూయచెంది, వారిపై మంత్ర ప్రయోగం చేసేందుకు వచ్చాము. అదేమి చిత్రమోగానీ వచ్చింది మొదలు ఆ మాటే మరచిపోయి ఈ చెట్టు క్రింద ఇలా కూర్చుండి పోయాము. అది శ్రీస్వామివారి మహిమ. మేమింత దుర్బుద్ధితో వచ్చినాగానీ శ్రీస్వామివారు మమ్ము ఇంత ఆదరంగా చూచారు. శ్రీస్వామివారి కృపకు మేము అర్హులముకామ'ని చెప్పి శ్రీస్వామివారికి మనఃపూర్వకంగా నమస్కరించారు.

# అవధూత లీల

## అధ్యాయము - 13
## దక్షిణ



**దైవము, గురువు, సత్పురుషుల ఎడల మన
హృదయములో గల పూజ్యభావము, ప్రేమ, శ్రద్ధలను వ్యక్తం
చేసేందుకు సమర్పించేదే దక్షిణ. సంస్కృతంలో దక్ష అంటే
శ్రద్ధ అని అర్థము. మన హృదయాలలో అట్టి పూజ్యభావము 35
లేకుండా బాహ్యంగా సమర్పించబడిన దక్షిణ ఎంత పెద్ద
మొత్తమైనా నిరర్థకమే. మన హృదయాలట్టి పూజ్య
భావముతోను ప్రేమతోనూ నిండియున్నప్పుడు మన కానుకెంత చిన్నదైనా
స్వీకరించే వారికదెంతో గొప్పదిగా వుంటుంది.**

అందుకే గీతలో 'భక్తితో సమర్పించిన పత్రం, పుష్పం, ఫలం, నీరు...... నేను ప్రీతితో స్వీకరించుచున్నాను అని' శ్రీకృష్ణ భగవానుడు చెప్పాడు.

సర్వాన్ని నడిపేది ఆ భగవంతుడేనని, ఆయనే భక్తపాలన కొరకు ప్రజలకు ధర్మబోధ చేయుటకు వివిధ మహాత్ముల రూపంలో భూమిపై అవతరిస్తుంటారని గుర్తించడమే శ్రద్ధాపూర్వకమైన భక్తి. ఈ సత్యాన్ని తమ భక్తులు గుర్తించగలందులకే శ్రీస్వామివారు అప్పుడప్పుడూ తమ భక్తుల నుండి దక్షిణ కోరి తీసుకునేవారు. దానికితోడు ఒక్కొక్క భక్తుని పరిస్థితిని బట్టి ఆయన కోరే దక్షిణకు మరెన్నో అర్థాలు, ప్రత్యేకతలు గూడా ప్రకటమౌతాయి.

జనవరి 1980 లో తులశవ్వను పదకొండు దుప్పట్లు దక్షిణగా సమర్పించమన్నారు శ్రీస్వామివారు. శ్రీ సాయి కూడా ఆధ్యాత్మిక సత్యాలను బోధించదలచినప్పుడు దక్షిణ కోరడం ద్వారా వారు వదలవలసిన దుర్గుణాల సంఖ్యను తెలిపేవారు. శ్రీస్వామివారు తులశవ్వ నుండి కోరింది 5 జ్ఞానేంద్రియాలు, 5 కర్మేంద్రియాలు, మనస్సు మొత్తం 11. ఆత్మజ్ఞానాన్ని ఆవరించి బ్రహ్మం నుండి మనలను పరిమితులుగా చేసియున్న ఈ 11

ఆవరణలను (దుప్పట్లను) తనకు సమర్పించి బ్రహ్మంతో ఐక్యమవమని శ్రీస్వామివారి భావం కాబోలు!

స్వామి:- నా తొమ్మిది దుప్పట్లు నాకివ్వండయ్యా

బి. నాగయ్య :- స్వామీ! తమకుండేది ఆరు దుప్పట్లేగదా? తొమ్మిదెక్కడివి? ఇదిగో మీ ఆరు దుప్పట్లు తీసుకోండి.

స్వామి :- ఆహా....... ఆ తొమ్మిది దుప్పట్లు నా కివ్వండి.

నాగయ్య ఆ ఆరు దుప్పట్లకు టవల్సు మూడు కలిపి లెక్కకు తొమ్మిది చేసిఇచ్చాడు.

స్వామి :- ఇదేందయ్యా! గోచీ గుడ్డలిచ్చావు? నాయి పెద్ద దుప్పట్లు గదా?

నాగయ్య తన దుప్పటి, రోశిరెడ్డి దుప్పటి, గురవయ్య దుప్పటి కలిపి తొమ్మిదిచ్చాడు.

స్వామి :- ఆ..... అద్ది! సరిపోయింది. అంతే! అంతే! అన్నారు.

36 **పంచభూతాలు, మనస్సు, బుద్ధి, అహంకారము అనే అష్టవిధ ప్రకృతులు వాటి కాధారమైన పరమాత్మతత్వము ఈ మొత్తమూ కలసి భగవంతుడు.** అన్నింటినీ భగవత్ స్వరూపుడైన శ్రీస్వామివారుగా గుర్తిస్తూండడమే తొమ్మిది దుప్పట్లనూ ఆయనకు సమర్పించడం అని వారి భావం గాబోలు.

37 **మరొకప్పుడు తులశవ్వనుద్దేశించి శ్రీస్వామివారు, 'ఆరు దుప్పట్లు గుండములో వేయమ్మా' అని పదే పదే ఆదేశించారు. అరిషడ్వర్గాలనే ఆరు దుప్పట్లను కాల్చివేయమన్నారేమో అనిపిస్తుంది.**

**నిజమైన భక్తి ప్రేమలకే శ్రీస్వామివారు విలువనిస్తారుగాని మనం**
38 **సమర్పించే వస్తువులకు మాత్రం కాదు. భక్తి ప్రేమలు లేకుండా లోకం కొరకు, తోటివారిలో గొప్ప అనిపించుకొనుటకూ, మన హోదా నిలుపుకొనుటకూ సమర్పించిన వస్తువులు ఎంత విలువైనవైనా, శ్రీస్వామివారి దృష్టిలో అవి కాకిరెట్టవంటివే.**

నన్ను (రచయిత) శ్రీస్వామివారు ఆయాసం బాధ నుండి విముక్తుని చేసినందుకు కృతజ్ఞతతో తలుపూరులో ప్రతిరోజూ నాలుగిడ్లీలు కొనుక్కొచ్చి

స్వామివారికి సమర్పించేవాడను. మార్గమధ్యంలో షిరిడీ సాయి నామముయేమారక జపిస్తూండేవాడను. ఒకనాడు జేబులో పదిపైసలే వున్నది. దానితో ఒక ఇడ్లీ తేవడమా లేక అప్పుపెట్టి నాలుగు ఇడ్లీలూ తేవడమా అనే ఆలోచనతో మార్గమంతా గడిపాను. నాలుగు తేకుండా ఒక్కటిగా సమర్పించడం తక్కువగా వుంటుందని అప్పుచేసి నాలుగు తెచ్చి సమర్పించాను. ఎంత బ్రతిమాలినా శ్రీస్వామివారు అవి తాకనుగూడా లేదు. నామజపం ఆగిపోయింది. మరీ ఒక్క ఇడ్లీ సమర్పించడం చిన్నతనమని అప్పు చేయడమే శ్రీస్వామివారికి సమ్మతం కాలేదు. కనుకనే వారు ముట్టలేదు.

పండుగకు, యాత్రకు, పబ్బానికి, మరే పవిత్ర కార్యానికి అప్పు చేయకూడదని శ్రీ షిరిడీ సాయి కూడా భక్తులకు బోధించారు.

ఒకరోజు కలిచేడు హిందీపండిట్ మస్తాన్‌సాహెబ్‌గారు శ్రీస్వామివారికి రెండు రూపాయలు సమర్పించి నమస్కరించాడు. 'ఈయనకు ఇరవై ఆరు రూపాయలు రావలెనని వ్రాసి ఇయ్యయ్యా!' అన్నారు శ్రీస్వామివారు. మూడు నెలల తరువాత వారికి ప్రభుత్వము వారు చాలాకాలంగా పెండింగులో వుంచిన అడిషనల్ ఇంక్రిమెంట్ రూ. 26/- లు మంజూరైనది! శ్రీస్వామివారికి దక్షిణ సమర్పించిన నెల నుంచీ ఇంక్రిమెంటు ఆమోదించడమే ఆశ్చర్యం.

శ్రీస్వామివారు కొంతమందికి ఇంత డబ్బు పెడితేగాని మాటరాదని చెప్పేవారు. ధనాశపరులు, లోభులు శ్రీస్వామివారికి డబ్బు పిచ్చనుకునేవారు. పరిశుద్ధమైన వారి వైరాగ్య జీవిత విధానాన్ని పరిశీలించినవారికిగాని శ్రీస్వామివారికి ధనమంటే ధాన్యపుగింజంత విలువగూడా లేదని తెలియదు. ఆయన ధనమేనాడు దాచుకొని యెరుగరు. సాయంకాలానికల్లా సేవకులకు వారి వారి కష్టాన్ని, అవసరాన్ని బట్టి పంచేసేవారు. కొందరు దక్షిణ సమర్పించినా స్వీకరించేవారు కారు.

కొన్ని కారణాలవల్ల శ్రీ రామయ్య తన ప్రక్క చేనుకంటే ఆలస్యంగా 'రాగి' పైరు పెట్టారు. చేలో పదును లేదు గనుక చక్కగా మొలవదని భయపడి, రాగిపైరు బాగా పండితే శ్రీస్వామివారికి పుట్టికి ఒక తూము రాగుల చొప్పున సమర్పించుకుంటానని మ్రొక్కుకున్నాడు. చేను అనుకున్న దానికంటే ఎక్కువగా పండింది. తాను మ్రొక్కుకున్న రాగులలో కొన్ని ఇచ్చాడుగాని కొన్ని ఇవ్వలేదు.

ఆ సంగతి మరచిపోయి రెండు సంవత్సరాలు గడిచాయి. ఎప్పుడో గుర్తొచ్చినప్పుడు మాత్రం బాధపడేవాడు. ఒకరోజు శ్రీస్వామివారిని దర్శించి నమస్కరించాడు. శ్రీస్వామివారు తమలో తాము 'ఆ రాగులు అట్లాగే పోయాయి!' అని రెండు మూడు మార్లు పెద్దగా, అనుకొంటున్నారు. ఆ మాటలు తన మ్రొక్కును గురించేనని గుర్తించాడు. పరిహారంతో సహా ఆ రాగుల ఖరీదును వెంటనే శ్రీస్వామివారికి సమర్పించాడు.

శ్రీ సాయినాధునివలె శ్రీస్వామివారు తనకు రావలసిన మ్రొక్కుబడులు అడిగి పుచ్చుకొనేవారు. ఒక్కొక్కప్పుడు దక్షిణ పైకం చిన్న చిన్న మొత్తాలుగా అనేకమార్లు అడిగి పుచ్చుకొని రావలసిన మొత్తం పూర్తియైన తరువాత ఇక ఒక్క పైసా కూడా తీసుకునేవారు కాదు.


ఒకప్పుడు దక్షిణాది నుండి వచ్చిన రైతు కూలీ రూ. 2/- పెట్టి ఏదో ప్రశ్న అడిగాడు. శ్రీస్వామివారు ఒక్కమాట చెప్పి 'ఇక మాటరాదు, మరలా దక్షిణ పెట్టమన్నారు'. ఇలాగే అనేక మార్లు దక్షిణ అడిగి అతని వద్దనున్న పైకమంతా చార్జీకి కూడా లేకుండా తీసుకున్నారు. చిట్టచివర అతనికి చీటీ వ్రాయించి ఇచ్చారు. తరువాత అతనికి చార్జీలకు కూడా పైకంలేని సంగతి ఎరిగే శ్రీస్వామివారు అతనికి రూ. 6/- లు ఇచ్చి పంపారు.

కడప జిల్లా నుండి ఒక భక్తుడు దర్శనార్థం రాగానే శ్రీస్వామివారు అనేక పర్యాయాలు దక్షిణ అడిగి అతని దగ్గర ఒక్క పైసా లేకుండా తీసుకున్నారు. ఇదంతా మన మంచికేనని ఆ భక్తుడు చాలా సంతోషంగా జేబీ ఖాళీ చేశాడు. శ్రీస్వామివారి ఆశ్రమంలో భోంచేసి సెలవు తీసుకొని తన గ్రామం బయలుదేరాడు. చేతిలో పైసాలేదు. బస్సులో శ్రీస్వామివారు తనకేదో ఒక విధంగా చార్జి డబ్బు సహాయం చేస్తారని తలచాడు. చిత్రంగా తాను మూడు బస్సులు, ఒక పడవలో ప్రయాణం చేసినా ఒక్కరు గూడ తనను చార్జి ఇమ్మని అడుగలేదట. ఈ విషయాన్ని అతడు తన స్నేహితులందరికీ ఆశ్చర్యంతో వెల్లడి చేశాడు.

ఓం నారాయణ - ఆదినారాయణ

# అవధూత లీల

## అధ్యాయము - 14
## సాధు దూషణ




కోటితీర్థం దగ్గర పెన్నానదిలో పెద్ద దూలమంత మొద్దు ప్రవాహంలో వచ్చింది. చాలా మంది దానిని బండి మీద తీసుకురావాలని చూచారు. అది చాలా బరువుగా వున్నందున తిరిగి వెళ్ళిపోయారు. ఆ రాత్రి శ్రీస్వామివారు ఒక్కరే దాన్ని భుజాన మోసుకు వచ్చి తమ గుండములో వేశారు. తెల్లవారి దాన్నా రైతులు చూచి, 'ఓ పిచ్చి వెంకయ్యా! బంగారం లాంటి దూలాన్ని ఇట్లా తగులబెడుతున్నావే, నీ కోసమేనా మేము దాన్నక్కడ వుంచింది? అని తూలనాడారు. వారిలో ఒక దుండగుడు, 'నీవీ పిచ్చి పనులు చేయకు' అని చెంపన ఒక దెబ్బ కూడా కొట్టాడట. ఆ దుండగుడు ఇంటికి వెళ్ళేసరికి అతని ఇల్లు తగులపడుతుంది. చుట్టు ప్రక్కల వాళ్లంతా తమను రక్షించమని శ్రీస్వామివారిని ప్రార్థించారు. 'పాపం వున్నంత వరకు పోతుంది మిగిలినది నిలబడుతుంది' అని సెలవిచ్చారు. అట్లాగే ఆ కొట్టినవాని ఇంటివరకూ కాలిపోయింది. మిగిలిన ఇండ్లు చెక్కు చెదరలేదు. తెల్లవారి అతడు శ్రీస్వామివారి కాళ్ళపై బడ్డాడు.

ఒకరోజు శ్రీస్వామివారు ముదిగేడులో ఒకరింటికి వెళ్ళి 'అమ్మా!' అని పిలిచారు. ఆ గృహిణి దొడ్లో పనిచేసుకుంటూ, 'ఎవరదీ?' అని పెద్దగా అరచింది. శ్రీస్వామివారు 'నేనమ్మా, పిచ్చోణ్ణి' అన్నారు. ఆమెకు సరిగా వినపడక మరలా, 'ఎవరదీ?' అని అరిచింది. శ్రీస్వామివారు తలగీరుకుంటూ 'పిచ్చోణ్ణమ్మా!' అన్నారు. ఆమె 'అయితేనేం?' అన్నది, శ్రీస్వామివారు 'అంత ముద్ద పెడతావనీ!' అన్నారు. ఆ గృహిణి లేదంటూనే ఒక సంగటి ముద్ద శ్రీస్వామివారి తువ్వాలులో వేసింది. శ్రీస్వామివారు 'నాలిక్కడ్డమేమైన అంత వెయ్యమ్మా' అన్నారు అంటే పచ్చడిగాని, కూరగానీ వేయమని భావం. లేదని కసురుకుంటూనే ఆమె అంత పచ్చడి వేసింది. 'అంత ధార వేయమ్మా' అన్నారు శ్రీస్వామివారు. అంటే నెయ్యి వేయమని, ఆమె లేదంటే లేదని

చాలా పరుషంగా మాట్లాడింది. 'ఉట్టిపైన దుత్తలో వుంది, వెయ్యమ్మా' అన్నారు శ్రీస్వామివారు. ఆమె కసిరి కొట్టింది. వెంటనే ఆ ఉట్టి తెగి క్రిందపడి నెయ్యంతా నేలపాలైంది. శ్రీస్వామివారు నవ్వుకుంటూ వెళ్ళిపోయారు. ఇందుకే గాబోలు శ్రీ సాయినాథుడు భిక్షయివ్వకున్నా భిక్షగాళ్ళను తూలనాడవద్దని సెలవిచ్చారు.


అలాగే పెద్దవాళ్ళు, 'కాలు జారినా ఫరవాలేదు. నోరు జారితే ప్రమాదం' అన్నారు. దీన్నే స్వామివారు 'నోరు విప్పకూడదయ్యా' అని చెప్పారు.



# అవధూత లీల

## అధ్యాయము - 15

## భిక్షాన్నం



ఎందరో ధనికులు వచ్చి ధన రాసులు శ్రీస్వామివారి పాదాల చెంత కుమ్మరించినా వారికి ప్రశ్నలు చెప్పేది లేదు. పైవాళ్ళు ఒప్పుకోలేదు అనిగానీ, మాట రాలేదనిగానీ చెప్పి త్రిప్పి పంపేవారు. భక్తి శ్రద్ధలుగల వారికి డబ్బు పెట్టకపోయినా వారు అడుగకుండానే వారికి తమ ఆశీస్సులు వ్రాయించి, అభయ ముద్ర వేసిన చీటీలు ఇచ్చేవారు. కనుక ఎల్లవేళలా భిక్షాన్నం మీద ఆధారపడేవారు. తమ కోరికలు తీరిన భక్తులు శ్రీస్వామివారి విడిదిలో సంతర్పణ చేసినా సరే, పండగనాడైనాసరే, భిక్షాన్నము తెచ్చేందుకు వెళ్లవలసిందే. 'అయ్యా, ఈ రోజు వీళ్లు పెట్టారని మనం భిక్షకు పోకుంటే రేపు పెట్టరయ్యా!' అనేవారు.

దశయ్య:- స్వామి! ఆశ్రమాన్ని కనిపెట్టుకొని ఇరవై మంది ఉన్నాము. మేమంతా బ్రతికేదెట్టా?

శ్రీస్వామి:- ఈ పండేదంతా ఎవరిదనుకున్నావయ్యా.

భగవంతుడే అందరికీ ఆకలిచ్చి దానికి తగిన ఆహారాన్ని పండేటట్లు చేస్తున్నాడు. మన చేలో పండింది గనుక అంతా మనమే తినాలనే స్వార్థబుద్ధి మాని పంటనిచ్చిన దైవము ఎడల కృతజ్ఞతా భావముతో విరివిగా దైవము పేరిట దానధర్మాలు చేయమని శ్రీస్వామివారు బోధిస్తున్నారు.

శ్రీస్వామివారికి భిక్షగానీ, నైవేద్యంగానీ, దానంగానీ సమర్పించేటప్పుడు ఈ కృతజ్ఞతా భావముతో సమర్పిస్తే అది మహత్తరమైన ఫలితమిస్తుంది. భిక్షగాడనే భావనతో వేస్తే దానికి తగిన స్వల్ప ఫలితమే దక్కుతుంది.

తమ మహాసమాధి అనంతరం కూడా వీరు తమ సేవకుల హృదయాలను తగు విధంగా ప్రేరేపించి ఈ నిరంతర భిక్ష సాంప్రదాయమును కొనసాగించుచున్నారు.

శ్రీస్వామివారి ఆజ్ఞమేరకు అన్నం తినడం మాని అటుకులు, చక్కెర నీళ్ళతో జీవిస్తున్న రోశిరెడ్డి ఇలా చెప్పారు.'నాకు వృద్ధాప్యమువల్ల కంటి చూపు బొత్తిగా కానరాదు. అందులో ద్రవాహారం తీసుకుంటాను గనుక చాలా బలహీనంగా వుంటాను. అదేమి చిత్రమోగానీ భిక్షకు వెళ్ళే వేళయితే కొండంత బలం వచ్చి, ఇక పడుకో బుద్ధెయ్యదు. భిక్షాపాత్ర తీసుకొని పోతుంటే స్వామి దయవలన దోవన తెల్లని దారం పట్టినట్లుగా స్వల్పంగా జాడ తెలుస్తుంది. అలా పోతుంటే ఒక్కరోజైనా ముల్లుగుచ్చుకొనిగానీ, రాయి ఎదురు తగిలిగానీ ఎరుగను. రెండున్నర కిలోల బియ్యపన్నంపట్టే టిఫిను, మజ్జిగ టిఫిను, భక్తులు ఇచ్చిన ఇతర వస్తువులు ఎక్కడా క్రింద పెట్టకుండా ఆశ్రమం చేర్చినదాకా బాగా వుంటాను. స్నానం చేసి, శ్రీస్వామివారికి నమస్కారం చేశాక ఆ శక్తంతా ఏమవుతుందో ఏమో నిర్వీర్యంగా పక్కమీద వాలితే ఇక రేపు భిక్షవేళకే తిరిగి శక్తి వస్తుంది. ఇది కేవలం శ్రీస్వామివారి కృపగాక మరేమిటి? శ్రీస్వామివారు నాకిచ్చిన ఈ సేవ చివరి శ్వాసవరకు చేయడమే నా పరమ కర్తవ్యంగా తలుస్తున్నాను'.


రోశిరెడ్డిగారు మే నెల 1986లో పరమపదించాక ఈ సేవను శ్రీ రామయ్య వంటి ఇతర సేవకులు చేసేవారు. ఒకప్పుడు అనివార్య కారణాల వలన భిక్షాన్నానికి వెళ్ళే మగవాళ్లెవ్వరు ఆశ్రమంలోలేరు. అలాంటి పరిస్థితులలో గూడా నిరంతరం సాగే ఈ కార్యక్రమం నిలచిపోకుండా శ్రీస్వామివారు ఒక చిత్రమైన లీల ప్రదర్శించారు.

చిన్ననాడే భర్తపోయాక దుఃఖము వలన ఆకలి లేమితో మంచం పట్టి చావనున్న కోడూరు వెంకమ్మ శ్రీస్వామివారి కృపవలన స్వస్థత చెంది ప్రస్తుతం ఆశ్రమంలో ఉంటుంది. ఈమె ఏనాడూ గ్రామంలోకి వెళ్ళి ఎరుగదు. ఈమెకు శ్రీస్వామివారు ఎలాంటి ప్రేరణ నిచ్చారోగానీ నిరంతర భిక్ష నిలచిపోకుండా ఆనాడు తానే భిక్షకు బయలుదేరింది. ఆ విధంగా ఈమె సుమారు ఒక సంవత్సరము శ్రీస్వామివారికి భిక్ష తెచ్చే సేవ చేయగల్గింది. నేటికీ స్వామి కృపవలన ఈ కార్యక్రమం కొనసాగుతూనే వుంది. శ్రీస్వామివారి కృపవలన వేళకు వచ్చిన అతిథులందరికి ఆశ్రమంలో ఉచిత భోజన వసతి శ్రీస్వామివారే కల్పించుచున్నారు.

భిక్షాన్నాన్ని గూర్చి రోశిరెడ్డిగారు చెప్పిన మాటలు గమనార్హము.


'ఆశ్రమంలో ఎక్కువమంది అతిథులు వచ్చిన రోజు ఎక్కువ అన్నం దొరుకుతుంది. తక్కువమంది వస్తే తక్కువే దొరుకుతుంది. నిండా ఆరోగ్యం బాగాలేదు. ఈరోజు ఊరంతా తిరుగగలనా అనుకుంటే ఎప్పుడు తిరుగుతానో ఏమో, రెండు టిఫిన్లు క్షణంలో నిండి కూర్చుంటాయి. శ్రీస్వామివారి మహత్తు చెప్పేందుకు కాదులేయ్యా. అది ఎవరికి వారు తెలుసుకోవలసిందే' అంటారు రోశిరెడ్డిగారు.

ఇదేవిధంగా ఏ రోజు వస్తువులు ఆశ్రమంలో లేకుంటే అవసరానికి తగినవాటిని ఎవరో ఒకరు తెచ్చి ఇవ్వనే ఇస్తారు. 'నేను చాటుకు పోయాక కూడా నేనున్నప్పుడు జరిగినట్లే జరుగుతుంది' అని శ్రీస్వామివారిచ్చిన అభయం నేడు అక్షరాలా నిజమైంది.



## అధ్యాయము - 16

## జన్మజన్మల అనుబంధం

39 

**పరమాత్మ స్వరూపుడైన మానవుడు అజ్ఞానం వలన రాగద్వేషములు ఇష్టాయిష్టములకులోనై సుకృత, దుష్కృత్యాలు చేస్తాడు. వాటి కర్మ ఫలితాలను అనుభవించడానికెన్నో జన్మ పరంపరలు ఎత్తుతాడు.** 'మనుష్యాణాం సహస్రేషు' అన్నట్లు ఎవరో ఒకరు మహాత్ముల కృపవలన అజ్ఞానాన్ని ఛేదించుకొని జ్ఞానులౌతారు. అట్టివారికి జీవుల యొక్క పూర్వజన్మలు, వాటి కర్మఫలాలు స్పష్టంగా తెలుస్తాయి. ఈ విషయం అందరు మహనీయుల చరిత్రలలోనూ చూడవచ్చు. శ్రీస్వామివారు కూడా అనేక మందికి పూర్వ జన్మలు, వారితో తనకు గల అనుబంధం గూర్చి చీటీలు వ్రాయించి ఇచ్చేవారు. వారితో తనకు గల పూర్వ జన్మల అనుబంధం గూర్చి తెలిసిన మానవులు వారి ఎడల కృతజ్ఞతా భావంతో ఎంతో సన్నిహితమై శ్రీస్వామివారిని సేవించేవారు.

ఒకరోజు గురవయ్యను గురించి ఇలా చెప్పారు.

'ఈయన బెంగుళూరు దక్షిణం వీధిలో కంసాలింట పుట్టాడు. మరలా కోమటింటపుట్టాడు. ఆ తరువాత నేను వెంకటగిరి రాజాగారింట్లోనూ, గురవయ్య రాజాగారి మామగారింట్లోనూ పుట్టాము'.

ఒకసారి చలమానాయుడుతో చెప్పారు. 'చలమానాయుడా! పోయిన జన్మలో వెంకటగిరి రాజాగారింటిలో నేను గవర్నరు కోర్సు, నీవు జడ్జి కోర్సూ చదివాము. నగళ్ళలో నివసించాము. మనిద్దరికీ పెండ్లి లేదు. ఇప్పుడు పూరింట్లో వున్నాము. ఎల్లప్పుడూ మేడలు వస్తాయా? ఆ తరువాత పిఠాపురం రాజాగారింట్లో వుండి ఇప్పుడు నాగలేటూరు వచ్చాను' అన్నారు.

మల్లిక వెంకయ్య (అనికేపల్లి) ఇరవై అయిదు సం॥ల వయస్సులో శ్రీస్వామివారి దగ్గరకొచ్చారు. గత ఇరవైరెండు సం॥లుగా కట్టెలు కొట్టి శ్రీస్వామివారి అగ్నిగుండానికి సమర్పిస్తున్నాడు.

ఒకరోజు శ్రీస్వామివారు వెంకయ్యను చూచి 'నా దగ్గరకు వచ్చేయ్' అని పిలిచారు. 'స్వామీ! నేను రాను. మీ దగ్గరకొస్తే భిక్షాన్నం తెచ్చేందుకు పోవాలి. అది నావల్లగాదు' అన్నాడు. 'అబ్బే అదేమీలేదు..... రామేశ్వరంలో నేను మేనేజరు. నీవు పెద్ద గుమాస్తాగాను వుండినాము. ఈ ప్రాంతంలో నీ బాకీలన్నీ తీరిపోయాయి. నా దగ్గర కొచ్చేయ్' అన్నారు. **'స్వామీ, నాకు** 40
**దయ్యాలు పోగొట్టే మంత్రం, గాలికుంటు మంత్రం, కాటేరు మంత్రం, పోలేరమ్మ మంత్రం చెపితే నీ దగ్గరకొస్తాను'** అన్నాడతడు. 'అట్లాగే చెపుతాను' రమ్మన్నారు. 'నీవు మా ముఠాలో మేస్త్రీగా వుండి కట్టెలు కొడుతుండు. నీ వెనకాలే వీళ్ళందరూ వస్తుంటారు' అని చీటీ వ్రాయించారు శ్రీస్వామివారు. అతడు కోరినట్లే ఆయా మంత్రాలు చెప్పడమేగాక వాటిని పలికే విధానము, నియమనిష్ఠలు వగైరా కూడా చెప్పారట. (అహంకారం ఎంత దిగజారుస్తుందో చూడండి. మానవుల ఏ బాధైన నేను పొమ్మంటే పోయే వరమిస్తే వస్తానని అడిగితే నియమ నిష్టలు, మంత్రజపం బాధ పోయేదేగదా! వస్తువులు మొలలో కట్టుకో! పొమ్మన్న జబ్బులు పోతాయన్నారు గదా వేలూరు రామానాయుడ్ని.)

స్వామివారి సేవకురాలు కోడూరు వెంకమ్మ గురించి ఇలా చెప్పారు. "పూర్వం జెండాలవారి కోడలవై పుట్టి, అంతస్తులలో వుండి వంటి నిండా బంగారు నగలు ధరించి క్రింది చూపు లేకుండా పై చూపుతో వున్నావు. ఒక రోజు నీ కాలు జెండాకు తగిలి జెండా వరిగింది. నీవు బోర్లా పడ్డావు. 'నీవు భూమి మీద పుట్టి సామాన్య విధవరాలుగా వుంటావు పో!' అని ఆ జెండా శపించింది. ఆ శాపం లేకుంటే నీకు పెండ్లేలేదు. కానీ శాపం వలన పెండ్లి జరిగి బాల్యంలోనే భర్త పోయాడు. కానీ మేము నిన్ను వదలి పెట్టము" అన్నారు.

ఇనుకుర్తిలో ఒక టీచర్ వుండేవాడు. అతని కుమారునికి బుద్ధిహీనత, కాళ్ళు చేతులు స్వాధీనంలో లేవు. డాక్టర్లవల్లగాక శ్రీస్వామివారి చెంతకు తీసుకువచ్చారు. శ్రీస్వామివారు అన్నారు. 'ఏమి చేస్తామయ్యా? గుఱ్ఱాలను కొట్టినపాపం, పూర్వజన్మలో పందెపు గుఱ్ఱాలు తోలేవాడు. అనుభవించాలి గదా?'

ఇలానే శ్రీస్వామివారి దగ్గరకు ఒక మూర్ఛవ్యాధిగల సన్యాసి వచ్చాడు. 'ఏమిస్వామీ! ఇంత పవిత్ర జీవనం చేసేవాడికీ వ్యాధి?' అని భక్తులు అడిగారు. **పూర్వం ఇతడు పక్షుల వేటగాడు. సంబరానికి వేటాడేవాడు. అనుభవించవద్దా?'** అన్నారు శ్రీస్వామివారు. ఆకలిచే బాధించబడి మాంసం తినడం కాదు. సంబరానికి 40

వేట ఆడితే ఇలా వుంటుంది. అన్ని విషయాలు అంతే.

ఆ సన్యాసి మూర్ఛ వచ్చి పై నుండి గిరగిర తిరిగి క్రింద పడే పక్షివలె గిరగిర తిరిగి పడేవాడు. కర్మసూత్రం ఎంత చక్కగా పనిచేస్తుందో శ్రీస్వామివారు వివరించారు.

నాగులవెల్లటూరులో ఒకపిల్లవానికి రెండు బొటనవేళ్ళకూ స్పర్శలేదు. శ్రీస్వామివారి దగ్గరకు తీసుకువచ్చారు. 'కాట్‌పుల్టుతో తమాషాకు పిట్టల్ని కొట్టేవాడు. అనుభవించవద్దా?' అన్నారు శ్రీస్వామివారు.

ఒకరోజు శ్రీస్వామివారు రోశిరెడ్డిని పిలచి, 'అయ్యా! పోయిన జన్మలో నీవు సుబ్బయ్య అనే బ్రాహ్మణుడవు. నీవు నాకు చదువు చెప్పిన గురుడవు. ఈ పంచెల జత, రూ.10/- లు గురుదక్షిణగా తీసుకో' అని ఆయనకు ఇచ్చారు.

1979వ సం॥లో శ్రీస్వామివారు ఇనుకుర్తిలో వుండేటప్పుడు ఒక యానాది స్త్రీ, ఆమె ముగ్గురు కుమార్తెలు బాగా ఆకలితో వచ్చారు. వారికి శ్రీస్వామివారు అన్నం పెట్టించారు. విస్తర్లోని అన్నాన్ని తల్లికంటే ముందు ఆ బిడ్డలు తినేశారు. మరలా అన్నం వడ్డించి అందరికీ తృప్తి గల్గించారు. 'వీళ్లేకాదయ్యా! ఈమెకు ఇంటి దగ్గర ఇంకా నలుగురు బిడ్డలున్నారు. పూర్వం ఈమె రాజుగారి పట్టమహిషి. ఊయలలో వూగుతూ తన ఏడుగురు దాసీలకు పెట్టకుండా ఈమె హాయిగా ఫలహారం భోంచేసేది. ఆ ఏడుగురు దాసీలు ఇప్పుడామె బిడ్డలుగా పుట్టి ఈమెను తిననివ్వకుండా బాధిస్తున్నారు' అన్నారు శ్రీస్వామివారు. ఆమె తృప్తిగా భోంచేశాక ఆమెకు పది రూపాయలు, ఒక చీర ఇప్పించి పంపారు. కర్మఫలం ఎలా అనుభవమవుతుందో మనము గుర్తించి నడచుకోవాలి.

1969 సం॥ ప్రాంతంలో గొలగమూడి ఆశ్రమానికి ప్రతినిత్యం ఒక గిరిజన బాలిక భిక్షాన్నానికి వచ్చేది. తులశమ్మగారు ఆ బాలికకు భిక్షాన్నాన్ని పెట్టి పంపేది. ఒకరోజు ఆ బాలిక రాగానే వరండాలో వేలిముద్రలు వేస్తున్న శ్రీస్వామివారు 'ఆమె వచ్చిందమ్మా!' అంటూ లోపలనున్న తులశమ్మను పిలిచారు. అమ్మ పెట్టిన అన్నం తీసుకొని ఆ బాలిక వెళ్లిపోయింది. శ్రీస్వామివారు, 'రాజాగారి కుటుంబములో నుండి బ్రాహ్మణ కుటుంబములోకి


అక్కడ నుండి ప్రస్తుతం యానాది కుటుంబములోకి వచ్చింది. ఏం సృష్టయ్యా ఇది'! అంటూ పక పక నవ్వారు. దాతృత్వం తగ్గేకొద్దీ మానవుడు మేడలో నుండి పెంకుటింట్లోకి, అక్కడ నుండి గుడిశలోకి రావలసుంటుందని శ్రీస్వామివారి భావం.

వేలూరు సుబ్రహ్మణ్యంగారు చాలా కాలంగా తన భార్య మోకాలు నొప్పితో బాధపడుతుంటే శ్రీస్వామివారికి విన్నవించారు. 'అయ్యా! ఈమె పూర్వజన్మలో కడివేడు గ్రామంలో మగవాడుగా వుండి తన ఇంట్లో వడ్లు తింటున్న ఆవును రోకలి బండతో కొట్టింది. ఆ ఖర్మ ఇది. గ్రామదేవత బంగారమ్మ, వీరరాఘువ స్వామి తగ్గిస్తారు. కానీ పూర్తిగా నొప్పిపోదు' అని సెలవిచ్చారు. అట్లాగే జరిగింది అంటారు.



# అవధూత లీల

## అధ్యాయము - 17
## దివ్యానుభవాలు



**రాక్షస సంహారంతో భూభారాన్ని తగ్గించి ఋషులను అనుగ్రహించేందుకు రాముడు అవతరించాడు. అట్లే మహాభారత యుద్ధం ద్వారా భూభారం తగ్గించుటకునూ, అర్జునుడు, ఉద్ధవుడు, యశోద, గోప గోపికలననుగ్రహించుటకునూ శ్రీ కృష్ణుడు అవతరించాడు.**

**ఇదే విధంగా చరిత్ర పొడవునా ముముక్షువులకు ఆధ్యాత్మిక ప్రబోధాన్నందించి దివ్యానుభవాలతో ప్రోత్సహించి కృతార్థులను**
**41 చేయడానికి, దీన జనోద్ధరణ కొరకు భూమి మీద పరిపూర్ణులైన మహనీయుల రూపంలో ఆ పరమాత్మ అవతరిస్తూ వుంటారు. అట్టి మహనీయులను ముముక్షువులు ఆశ్రయించి తీరాలని ఉపనిషత్తులు భగవద్గీత చెపుతున్నవి. అర్జునుడు, ఉద్ధవుడు శ్రీ కృష్ణుణ్ణీ, శ్రీ కృష్ణుడు సాందీపని మహర్షిని, శ్రీ రాముడు వశిష్ఠునీ ఆశ్రయించడం ద్వారా మనకీ రహస్యం తెలుస్తుంది. కారణం సకల శాస్త్రాల సారాన్నీ మహనీయులు బోధించడమేగాక మనం విశ్వసించలేని విషయాలను ప్రత్యక్షానుభవం ద్వారా తెల్పగలరు. విశ్వరూపసాక్షాత్కారం ద్వారా శ్రీకృష్ణుడు అర్జునుడికి చేసిన ఉపదేశమిదే.**

అటువంటి అనుభవాలే దత్తాత్రేయ స్వరూపులైన శ్రీ శిరిడీ సాయిబాబా, అక్కల్‌కోట స్వామి వంటివారు తమ భక్తులకనుగ్రహించటం వారి చరిత్రలో చూడవచ్చు. వారికి ముందు అవతరించిన దత్తాత్రేయవిశేషాలను 'శ్రీ గురుచరిత్ర' గూడ చక్కగా వివరిస్తుంది. ఇటువంటి మహనీయులలో మనకిటీవల వరకూ లభించిన అవధూత శ్రీ వెంకయ్యస్వామివారు ఒకరు. నిజానికి మిగిలిన దత్తావతార పురుషుల చరిత్రలు శ్రద్ధతో పరిశీలిస్తేగాని శ్రీ వెంకయ్యస్వామి మహిమ మనకు పూర్తిగా అర్థంగాదు. ఈ మాటలోని సూత్రాన్ని తెలియకుంటే ఆయన ఒక వెర్రివారనో, లేక కేవలం ప్రశ్నలు

చెప్పుకొని జీవించే ఒక సామాన్య సాధువనో మనం భ్రమించే అవకాశమున్నది. మిగిలిన దత్తావతారముల వలె అవధూత శ్రీ వెంకయ్యస్వామివారు భక్తులకనుగ్రహించిన దివ్యానుభవాలను ఈ అధ్యాయంలో చూస్తాము.

ముదిగేడు వాస్తవ్యులు అక్కిం వెంకట్రామిరెడ్డిగారు ఇలా చెపుతున్నారు. ఒకసారి శ్రీస్వామివారు ముదిగేడు వచ్చారు. అదేమోగాని, ఆయన నా పేరు మార్చి 'సుబ్బరామయ్యా! నీవు నాకు తలుపూరుకు త్రోవ చూపిస్తువు, రావయ్యా!' అని నన్ను బయలుదేర తీశారు. తక్కిన వారందరూ నిద్రపోతున్నారు. మేము కొంతదూరం వెళ్ళి కొక్కెరాళ్ళ గుట్ట దగ్గరకు చేరాము. శ్రీస్వామివారు నన్నక్కడ కూర్చోమని చెప్పి ఆ గుట్టను తొక్కితే మెత్తబడుతుందని, తాము వెళ్ళి ఆ పనిచేసి వస్తామని చెప్పి వెళ్ళారు. ఆయన ఏమి చేస్తారో చూడాలని కొద్ది సేపటికి నెమ్మదిగా వారిని సమీపించి ఒక ప్రక్కన దాక్కున్నాను. ఆయన ఆ గుట్టపైకి ఎక్కి ఒక పెద్ద బండ మీద వెల్లకిలా పడుకొని కాలు మీద కాలు వేసుకొని ఊగించుకుంటూ పాటలు పాడుకుంటున్నారు. నేను వారి పాట వినాలని చిన్నగా నక్కి నక్కి పారాడుతూ ఆ బండ క్రిందచేరి కూర్చున్నాను. ఆయన వెంటనే అది పసిగట్టి, 'పెనుభూతాలు తిరిగే ఈ ఝామున నీవిలా రావచ్చయ్యా?' అన్నారు. నేనపరాధం చేశానేమోనని భయమేసింది. వెంటనే శ్రీస్వామివారు 'అఘోరించావులే, పడమరగా నున్న ఆవుల మందను చూడు!' అన్నారు. చూస్తే సుమారు మూడు మైళ్ళు విస్తీర్ణంగా సందు లేకుండా ఆవుల మందలు కనిపిస్తున్నాయి. పట్టపగలల్లే వెలుగు ఆవరించినది. మగవాళ్లు కొంతమంది ఆవులకు పాలు తీస్తుంటే ఎందరో గోపికా స్త్రీలు పాలు నెత్తిన పెట్టుకొని పోతున్నారు. ఆ దృశ్యాన్ని చూస్తున్నంత సేపూ నాకు దేవలోకంలో విహరిస్తున్నట్లనిపించింది. నేను కూడా ఒక పాలకుండ తీసుకుపోయి వారికందించివస్తాను' అన్నాను. 'ఓయబ్బో! వాళ్ళు రేపల్లె వాడకెత్తుకుపోతుంటే, మరోవంక ప్రొద్దు మొలిచి వస్తుంటే నీ వెక్కడికయ్యా పోయేది?' అన్నారు. అప్పుడు నేను తూర్పు పడమరలు చూస్తే అంతా అంధకారంగా వున్నది. వెనకటి దృశ్యమే లేదు. పోదాము పదయ్యా! తలుపూరుకు పోయి గుర్తులేసుకోవాలి' అని శ్రీస్వామివారు బయలుదేరదీశారు.

నన్ను సాయంత్రం వరకూ తలుపూరులో తమతో కూడా వుంచుకున్నారు. అన్నం, నీరు తీసుకోకుండా ఇద్దరమూ అలాగే వున్నాము.

తరువాత నన్ను ఊరికి పొమ్మన్నారు.

ఒకసారి తలుపూరు గ్రామంలో ఈశ్వరనాయుడు గారింట్లో శ్రీస్వామివారు వేంచేశారు. అది వర్షాకాలం. శ్రీస్వామివారు అర్ధరాత్రి వరకూ కాగితాల మీద తమ వ్రేలి ముద్రలు వేస్తున్నారు. ఆ గృహస్థు ఈశ్వరనాయుడు ప్రొద్దుపోయిందని చెప్పి శ్రీస్వామివారిని, నన్ను భోజనం చేయమని చెప్పాడు. అప్పుడు శ్రీస్వామివారు 'అయ్యో, మండలాలు తగ్గి వచ్చాయి. కొమ్ము కట్టదు. నీవు నీ ఊరికి పోయ్యా!' అని వెంకట్రామిరెడ్డిని ఆదేశించారు. కాని అక్కడున్న చలమానాయుడు శ్రీస్వామివారితో తనకు గల అతి చనువును పురస్కరించుకొని, ఇప్పుడు అర్ధరాత్రి ఇంత వర్షంలో ఆయనను ఊరికి పొమ్మంటావే! నీ జీవం కోసం వర్షంలో ఆయనెక్కడపోతాడు? అని గద్దించి, ఒక మొండి గొడ్డలి తీసుకొని శ్రీస్వామివారి మీద కురికాడు. అప్పుడాయన, 'అబ్బో! ఆయనిక్కడుండ కూడదయ్యా!' అన్నారు. మిగిలిన వివరం అక్కిం వెంకటరామిరెడ్డి చెబుతున్నారు.

"శ్రీస్వామివారి మాట జవదాటని నేను అర్ధరాత్రి వేళ వర్షంలో నెత్తిన గుడ్డ కప్పుకొని మా ఊరు బయలుదేరాను. తలుపూరు గ్రామ పొలిమేరదాకా నాకంతా తెలుస్తూనే వున్నది. ఆ తర్వాత నేనెక్కడున్నానో, ఏమి చేస్తున్నానో నాకేమీ తెలియలేదు. ఏ దోవన వచ్చానో, కళ్ళేరులో నీరు ఎంత లోతున్నది కూడా నాకు తెలియలేదు. మా ఇంటి దగ్గరకు వచ్చేటప్పటికి మా వాకిట్లో మా ఊరి ఆంబోతు రంకె వేయడంతో నాకు తెలివి వచ్చింది. నేను మా ఊరు చేరాననీ, అది మా ఇంటి గడపనీ, రంకె వేసింది మా ఊరి ఆంబోతని అర్థమైంది. అదొక విచిత్రమైన అనుభూతి. వర్షాకాలంలో నిండుగా ప్రవహిస్తున్న 15 అడుగుల లోతు కళ్ళేరును నాకు వళ్ళు తెలియని స్థితిలో దాటించి ఇల్లు చేర్చారు శ్రీస్వామివారు. ఆ మహనీయుని దివ్యశక్తిని కొనియాడ వేయి శిరస్సుల ఆదిశేషునకైనా తరము గాదు!

"మరొకసారి 'కొండ చుట్టూ త్రొక్కి రావలయ్యా' అని చెప్పి శ్రీస్వామివారు మా అందరినీ, ఎనిమిది మందిని, కాలినడకన పెంచలకోనకు తీసుకుపోయారు. అక్కడ మాలో కొందరు భక్తులు అన్నము, ధుని సిద్ధం చేస్తుండగా శ్రీస్వామివారు 'అయ్యా! మన వాళ్ళు పనులు చేస్తుంటారు. మనం మల్లెంకొండకు పోయి వస్తాం రా!' అని నన్ను పిలిచారు. 'మీరెక్కడికి

రమ్మంటే అక్కడికి వస్తాను' అని చెప్పి వారితో బయలుదేరాను. సుమారు మూడు మైళ్ళలోవున్న మల్లెంకొండ చేరాము. అక్కడ మల్లీశ్వరుడనే లింగాకారమున్నది. శ్రీస్వామివారు దాన్ని సమీపించి, నాకర్థంకాని వింతైన భాషలో ఆ లింగాకారంతో మాట్లాడారు. అక్కడ నుండి సుమారొక మైలు దూరంలోవున్న మామిళ్ళ కోనకు పోయాము. అక్కడ శ్రీస్వామివారు ఒక బిలంలో దిగుతూంటే నేను కూడా అనుసరించాను. ఆ బిలంలో ఎటు చూచినా దట్టమైన మామిడి వనమున్నది. క్రిందంతా మామిడి పండ్లు మూరెడెత్తున రాలి వున్నాయి. చెట్లమీద గూడా పండ్లు గుత్తులు గుత్తులుగా వ్రేలాడుతున్నాయి. మేమిద్దరమూ ఆ పండ్లను తొక్కుకుంటూనే మూడు మైళ్ళు ప్రయాణం చేశాము. మేము ఆ కొండ గుహ చివరకు చేరుతుండగా ఒక పెద్ద ఎలుగుబంటి గాండ్రిస్తూ పైకి లేచింది. దాని కోరలు సుమారు మూడంగుళముల పొడవున్నాయి. మనిషిని అమాంతం మింగేటంతగా నోరు తెరచి మా మీదకు వస్తున్నది. ముందు శ్రీస్వామివారు, వెనుక నేను పోతున్నాము. నేను భయపడి ఒక మామిడి చెట్టు చాటుకు వెళ్ళి చూస్తున్నాను. శ్రీస్వామివారు చిటికలేస్తూ నుచ్చరకొడుతూ (అంటే కుక్కను పిలిచినట్లు చప్పుడు చేస్తూ) దాని దగ్గరకు పోయి తమ కుడిచేతితో దాని నెత్తిపై నుండి వీపు మీదుగా తోక చివర వరకు మూడు సార్లు నిమిరారు. వెంటనే ఆ ఎలుగుబంటి క్రిందకు వంగి వారి పాదాల వద్ద తల పెట్టి లేచి ఒక కొండచరియలోకి వెళ్ళిపోయింది. నేను వెంటనే శ్రీస్వామివారి చెంతకు చేరాను.

"అక్కడొక బాట, ఒక ఈశ్వర లింగము, రెండు స్త్రీ విగ్రహాలూ వున్నాయి. కొండపై నుండి ఆ మూడు శిలల మీద మూడు నీటి ధారలు పడుతున్నాయి. ఎవరో పసుపు, కుంకుమ, పత్రితో వాటి నర్చించినట్లు ఆ ప్రాంతమంతా సువాసనతో నిండిపోయింది. శ్రీస్వామివారు తమ ఎడమ చేతితో కర్ర పట్టుకొని ఆ విగ్రహాలతో ఏదో చిత్రమైన భాషలో మాట్లాడారు. ఇంతలో సుమారు మూడు బారల దూరంలో ఆగ్నేయంగా వున్న నీటికుండము దగ్గరకు వెళ్ళాను. ఆ కుండానికి ఉత్తరం దక్షిణ దిక్కులుగా రెండు మామిడి చెట్లున్నాయి. దట్టమైన వాటి కొమ్మలు పెనవేసుకొని క్రిందకి వంగియున్నవి. నేను ఉత్తరంగానున్న చెట్టును పట్టుకొని కుండంలోకి తొంగి చూచాను. అందులోని నీరు చెప్పలేనంత లోతుగా వున్నది. దానిలో బంగారు, వెండి నాణాలు రాసులు రాసులుగ వున్నాయి. నేనలా చూస్తూవుండగా పడమటి

నుండి ఒక పెద్ద చేప తల కుండంలోకి ప్రవేశించింది. దాని పెదవులకు, మొప్పలకూ బంగారు పోగులు వేసినట్లున్నాయి. దాని తల ఏనుగు తలంత వున్నది. ఆ మొప్పలు తలుపు రెక్కలంత వున్నవి. ఆ చేప తన మొప్పల నాడించే సరికి నీరు వరవరమంటూ నురుగులు చిమ్ముతూ పైకి పొంగింది. నేను భయంతో శ్రీస్వామివారి వద్దకు పరుగెత్తి 'స్వామీ! అందులో నీరు పొంగుతోంది. మనం బయటకి ఎట్లా పోతాము?' అన్నాను.

"ఆయన, 'అదెంతలేయ్యా!, అడ్డేలు (వేలు వెడల్పంత) లోతేలే!' అన్నారు. అక్కడ నుండి మేము మూడు మైళ్ళూ ఆ కుండంలోంచి పొర్లుతున్న అడ్డేలు లోతు నీటిలో నడచి బయటికొచ్చాము. అచ్చట కొండరాళ్లు, చెట్లు యథాప్రకారమున్నాయి. మేము పెంచలకోన చేరాము. శ్రీస్వామివారు మమ్ములనందరినీ 'మీరు తెగచర్ల మీదుగా కుల్లూరు రండి, నేను సాధువయ్యగారిని కలుసుకొని వస్తాను' అని చెప్పి కొండల్లోకి వెళ్ళిపోయారు. అన్నింటికంటే దగ్గర దారి అయినప్పటికి మేము కుల్లూరు చేరేసరికి శ్రీస్వామివారు తమ భక్తుడైన పెద్దయ్యగారి ఇంటి ముందు ధుని వద్ద వేలిముద్రలు వేస్తూ కూర్చొని యున్నారు. శ్రీస్వామివారు నన్ను పిలిచి 'నీ పేరు మారిపోయింది. నీకు నిందలు వచ్చాయి. వెంటనే ఇంటికిపో!' అన్నారు.

"నాకు తులశమ్మగారు చార్జీలకు రూ.2/- లు ఇచ్చారు. నేను ఇల్లు చేరేసరికి అక్కడ ఊరి జనమంతా గుమిగూడియున్నారు. వారంతా నన్ను ఆశ్చర్యంతో చూచారు. విచారించగా గొడ్లకాపరి పిల్లలు నన్ను చంపి చాపలో చుట్టి ఈత చెట్లలో దాచారని పుకారు పుట్టిందట. అందరూ నా శవాన్ని తేవడానికి గుమిగూడారని తెలిసింది. అందరూ వెళ్ళి ఈతచెట్ల దగ్గర చూస్తే ఒక పాత చాప మాత్రమే వున్నది. శ్రీస్వామివారి మాటలు నాకప్పుడర్థమయ్యాయి.

"ఒకసారి గొలగమూడిలో శ్రీస్వామివారితో కలసి కొన్ని రోజులున్నాను. ఒకనాటి రాత్రి సుమారు పన్నెండు గంటల ప్రాంతంలో శ్రీస్వామివారెక్కడికో ఒంటరిగా బయలుదేరి పోతున్నారు. నా అలవాటు ప్రకారం నేను గూడా వారికి తెలియకుండా వారి వెనకాలే బయలుదేరాను. శ్రీస్వామివారు నాగులవరం అనే అడవిలోకి పోయి అక్కడ 'పెగడ్రాజుగుంట' అనేచోట ఆగారు. నేనా సమీపంలోని విడవలి ('తుంగ') తుప్పల చాటున దాగి కూర్చున్నాను. శ్రీస్వామివారు ఆ గుంట దగ్గర కొంచెం సేపాగి, నేను

దాగియున్న చోటుకు వచ్చి, 'నేను ఎన్నిసార్లు చెప్పినా నీవు చాటుగా వస్తూనే వుంటావు. ఇది ఎటువంటి గండ్రకత్తెర కాలమనుకున్నావ్?' అని నన్ను మందలించి, ఒక దిక్కుగా చూడమన్నారు. అక్కడ పెద్ద చింతమాను మొద్దులంత పెద్దపాము ముక్కలుగా నరికివేయబడియున్నది. 'పైవాళ్ళు దానినలా చేయకపోతే నిన్నూ, నన్నూ అది ఏమి చేసియుండునో? నీవిలా ఎప్పుడూ రాకూడదు' అని నన్ను తిప్పి పంపించేశారు. నేను ఊరిలోకి వచ్చేశాను. ఉదయం ఏడు గంటలకు శ్రీస్వామివారు కొన్ని కట్టెలు, నాగజెముడు బొంతలు కట్ట కొట్టుకొని తీసుకు వచ్చారు.

"శ్రీస్వామివారు అర్ధరాత్రి బయలుదేరి యథేచ్ఛగా సంచరిస్తుండేవారు. ఒకసారి మంచి వర్షాకాలంలో బ్రహ్మాండమైన ఉరుములూ, మెరుపులతో వర్షం పడుతోంది. ఆ కటిక చీకటిలో శ్రీస్వామివారు ఒక తాటిఆకు నెత్తిన పెట్టుకొని ధుని దగ్గర నుండి బయలుదేరారు. ఆయనెక్కడికి పోతారో, ఏం చేస్తారో కనిపెట్టదలచి నేను వారికి కనపడకుండా వెనుకనే నడిచాను. ముదిగేడు దగ్గరున్న కళ్ళేరు ఒడ్డునున్న చాకిరేవు దగ్గరకుచేరి, స్వామి తమ గుడ్డవిప్పి గట్టున పెట్టారు. గట్లనిండుగా తన్నుకొని ప్రవహిస్తున్న కళ్లేరు నీటిపైన శ్రీస్వామివారు చిన్న పిల్లాడిలా పరుగులెత్తుతూ నీళ్ళు వెదజల్లుతున్నారు. మనకర్థంకాని భాషలో తమలో తామే ఏదో మాట్లాడుకుంటూ, ఆవతలి ఒడ్డు నుండి ఇవతలి ఒడ్డుకు తిరుగుతున్నారు. కొంత సేపయ్యాక గట్టునున్న గుడ్డలు ధరించి నేను దాగియున్న తాటిచెట్ల దగ్గరకే వచ్చి, తమ చేతికర్రతో నన్ను పొడుస్తూ, 'రాక్షస లగ్నంలో నీవిలా రావచ్చా?' అని, ఆ కర్రను నా మెడ మీద పెట్టి నెట్టుకుంటూ ఇంటికి తీసుకొచ్చారు. మేము ఇల్లు చేరగానే ఆయన ఏమీ ఎరుగనట్లే తమ ధుని దగ్గర కూర్చున్నారు. నేను కూడా నేరుగా పోయి పడుకున్నాను.

"నేనపుడు ముదిగేడులో ఒక పూరిపాకలో వుండేవాడిని. నాకు ఇల్లు కట్టుకునే శక్తి లేదు. ఒకరోజు శ్రీస్వామివారు నన్ను ఇల్లు కట్టుకోమని చెప్పి తమ స్వహస్తాలతో శంఖుస్థాపన చేశారు. తరువాత పని ఎలా పూర్తి చేయాలని నేను ఆందోళన పడుతుంటే 'నీవు నేరుగా ఈ దిక్కుగా రోడ్డు మీద పోతుంటే, నీ పనులన్నీ నెరవేరుతాయి' అని చెప్పారు. నేనా దిక్కుగా బయలుదేరి పోతుంటే బేలుదార్లు, ఇటుక కోసేవారు, వాటిని తోలే బండివారు దారిలో కనిపించి, 'ఎక్కడికి పోతున్నావు' అని అడిగి, 'మేమే వచ్చి ఆ పని చేస్తాము' అని చెప్పి,

నా పని పూర్తి చేసి పోయారు. మిత్రులు నేనడుగకున్నా ఇంటి దగ్గరకు పైకము తెచ్చి ఇచ్చి నా పని పూర్తిచేయించారు. అందులో నాకెలాంటి ప్రమేయమూ లేకుండానే ఇల్లు పూర్తి అయినది. కొంత కాలానికి శ్రీస్వామివారు మా ఇంట్లోకొచ్చి ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ ఇంటిలో ధుని వేశారు. అందరి ఇండ్లకంటే మా ఇల్లే బాగా వున్నదని గ్రామంలో అందరూ అంటారు. అంతా స్వామి దయ!" (పూర్తి వివరములు 'స్వామిసన్నిధి' లో చూడవచ్చు).

ఒకప్పుడు కొందరు భక్తులు కాశీ యాత్ర పోవాలనుకున్నారు. వారి స్నేహితురాలైన వల్లపురెడ్డి తులశమ్మను తమతో గూడా యాత్రకు రమ్మన్నారు. ఆమె శ్రీస్వామివారిని కూడా యాత్రకు రమ్మని ప్రార్థించింది. 'వాళ్ళను పోనీయమ్మా! మనం రేపు పోదాము' అంటూ నాలుగు రోజులు గడిపారు శ్రీస్వామివారు. శ్రీస్వామివారు వచ్చే మాట ఉత్తదేనని తులశవ్వ అలిగి ఆ రాత్రి అన్నం తినకుండా పోయిపడుకున్నది. ఉదయం ఎనిమిది గంటలైనా లేవలేదు. భక్తులు తట్టి లేపారు. "నేనేమిటి, ఇక్కడున్నాను?" అని ఆమె లేచింది. రాత్రంతా తాను కాశీ యాత్ర చేసినట్లు స్వప్నంలో దర్శనమైందని ఆమె ఎంతగానో వివరించి చెప్పింది. సాక్షాత్తు తనను శ్రీస్వామివారు యాత్రచేయించినట్లు ఆమె తలచింది. అది ఏదో కాకతాళీయమైన స్వప్నమని, కల నిజమైన యాత్ర ఎలా కాగలదని భక్తులందరూ అన్నారు. ఒక నెల తరువాత యాత్ర నుండి వచ్చిన భక్తులకు ఎక్కడెక్కడ ఏమేమి వున్నదీ ఆమె వివరించింది. అది విని వారాశ్చర్యపోయి శ్రీస్వామివారు ఆమె చేత నిజంగా యాత్ర చేయించారని అందరూ గుర్తించారు. ఈ లీల యొక్క అంతరార్థం పూర్తిగా అర్థంగావాలంటే "శ్రీ గురుచరిత్ర" లోని కొన్ని లీలలు చూడాలి.

శ్రీస్వామివారు గుండానికి చాలా సమీపంలో పడుకొనేవారు. గొలగమూడి ఆశ్రమంలో చింతచెట్టు క్రింద గురవయ్య శ్రీస్వామివారి దగ్గరగా పడుకొనియున్నాడు. అందరూ నిద్రపోతున్నారు. కొందరు దిగంబరులైన ఋషులు వచ్చి శ్రీస్వామివారి చుట్టూరా కూర్చొని మాట్లాడుతున్నారు. గురవయ్యకు మెలుకువ వచ్చి గుండం సరిచేయడానికి వెళ్లాడు. 'ఏమయ్యా! ఇప్పుడు లేచావు?' అన్నారు శ్రీస్వామివారు. అంతటితో మైకం వచ్చి గుండం దగ్గర అతడు పడిపోయాడు! ఋషీశ్వరులు వెళ్ళేంత వరకూ లేవలేదు.

ఒకసారి శ్రీస్వామివారు, రాజుపాళెం జయరామయ్య కలిసి బద్వేలు

తిప్పమీదుగా వెడుతున్నారు. 'ఆకాశంలో వెళుతున్న వారిని చూడండయ్యా!' అన్నారు శ్రీస్వామివారు. ఎవ్వరూ కనిపించలేదన్నాడు జయరామయ్య. అప్పుడు శ్రీస్వామివారు అతని కళ్ళను తాకి మరలా చూడమనగా ఆయనకు చాలా పొడవైన మనుష్యులు ఆకాశంలో నడుస్తూ కన్పించారు. తిరిగి శ్రీస్వామివారు అతడి కళ్ళను తాకడంతో ఆయనకా దృశ్యం అంతరించి పరిసరాలు తెలిసాయి.

ఒకప్పుడు వక్కెమ్మ ఆంజనేయస్వామి గుడికి వెళ్ళినప్పుడు అక్కడ దేవతలందరూ సభ చేసినట్లు దర్శనమైంది. ఆ దృశ్యం చూచిన ఆమె ఆ వైభవం చెప్పనలవి కాదని అంటుంది. బ్రహ్మ బొమ్మలు చేసి, నొసటన శిరస్సున వ్రాస్తున్నట్లూ, ఒక స్త్రీ మూర్తి ఆ బొమ్మలలో గల లోపాలను మట్టి పూసి సరిచేస్తున్నట్లు దర్శనమైందట. ఇటువంటి దర్శనం కేవలం భ్రాంతి మాత్రమనడానికి వీలులేదు. విశాఖపట్టణంలో యాసిన్ బాబా అనే ముస్లిం మహాత్ముడు సోమయ్య అనే ఒక భక్తునికి ఇలాంటి దర్శనము ప్రసాదించాడు.

వక్కెమ్మ ఒకనాడు శ్రీస్వామివారికి కొంత దూరంగా నిలబడి ఉన్నది. శ్రీస్వామివారు ఆమెను ప్రేమగా దగ్గరకు పిలిచారు. దగ్గరకొస్తే అచ్చట శ్రీస్వామివారి స్థానంలో తీగపై వేణువు ఊదుతున్న కృష్ణుడు నాట్యం చేస్తూ కనిపిస్తున్నాడు. ఆనందభాష్పాలు రాలుస్తూ తన్మయంగా కొంతసేపు చూచింది. తరువాత ఆ స్థానంలో శ్రీస్వామివారు మామూలుగా దర్శనమిచ్చారు.

వక్కెమ్మ ఒకరోజు గొలగమూడిలోని ఆంజనేయస్వామివారి గుడికి వెళ్ళింది. ఆంజనేయస్వామి ఆమె ప్రక్కన నిలుచుని, 'పూలమాల వేసి పూజచేసుకో!' అని స్పష్టంగా చెప్పారు.

**సద్గురువు యొక్క అనుగ్రహానికి పాత్రులైన వారికి దేవతలు కూడా వశమై తమకై తామే సాక్షాత్కరిస్తారని 'శ్రీ గురుచరిత్ర' చూస్తే తెలుస్తుంది.** 42

ఒకప్పుడు మహాభక్తురాలు వక్కెమ్మ శ్రీస్వామివారి మహాత్మ్యం చూడాలనుకున్నది. ఒకరోజు ఆశ్రమంలో శ్రీస్వామివారి కెదురుగా 30 అడుగుల దూరంలో నేలమీద మెలుకువగా పడుకొనియున్నది. ఆమెకు ఇరవై అడుగుల దూరంలో రామలక్ష్మణులు నిలుచుని దర్శనమిచ్చారు. వారు అదృశ్యమై అదే స్థానంలో శ్రీ కృష్ణుడు నిలబడి దర్శనమిచ్చాడు. తాను కోరిన దర్శనం ప్రసాదించారని భక్తితో నమస్కరించింది. వక్కెమ్మగారికి ఇలాంటి అద్భుతములు జరిగినపుడు ఇతరులకు చెప్పేందుకు శ్రీస్వామివారు

అనుమతించక గుప్తంగా ఉంచమని హెచ్చరించేవారు. కనుక శ్రీస్వామివారు సమాధైనంత వరకూ పెదిమ కదిపేది కాదు. అలానే మరొకసారి నెల్లూరులో గురులదిబ్బ దగ్గర సూర్యనమస్కారం చేస్తున్నది. అప్పుడు ఆమె రెప్పపాటులో తాను అంతరిక్షంలోని వేరొక గ్రహాన్ని చేరినట్లు అనుభవమైంది. అక్కడ గూడా భూమి మీద వలె రాళ్ళు, బండలు ఆమెకు కన్పించాయి.

ఒకరోజు వక్కెమ్మకు ఒక స్వప్న దర్శనమైంది. శ్రీస్వామివారు పండుకొని ఒక్క వూపులో నాలుగు మైళ్లు జారిపోతున్నారు. ఇలా మూడు మార్లు ముందుకు, వెనుకకు జారి వక్కెమ్మ దగ్గరకు వచ్చి నోరు తెరచి విశ్వరూపం చూపుతున్నారు. ఇంతలో తులశమ్మ 'అబ్బయ్య బలే చూపుతున్నాడు అ! అబ్బో!' అంటూ తనకాలి మడిమను స్వామి నోటికి అడ్డం పెట్టింది. వక్కెమ్మ కోపంతో ఆమెను ప్రక్కకు నెట్టివేసింది. అంతటితో
43 విశ్వరూప దర్శనం మధ్యలోనే ముగిసింది. **తులశమ్మ కాలు అడ్డం పెట్టడమంటే ప్రకృతి అడ్డుపడటం కాబోలు.**

ఒకరోజు రోశిరెడ్డి గొలగమూడి ఆశ్రమంలో పగలే కునికిపాట్లు పడుతున్నాడు. అతని కన్నులు మూతపడి సుమారు 90 కి.మీ. దూరములో నున్న వారి గ్రామం కనబడుతుంది. వారి కుటుంబమంతా వర్షంలో తంటాలు పడుతూ నువ్వుల మాసూలు చేస్తున్నారు. వాళ్ళ ఇంట్లో పచ్చి నిమ్మకాయలు కోసి ప్రోగుపోసి ఉన్నాయి. కొంత సేపటికాదృశ్యం అంతరించి మేలుకున్నాడు. మూడవనాడు రెడ్డిగారిని చూడాలని వారి చిన్న కుమారుడు గొలగమూడి వచ్చాడు. ఇంటి దగ్గర జరిగిన నువ్వు మాసూలు, నిమ్మకాయల కోత గురించి రెడ్డిగారు వివరిస్తూ ప్రశ్నలు వేస్తుంటే **'ఈ విషయాలన్నీ మీకెలా తెలిశాయి' అని విస్తుబోయాడు వారి కుమారుడు. సద్గురు మహిమంటే ఏమిటో ఆ**
44 **పిల్లవానికి కొంతైనా అర్థమైందో లేదో!**

ఒకరోజు రోశిరెడ్డి చేతికొక చెక్క పలకనిచ్చి దానిమీద ఏముందో చూడమన్నారు శ్రీస్వామివారు. అతడు చూచి "ఏమీ లేదు స్వామి" అన్నాడు "బాగా చూడయ్యా!" అన్నారు శ్రీస్వామివారు. మరలా జాగ్రత్తగా చూస్తే రోశిరెడ్డికి ఇష్టదైవమైన వెంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవి, గణపతి విగ్రహాలు చెక్కపలకపై చాలా స్పష్టంగా కనపడినాయి. కొంత సేపయిన తరువాత మరలా కనపడకుండా పోయాయి.

వేలూరు రామానాయుడు (నాగులవెల్లటూరు) గారు, వారి

కుటుంబంలోని వారందరూ తరచూ శ్రీస్వామివారిని భక్తితో దర్శించేవారు. ఒకరోజు రాత్రి తల్లీ కొడుకులు మంచం మీద మేలుకొనే ఉన్నారు. కుమారునకు శ్రీస్వామివారు కిరీటం, భుజకీర్తులు ధరించి విష్ణువుగా గుండంలో కూర్చుని దర్శనమిచ్చారు. అతడాశ్చర్యపోయి ప్రక్కనే ఉన్న వారి తల్లికి ఆ వింత చెప్పి చూడమన్నాడు. కానీ ఆమెకక్కడ ఏమీ కనిపించడంలేదు. శ్రీస్వామివారు ఆ సమయంలో ఆ గ్రామంలోనే ఉన్నారు. మరుసటి ఉదయం ఆమె శ్రీస్వామివారిని దర్శించింది. అప్పుడామెతో శ్రీస్వామివారు "అమ్మో, పై వాళ్ళు వచ్చి రాత్రి గుండంలో విడిది చేసి పోయారు" అని అమాయకంగా చెప్పారు. రాత్రి తన బిడ్డకు అనుగ్రహించిన దర్శనం నిజమేనని ఆమెకు, ముందటి రాత్రి తనకు లభించిన దర్శనం భ్రాంతిగాని, ఊహగానీ కాదని, కేవలం శ్రీస్వామివారి అనుగ్రహం వలన మాత్రమే లభించినదనీ అతనికి తెలిసింది.


అనంతసాగరం వాస్తవ్యులు చడ్డా వెంకటరెడ్డిగారింటికి శ్రీస్వామివారు తరచుగా వెళ్లేవారు. రెడ్డిగారు శ్రీస్వామివారికి ప్రేమతో ఆతిథ్యమిచ్చేవారు. చాలామంది ఆ గ్రామస్తులుగానీ, చుట్టుప్రక్కల గ్రామాలవారుగానీ వచ్చి శ్రీస్వామివారిని దర్శించి ఆశీస్సులు పొందేవారు. అనేకమంది తమ బాధలు చెప్పుకొని శ్రీస్వామివారు ప్రసాదించే దారము, వేలిముద్రల కాగితాలు తీసుకెళ్ళి పవిత్రంగా భద్రపరచుకొనేవారు.

ఒకరోజు రెడ్డిగారు "స్వామీ అందరూ మీరు చాలా గొప్ప మహాత్ములంటారే. మరి నాకేదైనా నిదర్శనం చూపండి" అని వినయంగా ప్రార్థించారు. "అయ్యా నిదర్శనం చూస్తావా? సరే కళ్ళు మూసుకో" అని శ్రీస్వామివారు రెడ్డిగారి తలపై చేత్తో తాకి కళ్ళు తెరవమన్నారు. చూస్తే కనుచూపు మేర చుట్టూ ఏ ప్రపంచమూలేదు. చెట్లు, ఇండ్లు అన్నీ మాయమైనవి. చుట్టుప్రక్కల ఎంతదూరం చూచినా అసంఖ్యాకంగా నీటితో నిండిన గుంటలు, ప్రతి గుంటలోను మెడవరకు నీటిలో మునిగి శ్రీస్వామివారి తలమాత్రం పైకి కన్పిస్తుంది. కొంతసేపు చూచాక ఆ దృశ్యాన్ని చూడలేక "స్వామీ తమరు దైవస్వరూపులు. మీకు ఆది అంతములేదు, అనంతులు. దయచేసి నాకు మామూలు దృష్టి ప్రసాదించండి" అని అలనాడు విశ్వరూపం చూచిన అర్జునునివలె చేతులెత్తి ప్రార్థించాడు. మరలా శ్రీస్వామివారు ఆయన తలపై తాకగానే మామూలు ప్రపంచము గోచరమైనది.

# అవధూత లీల

## అధ్యాయము - 18

## దేంతో పీకులాడే వాళ్ళు దాంట్లోకే



"స్వామీ! మానవుడు చనిపోయాక ఏమౌతాడు? మరలా మనిషిగా పుట్టి, పాప పుణ్యాలు అనుభవిస్తాడా?" అని అడిగిన వారితో శ్రీస్వామివారు క్లుప్తంగా **"దేంతో**
45 **పీకులాడే వాళ్లు దాంట్లోకి పోతుండ్లాయ్యా"** అని సెలవిచ్చారు.

చివరి క్షణంలో జీవులు దేనిని స్మరిస్తాయో వాటినే పొందుతాయని భగవద్గీతాది శాస్త్రాలు చెపుతున్నాయి. జీవితాంతం లౌకిక వ్యవహారాల్లో కొట్టుకులాడే సామాన్య మానవులకు చివరి ఘడియలలో అట్టి స్మృతులే కలుగుతాయి. కానీ పూర్వ పుణ్యం వలన మహనీయుల నాశ్రయించినవారు నిరంతరం వారి స్మరణ, సేవలలోనే తమ జీవితాన్ని గడుపుతారు. అట్టివారికి సహజంగా అంతిమ శ్వాసలో అటువంటి శుభమైన స్మృతులే కలుగుతాయి.

**మన శాస్త్రాలు, విద్యలను పరవిద్య, అపరవిద్య అని రెండు వర్గాలుగా విభజించారు. మోక్షాన్నిచ్చే విద్యను పరవిద్య అని, మోక్షగాములు వాటి నాశ్రయించాలని చెప్పారు. జ్యోతిష్యము, వ్యాకరణము మొదలగునవి అపర విద్యలు. ఇవి బహిర్ముఖములు, ఐహికములు గనుక మోక్షమునకు**
46 **ప్రధానము కావని చెప్పారు. ఇవి మానవుని భ్రాంతిలో పడవేసి అధోగతిపాలు చేస్తాయని చెప్పారు. కనుక ముముక్షువు వీటిని పట్టించుకోకుండా తన దృష్టినంతటిని సద్గురువు పై నిలపాలని చెప్పారు. ఇందుకు చక్కని ఉదాహరణ శ్రీస్వామివారి చరిత్రలో కాన వస్తుంది.**

నాగులవెల్లటూరుకు చెందిన సోంపల్లి రామానాయుడు జ్యోతిషశాస్త్రమును అభ్యసించి ఎక్కువ కాలం శ్రీస్వామివారి చెంతనే గడిపేవాడు. అతడా విద్యలో ప్రావీణ్యం కావాలని శ్రీస్వామివారి నాశ్రయించాడో ఏమోగాని, కొంత కాలానికి ప్రశ్నలు చాలా చక్కగా చెప్పేవాడు.

ఒకసారి ఒకరి నెక్‌లెస్ పోతే ఆయన లెక్కవేసి, వారింటి తాటాకు దడిలో దాచారని చెప్పాడు. దడి విప్పితే అందులో నుండి నెక్‌లెస్ క్రింద పడింది. తప్పిపోయిన బఱ్ఱెను గూర్చి ప్రశ్నించిన వారితో "మీ ఊరికి ఉత్తరాన మూడు మైళ్లలో ఉన్న గ్రామానికి ఎల్లుండి సూర్యోదయమప్పుడు వెడితే దొరుకుతుంది" అని చెప్పాడు. సరిగా ఆ సమయానికి ఆ ఊరికి వెతకటానికి వెళ్లిన మనిషికి ఎదురుగా ఒక ఇంట్లోంచి ఆ గేదె బయటికి వచ్చింది.

ఒకసారి శ్రీస్వామివారు పర్యటనకు వేరొక ఊరికి బయలుదేరుతుండగా రామానాయుడు "స్వామి, నా వంట్లో బాగాలేదు. నేనిక్కడే వుంటాను" అన్నాడు. శ్రీస్వామివారు అంగీకరించి వెళ్లిపోయారు. తరువాత రెండవ రోజున రామానాయుడు ఆశ్రమంలో మరణించాడు. ఆ వార్త శ్రీస్వామివారికి తెలిపితే అతడి దేహాన్ని ఆశ్రమంలో ఒక ప్రక్కన సమాధి చేయమని శ్రీస్వామివారు కబురు చేశారు. భక్తులలానే చేశారు.

ఆ సమాధి ప్రక్కనే శ్రీస్వామివారి భక్తుడైన పోలిరెడ్డి సమాధి కూడా ఉన్నది. పోలిరెడ్డి ఎప్పుడూ శ్రీస్వామివారిననుసరించి సేవిస్తుండేవాడు. శ్రీస్వామివారు ఎక్కడ విడిది చేసినా అతడు వెంటనే ఆ ప్రాంతంలో వెదకి ఆకుకూర సేకరించి, వండి శ్రీస్వామివారికి పెట్టేవాడు. కారణం శ్రీస్వామివారు ఆకుకూరను ఎక్కువ ప్రీతిగా తినేవారు. అంతకు మించి అతడు శ్రీస్వామివారి నుండి కోరిందికానీ, పొందినదిగానీ ఏమీ కనిపించదు. కానీ అతడు చనిపోవడానికి నలభైరోజులు ముందుగా శ్రీస్వామివారు భక్తులతో, "నేటికి నలభైరోజులకు భగవంతుడు విచారణకు వస్తాడు. మనమందరమూ ఆ రోజు గంగైనా ముట్టకూడదు" అన్నారు. వారి భావమేమో ఎవ్వరికీ అర్థంగాలేదు. సరిగ్గా ఆరోజుకు మైపాడులో ఉన్న శ్రీస్వామివారు, "అయ్యా, మనం ఆశ్రమం చేరినదాకా నేనేగాదు, మీరు కూడ గంగను ముట్టకూడదు. మనం వెంటనే గొలగమూడి చేరాలి. పదండి" అన్నారు. వర్షాల వల్ల ప్రయాణ సౌకర్యం లేకపోయినప్పటికీ ఆయన సేవకులను తొందరచేసి కాలి నడకన నెల్లూరు చేరి మధ్యాహ్నానికి కారులో గొలగమూడి చేరారు. నాటి ఉదయమే ఆశ్రమంలో పోలిరెడ్డి పరమపదించాడు. అతడికి అంత్యక్రియలు ఎక్కడ, ఎలా చేయాలని భక్తులు తర్కించుకుంటున్నారు. శ్రీస్వామివారిని విచారించడానికి ఆయన ఎక్కడున్నదీ వారికి తెలియలేదు. కాని శ్రీస్వామివారికి తెలియనిదేమున్నది?

పోలిరెడ్డి మరణించిన సమయానికే శ్రీస్వామివారు సేవకులను ఆశ్రమానికి బయలుదేరదీశారు. తర్వాత ఆశ్రమంలో ఆయనే స్వయంగా పోలిరెడ్డి దేహాన్ని సమాధి చేశారు.

పోలిరెడ్డి అంత్యక్రియల పట్ల అంత శ్రద్ధ వహించిన శ్రీస్వామివారు జ్యోతిష్యములో ప్రావీణ్యం గడించిన రామానాయుడు చనిపోయినపుడు ఆశ్రమానికి ఎందుకు రాలేదని భక్తులీనాటికీ తర్కించుకుంటున్నారు. శ్రీస్వామివారి సేవను తప్ప ఏమీ కోరని అనన్యమైన గురుభక్తుడు, ముముక్షువు పోలిరెడ్డి. శ్రీస్వామివారు స్వయంగా అతని దేహాన్ని సమాధి చేయటం, అతడికి ఆయన నిశ్చయంగా సద్గతిని ప్రసాదించారనడానికి నిదర్శనం. రామానాయుడు శ్రీస్వామివారి నుండి జ్యోతిష్య విద్యను మాత్రమే ఆశించిన అర్థార్థి. అయితే పూర్వపుణ్యం వలన ఆ మిషమీద అతడిని పరమ పవిత్రమైన శ్రీస్వామివారి ఆశ్రమంలోనే సమాధి చేయమన్నారు శ్రీస్వామివారు. శ్రీ సాయి చరిత్రలో గూడా వారి నుండి ఏమీ ఆశించకనే అనన్యంగా సేవించిన మేఘుని గురించి సాయి, "వీడే, నా అసలైన భక్తుడు" అని ప్రశంసించి అతని దేహంతో గూడ స్మశానం వైపుకు కొంత దూరం నడచి వీడ్కోలు చెప్పడమేగాక తమ స్వంత ఖర్చుతో భక్తులకు సాయి సంతర్పణ చేయించారు. ఏమీ కోరని సేవే భక్తి.

నెల్లూరు వాస్తవ్యులు ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసరుగారికి ఒక పెంపుడు కుక్క వుండేది. దాన్ని వారెంతో ముద్దుగా చాకేవారు. ఆ కుక్కకు జబ్బు చేస్తే డాక్టరు వల్ల నయంగాక శ్రీస్వామివారి చెంతకు కారులో తీసుకొచ్చారు. శ్రీస్వామివారు కుక్కను, కుక్క శ్రీస్వామిని ఒకరొనొకరు చూచుకున్నాక ఆ కుక్క ప్రాణాలు వదిలింది. శ్రీస్వామివారి సన్నిధిలో ప్రాణాలు వదిలిన జీవికి తప్పక సద్గతి లభిస్తుంది. సాయి చరిత్రలో సాయినాథుని దర్శించి ఒక పులి తన ప్రాణాలు విడిచినట్లుందీ సన్నివేశం.

కొట్టకూటి నరసింహులునాయుడు (గొలగమూడి), వీరి భార్య అనేక సంవత్సరములుగా శ్రీస్వామివారి భక్తులు. శ్రీస్వామివారి మాటపై అచంచలమైన విశ్వాసంగలవారు. ఒకప్పుడు శ్రీస్వామివారు వీరిని ఒక్క సంవత్సరం రోజులు గొలగమూడి వదలి పడమటి రాజ్యం పొమ్మని ఆజ్ఞాపించారు. వీరలాగే ఇల్లు వాకిలీ వదలి శ్రీస్వామివారు మరలా రమ్మని చెప్పినంత వరకూ తలుపూరులో పూరిపాక వేసుకొని సంతోషంగా కాలం

వెళ్ళబుచ్చారు.

1983 లో నాయుడుగారి భార్యకు కాన్సరు వ్యాధి వచ్చింది. డాక్టర్లకు చూపిస్తే వారు ఆశ వదలివేశారు. శ్రీస్వామివారిని శరణుజొచ్చి విభూతి వాడుతున్నారు. శ్రీస్వామివారి భక్తులు బుజ్జన్నగారు స్వామివారి సమాధికి దారం తాకించి ఇస్తే ఆ దారం కట్టి సాంబ్రాణి పొగ వేయించి, స్వామి విభూతి నీటిలో కలిపి ఇప్పిస్తూ శ్రీస్వామివారిని ప్రార్థించారు.

ఆనాటి రాత్రి బుజ్జయ్యగారి స్వప్నంలో ఆమెను బ్రహ్మాండమైన పాడెపై పెట్టి అలంకరించినట్లు, పెద్ద పూలమాల వేసినట్లు ఆమె ముఖం బెజవాడ కనకదుర్గమ్మ ముఖం వలె వెలుగుతున్నట్లూ కనిపించింది. తెల్లవారి ఆమె మరణించింది. శ్రీస్వామివారు ఆమెను రక్షించలేదని బుజ్జన్న మొదలైన భక్తులనుకుంటారని, ఆమెకు ఆయువు తీరిందని, ఏమి చేయుటకు వీలులేదనీ వీరికి ఆ స్వప్నం ద్వారా తెలిపారు.

ఆమెకు మృత్యుకళ లేకుండా దైవకళతో నున్నట్లు స్వప్నంలో చూపడంబట్టి ఆమెకు శ్రీస్వామివారు ఉత్తమగతి కల్గించారని తెలుస్తుంది.

కల్లూరుపల్లి వాస్తవ్యులు పాబోలు సుబ్బమ్మ చాలా దయగల వ్యక్తి. సర్వజీవులనూ పరమాత్మ రూపాలుగా చూచుకొనే స్వభావం గలది. గ్రామస్తులు ఒక దొంగను పట్టుకొని ఆమె ఇంటి ముందు బండికి కట్టివేశారు. ఆమె రహస్యంగా ఈ దొంగకు పెరుగన్నం పెట్టి కట్లు విప్పి తరిమేసిన దయామయి.

వృద్ధాప్యంలో కలిచేడులో మంచాన ఉండి నిరంతరం రాత్రింబవళ్ళు శిరిడి సాయి నామస్మరణ చేసింది ఆమె. వీరి మనుమడు పి.సుబ్బరామయ్య ఒకనాడు శ్రీస్వామివారిని సిద్దలయ్య కొండ దగ్గర దర్శించాడు. అప్పటికి 2 రోజుల నుండి మౌనంలో నున్న శ్రీస్వామివారు వెంటనే లేచి వీరికొక చీటి వ్రాసి, అభయముద్ర, ఆశీర్వాదమూ వేసి ఇచ్చారు. జావ త్రాగమన్నా త్రాగకుండా మరలా మౌనం వహించారు. మరుక్షణంలో వెంటనే సుబ్బరామయ్య కోసం మనిషి వచ్చాడు. ఇది తెలిసే స్వామి మౌనం చాలించి ఆమెకు సద్గతి కొరకు తమ ఆశీస్సులు వ్రాయించి ఇచ్చారు. ఇంటికి వెళ్ళి, అంత వరకూ ఏమి నోటిలో పోయబోయినా వద్దనే ఆమె బాబా విభూతి, శ్రీస్వామివారి తీర్థము నోటిలో పోస్తామంటే నోరు తెరిచింది. అవి స్వీకరించాకనే

ప్రాణం వదిలింది. నిజంగా ఆమెకు సకల సాధు స్వరూపమైన శ్రీసాయియే శ్రీ వెంకయ్యస్వామివారి ద్వారా సద్గతిని ప్రసాదించారు. అందులోనూ పవిత్రమైన ధనుర్మాసంలో శరీర త్యాగం చేయించారు సకల సాధు స్వరూపుడు శ్రీస్వామివారు.

వల్లపురెడ్డి ఆదినారాయణరెడ్డిగారు తన తల్లిగారి సద్గతిని గూర్చి ఇలా చెపుతున్నారు.

"మా తల్లిగారైన తులశమ్మగారు శ్రీస్వామివారి సేవకంకితం కాక ముందే చాలా సంవత్సరముల నుండి 'తూర్పున మన అమ్మ వుంది ఆమె మనకు గత ఐదు జన్మల నుండి అన్నం పెడుతూంది. ఇక మీదట మనమంతా ఆమె అన్నం తినాలి' అని శ్రీస్వామివారు చెప్పేవారు. 'ఎవరు స్వామి ఆమె? ఆమెది ఏ వూరు?' అని అడిగితే చెప్పేవారు కాదు. కాలాంతరంలో తులశమ్మ శ్రీస్వామివారి సేవకంకితమైనప్పుడు శ్రీస్వామివారు చెప్పిన అమ్మ ఎవరో భక్తుల కర్థమైంది. ఈమె ఇల్లు, వాకిలి వదలి తన సర్వస్వమూ శ్రీస్వామియేనని సుమారు ఇరవై ఐదు సంవత్సరములు నిరంతరం శ్రీస్వామివారి సేవలో తన జీవితాన్ని పండించుకున్న ధన్యజీవి. ఎప్పుడూ శ్రీస్వామివారు ఈమెను 'అమ్మా, అమ్మా' అని ఎంతో గొప్పగా పిలిచేవారు తమ బృందంలో ఉన్న మిగిలిన ఆడవాళ్లను అలా పిలిచేవారు కాదు. ఈమె యొక్క అనన్యమైన సేవకు ప్రతిఫలంగా వీరికి శ్రీస్వామివారు సద్గతి ప్రసాదించారు.


1. ఈమె శరీరానికి అగ్ని సంస్కారం చేసినపుడు గంధపు చెక్కలు మొదలగు సుగంధ ద్రవ్యములేవీ వాడలేదు. కానీ ఈ మహాతల్లి శరీరం నుండి కవురు వాసనే రాలేదు.

2. పరమపదించుటకు ముందు రెండు నెలల నుండి నిరంతరం ఈమెకు మౌనము (ధ్యానస్థితి) ప్రసాదించారు శ్రీస్వామివారు.

3. చిత్రమైన ప్రేరణ పెట్టి వెంకయ్య, వెంకమ్మ అనే భక్తులను ఆమె సేవకు వినియోగించారు. వీరు ఆమెను కన్నతల్లికంటే ఎక్కువ ప్రీతితో ఆమెనే సాక్షాత్తు శ్రీస్వామివారనే భావంతో సేవించేటట్లు చేశారు శ్రీస్వామివారు.

# అవధూత లీల

## అధ్యాయము - 19
## శ్రీస్వామివారి అభయం



శ్రీస్వామివారి సేవకు తమ జీవితాలను అంకితంచేసి, వారినే తమ గురువు, దైవము, తల్లి, తండ్రి, అన్నదమ్ములు తమ సర్వస్వమనే భావంతో నిరంతరం శ్రీస్వామివారిని సేవించిన సేవకులకు వారి ఎడబాటు అనే ఆలోచన హృదయాన్ని పిండివేసేది. వారు మహాసమాధి చెందితే తమ గతేమిటన్న సందేహం గల్గిన సేవకులు శ్రీస్వామివారితో ఆ విషయం కన్నీటితో విన్నవించినప్పుడు ఆ కరుణామయుడిచ్చిన అభయాలు వారి సేవకులకేగాక వారితో అనేక జన్మలుగా ఏదో ఒక విధంగా అనుబంధమున్న మనందరికీ అందగాయున్నవి. వారిచ్చిన అభయాల ప్రకారం మనం నడుచుకున్నంత సేపు వారి దివ్యసన్నిధి, రక్షణలకు మనకు కొదవే లేదని, మనం ఏమారియున్న సమయాలలో గూడా ఆ కరుణామయుడు మనలను వెన్నంటి కాపాడుతారని వారి మహాసమాధి అనంతరం లీలలు నిరూపిస్తున్నవి. అలా వారిచ్చిన కొన్ని అభయాలను స్మరిద్దాము.

వల్లపురెడ్డి నారాయణరెడ్డిగారు మద్రాసులో కారు కొన్నారు. కాని "సి. బుక్కు" విషయంలో కొన్ని ఇబ్బందులెదురైనవి. ఎన్నిమార్లు తిరిగినా పని కాలేదు. ఇట్టి సమయంలో ఒకరోజు పెనవర్తిలోని వారి ఇంట్లో శ్రీస్వామివారి పటానికిలా విన్నవించుకున్నాడు. "స్వామీ! ఎన్ని మార్లు తిరిగినా నా కారు విషయం అలాగే పెండింగుగా వుంది. ఇక మూడు రోజులలో మరలా మద్రాస్‌కు వెళ్ళబోతున్నాను. ఈసారైనా పని అయ్యేటట్లు దయచేయండి" అని ప్రార్థించాడు. మూడవరోజు మద్రాసు పోతూ శ్రీస్వామివారిని గొలగమూడిలో దర్శించి తాను వెళ్ళే పని గూర్చి విన్నవించారు. "మూడు రోజుల నాడే నీ పని పూర్తిచేసిళ్ళాయ్యా?" అన్నారు శ్రీస్వామివారు. అంటే మూడు రోజులనాడు తాను శ్రీస్వామివారి పటానికి విన్నవించుకున్న వెంటనే ఆ పని విషయం శ్రీస్వామివారు చక్కబెట్టారన్న మాట. అందుకే

శ్రీస్వామివారు ఒకప్పుడు అన్నారు, "వాళ్లుండేదాన్ని బట్టి గదయ్యా మనముండేది!" అని **శ్రీస్వామివారి పటాన్ని కేవలం ఒక చిత్ర పటంగా గాక ఆ మహాత్ముడు మనపై కరుణచే ఆ రూపంలో మన ఇంటనున్నారని,**
47 **భక్తి శ్రద్ధలతో ఆ పటాన్ని సేవిస్తే ఆ సేవ వారికి ప్రత్యక్షంగా చేసినట్లేనని మనకభయమిచ్చారు.**

శ్రీస్వామివారు రెండు సంవత్సరాలకు సమాధి చెందుతారనగా "అన్ని జీవులలో వెంకయ్య వున్నారని వ్రాసుకోయ్యా" అన్నారు. **గనుక మనమే జీవిని ఆదరించినా, బాధించినా అది శ్రీస్వామివారికే చెందుతుందనే ఎరుకతో**
48 **ప్రతి నిత్యం నడుచుకోవడమే నిజంగా శ్రీస్వామివారికి మనం చేసే నిత్య పూజని మనం గుర్తించాలి. గనుకనే తమ ప్రతిరూపాలైన సర్వజీవులపై వారి కంతటి ప్రేమ.** లేకుంటే ప్రతి నిత్యం ఆ జీవుల కొరకు అంతంత అన్నం భూతబలికి సమర్పిస్తారా? అన్నము, రాగులు మొదలగు వాటిని చీమలకు పోసేవారా? భక్తులు భరించలేని రోగాలను తన శరీరం మీదకు తీసుకొని బాధపడతారా?

ఒకప్పుడు శ్రీస్వామివారు తమను సిద్ధలయ్యకొండ శిఖరం పైకి తీసుకుపొమ్మని సేవకులను కోరినారు. శ్రీస్వామివారు నడువలేరు. డోలీలో తీసుకుపోవడానికి అది అనువైన మార్గంకాదు. ఒక భక్తుడు శ్రీస్వామివారిని వీపు మీద ఎక్కించుకొని కొండపైకి చేర్చాడు. "మూరకు మూడువేలు వ్రాసుకోయ్యా!" అన్నారు శ్రీస్వామివారు. ఆ భక్తుడు ఆయనను మోసుకొని నడచిన ప్రతి మూరెడు దూరానికి అపారమైన పుణ్యం అతడి పేర జమ చేయబడినదని వారి భావం. "స్వామీ, మీరు సమాధైతే మేము మా ఇండ్లకు పోకుండా భిక్షమెత్తుకొని జీవిస్తూ తమ సమాధి దగ్గర ఉంటాము" అన్న సేవకులతో, "అట్లా పనిలేదయ్యా! మీరు అడవిలో కూర్చున్నా అన్నం వచ్చేటట్లు వ్రాసుకోండి" అన్నారు చల్లని శ్రీస్వామివారు. అంటే వారు భుక్తిని, ముక్తినీ గూడా సేవకులకనుగ్రహించారన్నమాట.

మరొకప్పుడు, "స్వామీ, మీరు సమాధైతే మేమేంచెయ్యాలి? ఎక్కడకు పోవాలి?" అని గురవయ్య అడిగితే, "ఎక్కడకూ పోనక్కరలేదయ్యా! నా సమాధి దగ్గర కూర్చున్నా అంతా నేను ఉన్నట్లే జరుగుతుంది" అని అభయమిచ్చారు. "నా భక్తులతో నా సమాధి మాట్లాడుతుంది, నా మట్టి సమాధానం చెబుతుంది,

నా నామం పలుకుతుంది” అన్న శ్రీసాయిమాటల నెంతగానో శ్రీస్వామివారి అభయాలు పోలియున్నవి.

ఒక్కొక్కప్పుడు మంచి వేసవి కాలపు ఎండలో మధ్యాహ్నం 12 గంటలకు “నేరుగా ఫలానా కొండ దగ్గరకు పోవాలి” అనేవారు. త్రోవన పోదామంటే వప్పుకోరు. ముండ్లుగానీ, బండలుగానీ, గుట్టలుగానీ నేరుగా అంటే నేరుగా వెళ్ళాల్సిందే. శ్రీస్వామివారి డోలి మోసేవారు పాదరక్షలు ధరించేవారు కాదు.

బి. నాగయ్య చెబుతున్నారు: “స్వామి కృపవలన వారు ముండ్లలో పొమ్మంటే ఓంకారం చేస్తూ ‘నీదే భారం గురుదేవా’ అంటు నిలువునా ముండ్లమీద నడిచినా ఒక్క ముల్లు గ్రుచ్చుకునేదికాదు. నేరుగా స్వామి చూపిన దిశలోనే నడిచేవాళ్లం. అంతటి ఎండలో 12 గంటలకు బయలుదేరి మూడు గంటల వరకు విరామం లేకుండా తిరిగి తిరిగి మజిలీకి వస్తే అలుపు, బడలిక వుండేది కాదు. ‘అయ్యా మీరు మోసినందుకు ముప్పయి కోట్లు రశీదు తీసుకుపోయారు’ అని చెప్పేవారు.”

ఒకప్పుడు తన ధునిని ఉద్దేశించి, “**కోటి లింగాల పూజ కదయ్యా** 49
**ఇక్కడ జరిగేది!**” అన్నారు శ్రీస్వామివారు.

**తిరుపతిలో జరిగిన ఒక యజ్ఞం గురించి శ్రీస్వామివారికి చెపితే,**
**“అయ్యా, అక్కడ 40 రోజులలో వచ్చే ఫలితం ఇక్కడ 4 గంటలలో** 50
**వస్తూ వుండ్లా?” అన్నారు.**

మరొకప్పుడు అన్నారు, “బాలయోగి ఆయన పని ఆయన చూచుకొని పోయేవాడేనయ్యా మనం అందరినీ చూస్తుండ్లా?”

ఒకరోజు గురవయ్యతో “అయ్యా, వీరబ్రహ్మంగారిలాగ గుంట త్రవ్వించుకొని చాటున కూర్చోను. అందరికీ అన్ని ఏర్పాట్లూ చేసిపోతాను” అని అన్నారు. అలాగే జరిపిస్తున్నారా ప్రేమమూర్తి.

రోశిరెడ్డితో “**అయ్యా, అందరికీ పంట పండించాను. దొంగలు**
**పడకుండా కాపలా కాచుకోండి**” అన్నారు శ్రీస్వామివారు. ‘**ఆధ్యాత్మికంగా** 51
**అందరినీ పూర్ణంగా అనుగ్రహించాను. మీలోని ప్రకృతి సిద్ధమైన దుష్ట సంస్కారములనే దొంగలు ఆ కృపను దోచుకోకుండా**

**కాపాడుకోమని**' శ్రీస్వామివారి భావం కాబోలు. 'శ్రీస్వామివారిని నమ్ముకున్నాను. అంతా వారే చూచుకుంటారు' అని అనుకుంటూ తప్పులు చేస్తూ పోవడం సరైన పద్ధతికాదు. మనలోని చెడ్డగుణాలు అనే దొంగలను ఏరి పారేసుకుంటే శ్రీస్వామివారికృప మనకనుభవమౌతుంది, దక్కుతుంది. "మీరు పోతే మాకు దిక్కెవ్వరు స్వామి" అంటే "పోయేదెక్కడికయ్యా, సూర్యచంద్రులు ఉన్నంతవరకూ ఉండేదేగదా" అన్నారు ఆ మహనీయుడు. ఈ విషయం నిజమేనని మహాసమాధి అనంతరం జరిగే శ్రీస్వామివారి లీలలు నిరూపిస్తున్నవి. "వెంకయ్య పేరు మీద పిడికెడు మెతుకులు పెట్టిన వారికి, తెచ్చినవారికి, వారి మంచి చెడ్డలన్నీ మనమే చూడొద్దయ్యా" అన్నారు శ్రీస్వామివారు.

ఒకనాడు శ్రీస్వామివారు అన్నారు. "ఇప్పుడెవరు ఏ ఏ పని చేసుకుంటున్నారో ఇక ముందు కూడా ఆ పనులే చేసుకోండి. ఆ పనులలో నేనే ఉన్నాను" అన్నారు.

తేలుకుట్టినవారు కొందరు శ్రీస్వామివారి దగ్గరకొస్తేనే తగ్గుతుంది. మరి కొందరికి ప్రదక్షిణలు చేస్తే తగ్గుతుంది. మరికొందరికి కుట్టినప్పుడే శ్రీస్వామివారిని స్మరిస్తే తగ్గుతుంది. "ఈ భేదమేమిటి స్వామీ?" అంటే ఆయన అన్నారు, "వాళ్ళుండే దాన్ని బట్టి గదయ్యా మనముండేది!" అని. అంటే అవతలివారి విశ్వాసాన్ని బట్టి రక్షణ అన్నమాట. శ్రీస్వామివారే మరొకప్పుడు, "చచ్చేదేముంది, బ్రతికేదేముంది? చచ్చి బూడిదైనా రమ్మంటే రావలసిందేగదా" అన్నారు.

అప్పుడప్పుడూ శ్రీస్వామివారు రోశిరెడ్డితో "అయ్యా ఊర్లోకిపోయి ఎవరినన్నా అడిగి పాత గుడ్డలు తీసుకురాయ్యా! మనకు పనికివస్తాయి. ఇచ్చిన వాళ్ళకు జబ్బులు పోతాయి" అనేవారు.

"ఏదైనా ఒక పని ప్రారంభించేందుకు ఏ వారం మంచిది స్వామీ?" అని ఒక భక్తుడు అడిగాడు.

స్వామి:- మందల కనుక్కుంటే మంగళవారం మంచిది గదయ్యా!

మందల కనుక్కోవడమంటే మనం ఏ పని చేసినా నిష్కామ కర్మగా, గురుసేవగా చేస్తుంటే ఏ వారమైనా పరవాలేదు. చెడ్డదని భావించే

మంగళవారము కూడా మంచిదేనని శ్రీస్వామివారి భావన.

భక్తుడు:– స్వామీ! మీరు నిరంతరం పర్యటిస్తున్నందున మాకు మిమ్ము దర్శించే భాగ్యము కష్టముగా వున్నది స్వామీ!

స్వామి:– ఎక్కడ తల్చుకుంటే అక్కడనే ఉండ్లాయ్యా నేను?

ఇది నిజమేనని ఎంతో మంది భక్తుల అనుభవాలు ఋజువు చేస్తున్నవి. ఒకప్పుడు శ్రీస్వామివారు అన్నారు: “ఇప్పుడేముందయ్యా – వెంకయ్య చాటుకుపోయిన తరువాత మూడేండ్లకు గదా ఉండేది? ఇక్కడ నెల్లూరు రంగనాయకులస్వామి గరుడసేవ జరిగినట్లు జరుగుతుంది. పూర్తి విశ్వాసంతో ఇక్కడికొచ్చి ఏమనుకుంటే అది అయ్యేదేగదయ్యా!”

ఈ మాట నేడు అక్షరాల నిజమైంది.

“వాళ్లుండేదాన్నిబట్టి గదయ్యా మనముండేది” అని సెలవిచ్చారు శ్రీస్వామివారు. ఈ విషయం అక్షరాలా నిజమని వక్కెమ్మ అనుభవం ఋజువు చేస్తుంది.

ఒకరోజు చలమానాయుడు, వక్కెమ్మ శ్రీస్వామివారి దర్శనార్థమై ఏరుదాటుతున్నారు. ముందు నడిచే చలమానాయునికి నడుములలోతు నీళ్ళు, గుడ్డలన్నీ తడిశాయి. అతని వెనుకనే వచ్చే అమాయకురాలు వక్కెమ్మకు మాత్రం మోకాళ్ళ లోతు నీళ్ళు, గుడ్డలు తడవనేలేదు.




ఓం నారాయణ - ఆదినారాయణ

# అవధూత లీల

## అధ్యాయము - 20

## ధర్మాచరణ



**ప్రతి మానవుడు సుఖశాంతులతో తృప్తిగా
జీవించాలని తలుస్తాడు. కానీ అట్టి సుఖము, శాంతి, తృప్తి
52 అనునవి మన మాచరించే ధర్మము వల్ల మాత్రమే
లభిస్తాయని ఎన్ని శాస్త్రాలు ఘోషించినా, మహాత్ములందరూ
ఎలుగెత్తి చాటినా ఆశాబద్ధుడైన మానవునకు అట్టి ఆచరణ
దుస్సాధ్యమైంది. ఇట్టి ధర్మాచరణ మన నిత్యజీవితంలో సహజసిద్ధమ
య్యేందుకు మహనీయుల సాంగత్యమొక్కటే శరణ్యమని భగవద్గీతాది
గ్రంథాలన్నీ చెపుతున్నాయి.** వారి ప్రత్యక్ష సాన్నిధ్యము లభించనప్పుడు
మహాత్ముల చరిత్ర పారాయణ కూడా మహాత్ముల ప్రత్యక్ష సాన్నిధ్యముతో
సమానమని ఎందరో భక్తుల అనుభవాలు ఋజువు చేస్తున్నవి. మహనీయుల
చరిత్ర పారాయణ ద్వారా అనేకమంది భక్తులలో కల్గిన హృదయ పరివర్తనే
ఇందుకు నిదర్శనము. అట్టి ధర్మాచరణను గూర్చి శ్రీస్వామివారు ఏనాడూ
పెద్దగా ఉపన్యసించకున్ననూ శ్రీస్వామివారి నిత్యజీవిత సంఘటనల నుండి
ఇట్టి ధర్మబోధ వినగల్గినవారికి అనుక్షణమూ వినిపిస్తూనే ఉంటుంది.

కొట్టుకూటి బుజ్జయ్యగారు ప్రతినిత్యం శ్రీస్వామివారి సన్నిధిలో ఎక్కువ
కాలం గడిపేవారు. ఒకప్పుడు ఎందుకోగాని ఊరిలో ఉండి కూడా పది
రోజులు శ్రీస్వామివారి దర్శనానికి రాకుండా వీధులలో రచ్చమీద కూర్చొని
మాట్లాడుతూ కాలం గడిపేవాడు. పదకొండవ రోజున శ్రీస్వామివారి దగ్గరకొస్తే
శ్రీస్వామివారు వీరిని చూపుతూ, **“ఏ వూరయ్యా ఆయినది?” అని అన్నారు.
తన ప్రవర్తనకు బుజ్జయ్య పశ్చాత్తాప పడ్డారు. గురువును పక్షానికీ,
53 మాసానికి, కనీసం ఆరు మాసాలకైనా ఒక్కసారి విధిగా దర్శించాలని
శాస్త్రం, ఈ శాస్త్ర వాక్యం వారి మహాసమాధి అనంతరం గూడా వర్తిస్తుంది.**
సద్గురువు జనన మరణాల కతీతుడు గనుక వారితో భక్తులకు గల అనుబంధం
వారి మహాసమాధి అనంతరం కూడా కొనసాగుతూంటుందని శ్రీరమణమహర్షి

చెప్పారు. సూర్యచంద్రాదులున్నంత వరకూ తామక్కడే ఉంటామని శ్రీస్వామివారు మనకు వాగ్దానం చేశాక వారి సమాధిని దర్శించడం, వీలైనంతకాలం అక్కడ గడపడం మనకెంతో శ్రేయస్కరం.

నాగులవెల్లటూరు వాస్తవ్యులు మంగమ్మ ఒక రోజు ఉపవాసమున్నది. ఆ రోజు శ్రీస్వామివారు ఆమెతో "అందరికీ అన్నం పెట్టి నీవు తిని రామ్మా" అన్నారు.

"ఈరోజు శివరాత్రి స్వామీ! ఉపవాసం ఉన్నాను" అన్నది మంగమ్మ, "అబ్బే అన్నం చూస్తూ వుళ్ళామ్మా? తినేసిరా" అన్నారు శ్రీస్వామివారు. అంటే అన్నం తినాలనే కోరిక, ఆకలి ఉంటాయి కనుక తినటమే మంచిదని శ్రీస్వామివారి భావం. అలానే ఆమె అన్నం తిని వచ్చింది. ఆకలితో నకనకలాడుతూ ఎప్పుడెప్పుడు దీక్ష విరమించి అన్నం తిందామా అన్న తలంపు ఉన్నంత సేపు అన్నం తినినట్లే లెక్క. తినాలనే కోరిక లేకుంటే తప్ప ఆ కోరిక ఉన్నంత సేపు తినకుండా ఉండినా తినినవాళ్ళ క్రిందే లెక్క. దీనినే భగవద్గీత మిథ్యాచారమని చెప్పింది. అందుకే శ్రీస్వామివారు ఆమె సంస్కారమునకు ఉపవాసం తగదని చెప్పారు. కానీ కొందరిని శ్రీస్వామివారు ఉపవాసముండమని ప్రోత్సహించేవారు. ఉదా: రోశిరెడ్డిగారిని ఒకప్పుడు ఐదు రోజులు ఆహారం లేకుండా ఉంచారు. అది వారి సంస్కారమునకు తగినది గనుక అలా చేశారు.

శ్రీస్వామివారు సామాన్యంగా ఎవరింటిలోకీ వెళ్ళేవారుగారు. కాని 1978 సంవత్సరంలో శ్రీస్వామివారు కలిచేడు నరసారెడ్డిగారి ఇంటిలో మూడు రాత్రులు ఉండి ఒకనాడు వారి నట్టింట ధుని వెలిగించి, ఇంటి లోపల కూర్చోవటం విశేషం. నాల్గవరోజు ఉదయం శ్రీస్వామివారు. "సిద్ధలయ్య కొండకు వెళ్ళాలి బండి తీసుకురా" అన్నారు. బండి వచ్చింది. సామానులన్నీ బండిలో వేసి శ్రీస్వామివారిని కదలమన్నారు భక్తులు. కానీ ఆయన, "ఇప్పుడు పోవడానికి లేదు, బండి వానికి రూ. 6/- ఇచ్చి పంపండి" అని 4, 5 సార్లు చెప్పారు. బండి వానికి అంత డబ్బు ఎందుకివ్వాలో ఎవరికీ అర్థంగాలేదు. కాని బండివాడు రోజూ గనిలోకి పోయి కూలి చేసి బాడుగ సంపాదించుకొనేవాడు. ఆ రోజు అతడు బండి కట్టడం వలన అతడికి పనిపోయింది. కనుక ఆ కూలి మనమే ఇవ్వాలని శ్రీస్వామివారి భావం. సాయినాథుడు చెప్పినట్లు, "ఎవరి సేవనూ ఉచితంగా తీసుకోవద్దు. ఎలాంటి

సేవకైనా ఉదారంగా ప్రతిఫలమివ్వాలి". ఈ ధర్మాన్ని శ్రీస్వామివారు ఎంత చక్కగా పాటిస్తున్నారో చూడండి. బండి దొరకడం కష్టం గనుక శ్రీస్వామివారిని సేవకులు ఆ రోజే బయలుదేరమన్నారు. కానీ శ్రీస్వామివారి ఆజ్ఞకు తిరుగేముంది. బండిలో సామానులు దించి బండి వానికి ఆరు రూపాయలిచ్చి పంపినంతవరకు శ్రీస్వామివారు వదలలేదు. అమాయకులైన సేవకులు బండివానితో 'రేపు వచ్చి శ్రీస్వామివారిని వదిలిపెట్టమన్నారు. కానీ శ్రీస్వామివారు అప్పుడు కూడా ఆరు రూపాయలివ్వందే వప్పుకుంటారా?

శ్రీస్వామివారి చెల్లెలు మంగమ్మ, శ్రీస్వామివారిని చాలా ప్రేమగా చూసేది. వీరు ఎక్కడెక్కడో తిరిగి ఇంటికి వచ్చేసరికి ఎంత ఆకలియైనా ఈమె వారికోసం అన్నం దాచి పెట్టి ఎదురు చూచేది. అందులకు శ్రీస్వామివారి కుటుంబ ఆస్తిలో తమ వాటా ఈమెకే ఇవ్వమని తమ సోదరులను ఆజ్ఞాపించారు. వారలానే ఆమెకిచ్చారు. కృతజ్ఞతంటే ఎలా వుండాలో శ్రీస్వామివారు పాటించి చూపారు.

కొట్టుకూటి బుజ్జయ్య గారికి శ్రీస్వామివారు ఒకనాడు ఒక మాట చెప్పారు. "అయ్యా నన్ను కనిపెట్టుకొని ఉండే వాళ్ళను కనిపెట్టుకొని ఉండు" అన్నారు. అందుచేతనే శ్రీస్వామివారు సమాధి చెందిన తరువాత గూడా శ్రీస్వామివారికి సేవ చేసిన వారి నందరిని ఆయన ఆదరంగా సేవించుకొనుచున్నాడు. **నిజమైన సద్గురుసేవ సద్గురువు యొక్క మహాసమాధి అనంతరం కూడా కొనసాగుతుంది. అందుకే మన ప్రాచీన శాస్త్రాలు నైష్ఠిక బ్రహ్మచారి (జీవితాంతం బ్రహ్మచర్యం పాటించేవారు) ఎల్లప్పుడూ**
54 **గురువు చెంతనే ఉండాలని, గురువు పరమపదించినట్లయితే వారి అగ్నిహోత్రాన్ని వారి ప్రత్యక్షరూపంగా సేవిస్తూ జీవితాంతం ఉండాలనీ చెపుతాయి.** శ్రీ సాయి ఆ నియమాన్ని పాటించారు. శ్రీస్వామివారు కూడా అలానే చేసి యుండవచ్చు. అందుకే గాబోలు శ్రీసాయిని వారు తమ సోదరులని వ్యవహరించారు. అలానే సచ్ఛిష్యుడు తన గురు బంధువులను అంటే తన సాటి శిష్యులను గూడా ప్రేమతో ఆదరించడం ధర్మం.

**"బ్రేవ్‌మని త్రేంపే వాడికి కాదయ్యా, ఆకలై కొంగుపట్టేవారికి అన్నం**
55 **పెట్టాలయ్యా" అన్నారు శ్రీస్వామివారు.**

శ్రీస్వామివారు రెండు మూడు రోజులు ఆహారం లేకుండా ఉన్నప్పుడు కూడా అన్నం తినే వేళయితే తన బృందములోని వారేగాక, **దర్శనార్థం** 56
**వచ్చిన వాళ్ళందరూ భోజనాలు పూర్తిచేశాకనే శ్రీస్వామివారు గంజి త్రాగేవారు. తన వారందరూ భోంచేశాకనే యజమాని భోంచేయాలని ధర్మశాస్త్రం చెబుతుంది.**

శ్రీస్వామివారు అన్నంలో కేవలం పచ్చి ఎల్లికారం తినేవారు. మజ్జిగ ఇస్తే త్రాగేవారు లేకుంటే లేదు. రుచి విచక్షణగానీ, ఉడికిందా, ఉడకలేదా అనిగానీ చూచేవారు కాదు. ఒకప్పుడు భక్తులు సజ్జ సంగటి వండుతున్నారు. అది సగమే ఉడికింది. 'ఉడకకపోయినా పర్వాలేదు పెట్టమన్నారు' శ్రీస్వామివారు. అందులోకి కూరలేదంటే, 'మీరు కూరలో వేసుకొనే ఎల్లిపొడి వెయ్యండి' అన్నారు. ఆ భక్తులు **ఉప్పులేని మిరప్పొడి వేస్తే వేడి వేడిగా**
**వున్న సంగటిలో ఆ మిరప్పొడే అద్దుకొని శ్రీస్వామివారు తిన్నారు. ఆహారం** 57
**ఆకలికే కాని రుచికి కాదు. ఇది వైద్య శాస్త్రానికి, సాధనకూ ప్రధాన సూత్రం.**

మంగలివాడు తమకు గడ్డం చేసినందులకు రెండు రూపాయలిచ్చేవారు. అందరూ ఇచ్చేది యాభై పైసలు మాత్రమే. ఇదే విధంగా చాకలికి అందరూ ఇచ్చేదానికంటే రెట్టింపు పైకం ఇప్పించేవారు శ్రీస్వామివారు. భక్తులతో, 'ఎలాంటి సేవకైనా ఉదారంగా ప్రతిఫలమివ్వాలి' అన్నారు శ్రీ సాయి. మహాత్ములందరి ఆచరణ ఒకే విధంగా వుంటుంది.

వల్లపురెడ్డి ఆదినారాయణరెడ్డిగారు ఒకరోజు శ్రీస్వామివారిని నెల్లూరు నుండి పెనువర్తిలోని తన ఇంటికి కారులో రమ్మన్నారు. శ్రీస్వామివారు 'పై వాళ్ళు వప్పుకోరు' అన్నారు. రెడ్డిగారు కాస్త ఆలోచించి 'స్వామీ! మనవాళ్ళ నందరినీ బస్సులో తీసుకువస్తాను. మీరు కారులో పదండి' అని ప్రార్థించాడు. శ్రీస్వామివారు 'అట్లాగయితే పదయ్యా' అని బయలుదేరారు. కారుకుపోను మిగిలిన వారిని రెడ్డిగారు బస్సులో పెనువర్తికి తీసుకుపోయారు.

రెడ్డిగారితో తాను కారులో వెళ్ళితే అది ధర్మవిరుద్ధమని పైవాళ్ళు ఒప్పుకోరని చెప్పారు. వారు బస్సులో వస్తారని చెప్పగానే అంగీకరించారు. శ్రీస్వామివారికి కాళ్ళు బాగుండి నడువగల్గినట్లయితే అందరకూ ఒకే రకమైన వాహనముంటేనే కదలి వుండెడివారు.

ఒకనాడు శ్రీస్వామివారు భోంచేసే విస్తర్లో కుక్క మూతి పెట్టింది. దాన్నేమీ అనకుండా శ్రీస్వామివారు ఇవతల కొచ్చేశారు. కుక్క తృప్తిగా తిని వెళ్ళిపోయింది.

శ్రీస్వామివారు కుక్కలకు అన్నం పెడితే అవి తమ జాతి వైరం మాని అన్ని కుక్కలూ సామరస్యంగా తినేవి. ఇదే విధంగా శ్రీస్వామివారి భక్తురాలు తులశమ్మ అన్నం పెడితే కుక్కలు, పిల్లులు వైరం మాని ఒకే విస్తర్లో తినేవి.

ఒకరోజు శ్రీస్వామివారు నిద్రలేస్తూనే 'ఈరోజు ఎవ్వరూ నోరు విప్పకూడదయ్యా' అని పదే పదే చెపుతున్నారు. శ్రీస్వామివారు ఎందుకా విధంగా చెపుతున్నారో ఎవరికీ బోధపడలేదు. కొంత సేపటికి ఆశ్రమంలో ఐదు ధోవతులు కలిపి తయారు చేసిన మంత్రం వేసే గుడ్డ ఎవరో దొంగలెత్తుకు పోయారని ఆ విషయమై దొంగలను తమ సేవకులు దూషిస్తారని శ్రీస్వామివారు అలా చెప్పారని సేవకులు తెలుసుకున్నారు.

ఒకరోజు ఆశ్రమంలో నీళ్ళు కాచుకునే పెద్ద రాగి అండా దొంగలెత్తుకు పోయారు. శ్రీస్వామివారికి చెపితే 'వాళ్ళకు లేకే గదయ్యా ఎత్తుకుపోయారు. వాళ్ళను మనమేమీ అనకూడదే!' అని సెలవిచ్చారా ధర్మప్రభువు. 'ఉదాసీనోగతవ్యథః' అని గదా శాస్త్రం.




ఓం నారాయణ - ఆదినారాయణ

# అవధూత లీల

## అధ్యాయము - 21

## శ్రీస్వామివారి దివ్యబోధ



**శ్రీస్వామివారిని 'మాకేమైనా బోధించండి స్వామీ' అని అనేక మంది అడిగినప్పుడు స్వామివారు 58 'చూచినేర్చుకోండయ్యా' అని క్లుప్తంగా బోధించేవారు.** వారు వాచా ఎన్నడూ బోధ అని ప్రత్యేకంగా చెప్పకపోయిననూ వారి జీవితకాలంలో భక్తులతో వారు మాట్లాడిన మాటలే మనకు దివ్యబోధలు. వాచా బోధించే కంటే నిత్య సత్యమైన నిదర్శనముతో శ్రీస్వామివారు ఒకటి రెండు ముక్తసరి ముక్కలు మాట్లాడినా అవే వేదముల సారాంశముగా ఉండడం గమనార్హము. అట్టి దివ్యమైన ధర్మబోధలు కొన్ని ఈ క్రింద చూడగలము.

**అజ్ఞానులమైన మనం పెద్దలు చెప్పిన కొన్ని విషయాలను 59 మూఢనమ్మకాలని త్రోసిపుచ్చుచుంటాము. కానీ ఈ విషయాలలో శ్రీస్వామివారి వంటి మహనీయులు చెప్పిన మాట అందరికీ శిరోధార్యము.**

కారి రామస్వామి ఇలా వివరించారు. "పొదలకూరులో రెండెడ్ల బండి కొనేందుకు అడ్వాన్సు ఇచ్చి శ్రీస్వామివారికి ఆ విషయం చెబితే 'అయ్యా ఆ బండి ఇంటికొస్తే మంచిదికాదు. దాని ఇరుసులో కోడిపుంజులు పోట్లాడుతున్నాయి. అదివద్దు' అన్నారు. చెర్లోపల్లిలో మరొక బండి మాట్లాడి వచ్చి స్వామికి చెప్పాను 'అయ్యా ఆ బండి వస్తే ఆడవాళ్ళకు జబ్బులు కలుగుతాయి, అది వద్దు' అన్నారు. తరువాత తురిమెర్లలో మరొక బండి చూచివచ్చి చెప్పాను. 'అయ్యా ఆ బండి వస్తే పిల్లకాయలకు జబ్బు చేస్తుంది అది వద్దు' అన్నారు. ఒక వారం రోజుల తరువాత బండి కొనేందుకు ఏ గ్రామం పొమ్మంటారో అడగాలని శ్రీస్వామివారి చెంతకు వెళ్ళాను. నేనా విషయం వారి నడగకమునుపే 'అయ్యా రాజుపాళెంలో నాలుగు వందల రూపాయలకు క్రొత్తబండి ఇస్తారు. తోలుకొచ్చుకో' అన్నారు. ఆ బండి ఏరోజు తోలుకొస్తే మంచిదని అడిగాను. 'అయ్యా సోమవారం ఉదయాన్నే

సూర్యోదయానికి పూర్వమే నీవు బండి కొన్న గ్రామం వదలి బండి తోలుకొని వచ్చేయాలి. మీ గ్రామంలో రాములవారి దేవాలయం వద్ద మూడు నిద్రలు చేయించి, మీ పిల్లకాయలందరిని బండిలో ఎక్కించి ఊరంతా త్రిప్పుచూ శెనగలు, బొరుగులు, బెల్లం, పంచదార పెడుతూ బండిని ఇంటికి తోలుకురమ్మ'ని సెలవిచ్చారు. నేనలాగే చేశాను. ఆ బండి గత ఇరవై ఐదు సంవత్సరముల నుండి పనిచేస్తూనే ఉంది. ఎలాంటి యాక్సిడెంట్లు లేవు. ఆ బండి వచ్చాక మాకు భూస్థితి పెరిగింది. ఈనాటికీ దాన్ని గురు ప్రసాదంగా పరమ పవిత్రంగా వాడుకొనుచున్నాము."

ఒకానొక బండి ఇరుసులో కోడిపుంజులు పోట్లాడడం ఏమిటి? కొయ్యతో చేయబడిన ఒక బండి ఇంటికివస్తే ఆడవాళ్ళకు జబ్బు చేయడమేమిటి? మరొక బండి వస్తే పిల్లలకు జబ్బులు చేయడమేమిటి? ఇలాంటివి విన్నప్పుడు అజ్ఞానులమైన మనకు మూఢ నమ్మకాలుగా ఉంటాయి. ఇలాంటి విషయాలలో సర్వజ్ఞుడైన శ్రీస్వామివారి మాటే శిరోధార్యం.

60 **శ్రీస్వామివారి బృందంలోని వారెవరైనా దురుసుగా మాట్లాడినపుడు 'ఫలానావాడు ఇలా మాట్లాడాడు స్వామీ' అని చెపితే 'ఆయనలో బొమ్మలేచింది లేయ్యా! ఆయనేం చేస్తాడు' అనేవారు.**

అలాగే ఒకరోజు మాటల సందర్భంలో శ్రీస్వామివారు బరిగెల నాగయ్యతో అన్నారు 'బొమ్మల కత్తిరింపు మన దగ్గరుండ్లాయ్యా' అని. మనలోని దుర్గుణాలే మనలోని బొమ్మలు. శ్రీస్వామివారికి మనపై దయగల్గినట్లయితే మనపై తన కత్తిరింపు ప్రయోగం చేసి ఆయా దుర్గుణాలను నిర్మూలించగలరు.

61 **ఒక వ్యక్తి వలన అనేక మందికి అసౌకర్యము, ప్రమాదము అని శ్రీస్వామివారు తలచినట్లయితే – మాట మందలింపు లేకుండానే తనకై తానే ఆ ప్రదేశం వదలి వెళ్ళేటట్లు శ్రీస్వామివారు ఆ వ్యక్తి హృదయాన్ని ప్రేరేపించేవారు.**

ఉదా:– ఒక భక్తుడు ఒక అరగంట ఆలస్యమైనా సరే శ్రీస్వామివారి నిత్యపూజ తాను వచ్చేంతవరకూ ఆపాలని, తాను ఉన్నప్పుడు తానే స్వయంగా శ్రీస్వామివారి సమాధి పూజ చేయాలని అప్పుడప్పుడూ ఆదేశించేవాడు. నిత్యపూజను ఆ విధంగా ఆలస్యం చేయడం ఎంతవరకు ధర్మమో యోచించలేదు.

ఆ భక్తుని హృదయంలో శ్రీస్వామివారు ఏ చిత్రమైన ప్రేరణ పెట్టారో ఏమోగానీ అతడు తనకై తానే దూరంగా ఉండడం మొదలు పెట్టి, అలాంటి సేవలు మానుకున్నాడు; **ధర్మాధర్మాలు యోచించకుండా ప్రవర్తిస్తే మనపై కూడా శ్రీస్వామివారు తమ కత్తెర ప్రయోగం చేస్తారని గుర్తించి మెలగాలి.** 62

ఒకప్పుడు శ్రీస్వామివారి సేవకులు ఇద్దరు కలహించుకొని కలబడ్డారు. ఒకడు గొడ్డలి తీసుకున్నాడు. రెండవ సేవకుడు గొడ్డలి పీక్కొని అతని మెడపై కొరికాడు. అతనికి రక్తం కారి గ్రామంలోని పెద్దలకు చెప్పుకున్నాడు. వారంతా ఆ రక్తం చూచి అలా చేసిన వాణ్ణి ఆశ్రమం నుండి వెళ్ళగొట్టమని శ్రీస్వామివారికి విన్నవించారు. అప్పుడు **శ్రీస్వామివారు 'అయ్యా ఒకరిని పొమ్మనే కంటే మనమే పోతే మంచిది కదా?' అని సెలవిచ్చారు. ఈ ధర్మ తీర్పుతో అందరూ కిమ్మనకుండా జారుకున్నారు.** 63

1980 సం॥లో శ్రీస్వామివారికి గుణం వచ్చింది. చేతులు, తల ఎగురవేసేవారు. ఇంజెక్షన్ చేయించాలని డాక్టరును తీసుకువచ్చారు.

సేవకుడు : స్వామీ!
స్వామి : వచ్చాడాయ్యా?
సేవకుడు : ఇంజెక్షన్ చేస్తాడు స్వామీ!
స్వామి : ఎవరికి?
నాగయ్య : మీకే స్వామీ!
స్వామి : ఎందుకు?
నాగయ్య : గుణం తగ్గేందుకు స్వామీ.
స్వామి : తగ్గుతుందాయ్యా?
నాగయ్య : తగ్గుతుంది స్వామీ.
స్వామి : చేసుకోమను.

డాక్టరు ఇంజెక్షన్ చేశాడు. కాని శ్రీస్వామివారు ఏ మాత్రమూ చేయి కదల్చడంగానీ, బాధను వ్యక్తం చేయడంగానీ లేదు. మూడు రోజుల తర్వాత శ్రీస్వామివారు మరలా అన్నారు.

స్వామి : అయ్యా, సూదేశారే, తగ్గిందా అయ్యా!
నాగయ్య : తగ్గలేదు స్వామీ, మీరు తగ్గమని చెపితే తగ్గుతుంది.

స్వామి : అది ఎట్లా తగ్గుతుందయ్యా?

నాగయ్య : తగ్గుతుంది స్వామీ, మీరు చెప్పండి.

స్వామి : నువ్వు భలే మాట్లాడుతావయ్యా!

శ్రీ సాయినాథునివలె శ్రీస్వామివారు కూడా తమ రుగ్మతలకు మందులు సేవించక ఓర్పుతో అనుభవించేవారు. **సేవకులతో గూడా 'నొప్పి**
64 **ఎంత అనుభవిస్తే అంత మంచిది' అని చెప్పేవారు.** ఒక్కొక్కప్పుడు ఉడకబెట్టిన తెల్లగడ్డలు, కరివేపాకుపొడి, ధనియాల పొడి మొదలగు వాటిని తమ రుగ్మతలకు వాడేవారు. కొంతమంది రోగాలకు కొన్ని ఆకులు, వేళ్ళు చెప్పి తినమనేవారు.

రోశిరెడ్డి : స్వామీ! ఎల్లప్పుడూ తమరు మౌనంలో ఉంటిరే! మరి మాకు మంచి, చెడ్డ తెలిసేదెట్లా?

స్వామి : మూడు వందలు ఇస్తే సాదయ్య వచ్చి చెపుతాడు.

స్వామి : (మరొక రోజు అన్నారు) రోశిరెడ్డీ! పెద్దవాడివిగదా! ఎవరికైనా హెచ్చు తగ్గులుంటే చెప్పయ్యా!

గురవయ్య : స్వామీ, దేవుడెట్లా కనపడతాడు?

స్వామి : అందరినీ సమానదృష్టితో చూచుకుంటే దేవుడు కనపడతాడు.

గురవయ్య : మరొక రోజు ఇదే ప్రశ్న అడిగాడు.

స్వామి : వీరబ్రహ్మంగారి చరిత్ర చదువు అనుభవమౌతుంది.

ఇక్కడ శ్రీస్వామివారు తమ భక్తులను అనేక మంది మహనీయుల చరిత్రలను శ్రద్ధగా పఠించమని ఆదేశిస్తున్నారని మనం గుర్తించాలి. లేకుంటే తమను గురువుగా విశ్వసించి సేవించుకునే అతణ్ణి మరొక మహనీయుని చరిత్ర చదవమనడమెందుకు? అవధూతలందరికీ మూలపురుషుడైన శ్రీ దత్తాత్రేయ స్వామియే శ్రీస్వామివారి రూపంలో గూడ మనలననుగ్రహించి ఆ సాంప్రదాయముననుసరించి ఇలా ఆదేశిస్తున్నారు.

గురవయ్య ఏదైనా చెప్పమని అడిగితే, 'సంపన్నత్వం కల్గి సాధారణంగా నడచుకో. సత్యం, ధర్మం తప్పకుండా ఉండు' అన్నారు.

సంపన్నత్వమంటే సత్వగుణ ప్రధానమైన దైవీసంపద లక్షణాలు,

సాధారణత్వమంటే 'నాకు గొప్ప గుణములు గలవు' అనే అహంభావం లేకుండా శ్రీస్వామివారివలె అతి సాధారణ మానవునివలె నడచుకోవాలని శ్రీస్వామివారి ఆజ్ఞ. నిజానికి ఈ రెండు శ్రీస్వామివారు మనకు వారి ఆచరణ ద్వారా బోధించి చూపారు.

'కోపమెట్లాపోతుంది స్వామీ?' అంటే 'ప్రొద్దు పొడిచేది, క్రుంకేది తెలియకుండాపోతే పోతుంది' అన్నారు. అదే ప్రశ్న మరొకప్పుడడిగితే, 'సూర్యచంద్రులకు అర్ఘ్యి పెడితే పోతుంది' అన్నారట.

ఒకరోజు మోపూరు దశయ్య గన్నేరు పూలు కోస్తున్నాడు. శ్రీస్వామివారు అతనిని పిలిచి, 'ఒక్క పువ్వే గదయ్యా' అన్నారు. మరలా మాట్లాడలేదు. మనస్సు అనే ఒక్క పుష్పమే గదా భగవంతుడు కోరేది అని శ్రీస్వామివారు హెచ్చరించారని అతడు గుర్తించాడు.

భక్తుడు మనస్సునుగాని లేక హృదయాన్ని నిజంగా సద్గురువుకుగానీ, దైవానికిగానీ సమర్పించినపుడు అలా చేయడం ఒక్కసారి మాత్రమే సాధ్యం. అందుకు సంకేతంగా ఒక్క పువ్వు చాలని శ్రీస్వామివారి భావం. పూజకోసం అధికంగా తులసి కోస్తున్న భక్తురాలితో ఈ విషయాన్నే శ్రీరమణమహర్షి ఎంతో చమత్కారంగా చెప్పారు. అలానే శ్రీసాయిబాబా మరలా నమస్కరించ బోయిన ఒక భక్తునితో 'నీవు హృదయపూర్వకంగా చేసిన ఒక్క నమస్కారమే చాలు' అని హెచ్చరించారు.

ఒక భక్తురాలు ప్రజలకు వడ్లు అరువుగా ఇచ్చి 'నాము' అనే పేరుతో అధికంగా లాభం గడించేది. ఒకప్పుడు ఆమె ఇల్లు కాలిపోయింది. ఆ ప్రమాదంలో చాలా ధాన్యం గూడా నష్టమైంది. కాని ప్రక్కవారి సహాయంతో కొంత ధాన్యమైనా దక్కించుకోగల్గింది. అయినప్పటికీ నష్టమైన దాన్ని గురించి ఆమె బాధపడుతూనే ఉండేది. ఒకసారి ఆమె శ్రీస్వామివారిని దర్శించి 'స్వామీ, ఇల్లు తగులబడి సర్వనాశనమైంది' అని విలపించింది. 'అమ్మా, లాభమే పోయింది. అసలు దక్కింది గదా?' అన్నారు శ్రీస్వామివారు. నిజానికి ఆ గ్రామస్థులు 8 పుట్ల గింజలను ఆ అగ్ని ప్రమాదం నుండి తప్పించి బయటపోశారనీ, మిగిలిన సామానులు, వడ్లు తగలబడినాయని ఆమె అంగీకరించింది. అన్యాయార్జితమైన ధాన్యం అగ్నిపాలయింది. అందుకే

శ్రీస్వామివారు 'వడ్డీ విషయంలో కూడా ధర్మంగా వుండాలయ్యో' అని సెలవిచ్చారు.

కోడూరు వెంకమ్మగారి భర్త చనిపోయిన దిగులుతో మంచం బట్టి అహర్నిశలూ శోకిస్తూన్నది. శ్రీస్వామివారు తమ చిత్రమైన తత్వబోధతో ఆమె శోకాన్ని నివారించారు.

'అమ్మా, ఒక మామిడి పండుకు పుండు పడితే అది ఎంత ఫలింపు అవుతుందమ్మా? వరుటుబారి, కుళ్ళి ఎందుకూ పనికి రాకుండా పోతుంది. ఆ పండు ధైర్యంగా ఉండి ఆ పుండును లెక్క చేయకుంటే ఆ పుండు దాన్నేమీ చేయలేదు. పండు మధురంగా తయారై ఎన్నో కాయల్నిస్తుంది. అది ఎన్నోసార్లు ఇలాంటి చెట్లు అయిన తరువాత మనిషవుతుంది. ఇలా మనిషిగా ఎన్నోసార్లు జన్మించాక కాస్త బుద్ధిగలవాడౌతాడు. అలాంటి బుద్ధిగలవాడుగా ఎన్నోసార్లు జన్మించాక ఒక జన్మలో భక్తుడవుతాడు. తర్వాత అలాంటి జన్మలెన్నో అయ్యాక ఒక జన్మలో ధర్మంగా పరిపాలించే రాజవుతాడు. అట్లాంటి రాజుగా ఎన్నో జన్మలెత్తిన తర్వాత దేవుని కొరకు పాటుపడుతాడు. అలాంటి ముముక్షు జన్మలు ఎన్నో గడిచాక దేవుని సన్నిధిలో ఉంటాడు. అప్పుడు దేవుడు తన కన్ను కొద్దిగా తెరచి భక్తుని చూస్తాడు. ఆయన తన బొటన వ్రేలు క్రింద ఉండే అల్లెతాడు త్రొక్కితే ప్రపంచంలో ఉండే బొమ్మలాటంతా అతడికి కన్పిస్తుంది. అప్పుడు దేవుడు అతనిని తనలో చేర్చుకుంటాడు'. అది విని వెంకమ్మ, 'ఇప్పటికే ఇన్ని జన్మలు ఎత్తి ఎన్నో బాధలు పడుతున్నాను. ఈ కొంచెం బాధలు ఒక లెక్కా? ధైర్యంగా మామిడిపండువలె వుండాలని' అనుకొని, అది మొదలు ఏడ్చేది కాదు.

**పని చేయకుంటే ఉద్యోగం నష్టం. పనిచేయకున్నా జీతం రావచ్చు. కానీ అది దక్కదు (నష్టపడతావని భావం). కష్టం చేస్తూనన్నా ఉండు. దేవుని ధ్యానం చేస్తూనన్నా ఉండు. రోగంతో మూలుగుతూనన్నా ఉండు.**
65 **దరిద్రంతో బాధపడుతూనన్నా ఉండు (ఈ నాలుగు దశలలోను మానవునకు నిరంతరం దేవుడు గుర్తు వస్తుంటాడని కాబోలు శ్రీస్వామివారు అలా చెప్పారు). అంతేగాక కష్టం చేస్తున్నా, రోగంతో మూలుగుతున్నా, దరిద్రంతో బాధ పడుతున్నా కర్మశేషం ఖర్చవుతుంటుంది. ధ్యానం చేస్తుంటే క్రొత్తగా కర్మ సంక్రమించదు.**

ఒక భక్తుడు తరుచుగా శ్రీస్వామివారి దర్శనార్థం వస్తూ తనకు శ్రీస్వామివారి రక్షణ ఉందనే ధీమాతో ఆఫీసు పని బాగా నిర్లక్ష్యం చేసేవాడు. పై అధికారిని గూడా లెక్క చేసేవాడు కాదు. ఒకరోజు శ్రీస్వామివారు అతని స్వప్నంలో "what do you mean by negligence of duty, bloody idiot". **(బుద్ధి లేని వాడా! విద్యుక్త ధర్మాన్ని అశ్రద్ధ చేయడమంటే ఏమనుకుంటున్నావ్) అని తీవ్ర స్వరంతో మందలించారు. ఆ భక్తుడు** 66
**'స్వామీ, మీకు ఇంగ్లీషు కూడా వచ్చా' అన్నాడు. 'ఇంగ్లీషేమిటి ప్రపంచ భాషలన్నీ వచ్చు' అని మందలించారు శ్రీస్వామివారు. తమ భక్తులను పాపభారము నుండి ఎలా కాపాడుతారో చూడండి.**

నిరంతరం తన సేవలో నున్న గురవయ్యతో అన్నారు, 'మాల, మాదిగ, జోగి, జంగంవాళ్ళు చేరకుండా చూచుకో. సత్యం, ధర్మం, సాధారణత్వం, సద్గురుసేవ సాధించు'. ఇది "మనలో ఒక హీనజాతి వాడున్నాడు వాణ్ణి వెళ్ళగొట్టాలి" అన్న శ్రీసాయి ఆదేశం వలె ఉంది!

మాల, మాదిగ, జోగి, జంగం అంటే మనలోని దుర్గుణాలని శ్రీస్వామివారి భావం.

ఒకసారి శ్రీస్వామివారు గురవయ్యతో అన్నారు 'తప్పుచేస్తే వద్దిదొండ పురుగులు పడతాయి. మాదిగ ఇండ్లలో పుడతారు'. ఇక్కడ మాదిగ అన్నది ఈనాటి వర్ణ వ్యవస్థలో జన్మవలన వచ్చే వర్ణవిశేషం గురించి కాదని గుర్తించాలి. 'మరలా ఎన్నో జన్మలకు కూడా నా దగ్గరకు రాలేరు' అని కూడా అనేవారు శ్రీస్వామివారు.

దశయ్య : తరించే దెట్లా స్వామీ?

స్వామి : **ఆశపోతే అంతా పోతుండ్లాయ్యా!** 67

అమ్మ : స్వామీ! మిమ్ములను తెలుసుకునేదెట్లా?

స్వామి : అమ్మా, భద్రాచలం పోయి గర్భగుడి తెరిచి చూడు తెలుస్తుంది.

మరి అమ్మ అలా చేసిందో లేదో తెలియదు. ఇదే విధంగా అడిగిన చల్లా సుబ్బమ్మతో కోటితీర్థం దేవాలయం మీద చూడమన్నారు. ఆమె అలాగే చేసింది. **ఆమె కచ్చట అనంతమైన వెలుగు దర్శనమైంది. పార్వతీదేవి**

**ప్రకృతి మాత గదా. 'పరబ్రహ్మ స్వరూపుడనైన నేనే ఈ దృశ్య జగత్తుగా**
68 **ప్రకటమౌతున్నాను. అన్నింటిలో అంతటా నన్నే భావన చేయమ'ని బోధించారన్నమాట.**

ఒకప్పుడు మోపూరు దశయ్య 'స్వామీ, మీకు అడవిలో ఎవరో ఒక ఋషి కనపడి నాలుక మీద బీజాక్షరాలు వ్రాశారని చెపుతున్నారు నిజమేనా?' అని అడిగాడు. **"మైసూరు మహారాజు త్రోవన పోతుంటే మనం చూస్తే**
69 **మనకేమి వస్తుంది? మనం చేసుకున్నదే గదా మనకు?"** అని శెలవిచ్చారు శ్రీస్వామివారు. అంటే దాని అర్థం మనకు అవకాశమున్నంత వరకు **జపధ్యానాలు, ధర్మాచరణ, సద్గురు సేవ చేస్తూంటేగాని మహారాజు వంటి మహాత్ముని అనుగ్రహం మనకు లభించదు. మనము అట్టి సాధన చేసి**
70 **పరిపాకాన్ని పొందితే అట్టి ప్రతిభావంతులను మహారాజు ఆహ్వానించి తన ఆస్థాన పండితులుగా నియమించుకున్నట్లు ఎవరో ఒక మహనీయుడు మనలననుగ్రహిస్తారని శ్రీస్వామివారి భావం.**

రాజు సర్వశక్తిమంతుడు, సర్వస్వతంత్రుడూ అయినా కష్టించి ప్రతిభను సంపాదించుకున్న వారిని తప్ప మిగిలిన వారిని చేరదీసి సత్కరించడు. శ్రమపడి సాధన చేస్తేనే శ్రీస్వామివారు కృప చూపుతారని గుర్తించాలి.

వెంకయ్య ద్వారా ఒకరు శ్రీస్వామివారికి కట్టెలు తోలినందుకు బండి బాడుగ రూ॥ 4/- తీసుకొని మరలా వెంకయ్య చేత వరికుప్ప దగ్గర ఉచితముగా పని చేయించుకున్నాడు. ఆ బండివాడు స్వామి చెంతకొస్తే ఎవరూ ఏమీ చెప్పకనే శ్రీస్వామివారు "అయ్యా, ఈయన బండాయనా? ఈయన మనకు రూ॥ 150/- బాకీ తేలినాడు. అందుకు అపరాధంగా తిరుపతి పోయిరావాలి" అని వ్రాసి ఇచ్చారు. అతడు అట్లాగే తిరుపతి పోయాడు. బండాయన అపరాధం శ్రీస్వామివారి డబ్బులు అలా దొంగలించడమే. **శ్రీస్వామివారి సేవకులు సాక్షాత్తు భగవంతుని సొత్తు. వారి ఋణం భగవంతునికిగానీ,**
71 **వారి గురువుకుగానీ, ఆ సేవకునికిగానీ చెల్లించకుంటే ఆ ధనం నష్టమై తీరుతుంది.**

శత వృద్ధుడు రోశిరెడ్డి చాలా కాలంగా శ్రీస్వామివారి సేవలో ఉన్నాడు. ఒకప్పుడు ఎవరో ఏమో అన్నారని ఇతడు ఇంటికి వెళ్ళాలనుకున్నాడు.

ఆయనను శ్రీస్వామివారు ఏకాంతంగా పిలిచి **"పంటచేను వదిలి పరిగ ఏరుకుంటావా?" అని హెచ్చరించారు. అతడా సంకల్పం విడిచి పెట్టాడు.** 72
సద్గురు సాన్నిధ్యం పంటచేను, సామాన్యంగా జీవిస్తూ ఇతర సాధనలు చేయడం పరిగ ఏరుకోవడం లాంటిదని గుర్తించి చివరి శ్వాస వరకు భిక్షాన్నం తెచ్చే గురుసేవ చేసి తన జీవితం ధన్యం చేసుకున్నారు.

1. **రోశిరెడ్డి గారి యొక్క నిస్వార్థమైన గురుసేవా ప్రభావము వలన వారికి ఆశాపాశములు, బంధుప్రీతి తనవారి పైననేగాక చివరకు** 73
**తన శరీరం మీద కూడా మమకారం లేకుండా చేశారు శ్రీస్వామివారు. ఇలా స్వయంకృషితో సాధించడం దుస్సాధ్యమని సాధకుల అనుభవం.**

2. హృదయాంతరాళములో అంతటి ప్రేమతో తన గురుని సేవించాడు గనుకనే ప్రారబ్ధ కర్మవశాత్తు సంభవించే వృద్ధాప్య శరీర రుగ్మతలు లేకుండా చేశారు శ్రీస్వామివారు.

3. అత్యవసర విషయములలో ఏ వ్యక్తి ఎలాంటివాడు అనే విషయముగానీ, ఎచ్చట ఏమి జరుగుచున్నది అనేది గానీ శ్రీస్వామివారు వీరికి దృశ్య సంకేతములతో చూపేవారు.

ఉదాహరణకు ఒకరోజు రోశిరెడ్డిగారి ఇంటి దగ్గర గాలివానలో వారు తంటాలు పడుతూ చేస్తున్న సజ్జమాసూలు, డబ్బు అవసరమైనందున పిందెలుగా ఉన్న మంచి నిమ్మకాయలు కోసి రాశిపోయడం శ్రీస్వామివారి సన్నిధిలో ఉన్న రోశిరెడ్డికి దృశ్యంగా కనబడసాగింది. మూడవరోజు ఇతని కుమారుడు వచ్చినపుడు విచారిస్తే రెండు విషయాలూ నిజమేనని తేలాయి.

శ్రీ భరద్వాజ మాస్టర్‌గారిని అందరూ దేవుడు, గురువు అని పూజిస్తున్నారు. వీరి అసలు స్థితి ఏమిటా అని మనసులోనే మదనపడుచున్న రోశిరెడ్డికి ఒక దృశ్యం గోచరించింది. మాస్టరుగారు ఒక ఎడారిలో నిలబడియున్నారు. ఉన్నట్లుండి వారు శంఖుచక్రాలు ధరించి మహావిష్ణువయ్యారు. వారి పాదాలు చుట్టూ మంచి నవనవలాడే పచ్చగడ్డి ఉంది. రోశిరెడ్డి ఒక దున్నపోతుగా మారి ఆ గడ్డి మేస్తున్నట్లు దృశ్యం గోచరించింది. ఇదే విధంగా మరియొక వ్యక్తిని గూర్చి యోచిస్తుంటే ఆ వ్యక్తి చెడిపోయిన తాళాల బుర్రలు రిపేరు చేస్తున్నట్లు చూపారు. అంటే ఆ వ్యక్తి

అందరి లోపాలు సరిచేయగల సమర్థుడని శ్రీస్వామివారు వీరికి బోధించారన్నమాట.

ఒకరోజు రోశిరెడ్డిగారి అల్లుడు, కుమారుడు ఆయనను పది రోజులు తన ఇంటికి తీసుకుపోవాలని స్వామివారి ఆశ్రమానికి వస్తున్నారు. అప్పుడు ఆయనకు చూపు సరిగా లేనందువలన ఒంటరిగా ఎక్కడికీ పోలేకున్నాడు. కానీ శ్రీస్వామివారు అతనిని, "త్రోవ పట్టుకొని నేరుగాపో!" అని ఆజ్ఞాపించారు. గుర్వాజ్ఞయందు అచంచల విశ్వాసంగల రోశిరెడ్డి తనకు చూపు కనబడని విషయం కూడా లెక్క చేయకుండా ఎనిమిది కిలోమీటర్లు నడిచి నెల్లూరు నుంచి గొలగమూడికి ఒంటరిగా వచ్చేశాడు. అల్లుడు, కుమారుడు బస్సులో ఈయనకంటే ముందుగా గొలగమూడి చేరి రోశిరెడ్డి కోసం విచారించారు. కానీ నడిచి వస్తున్నందున రోశిరెడ్డి మార్గమధ్యంలో ఉన్నాడు గనుక ఆశ్రమంలో లేడు.

ఒకరినొకరు కలవనందున ఇక రోశిరెడ్డిని వెతికి పట్టుకోవటం కష్టమని వాళ్ళు తిరిగి ఇంటికి వెళ్ళిపోయారు. సర్వజ్ఞులైన శ్రీస్వామివారు అలా ఆదేశించకుంటే తన కుమారుడు, అల్లుడు చెప్పే మాటలకు మెత్తబడి ఇంటికి ప్రయాణమై, **పరిగ ఏరుకోవడం లాంటి లంపటంలో పడకుండా**
74 **గురుసేవలో సమయాన్నంతటినీ గడపడమే త్రోవ పట్టుకొని పోవడమని శ్రీస్వామివారి మాటలకర్థం.** మరొకప్పుడు ఒక భక్తుడు "ఎలా స్వామీ, మేము తరించేది?" అని అడిగితే గూడా శ్రీస్వామివారు, "ఏముందయ్యా, నేరుగా త్రోవ చూచుకుంటూ పోయేదే గదయ్యా" అన్నారు.

పై విధంగా గురువు మాట యందు అచంచలమైన విశ్వాసంతో, గురుసేవే తన ధ్యేయంగా జీవించారు గనుకనే వీరి అంత్య దశలో మంచాన పడడం ఇతరుల సేవ తీసుకోవలసిన అవసరం లాంటివి లేకుండా చేశారు శ్రీస్వామివారు. **వీరు పరమపదించినప్పుడు వీరి ముఖంలోని కళ,**
75 **శరీరంలోని తేజస్సు వలన వీరు తప్పక కైవల్యం పొందారని తెలుస్తుంది. గురుసేవా ప్రభావమంతటి మహిమాన్వితమైనది గదా!**

ఒకనాడు శ్రీస్వామివారు, "వెంటనే మజిలీ మార్చాలి పదండి" అన్నారు. సేవకులు "ఇప్పుడు కాదు. సాయంకాలం కానీ లేక భోంచేసిన

తరువాత గానీ పోదాము” అని చెపుతూ తలా ఒక త్రోవన వెళ్ళుతున్నారు. శ్రీస్వామివారి సమీపంలో ఉన్న బరిగెల నాగయ్య “వీళ్ళు శ్రీస్వామివారి దగ్గరకు వచ్చింది దేనికైనట్లు? శ్రీస్వామివారు చెప్పినట్లు వినరు. వీళ్ళు ఇలా తలా ఒకవైపు వెళ్తుంటే స్వామి అదేమని గదమాయించి అడుగరు! ఇది ఏమిటబ్బా?” అనుకున్నారు. ‘‘ఇలా చేయండని’’ సలహా ఇస్తారేకానీ మహాత్ములు
నిర్బంధించరు. వినకపోతే మన కర్మకు మనల్ని వదిలేస్తారు. **మనం తప్పులు**
**చేస్తూ, “అన్నీ శ్రీస్వామివారే చూచుకుంటారు” అని అనుకోవటం అవివేకం.** 76
**నిజానికి అన్నీ ఆయనే చూస్తారు. ఎవరేమి చేసుకుంటే దానికి తగ్గ ఫలితం నిష్పక్షపాతంగా వద్దన్నా ప్రసాదిస్తారు. మంచికి మంచి, చెడ్డకు చెడ్డ!**

నెల్లూరు వాస్తవ్యులు తాళ్ళూరి శ్రీనివాసులు మేళం వాయించేవాడు. శ్రీస్వామివారు మహాసమాధి చెందినప్పుడు ఆటోరిక్షా రూ။ 25/- లకు మాట్లాడుకొని, మేళం వాయించడానికి గొలగమూడి వచ్చాడు. డ్రైవరు ఆశ్రమం వారితో అబద్ధం చెప్పి రూ။ 5/- ఎక్కువ తీసుకున్నాడు! అతడిలా చేశాడని శ్రీనివాసులుకు తెలిసింది. తిరుగు ప్రయాణంలో ఆటోరిక్షా ఒక ఫర్లాంగు పోయి అకారణంగా ఆగిపోయింది. ఎంత ప్రయత్నించినా కదలలేదు. శ్రీనివాసులు ఆటో డ్రైవరుతో, “నీవు అబద్ధం చెప్పి శ్రీస్వామివారి డబ్బు రూ။ 5/- లు ఎక్కువ తీసుకున్న ఫలితంగా నీకిలా జరిగింది. ఇక ఇలాంటి తప్పు చేయనని చెంపలు వేసుకుంటే ఆటో కదులుతుందని” చెప్పారు. ఆటోవాడు అలా చెంపలేసుకున్న మరుక్షణమే ఆటో కదిలింది!

శ్రీస్వామివారు తమకు సన్నిహితంగా సేవచేసేవారిని, శ్రద్ధావంతులైన భక్తులను సాధ్యమైనంత వరకూ కేవలం లౌకికులైన జనంతో కలవడం తగదన్నట్లు సూచనగా హెచ్చరించేవారు. ఉదాహరణకు:

ఒక భక్తుడు కొంతకాలం వారిని సన్నిహితంగా సేవించి తర్వాత అతి చనువు వలన వారిపట్ల శ్రద్ధతగ్గి అవకాశ మొచ్చినప్పుడల్లా పామరులతో కలసి తిరగడమారంభించాడు. అంతకుముందు అతడు నివేదిస్తేనేగాని భోజనం చేయని శ్రీస్వామివారు తర్వాత అతడు పెడితే స్వీకరించక, “ఆయన మనుషుల్లోకి పోయాడయ్యో! ఆయనొద్దు, నువ్వు పెట్టు” అని మరొక సేవకుని కోరనారంభించారు. మొదట్లో తెలియక సన్నిహిత సేవకుడైన గురవయ్య

ఎప్పుడైనా వారి సన్నిధి విడిచి దూరంగా వెడితే "నువ్వుకూడా మనుషుల్లోకి పోతుండ్లాయ్యా?" అని మందలించేవారు.

**అంటే "మనుషుల" సాంగత్యం ముముక్షువునకు తగదని వారి**
77 **హెచ్చరిక. అరిషడ్వర్గయుక్తుడు, విషయ వాంఛాసక్తుడు గనుక "మనిషి" పరమలౌకికుడు అని శ్రీస్వామివారి భావం.**

**కనుక మనమిపుడు దీక్షా సమయంలో కానీ, ఇతర సమయములలో గానీ శ్రీస్వామివారిని ఎలా సేవిస్తే వారు సంప్రీతులౌతారో గుర్తుంచు కొనవలసియున్నది. ఇతరులను గూర్చి దుర్విమర్శలు చేయుట, ఊసుబోని రాజకీయములు చర్చించుట, ఎప్పుడో, ఎక్కడో జరిగిపోయిన విషయములను**
78 **గూర్చి మననము చేయుట మొదలగువన్నీ శ్రీస్వామివారి దృష్టిలో మన కంటుకునే మలినాలే. అది అంటుకున్నాక ఎన్నిమార్లు స్నానం చేసినా ఆ మైల మనలనొదలదని శ్రీస్వామివారు తన ఆచరణ ద్వారా చూపించి బోధించారు.**

మోపూరు దశయ్య (పెనుబర్తి) : "స్వామీ, మీరు కొండలలో అడవులలో తిరుగుతుంటారు. మిమ్ములను చూడాలంటే వీలుపడడంలేదు. ఎట్లా స్వామీ?" అన్నాడు. "అబ్బే అదేముందయ్యా? కొండమీద ఎక్కి బోటురాయి మీద అద్దంపెట్టి, నేరుగా చూస్తే మీకు మాకు దూరం బెత్తెడే గదయ్యా?" అన్నారు.

కొండంటే శరీరంలో పై భాగమైన మెదడు. బోటురాయి మీద అద్దంలో చూడడమంటే లౌకిక వ్యవహారాలలో కొట్టుమిట్టాడే మనస్సును వాటి కతీతంగా కొంచెంసేపు అద్దంవలె శుభ్రంగా, నిశ్చలంగా నిలిపితే శ్రీస్వామివారు ఎక్కడున్నా మన మనోనేత్రంతో చూడగలమని శ్రీస్వామివారి భావం. మన శరీరంలో బోటురాయివంటిది మాడు. దానిపైన సహస్రారమనే యోగ కేంద్రముంటుందని, **దానిలోనే శ్రీ గురుచరణాలుంటాయనీ శాస్త్రం.**
79 **అందుకే శ్రీస్వామివారు, "మీకూ మాకూ బెత్తెడే గదయ్యా?" అన్నారు. అంటే శ్రీస్వామివారు తాము సద్గురువునని మనకు తెలిపినట్లే!**

80 **"మీరు మమ్ములను చూస్తే మేము మిమ్ములను చూస్తాంళ్యాయ్యా!"** అన్నారు మరొకప్పుడు. సద్గురువులపై భక్తులెంత శ్రద్ధాభక్తులతో తమ దృష్టిని నిలుపుతారో అంతమేరకు సద్గురువుల కృపాదృష్టి వారికి లభిస్తుంది. అందుకు

శ్రీ సాయిబాబా “నీ దృష్టి నాపై నిలుపు, నా దృష్టి నీపై నిలుపుతాను” అన్నారు.

మరొకప్పుడు శ్రీస్వామివారు తమ బృందంలో వారినుద్దేశించి అన్నారు, “మీరు మాలోళ్ళు నేను మాదిగవాణ్ణి”.

శ్రీ అక్కల్ కోటస్వామి ఒకవంక తాను కాశ్యపస గోత్రానికి చెందిన యజుర్వేద బ్రాహ్మణుడనని ఒకరితోనూ, తాము మాలవారమని, తమ వృత్తి తోళ్ళపని అని మరొకరితోనూ చెప్పినట్లు వారి చరిత్రలో చూడవచ్చు. ఈనాడు గుడ్డిగా ప్రజలు అంటి పెట్టుకొనే వర్ణ వ్యవస్థ ఎంత అర్థరహితమో తెల్పడమే మహనీయుల లక్ష్యం.

గురువాజ్ఞను పాటించక సాధన చక్కగా చేయక కలహించుకొనే సేవకులనుద్దేశించి శ్రీస్వామివారు ఒకప్పుడన్నారు. “నిర్భాగ్యులు, ముండలు, రండలై ఉన్నారు. అంతా అప్పు, బాకీ చేస్తున్నారు. అర్దణా సంపాదిస్తున్నారా?” అన్నారు. **సకల సృష్టికీ, ప్రతి జీవికీ, ఆధారమూ, ఆత్మస్వరూపమూ అయిన** 81
**సద్గురువును మరచి అన్య భావాలకు తావివ్వడాన్ని రూపకాలంకారంగా పాతివ్రత్యభంగమన్నట్లు శ్రీస్వామివారు సూచించారు.**

ఒకరోజు దొంగతనం విషయమై ప్రస్తావన వస్తే శ్రీస్వామివారు “పావలాకు పదిరూపాయలు పోతుండ్లాయ్యా” అన్నారు అంటే ఒకటికి నలభైరెట్లు నష్టపోతారన్నమాట. **మరి దైవానికి భక్తితో సమర్పించిన** 82
**పావలాకు మరి ఎన్నిరెట్లు మేలు పొందుతారో మనం ఊహించవచ్చు.** శ్రీస్వామివారికి సమర్పించిన ప్రతి చిన్న సేవకు అనంతమైన పుణ్యఫలాన్ని మనకు ప్రసాదిస్తారని ఈ క్రింది సంఘటన తెలుపుతుంది.

ఒక రైతు క్రొత్తగా కొన్న గిత్తను కాడి కట్టి మరుపుతున్నాడు. కానీ అది బెదిరి చాలా బాధపెడుతూవుంది. శ్రీస్వామివారు ఆ మార్గమున పోతూ “అయ్యా బండి కట్టి నన్నా యేరు కాస్త దాటించు” అని అడిగారు. ఆ రైతు “స్వామీ ఇది ఇంకా కాడి మరగలేదు. బెదురుతుంది నాకు ఇది తప్పితే ఇక ఎద్దు లేదు” అని విన్నవించాడు. “అది బాగా లాగుతుందయ్యా! నీకెందుకు? బండి కట్టు చూస్తాం” అని అన్నారు. శ్రీస్వామివారి మీద భారం వేసి బండి కడితే మోకాటిలోతు బురదలో ఏమీ వెనుకాడకుండా సునాయాసంగా లాగడమే కాకుండా అది మొదలు బాగా అలవాటు పడిన ఎద్దులాగా సేద్యపు పనులన్నీ

చేయసాగింది. **శ్రీస్వామివారి కార్యానికి శ్రమపడినందున రైతుకు శ్రమ,**
83 **ఎద్దుకు దెబ్బలు తప్పిపోయాయి. ఆ చిన్న సేవకు ఆ రైతును ఆజన్మాంతము కాపాడుతారు శ్రీస్వామివారు.**

మంత్రోపదేశం కోరిన ఒక భక్తునితో శ్రీస్వామివారు, "మంత్రమెక్కడుంది, తంత్రమెక్కడుందయ్యా? చూచుకుంటూ పోయేదేగదా?" అన్నారు. జ్ఞానపూర్ణులైన సద్గురువులెవ్వరూ మంత్రోపదేశాలు చేయలేదు.
84 సాయిబాబా, రమణమహర్షి ఉదాహరణలు. కారణం **నిరంతరమైన సద్గురు భక్తి సకల సాధనలకూ అతీతమైనది, తిరుగులేనిది.**

శ్రీస్వామివారు ఒకరోజు గురవయ్యతో చెప్పారు "అంతటా సమానంగా చూచుకుంటే దేవుడవుతావు". ఒకరోజు రోశిరెడ్డితో చెప్పారు **"వసద్ది చేసుకుంటే రెండక్షరాలు చాలయ్యా" అని. వసద్ది చేసుకోవడమంటే**
85 **సాధనద్వారా మనలోని రాగద్వేషములు, రాజస, తామస గుణములు నిర్మూలించుకొని దైవీసంపదలో నెలకొంటే ఏ మంత్రంతోనైనా తరించవచ్చని శ్రీస్వామివారి భావము.**

86 **శ్రీస్వామివారు సమాధి చెందేందుకు 6 నెలల ముందు నుంచి "సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురు సేవ" అని చాలా రోజులు కేకలేస్తూనే వున్నారు. కనుక ఇది వారి సాంప్రదాయమని, వారి చరమోపదేశమనీ మనం గుర్తించాలి.**

87 **"అయ్యా ఈ కనబడేదంతా నిజమనుకుంటున్నారా?" అన్నారు ఒకప్పుడు. నామరూపాల భేదభావం వదలి అన్నింటిలోనున్న భగవత్‌తత్వాన్ని గుర్తిస్తూండమని శ్రీస్వామివారు హెచ్చరిస్తున్నారు.**

ఒకనాడు నెల్లూరు నుండి ఒక రెడ్డిగారు జబ్బుతో బాధపడుతూ వచ్చాడు. అతడి పైసలు వదిలాయేగానీ డాక్టర్ల వల్ల నయంకాలేదు. శ్రీస్వామివారు పలక లేదు. అతడు సేవకులతో "నా జబ్బు నయం చేస్తే
88 చాలా డబ్బు ఇస్తాను" అన్నాడు. శ్రీస్వామివారు **"ఏమిటయ్యా ఆయననేది? అందరికీ మనమిస్తుంటే ఆయనేంది మనకిచ్చేది?" అన్నారు. నిజానికి అందరికీ అన్నీ ఇచ్చేది ఆ భగవంతుడే గదా!**

ఒకసారి శ్రీస్వామివారు ఇలా అన్నారు "ఆరు నాగళ్ళు గొట్టు కట్టి

నేనూ, జయరామరాజు దున్నుతున్నాము. జయరామరాజు గొఱ్ఱు ఉదయగిరి కొండకు తగిలి ఆగిపోయింది. నా గొఱ్ఱు మాత్రం ఆగకుండా సాగింది. ఉత్తర సముద్రం నీళ్ళు దక్షిణ సముద్రానికి పారాయి." ఆరు నాగళ్ళ సేద్యం అంటే అరిషడ్వర్గాల నరికట్టే సాధన. సముద్రాలు ఏకం కావడమంటే అంతా పరబ్రహ్మమని అనుభవమవటం కాబోలు. **జయరామరాజు తన సాధన నిలిపి** 89
**లౌకిక జీవితంలో చిక్కుకోవడమే ఆయన గొఱ్ఱు నిలిచిపోవడం కాబోలు.**

**శ్రీస్వామివారు శ్రద్ధా భక్తులు గలవారు, లేనివారు అనే భేదం** 90
**చూపేవారేగాని, ధనికులు–పేదవారనే భేదం యేనాడూ చూపేవారు కాదు. భక్తిగల చోటుకు తమను ఆహ్వానించకున్నా, నిరుపేదలైనా వారి వద్దకు వెళ్ళేవారు. ధనమదాంధులై భక్తి లేకుండా బంగారం పెడతామన్నా శ్రీస్వామివారు వెళ్ళేది లేదు.**

శ్రీస్వామివారికి నిరంతరం సేవచేస్తుండిన శిష్యులు తాము గమనించిన విశేషాలను ఇలా తెలిపారు.

**శ్రీస్వామివారు తమకు పరిచర్య చేసే వారిలో ఏ చెడు** 91
**అభిప్రాయమున్నా, అన్యచింతలు, పరదూషణ, కోపము వున్నా వారి సేవను అంగీకరించేవారు కాదు. ప్రతిరోజు పొగాకు వారిచేత పెట్టించుకునే శ్రీస్వామివారు అలాంటి సమయాలలో మరొకరి నడిగేవారు.**

ప్రతిరోజు శ్రీస్వామివారికి జావపోసే భక్తుడు కోనేటికి స్నానానికి వెళ్లి, సాటి భక్తులు కొందరిపై దుర్విమర్శలు చేయగా విని వచ్చాడు. శ్రీస్వామివారికి జావపోయబోతే, **"చెప్పుడు మాటలు వినివచ్చావు. నీవు** 92
**పోసే జావవద్దు" అని నిరాకరించారు. శ్రీస్వామివారి సమాధి దర్శనార్థం వచ్చి వారిని సేవించే భక్తులు ఎలా సేవించాలో ఇచ్చట గమనించ ప్రార్థన.**

1975వ సంవత్సరం వరకూ ఎన్నడూ భక్తులు సమర్పించిన క్రొత్త బట్టలు శ్రీస్వామివారు స్వీకరించలేదు. పాత గుడ్డలు, చినిగిపోయిన పాత దుప్పట్లు మాత్రం స్వీకరించేవారు. తమ సేవకులు తీసుకున్నా వప్పుకొనేవారు కాదు.

ఒకప్పుడొక శ్రీమంతుడు ఖరీదైన దుప్పటిని బలవంతంగా శ్రీస్వామివారి చెంత ఉంచి వెళ్ళాడు. స్వామి సేవకులు దానిని తీసుకున్నారు. సిద్ధలయ్యకొండ దగ్గర ఏమీ ఎరుగనట్లు "అయ్యా! ఒక క్రొత్త దుప్పటి కావాలి"

అని అడిగారు శ్రీస్వామివారు. **సేవకులా క్రొత్త దుప్పటి తెచ్చి ఇస్తే దాన్ని**
93 **జానెడు జానెడు పేలికలు చేసినదాకా ఆయన ఒప్పుకోలేదు. "అయ్యా! ఈ పేలికలు జబ్బులవాళ్ళకివ్వండి జబ్బులు పోతాయి" అన్నారు.**

గోతపు సంచులు, తాటాకు దొన్నెలు, తాటాకు చదరలు, మట్టి పాత్రలు అల్యూమినియం దబరలు మాత్రం వాడేవారు. విలువగల వస్తువులు తమవద్ద ఉండనిచ్చేవారు కాదు. ఒకొప్పుడొక శ్రీమంతుడు ఖరీదైన జిప్‌బ్యాగ్‌ను వద్దన్నా వినకుండా శ్రీస్వామివారి చెంత ఉంచి వెళ్ళాడు. **దానిలో సేవకులు తమ**
94 **గుడ్డలు పెట్టుకున్నారు. అర్ధరాత్రి అందరూ నిద్రలో ఉండగా శ్రీస్వామివారు పరిగాడుతూ పోయి ఆ బ్యాగ్‌ను ధునిలో కాల్చేశారు. (వైరాగ్యం)**

ఒకసారి జోరున వర్షం కురుస్తున్నది. శ్రీస్వామివారు చెట్టు క్రింద కూర్చుని అగ్నిని సంరక్షిస్తున్నారు. వాన నీరు చెట్ల ఆకులలో నుంచి పడడం వలన ఒక ప్రక్క నుంచి మంట చల్లారుతూంది. కానీ శ్రీస్వామివారు ఓర్పుగా మరొక పక్క నుంచి చితుకులు వేసి మంటను రగులుస్తున్నారు. ఆయన పడుతున్న అవస్థను చూచి భక్తులు, "స్వామి! ఎందుకీ శ్రమ? మీరు దేవాలయం పంచలో అగ్ని వేసుకుంటే సరిపోతుంది గదా!" అన్నారు. శ్రీస్వామివారు, "అయ్యా! బొక్క పడుతుందిగా?" అని క్లుప్తంగా సమాధానమిచ్చారు. భక్తులకామాటలు అర్థం కాలేదు. ఆయన ఆ శ్రమకు వెరచి తమ నియమాన్ని ఉల్లంఘిస్తే స్వధర్మమనే దేవాలయం కప్పు బొక్క (రంధ్రం) పడినట్లేనని, నిరంతరం అగ్నివలే ప్రజ్వరిల్లే తమ ధర్మనిష్ట వానకు నిప్పు వలే చల్లారినట్లేనని వారి భావం. లేక ఆ సమయంలో వర్షపు చినుకుల వలన తమ అగ్ని సేవనానికి విషమ పరీక్ష ఏర్పడడమే దైవనిర్ణయమైతే, తాము ఆ రోజు ఆలయం వరండాలోకి తమ మకాము మార్చినా, దాని కప్పుకు చిల్లిబడియైనా అలానే ఇబ్బంది కలిగి తీరుతుందని వారి భావమై ఉండవచ్చు. **కార్యదీక్ష అంటే**
95 **ఎలా ఉండాలో, దైవనిర్ణయముపై మన విశ్వాసమెలా ఉండాలో శ్రీస్వామివారు మనకు ఈ సన్నివేశం ద్వారా బోధిస్తున్నారు.**

ఒకసారి శ్రీస్వామివారి సేవకులు త్రోవన వస్తున్నారు. "అందరూ దొంగ సాధువులే - పొట్టకూటి స్వాములు" అని ఎవరో తుంటరులు తూలనాడారు. తుంటరులలో ప్రముఖుడైన రైతుపై కోపగించి ఒక భక్తుడు కలబడబోయాడు. శ్రీస్వామివారు తమ సేవకుని ఆపి, **"ఏందయ్యో!**

**వాళ్ళంటుంటే ఓర్చుకుంటేగదయ్యా నిజంగా మనం సాధువులం!"** అని 96
చెప్పి, "నీకు ఓర్పులేదు. కనుక నిజంగా దొంగసాధువువే" అని మెత్తగా ఆ భక్తునికి పాఠం చెప్పారు. అది మనందరికి గుణపాఠమే.

ఒకరోజు దక్షాది రమణయ్య, పోలు మస్తానయ్య శ్రీస్వామివారి సన్నిధిలో ఉన్నారు. రమణయ్య, మస్తానయ్యను "ఒరేయ్ మస్తానయ్య, ఇట్లారా!" అని పిలిచాడు. అతడు పలకలేదు. రమణయ్య మరలా మరలా ఆయన్నలాగే పిలిచాడు. తనను "ఒరేయ్" అని ఏకవచన ప్రయోగం చేసి పిలిచినందుకు మస్తానయ్య బాధపడి "నన్ను 'ఒరేయ్' అంటావా? నీవు ఆశ్రమం బయటకురా నీ సంగతి చెపుతాను" అని మనస్సులో అనుకున్నాడు. వెంటనే శ్రీస్వామివారు, "అయ్యా, ఒరేయ్ అన్నదెవరు?"

మస్తానయ్య : రమణయ్య స్వామీ!

స్వామి : అతడికి పాపం మూడు వందలు లెక్క వ్రాశారయ్యా!

రమణయ్య : స్వామీ! ఆ లెక్క ఎట్లా పోతుంది?

స్వామి : అనుభవిస్తే పోతుంది.

"నన్ను అమర్యాదగా మాట్లాడినందుకు అనుభవిస్తాడులే" అని మస్తానయ్య శాంతించాడు.

మనం స్వల్పమైనవని భావించే పొరపాట్లు నిజానికి చిన్నవేకాదు. గడ్డిపోచలు ఎంత బలహీనంగా కనిపించినా, అవన్నీ త్రాడుగా పేనబడినపుడు మదపుటేనుగును గూడా బంధిస్తుంది. అలానే కర్మబంధాన్ని కల్గిస్తుంది. "సాటివారిని నిందించడం పంది మలభక్షణ చేయడం లాంటిద"ని సాయి కూడా అన్నారు. **"బుద్ధిలేనివాడా!" అని సాటివారిని అనినా గూడా నరకానికి పోవలసి వస్తుందని క్రీస్తు కూడా చెప్పారు. మనమెంత జాగ్రత్తగా ఉండాలో! దీనినే వాక్కును నియమించుట, లేక సరళమైన** 97
**వాక్కును గల్గియుండుట అని ఋషులు అన్నారు. శ్రీసాయి సమకాలికుడు అయిన మహనీయుడు శ్రీతాజుద్దీన్ బాబా ఇలా అన్నారు. "కాబాను తగులబెట్టితే తగలబెట్టావు, ఖురాను తగుల బెట్టినా పెట్టేవు, మద్యం త్రాగితే త్రాగావు, విగ్రహారాధన జరిగే మందిరంలో నివసించినా ఫరవాలేదేమోగాని, మనిషి హృదయాన్ని మాత్రమెన్నడూ గాయపరచకు. కారణం భగవంతుని**

**నిలయమైన ఏడవ స్వర్గం మానవ హృదయంలో దాగియుంటుంది."**

ఒకసారి శ్రీస్వామివారికి విరేచనాలై పదిహేను రోజులు బలహీనంగా ఉన్నారు. **"మందు తీసుకోండి స్వామీ" అంటే "దేవుడిచ్చింది**
98 **అనుభవించొద్దయ్యా?" అన్నారు.**

కావుకావుమని అరుస్తున్న కాకిని రాయితో కొట్టబోతే శ్రీస్వామివారు గురవయ్యను వారించారు. శ్రీస్వామివారు చూస్తుండగా కుక్కనుకూడ కొట్టేందుకు వీలులేదు అంటాడు గురవయ్య.

**ధర్మశాస్త్రంలో చెప్పబడిన ధర్మసూక్ష్మాన్ని సర్వధర్మజ్ఞులు, బ్రహ్మవేత్తలూ అయిన మహనీయుల నుండి తెలుసుకోవాలని ధర్మశాస్త్రాలే చెపుతాయి. అలా చేయకపోవడం వలన మన సమాజంలో వర్ణవ్యవస్థ తారుమారై ప్రజా శ్రేయస్సుకుపకరించే బదులు దేశానికి దౌర్భాగ్యంగా పరిణమించింది. నేటి సమాజంలో వర్ణభేదం జన్మను బట్టి వస్తుందని**
98A **తలచబడుతూంది. కానీ నిజానికది గుణాన్ని బట్టి ఏర్పడిందని భగవద్గీతలో (4 : 13) చెప్పబడింది. అయినప్పటికీ కొందరు పండితులు దానిని వక్రించి వ్యాఖ్యానించారని బ్రహ్మవేత్తల బోధలవలన తెలుస్తుంది.**

ఉదాహరణకు శిరిడీ సాయిబాబా, "మనలో ప్రతివారిలోను ఒక అంత్యజుడుంటాడు. వాణ్ణి వెళ్ళగొట్టాలి" అన్నారు. ఇక్కడ అంత్యజుడంటే అరిషడ్వర్గాలకు ప్రేరకమైన అజ్ఞానమూ, దాని ప్రత్యక్ష రూపమైన అహంకారమూ అని మనము గుర్తించాలి. ఈ విషయాన్నే ఆయన మరొకసారి, "వసతి గృహంలోని దొంగలను కనిపెట్టాలి" అని చెప్పారు. జన్మజన్మకూ మారుతుండే అశాశ్వతమైన శరీరమే వసతి గృహము లేక సత్రము. అది ఎవరికీ స్థిరనివాసం కాజాలదు.

అలానే వారి సమకాలికులు, మరొక రూపమూ అయిన శ్రీ అక్కల్ కోటస్వామి ఆ భావాన్నే సూచించారు. ఆయన దర్శనార్థం వచ్చిన ఒక సద్బ్రాహ్మణుడు విధిలేక ఒక హరిజనుడి ఇంటి వద్ద కుండలోని నీటితో స్నానసంధ్యలు పూర్తిచేసుకొని, స్వామిని దర్శించి, బ్రాహ్మణ పంక్తిలో భోజనానికి కూర్చున్నాడు. అది గమనించిన శ్రీస్వామివారి సేవకుడొకడు అతడిలా చేసినందుకు తీవ్రంగా విమర్శించి, పంక్తిలో నుంచి వెళ్ళగొట్టాడు. ఆ సద్బ్రాహ్మణుడు నొచ్చుకున్నాడు. తరువాత ఆ సేవకుడు శ్రీస్వామివారికి

యధావిధిగా భిక్ష ఇచ్చినప్పుడు ఆయన స్వీకరించలేదు. తన నేరమేమని అడిగిన సేవకుని చేత ఆ హరిజనుని పిలిపించి, అతడి నొసట విభూతిపెట్టి, నేలమీద ఏడుగీతలు గీచి, ఒక్కొక్క గీత దాటుతూ పూర్వ జన్మల స్మృతిని పొంది వేరు వేరు జన్మలలో వివిధ వర్ణాలలో జన్మించాననీ, ఏడుజన్మల క్రిందట తానొక కర్మటుడైన బ్రాహ్మణుడనని చెప్పాడు. శ్రీస్వామివారు పరీక్షించగా అతడు వేద వేదాంగాలలోని విషయాలను వల్లించి తన పూర్వజన్మ జ్ఞానం యదార్థమని నిరూపించుకున్నాడు. 'అయితే ఈ జన్మలో ఈ వర్ణంలో జన్మించావేమి?' అని శ్రీస్వామివారడిగితే, **తాను బ్రాహ్మణుడుగా ఉన్నప్పుడు ఇతర వర్ణస్థులను అసహ్యించుకుంటూ, వారందరూ నడచిన బాటమీద మంత్రజలం చల్లుకొని శుద్ధి చేసుకొని తాను నడిచే వాడిననీ, అట్టి అనన్య చింతన వలన తనకిప్పుడు ఈ జన్మ ప్రాప్తించిందనీ, ఆ హరిజనుడు చెప్పాడు. వర్ణభేదం జన్మవలన వస్తుందని తలచి సంకుచితమైన** 99
**అసహనాన్ని వహించిన వారికి, జన్మాంతరంలో ఆధ్యాత్మిక జ్ఞానానికే అవకాశంలేని కుటుంబాలలో జన్మించవలసి ఉంటుందని శ్రీస్వామివారు తమ సేవకునికి తెలియబరచారు. శాస్త్రాల అర్థాన్ని మహనీయుల యొద్ద తెలిసికొనక మనకు తోచిన తప్పుడు అర్థాలను అనుసరించి నడుచుకుంటే కలిగే అనర్థమే ఇది.**

వారి ఈ భావం ఇంకా స్పష్టమయ్యేలాగా ఆయన తరచు భక్తులతో 'మాలవాళ్ళు, మాదిగవాళ్ళు నీలో లేకుండా చూచుకో అయ్యా' అనేవారు. ఒక్కొక్కప్పుడు అన్యవర్ణస్థులు తమ దర్శనానికి వచ్చినపుడు వారిని శ్రీస్వామివారు బ్రాహ్మణులనేవారు. ఉదా: జన్మతః వైశ్యులైన నన్ను (రచయిత) బ్రాహ్మణుడనేవారు. అలానే అల్లుభాస్కర్ అనే రెడ్డి వర్ణస్తుడు వారి దర్శనానికి వస్తుంటే 'అడుగో ఒక బ్రాహ్మణుడొస్తున్నాడు' అన్నారు శ్రీస్వామివారు. అంటే ఆయన దృష్టిలో మహాత్ములయందు పూజ్యభావము, మోక్షము లేక బ్రహ్మజ్ఞానం కోసం కోరిక గలవారే బ్రాహ్మణులన్నమాట. సరిగా వజ్రసూచి ఉపనిషత్తులో బ్రాహ్మణత్వం ఇలానే నిర్వచించబడడం గమనార్హం. అంతేగాక జన్మతః బ్రాహ్మణుడైనవాడు గూడా నిజమైన బ్రాహ్మణత్వానికి తగని రీతిన జీవించినట్లయితే అతడికి శూద్రత్వము, చండాలత్వము ప్రాప్తించి అతడు ధర్మబాహ్యుడౌతాడని ధర్మశాస్త్ర గ్రంధాలలో చెప్పబడ్డది. అంటే ముముక్షువు

కుండవలసిన గుణాలుగల్గి, వాటికి తగిన రీతిన జీవించేవాడే బ్రాహ్మణుడనే అర్థం గాదా? అటువంటి వాడికి మాత్రమే బ్రాహ్మణ సంస్కారాలన్నీ సార్థకమౌతాయని గదా శాస్త్రం?

అటువంటి గుణాలను దైవీసంపద, సత్వగుణము అని భగవద్గీత అభివర్ణించిందని మనం గుర్తించాలి. అట్టివారు చేసిన యజ్ఞ, దాన, తపః, కర్మలు మాత్రమే మోక్షమనే సాఫల్యాన్ని పొందుతాయని గూడా భగవద్గీతలోని శ్రద్ధాత్రయ విభాగయోగము స్పష్టంగా చెపుతుంది. దీనినే శ్రీ వెంకయ్య స్వామివారు, "సంపన్నత్వం, సాధారణత్వం గల్గి, సద్గురు సేవ చేయమనేవారు. సంపన్నత్వము అనగా పైన చెప్పిన దైవీసంపద గల్గియుండడమన్నమాట.

సాధారణత్వమంటే అట్టి గుణాలు తనలో ఉన్నాయని, తానొక సాధువు లేక ముముక్షువునని, తాను పవిత్రుడనని విర్రవీగి, సాటివారిని హీనులుగా తలచకుండడం అన్నమాట. ఈ సూత్రానికి స్వామి యొక్క జీవిత విధానమే చక్కటి ఆదర్శం. అందుకే అటువంటి మహనీయుల ఆచరణనే, బోధనే ప్రమాణంగా స్వీకరించాలని ధర్మ శాస్త్రాలు ఘోషించాయి.

బౌద్ధ, జైన, పార్శీ, క్రైస్తవ, ఇస్లాం మతాలు ఇందుకే "పవిత్రమైన ఆధ్యాత్మిక జీవనం కలవారు, దానిని కలిగియుండనివారు" అని సమాజంలోని వ్యక్తులను వర్గీకరించడం గమనార్హం.

**"కష్టమంటే ఏమిటో, సుఖమంటే ఏమిటో నాకు తెలియదయ్యా"**
100 **అన్నారు రోశిరెడ్డితో శ్రీస్వామివారు (అంటే ఇష్టాఇష్టాలు పోగొట్టుకో, సుఖేచ్ఛ వదులు అని).**

'సాధన చేసుకుంటూ దైవకృప ఎలా కలుగుతుంద'ని అడిగిన భక్తునితో **"అయ్యా! పై మిద్దేసుకుంటే బాగుంటుండ్లా" అన్నారు. అమర నారాయణ**
101 **శతకంలో ఆధ్యాత్మికంగా దైవీసంపదను సాధించడాన్ని పైమిద్దె నిర్మించడంగా పోల్చి చెప్పారు.**

మరొక భక్తుడు "స్వామీ! నన్ను సాధన చేసుకుంటూ ఎచ్చట ఉండమంటారు?" అన్నాడు. 'ఎక్కడైనా ఒక్క దూలపు ఇల్లు వేసుకొని ఉండవచ్చు'. 'ఏ ఊరిలో ఉండమంటారు? ఏ ఆశ్రమంలో ఉండమంటారు?'

అని మరలా మరలా ఎన్నిమార్లు అడిగినా గానీ శ్రీస్వామివారు మాత్రం "ఒక్క దూలపు ఇల్లు వేసుకొని ఎక్కడైనా ఉండవచ్చు" అని శెలవిచ్చారు. ఇల్లంటే శరీరం. దీనికి ఒక్క దూలం ఆధారం అంటే ఒక్క దైవమే శరణ్యంగా సర్వస్యశరణాగతితో జీవించడం. మానవులు ధనకనక వస్తువాహనాలే జీవిత ఆధారమని నమ్ముతారు. నిజానికి అవి అశాశ్వతములు. దైవమే ఆధారంగా జీవిస్తూ అదే గమ్యంగా భావిస్తూంటే ఎక్కడున్నా సాధనే - 'సబ్‌కా మాలిక్ ఏక్ హై' అన్న సాయి వాక్యాన్ని శ్రీస్వామివారు ఇలా చెప్పారన్నమాట. సర్వశాస్త్రముల సారమును శ్రీస్వామివారి వలె మామూలు భాషలో చెప్పగల పండితులెచ్చట లభిస్తారు!

తమ ఆధ్యాత్మిక ధనాన్ని గూర్చి శ్రీస్వామివారు అన్నారు "కొండలు కొండలుగా డబ్బులువున్నా, ఒక్కరు కూడా అడుగరేమయ్యా? కొండలు పొర్లి జారి వచ్చేస్తున్నాయయ్యా!"

మరొకసారి శ్రీస్వామివారు అన్నారు - "ఏడుకొండలు యాలానికి వచ్చాయి, పాటపాడి కొనేవాళ్ళుంటే కొనవచ్చయ్యా". మరొకసారి "నల్లకొండలు యాలానికి వచ్చాయి. కొనేవాడే లేడే" అని వాపోయారు. సాయినాథుడు "జ్ఞానధనం రాసులుగా ఉన్నా అడిగే నాథుడేలేడే అని" అన్నట్లు ఉంది.

"దక్షిణపు కొండ తేలివచ్చింది. ఎవరైనా కొనేవాళ్ళు ఉంటే కొనమని అందరికి చెప్పయ్యా" అన్నారు శ్రీస్వామివారు.

ఒకప్పుడు శ్రీస్వామివారు "బ్రాహ్మణులలో మాదిగవాళ్ళు ఉన్నారు, మాదిగవాళ్ళలో బ్రాహ్మణవాళ్ళు ఉన్నారు. కోమటి వాళ్ళలో కమ్మవాళ్ళు, కమ్మవాళ్ళలో కోమటివాళ్ళు ఉన్నారు. గొల్లవాళ్ళలో మాలవాళ్ళు, మాలవాళ్ళలో గొల్లవారు ఉన్నారు. లోకమంతా ఈ విధంగా ఉందయ్యా అని అన్నారు".

**"లాభంలో భాగం తీసుకుంటే పాపంలో కూడా భాగమొస్తుందయ్యా" అన్నారు మరొక రోజు. (మనం చందాలు ఎవరిని అడగాలో యోచించండి)** 102

భక్తుడు : స్వామీ మానవుడు చనిపోయాక తిరిగి జన్మ ఉన్నదా? ఉంటే మనిషిగానే జన్మిస్తాడా? లేక పశుపక్ష్యాదులుగా జన్మిస్తాడా?

స్వామి : మనిషై పోతే మనిషిగానే వస్తుళ్ళాయ్యా.(దుర్లభమైన

మానవజన్మ వచ్చింది. సద్వినియోగం చేసుకో, సద్గురుని అన్వేషణ, సేవ సాధించు)

**అంటే మానవ లక్షణములు గల్గి జీవిస్తే మానవుడుగానే జన్మిస్తాడని, అలాగాక ఇంద్రియలోలత గల పశులక్షణములు గల్గి జీవితాన్ని గడిపితే**
103 **హీన జన్మలొస్తాయనీ గనుక మానవ జన్మ సార్థకమయ్యేలాగా జీవితాన్ని గడపమని శ్రీస్వామివారు సెలవిచ్చారు.**

పునర్జన్మ వున్నదని ఇప్పుడు చెప్పినట్లే – అనేక మంది భక్తులు పూర్వ జన్మలో ఎచ్చటెచ్చట జన్మించి ఏమేమి చేసేవారోకూడా శ్రీస్వామివారు చెప్పేవారు.

ఇదే ప్రశ్న మరొకభక్తుడడిగితే "దేంతో పీకులాడుతూపోతే దానిలోకే వస్తుండ్లాయ్యా" అన్నారు. అంటే జీవితాంతం దేనిపై ఎక్కువ ప్రీతితో మనసంతా నింపుకొని వుంటామో, చివరి క్షణాల్లో దాన్నే స్మరిస్తూ ప్రాణాలొదిలి అదే విధంగా జన్మిస్తాడని, అంత్యకాలంలో దేనిని స్మరిస్తూ శరీరం వదులుతాడో అలాగే జన్మిస్తాడని గీతలో చెప్పబడ్డదానికి ఇది శ్రీస్వామివారి వ్యాఖ్య అన్నమాట.

మరొకభక్తుడు ముక్తిమార్గం బోధించమంటే శ్రీస్వామివారు ఇలా చెప్పారు.

"అయ్యా! ఆయనను మూడు లక్షలు కట్టమను" అన్నారు.

అంత పైకం లేదు స్వామీ అంటే

"ఆరు లక్షలు కట్టమనయ్యా" అన్నారు.

"అసలు డబ్బేలేదు స్వామీ" అంటే

"8 లక్షలైనా కట్టమనయ్యా" అన్నారు

**మూడు లక్షలు ఈషణ త్రయమును వదలమని, ఆరు లక్షలు అరిషడ్వర్గాలకు, 8 లక్షలు అష్టమదములకు సంకేతంగా చెప్పారు**
104 **శ్రీస్వామివారు. శ్రీస్వామివారికి ఏ ఆధ్యాత్మిక శాస్త్రాలూ తెలియవని అనుకుందామా?**

ఒకప్పుడు పోలీసులు ఒక దొంగతనం అన్వేషణలో శ్రీస్వామివారిని


అనుమానించి కలువాయి పోలీసు స్టేషనుకు తీసుకువెళ్ళి రూములో పెట్టారు. సాయంకాలమునకు కలువాయి గ్రామ ప్రజలకు ఆ విషయం తెలిసి సబ్ ఇన్‌స్పెక్టరును నాలుగు చీవాట్లు పెట్టి "ఎవరనుకున్నావు ఆయనను, తీసుకొచ్చి స్టేషన్‌లో పెట్టావే నీకేమైనా బుద్ధివుందా" అని శ్రీస్వామివారి సంగతి చెప్పారు. ఆ ఇన్‌స్పెక్టరు 'స్వామీ తెలియక తప్పు జరిగింది క్షమించండి' అని శ్రీస్వామివారిని వెళ్ళమన్నారు. శ్రీస్వామివారు ఆ గ్రామస్తులతో "ఏమయ్యా ఇక్కడైనా బాగానే ఉందయ్యా" అన్నారు. ఇంకా ఇక్కడ ఆరుగంటలు ఉండాలి అని మరికొంతసేపు అక్కడ వుండి వచ్చారు. వారికి సుఖదుఃఖములు అనే ద్వంద్వములు ఉంటే గదా!

ఒక భక్తుడు శ్రీస్వామివారితో "స్వామీ, హస్త కార్తెలో జొన్న వేస్తాను" అని అన్నాడు. అందుకు శ్రీస్వామివారు "ఊర్లో జొన్నలన్నీ నీవే గదయ్యా" అన్నారు. అంటే అర్థమేమిటో ఆ భక్తుడు వివరంగా అడిగి తెలుసుకోకుండానే 'ఈ సంవత్సరం గ్రామస్తులందరికీ పంట పండదు. అందరి పంట నాకొక్కడికే పండుతుంది' అని శ్రీస్వామివారి మాటలకు అర్థం చెప్పుకొని హస్త కార్తెలో జొన్న పైరు పెట్టాడు. ఈ భక్తుడి పైరు మాత్రమే గింజ కూడా పండకుండా పోయింది. తక్కిన రైతులకు దివ్యంగా పండింది. ఈ భక్తుడు ఆ సంవత్సరం పొడుగునా అడిగిన వాళ్ళను అడగకుండా గ్రామస్తులందరి దగ్గరా జొన్నలు బదులు తెచ్చుకొని తిన్నాడు. ఆ విధంగా ఊర్లో జొన్నలన్నీ ఆయనవే అయినవి. ఊర్లో జొన్నలన్నీ తనకెలా వస్తాయని తలచాడో, అలా తనకు వచ్చినా వాటిని మరలా అందరికీ ఇవ్వవలసి ఉంటుంది అనే వివేకం లేకపోయింది. ఆశ ఎలాంటి భావాలను, అర్థాలను చెపుతుందో చూడండి. అలాంటి పేరాశను వదలమనే శ్రీస్వామివారు అలా అన్నారు.

నూతేటి శ్రీ రాములునాయుడు తన నిమ్మతోటలోని గుడిసెలో శ్రీస్వామివారి పటాన్ని పూజించేవాడు. ఒకరోజు నివేదనకేమీ లేక ఒక మంచి నిమ్మకాయని రెండు ముక్కలుగా కోసి నివేదించాడు. కానీ దాన్ని తాను ప్రసాదంగా స్వీకరించలేదు కదా! ఆ సాయంత్రం ఇంటి నుండి ఆయనకు పేలపిండి తెచ్చారు. రాత్రికి పేలపిండి నైవేద్యం శ్రీస్వామివారికి సమర్పించాడు. పూజానంతరం ఆ పేలపిండిని ప్రసాదంగా నోట్లో వేసుకున్నాడు. అది నిమ్మరసం వలె అమిత పుల్లగా ఉండటం చూచి ఆశ్చర్యపోయాడు. నివేదనకు


పెట్టకుండా తాను తినేందుకు ప్రక్కన ఉంచిన మిగతా పేలపిండి తియ్యగానే ఉంది. **మనం ప్రీతితో తినే పదార్థాన్నే దైవానికి నివేదించాలనీ, మనం తినేందుకు ఇష్టపడని పదార్థాన్ని దైవానికి నివేదించకూడదని**
105 **శ్రీస్వామివారు తనకు ఈ లీల ద్వారా బోధిస్తున్నారని ఆయన గ్రహించాడు. ఇది మనందరకూ కూడా మంచి ఉపదేశమే.**

గోవు పంచితాన్ని పవిత్రంగా ఇండ్లలో స్వల్పంగా చల్లుకొనడము, కొంత మంది కళ్ళకు మంచిదని కళ్ళలో వేసుకోవడము కద్దు. ఒకరోజు శ్రీ రాములనాయుడు **గోవు పంచితాన్ని తన గుడిసెలో చల్లుతుండగా శ్రీస్వామివారి పటం పైన కూడా పడింది. అలా పడితే మంచిదిలే అని**
106 **తుడవకుండా వదిలేశాడు. ఆ రాత్రి ఆయన కూర్చునియుండగా ఆయన పైన ఏదో ద్రవం పడింది. బల్లి ఒంటేలు పోసిందని పైన చూస్తే బల్లిలేదు. గుడ్డ తడిసిన చోట వాసన చూస్తే అది పంచితం వాసన.** ఆయనకు అసహ్యమనిపించింది. ఇప్పుడు నాపై పంచితం ఎలా పడ్డాయా అని ఆలోచించాడు. "పంచితం నీపైన పడితే అసహ్యించుకొంటావే, మరి నాపై పడితే తుడవకుండా వదిలేశావే" అని శ్రీస్వామివారు ఆయనకు ఆత్మబోధ చేసారట. 'నా పటానికి నాకు భేదం లేద'ని శ్రీస్వామివారు మరొకసారి నిరూపించారు.



# అవధూత లీల

## అధ్యాయము - 22
## శ్రీస్వామివారి సూక్తులు



1. “బ్రేవ్‌మని త్రేపే వాడికి కాదయ్యా, ఆకలై కొంగుపట్టేవారికి అన్నం పెట్టాలయ్యా”.

2. “స్వామీ! కొందరు మిమ్మల్ని స్మరించిన వెంటనే రక్షణ పొందుతున్నారు. కొందరికి ఆలస్యమౌతుంది ఏమిటి” అని అడిగితే “వాళ్ళుండేదాన్ని బట్టి గదయ్యా మనముండేది” అన్నారు. అంటే మన విశ్వాసాన్ని బట్టి శ్రీస్వామివారి రక్షణ లభిస్తుందన్నమాట.

3. “సంపూర్ణ విశ్వాసంతో ఇక్కడకొచ్చి ఏదనుకుంటే అది అయ్యేదేగదయ్యా”.

4. “అన్ని జీవులలో వెంకయ్య వున్నాడని రాసుకో” అది ప్రతి ఒక్కరికీ అనుక్షణము గుర్తుండవలసిన విషయం. సద్గురువు విశ్వరూపుడనీ, సర్వ ప్రాణులను వారే పరివేష్టించి యున్నారనీ, ఏ ప్రాణిని ఆదరించినా బాధించినా అది సద్గురునికే చెందుతుందనీ అనుక్షణం గుర్తుంచుకొని జీవితాన్ని సాగిస్తే గురుకృప సదా మనకు లభిస్తుంది.

5. “మైసూరు మహారాజు కనిపిస్తే మనకేమొస్తుంది. మనం చేసుకున్నదే గదా మనకు” మైసూరు మహారాజా లాంటి సద్గురువు తారసిల్లినా మనం సాధన చేసి అర్హత సంపాదించనిదే వారు కృపచూపినా మనం నిలుపుకోలేమని అర్థం.

6. “అందరికీ పంట పండించాను, దాన్ని దొంగలు పడి దోచుకోకుండా చూచుకోండి”. మనలోని దుర్గుణాలే దొంగలు.

7. మీరు నన్ను వదలినా నేను మిమ్మల్ని వదలను.

8. వెయ్యి గొర్రెలలో వున్నా మన గొర్రెను కాలు పట్టి లాక్కురావచ్చు.

9. అందరినీ సమానంగా చూచుకుంటే భగవంతుడు కనిపిస్తాడు.

10. ఆకలిగా లేదు, నాకు అన్నం వద్దు అనే భక్తుణ్ణి, కొద్దిగానన్నా తినమని

కొందరు బ్రతిమిలాడుతున్నారు. వారితో శ్రీస్వామివారు ఇట్లా అన్నారు, "మందం, బంధం" మందాకలితో భోంచేస్తే అది పరిగ్రహమై బంధ హేతువౌతుంది. ప్రకృతి శక్తుల రూపంలో మనకు ఆహారాన్ని ప్రసాదించే భగవంతునికి ఋణపడతామన్న మాట.

11. వెంకయ్య పేరుమీద పిడికెడు మెతుకులు పెట్టిన వారికి, తెచ్చిన వారికి వారి మంచి చెడ్డలన్నీ మనమే చూడొద్దయ్యా.

12. "మాకేదన్నా బోధించండి స్వామీ" అంటే "చెప్పేదేముంది. చూచి నేర్చుకోండి" అన్నారు. వారిని చూచి మనమేమి నేర్చుకోవాలో "అవధూత బోధామృతం" లో విపులంగా వివరించబడింది.

13. మంత్రోపదేశం చేయమన్న భక్తునితో శ్రీస్వామివారు "మంత్రమెక్కడుంది, తంత్రమెక్కడుంది? చూచుకుంటూ పొయ్యేదే గదయ్యా" అన్నారు. మనలో దుర్గుణాలు చేరకుండా చూచుకుంటూ సద్గురుడు ఆచరించి చూపిన శుభ్రమార్గాన్ని చూచుకుంటూ, ఆ మార్గంలో నడవడమే మన కర్తవ్యమన్న మాట.

14.సన్యాసులు ధర్మంగా ఉండటంలో గొప్పేముందయ్యా? సంసారంలో ధర్మంగా ఉండటమే గొప్ప.

15. వడ్డీ విషయంలో కూడా ధర్మంగా ఉండాలయ్యా.

16. మాకేమైనా బోధించండి స్వామీ అంటే "సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురు సేవ సాధించండి" అన్నారు.

**సంపన్నత్వమంటే దైవీసంపద లక్షణాలు, సాధారణత్వమంటే**
107 **సర్వవిధముల గర్వము, అహంకారము లేకుండా "అల్లామాలిక్" అనే భావాన్ని ఆచరణలో జీర్ణించుకొని యుండటం. సద్గురు సేవ అంటే సద్గురువు విశ్వరూపుడని, ఏ జీవిని ఆదరించినా హింసించినా అది గురువుకే చెందుతుందనే ఎరుకతో ప్రతిక్షణం జీవించటం.**

17. నిత్యమూ తమలో తాము కలహించుకొనే తమ సేవకులలో కొందరిని ఏకాంతంగా పిలిచి "నోరు విప్పకూడదయ్యో" అని ఒకే మాట బోధించేవారు.

18. 'నా ఆరోగ్యం సరిలేదు. అక్కడ నొప్పి ఇక్కడ నొప్పి' అని తనకు చెప్పుకొనే సేవకులతో శ్రీస్వామివారు "నొప్పి ఎంత అనుభవిస్తే అంత మంచిది

గదయ్యా" అనేవారు.


19. పావలా దొంగిలిస్తే పది రూపాయలు నష్టపోతుండ్లాయ్యా!
20. మనిషైపోతే మనిషిగానే వస్తుండ్లా.
21. తప్పు చేసిన సేవకులను శ్రీస్వామివారు మందలించలేదని తలచినవారితో "పొయ్యే వాళ్ళను పోనిచ్చేదే గదయ్యా" అన్నారు.
22. ముందు ముందు తెడ్డు తగలని అన్నం తింటారయ్యో అన్నారు.
23. ఆశబోతే అంతా పోతుండ్లాయ్యా. ఇది సర్వశాస్త్రాలసారము.
24. దారం తెగిపోకుండా చూచుకుంటే నేనెప్పుడూ మీతోటే ఉండ్లాయ్యా.
25. ఒకరిని పొమ్మనే దాని కంటే మనమే పోవడం మంచిదయ్యా.



# అవధూత లీల

## అధ్యాయము - 23

## నమ్మినవారికి సొమ్ము - నమ్మకుంటే .........



**భగవంతుడనుగ్రహించినా విశ్వాసం లేని వారేమీ పొందలేరు. భగవంతుని మాటగానీ, సద్గురుని మాటగానీ**
**108 సంపూర్ణంగా విశ్వసించి వారు చెప్పినట్లు తు-చ తప్పకుండా ఆచరించిన వారికి మాత్రమే వారి కృప లభిస్తుంది. వారు చెప్పినట్లు ఆచరించలేని వారికి కృప అడవిగాచిన వెన్నెల వంటిది.**

ఇంతవరకూ శ్రీస్వామివారు చెప్పిన వాటిని విశ్వసించి సఫలులైన వారి అనుభవాలు చూచాము. అలాగాక శంకించిన వారి అనుభవం ఏమిటో చూద్దాం.

గొడ్డటి శేషయ్య (గొలగమూడి) గారికి ఆరోగ్యం బాగుండక శ్రీస్వామివారు నయం చేస్తారని వచ్చి ఆయనతో చెప్పుకున్నాడు. శ్రీస్వామివారు "గుంట కలగరాకు వ్రేళ్ళపై నున్న తాట నూరి మూడు పూటలా మ్రింగు" అన్నారు. వారు అలాగే తాట నూరి ఉండలు చేసి మ్రింగబోతూ "దీనికి తగ్గుతుందా?" అని శంకిస్తూ మ్రింగాడు. తెల్లవారి ఆయన శ్రీస్వామివారి దగ్గరకు రాగానే ఏమీ చెప్పుకోకముందే "అయ్యా, దానికి తగ్గదు గాని ఒక మనిషి వస్తాడు. ఆయన దగ్గర మందు తీసుకో" అని చెప్పారు. ఆయన మనసులో ఉదయించిన శంక శ్రీస్వామివారికి తెలియకపోతే గదా!

వి. రామమూర్తి (నెల్లూరు) గారి అన్న కుమారునికి వరుసగా ముగ్గురు ఆడపిల్లలు కలిగారు. నాల్గవ కాన్పుకు ముందు శ్రీస్వామివారి వద్దకొచ్చి మగపిల్లవాడు పుట్టేటట్టు అనుగ్రహించమని ప్రార్థించారు. "అర్థరాత్రి వేళ ఏ దేవస్థానములోనైనా రోజుకు మూడు ప్రదక్షిణలు చొప్పున మూడు రోజులు చేస్తే మగసంతతి కల్గుతుంది" అని శ్రీస్వామివారు సెలవిచ్చారు. " అర్థరాత్రివేళ ప్రదక్షిణలు చేయడం కష్టమని, అందులోనూ నవమాసాలు నిండినవిగదా?

ఇప్పుడు ప్రదక్షిణలు చేస్తే బిడ్డ ఎలా మార్పుచెందుతుంది?” అని వారు **అశ్రద్ధ చేసి ప్రదక్షిణలు చేయలేదు. నాల్గవ కాన్పులో గూడా ఆడపిల్ల జన్మించింది.** 109
**శ్రద్ధలేని వారికి దైవం కరుణించినా ప్రయోజనం లేదుగదా!**

ఇందుకూరుపేటకు చెందిన ఆత్మకూరు వెంకయ్య ఇలా చెప్పారు.

**ఒకప్పుడు 'అయ్యా! ఎద్దుకు బండి గండముంది. అమ్మెయ్యండి' అన్నారు శ్రీస్వామివారు. అమ్మాలనుకున్నా వెంటనే తగిన బేరం రాక పోయేసరికి కాలయాపన జరిగింది. ఒకనాడు రాత్రిపూట ఆ ఎద్దు బండి చక్రానికున్న ఆకుల సందున తలదూర్చి, రుద్దుకొనటానికి ప్రయత్నించింది.** 110
**దాని కొమ్ములు అడ్డం తగిలి తల ఆకుల సందునుండి రాలేదు. తెల్లవార్లూ తల తప్పించుకునే ప్రయత్నంలో గుంజులాడి తెల్లవారేసరికి చచ్చిపడిపోయింది. (ముందు నిర్ణయం తెలుసుకో)**

రాపూరు తాలూకా పెనవర్తి గ్రామస్తులు శ్రీ రాములు శెట్టిగారికి కుష్టువ్యాధి. కాళ్ళు చేతులు వాపు, పొడ, కాలిబొటిన వ్రేలికి పుండు. ఆయన శ్రీస్వామివారినాశ్రయించాడు. శ్రీస్వామివారు ఆయన వంటికి నూనె రుద్దేవారు. శెట్టిగారింటికి వెళ్ళి అప్పుడప్పుడు శ్రీస్వామివారు ఆతిథ్యము స్వీకరించేవారు. శ్రీస్వామివారు ఎక్కడున్నా శెట్టిగారు వచ్చి దర్శించేవారు. కొన్నాళ్ళకు ఆయన వ్యాధి నివారణైంది. **కానీ ఆయన శ్రీస్వామివారు చెప్పిన స్త్రీ పథ్యము, నియమాలు పాటించలేదు. కనుక అతనికి మరలా** 111
**ఆ వ్యాధి సంక్రమించింది. (శ్రీస్వామివారివలె జబ్బు నయం చేయలేము. వారిని చూచి అసహనముతో కసిరి కొట్టకుండా భిక్ష ఇచ్చినా సేవే)**

ఒకప్పుడు వేలూరు సుబ్రహ్మణ్యం శ్రీస్వామివారితో తిరువళ్ళూరు వెళ్ళాడు. శ్రీస్వామివారొకచోట నిలుచుని కొండరాళ్ళను తడిమి పరీక్షిస్తున్నారు. కొంతసేపటికి ఒక చిన్నపుల్లతో నేలమీదనున్న ఒక రూపాయి బిళ్ళను ప్రక్కకు తోస్తూ సుబ్రహ్మణ్యాన్ని పిలిచారు. “దీనితో కర్పూరం కొని శ్రీస్వామివారికి వెలిగించు” అని రూపాయిని చూపారు. శ్రీస్వామివారెప్పుడూ తమ చెంత డబ్బు ఉంచుకొనేవారు కాదు. కాని ఆ రూపాయి అక్కడకెలా వచ్చిందో సుబ్రహ్మణ్యంకు తెలియలేదు. సుబ్రహ్మణ్యం వెలిగిస్తానని శ్రీస్వామివారితో చెప్పాడేగాని వెంటనే ఆ పని చేయలేదు. ఆ రూపాయి జేబులో వేసుకొని దేవాలయానికి వెళ్ళాడు. అక్కడ పదిరూపాయల నోటుకు చిల్లర తెమ్మన్న

తులశమ్మగారికి ఆ రూపాయిచ్చి అప్పటికి వాడుకోమన్నాడు. ఆ సాయంత్రం శ్రీస్వామివారు అతణ్ణి "కర్పూరం వెలిగించావా?" అని అడిగారు. "వెలిగించానని" అతడు జవాబిచ్చాడు, కాని నిజానికి వెలిగించలేదు. తులశమ్మ ఖర్చు పెట్టింది కూడా దేవునికేగా అని తలచాడు. మూడు నెలలు గడిచాయి.

ఒకనాటి రాత్రి అతని స్వప్నంలో పెద్ద కర్పూరం గడ్డ మండుతూ బ్రహ్మాండమైన జ్వాల కనిపించింది. అది చూచి అతడు నిద్రలోంచి భయపడి లేచి ఏమిటా? అని ఆలోచించసాగాడు. ఆనాడు శ్రీస్వామివారు చెప్పిన పని చేయని ఫలితమే ఇదని గుర్తించి వెంటనే ఉన్న పళంగా లేచి ప్రయాణమై తిరువళ్ళూరు వెళ్ళి, చెంపలేసుకొని, కర్పూరం వెలిగించి క్షమాపణ వేడాడు.

112 **సద్గురువు కృప జూపినా వారి సలహా యందు పూర్ణ విశ్వాసం లేనివారు ఫలితం పొందజాలరని వేలూరు సుబ్రహ్మణ్యంగారి అనుభవాలు సూచిస్తున్నవి.**

వేలూరు సుబ్రహ్మణ్యంగారు తన అనుభవాల్ని ఇలా చెప్పారు.

1970వ సం॥లో నేను, నా భార్య శ్రీస్వామివారి ఆశీస్సులు తీసుకొని గొలగమూడి నుండి ఇంటికి వెళ్ళేందుకు బస్సు దగ్గర ఉన్నాము. ఆ కరుణాసముద్రుడు మా వద్దకు వచ్చి "అయ్యా! నీకు కనకమంటి కాలమొస్తుంది. నీకు చీటి వ్రాసి ఇచ్చినా నీవు గుర్తెరుగలేవు. నేను నీకా స్థలం చూపించాలి. తలుపూరులో ఎగవ వాళ్ళ ఇంటికి పడమరగా ఉంది. ఆ ఇల్లు కూడా నేను చెపితే నీ పరమవుతుంది. నీవక్కడే కాపురముండు" అని చెప్పారు. ఆ విధంగా కాపురం మార్చడం నాకు ఇష్టం లేదు. కానీ శ్రీ స్వామివారు చెప్పారు గనుక "సరే రండి స్వామి, ఆ స్థలం చూపించండి" అన్నానే కానీ మనసులో మాత్రం ఈ పిచ్చి వెంకయ్యతో కూడా తిరుగుచున్నానని తలుపూరులో మా బంధువులు నవ్వుకుంటారని మనసులో తలచాను. వెంటనే ఆ సర్వజ్ఞమూర్తి నా మనసులోని మాట గుర్తించి "అయ్యా! పిచ్చి వెంకయ్య మీదనే చెప్పు. నాకేమీ ఫరవాలేదు" అని చెప్పి బస్సులో నాతో నెల్లూరు వచ్చారు. మేము తలుపూరు బస్సు ఎక్కి కూర్చున్నాము. కానీ కొద్ది సేపటిలో నా బుద్ధి మారింది. తలుపూరు వెళ్ళి నవ్వుల పాలవడం ఇష్టం లేక "స్వామీ మీరు ముదిగేడు పోండి, నేను మా బంధువులింటికి వెళ్ళి వస్తాను" అని చెప్పి బస్సు దిగిపోతున్నాను.

వెంటనే ఆ మహానుభావుని ముఖారవిందము లక్షలు నష్టపోయిన


వానికి వలె దీనాతి దీనంగా మారింది. “అయ్యా! నేను నీకోసం వస్తే, నీవు నామాట వినకుండా పోతున్నావే. నీకు అన్నం చేసి పెట్టే ఆమెకు ఎడమ కాలుకు గడ్డ వచ్చేటట్లు ఉంది. మద్రాసు ఆసుపత్రికి పోవలసి వస్తుంది. నీవు నెల్లూరు రంగనాయకుల దేవస్థానంలో పావలా ఇచ్చి ప్రసాదపు అన్నం కొని మూడు పూటలు ఆమెకు పెట్టించు, కొంత జబ్బు తగ్గిస్తారు” అని సెలవిచ్చారు. రెండు నెలలకు ముందు ఆపదను తెల్పి నివారణ కూడా చెప్పారు.

శ్రీస్వామివారి మాట యందు శ్రద్ధ లేని నేను మా వంటామెకు ఒక్కపూట మాత్రమే ప్రసాదం పెట్టించి వెళ్ళిపోయాను. శ్రీస్వామివారు చెప్పినట్లే అటు తర్వాత రెండు నెలలకు ఆమె తొడ మీద గడ్డలేచింది. మద్రాసుకు తీసుకువెళ్ళి ఆపరేషన్ చేయిస్తే ఐదు వందల రూపాయలు ఖర్చు అయినది. ఆ రోజు శ్రీస్వామివారి మాట పాటించనందుకు తగిన శాస్తి జరిగింది. తలుపూరుకు కాపురం మార్చి ఉండినట్లయితే సిరిసంపదలతో సుఖంగా ఉండెడివాడను. కానీ వారి మాట వినలేదు గనుక ఇలా ఉన్నాను”.

ఒక రోజు ఈ భక్తుడే తన పొలంలో నీరు ఎక్కడ పడుతుందో చెపితే బావి త్రవ్వుకుంటానని శ్రీస్వామివారిని అడిగాడు. శ్రీస్వామివారు పొలంలో నాలుగు వైపులా తిరిగి, **“అయ్యా! ఈ చేలో నీళ్ళు లేవు ఈ ప్రక్కనున్న అర ఎకరాలో ఎనభై నాలుగు ఎకరాలకు సరిపడు నీరున్నది. ఈ అర ఎకరా కొని బావి త్రవ్వించు. ఇందులో బావి త్రవ్వినవారు ఎప్పుడూ నీడన** 113
**జీవిస్తారు”** అని చెపుతూ బావి త్రవ్వవలసిన చోట గుర్తు కూడా పెట్టారు. ‘ఈ పొలం నీవు ఎట్టి పరిస్థితిలోను అమ్మవద్ద’ని చెప్పారు. కానీ ఏమి లాభం. వారి మాట వినకుండా అమ్మేశాను. ఇప్పుడచ్చట బావి త్రవ్వినవారు లక్షాధికారులైయున్నారు. (భవిష్య నిర్ణయం - ఎవరనేది నిర్ణయం లేదు. ఎవరు కొంటే వారికి. ఇది ఒక చిత్రమైన విధి నిర్ణయం కాదా?)

కాటంరెడ్డి సుబ్బారెడ్డి (కల్లూరుపల్లి) ఇలా చెపుతున్నారు. మాకు వున్న 22 ఎకరాల మెట్ట అమ్మదలచి శ్రీస్వామివారిని అడిగాను. “రాబోయే రోజులలో అది లక్షల విలువ చేస్తుంది. నీకు ఏమి శనిబట్టి అమ్ముచున్నావయ్యా” అన్నారు శ్రీస్వామివారు. మా నాన్నకు నిజము చెప్పకుండా బుకాయించి ఎకరా రూ. 500/- చొప్పున అమ్మివేశాను. ఇప్పుడు అది ఎకరా ఒక లక్షరూపాయలు విలువ చేస్తుంది.

మరొకప్పుడు నాకున్న మాగాణిని మార్పు చేయదలచి శ్రీస్వామివారిని అడిగాను. "అయ్యా, మాగాణి అమ్మితే నానా అగచాట్లుపడుతాడని చెప్పినా వినడు. కర్మఫలం చాలా బలంగా వుంది. ఏమి చేస్తాము" అని శెలవిచ్చారు. (వినడని కూడా శ్రీస్వామివారికి తెలుసు). శ్రీస్వామివారి మాట వినకుండా పొలము మార్పు చేశాక మూడు సంవత్సరములు పంటలు పండక 20 వేల రూపాయలు అప్పు చేయడమేగాక జీవితంలో ఎన్నడూ అనుభవించనంత మానసిక బాధను అనుభవించాను. శ్రీస్వామివారి కృపవలన 10 వేల రూపాయలు ఇచ్చి మరలా నా పొలము నేను మార్పు చేసుకున్నాను. అది మొదలు నా ఆర్థిక, మానసిక పరిస్థితులు చక్కబడి సుఖపడ్డాను. ఈ పొలము మార్పిడి కేవలము శ్రీస్వామివారి కృపవలన జరిగినదేగాని నా తెలివితేటల వల్లకాదు. మా నాన్నపై శ్రీస్వామివారికి గల ప్రేమ వలన నా పొలము నాకు వచ్చేటట్లు కృప చూపారు.




శ్రీ స్వామివారి సమాధి

# అవధూత లీల

## అధ్యాయము - 24
## శ్రీస్వామివారి అభేదస్థితి





**పరబ్రహ్మ స్వరూపులైన సద్గురువులు నిర్గుణ నిరాకారులు మాత్రమేగాక సగుణ సాకారులుగా కూడా వారి చైతన్యం అనుక్షణమూ పని చేస్తుంది. అలా రెండు స్థితులనూ అనుక్షణం అనుభవించగల్గి, దైవాదేశం పొందిన మహనీయులు మాత్రమే అనుక్షణమూ భక్త సంరక్షణ చేయగలరు.** ఈ విషయములో శ్రీస్వామివారికి శ్రీ శిరిడీ సాయినాథునితో ఎంతో చక్కని పోలిక మాత్రమే గాక ఎంతో సన్నిహిత సంబంధం గలదు. ఇది వారి జీవిత విధానంలోనే గాక వారిద్దరూ కలసి భక్తుల కిచ్చుచున్న దివ్యానుభవాల ద్వారా కూడా ప్రకటమౌతుంది. 114

ఇద్దరూ అస్ఖలిత బ్రహ్మచారులే. తమదంటూ ఒక నివాసం లేనివారు (అనికేతులు). ఇద్దరూ భిక్షతో జీవించారు. సిద్ధులై కూడా ఆదర్శప్రాయులైన సాధువులవలె జీవించారు. ఇరువురూ నిరతాగ్నిహోత్రులు. వీరిద్దరి లీలలు, బోధలు ఎంతో సన్నిహితంగా పోలియున్నవి.

సాయినాథుడు తాను భక్తరక్షణ చేశాక నేనే చేశానని భక్తులకు ఎరుక పరచేవారు. కానీ శ్రీస్వామివారు జీవితాంతమూ తమ గుట్టును చాలా గోప్యంగా ఉంచారు.

శ్రీస్వామివారు స్వయంగా ఒకసారి భక్తులతో ఉత్తర దిక్కున తమ అన్నగారుండే వారని, వారు కూడా ఎప్పుడూ అగ్నిగుండమే సేవారని చెప్పారు. ఇద్దరూ పరిభాషలో సంకేతంగా మాట్లాడేవారు. ఇద్దరూ మహాసమాధిని గూర్చి ముందుగా చెప్పడమేగాక తరువాత గూడ శాశ్వతంగా తమ భక్తులననుగ్రహిస్తూ ఉంటామని అభయమిచ్చి అదేరీతిని తమ అభయాన్ని నెరవేరుస్తున్నారు. వీరిద్దరూ కలసి భక్తుల కొసంగిన దివ్యానుభవాలు పరిశీలిద్దాము.

ప్రఖ్యాత సాయిభక్తులైన ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు శ్రీస్వామివారిని ప్రథమంగా దర్శించిన విషయం ఇలా తెలియచేసినారు.

"1975 సం॥లో శివరాత్రినాడు ఉదయాన్నే పూజ చేసుకున్నాక గొలగమూడిలో శ్రీ అవధూత వెంకయ్యస్వామివారిని దర్శించాలని నాకు సంకల్పం కలిగింది. శ్రీస్వామివారి భక్తుడు, విద్యార్థి అయిన చి॥ రామకృష్ణారెడ్డిని నాతో రమ్మన్నాను. 'ఆయన గొలగమూడిలో ఉన్నారో లేదో ముందుగా విచారించాలి. ఆయన ప్రక్క గ్రామాలకు వెళ్ళుతుంటారు' అన్నాడు రామకృష్ణ. ఉదయం 8:30గంటలకు నేను సాయికి అగరువత్తి సమర్పించి 'సాయి! మీరు సకల సాధు స్వరూపులు, శ్రీ వెంకయ్యస్వామివారి రూపంలో వున్న తమను దర్శించ వెళ్ళుతున్నాను. వారి సన్నిధి, ఆశీర్వచనమూ విశేషంగా లభించాలి!" అని ప్రార్థించి బయల్దేరాను. సుమారు ఉ॥10 గంటలకు గొలగమూడి వెళ్ళే బస్సు మాకెదురైంది. మేమందులో ఎక్కగానే శ్రీస్వామివారి తంబురను పట్టుకొని వున్న ఒక సాధువును రామకృష్ణ గుర్తుపట్టి విచారించాడు. ఆ సాధువు 'శ్రీస్వామివారు నాలుగు రోజుల క్రిందట నెల్లూరు వచ్చి దత్తాత్రేయ మఠంలో విడిది చేశారు. మొదట వారక్కడ పదిరోజులుంటామన్నారు. అందువల్ల వారు నిర్వహించే నిరంతరాగ్నిహోత్రానికి అవసరమైన కట్టెలు కూడా భక్తులు సిద్ధం చేశారు. కానీ వారీ ఉదయం 8:30 గంటలకు తాము తక్షణమే గొలగమూడి బయలుదేరాలని చెప్పారు. వెంటనే భక్తులు వారిని గుఱ్ఱపుబండిలో అక్కడకు పంపారు. వారు అరగంట క్రిందట గొలగమూడి చేరి వుండాలి' అన్నాడు. కొద్ది నిమిషాలలో మేము శ్రీస్వామివారి సన్నిధికి చేరాము. శ్రీస్వామివారు ఆకస్మికంగా గొలగమూడి చేరడంతో భక్తులెవ్వరూ ఆయన దర్శనార్థం అక్కడకు రాలేదు. నేను, రామకృష్ణారెడ్డి మాత్రమే సుమారు ఆరుగంటలు వారి సన్నిధిలో ప్రశాంతంగా గడిపాము. మా ఇద్దరినీ, గురువారపు భజన బృందాన్నీ ఎంతో గొప్పగా ఆశీర్వదించారు శ్రీస్వామివారు. కనుక శ్రీస్వామివారు తమ రూపమేనని శ్రీ సాయి నాకు తెలిపినట్లనిపించింది. తరువాత అప్పుడప్పుడూ నేను, మా సత్సంగసభ్యులు శ్రీస్వామివారిని దర్శిస్తూ వచ్చాము."

ఒకరోజు శ్రీస్వామివారు కలిచేడు నుండి మజిలీ మార్చాలని సామాన్లు బండికెక్కించమన్నారు. సామానంతా ఎక్కించి శ్రీస్వామివారిని బండి ఎక్కమంటే

'పొయ్యేందుకు వీలులేదు. సామాను బండి నుండి దించి బండివానికి ఆరు రూపాయలిచ్చి పంపమ'ని ఆజ్ఞాపించారు. ప్రయాణము ఎందుకు నిలుపుతున్నారో సేవకులకు అర్థం కాలేదు.

ఆ రోజు ఉ॥ 9 గంటలకు సోదరుడు శేషాద్రి విద్యానగర్ నుండి శ్రీస్వామివారి దర్శనానికై బస్సు దిగాడు. శ్రీస్వామివారు అకస్మాత్తుగా ప్రయాణము ఆపుకోడానికి కారణం అప్పుడు అందరికీ అర్థమయింది. విద్యానగర్ నుండి శ్రీస్వామివారి దర్శనానికి బయలుదేరబోతూ శ్రీస్వామివారి దర్శనమిప్పించమని శ్రీసాయిని శేషాద్రి ప్రార్థించిన సమయంలోనే ఇక్కడ శ్రీస్వామివారు ప్రయాణం విరమించుకున్నారు! సకలసాధుస్వరూపి శ్రీ సాయి, శ్రీస్వామి వేరుకాదు కదా!

1980 సం॥లో ఆశ్రమంలో సమాధి మందిరం కట్టేందుకు ఇటుకలు తీసుకొచ్చిన లారీ వచ్చింది. ఆరోజు శ్రీస్వామివారు అందరినీ ఇప్పుడున్న సమాధి మందిర ప్రాంతంలో పడుకోమన్నారు. 'అయ్యా ఇక్కడ పెంచల కొండంత మశీదు పడుతుందయ్యా' అని అన్నారు. వారి సమాధి మందిరం ఒక సంవత్సరం లోపల వెలిసింది.

కాని వారు తమ సమాధి మందిరాన్ని '**మసీద**'ని ఎందుకన్నారో ఆలోచించవలసి యున్నది. ద్వారకామాయి పేరు పెట్టి మసీదులో నివసించిన మహనీయుడు శ్రీ శిరిడి సాయినాథుడే. ఇచ్చట మతభేదం లేకుండా సర్వమతస్తులు వారి వారి మతానుసారం దైవాన్ని ఆరాధిస్తారు. అంతేగాక మసీదు అని పిలువబడుతూ హిందూ దేవాలయములలోవలె గంటలు కొట్టడం, తులసిమాతను పూజించడం ఒక్క శిరిడిలో తప్ప మరెక్కడా లేదు. **శిరిడిలో వలె గొలగమూడిలో గూడా సర్వమతస్తులు శ్రీస్వామివారిని ఆరాధించి వారి కృపను పొందుచున్నారు.** కనుక శ్రీస్వామివారు తమకు, శ్రీసాయినాథునకు భేదం లేదని తెలుపుచున్నారు.

1980 సం॥లో శ్రీస్వామివారు తలుపూరులో నారాయణదాసుగారి ఆశ్రమంలో విడిది చేసియున్నారు. శ్రీస్వామివారి సేవకుడు గురవయ్యగారికి నేను శ్రీ సాయిలీలామృతం చదివి వినిపించాక వారా గ్రంథాన్ని పారాయణ చేస్తున్నారు. ఒకరోజు నేను, గురవయ్య ప్రక్క ప్రక్కగా శ్రీస్వామివారి సన్నిధిలో పడుకొని నిద్రిస్తున్నాము. అర్థరాత్రివేళ గురవయ్య నలభై గజాల దూరం

వెళ్ళి తిరిగి వస్తూ 'నీవు నిద్ర వల్ల వెంటనే లేచి రాలేక పోయావు, ఇప్పుడే సాయిబాబా వచ్చి వెళ్ళిపోయారు. ఆయన వచ్చి నా ప్రక్కన నిలుచున్నారు. నాకు మెలుకువ వచ్చి లేచి పాదాభివందనం చేయబోతే కదిలిపోతూ ఉన్నారు. నేను వెంబడించి గేటు దాకా వెళ్ళాను. వారక్కడ అదృశ్యమైనారు' అని చెప్పారు. వారి ఉద్రేకం చూస్తే నిజంగా శ్రీసాయి భౌతికంగా దర్శన మిచ్చినట్లే ఉన్నారు. శ్రీస్వామివారి సన్నిధిలో వారి ప్రధాన సేవకునకు శ్రీ సాయి భౌతికదర్శనమిచ్చి అనుగ్రహించడం శ్రీస్వామికి, శ్రీసాయికి గల సన్నిహిత సంబంధం తెలుపుతుంది.

వైద్యుల సుధాకర్ మరదలు గీతాభవాని ఇలా చెబుతుంది. "మా తల్లిదండ్రులకు నన్ను మా మేనమామగారైన వైద్యుల సురేష్‌గారికి ఇచ్చి వివాహం చేయాలని కోరిక. నన్ను చేసుకోవడం ఆయనకు ఇష్టం లేదు. వారిని వివాహమాడటం నాకిష్టమే గనుక వారితో నా వివాహమైతే దంపతులం వచ్చి శ్రీస్వామివారిని దర్శించి ఆశ్రమంలో నిద్రచేస్తామని మ్రొక్కుకున్నాను. ఈ విషయం చెప్పకుండా మా అక్క శ్రీస్వామివారి దారాన్ని మా మామగారి మణికట్టుకు కట్టింది. శ్రీస్వామివారి దారం కట్టుకుంటే మంచిదని చెప్పింది. ఒక్క నెల కూడా గడవకుండానే మా మామగారి అంగీకారంపై మా వివాహం జరిగింది. మ్రొక్కుబడి ప్రకారం శ్రీస్వామివారి ఆశ్రమంలో మా దంపతులిద్దరం నిద్ర చేశాము, నాటి రాత్రి శిరిడీ సాయినాథుడు నా స్వప్నంలో కనిపించి 'నీ వివాహమైంది గదా నాకు సత్యనారాయణ స్వామి పూజ చేయించు' అన్నారు. 'స్వామీ! మా ఇల్లు చాలా చిన్నది. పెద్ద ఇల్లు కట్టిస్తే అట్లాగే చేస్తా'నని అన్నాను. 'ఈ దారం నీవు కట్టుకో' అని ఒక దారం ప్రసాదించి అదృశ్యులైనారు. తెల్లవారి చూస్తే నిజంగానే నా పడకపై శ్రీ సాయి ప్రసాదించిన శ్రీస్వామివారి దారం ఉంది".

బాబా తమ భక్తులకు విభూతి మాత్రమే ప్రసాదించడం సాంప్రదాయం. శ్రీ వెంకయ్యస్వామివారు తమ భక్తులకు తమ ఆశీర్వాద సూచకంగా విభూతితో దారము కూడా ప్రసాదించడం పరిపాటి. శ్రీ వెంకయ్య స్వామివారి ఆశ్రమంలో వారి మ్రొక్కు తీర్చుటకు వెళ్ళిన సమయంలో శ్రీసాయినాథుడు ఆమెకు శ్రీ వెంకయ్య స్వామివారి దారం ప్రసాదించారంటే శ్రీసాయినాథునకు, శ్రీ వెంకయ్యస్వామివారికి భేదం లేదని తెలిపారన్నమాట.

గుంటూరు నివాసి జి.వి. రమణమూర్తి ఇలా వ్రాస్తున్నారు. "శిరిడీ

సాయినాథుని చరిత్ర పారాయణ ద్వారా వారితో నాకు చాలా అనుభవము లున్నాయి. వారికి, శ్రీ వెంకయ్యస్వామివారికి భేదం లేదని నిరూపించారు. నేనొక సమస్యతో తికమక లాడుతుండగా నాకు శ్రీ వెంకయ్యస్వామివారి చరిత్ర గ్రంథం లభించి తెరువగానే నాకు కావలసిన సందేశం లభించడంతో ఆ గ్రంథం ఆమూలాగ్రం పారాయణ చేశాను. అప్పట్లో నాకు గల గ్రహబాధల నివారణార్థం జొన్నవాడ కామాక్షమ్మ సన్నిధికి చేరాను. నాటి రాత్రి కామాక్షమ్మ, మల్లిఖార్జునస్వామి నాకు మంత్రోపదేశం చేసి అన్నీ చక్కబడుతాయని శెలవిచ్చారు. మెలకువ వచ్చింది. కానీ కళ్ళు మూసుకొనియున్నాను. "అయ్యో! నీవు మూడు రోజులు నా దగ్గరుండాలయ్యో" అనే మాటలు స్పష్టంగా వినిపించాయి. ఆ మాటల పొందిక శ్రీ వెంకయ్యస్వామి వారిదేనని తెల్లవారి గొలగమూడి చేరాను. ఆనాటి రాత్రి నేను మెలుకవగానే పడుకొని వున్నాను. రాత్రి 10 గంటల సమయం. ప్రక్కన భజన జరుగుతూ ఉంది. కాళ్ళ వద్ద శ్రీ శిరిడీ సాయి, శ్రీ వెంకయ్యస్వామివారు చెరొకవైపు నిలుచుకొనియున్నారు. కళ్ళు తెరిచి స్పష్టంగా చూస్తున్నాను. తన్మయత్వంలో లేవాలని గాని, మాట్లాడాలని గానీ అనిపించలేదు. వారు నా వైపే చూపిస్తూ 'రా బయటకు' అన్నారు. నాలో నుండి ఆకుపచ్చ చీర ధరించి రవిక లేని ఒక వికటరూపిణి బయటకొచ్చి నిలిచింది. 'పో! ఇక్కడ నుండి' అని స్వామి ఆజ్ఞాపిస్తున్నారు. 'నేను ఈయనను నమ్ముకొనియున్నాను. ఎచ్చటికి వెళ్ళగలను. ఇంకెవరినైనా చూపండి పోతాను' అన్నది. వెంటనే బాబా చేతిలోని సటకాను శ్రీస్వామివారు తీసుకొని దానితో ఆ వికటరూపిణి మెడపై పెట్టి నెట్టారు. ఆమెకు కరెంట్‌షాకు కొట్టినట్లుగా అరచి వెళ్ళిపోయింది. నాటితో నాకున్న గ్రహబాధ తీరిపోయింది. (పిలిచిన పలికే దైవం!)

"గుంటూరులో నేను బాడుగ స్థలంలో పెట్టియున్న టీకొట్టు మరొకరికి అమ్మాలనుకొన్నాను. నాటి రాత్రి నాకు బాబా కలలో 'అమ్మేస్తే ఏమి తినాలనుకున్నావు' అన్నారు. మరొక స్త్రీ 'నీకు మరొక స్థలం చూపుతానంటోంది' అంతటితో స్వప్నం నుండి మెలకువ వచ్చింది. కానీ బాబా మాట లెక్క చేయక కొట్టు అమ్మేశాను. అది మొదలు బాబా చెప్పినట్లే అనేక కష్టాలకు గురియై అన్నానికి ఇబ్బందైంది.

"ఇట్లాగే ఒకరోజు బాబా స్వప్నంలో 'నాలాంటి కుమార్తె పుడుతుంది'

అన్నారు. కానీ నేను ఆడపిల్ల నాకక్కరలేదని అబార్షన్ చేయించాను. కష్టాలు తప్పలేదు. ఆ తరువాత మరలా నా భార్య 7వ నెల గర్భవతిగా నుండగా శ్రీ వెంకయ్యస్వామివారు నా స్వప్నంలో 'చల్ల అవుతుంది. నా దగ్గరకు రా' అని చెప్పారు. ఆ మాట నాకు అర్థంగాక శ్రీస్వామివారి దర్శనానికి వెళ్ళక అశ్రద్ధ చేశాను. ఫలితంగా నా భార్య గర్భంలో పిండం చల్లబడి చనిపోయింది. ఆపరేషన్ చేసి తీయడంలో ఆమెకు ప్రాణాపాయమైంది. కానీ బాబా నా ప్రార్థన మన్నించి ఆమె గుండెలపై తమ హస్తమునుంచినట్లు దర్శనమైంది. అప్పుడు ఆమెకు గండం గడిచి బ్రతికింది.

"నా స్వప్నంలో బాబా కనిపించి ఊరి వెలుపలొక స్థలం చూపి కొనమన్నారు. కానీ అది వ్యాపారానికి అనువైన చోటు గాదు. కనుక బాబా ఇలాంటి స్థలం చూపారేమిటి అని బాధపడి బాబాను, శ్రీస్వామివారిని ఇద్దరినీ ప్రార్థిస్తున్నాను! అటు తరువాత శ్రీవెంకయ్యస్వామివారు కలలో 'నీకా స్థలం వద్దా?' అన్నారు. అటు తరువాత శ్రీ వెంకయ్యస్వామి, బాబా ఇద్దరూ స్వప్నంలో వచ్చి గుంటూరు సెంటర్‌లో ఒక స్థలం చూపి కొనమన్నారు. ఆ స్థలం బేరం చేస్తే అసలు ఇవ్వమన్నారు. పూర్వం శ్రీస్వామివారి ఆజ్ఞను పాటించని ఫలితంగా అనేక కష్టాలు పడ్డాను గనుక ఈసారి ఎంత ఖరీదైనా దాన్ని కొనాలని అనేక ప్రయత్నాలు చేశాను. ఆఖరుకు 40 వేలు ముందుగా ఇస్తే తరువాత తీరిక ఉన్నప్పుడు రిజిష్టరు చేస్తానన్నాడు. అలాగే అప్పు తెచ్చి 40 వేల రూపాయలు చెల్లించాను. అమ్మిన అతను మోసగాడు. 'నీ డబ్బు పోయిందని' అన్నారు అందరూ. కానీ బాధ్యత శ్రీ స్వాముల మీద ఉంచి నిశ్చింతగా ఉన్నాను. చిత్రంగా ఒకనాటి ఉదయం అతనే వచ్చి రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ విధంగా శ్రీసాయినాథుడు, భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారు భేదభావం లేకుండా కలసికట్టుగా భక్తరక్షణ చేస్తున్నారు. అది నా అదృష్టం."

వల్లపురెడ్డి నారాయణరెడ్డిగారికి, వారి తల్లిగారికి శ్రీస్వామివారు ప్రాణభిక్ష పెట్టిన విషయం భక్తులకు తెలిసినదే. కాలాంతరంలో శిరిడీ సాయినాథుని చరిత్ర పఠన ద్వారా వారిపై ఆయనకు భక్తి, శ్రద్ధలేర్పడి శ్రీసాయిని కూడా స్మరించేవారు. ఒక దినము విపత్కర పరిస్థితిలో శ్రీస్వామివారిని, సాయిని కూడా ప్రార్థింపగా నాటి రాత్రి శ్రీస్వామివారు స్పష్టంగా, శరీరముతో ఉన్నప్పటి గొంతుతో, "వారిని స్మరించినా నన్ను స్మరించినట్లే"

అని స్పష్టంగా పలికారు.

ఒకప్పుడు శ్రీస్వామివారి దివ్యత్వం గూర్చి విని వారిని దర్శించాలని ఎంతో భక్తి, శ్రద్ధలతో శ్రీభరద్వాజ మాష్టరుగారి అత్తగారు, మరదలు, మరికొంతమంది తలుపూరు చేరారు. కానీ అదే సమయానికి శ్రీస్వామివారు మరొక అడ్డతోవన బండిలో ప్రక్క గ్రామమైన కలిచేడు చేరారు. ఆ విషయం తెలిసి బస్సు లేనందున మాష్టరుగారి అత్తగారు 56 సం॥ వయస్సులో తన వృద్ధాప్యాన్ని, బలహీనతను గూడా లెక్క చేయక మిట్ట మధ్యాహ్నం ఎండలో అందరితో కలసి మూడు మైళ్ళు నడిచి కలిచేడు చేరి శ్రీస్వామివారికి నమస్కరించారు. అప్పట్లో ఎల్లప్పుడూ మౌనవ్రతంలో ఉండి ఎవ్వరినీ తాకనివ్వకుండా ఉంటూన్న శ్రీస్వామివారు, కాగితాలపై వేలిముద్రలు వేసి భక్తులకు ఇస్తూ త్వరత్వరగా కాగితాలు తమ బొటనవ్రేలి క్రింద ఉంచమని వారిని ప్రోత్సహించారు. ఆ పనిలో ఆడవాళ్ళ చేతులు శ్రీస్వామివారికి తగులుతున్నాసరే శ్రీస్వామివారు వారినేమీ ఆటంకపరచలేదు. వారి భక్తి శ్రద్ధలను శ్రీస్వామివారు అంగీకరించి ఆ విధంగా అనుగ్రహించారు.

శ్రీస్వామి దర్శనము, స్పర్శ తమకు శ్రీ సాయినాథుని అనుగ్రహం వలన ప్రాప్తించాయని, శ్రీ శిరిడీ సాయి, శ్రీస్వామివారు వేరు కాదనీ వారానందించారు.

తన అవసాన దశలో ఒక సంవత్సరం పాబోలు సుబ్బమ్మ నిరంతరం శ్రీసాయినాథుని నామజపం చేసిన ధన్యజీవి. వీరి అంతిమ ఘడియలో శ్రీస్వామివారు తమ ఆశీస్సులు, పాదతీర్థం ఈమెకు పంపారు. శ్రీస్వామివారి పాదతీర్థం స్వీకరించి చివరి శ్వాస వదలిన ధన్యజీవి. సాయినాథుని నామం చేస్తుంటే శ్రీస్వామివారు తమ పాదతీర్థం పంపారంటే వారిద్దరికీ భేదమే లేదని గదా భావము. **రూపనామములకతీతమైన వారే మహాత్ములు. అట్టివారే అంతటా నిండియుండగలరు. అంతటా నిండియున్నది ఒకే తత్వం గదా. అదే మన స్వామివారు.**

శ్రీస్వామివారు ఎప్పుడు కూడా క్రొత్త గ్రామాలకు, ప్రదేశాలకు వెళ్ళేవారు కాదు. తాము తరచుగా పర్యటించే గ్రామాలలోనే ఆయా స్థలాలలోనే మరలా మరలా విడిది చేసేవారు. శ్రీస్వామివారిని ఎప్పుడైనా భక్తులు

ప్రాధేయపడి ఏదైనా క్రొత్త స్థలానికి తీసుకుపోతే ఒక్కరోజు ఉండేసరికి గగనమైపోతుంది. శ్రీస్వామివారు వెంటనే ఆ చోటు వదలి వెళ్ళిపోయేవారు. శ్రీస్వామివారు ఎప్పుడూ నెల్లూరు జిల్లాలోని విద్యానగర్ గ్రామానికి వెళ్ళియుండలేదు. కానీ ఒకరోజు ఎవరియొక్క ఆహ్వానం లేకుండానే తన బృందంతో విద్యానగర్ చేరారు. అప్పుడే క్రొత్తగా నిర్మించబడి ప్రారంభోత్సవమునకు ఎదురుచూస్తున్న శ్రీశిరిడీ సాయిబాబా మందిరంలో సమాధి నిర్మించబోవు వేదికపై తమ పవిత్రమైన అగ్నిగుండాన్ని ఐదు రోజుల పాటు నిర్వహించి ఆ మందిరాన్ని పావనమొనర్చారు.

రెండవరోజు తమ సేవకులు 'మరొక గ్రామము వెడదాము స్వామీ!' అంటే 'పొయ్యేందుకు దోవ కనబడడం లేదయ్యా! ఇచట ఇరవై ఒక్క కోట్లు జమ కట్టవలసియున్నది' అని సెలవిచ్చారు. ఆచార్య శ్రీభరద్వాజగారు సాయినాథునకు పూజ చేస్తూ 'ఆసనం సమర్పయామి' అన్నప్పుడు, అంతవరకు పడుకొనియున్న శ్రీస్వామివారు లేచి కూర్చున్నారు. 'నైవేద్యం సమర్పయామి' అన్నప్పుడు, గంజి కావాలని శ్రీస్వామివారు అడిగి గంజి పోయించుకొని త్రాగారు. బాబాకు భక్తులు హారతి చేస్తుంటే ఎంతో శ్రద్ధగా హారతందుకొన్నారు. 'ఈ మందిరంలో మీకెలా ఉంది స్వామీ!' అంటే 'చాలా బాగుందయ్యా' అంటూ వారి పరిభాషలో మందిరమునకు ఆశీస్సులు అందజేశారు.

ఏనాడూ పూలమాలలు అంగీకరించని శ్రీస్వామివారు, శ్రీ భరద్వాజగారు వారి పాదములపై చామంతి పూలుంచి నమస్కరిస్తే మౌనంగా అంగీకరించి ఆశీర్వదించారు. శ్రీస్వామివారు పూలను అంగీకరించరని ఒక సేవకుడు ఆ పూలను తీసివేయబోతే శ్రీస్వామివారు అతనిని నివారించి ఆ పూలను అక్కడ నుండి కదిలించనీయలేదు. ఈ విధంగా శ్రీస్వామివారు శ్రీ సాయినాథునితో అభేదస్థితిని మనకెరుకపరచారు.

పొదలకూరు నివాసి పి.పెంచలయ్య ఇలా తెలిపారు.

"శ్రీస్వామివారు నడిచే రోజులలో నేను వారిని కొన్నాళ్ళు సేవించాను. అది మొదలు శ్రీస్వామివారి పటాన్ని ప్రతినిత్యం పూజిస్తుంటాను. ఒకరోజు 4 సం॥ వయస్సు గల మా కుమార్తె పద్మను సైకిల్ మీద తీసుకుపోతుంటే యాక్సిడెంటై మా పాప కాలు విరిగింది. 'నేను నిమిత్త మాత్రంగా కట్టు కట్టిస్తాను. కానీ కాలు బాగుపరచవలసిన బాధ్యత తమదే స్వామీ' అని


శ్రీస్వామివారిని ఆర్తితో ప్రార్థించాను. నాటి రాత్రి శ్రీస్వామివారికి బదులు శ్రీ శిరిడీ సాయిబాబా స్వప్నదర్శనమిచ్చి 'నాయనా, కాలు బాగవుతుంది బాధపడవద్దు' అని చెప్పి ఆమె కాలికి ఒక పసరు పూసి కట్టు కట్టారు. శ్రీసాయినాథుడు చెప్పినట్లే ఒకే ఒక కట్టుతో పాప కాలు అతుక్కొని చక్కగా నడువగలిగింది. స్వప్నదర్శనమైన తెల్లవారి నెల్లూరు సాయిబాబా మందిరం వెళ్ళి బాబాకు పూజ చేయించి ఒక బాబా పటం తెచ్చి శ్రీస్వామివారి పటం ప్రక్కన స్థాపించి ప్రతినిత్యం ఇద్దరినీ పూజిస్తున్నాను. ఈ మహనీయులిద్దరికీ ఎలాంటి భేదమూ లేదు. లేకుంటే శ్రీస్వామివారి పటాన్ని పూజిస్తూ బాబాను గూర్చి బొత్తిగా పరిచయంలేని నాకు బాబా దర్శనమీయడమేమిటి!

"ఆగష్టు నెల 1986 లో శ్రీస్వామివారంటే భక్తి, శ్రద్ధలు గల్గి, నా యందు ప్రేమాభిమానములు గల మా మరదలుకు ప్రమాదకరమైన జబ్బు చేసి వెంటనే మద్రాసు తీసుకువెళ్ళారు. నాకీ వార్త తెలిసి 'ఏమి స్వామీ! ఇంతటి ఆత్మీయురాలు ఆపదలో ఉంటే కళ్ళ చూపులు కూడా లేకుండా దూరంగా పంపేశారు. దయచేసి ఆమెకు ఆరోగ్యం చేకూర్చి మరలా నేనామెను చూచేటట్లు అనుగ్రహించండి' అని ప్రార్థించాను. వెంటనే నా కన్నులు మూతపడి ఒక దృశ్యం పొడ కట్టింది. 'సాయిబాబా నా దగ్గరకొచ్చి మా మరదలును చూపిస్తా'నని నన్ను క్షణంలో మద్రాసు తీసుకువెళ్ళి ఆమె మంచం దగ్గర నిలిపారు. 'చూడు నాయనా ఈమెకు తప్పక నయమవుతుంది. ఇంజక్షను చేస్తున్నాను' అని ఇంజక్షను చేశారు. నాకు మెలకువ వచ్చింది. మా మరదలుకు జాబు వ్రాసి కనుక్కుంటే సరిగ్గా నాకు దృశ్యం గోచరించిన సమయంలో ఆమెకు గూడా బాబా స్వప్న దర్శనమిచ్చి ఇంజక్షను చేసి బాగవుతుందని ఆశీర్వదించారని జాబు వచ్చింది. అనతి కాలంలో ఆమె పూర్ణ ఆరోగ్యవంతు రాలైంది. శ్రీస్వామివారు, శ్రీసాయి వేరుగాదు. వారు నామరూపాల కతీతులైన పూర్ణ గురుతత్వం మాత్రమే."

# అవధూత లీల

## అధ్యాయము - 25

## మహాసమాధి



శ్రీస్వామివారు తమ సమాధికి ముందు సుమారు రెండున్నర సంవత్సరములపాటు తమ పర్యటనలు మాని గొలగమూడిలోని పూరిపాకలో నివసించసాగారు. రాత్రింబవళ్ళు అంతు తెలియని భాషలో తాము చెప్పే మాటలను పెద్దగా అరుస్తూ తమ సేవకుడు గురవయ్యను తిరిగి పెద్దగా చెప్పమనేవారు. గురవయ్య అలసిపోయి అలా చెప్పకుంటే మరుక్షణమే "ఏమయ్యా పలకవు, చెప్పు" అని తొందర చేసేవారు. శ్రీస్వామివారు చెప్పే మాటలు తిరిగి చెపుతూ రాత్రింబవళ్ళు గురవయ్య ప్రక్కనుండవలసిందే. అతడు అన్నానికి పోతే మరొకరైనా చెపుతుండాలి.

మహాసమాధికి కొన్నాళ్ళ ముందు శ్రీస్వామివారు వారి దుప్పట్లు, గోచీ గుడ్డలు అన్నీ లెక్క పెట్టి గురవయ్యకు ఇచ్చి 'ఇవన్నీ జాగ్రత్తగా దాచి పెట్టయ్యా' అన్నారు. **"సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురుసేవ"** అని పదేపదే అరిచేవారు.

మహాసమాధికి ఒక సంవత్సరం ముందు నుండీ "చెప్పులయ్యా చెప్పులు" అని పదే పదే అడిగేవారు. చెక్క పలకలు వగైరా ఇస్తే "ఇవి కాదయ్యా అసలు చెప్పులు కావాలయ్యా" అన్నారు. గంధపు చెక్కతో పాదుకలు తయారు చేయించాలంటే భక్తులకు వీలుకాలేదు. ఒకరోజు రోశిరెడ్డి కుమారుడు పావుకోళ్ళు చేయించి శ్రీస్వామివారికి సమర్పించాలని తెస్తున్నాడు. శ్రీస్వామివారు ఆశ్రమంలో "చెప్పులు చెప్పులు" అని అరుస్తున్నారు. వారు తెచ్చిన పాదుకలు శ్రీస్వామివారికిస్తే వాటిని గట్టిగా కౌగిలించుకున్నట్లు గుండెలకేసి అదుముకొని చాలాసేపు ఇవ్వలేదు. ఆ పవిత్ర పాదుకలే శ్రీస్వామివారు నిర్యాణం చెందిన పూరిపాకలో నేడు ప్రతిష్ఠించబడి యున్నవి.

అలనాడు శ్రీరాముడు తన ప్రతినిధిగా తన పాదుకలను భరతునకు ప్రసాదించారు. దత్తక్షేత్రాలైన గంధర్వపురంలోను, నరసోబావాడిలోను

నృసింహసరస్వతి లాంటి మహనీయులు తమ ప్రతి రూపాలుగా తమ పాదుకలే ప్రతిష్ఠించారు. అక్కల్‌కోటస్వామి తమ శిష్యులకు తమ పాదుకలనే ప్రసాదించారు.

అట్టి మహనీయుల సాంప్రదాయమునకు చెందిన శ్రీ వెంకయ్య స్వామివారు కూడా మనకు తమ దివ్యశక్తిని నిక్షిప్తము చేసి ఈ పాదుకలను తమ ప్రతిరూపంగా మనకు ప్రసాదించారు. ఆ పాదుకలను మనం తగు శ్రద్ధాభక్తులతో పూజించి వారి అనుగ్రహానికి పాత్రులగుదుముగాక!

1982లో శ్రీరామనవమి రోజు సీతారామలక్ష్మణులు వచ్చి 'నీకు టైం అయిపోయింది. శరీరం వదలి వచ్చేసేయ్' అని శ్రీస్వామివారిని పిలుస్తున్న దృశ్యం గురవయ్యకు స్పష్టంగా గోచరించింది.

శ్రీరామనవమి రోజు శ్రీస్వామివారికి ఎంతో తీవ్రంగా జబ్బు చేసింది. ఆనాడే ఆయన దేహత్యాగం చేస్తారని భక్తులనుకొన్నారు. శారీరకంగా చాలా బాధ కూడా పడ్డారు. కానీ మరురోజుకంతా ఆరోగ్యవంతులైనారు.

మహాసమాధికి రెండు నెలల ముందు శ్రీస్వామివారు ఆయాసంతో చాలా బలహీనంగా ఉండినారు. ఒకనాడు 'నేను వెళ్ళిపోతున్నాను' అని చీటీ వ్రాయించారు. స్పృహలేకుండా కొన్ని గంటల సేపు ఉండినారు. అందరూ నిజంగానే శ్రీస్వామివారు శరీరం చాలిస్తున్నారు అని ఆ సమయంలో బాధపడుతున్నారు. కొన్ని గంటల తరువాత తిరిగి లేచి కూర్చొని 'పై వాళ్ళు ఒప్పుకోలేదు. ఇంకా కొంత కాలం ఉండి రమ్మన్నారయ్యా!' అని చెప్పారు.

శ్రీస్వామివారు మహాసమాధి చెందబోయే ముందు వారం రోజుల నుండి శ్రీస్వామివారి ముఖంలో రోజుకొక కళ తగ్గుతూ వచ్చింది. గురవయ్యకు శ్రీస్వామివారిలో అదృశ్యంగా అప్పుడప్పుడు కనిపిస్తూండిన ఎనిమిది శిరస్సుల నాగేంద్రుడు మహాసమాధికి ముందు రోజు (23-8-82) శ్రీస్వామివారి నుండి నిష్క్రమించినట్లు దర్శనమైంది.

మహాసమాధికి నాలుగు రోజుల ముందు (ఆగష్టు 20, 1982) ఒక దివ్యమైన రథం వచ్చి శ్రీ స్వామివారిని ఎక్కించుకున్నారు. గురవయ్య కూడా ఎక్కబోతే 'నీవు ఇప్పుడు కాదు, దిగు' అని బలవంతంగా దింపేసి శ్రీస్వామివారిని మాత్రం రథంలో ఆకాశంలోకి తీసుకు వెళ్ళినట్లు గురవయ్యకు

స్వప్న దర్శనమైంది.

మహాసమాధికి మూడు రోజుల ముందు అప్పటికే ముందుగా నిర్మించియున్న సమాధి మందిరంలో నిత్య పూజలందుకుంటున్న శ్రీస్వామివారి చిత్రపటం, శ్రీస్వామివారి వెనుకనున్న శిరిడి సాయిబాబా పటము ప్రక్కకు కదిలి నిలుచున్నట్లుగా గురవయ్యకు దృశ్యం గోచరించింది. అప్పటికి శ్రీస్వామివారు చాలా బలహీనంగా ఉన్నారు. 'శ్రీస్వామివారు కూడా బాబాలాగా చాటై పోతున్నారు. ఇక వారి పటానికే పూజ చేసుకోవాలి గామోలు' అని అనుకున్నాడు గురవయ్య! అదే నిజమైంది. మూడు రోజుల తరువాత శ్రీస్వామివారు నిజంగానే మహాసమాధి చెందారు.

మహాసమాధికి ముందు రోజులలో శ్రీస్వామివారు 'ప్రొద్దు గ్రుంకు తుందయ్యా!' అని పదే పదే అరచేవారు. ఒకవంక తమ అవతారలీలా కాలం సమాప్తమౌతుందని, మరొకవంక భక్తుల ఆయుష్షు కూడా క్షీణిస్తుందని కనుక త్వరపడి కాలాన్ని సద్వినియోగం చేసుకోమని శ్రీస్వామివారి భావం. ఇదే విధంగా శ్రీస్వామివారి మహాసమాధి ముందు రోజులలో రోశిరెడ్డికి పొద్దుగ్రుంకుతున్నట్లు దృశ్యం గోచరించింది.

శ్రీస్వామివారి మహాసమాధికి ముందు రోజులలో పాకలోని అన్ని పటాలకు పూజచేసి శ్రీస్వామివారికి హారతివ్వడం, తరువాత అన్ని పటాలకు హారతివ్వడం బుజ్జయ్యగారి అలవాటు. ఆగష్టు 24, 1982 మధ్యాహ్నం శ్రీస్వామివారు ఒక ప్రక్కకు వత్తిగిలి పడుకొని యున్నారు. బుజ్జన్నగారు హారతిస్తుంటే చివుక్కున బుజ్జన్న వైపు తిరిగి తమ కుడిచేత్తో హారతికి అభయహస్తం చూపించి పడుకున్నారు. శ్రీస్వామివారు శరీరంతో ఉండగా వారికి భక్తులిచ్చిన చివరి హారతి ఇదే. ఆ తర్వాత ఆనాడే వారు కొద్ది సేపట్లో మహాసమాధి చెందారు. అంతకు ముందు కొన్నాళ్ళ నుండి గురవయ్యగారు చదువుతూ ఉన్న 'మాధవదాసు చరిత్ర' ఆనాడే పూర్తి అయింది. దానిలో విమానం వచ్చి మాధవదాసుగారిని ఊర్థ్వ లోకాలకు తీసుకుపోవటం జరిగింది. ఆనాడే శ్రీస్వామివారు మహాసమాధి చెందారు.

శ్రీస్వామివారు ఆగష్టు 24, 1982 న సమాధి చెందారు. భక్తులు, సేవకులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. శ్రీస్వామివారి దేహాన్ని ఐదవ

రోజు అనగా 28-8-82 తేదీన సమాధి చేయబడుతుందని, ఈలోగా భక్తులందరూ అంతిమదర్శనం చేసుకోవచ్చుని ఆంధ్రజ్యోతి, ఆంధ్రపత్రిక వగైరా దినపత్రికలలో ప్రకటించారు.

ప్రతినిత్యం జనం తండోపతండాలుగా శ్రీస్వామివారి భౌతిక కాయాన్ని దర్శించసాగారు. నిరంతరం 'హరేరామ హరేరామ రామరామ హరేహరే, హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే' అని భక్తులంతా కన్నీటితో భజన చేయసాగారు. శ్రీస్వామివారు యోగనిష్ఠలో వున్నారని, మరలా తిరిగి మేల్కొంటారనీ తలచి భక్తులూ, సేవకులూ ఎంతో ఆశతో ఎదురు చూచారు. ఇలా మూడు రోజులు గడిచాయి. శ్రీస్వామివారి శరీరం ఎంతగానో ఉబ్బిపోయింది. మూడవరోజున శ్రీస్వామివారికి సన్నిహితంగా సేవ చేసిన గురవయ్యకు దివ్యమైన ఆవేశం కల్గి, 'శ్రీస్వామివారి దేహాన్ని ఈరోజే సమాధి చేయమంటున్నార'ని ఆ దేహాన్ని ఒక్కడే తన చేతులపైనెత్తుకొని ఆవేశంగా నూతనంగా నిర్మించబడియున్న మందిరంలోకి పరుగు తీశాడు.

శ్రీస్వామివారు సమాధి చెందినప్పుడు మూడు రోజులు దేహాన్ని అట్లాగే ఉంచినందున ఉబ్బింది. పల్లంరెడ్డి కృష్ణారెడ్డిగారు ఇది చూచి, 'శ్రీస్వామివారు మహాత్ములు గదా, మరి మామూలు మనిషి శరీరం వలె ఉబ్బిందే!' అనుకున్నాడు. శ్రీస్వామివారి దేహానికి స్నానం చేయిస్తుంటే చేయి తగిలిన చోటంతా పైతోలు లేచిపోతున్నది.

చొక్కా, బనీను తీసేసి కృష్ణారెడ్డిగారు సమాధి గుంటలోకి దిగి శ్రీస్వామివారి శరీరాన్ని అందుకున్నారు. అతడు శ్రీస్వామివారి దేహాన్ని సమాధిలో దించి బయటకు వచ్చేసరికి అతని రొమ్ము మీద అప్పుడే కారిన రక్తం అంటుకొని యుండడం చూచిన వారందరూ ఆశ్చర్యపోయారు. గాయం అతని రొమ్ముది కాదు. శ్రీస్వామివారి శరీరాన్ని, గురవయ్య ఆవేశంగా తన చేతుల మీద ఎత్తుకొని ఆశ్రమంలో నుంచి సమాధి మందిరంలోకి తీసుకు వస్తుండగా శ్రీస్వామివారి భుజానికి ముల్లు గీచుకున్నది కాబోలు శ్రీస్వామివారి దేహం నుండి అది కారినదని అందరూ గుర్తించారు.

మూడు రోజుల క్రిందట సమాధి చెందిన శ్రీస్వామివారి శరీరం నుండి క్రొత్త రక్తం రావటమే ఆశ్చర్యం. అది కేవలం కృష్ణారెడ్డికి కల్గిన

సందేహానికి శ్రీస్వామివారిచ్చిన సమాధానమే.

శ్రీస్వామివారు స్వహస్తాలతో శంకుస్థాపన చేయగా వారి ఆశీస్సులతో ముందుగానే నిర్మించబడియున్న సమాధి మందిరంలో 4అ॥ పొడవు, 4అ॥ వెడల్పు, 6అ॥ల లోతుగల గుంటను త్రవ్వి, గుంట ప్రక్కలకు సిమెంటుతో నాపరాళ్ళతికించి తొట్టివలె చేసి అందులో శ్రీస్వామివారి పాన్పు అమర్చి వారిని తూర్పు ముఖంగా కూర్చోబెట్టి పట్టువస్త్రం కప్పారు. తొట్టిలోని ఖాళీని మంచి గంధపు పొడి, కర్పూరము, ఉప్పు, పూలమాలలతో శ్రీస్వామివారి కంఠము వరకు నింపారు. ఆ పైన కొద్దిగా మట్టిపోసి దానిపై అత్తరు, పన్నీరు మొదలగు సుగంధ ద్రవ్యములు పోశారు. వారి ముఖం దివ్యకాంతులతో మెరిసిపోతూ ఉండగా ఎంతో బాధతో భక్తులు ఆ తొట్టిని నాపరాళ్ళతో మూసివేశారు. నాపరాళ్ళపై శ్రీస్వామివారు వాడుకున్న దుప్పటి పరచి వారి మట్టిముంత ఉంచి ఇటుకతో భూమిపై అరుగు నిర్మించి పాలరాళ్ళతో తాపడం చేశారు.

అన్నదానము, భజన కార్యక్రమములు 40వ రోజు మండలారాధన వరకు నిరాటంకముగా జరుగుతూనే ఉన్నాయి. మండలారాధనకు సుమారు పదివేల మంది భక్తులు హాజరై శ్రీస్వామివారికి తమ నివాళులు అర్పించారు. ఆనాడు అనేక గ్రామముల నుండి హరిదాసులు, భగవద్గీత ప్రవచనకారులు, భజన బృందాల వారు, పండరి భజనవారు ఎవరికి వారు తమ కార్యక్రమములు నిర్వహించుకొన్నారు. ఈ వచ్చిన భక్తాదులందరికీ శ్రీస్వామివారి కృపవలన షడ్రసోపేతమైన అన్నసంతర్పణెలా జరిగిందో శ్రీస్వామివారికే ఎరుక. అది మొదలుకొని ప్రతి నిత్యం ఉదయం 4 గం॥లకు, మధ్యాహ్నం 11 గం॥లకు, సాయంకాలం 6:30 గం॥లకు పూజ మరియు నైవేద్యము, రాత్రి 9 గంటలకు భజన, పవళింపు హారతి నిర్విఘ్నముగా సాగుచున్నవి. శ్రీస్వామివారు వెలిగించిన అగ్నిహోత్రము నిర్యాణానంతరము కొనసాగుచున్నది. నిత్యం రెండు వేళలా అన్నదానం జరుగుచున్నది.

మహాద్భుతమైన శ్రీ వెంకయ్యస్వామివారి యొక్క భౌతిక జీవితం అలా అంతమైనప్పటికీ తర్వాత అధ్యాయాలలో మనం గమనించనున్న వారి దివ్యమైన లీలామయ జీవితం ఇప్పటికీ యధాపూర్వం కొనసాగుతున్నది.

అంతేగాదు, అలా సూర్యచంద్రాదులున్నంత వరకూ తమ లీల కొనసాగవలసిందేనని వారే సవాలు చేసినట్లు చెప్పారు. అలా జరగాలంటే ఆయన నిజతత్వం ఎలాంటిదై ఉండాలి? దానిని గురించి మనమెంత ఆలోచించినా అది మన ఊహ మాత్రమే గదా? మన అవగాహనా శక్తిని బట్టి మనం అంచనాలను వేస్తాం. అది నిజం కావాలనేమున్నది? అందుకే వారి మాటలలోనే వారి తత్వాన్ని గమనిద్దాం.

ఒకసారి బాలయోగిగారి ప్రసక్తి వస్తే శ్రీస్వామివారిలా అన్నారు. 'ఆయన తన పని తాను చూచుకొని పొయ్యేవాడే గదయ్యా! ఆయనకు లోకుల సంగతి పట్టదే! మనమో! అందరి లెక్కలు సరిచెయ్యాల గదా!' కనుకనే సమాధికి రెండు సంవత్సరాల ముందు వరకూ నిరంతరం వివిధ గ్రామాలలో పర్యటిస్తూ భక్తుల లౌకిక, పారలౌకిక అవసరాలను తీరుస్తూండేవారు. శ్రీస్వామివారు ఆ ప్రయాణాలలో ఎంత శారీరక బాధ భరించేవారో తలచుకుంటేనే శరీరం గగుర్పాటు చెందుతుంది. అంతటి జీవకారుణ్యంతో అందరి బాధలు తీరుస్తూ ఉండబట్టి, నేటికీ వారి ఆశ్రమంలో ఎందరు అతిథులు వచ్చినా లేదనకుండా అన్నదానం జరుగుతుందంటే భక్తులకు శ్రీస్వామివారిపై గల ప్రేమయెంతో అర్థం కాగలదు. ప్రజలకు ఆయన తమ అమూల్యమైన తపోమహిమతో ఎన్నిరీతుల మేలు చేశారో వివరించలేము. వర్షాభావం వల్ల బాధపడుతుంటే కరువు కాటకమైన కాలంలో ఎన్నిమార్లు శ్రీస్వామివారు వర్షం కురిపించారో చెప్పలేము!

శ్రీస్వామివారు ఒకసారి తమ గూర్చి తామే ఇలా చెప్పారు. **'రావణుని చంపింది దశరథ పుత్రుడైన రాముడు కాదు నేనే! అతడు మూడు దెబ్బలకు పడిపోయాడు. ప్రహ్లాదుని పాత్ర గట్టిందీ నేనే. అందరినీ మింగిందీ నేనే'** 115
అంటే వారందరి రూపాలలో ఆయా లోక కళ్యాణ కార్యాలను ఎల్లప్పుడూ చేస్తున్న పరమాత్మ తత్వమే తామని శ్రీస్వామివారి భావము. ఈ భావంతోనే శ్రీరామకృష్ణ పరమహంస 'ఎవడు రాముడో, ఎవడు కృష్ణుడో అతడే ఈ రామకృష్ణుడు' అని వివేకానందునితో చెప్పారు. సకల సాధు సత్పురుషులు, దేవతలు తామేనని శ్రీసాయి తమ భక్తులకు అనుభవ పూర్వకంగా నిరూపించడంలోని భావం కూడా ఇదే. దశరథ కుమారుడైన రాముడు, ఆయనలో దివ్యావతారతత్వమే లేకుంటే, సామాన్యుడే అయ్యేవాడు. అప్పుడు

రావణ సంహారము కాజాలదు. కనుక రావణుని చంపింది రామునిలోని పరమాత్మ తత్వమే. అదే తామని శ్రీస్వామివారు పై మాటలలో చెప్పారన్నమాట.

మరొకసారి శ్రీస్వామివారిలా అన్నారు.

'అన్ని జీవులలో వెంకయ్య ఉన్నాడు అని వ్రాసుకో' అని చెప్పి చీటీ మీద లిఖిత పూర్వకంగా వ్రాయించారు.

శ్రీస్వామివారు మహాసమాధి చెందినప్పుడు తాను శ్రీస్వామివారిని దర్శించలేక పోయానని మాలెపాటి చెంచమ్మ దుఃఖించింది. నాటి రాత్రి శ్రీస్వామివారు స్వప్నదర్శనమిచ్చి 'నేనెక్కడికీ పోలేదు. ఇక్కడే ఉన్నాను. సాధించాలంటే చాలా టైం పడుతుంది' అన్నారు.

శ్రీస్వామివారు మహాసమాధి చెందిన నాటి రాత్రి శ్రీరామయ్య నాగుల వెల్లటూరులో తన పాకలో శ్రీస్వామివారి పటానికి పూజ చేస్తున్నాడు. శ్రీస్వామివారు పెద్ద వెలుగుతో గాలిలో వచ్చి తన పాకచుట్టూ తిరిగినట్లు దర్శనమైంది. తెల్లవారి శ్రీస్వామివారు మహాసమాధి చెందినట్లు మనిషి వచ్చి చెప్పారు.

'వెయ్యి గొఱ్ఱెలలో మన గొఱ్ఱె ఎక్కడున్నా నేరుగా కాలు పట్టి లాక్కురావచ్చు గదయ్యా' అన్నారు శ్రీస్వామివారు.

**అంటే శ్రీ సాయివలె శ్రీస్వామివారు గూడ తమ భక్తులెక్కడున్నా**
116 **వారిని తమ చెంతకు చేర్చుకోగలమని అభయమిస్తున్నారు.**

**శ్రీస్వామివారు వేలూరు రామానాయుడుతో అన్నారు 'అయ్యా!**
117 **నేను అందరిలాగా పిచ్చమ్మ, పెంచలనాయుడికి కలిగాననుకొంటున్నావా?' అని. జన్మించినపుడే తాము జనన మరణ రహితులైన ఆత్మయన్న జ్ఞానం వారికున్నట్లు ఈ విషయము తెలియజేస్తున్నది.**

చలమానాయుడు శ్రీస్వామివారితో అన్నాడు 'స్వామీ! రాముడు, కృష్ణుడు మొదలగు వారికి కూడా గురువున్నారు. మరి మీకు గురువు లేదు పాడూ లేదు, ఏంది స్వామీ?'

శ్రీస్వామివారు 'చలమానాయుడా! పిచ్చా ఏమి నీకు? ఇది పదోచూపు, నీవెరుగవులే, నీవు ఏమన్నా కోరుకో! వాటంతటవే వస్తాయి. నాకు

గురువెందుకయ్యా, నానెత్తిన మరలా?' అన్నారు.

ఆనాటి రాత్రి చలమానాయుడి భార్యకు శ్రీస్వామివారు ఒక దివ్యదర్శనం ప్రసాదించారు. బంగారు శరీరం, బంగారు నగలు ధరించి ఒక స్త్రీ, శ్రీస్వామివారిని మరొక మామూలు చర్మం గల స్త్రీకి చూపుతూ, 'వెంకయ్య స్వామి అంటే ఈయనే' అని చెబుతోంది. ఈ దృశ్యం చూచి చలమానాయుడి భార్య నిద్రలోనే 'ఈమె వచ్చింది. దణ్ణం పెట్టండి' అని రెండు మార్లు అరిచింది. ఏమిటని ఆమెను నిద్రలేపి అడిగితే పై విషయం చెప్పింది. నాయుడు పశ్చాత్తాపపడి శ్రీస్వామివారికి భజన చేయండి అని అందరిని ఉత్సాహపరచారు. పైన శ్రీస్వామివారు **'గురువెందుకయ్యా, నా నెత్తిమీద?' అన్నారని గమనించాము. దీని అర్థం తమకు మొదట గురువు** 118
**లేరని కాదు. ప్రస్తుతం వారున్న అద్వైతస్థితిలో మరలా తమకొక గురువంటూ అవసరం లేదని మాత్రమే.** కారణం ఒకప్పుడు పెంచలకోనలో ఎవరో ఋషీశ్వరుడు శ్రీస్వామివారి నాల్కమీద ఏమో వ్రాశారట గదాయని అడిగిన భక్తునితో 'మైసూరు మహారాజా దోవనపోతుంటే చూచామనుకో, మనకేమొస్తుంది? మనం చేసుకున్నదే గదయ్యా మనకు' అని అన్నారు. **అంటే ఆధ్యాత్మికంగా ఒక గొప్ప మహనీయుడు తమకు తారసిల్లారని వారు మౌనంగా అంగీకరించినట్లే అయింది. కాకుంటే పూర్వపుణ్యము,** 119
**ఉత్తమమైన పూర్వజన్మ సంస్కారమూ ఉంటేనేగానీ అటువంటి మహారాజుల కుటుంబములో ఒకడు జన్మించలేనట్లు ఈ జన్మలో సద్గురు అనుగ్రహాన్ని పొందజాలడని మాత్రమే వారి హెచ్చరిక.**

'భగవద్గీత అంతా 64 చూపులకు ఇవతల వాళ్ళకే ఉపయోగం. అంతకు పైచూపువారికి భగవద్గీత చాలదు' అన్నారు.

'ఒకప్పుడు పెంచలకోన అడవులలో 3 రోజులు రాత్రింబవళ్ళు గడిపేవాడిని. లోకం తెలిసేది కాదు, అన్నం, నీళ్ళ సంగతి తెలియదు. లోకం తెలిసినపుడు గోనుపల్లెకు వచ్చి ఎవరినైనా అడిగి పెట్టించుకు తినేవాడిని'.

'19, 20 సంవత్సరాల వయస్సులో పాము నా కాలిపై కాటేసి పడగ విప్పి నిలిచింది. ముల్లుగర్రతో కొట్టబోయాను. కానీ అది కరిచేసింది కదా కొట్టి మాత్రం లాభమేమిటని ఇంటికి పోయాను. కానీ విషం ఎక్కలేదు.

మామూలుగా భోంచేసి నిద్రపోయాను’ అని స్వయంగా తమ సేవకులకు చెప్పారు.

‘వీళ్ళంతా ఋషులు, చూడు ఎంతమంది ఎట్లా తిరుగుతున్నారో చూడండి’ అంటారు, మనకేమీ కనిపించదు.

వచ్చిన భక్తులకు శ్రీస్వామివారు చీటీల మీద తాము చెప్పిన సందేశాన్ని భక్తుల చేత వ్రాయించి ఆశీర్వదించి ప్రసాదిస్తుండేవారు. ఉదాహరణకు వారు వ్రాయించిన చీట్లు ఇలా ఉండేవి.

కోట్లు, పడగలు, మణుగులు, రాశులు అని వ్రాయిస్తుంటే ‘మీ భాష అర్థం కావడం లేదు స్వామీ’ అంటే శ్రీస్వామివారు ‘పదహారు భాషలకు పై భాష దేవనాగర భాష. ఇది కలియుగ దేవుళ్ళకే అలివి కాలేదు. మీకేమి అర్థమవుతుంది. ఇది పైలోకం లెక్క’ అన్నారు. కొందరికి ‘పదవ చూపు మనిషి, పదవచూపులో వ్రాసినది’ అని చెప్పేవారు. అర్థమేమిటని అడిగితే ‘అది దేవచూపు. సముద్రాల మీద ఆ చూపుకు అడ్డేలేదు’ అన్నారు. మరొకప్పుడు ‘కలియుగ దేవుళ్ళ చూపు ఆరులక్షల చూపు. మేము కూడా ఆరు లక్షల చూపు వరకు పనిచేయగలము’ అని, శ్రీ ముమ్మిడివరం బాలయోగి భక్తుడు వస్తే ‘బాలయోగి 4 లక్షల చూపులో ఉన్నాడ’ని అన్నారు.

ఇలాగే తలుపూరు చెర్లోపల్లెలో శ్రీస్వామివారు యుండగా నెల్లూరు నుండి వచ్చిన రెడ్డిగారికి ఇటువంటి పరిభాషతో నిండిన చీటీని వ్రాయించి ఇచ్చారు. అప్పుడతడు దాని అంతరార్థమేమిటో మాకు తెలిసే మాటలలో విప్పి చెప్పండి అని కోరాడు. అది దేవభాష అనీ, దానిని విప్పి చెప్పరాదనీ శ్రీస్వామివారు చెప్పినా అతడు తన పట్టు విడువలేదు. ‘స్వామీ! మీరు దానిని విప్పి చెప్పినట్లయితే మీరు కోరిన దక్షిణ సమర్పిస్తాను’ అన్నాడు. అప్పుడు శ్రీస్వామివారు ‘అయితే నాలుగు లక్షలు కట్టు చెపుతాను’ అన్నారు. అతడదేపోత (తిరిగి మాట్లాడకుండా) పోయాడు. ఇలానే ఇంకెందరో భక్తులు శ్రీస్వామివారి నడిగారు. ఆయన ‘ఇది దేవ భాషయ్యా, దీని కర్థం చెప్పాలంటే మళ్ళీ ఇంకొకడు దిగిరావాలి’ అని అన్నారు. అట్టిది శ్రీస్వామివారి యొక్క నిజతత్వం.

ఆనాటి జమీందారులలో ఒకరైన వెంకట్రామరాజు యజ్ఞం చేయతలపెట్టి మాధవదాసువలె నాలుకలేని గంటలు మ్రోగించ సమర్థుడైన

మహాత్ముల కొరకు అన్వేషిస్తూ, శ్రీస్వామివారిని గూర్చి విని వారిని తీసుకురమ్మని మనిషిని పంపారట. వెంకట్రామరాజు గారి జన్మ వృత్తాంతము, జనన తేదీ వగైరా శ్రీస్వామివారు వ్రాయించి ఒక చీటీని ఆ వచ్చిన మనిషి ద్వారా పంపారు. అది చూచి ఈయన జనన తేదీ ఖచ్చితంగా చెప్పినందుకు శ్రీస్వామివారియందు భక్తి కుదిరి భార్యాభర్తలు శ్రీస్వామివారిని ఆహ్వానించడానికి వచ్చారు. ఆ సమయంలో శ్రీస్వామివారు బురదలో దిగి తలంతా బురద పూసుకొని పిచ్చివానివలె ఉన్నారట. రాజు దంపతులు ఆ బురదలో దిగి శ్రీస్వామివారికి నమస్కరించి తమ యజ్ఞమునకు రమ్మని అర్థించారు. తరువాత శ్రీస్వామివారు ఆ యజ్ఞానికి వెళ్ళి నాలుకలేని గంటలు మ్రోగించారు.




ఓం నారాయణ - ఆదినారాయణ

# అవధూత లీల

## అధ్యాయము - 26

## సాధన



సాధన అంటే ఏమిటో మాతాజీ తులశమ్మ వంటి
గురుకృపకు పాత్రులైన వారి జీవితాలను బాగా తరచి
చూచినట్లైతే తెలుస్తుంది. **మొదటి సాధనమైన నిష్కామకర్మ**
120 **ఫలిస్తేనే ముముక్షువులు చేసే జపము, ధ్యానము, భజన**
**పూజ వగైరా సఫలమౌతాయని శాస్త్రాలు చెప్తున్నాయి.** ఈ
విషయం తులశమ్మగారి ఎడల సార్థకమైంది. ఈ మహాతల్లి శ్రీస్వామివారి సేవకు అంకితమయ్యాక పైన చెప్పబడిన జపము వగైరా ఏనాడూ చేయలేదు. కానీ శ్రీస్వామివారు 'అమ్మ ఇక వచ్చేది లేదు' అని తులశమ్మకు ఆశీర్వాద చీటీ వ్రాసి ప్రసాదించారు. అంతేగాక ఆమెకు ఎరుక కలదు అనేందుకు నిరూపణగా మాతాజీ తులశమ్మగారు నిర్యాణమైన మూడు నెలలకు కోడలికి స్వప్న దర్శనమిచ్చి 'నేను మరలా జన్మకు వచ్చేది లేదు. శ్రీస్వామివారు మరలా జన్మకు వస్తారు' అని చెప్పినది. ఆమె మన మధ్య ఉండగా ఈ విషయాన్నే ఆమె కుమారుడు 'స్వామి మరలా జన్మకు వస్తాడా?' అని అడుగగా 'ఎనభై సంవత్సరములకు మరలా వచ్చి హెచ్చు తగ్గులు చూచుకొని పోతాడట అని శ్రీస్వామివారు చెప్పారని అనుకొంటున్నారు' అని తనకు తెలిసి కూడా తెలియనట్లే చెప్పింది.

మాతాజీ తులశమ్మగారు ఈ విధంగా జన్మరాహిత్యం చేసుకునేందుకు చేసిన సాధనలేవి?

ఒకే ఒక సాధన. సద్గురుడైన శ్రీస్వామివారిని త్రికరణశుద్ధిగా అచంచల విశ్వాసంతో దీక్షతో సేవించడమే.

'శరీరం ఇంద్రియం ప్రాణం అర్థ స్వజన బాంధవాన్
ఆత్మదారాధికం సర్వం సద్గురుభ్యో నివేదయేత్'

అన్న గురుగీత వాక్యాన్ని ఈమె సంపూర్ణంగా ఆచరించింది.

శ్రీస్వామివారికి, వారి బృందానికి, దర్శనార్థం వచ్చిన భక్తులకు నిరంతరం వంటచేసి పెట్టడమే ఈమె సేవ. తన ఏకైక పుత్రుడు మరణావస్థలో ఉన్నాడని తెలిసి కూడా ఆ బిడ్డను చూచేందుకు వెళ్ళమంటారా? వద్దంటారా? అని శ్రీస్వామివారి ఆజ్ఞ కొరకు ఎదురుచూచిన త్యాగశీలి. 'నీవు నీ బిడ్డను చూచేందుకు పోనక్కరలేదు. ఆయన బాగుంటాడులే!' అని శ్రీస్వామివారు చెప్పినప్పుడు సంతోషంగా శ్రీస్వామివారి సన్నిధిని వీడని భాగ్యశాలి. ఈ విధంగా మమకారం నశించేందుకు ఆమె ఏ గ్రంథాలూ చదవలేదు. మననం చేయలేదు. అనన్యప్రీతితో శ్రీస్వామివారి సేవ కొరకు సర్వ కోరికలనూ విడనాడింది. శ్రీస్వామివారు ఒక్క క్షణం ఎడబాటైనా తనకు ప్రాణహాని జరిగినంత స్పష్టంగా భావించింది. కనుకనే శ్రీస్వామివారి కృపవలన మమకార బంధం తెగిపోయింది.

జన్మజన్మలుగా తానార్జించిన త్యాగమయ సంస్కారమే ఆమెను శ్రీస్వామివారి చెంతకు చేర్చింది. తాను లక్షాధికారియై వుండి కూడా అందరిలాగా వందలకొలది చీరలు పెట్టెలలో మ్రగ్గిపోనీయక భర్తకు తెలియకుండా అన్నీ పేదలకు దానం చేసి రెండు చీరలతోనే సాంసారిక జీవితం వెళ్ళబుచ్చిన దానకర్ణ ఈమె.

శ్రీస్వామివారి సేవకంకితమయ్యాక ఒకప్పుడు మానహీనంగాయున్న ఒక అనాథను చూచినప్పుడు తన చీరలో సగం చీర చించి దానం చేసి మిగిలిన సగం చీరతోనే శరీరాన్ని కప్పియుంచుకున్న వైరాగ్యమూర్తి.

ఇంటి నుంచి బస్తా మిరపకాయలు తెప్పించి రెండవ రోజుకు బస్తా ఖాళీ చేసిన మహాతల్లి ఈమె. కొన్ని చాకలివాళ్ళకు, కొన్ని మంగలివాళ్ళకు, మరికొన్ని పనివాళ్ళకు, కొన్ని నిరుపేదలైన యాచకులకు, మిగిలినవి ఆశ్రమములో పచ్చళ్ళకు ఖర్చుచేసినందున మూడవనాటికి మరలా మిరపకాయలకు కరువే అయ్యేది. 'అదేమిటి అవ్వా! అన్నీ అట్లా ఖర్చు చేస్తే ఎట్లా?' అంటే 'మనల్ని కనిపెట్టుకోనుండే వాళ్ళకు గుప్పెడు మిరపకాయలు కూడా పెట్టకుండా ఎట్లాగయ్యా' అనేది.

కూరగాయలు దొరకని మంచి వేసవికాలంలో తోటలో పండాయని ఎవరో నాలుగు సొరకాయలు తెచ్చి ఇచ్చారు. నాలుగూ ఒకేరోజు కూర చేసేసింది. ఇదేమిటవ్వా రేపటికి ఒకటైనా ఉంచకూడదా? అంటే 'ఉంది

గదా! తిన్నీలేయ్యా పాపం, ఆశతీరా తింటారు. ఇవి ఇక్కడ వుంటే ఇక ఎవ్వరూ మరలా తీసుకురారు. ఏమీ లేకుండా ఉంటే శ్రీస్వామివారు ఎవరో ఒకరి చేత మరలా తెప్పిస్తారు' అనేది. ఆమె చెప్పింది అక్షరాలా నిజమయ్యేది.

**121 సాటి జీవులు తృప్తి చెందటమే ఆమె ధ్యేయం. 'అన్ని జీవులలో నేను ఉన్నాను' అని శ్రీస్వామివారు చెప్పారు గదా!**

మాతాజీ తులశమ్మగారికి గల మరొక ముఖ్యమైన దైవీసంపద నిష్కాపట్యము. క్రొత్తగా శ్రీస్వామి దర్శనార్థం వచ్చిన వారికి శ్రీస్వామివారికి అతి సమీపంలో కూర్చోవాలని, వారిని తాకి నమస్కరించుకోవాలని ఉంటుంది. దాన్ని శ్రీస్వామివారు అంగీకరించరు. కనుక ఈమె వారిని శ్రీస్వామివారికి దగ్గరగా పోవద్దని అరిచి తగువులాడేది. 'ఏం మనుషులు మీరు? తలకాయ లేదా? ఆయనేమి మనలాంటి మనిషనుకుంటున్నారా? రాండి రాండి దూరంగా' అని గదమాయించి అరిచేది. పది నిమిషాల తరువాత ఆ భక్తులు వంటశాలలో ఆమెకంట పడ్డారంటే ఇందాక ఆమె అరచి కసిరికొట్టిన విషయం జరగనట్లు తానే వారితో మాట్లాడేది. వారికి ఏం కూర ఇష్టమో అడిగి తెలుసుకొని వారికి తృప్తిగా భోజనం పెట్టేది. శ్రీస్వామివారు తిరిగే కుగ్రామాల్లో కాఫీ, టీలు దొరకవు కనుక ఎవరైనా పట్టణ వాస్తవ్యులు శ్రీస్వామివారి దర్శనార్థం వస్తారని వారికోసం కాఫీపొడి, చక్కెర దాచిపెట్టి ఉంచేది.

సోమరితనాన్ని చూచినప్పుడు పిచ్చికోపం తెచ్చుకునేది – శ్రీస్వామివారి సేవకుల్లో కొందరు వంతులు పెట్టుకొని పని ఎగ్గొట్టేవారు కూడా ఉండేవారు. వారిని నిర్మొహమాటంగా చీవాట్లు పెట్టి 'దండుగ తిండి తింటే శ్రీస్వామివారికి బాకీపడుతారు' అని నిక్కచ్చిగా చెప్పేది. ఆ సోమరిపోతే మధ్యాహ్నం అన్నానికొస్తే ఆయన కోరింది ప్రేమతో తృప్తిగా పెట్టేది. ఆ భక్తుడు 'పెట్టినా తిట్టినా అమ్మకు అమ్మే సరి' అని చేతులెత్తి నమస్కరించేవాడు.

ఇట్టి సద్గుణములతో నిరంతరము శ్రీస్వామివారి సేవయే తన ధ్యేయముగా శ్రమించింది కనుకనే ఏ సాధనలు చేయకున్నా శ్రీస్వామివారు ఈమెకు 'అమ్మ ఇక వచ్చేది లేదు' అని సెలవిచ్చారు. కనుక మనం అమ్మ జీవితం నుండి నేర్చుకోవలసింది ఎంతైనా ఉంది.

అనేక సంవత్సరాలుగా శ్రీస్వామివారిని కొలుచుకుంటున్న నెల్లూరు, ఫత్తేఖాన్ పేట – భాగవతుల రఘురామయ్యగారు ఇలా చెబుతున్నారు.

1985లో నేను ఆర్థికముగా చాలా ఇబ్బందులలో ఉన్నాను. దానికితోడు నా భార్య రెండు నెలలుగా అనారోగ్యంతో మంచంలో ఉంది. 19-12-1985న నా భార్య మా కష్టాలను శ్రీస్వామివారి పటానికి విన్నవించుకొని కంటతడి పెట్టింది. నాటి రాత్రి శ్రీస్వామివారు ఆమెకు స్వప్న దర్శనమిచ్చి 'పూర్వజన్మ కర్మఫలం అనుభవించక తప్పుతుందామ్మా' అని ఓదార్చారు. 26-12-1985న మరలా నా భార్యకు స్వప్న దర్శనమిచ్చి 'నీకు టైం అయిపోయిందని పైవాళ్ళు కోర్టులో తీర్పు చెప్పారమ్మా' అన్నారు. 'స్వామీ! నాకు చిన్న బిడ్డలున్నారు గదా ఇప్పుడు నేను పోతే ఆ పిల్లల గతేం కావాలి' అని దుఃఖిస్తూ శ్రీస్వామివారికి మొరపెట్టుకొన్నది. 'చూస్తాంలేమ్మా' అని సెలవిచ్చారట శ్రీస్వామివారు. 28-12-1985 తేది శనివారం నేను గొలగమూడి వెళ్ళి శ్రీస్వామివారిని దర్శించి తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు ఇల్లు చేరాను. ఆ రోజు మధ్యాహ్నం 12 గం॥ నుండి నా భార్యకు గుండెనొప్పి, ఆయాసం మొదలై ఆసుపత్రికి తీసుకువెళ్ళే ప్రయత్నంలో ఉన్నారు. వెంటనే డాక్టరుగారి ఇంటికి తీసుకువెళ్ళాము. డాక్టరు ఆమెను పరీక్షించి 'ఇంటికి తీసుకుపోతారా, ఆస్పత్రికి పోతారా' అని నీళ్ళు నములుతూ నిరుత్సాహంగా మాట్లాడారు. 'అదేమిటండి, అలా చెపుతారు. వెంటనే ఆసుపత్రికి పదండి' అన్నాము. 'నేను ఫోనుచేసి విషయం చెబుతాను మీరు తీసుకుపోయి చేర్చండి, నేను మీ వెనకాలే వస్తాను' అన్నారు డాక్టరుగారు. నెల్లూరు కన్నెకల ఆసుపత్రికి తీసుకెళ్ళి స్ట్రెచర్‌మీదకు దించక ముందే ఆమె శ్వాస నిలిచిపోయింది. డాక్టరు చూచి ప్రయోజనం లేదు ఇంటికి తీసుకు వెళ్ళమన్నారు. 'ఇంతదూరం తీసుకువచ్చాము గదా దయచేసి ఆక్సిజన్ పెట్టి మీ ప్రయత్నం మీరు చేయండి' అని ప్రాధేయపడ్డాము. ఆక్సిజన్ పెట్టి వెంటనే రక్తపరీక్ష చేశారు. రక్తమంతా నల్లగా మారి ఉంది. ఈ తతంగం అయ్యేలోగా ఒక అరగంటలో మరలా ఆమెకు శ్వాస మొదలై డాక్టరుగారిని ఆశ్చర్యపరచింది. 'మూడు గంటలసేపు ఇలాగే శ్వాస కొనసాగితే ఇంజక్షనుల ద్వారా రక్తం యొక్క రంగు మార్చేందుకు వీలౌతుంది. అంతా దైవానుగ్రహం' అని డాక్టరు వారి ప్రయత్నం చేస్తున్నారు. అనుకున్న టైం కంటే ముందుగానే ఆమె పరిస్థితి మెరుగైంది. ఈలోగా మా కుటుంబ డాక్టరు కూడా వచ్చి ఆమెను చూచారు.ఇద్దరు డాక్టర్లకు మేము కృతజ్ఞతాభివందనములు తెలిపినపుడు 'ఇది కేవలం ప్రభువు యొక్క కృప తప్ప

మా ప్రజ్ఞ ఏమీలేదు. ప్రభువుకు స్తోత్రములు చెల్లించండి' అని చెప్పారు. జనవరి 15, 1986 వరకు ఆసుపత్రిలో చికిత్సపొంది ప్రస్తుతం శ్రీస్వామివారి కృప వలన సుఖంగా ఉన్నాము.

1985 సం॥ లో నా భార్యకు శ్రీస్వామివారు స్వప్న దర్శనమిచ్చి L.Min.E. అని పలక మీద వ్రాసి చూపుతున్నారు. తెల్లవారి ఈమె L.Min.E. అంటే అర్థమేమిటని మా కుమారుణ్ణి అడిగింది. అది పాలిటెక్నిక్‌లో మైనింగ్ ఇంజనీరింగ్ కోర్సని చెప్పాడు. అయితే 'స్వామి నాకు రాత్రి స్వప్న దర్శనమిచ్చి నిన్ను L.Min.E. చదివించమన్నారు. గనుక నీవు దానిని చదువుటకు ప్రయత్నించు' అని చెప్పింది. ఆ పిల్లవాడు S.S.C. లో జనరల్ లెక్కలు, ఇంటర్‌లో లెక్కల గ్రూపు తీసుకొని తప్పాడు. గనుక ఎంట్రన్స్ వ్రాస్తే తనకు సెలక్షన్ రాదు గనుక ఆమె స్వప్నం కాకతాళీయమైన పిచ్చి ధోరణి అని ఎగతాళి చేశాడు.

కానీ కొన్నాళ్ళకు చిత్రంగా మిత్రుల ప్రోత్సాహంతో పాలిటెక్నిక్ ఎంట్రన్స్ వ్రాస్తే స్వామివారు చెప్పినట్లే మైనింగ్ ఇంజనీరింగులోనే సీటు వచ్చింది. కానీ ఆర్థిక ఇబ్బంది వలన కాలేజీలో చేరలేదు. ఫీజు కట్టే టైం అయిపోయింది.

ఆ సమయంలో మా అబ్బాయి చిన్నాయన కడప నుండి ఫోను చేసి సంగతి తెలుసుకొని 'ఫీజు కట్టేందుకు టైం పొడిగించారు. సీటుపోతే మరలా రాదు. గనుక తప్పక చేర్పించమ'ని ప్రోత్సహించాడు. శ్రీస్వామివారి కృప వలన పిల్లవాని తాతగారు ఆ పిల్లవాని చదువుకయ్యే ఖర్చు అంతా భరిస్తానని హామీ ఇచ్చి కాలేజీలో చేర్పించి చదివిస్తున్నారు.

**122 మనం శ్రద్ధాభక్తులతో శ్రీస్వామివారిని సేవిస్తుంటే మనం శ్రీస్వామివారిని అర్థించకపోయినాగానీ అవసరం వచ్చినప్పుడు మనకేది మంచిదో అది జరిగేటట్లు శ్రీస్వామివారే చూస్తారని మనం గుర్తుంచుకోవాలి.**

మా కుటుంబమంతా శ్రీస్వామివారి కెంతో ఋణపడి యున్నాము. శ్రీస్వామివారు మాకు ప్రాణదానం చేసి కాపాడిన అనేక సందర్భములలో ఇది ఒకటి. 1986 సం॥లో నా భార్య గుండెనొప్పి, రక్తపోటుతో బాధపడుతుంది. నెల్లూరు వైద్యంతో నయంగాక మద్రాసు అపోలో ఆస్పత్రిలో

చేర్పించాము. ఇరవై వేల రూపాయలు ఖర్చయినప్పటికీ ఆమె బాధలు ఇంకా ఎక్కువగుచున్నవి గానీ తగ్గలేదు. శరీరమంతా వాపు వచ్చి, తల నరాలు వాచి విపరీతంగా బాధపడుతుంది. రాత్రింబవళ్ళు కంటి మీద మూతలేదు. నేనా బాధను చూడలేక మనసులో చాలా బాధపడి శ్రీస్వామి మీద నిష్ఠూరపడ్డాను. నాటి రాత్రి శ్రీస్వామివారు నా స్వప్నంలో Neprosal అనే పెద్ద అక్షరాలు వ్రాసి చాలాసేపు చూపారు. వెంటనే మెలకువ వచ్చింది. ఆ పేరు కాగితం మీద వ్రాసి పెట్టుకొని తెల్లవారి మందులషాపులో విచారిస్తే అది రక్తపోటుకు వాడే ఒక మందని తెలిసింది. కానీ ఆ మందును ఇంతవరకు ఏ డాక్టరూ ఈమెకు వాడలేదు. దాన్ని వాడమని అడిగితే డాక్టర్లు కోపపడతారని తలచి కొంచెం యుక్తిచేశాను.

'సార్! నెప్రసాల్ అనే మాత్ర వాడితే మావాళ్ళకు ఇంతకు ముందు రక్తపోటు కొంచెం తగ్గింది. మేముగా సలహా ఇవ్వడం బాగుండదు. మీ సలహాగా దాన్ని మీ లెటర్‌హెడ్ మీద వ్రాసివ్వండి' అని మా కుటుంబ డాక్టరును అర్థించి వ్రాయించుకొని వెళ్ళి మద్రాసు డాక్టర్లకు చూపించి ఆ మందు వాడాను. చిత్రంగా ఆమె బాధలు ఉపశమించాయి. వెంటనే డిస్‌ఛార్జి చేయించుకొని ఇంటికి వచ్చేశాము. ఇతర మందులే లేకుండా ఆ మందుతోనే త్వరలో ఆమెకు స్వస్థత చేకూరింది.

అటు తర్వాత ఆమెకు స్వప్నంలో శ్రీస్వామివారు ఐదు బత్తాయి పండ్లు, ఐదు రాగి పైసలు ప్రసాదించారు. అది మొదలు బత్తాయి పండ్లరసమే ఆమెకు ముఖ్యమైన ఆహారంగా సరిపడింది. రాగి పైసలు ప్రసాదించడం మా భవిష్యత్తులో ఆర్థికాభివృద్ధిని సూచిస్తుంది.

ఆమె బాధలన్నీ ఉపశమించినా పాలిపోయినట్లున్న శరీరం, నీరసము తగ్గలేదు. ఒక నెల ఎదురు చూచినా పూర్తి ఆరోగ్యం చేకూరకపోయేసరికి ఇక వీలులేదని సర్వభారం స్వామిపై వేసి ఒక వారం రోజులు గొలగమూడిలోనే ఉంటూ శ్రీస్వామివారి సమాధి అభిషేకజలం సేవించింది. మనం నమ్మలేనంతగా ఆమె ఆరోగ్యంలో మంచిమార్పుగల్గి నెలల తరబడి పాలిపోయి బలహీనంగా ఉన్న శరీరం వారం రోజులలో మామూలు రంగువచ్చి బలం చేకూరడమంటే అది ఆ సద్గురు దర్శన ప్రభావం గాక మరేమగును. **శ్రీస్వామివారి సమాధి దర్శన ప్రభావం అంత మహిమాన్వితమైనదని** 123

**గుర్తించాము.** ఇట్లు - భాగవతుల రఘురామయ్య.

పెనవర్తి వాస్తవ్యులు పోలు మస్తానయ్య (R.T.C. నెల్లూరు) తనకు శ్రీస్వామివారిపై ఎలా భక్తి కుదిరింది అనే విషయం ఇలా వివరించారు.

'వెయ్యి గొఱ్ఱెలలో ఉన్నా మన గొఱ్ఱెను కాలుబట్టి లాక్కురానా' అన్న శ్రీస్వామివారి మాట నా యందు నిజమైంది. నేను నాస్తిక సిద్ధాంతాల కంకితమై దేవుని యందు విశ్వాసములేని రోజులవి. స్వాములంటేనే ఏవగింపు. 1981లో నేను ఇంటిలో లేని సమయంలో రెండువేల రూపాయలు చేసే మా బఱ్ఱెకు ప్రమాదమైన జబ్బు చేసింది. మూడు రోజుల నుండి ఆడవాళ్ళు చిన్న చిన్న వైద్యాలు చేస్తున్నారు. బొత్తిగా నీళ్ళు, మేత తీసుకొనడం లేదు. నేను ఇల్లు చేరేసరికి పరిస్థితి చేయి దాటి పోయింది. ఊర్లో ఉన్న వెటర్నరీ కాంపౌండరు సమయానికి లేడు. రాత్రి 10 గంటలకు దిగులుతో పడుకున్నాను.

ఇంతలో 8 సం॥ వయస్సు గల మా తమ్ముని కొడుకు వచ్చి 'వెంకయ్య స్వామి విభూది బఱ్ఱెకు పెడ్తా పెదనాయనా' అన్నాడు. 'నీకు విశ్వాసముంటే పెట్టుకోపో' అని చెప్పి నేను అన్నం తినకుండా నిద్రపోయాను. వాడా బఱ్ఱెకు ఎంత విభూది ఎక్కడ పెట్టాడో ఏమోగానీ ఆ తర్వాత వాడు నిద్రలో 'స్వామి వచ్చాడు, స్వామి వచ్చాడు' అని కలవరిస్తున్నాడట. కొంత సేపటికి బఱ్ఱెలేచి మేత తినడం మొదలు పెట్టింది. మా వాళ్ళు నన్ను నిద్రలేపి బఱ్ఱెకు బాగుంది, అన్నం తినమని చెప్పి, పిల్లవాని కలవరింత విషయం కూడా చెప్పారు.

వెంటనే నాకు అసలు విషయం స్ఫురించింది. నా నాస్తిక భావాలన్నీ ఆ క్షణంలో ఏమయ్యాయోగాని వెంటనే శ్రీస్వామివారిని దర్శించాలని తెల్లవారక ముందే మూడు మైళ్లు నడిచి వెళ్ళి శ్రీస్వామివారిని గొలగమూడిలో దర్శించాను. నేను నోరు తెరవకముందే శ్రీస్వామివారు 'అయ్యా, నీ గొడ్డుకు బాగుండ్లాయ్యా' అన్నారు. ఆ ఒక్కమాట శ్రీస్వామివారు అనకుంటే మరలా మరలా నాకు అనుమానాలు రేకెత్తుననే శ్రీస్వామివారు అలా హెచ్చరించారు. నాటి నుండి నేను దైవచింతనగల్గి శ్రీస్వామివారిని నా ఆరాధ్య దైవంగా పూజిస్తూ అనేక కష్టాల నుండి రక్షించబడుతున్నాను.

బరిగెల నాగయ్య (కొత్తూరు) : చాలాకాలం సమాధి మందిర పూజాదికములు నిర్వహించినారు. వీరు పద్దెనిమిది సంవత్సరముల వయస్సులో కలువాయికి గుడ్డలు కొనేందుకు వెళ్ళారు. 'బద్వేలు తిప్ప మీద

వెంకయ్యస్వామి అనే మహాత్ముడు వచ్చియున్నాడు' అని ఎవరో రోడ్డుమీద శ్రీస్వామివారిని గూర్చి అనుకుంటుంటే వీరి చెవినపడింది. 'వెంకయ్యస్వామి' అనే నామంతో వీరికెట్టి జన్మ బంధముందోగానీ వీరు గుడ్డలుకొనే పని వదలి వెంటనే శ్రీస్వామివారి దర్శనార్థం వెళ్ళారు. శ్రీస్వామివారు అగ్నిగుండం వేస్తున్నారు. జయరామరాజు శ్రీస్వామివారికి సేవ చేస్తున్నాడు. శ్రీస్వామివారు వీరికి తమ పరిభాషలో కోట్లు, మణుగులు, అద్భుదాలు అనే పదజాలంతో మూడు ఆశీర్వాద చీటీలు, మూడు వేలి ముద్రల కాగితాలు, మూడు నూలుదారాలు ఇచ్చి తమగుడ్డతో శ్రీస్వామివారే మంత్రించి వెళ్ళి రమ్మన్నారు. వీరు రాత్రికి శ్రీస్వామివారి దగ్గరుంటే బాగుండునని మనసులో అనుకోగానే శ్రీస్వామివారు 'అయ్యా నీవు అనుకొన్నది ఏ కాలానికైనా సరిపడుతుంది. ఇప్పుడు మాత్రం పెందలకడనే ఇంటికిపో' అని ఆజ్ఞాపించారు. శ్రీస్వామివారి ఆజ్ఞను పాటించిన నాగయ్యగారు తమ అనుభవాన్ని ఇలా చెప్పారు.

"అక్కడ నుండి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న మా గ్రామం నేను ఎలా నడిచానో నాకు తెలియదు. మార్గమధ్యమంతా దివ్యమైన మైకంలో నడిచాను. చిత్రమేమంటే నేను శ్రీస్వామివారి దగ్గర బయలు దేరేటప్పుడు నాలుగు బారల ప్రొద్దుంది. 10 కి.మీ. నడచి ఇల్లు చేరేసరికి కూడా నాలుగు బారల ప్రొద్దు అలాగే ఉంది. నా మనసులో మాటను బయట పెట్టడమే గాకుండా నన్ను దోవన నడిపించడంలో కూడా శ్రీస్వామివారు తమ దివ్యశక్తిని ప్రయోగించారు. కానీ ఋణానుబంధం, టైం రాలేదు గనుక అటు తర్వాత సుమారు ఇరవై అయిదు సం॥లకు నేను మైకాగనిలో పనిచేసే కలిచేడు ప్రాంతంలో శ్రీస్వామివారిని అనేక పర్యాయములు దర్శించాను.


"ఒకరోజు నాకు శ్రీస్వామివారి సేవలో నిరంతరం గడపాలని తీవ్రంగా అనిపించి వారి అనుమతికై వెళ్ళాను. నేను రెండు రూపాయలు దక్షిణ సమర్పిస్తే మాటరాదు, ఇంకా దక్షిణ పెట్టాలన్నారు. మూడు రూపాయలు సమర్పించాను. 'పాతాళలోకంలో జగదర్తిలో ఒక భాగం ఆయనకు ఉంది, 56 కోట్లది ఒకటి, 86 కోట్లది ఒకటి, రెండు రసీదులు ఆయనవి అక్కడికి అందినవి. నూట ఎనిమిదిలో ఒక భాగము మరియు మనలో గూడా ఆయనకొక భాగము ఉంది' అని తన ఆశీర్వాద చీటీ వ్రాయించారు. నేను మీ సేవలో ఉంటానని అడిగితే 'నీవు ఆరు నెలలు ఇప్పుడు చేసే ఉద్యోగం చేస్తుంటే ఆరుకోట్ల వందల

రూపాయలు ఆదాయం వస్తుంది. ఆ తర్వాత మా దగ్గరకు రావచ్చు' అని సెలవిచ్చారు. అది మొదలు నేను దోవన పోతుంటే శ్రీస్వామివారు అంతదూరాన నడిచిపోతున్నట్లు, ఎక్కడ కూర్చున్నా, పడుకున్నా శ్రీస్వామివారు కూడా వస్తున్నట్లు దృశ్యం గోచరించసాగింది. మూడు నెలలు గడిచేసరికి గగనమైంది. ఇక నేను శ్రీస్వామివారి ఎడబాటు భరించలేక మరలా వెళ్ళి నన్ను వారి సేవకు వినియోగించుకొమ్మని శ్రీస్వామివారిని అడిగాను. మొదట ఒక్క సంవత్సరం ఆగు అన్నారు. కానీ మరలా 'స్వామీ మీరు మునుపు ఆరు నెలలు గడువు చెప్పియుంటిరి. మూడు నెలలు పూర్తయినవి. ఇక నేను ఈ ఎడబాటు సహించలేన'ని చెప్పాను. 'అయ్యా నువ్వు ఇంక కొన్ని రోజులలోగానీ లేక రేపు వస్తే మరీ మేలే' అని తమ అంగీకారము సూచించారు. తెల్లవారి ఎంత మంది మిత్రులు, అధికారులు, గని ఓనరు వద్దని చెప్పినా వినకుండా గని పనికి రాజీనామా పత్రం వ్రాసి మేనేజరు టేబుల్ మీద పెట్టి వచ్చి శ్రీస్వామివారి సేవకంకితమయ్యాను. అది మొదలు ఆ కరుణాసముద్రుని కృపవలన తిరిగి ఇంటికి వెళ్ళాలనే బుద్ధి పుట్టకుండా శ్రీస్వామివారి సేవలో ఉండేటట్లు శ్రీస్వామివారే చేశారు. ఆ దయసాగరునకు ఏమిచేసి ఋణము తీర్చుకోగలను!



## అధ్యాయము - 27

## శ్రీస్వామివారికి అతిప్రీతిపాత్రమైన పని అందరూ చేసి తరించండి



అసంఖ్యాకమైన బాధ గురువులలో నిజమైన సద్గురుని గుర్తించడం చాలా గొప్ప విషయం. అలా గుర్తించాక వారి స్థితిని అవగాహన చేసుకొనడం, అంచనా వేయడం సామాన్యమైన విషయంగాదు. అలా వారి స్థితిని గుర్తించాక వారి మాటయందు **అచంచల విశ్వాసం గల్గి పూర్ణంగా ఆచరించగల్గాలంటే మనలో పూర్ణ భక్తిశ్రద్ధలు ఉంటేగానీ ఆచరించలేము.
వారి మాట ఆచరించకుంటే ఫలితం శూన్యం. అట్టి భక్తి శ్రద్ధలు మనలో** 124
**కల్గాలంటే వారి సన్నిధి - సేవల వలన వారి అనుగ్రహంతో మాత్రమే మనకట్టి శుభ సంస్కారములు కల్గును.** ప్రత్యక్ష సన్నిధి లభించనప్పుడు వారి జీవిత చరిత్ర పారాయణే వారి సన్నిధితో సమానము. ఆ విధంగా వారి ప్రత్యక్ష సన్నిధి సేవలుగానీ, వారి జీవిత చరిత్ర పారాయణగానీ చేసే శక్తి మనకెలా కల్గుతుంది? పుణ్యకర్మల ప్రభావం మన పాపకర్మల ప్రభావము కంటే అధికముగా నున్నప్పుడు మాత్రమే దైవాన్ని నియమ నిష్ఠలతో అనన్యంగా శరణువేడగలము (భగవద్గీత). అలాంటి పుణ్యకర్మలేవి? దేవ, ద్విజ, గురు, ప్రాజ్ఞపూజనం, భగవన్నామస్మరణ.

కనుక దైవకృప పొందాలంటే పూజ, నామస్మరణల కెంతైనా ప్రాధాన్యత ఉన్నది. కనుకనే శ్రీ వెంకయ్యస్వామి వారెప్పుడూ భజన, నామ సంకీర్తనలను ప్రోత్సహించేవారు. 'ఓం నారాయణ ఆదినారాయణ' అనే నామాన్ని తంబుర మీటుతూ గంటల తరబడి శ్రవణానందంగా గానం చేసేవారు.

తమ దర్శనార్థం వచ్చినవారిని "భజన చేసుకోండయ్యా" అని చెప్పి భక్తులు భజన చేస్తుంటే శ్రీస్వామివారు శ్రద్ధగా వింటూ కూర్చుని వారి భక్తి శ్రద్ధలననుసరించి వారిననుగ్రహించేవారు.

అప్పుడప్పుడూ భక్తులు పాడే భజన, కీర్తనలు ఆపి "ఓం నారాయణ

ఆదినారాయణ” అనే మంత్రాన్ని గానం చేయించేవారు.

హృదయపూర్వకంగా ప్రేమతో భగవన్నామాన్ని గానం చేయడం, భజన చేయడం శ్రీస్వామివారికెంతో ప్రీతి. అలా చేయబడుచున్న భజన కార్యక్రమములను శ్రద్ధతో ఆలకించి ఆశీర్వదించేవారు.

ఒకరోజు బొంతరాజుపాళెంలో భక్తులంతా కాళ్ళకు గజ్జెలు ధరించి చెక్క పలకలు చేతబూని చాలా ఉత్సాహంగా అడుగులు వేస్తూ భంగిమలు చేస్తూ కోలాహలంగా చెక్కభజన చేస్తున్నారు. ప్రేక్షకులంతా భగవంతుని స్మరించడం మరచిపోయి 'ఎవరు బాగా అడుగేస్తున్నారు. ఎవరు చక్కగా భంగిమలు ప్రదర్శిస్తున్నార'నే విమర్శలో ఉన్నారు. కీర్తనకారుల సంగతి చెప్పనక్కరలేదు. వారి దృష్టంతా ప్రేక్షకుల నాకర్షించడంలో కేంద్రీకృతమయింది.

కొంత సేపయ్యాక శ్రీస్వామివారు అమాయకంగా “ఏందయ్యా వాళ్ళు చేసేది?” అని పెద్దగా నవ్వేశారు. శ్రీస్వామివారలా ఎందుకన్నారో మనందరికి చక్కగా తెలిసిపోయింది. గనుక హృదయస్పందనతో, ఆర్తితో భజన, నామసంకీర్తన చేసి మనందరం శ్రీస్వామివారి కృపకు పాత్రులవుదాం.

ఒకరోజు ఒక భక్తుడు “స్వామీ! మీకు మా గ్రామంలో మందిరం కట్టిస్తాము. అక్కడ ఉండి అందరినీ అనుగ్రహించండి” అని అర్థించాడు. శ్రీస్వామివారు అన్నారు “ఒక్కరేముందయ్యా కట్టించేది, వెంకయ్య చాటుకు పోయాక ప్రతి ఊళ్ళో కట్టించుకుంటుళ్ళా” అని శెలవిచ్చారు.

కనుక ప్రతి గ్రామములోను కనీసం ఒక్కరిద్దరైనా సరే మొదట శ్రీస్వామివారి పటం ఆ గ్రామంలోని ఏ దేవాలయంలోనైనా పెట్టుకొని కడ్డీలు వెలిగించి శ్రీస్వామివారి చరిత్రలోని కనీసం నాలుగు లీలలు చదివి, “ఓం నారాయణ ఆదినారాయణ” మంత్రం భజన చేసి తరువాత శ్రీస్వామివారి భజనలు పాడుకోవడం ఎంతో శ్రేయస్కరం.

మహాత్ముల చరిత్ర పారాయణ మనలను తరింపచేయటమే గాక గ్రామానికంతకూ మేలు చేకూరుస్తుంది. శ్రీస్వామివారి అండ ఆశీస్సులు ఆ గ్రామంలో ప్రతివారికి లభింపజేస్తుంది. అనావృష్టి అరిష్టాల ప్రభావము తగ్గటం, సామూహిక వ్యాధుల నుండి రక్షణ తప్పక కల్గును. మొదట ఒకరిద్దరితో మొదలు పెట్టినా రానురాను శ్రీస్వామివారి కృపవలన ఆ భజన బృందం

అభివృద్ధి చెంది ప్రతివారికి శ్రీస్వామివారి కృప అనుభవమవుతుంది. ఒక వారం రోజులలో మరణించే పరీక్షిత్తునకు శుకయోగి శ్రవణం చేయించినది మహనీయుల చరిత్రే. అదే భాగవతం.


అయితే మొదట ఆరంభించడమే కష్టము. శ్రమ అనుకోకుండా బిడియపడకుండా ఒక్కరిద్దరైనా మొదలుపెట్టి చేస్తుంటే తదుపరి శ్రీస్వామివారే తమ కార్యం నెరవేర్చుకుంటారు.

**ఆ విధంగా చేసి శ్రీస్వామివారి కృప ఆ గ్రామానికంతటికీ లభించేలా చేసిన వారి కృషే నిజమైన నిష్కామకర్మ. వారమునకొక రోజు చేయడం కాకుండా నిత్యం చేయడం ఎంతో మేలు. మానవజన్మ సఫలం చేసుకునే పద్ధతే ఇది అని నా స్వానుభవం తెలుపుతుంది.** 125



# అవధూత లీల

## అధ్యాయము - 28
## నా స్వానుభవాలు (రచయిత)



ఆచార్య శ్రీభరద్వాజగారి సలహాననుసరించి శ్రీస్వామివారిని దర్శించి దివ్యమైన అనుభవములను పొంది గత పన్నెండు సం॥రాలుగా శ్రీస్వామివారిని సేవిస్తున్నాను. గత పదిహేను సంవత్సరములుగా శ్రీ శిరిడీ సాయినాథుని చరిత్ర పారాయణ, పూజ చేసుకొనుచున్నాను. దాని ఫలితంగానే నాకు భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారి రూపంలో శ్రీసాయినాథుడు లభించాడు. సాయిలీలామృతం పారాయణ ఫలితంగా శ్రీస్వామివారు ఒక గురుపూర్ణిమకు మా గృహమునకు విచ్చేసి మా ఆతిథ్యమును స్వీకరించి మా స్నేహితుడు టి.వి.శేషగిరిరావు గారింటిలో అఖండనామ సంకీర్తన చేయుచున్న బృందాన్ని ఆశీర్వదించారు. 20 సం॥లుగా నేను ఆయాసంతో బాధపడుతుండేవాణ్ణి. ఎంతటి బాధలోనైనా శ్రీస్వామివారి సన్నిధిలో కూర్చున్న వెంటనే నా బాధనంతా తీసేసినట్లు పోయేది. రెండు పర్యాయములు నేను శ్రీస్వామివారిని దర్శించిన వెంటనే నన్ను ఇంటికి వెళ్ళమని ఆజ్ఞాపించారు. నోరు మెదపకుండా ఇంటికెళ్ళియుంటే నా వ్యాధి ఆనాడే శుభ్రంగా నిర్మూలనమై ఉండేది. వెళ్ళమన్న శ్రీస్వామివారి ఆజ్ఞలను సంపూర్ణముగా ఆచరించకుండా అవసరాన్ని బట్టి నియమభంగం చేసుకోవడం ద్వారా విపరీతమైన అనారోగ్యమునకు గురియై మద్రాసు వెళ్ళి వైద్యం చేయించుకోమని డాక్టర్లు చెప్పడం, శ్రీస్వామివారి సమాధిని దర్శించిన తరువాతనే మద్రాస్ వెళ్ళాలని గొలగమూడి వచ్చేందుకు బస్సు ఎక్కిన లగాయతు సంపూర్ణముగా స్వస్థత చేకూరడం, అది మొదలు శ్రీస్వామివారి సమాధి చెంతనే కాపురముండడం మొ॥ విషయాలు ఈ గ్రంథారంభంలో విపులంగా వ్రాశాను. ఇక్కడ శ్రీస్వామివారు పెట్టిన నియమం వారే నాచేత ఎలా ఆచరింప చేస్తున్నారో చెపుతాను.

శ్రీస్వామివారు నన్ను 'నీ అన్నం నీవు తినయ్యా' అని ఆజ్ఞాపించారు అంటే నా కష్టార్జితం తప్ప వేరేవారి సొమ్ము తినవద్దని, మరియు 'చమురులేకుండా కాల్చు' అని శెలవిచ్చారు అంటే చమురు పదార్థాలు తినవద్దని ఆదేశించారు మరియు శ్రీ సాయినాథుడు ఉప్పు, పులుపు, కారం తినవద్దని ఆదేశించారు. వీటిని నేను చాలావరకు ఆచరిస్తున్నాను. కానీ ప్రసాదమనే పేరుతోను, స్నేహితుల బలవంతంపైన స్వల్పంగా నియమం తప్పడం, తద్వారా రుగ్మతకు లోనవడం గత నాలుగు సంవత్సరముల నుండి జరిగేది. ఈ స్వల్పమైన నియమభంగాన్ని కూడా శ్రీస్వామివారు సహించలేదు. 1985 డిసెంబరు నెలలో ఒకరి గృహప్రవేశానికి వెళ్ళి ప్రసాదమని స్వల్పంగా అరటి పండు తిన్నాను. అంతటితో ఆగక ఆ ఇంటి యజమానురాలు నేనేమీ తినలేదని చిన్నబుచ్చుకుంటుందని సగం అరటి పండు తిని మిగిలిన సగం సంచిలో వేసుకున్నాను. వెంటనే ఎడమకన్ను జిల! నలిపాను వాచిపోయింది. అరటిపండు తినడమే దీనికి కారణమని అనుమానిస్తూ స్కూలుకు చేరాను. ఉదయం 11 గంటలకే విపరీతంగా ఆకలైంది. సంచిలోని మిగిలిన సగం అరటిపండు కూడా తిన్నాను.

వెంటనే కన్ను బాధ జాస్తయింది. నిండా త్రాగిన వానికివలె మైకమై బెంచీ మీద వాలాను. నేను 7 1/2 అడుగుల ఎత్తు తలుపు ముందు రెండు పాదములు ఒకచోట ఉంచి నిలబడి రెండు అరచేతులతో ఆ తలుపును తడుముతూ నొక్కుచున్నాను. ఎచ్చటో ఒకచోట నొక్కితే తలుపు తెరుచుకుంటుంది. ఆ ప్రయత్నంలో కుడికాలు 3 అంగుళాలు ప్రక్కకు జరిపాను. వెంటనే వెనకనున్న సభలోని పెద్దలు "అన్‌ఫిట్ తీసెయ్" అని నన్ను ప్రక్కకు నెట్టేస్తున్నారు. "కాలు కొద్దిగా కదిలిస్తే అది కూడా తప్పేనా" అని వాదిస్తున్నాను. "**చిన్న తప్పయినా తప్పే**" అని ముమ్మారు పలికారు. వెంటనే మెలుకువ వచ్చి సాయంత్రం 6 గం॥లు అయిందని అదిరిపోయి గంట చూశాను. 11 గంటల 10 ని॥ లు మాత్రమే. "ఈ 10 నిముషాలలో ఈ దృశ్యమేమిటా?" అని ఆలోచిస్తే నేను ప్రసాదం అనే పేరుతో నియమభంగం చేస్తే అది చిన్నతప్పయినా ఆధ్యాత్మిక సాధనలో పెద్ద తప్పేనని శ్రీస్వామివారు నాకు దృశ్యంగా చూపించారు అని గ్రహించాను. నాటి నుండి శ్రీస్వామివారి కృప వలన అంతకుముందు సాధ్యముకాని నియమాలు సులభంగా

పాటించగల్గుచున్నాను.

ఆధ్యాత్మిక సాధన దైవరాజ్యంలోకి తలుపులు తెరిచే ప్రయత్నం లాంటిదని, ఆ ప్రయత్నంలో చిన్న తప్పయినా తప్పేనని, అట్టి తప్పు మనలను ఆ సాధనకు అనర్హులను చేస్తుందని శ్రీస్వామివారు బోధించారు.

నాటి నుండి ఎన్నో రోజుల నుండి నిగ్రహించలేని కొన్ని బలహీనతలు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయాయి. తక్కిన బలహీనతలను గూడా ఇదే విధంగా స్వామివారు నిర్మూలించి "మీరు నన్ను వదలినా నేను మిమ్ము వదలను" అని శ్రీస్వామివారిచ్చిన అభయం నిలబెట్టుకుంటారని నా విశ్వాసం. మనవైపు నుండి ఆర్తితో వారిని ప్రార్థించడం, వారి సూక్తులను ఆచరించడం మన కర్తవ్యం. అలాంటి ఆచరణ మనకందరికీ శ్రీస్వామివారు కల్గించాలని ప్రార్థిద్దాము.

శ్రీస్వామివారి ఆజ్ఞమేరకు నేను 1989 సం॥ నవంబర్ వరకు శ్రీస్వామివారి సమాధియొద్దనే కాపురముంటూ, 50 కి.మీ. దూరంలో ఉద్యోగం చేసి ప్రతినిత్యం రాత్రికి వచ్చి శ్రీస్వామివారి సమాధి దర్శనం చేసుకొని వారిని సేవించగలిగాను. 1989సం॥ నవంబర్ మూడవ తేదీ నుండి శ్రీస్వామివారి ఆజ్ఞ మేరకు వాలంటరీ రిటైర్‌మెంట్ ఇచ్చి గొలగమూడిలోనే కాపురముండి శ్రీస్వామివారిని సేవించుకొనుచున్నాను.

నేను (రచయిత) కలిచేడు వదలిపెట్టి శ్రీస్వామివారి సన్నిధిలో కాపురమున్న రోజులు. నాకు గల రెండు సమస్యల గూర్చి శ్రీస్వామివారి సలహా అడగాలనుకున్నాను. కానీ శ్రీస్వామివారితోను, శ్రీసాయితోను నాకు గల అనుభవం దృష్ట్యా శ్రీస్వామివారెప్పుడూ తమ మాటను సంకేత రూపంలో చెపుతారని, ఆ సంకేతాలు అర్థమవడం కష్టమని, కానీ శ్రీసాయి తన మాటను స్పష్టమైన మాటల్లో తెలియజేస్తారని తలచాను. గనుక నా సమస్యలను గూర్చి సమాధానం, సలహా కోరుచూ శిరిడీ వెళ్ళి ఒకవారం రోజులు దీక్ష చేశాను. అచ్చట శ్రీసాయినాథుడు కూడా నా సమస్యలకు శ్రీస్వామివారివలె సంకేత రూపములోనే సమాధానాలిచ్చి 'పిచ్చి వాడా నాకు, స్వామికి భేదం లేదు. నీవక్కడే శ్రీస్వామివారిని మనస్ఫూర్తిగా, మాకిద్దరికీ భేదభావం లేకుండా ఆరాధించమ'ని ఆత్మబోధ చేశారు. గనుక తత్త్వతః ఈ మహనీయులిద్దరికీ

ఎలాంటి బేధం లేదు. అంతే గాదు వీరిద్దరికీ ఎంతో గాఢమైన అనుబంధమున్నదని నా నమ్మకము.

ఇంతేగాక – శ్రీ సాయి తన నాశ్రయించిన వారికి వారి నడవడిలోని దోషాలు చూపించి వారి ప్రవర్తన సరిచేసేవారని – శ్రీస్వామి ఎల్లప్పుడూ మౌనంగా ఉంటారుగానీ శ్రీ సాయివలె మన దోషాలను వేలెత్తి చూపరని తలచేవాణ్ణి. రెండవది శ్రీస్వామివారు సశరీరంగా లేరు గనుక మన దోషాలను చూపి దండించే దిక్కులేదని తలచేవాణ్ణి.

కానీ 1988 మే నెలలో పదునైదు రోజులు శ్రీస్వామివారి సమాధికి పూజ చేసే భాగ్యం గల్గింది. ఈ కొద్ది కాలంలో శ్రీస్వామివారు సర్వకాల సర్వావస్థల యందు మనలను వెన్నంటి ఉంటారని, మన దోషాలను వాచా చెప్పే కంటే ఆత్మబోధ ద్వారా నిరంతరం పలుకుతుంటారని, మన దోషాలకు వెంటనే శిక్ష కూడా వేస్తారని తెలుసుకున్నాను. నాడే గాదు నేడు గూడా మనలో ఎలాంటి మలిన వాసనలు తలెత్తినా, పరదూషణ, అసత్యమాడుట, మనసులో అహంకరించుట వంటి దుర్గుణాలు తలెత్తినా వెంటనే తగువిధంగా హెచ్చరిస్తారు. అలాంటి దుర్గుణాలు తలెత్తినప్పుడు సాంబ్రాణి వేసేందుకు అనువైన నిప్పు దొరకదు. శ్రమపడి నిప్పు తెచ్చే లోపల పూజ టైం దాటిపోతుంది. ఒక్కొక్కప్పుడు పూజ చివర ధూపమేసేందుకు నిప్పు చూసుకుంటే ఆరిపోయి ఉంటుంది. మరొకప్పుడు పూజలో మరొక లోపం జరుగుతుంది. ఏమి స్వామీ ఇలా చేశారే అని అనుకుంటే 'ఇందాకటి నీ అహంకారానికిది శిక్ష' అని తెల్పుతారు. నేటికీ శ్రీస్వామివారు మన సేవను నిరాకరించడం ద్వారా మనలను హెచ్చరిస్తుంటారు. అలాంటి దుర్గుణాలు తలెత్తకుండా కాపాడమని శ్రీస్వామివారిని సదా ప్రార్థిస్తుంటాను.

శ్రీ శిరిడీ సాయిబాబా చరిత్ర చదివాక వారిలాగ శ్రీవెంకయ్యస్వామివారు ఖండయోగం చేసినట్లు సాక్ష్యాధారాలు లేవుగదా – అనే కొరత నన్ను చాలా కాలంగా పీడిస్తుండేది. కరుణామయుడైన శ్రీస్వామివారా కొరతను నేటికి తీర్చారు.

షేక్ రహంతుల్లా – ఓగూరు ప్రక్కన గల వాకమడ గ్రామం, బ్రాహ్మణపల్లి మండలం, కడప జిల్లావారు శ్రీస్వామివారితో తనకు గల

అనుభవాలనిలా వివరించారు.

నా కుడికాలు మోకాళ్ళ క్రింద నుండి ఎముకలలో చాలా తీవ్రమైన నొప్పి వుండేది. ఆనాటి నాటువైద్యులు, ఇంగ్లీషు వైద్యులు లెక్కలేనంత మంది వైద్యం చేసి వేలరూపాయలు ఖర్చయినవే తప్ప నా బాధను ఏ మాత్రమూ తగ్గించలేకపోయారు. నా స్నేహితుల ద్వారా శ్రీస్వామివారిని గూర్చి విని చివరి ఆశగా పెన్నబద్వేలు తిప్పపైన వేంచేసియున్న శ్రీస్వామివారిని దర్శించాను. తన అమృతహస్తంతో నాకాలు కొంచెంసేపు సరదీసినట్లు రుద్దారు. మొదటి రోజే కొంత నొప్పి తగ్గింది. ఇరవై రోజులపాటు శ్రీస్వామివారు నిత్యం నాకాలును ఈ విధంగా కొంతసేపు రుద్దేవారు. చివరికానొప్పి ఏ మందూ మాకు లేకుండానే పూర్తిగా పోయింది. నాకు క్రొత్త జీవితాన్ని ప్రసాదించిన ఆ కరుణామయునకు నేనేమి చేసినా ఋణం తీరదు.

ఆనాడు శ్రీస్వామివారుండే ఆ చోట్లో కరెంటు లైట్లు లేవు. రాత్రి ఒంటేలుకు లేచిన నేను జాజ్వల్యమానంగా వెలుగుచున్న అగ్నిగుండము వెలుగులో ఆ గుండముచుట్టూ ఉన్న దృశ్యం చూచి భయభ్రాంతుడనయ్యాను. శ్రీస్వామివారి అవయవాలన్నీ ముక్కలు ముక్కలుగా ఛేదింపబడి, కాళ్ళొకచోట, చేతులొకచోట, తల, మొండెము ఇట్లే అన్ని అవయవాలు తలా ఒక దిక్కున నేలపై పడియున్నాయి. ఆ దృశ్యం చూచిన నేను భయకంపితుడనై సమీప మందలి పూరిపాకలోకి పరుగెత్తాను. అక్కడ శ్రీస్వామివారు లేరు. తర్వాత పదినిమిషాలకు శ్రీస్వామివారు మామూలుగానే అగ్నిగుండము దగ్గర కూర్చొని దర్శనమిచ్చారు. ఒక అరగంట తర్వాత శ్రీస్వామివారు పూరిపాకలోని నా దగ్గరకొచ్చి "ఏమయ్యో రంతు సాయిబా! నీకు లోకం కనబడింది గదయ్యా. ప్రొద్దున్నే నీవు మీ గ్రామం వెళ్ళిపోవాలి. ఇక్కడ ఉండకూడదు" అని పదే పదే చెపుతూ చార్జీలకు నాచేతికి డబ్బులిచ్చి, 'నాలుగు రోజుల వరకు నీవిక్కడ ఉండకూడదు.' అని తొందర పెట్టి నన్ను మా గ్రామం పంపేశారు. నేను చూచిన ఖండయోగ దృశ్యం గురించి నేనందరికీ చెపుతాననే శ్రీస్వామివారలా నన్ను పంపేశారు.

ఐదవరోజు నేను శ్రీస్వామివారి చెంతకొచ్చి నిద్రచేశాను. తెల్లవారుతూనే 'అయ్యా రంతుసాయిబా! మీ తమ్ముని చెయ్యి విరిగింది.

కట్టు కట్టినారు, అదేమీ చేయదులే పోయ్యా' అని నన్ను మా గ్రామం పంపేశారు. నేను మా గ్రామం వెళ్ళి విచారిస్తే శ్రీస్వామివారి మాట అక్షరాలా నిజమైంది. మా తమ్ముడు మేకలకు ఆకు కోసేందుకు చెట్టెక్కి పడి చెయ్యి విరిగినందున కట్టు కట్టియున్నారు. శ్రీస్వామివారి ఆశీస్సుల ప్రకారం కొద్దిరోజులలో ఏ వైద్యాలూ లేకుండానే విరిగిన చెయ్యి చక్కగా కట్టుకున్నది.

**అవధూత శ్రీ వెంకయ్యస్వామి వారిలో నేను దర్శించిన సత్యాలు (రచయిత) :**

శ్రీస్వామివారు తలుపూరులో ఉన్నారు. శ్రీవారు విడిది చేసిన చోట ఆనాడు విద్యుత్ లైట్లు లేక లాంతరు ఒక గుంజకు తగిలించియున్నారు. రాత్రి పది గంటలప్పుడు శ్రీస్వామివారు 'అయ్యా ఇది రాత్రా, పగలా?' అని అడిగారు. 'స్వామీ! లాంతరు అంత బాగా వెలుగుతుంది కదా. పగలా రాత్రా అని అడుగుతారేమిటి?' అని సేవకులు నవ్వుతున్నారు.

మరొకరోజు శ్రీస్వామివారు 'అయ్యా ఇదేఊరు?' అనడిగారు. అది సాయం సమయము. 'స్వామీ మీకిదే ఊరైంది కూడా తెలియడం లేదా, ఇది తలుపూరు గదా స్వామీ' అని అందరూ నవ్వుకున్నారు. అంటే శ్రీస్వామివారు రాత్రి, పగలూ అనే భేదంగానీ, ఏగ్రామమైనది పరిసరాలను బట్టి తెలుసుకునే స్థితిలో లేరన్నమాట.


ఇదే విధంగా శ్రీ రామకృష్ణ పరమహంసగారు కూడా 'ఈనాడు పున్నమా? అమావాస్యా?' అని అడుగుతారు. అవధూతస్థితి తెలియని అమాయక సేవకులు నవ్వుకుంటారు.

ఒకరోజొక సేవకుడు కోపమెట్లా పోతుంది స్వామీ? అని అడిగితే శ్రీస్వామివారు 'రాత్రి, పగలు భేదం తెలియకుండాపోతే కోపం పోతుంది' అని అన్నారు. రాత్రి, పగలు భేదం తెలియకుండా పోవాలంటే ఏమి చేయాలో ఆ సేవకుడు అడుగలేదు.

అది మండు వేసవి. ఏప్రిల్ నెల. శ్రీస్వామివారు తలుపూరులో మస్తానయ్య గారింట్లో విడిది చేసియున్నారు. మస్తానయ్యగారిల్లు ఊరికి తూర్పు చివర ఉంది. ఆ ఇంటి ముందు చిన్న చిన్న కర్రతుమ్మ చెట్లు తప్ప వేరే ఏ నీడా, చెట్లూ లేవు. శ్రీస్వామివారు అక్కడొకచోట అగ్నిహోత్రమేసుకొని

కూర్చొనియున్నారు. మధ్యాహ్నం రెండు గంటల వేళలో నేను, నామిత్రుడు శ్రీ టి.వి. శేషగిరిరావుగారు శ్రీస్వామివారి దర్శనార్థం వెళ్ళాము. ఒక పది నిముషాల్లో నా రబ్బరు చెప్పులు వేడెక్కి నేను చెప్పుల మీద నిలువలేకున్నాను. శేషగిరిరావుగారు దూరానున్న వేప చెట్టు క్రిందకు వెళ్ళారు. నేను కఠ్రతుమ్మ మండల కొనలు నా చెప్పుల క్రింద వేసి అలాగే చూస్తూ కూర్చున్నాను.


తూర్పు ముఖంగా ఉన్న శ్రీస్వామివారు అగ్నిని ప్రజ్వలింపజేస్తూ పంగాల కఠ్రతో కట్టెలు ఎగదోస్తూ అగ్నికి సమీపంలోనేయున్నారు. వారి శరీరంపై కౌపీనం (గోచి) తప్ప మరెలాంటి ఆచ్ఛాదనా లేదు. శరీరమంతా చెమటలు కక్కుతుంది. వళ్ళంతా మసిమరకలు, ముఖమంతా వికారంగా మసి, విభూతితో నిండి ఉంది. కానీ శ్రీవారు అగ్ని ప్రేలుస్తూ తలమీద కనీసం దట్టంగా వెంట్రుకలు కూడా లేకుండా అగ్ని సమీపంలోనే కూర్చొనియున్నారు. నేనెంతో దూరంలో కాళ్ళకు చెప్పులు, చెప్పుల క్రింద కఠ్రతుమ్మ మండలు, నాతలపై చేతి గుడ్డ, వంటి నిండా దుస్తులు ఉన్నా ఆ ఎండ తీవ్రతను తట్టుకోలేకున్నాను. మరి శ్రీస్వామివారు ఆ ప్రజ్వలించే అగ్నికి ఎంతో దగ్గరలోనే కూర్చొని ఎలా ఉండగలుగుచున్నారు అన్నదే నా ప్రశ్నగా ఆశ్చర్యంతో గంటల తరబడి చూస్తూ ఉండిపోయాను. ఆనాడు అది అవధూత స్థితియని, అలా వారుండగలగడమే వారి గొప్పతనమని నాకు తెలియలేదు.



శ్రీ స్వామి వారి వేలి ముద్రలు

# అవధూత లీల

## అధ్యాయము - 29
## మహాసమాధి అనంతరం లీలలు



"సూర్యచంద్రులున్నంతవరకూ ఉండేదే గదయ్యా" అని శ్రీస్వామివారు అభయమిచ్చారు. వారిచ్చిన అభయం అక్షరాల నిజమని వారి మహాసమాధి అనంతరం జరిగే లీలల ద్వారా ఋజువౌతుంది. **శ్రీస్వామివారిని పూర్ణంగా ఆశ్రయించ గలిగిన వారికి పరిపూర్ణమైన ఆత్మజ్ఞానం కలిగేంతవరకు** 126
**ఈ మహనీయుడు వారిచెంత నుండి రక్షిస్తూనే ఉంటారు.**

వారు భౌతిక దేహంతో ఉండగా తమ మహిమను ఎంతో గుప్తంగా దాచియుంచుకొని, వారి మహాసమాధి అనంతరం నేడు తమ మహిమను దశదిశలా వ్యాపింపజేస్తూ తమను గూర్చి తెలియని క్రొత్తవారికి కూడా స్వప్న దర్శనములిచ్చి గొలగమూడిలోని తమ సమాధిని దర్శించుకోమని ఆదేశిస్తున్నారు. నాటి కంటే నేడు వారు భక్తులకు ఎక్కువ సులభంగా లభ్యమగుచున్నారు. ఒకప్పుడు శ్రీస్వామివారి కాళ్ళు పట్టుకుపోతే మందు తీసుకోమన్న భక్తులతో "అట్లా మందు తీసుకుంటే మనమొచ్చిన పని నిలిచిపోతుంది" అన్నారు. ఆ పని ఏమిటో ఆనాడు అర్థం కాలేదు. దీన జనరక్షణే వారి అవతార కార్యమని నేడు తెలుస్తుంది. తమ సమాధిని దర్శించిన ప్రతివారి బాధ నివారణ కావడమే ఇందుకు తార్కాణం.

ఆగష్టు 20, 1983 సం॥న శ్రీ రామయ్య తన తోటలోని పూరిపాకలో వున్నాడు. శ్రీస్వామివారు తమ తలమీద ఒక తువ్వాలు జారవేసుకొని దర్శనమిచ్చారు. "అక్కడంత పని జరుగుతూంటే ఇక్కడ కూర్చుని తంబుర మీటుతున్నావా?" అని రెండు చేతులూ వెటకారంగా చూపుతూ సైగచేస్తున్నారు. తెల్లవారి అతడు గొలగమూడి వెళ్ళి అచ్చట జరుగుతున్న ఆరాధన పనులలో ఫాల్గొని రెండు నెలలు ఆశ్రమంలో ఉండిపోయాడు.

ఏప్రిల్ 20, 1984న శ్రీరామయ్య నాగులవెల్లటూరు నుండి

ఆశ్రమానికి వచ్చాడు. ప్రతిరోజు అనికేపల్లి నుండి ఆశ్రమానికి భిక్షాన్నం తెచ్చేవాడు. అతడు పదిరోజులు స్వగ్రామం వెళ్ళినపుడు సుబ్బరాయుడనే మరొక భక్తుడు భిక్షకు వెళ్ళాడు. తర్వాత తన అలవాటు ప్రకారం ఏప్రిల్ 20 నుండి శ్రీరామయ్య భిక్షకుపోవాలి. కాని కాస్త పాలుమాలి ఇంకా నాల్గురోజులు సుబ్బరాయుడే భిక్షకుపోతాడులే అని అనుకొని శ్రీస్వామివారిని స్మరిస్తూ కూర్చున్నాడు. వెంటనే శ్రీస్వామివారు నెత్తిన ముసుగు పెట్టుకొని తమ ముసుగును శ్రీరామయ్యకు చూపుతూ వెక్కిరిస్తున్నట్లు అతడి మనోనేత్రానికి కనిపించారు. "భిక్షకు పోకుండా ముసుగేసుకొని మూలకూర్చో!" అని శ్రీస్వామివారు చెపుతున్నట్లు తనకు ఆత్మబోధ జరుగుతున్నది. చెంపలేసుకొని భిక్షకు బయలుదేరాడు.

కన్నవరం రాజయ్య డిసెంబరు 1984 లో ఒక వారం రోజులు జ్వరంతో బాధపడ్డాడు. ఆహారం సహించలేదు. బాగా బలహీనమయ్యాడు. చనిపోతానని భయపడ్డాడు. ఆ రాత్రి తన బాధను శ్రీస్వామివారికి మొరపెట్టుకొని నిద్రపోయాడు. స్వప్నంలో శ్రీస్వామివారు తంబుర వాయించుకుంటూ దర్శనమిచ్చారు. రాజయ్య వెళ్ళి స్వామి ఎదుట కూర్చోగానే, "ఎప్పుడూ నీ విషయం నాకు బాధేనయ్యా. ఇదిగో ఈ తంబుర పట్టుకో!" అని తంబుర ఇచ్చారు. మెలుకువ వచ్చింది. వారం రోజులుగా నిరంతరం $104^{\circ}$ ఉన్న జ్వరం పోయి వళ్ళంతా మంచుగడ్డలాగా ఉన్నది. విపరీతమైన ఆకలి, వెంటనే పాలు త్రాగాడు. తెల్లవారి మామూలుగా అన్నం తిన మొదలు పెట్టాడు.

పోలు మస్తానయ్య (పెనవర్తి) 1983 లో శ్రీస్వామివారి ఆరాధనకు నెల్లూరులో కూరగాయలు కొని రిక్షాలో వేసి నాలుగు బారల దూరం వచ్చాక ఏదో సంచి మార్కెట్టులో మరచిపోయినట్లు గుర్తించాడు. రిక్షాను రోడ్డు ప్రక్క నిలిపి ఆ సంచికోసం మార్కెట్టుకు పోయి వచ్చేలోపల రిక్షా ఆ ప్రాంతంలో లేదు. ఆ చుట్టుప్రక్కలంతా వెతికి వేసారాడు. గంటన్నర సేపటికి ఆ రిక్షావాడు తిరిగి వచ్చాడు. ఎక్కడికి పోయావని అడిగితే దీనవదనంతో "స్వామీ! బుద్ధి గడ్డి తిన్నది. కొంత దూరం పోయాక రిక్షా త్రొక్కేందుకు ఏ మాత్రమూ శక్తి లేదు. కండ్లు కనపడలేదు. ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. చేసిన తప్పుకు చెంపలేసుకుని మరలా వచ్చేశాను. క్షమించండి" అని

ప్రాధేయపడ్డాడు. శ్రీస్వామివారు ఇప్పటికీ సజీవులే!

మార్చి 1983 లో కాకు రాగయ్యగారి (గొలగమూడి) కోడెదూడ తప్పిపోయింది. ఒక నెలరోజులు వెతికినా కనపడలేదు. ఆ రాత్రి స్వప్నంలో శ్రీస్వామివారి వెనకాలే ఈయన నడుస్తూ ఇద్దరూ గొలగమూడికి నేరుగా తూర్పువైపు ఒక గ్రామానికి వెళ్ళారు. ఆ వూరిలోని ఒక ఆవుల దొడ్డి వద్దకు వెళ్ళారు. వీరి కోడెదూడ ఆ దొడ్లోని పేడదిబ్బ మీద నిలబడివుంది. వెంటనే మెలుకువ వచ్చింది. ఉదయాన్నే గొలగమూడికి నేరుగా తూర్పునున్న పెనవర్తికి పోయాడు. సరిగ్గా స్వప్నంలో చూచిన ఆవుల దొడ్డి దగ్గరకు పోవడమే ఆశ్చర్యం! అంతకంటే ఆశ్చర్యంగా తన కోడెదూడ ఆ దొడ్డిలోని పేడదిబ్బమీద తాను స్వప్నంలో చూచిన విధంగానే నిలబడి ఉంది.

రాయి లక్ష్మీనరసారెడ్డి (గోనుపల్లి - పెనవర్తి) గారి జత ఎద్దులు 1983 లో తప్పిపోయాయి. నెల రోజులు వెతికినా దొరకలేదు. రెడ్డిగారి భార్య ఒకనాటి రాత్రి “స్వామీ! సేద్యం ఎలాచేసి కుటుంబాన్ని పోషించాలి?” అని కన్నీటితో శ్రీస్వామివారి పటానికి నమస్కరించి నిద్రపోయింది. ఆ రాత్రి స్వప్నంలో శ్రీస్వామివారు కనిపించారు. ఆయనకు మోకాళ్ళకు క్రిందంతా ముళ్ళు గీచుకొని రక్తం కారుతున్నది. “నీ ఎద్దులు తోలుకు వచ్చేసరికి చూడమ్మా, నా కాళ్ళకు నెత్తురెలాకారుతున్నదో!” అన్నారు. మెలుకువ వచ్చి తలుపుతీసి చూస్తే నిజంగానే ఎద్దులు వాకిట ముందున్నాయి. వాటి శరీరాలపై కూడా ముళ్ళకంప గీచుకొని రక్తం కారుతున్నది.

పనబాక సుబ్బరామయ్య (గొలగమూడి) 1984 సం॥లో స్నేహితులను బ్రతిమిలాడి డబ్బు అప్పు తీసుకొని నెల్లూరులో దుక్కిపిండి బస్తాలు రూ॥ 450/- లకు కొని రిక్షాలో వేసుకొని బస్సు దగ్గరకు తెస్తున్నాడు. అల్లంత దూరాన బస్సు కదలిపోతున్నది. తాను రిక్షా నుండి దిగి ముందుగా పోయి బస్సు ఆపాలని ప్రయత్నించాడు. కాని బస్సు వెళ్ళిపోయింది. వెనక్కు తిరిగి చూస్తే రిక్షాలేదు. ఆ ప్రాంతమేకాదు, సమీపంలోని సందు గొందులన్నీ వెతుకుతూ స్వామిని స్మరిస్తూ కన్నీరు కారుస్తున్నాడు. పిండికట్టలు లేకుండా ఇంటికిపోయి బాకీల వాళ్ళచేత నానా మాటలూ పడేకంటే ఆత్మహత్యే మేలని నిశ్చయించుకొన్నాడు. ఎవరో ఒక పుణ్యాత్ముడీయనను పట్టుకొని ఆపి, “నీ

ఆదుర్దా, ఆవేశమూ ఏమిటి? ఇట్లా పరుగెత్తితే ఏ కారు క్రిందనైనా పడిపోతే ఏముంది? నీ బస్తాలు ఎక్కడికీ పోవు స్థిమితంగా వుండు" అని ఓదార్చాడు. మరొక గంటసేపటికి రిక్షావాడు తిరిగి అదే స్థానానికి వచ్చి పిండికట్టలు అప్పగించాడు.

చెరుకూరు క్రిష్ణయ్యకు (భక్తవత్సల నగర్) 1983లో గుండెనొప్పి వచ్చి నెల్లూరు గవర్నమెంటు ఆస్పత్రిలో వున్నాడు. ఒకటి రెండు సార్లు మంచం మీద నుండి క్రిందకూడా పడ్డాడు. ఆస్పత్రి ఉద్యోగుల సమ్మెవలన ఆగష్టులో ఇంటికి వచ్చియున్నాడు. ఒకనాటి రాత్రి పదిగంటలకు వెంటనే వెళ్ళి శ్రీస్వామివారి సమాధిని దర్శించాలని ప్రేరణగల్గి గొలగమూడికి ఒంటరిగా నడచి వస్తున్నాడు. కొండాయపాళెం కోనేరు దగ్గర ఎర్ర పంచె, చేతికర్ర గల మనిషి కనిపించి "ఎక్కడికి పోతున్నావు?" అని అడిగారు. "గొలగమూడి వెంకయ్యస్వామి దగ్గరకి" అని చెప్పాడు. "నీళ్ళు మడవేసి నేను కూడా వస్తాను పద"మన్నాడతడు. క్రిష్ణయ్య నాలుగడుగులు నడచి తిరిగి చూస్తే మనిషి లేడు! శ్రీస్వామివారి సమాధి దగ్గరకు వచ్చిన తరువాత గుండెనొప్పి వచ్చింది. ముందు వరండాలో పడిపోయాడు. అక్కడ భజన చేస్తున్న భక్తులు వీరిని ఫలానా వారని గుర్తించలేదు. నోటి నుండి చొంగపడుతోంది. అప్పుడు ఒక మనిషి వీరి వీపున గట్టిగా తట్టి పోతుందిలే!" అన్నట్లుందట. తెల్లవారి ఏ మందులూ లేకుండానే గుండెనొప్పి పోయింది. అసలు రాత్రివేళ, గుండె జబ్బుగల వ్యక్తి ఎనిమిది కి.మీ. నడచి రావడమే చిత్రం!

ఈదూరు నివాసి ఉప్పల వెంకయ్య భార్య శేషమ్మకు 1981 నుండి మోకాళ్ళ నుండి పాదముల వరకూ విపరీతమైన వాపు, నొప్పుల వలన రాత్రింబవళ్ళు నిద్రపట్టేదికాదు. ఎందరు డాక్టర్ల దగ్గర మందుతిన్నా ఫలితం లేకపోయింది. ఒక పూలమ్ముకొనే భక్తుడు శ్రీస్వామివారిని గురించి చెప్పి వారి సమాధిని దర్శించమని చెప్పాడు. ఆమె 1983లో శ్రీస్వామివారి సమాధిని దర్శించి ప్రార్థించింది. దర్శనంతోనే కొంత బాధ నివారణైంది. వారానికొకసారి తప్పక సమాధి దర్శనం చేసుకొని వెళ్ళేది. తరువాత కారణాంతరాలవలన దర్శనానికి రాలేక ఇంట్లోనే శ్రీస్వామివారి పటాన్ని పూజించసాగింది. మరలా యథా ప్రకారం నొప్పులు మొదలైనవి. ఈమె "స్వామీ, మీ సమాధి దర్శనం తరచు చేసుకోకున్నా, నిరంతరం ఇచ్చటనే తమను స్మరిస్తున్నాను గదా?

మరలా నాకీ బాధలు వచ్చాయే! దయ చూపండి” అని ప్రార్థించింది. నాటిరాత్రి స్వప్నంలో శ్రీస్వామివారు కన్పించి ఈమె వీపున చరిచి, “ఇదేమైనా నెత్తిన బరువా దించేదానికి? 3 సం॥ల నుండీ ఉన్నదే గదా. ఇక్కడే ఉండి ‘నాయనా’ అంటే సరిపోతుందా?” అన్నారు. తెల్లవారి అంతటి బాధలోనూ సమాధి దర్శనానికి నడిచి వెళ్ళింది. అది మొదలు ఆమెకు బాధలు లేవు. “నేను శ్రీస్వామివారిని చూడనైనా లేదే, నాకు మూడు సం॥ల నుండి బాధ ఉందని ఆయనకెలా తెలుసు” అని ఎంతో ఆశ్చర్యంతో చెపుతుంది. “దేవుడెక్కడైనా ఉన్నాడు గదా” అనే వారికి ఈ లీల కనువిప్పు కల్గిస్తున్నది.

శేషమ్మ కుమార్తెకు 1981 లో అధికంగా డిశ్చార్జి అవుతూంటే ఎన్నో వైద్యాలు చేయించారు. నెమ్మదించలేదు. శేషమ్మ తన కూతురికి శ్రీస్వామివారి విభూతినిచ్చి ఏమైనా మ్రొక్కుకోమని చెప్పింది. ఆమె నిత్యమూ విభూతి సేవిస్తూ తనకు ఆరోగ్యం బాగుపడితే శ్రీస్వామివారి సమాధిని దర్శిస్తానని మ్రొక్కుకొన్నది. అది మొదలు ఆమెకా బాధ నివారణైంది.

కొఱ్ఱకూటి నరసింహులునాయుడుగారి ఎద్దుకు 1983 సం॥లో జబ్బుచేసినందున దాన్ని ఆశ్రమం దగ్గర కట్టేసి విభూతి దాని నోటిలో వేస్తూ, వంటికి పూస్తూ నాయుడుగారు మూడు రోజులు అనన్యంగా శ్రీస్వామివారిని ప్రార్థించారు. కానీ దాని వ్యాధి హెచ్చుతూ తగ్గుతూ వుంది. ఇక ఈ ఎద్దు బ్రతకదని నిశ్చయించుకొని ‘స్వామిని నమ్ముకుంటే దీన్ని నయం చేయలేకపోయాడే’ అని బాధపడి పడుకున్నారు.

ఆ రాత్రికి స్వప్నంలో శ్రీస్వామివారు దేదీప్యమానమైన సింహాసనంలో ఆసీనులై యుండగా ఎవరో వింజామరలు వీస్తున్నారు. నాయుడుగారు శ్రీస్వామివారి దగ్గరకెళ్ళి అందరిలో నిలబడగానే ఆయన ‘నీ ఎద్దుకు బాగవుతుందిలే పోవయ్యా!’ అన్నారు. మెలకువ వచ్చి చూస్తే ఎద్దులేచి బిందెడు మూత్రం విడిచింది. మేత తిని స్వస్థత చెందింది.

తూపిలి వెంకయ్య (గొలగమూడి) 1984లో పెద్ద గుడ్డలమూట నెత్తిన పెట్టుకొని బస్సుపైన వేయడానికి నిచ్చెన ఎక్కాడు. ఇది తెలియక ఎవరో ‘రైట్’ చెప్పడంతో బస్సు కదిలింది. నిచ్చెనపై నుండి అతడొక ప్రక్క, మూటొక ప్రక్క పడిపోయారు. అరవై అడుగుల దూరం పోయి బస్సు ఆగింది. ‘వెంకయ్య తల పగిలి చచ్చాడు!’ అనుకున్నారందరూ, కానీ అతడికి కనీసం

చిన్న దెబ్బ గూడ తగలలేదు. అతడు వెంటనే లేచి ఆత్రుతగా మూట నెత్తిన పెట్టుకొని బస్సు దగ్గరకు పరుగెత్తడం చూచి అందరూ దిగ్భ్రమ చెందారు. 'నీ భార్య తాళిబొట్టు గట్టిదయ్యా!' అన్నారు. కానీ అది కేవలం శ్రీస్వామివారి కృపేనని అతడి భార్య పిచ్చెమ్మకు మాత్రమే తెలిసింది. కారణం ఈ సన్నివేశానికి మూడురోజుల ముందు పిచ్చెమ్మ స్వప్నంలో శ్రీస్వామిభక్తుడైన సమాధి మందిరం పూజారి కనిపించి ఆమెకు కుంకుమ బొట్టు పెడతానన్నాడు. ఆమె చేతిలో పెట్టమని అడుగుగా ఆయన అలాగే పెట్టాడు! ఈ స్వప్నం లేకుంటే వెంకయ్య కాకతాళీయంగా చావు తప్పించుకున్నాడని అనుకునేందుకు అవకాశముండేది.

సెప్టెంబర్ 1983 సం॥లో అగ్నిగుండం సమాధి మందిరమునకు ఎదురుగా నేలమీద ఒక అడుగు లోతు గుంట త్రవ్వి అందులోవేయబడేది.

ఒకరోజు ఈ వెంకయ్య కుమార్తె, మూడు సంవత్సరాల శ్యామల, మరొక పాపతో ఆడుకొంటూ ధుని చుట్టూ తిరుగుచున్నారు. ఆ ఆటలో అవతలి పాప శ్యామలను మండుతున్న అగ్ని గుండములోనికి తోసింది. ప్రజ్వరిల్లే మంటలలో బిడ్డ పడింది. ముంజేతుల వరకూ నిప్పులలో కూరుకుపోయాయి. ఆ బిడ్డ భయపడి మూత్రం విసర్జించి అరచింది. ఇరవై అడుగుల దూరంలో నున్న నాగయ్య పరుగునపోయి బిడ్డను బైటకు లాగేశాడు. పిచ్చమ్మ బావి నుండి పరుగెత్తి వచ్చింది. అంతటి మంటలో పడినా ఆ బిడ్డకు వెంట్రుకలు కూడా చెక్కుచెదరలేదు, చేతులు కూడా కందలేదు.

**127 మనము ఏమారియున్న సమయాలలో కూడా సర్వసమర్థుడైన శ్రీస్వామివారు మనలనేగాక మన బిడ్డలను కూడా ఎలా రక్షిస్తారో చూడండి.**

'వెంకయ్య పేరుమీద పిడికెడు మెతుకులు పెట్టినవారికి, తెచ్చినవారికి వారి మంచి చెడ్డలన్నీ మనమే చూడొద్దయ్యా' అని శ్రీస్వామివారు సెలవిచ్చి యున్నారు. ప్రతి నిత్యం వంటకాగానే కొంత ఆహారం ఆకులో గాని, కాగితంలో గాని ఇంటి బయట పెట్టి 'అన్ని జీవులలో వున్న శ్రీ వెంకయ్య స్వామివారికి సమర్పయామి' అని నమస్కరించుకుంటే నిత్యమూ శ్రీస్వామివారి అండ మనకున్నట్లే.

చెముడుగుంట ఆదెయ్య (అల్లీపురం) మార్చి 1984 లో కాలూ, చెయ్యి పడిపోయి మంచాన పడ్డాడు. మనిషి లేవదీస్తే లేచి కూర్చోగలిగేవాడు.

పట్టుకుంటే నిలుచునేవాడు. ఆర్థిక స్థోమత లేక ఒక నెల ఏ వైద్యమూ లేదు. ఒక రోజు శ్రీస్వామివారు గుర్తుకురాగా 'తెల్లవారే సరికి కొంచెం నెమ్మదిగా ఉంటే నీ దర్శనానికి వస్తాన'ని మ్రొక్కుకున్నాడు. అంత మాత్రాన ఆ తెల్లవారి ఎవరి సహాయమూ లేకుండానే లేచి కూర్చోగలిగాడు. వెంటనే శ్రీస్వామివారి సన్నిధికి చేరాడు. మొదట కర్ర సహాయంతో కాస్త నడువగలిగాడు. మూడవరోజు శ్రీస్వామివారు స్వప్నంలో కనిపించి 'కర్ర లేకుండా నడువు, చూడాలి' అన్నారు. ఆ తెల్లవారి నుండి అతడు కర్ర లేకుండానే నడుస్తున్నాడు.

వీరి భార్యకు కడుపులో బిళ్ళ వలన నొప్పిగా వుండి, అన్నం అరిగేది కాదు. శ్రీస్వామివారి చెంతకొచ్చాక ఆమెకు ఆ బాధ నివారణైంది. ఎప్పుడూ స్వామివారి సన్నిధిలోనే వుండాలని ఇప్పుడతడు గొలగమూడికే కాపురం మార్చాడు.

అప్పయ్య గేటు నివాసి గోనుగుంట రామమ్మ తనను బాధిస్తున్న భూతాన్ని శ్రీస్వామివారు ఎలా వెళ్ళగొట్టారో ఇలా వివరిస్తుంది: అన్నం సహించదు, బలహీనత, శరీరం నొప్పులు, బాగా శుష్కించిపోయింది. ఎందరు డాక్టర్లకు చూపించి ఎన్ని మందులు వాడినా నయంకాలేదు. తన స్నేహితుల సలహాపై శ్రీస్వామివారి సమాధిని దర్శించింది. నాటి రాత్రి ఆమెకు స్వప్నంలో ఒక వ్యక్తి 'ఛీ వెధవా! ఇక్కడకు కూడా వచ్చావా వెళ్లు' అన్నట్లు దర్శనమైంది. తెల్లవారేసరికి ఆకలై అన్నం సహించింది. ఒక వారంలో పూర్తి ఆరోగ్యం చేకూరింది.

1983 సం॥లో గోనుగుంట రామమ్మగారి బఱ్ఱె ఈనలేక మూడు రోజుల నుండి బాధపడుతూ అడ్డం పడిపోయింది. పశువుల డాక్టరు బఱ్ఱెను పరీక్షించి దూడ అంతకు ముందురోజే కడుపులో చనిపోయిందనీ, దానిని తీసివేస్తే బఱ్ఱె బ్రతుకుతుందని చెప్పి, దూడను తల్లి గర్భం నుండి లాగి ప్రక్కన వేశాడు. 'దూడను పారేసి ఈ స్థలమంతా శుభ్రం చేయండి. బఱ్ఱెకు ఇంజెక్షను చేస్తా'నన్నాడు. ఆమె, 'నా స్వామి నాకు దూడ లేకుండా చేస్తాడా? మూడు గంటలు చూచిగాని దూడను కదిలించను' అన్నది. 'ఏమమ్మా చనిపోయిన దూడెలా బ్రతుకుతుంది?' అన్నాడు డాక్టరు. కాని ఆమె ఇక వారితో మాట్లాడకుండా ఒక తువ్వాలు నీటిలో పిండి దూడపై కప్పి 'స్వామీ!

ఈ దూడ బ్రతికితే దీన్ని నీ ఆశ్రమానికి ఇస్తాను. ఒకరోజు పాలు తెచ్చి తమకు సమర్పిస్తాను' అని మ్రొక్కుకుని శ్రీస్వామివారిని స్మరిస్తూ కూర్చున్నది. మూడు గంటలు కాకముందే దూడ కళ్ళు తెరిచింది. అంతవరకూ అక్కడనే ఉన్న డాక్టరుగారు ఇది శ్రీస్వామివారి మహిమేనన్నాడు. నాలుగు నెలలు గడచినా ఆమె పాలు శ్రీస్వామివారికి సమర్పించలేదు. ఒకనాడు శ్రీస్వామివారు స్వప్నంలో కనిపించి, 'అమ్మా, మూడు నెలలు గడిచినా నా మాట మరచిపోయావే!' అని అన్నారు. తెల్లవారగానే చెంపలేసుకుని పాలు తెచ్చి ఆశ్రమంలో సమర్పించి 'దూడ పాలు మరువగానే తీసుకొచ్చి శ్రీస్వామివారి ఆశ్రమంలో అప్పగిస్తా'నని సమాధికి చెప్పుకొని వెళ్ళింది. ఆర్థిక ఇబ్బందుల వలన బర్రెను అమ్మేసింది. దూడ ఖరీదు యాభై రూపాయలుగానిర్ణయించారు. కానీ ఆ పైకం పద్దెనిమిది నెలల వరకు శ్రీస్వామివారికి చెల్లించలేదు. తేది 18-1-85 న శ్రీస్వామివారు స్వప్నంలో దర్శనమిచ్చి 'నీవు నాకు నూటముప్పై రూపాయలు బాకీ తేలావు. తేది 19-12-85 లోగా చెల్లిస్తానని ఆశ్రమంలో కాగితం వ్రాయించి వేలిముద్ర వేసిరా' అని ఆదేశించారు. కాగితం వ్రాయించి వేలి ముద్రవేసి వెళ్ళింది. **వెంటనే మ్రొక్కు చెల్లించనందుకు రూ. 80/- జరిమానా (జుల్మానా). మ్రొక్కు తీర్చడంలో మనమెంత జాగ్రత్తగా ఉండాలో తెలుపుతుంది ఈ లీల.**

128 గుండబోయిన నరసయ్య (అనపలపాడు) గారి మొదటి రెండు సంతానాలు పురిటిలోనే చనిపోయారు. 1983 లో మూడవ సంతతిగా ఆడపిల్ల కలిగింది. కానీ ఐదవరోజు నుండి జ్వరమొస్తూ ఆ బిడ్డ పాలుగానీ, మందుకానీ ఏమి పోసినా వాంతి చేసుకుంటుంది. బిడ్డ శరీరం చాలా వేడిగా ఉన్నది. రెండవరోజు సాయంకాలానికి బిడ్డ వాలబడిపోయింది. ఎటువేసిన కాలు అటు, ఎటువేసిన చెయ్యి అటుపడిపోతున్నాయి. బిడ్డ కళ్ళు మూతవేసింది. ఉన్నట్లుండి శరీరం చల్లబడింది. మొదట కలిగిన ఇద్దరు బిడ్డలవలే ఈ బిడ్డకూడా చనిపోబోతుందని ఇంటిల్లపాదీ గొల్లున ఏడుస్తున్నారు. అందరూ గుమిగూడారు. ఆ దారిన పోతున్న గోనుగుంట రామమ్మ ఈ విషయం చూచి బిడ్డను సమీపించింది. శ్రీస్వామివారు తప్పక ఆ బిడ్డను బ్రతికిస్తారని ఆమెకు దృఢమైన నమ్మకం కల్గింది. వెంటనే వస తెచ్చింది. ప్రక్కింటామె దగ్గర చనుబాలతో రంగరించి బిడ్డకు పోసింది. అంతవరకూ ఏమి పోసినా

వాంతి చేసుకుంటూ స్పృహలేకుండా ఉన్న బిడ్డ వసపాలు త్రాగింది. బిడ్డలో ఏ మాత్రమూ చలనం లేదు. రామమ్మ శ్రీస్వామివారి విభూతిని మంచం కోళ్ళ క్రిందపోసి, ఆ బిడ్డ నోటిలో కొంచెం వేసి, వంటికి పూసి మంచంపై పండ బెట్టి బిడ్డ తప్పక బ్రతుకుతుందని చెప్పి వెళ్ళిపోయింది. గంట లోపల బిడ్డ కళ్ళు తెరిచింది. తెల్లవారి పాలు త్రాగింది. స్వామికృపవలననే ఆ బిడ్డ దక్కిందని ఆ బిడ్డకు శ్రీస్వామివారి పేరు పెట్టారు.

పెనవర్తి వాస్తవ్యులు పంచాక్షరి మస్తానయ్య చాలా కాలంగా శ్రీస్వామివారి భక్తులు. వీరికి స్వప్న సందేశాలిచ్చి అనేక సార్లు రాబోవు ఆపదల నుండి శ్రీస్వామివారు వీరిని కాపాడారు.

తేది 7-7-84 న శ్రీస్వామివారు మస్తానయ్యకు స్వప్న దర్శనమిచ్చి 'అయ్యా ఐదు శవాలు ఒకేతూరి పోవలసియున్నది. సతాయించుటకు వీలులేని పరిస్థితి. మీరేమో చెబితే మాట వినిపించుకోని మొరటు మనుషులు' అని చెప్పారు. 'ఏమిటి స్వామి ఇలా చెబుతున్నార'ని మదనపడ్డాడేగాని తన స్వప్న వృత్తాంతమెవ్వరికీ చెప్పలేదు. తెల్లవారి 8-7-84 తేదీన మడవనూరు నుండి ట్రాక్టరు తోలుకుని పెనవర్తికి పోవాలి. మనస్సు ఆందోళనగా ఉంది. వెళ్ళేందుకు కాళ్ళాడవు.

ఇతని స్వప్న వృత్తాంతం వీళ్ళన్నకు తెలియదు. కనుక తప్పనిసరిగా ట్రాక్టరు తీసుకొని వెళ్ళాలని పట్టుబట్టాడు. మార్గమధ్యంలో గూడా మస్తానయ్య ట్రాక్టరు నిలిపేశాడు. కానీ అన్నగారి ప్రోద్బలము వలన వెళ్ళక తప్పలేదు. మద్రాసు రోడ్డు నుండి గొలగమూడి మట్టిరోడ్డు మలుపు (టర్నింగ్) తిరిగేటప్పుడు ఎరువుల లారీ రాంగ్ సైడ్ వచ్చి ట్రాక్టరును ఎదురు గుద్దింది. ఆ ఆపద సమయంలో అంతరిక్షంలో ఎవరో అరచేయి చూపినట్లు మస్తానయ్యకు మాత్రం అస్పష్టంగా గోచరించింది. ట్రాక్టరు గాలిలో ఎగిరి రోడ్డు ప్రక్కన పడిపోయింది. ట్రాక్టరు మీద సరిగ్గా ఐదుగురే ఎక్కి ఉన్నారు.

1. డ్రైవర్ మస్తానయ్యకు తలకాయ మీద చర్మం చీలి రక్త మండలమయింది. ఇంతేగాక తొడ ఎముకకు దెబ్బ తగలకుండా కండ మాత్రం బ్లేడుతో కోసినట్లు నాలుగంగుళాల పొడవున తెగిపోయింది.

2. వీళ్ళన్న ఇంజను క్రింద పడిపోయాడు. పొట్టమీద బరువు పడి

నొక్కడంతో రక్తం కక్కుతూ కొనవూపిరితో ఉన్నాడు.

3. మిగిలిన ముగ్గురికీ తేలికపాటి నెత్తురు గాయాలు తగిలాయి.

రక్తపు మడుగులో పడియున్న మస్తానయ్య తెప్పరిల్లుకొని కొనవూపిరితో ఉన్న అన్నగారిని చూచాడు. స్వామికృప వలన తనకందుబాటులో పడియున్న జాకీని అందుకొని ధైర్యంగా తన కుడికాలుతో జాకీరాడ్ త్రిప్పుచూ తన అన్నగారిపై ఉన్న ట్రాక్టరును నాలుగు అంగుళముల పైకి లేపాడు. అంతటితో వాళ్ళన్న కాస్త ఊపిరి పీల్చగలిగాడు. అంతలో వచ్చిన బస్సులో వీళ్ళనందరినీ ఆస్పత్రికి చేర్చారు. మస్తానయ్య అన్న తప్ప మిగిలిన నలుగురూ బ్రతికారు. ఇంజను పడ్డ విధానం చూస్తే వాళ్ళ ఎముకలు గూడా దొరకని తీరుగా వుంది.

నాటి రాత్రి శ్రీస్వామివారు మస్తానయ్యకు స్వప్నదర్శనమిచ్చి 'నీ బండిని చేత్తో విసిరి అవతల వేయవలసి వచ్చిందయ్యా' అని చెప్పారు. ఐదుగురు పోవలసి ఉంటే తన కృప వలననే నలుగురు బ్రతికారని శ్రీస్వామివారు ఈ స్వప్నం ద్వారా తెలిపారు.

మస్తానయ్య ఆస్పత్రి నుండి డిస్‌చార్జి అయ్యాక నాటి రాత్రి శ్రీస్వామివారు స్వప్నంలో కనిపించి, 'మొదట గొలగమూడి వెళ్ళి నిద్రచేసి తరువాత మద్రాసు వెళ్ళి మీ అన్నను చూచిరమ్మ'ని ఆదేశించారు. శ్రీస్వామి వారి ఆజ్ఞ ననుసరించి ఆనాడు ట్రాక్టరు కదిలించకుంటే ఎలాగుండునో గదా!
129 **శ్రీస్వామివారు కృప జూపినా దాన్ని దక్కించుకొనుటకు శ్రీస్వామివారి మాట మీద విశ్వాసముంచి వారు ఆదేశించినట్లు మనమాచరించాలి గదా!**

ఆగష్టు 1982 సం॥ లో శ్రీస్వామివారు మహాసమాధి చెందాక ఒక రోజు మస్తానయ్యను ట్రాక్టరు తోలేందుకు పోవద్దని శ్రీస్వామివారు స్వప్నంలో హెచ్చరించారు. తెల్లవారి ట్రాక్టరు తాళాలు తీసుకోబోతే రెండు మార్లు క్రింద పడ్డాయి. కానీ ఆ రోజు దున్నకుంటే తరువాత దున్నేందుకు నీళ్ళు దొరకవు కనుక నారు వేసేందుకు వీలు లేక తన యజమాని రెడ్డిగారికి చాలా నష్టం జరిగేటట్లు ఉంది. విధిలేక శ్రీస్వామివారికి నమస్కరించి ట్రాక్టరుతో దున్నుచున్నాడు. చేనులో ఒకచోట మరమ్మత్తు చేసిన గుంటలో ముందు చక్రాలు దిగబడి, గేరు మార్చి బండి లాగించే ప్రయత్నంలో వెనుక చక్రాలు లేచిపోయి ట్రాక్టరు తిరగబడిపోయింది. ఇతడు స్టీరింగ్ క్రిందపడి బురదలో

కూరుకుపోయాడు. ఎలా తప్పించుకొని బయటకు వచ్చాడో ఆయనకే తెలియదు. అది చూచిన వారంతా 'బురద దున్నకంలో ఇలాంటి యాక్సిడెంటు జరిగిన డ్రైవర్లందరూ అక్కడికక్కడే మరణించారు. నీవు బయట పడ్డావంటే ఇది కేవలం దైవకృపేనని' తమ ఆశ్చర్యాన్ని ప్రకటించారు.

ఒకప్పుడు ఆదినారాయణరెడ్డిగారి పొలంలో నీటి కొరకు పాయింటు వేయించాలని నాలుగు చోట్ల ప్రయత్నించినా లాభం లేకపోయింది. తన యజమానికి జరిగే నష్టము గురించి మస్తానయ్య చాలా బాధపడి శ్రీస్వామివారికి మొరపెట్టుకొని బోరింగ్ ఎక్కడవేస్తే నీళ్ళు పడతాయో తెల్పమని శ్రీస్వామివారిని ప్రార్థించాడు. ఆరోజు రాత్రి ఇతని స్వప్నంలో రెడ్డిగారి చేలో కొంగలు, కాకులు, నక్కలు ఒకచోట నీరు త్రాగుచున్నట్లు కనిపించింది. ఆ పొలంలో ఆ దృశ్యం గోచరించిన చోట బోరింగ్ వేస్తే సమృద్ధిగా నీరు పడ్డాయి.

**'మీరు మా వైపు చూస్తే మేము మీ వైపు చూస్తాండ్లయ్యా', 'వాళ్ళుండే** 130
**దాన్ని బట్టి గదయ్యా మనముండేది' అని అభయమిచ్చారు గదా శ్రీస్వామివారు.**

బ్రాహ్మణపల్లి గ్రామస్తులు బట్రెడ్డి శ్రీనివాసులురెడ్డి భార్య మనోజమ్మగారికి వివాహమైన 4 సం॥ల వరకు సంతానం లేదు. శ్రీస్వామివారితో వారికి గల అనుభవము వలన ఆమె 1986 ఫిబ్రవరిలో శ్రీస్వామివారి సమాధిని దర్శించి తన కోరికను విన్నవించుకున్నది. నాటిరాత్రి శ్రీస్వామివారు ఆమె స్వప్నంలో సంతానం ప్రసాదించానని తమ ఆశీర్వాద సూచకంగా ఒక దారం ప్రసాదించారు. తెల్లవారి చూస్తే నిజంగానే శ్రీస్వామివారు ప్రసాదించిన దారం ఆమె తాళిబొట్టునిండా చుట్టుకొని ఉన్నది. స్వప్నంలో ఇచ్చిన దారం నిజంగానే తెల్లవారి ఉండడం అనే అనుభవాల్లో ఇది రెండవది.

ఇబ్రహీంపట్నం - ఎలక్ట్రికల్ ఇంజనీర్ పి.మాధవరావుగారు జీవితంలో అనేక కష్టనష్టాలకు లోనై మనశ్శాంతి లేక దైవచింతననే శరణు వేడారు. బెజవాడ కనకదుర్గను ఆరాధించసాగారు. ఆమె సాక్షాత్కరించింది. కానీ మనశ్శాంతి లేదు. అట్టి స్థితిలో ఆ దుర్గ కృప వలన భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి చరిత్ర లభించి పారాయణ చేశారు. వెంటనే తమ మానసిక వేదన ఏమైందో కానీ ఎంతో శాంతి పొందారు. వెంటనే శ్రీస్వామివారి

ఆశ్రమానికి నెలకు 50 రూపాయలు చొప్పున దక్షిణ పంపుతూ శ్రీస్వామివారి చరిత్ర పారాయణ, పూజ ప్రారంభించారు. శ్రీస్వామివారి 3వ ఆరాధనోత్సవమునకు కుటుంబ సమేతముగా వచ్చి ఒక వారం శ్రీస్వామివారిని సేవించారు. 24-8-85న శ్రీస్వామివారి పాలరాతి విగ్రహం ఆవిష్కరించే రోజు జనంలో ఆ విగ్రహాన్ని, సమాధిని దర్శించలేక దూరము నుండి నిక్కి చూస్తున్నారు. సమాధి నుండి శ్రీస్వామివారు నడుముల వరకు పైకి వచ్చి దర్శనమిచ్చి "ఇక్కడేమి చూస్తావు, అందరిలో నన్ను చూడు" అని అదృశ్యమైనారు. అది మొదలు అన్నసంతర్పణ దగ్గర వడ్డనలో పాల్గొన్నారు.

ఆయనే ఇంకా ఇలా చెప్పారు. "నాకు 1 1/2 సం॥ నుండి గుండెకు ఎడమ వైపు నొప్పి. ఎక్కువ సేపు ధ్యానంలో కూర్చోలేను. డాక్టర్లిచ్చిన మందులు నిష్ప్రయోజనమైనాయి. ప్రాణాపాయమని భయపడ్డాను. నా బాధను నివారించి నా కాలాన్నంతటినీ తమ ధ్యానంలో గడిపేటట్లు చేయమని" ఆరాధనకు వచ్చినప్పుడు శ్రీస్వామివారికి విన్నవించుకొని వారి సమాధిని వదలి రాలేక ఎంతో దుఃఖముతో వచ్చేశాను. ఇల్లు చేరిన తెల్లవారి నుండి 15 రోజులు రక్తవిరేచనములైనవి. 16వ రోజుకు విరేచనాలు నిలిచిపోయాయి. నా గుండె నొప్పి కూడా శాశ్వతంగా మాయమైంది. లక్ష్మీనారాయణుని రూపం స్వప్నంలో దర్శనమైంది. ఇప్పుడు పూర్వంకంటే ఎంతో గాఢంగా ధ్యానం కుదురుతుంది.

"ఆగష్టు నెలలో శ్రీసాయినాథుడు కనిపించి గది లోపల శుభ్రంగా ఉంది. కానీ పైన బూజు ఉన్నది. ఆ బూజు శుభ్రం చేస్తే నేను గదిలోకి వస్తానని శెలవిచ్చారు. ఇది బాబా నాకు చేసిన ఆధ్యాత్మిక ప్రబోధమని నమ్ముతున్నాను.

"సెప్టెంబర్ 85 నుండి శ్రీస్వామివారు ఆధ్యాత్మిక బోధ చేయుచు ఆ మార్గాన నడుపుతున్నారు. ఎంత చక్కని అవగాహన, హృదయ స్పందన, మనశ్శాంతి ప్రసాదించారో చెప్పలేను. ఆధ్యాత్మిక విషయాలను బోధిస్తూ దృశ్యముల ద్వారా కర్మ క్షాళనం చేయిస్తున్నారు. శ్రీస్వామివారికి అఖండ దీపారాధన చేసి వారి మహిమ, విశ్వరూపాన్ని చూసి ఆనందిస్తున్నాను. ఈ జన్మకు ఇంతకంటే కావలసిందేదీ లేదు."

స్వామీ! మీరు సమాధి చెందితే మా గతి ఎట్లా? అని వాపోయిన భక్తులతో భగవాన్ శ్రీ వెంకయ్య స్వామివారు "ఎక్కడికయ్యా మేం పోయేది

సూర్యచంద్రులున్నంత వరకు వుండేదేగదయ్యా!” అని అన్నప్పుడు భక్తులకు అదెలా నిజమౌతుందో అర్థంకాలేదు. అయితే కాలాంతరంలో శ్రీస్వామివారు సమాధి చెందాక సమాధి నుండి ఆయన పలుకుతూ తమ భక్తుల మొరాలకిస్తున్నారని లీలలు ఎన్నో నిరూపిస్తున్నాయి. శ్రీస్వామివారి సమాధిని దర్శించలేకపోయినా దూరాన తమ ఇళ్ళలో శ్రీస్వామివారి పటం ముందు ఆర్తితో చెప్పుకున్న కష్టాలను సైతం శ్రీస్వామివారు తీరుస్తున్నారంటే భక్తరక్షణా పరతంత్రత మనల్ని ఆనందంలో ముంచేస్తుంది.

నెల్లూరు గవర్నమెంటు ఆస్పత్రి యమ్.యన్.ఒ. సి.వి. సుబ్బయ్యగారు శ్రీస్వామివారితో తమ అనుభవాలు ఇలా చెపుతున్నారు.

1977 లో తుఫాను వల్ల మా ఇల్లు పడిపోయింది. రెండు వైపుల ఇటుక మట్టితోనూ, రెండు వైపుల మట్టితోనూ గోడలు పెట్టుకొని మరల ఇల్లు వేసుకున్నాము. 1978 లో మరలా తుఫాను వల్ల మూడు రోజులు బీభత్సమేర్పడింది. కరెంటు లేదు. విపరీతమైన గాలి వల్ల గోడల తోటి ఇల్లు ఊగుతూవుంది. ఇల్లు వదలి రాత్రిపూట ఎక్కడికీ వెళ్ళలేని పరిస్థితిలో “స్వామీ! పోయిన సంవత్సరం ఇల్లు పడిపోయి కష్టనష్టాలకు గురి అయ్యాను. మళ్ళీ ఇప్పుడు గూడా అలాంటి పరిస్థితే చేస్తున్నారా? ఏమి చేసినా ఈ ఇల్లు వదలి పోలేను. మీ దయ” అని వేడుకుని పడుకున్నాను. వెంటనే స్వప్నం. శ్రీస్వామివారు వచ్చారని దీపం వెలిగించి చూస్తే ఏమీ లేదు. శ్రీస్వామివారి పటానికి నమస్కరించి మళ్ళీ పడుకున్నాను. ఆ గాలి ఎలా పోయిందో ఏమో! మా ప్రాంతంలో అనేక ఇండ్లు కూలిపోయాయి. కానీ మా ఇల్లు మాత్రం చెక్కుచెదరలేదు. వారావిధంగా దర్శనమివ్వకుంటే మా ఇల్లు నిలిచినది శ్రీస్వామివారి కృపవలనేనని నమ్మకముండేది కాదేమో!

శ్రీస్వామివారు సశరీరులుగా ఉండగా నన్నెప్పుడూ తమ పాదాలు అంటి నమస్కరించుకోనిచ్చేవారు గాదు. ఎప్పటికైనా నాకలాంటి అవకాశం రాకపోతుందా అని నిరీక్షిస్తూండేవాడిని. అయితే నాకాయన పాదస్పర్శ భాగ్యం కలుగకుండానే ఆయన మహాసమాధి చెందారు. శ్రీస్వామివారు నాకా అవకాశం ఇవ్వనేలేదే అనే కొరత నా హృదయంలో అలానే నిలిచి అప్పుడప్పుడూ ఎంతో వ్యథ చెందేవాడిని.

అయితే ఆక్టోబర్ 85లో నాకొక స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో శ్రీ

వెంకయ్య స్వామివారు చరచరా నడిచి వెళ్తున్నారు. నేను శ్రీస్వామివారు దొరికారు ఇంతేచాలు అని ఎదురుగా వెళ్ళి ఆయన రెండు కాళ్ళు జవిరి పట్టుకొని శ్రీస్వామివారిని ఒక్క అంగుళం కూడా కదలనివ్వలేదు. శ్రీస్వామివారు తల గీరుకుంటూ నవ్వుతూ అలాగే నిలుచున్నారు. నేను తృప్తి తీరా నమస్కరించుకున్నాను. అంతటితో స్వప్నం ముగిసింది. ఆనాటి దర్శనం నా హృదయంలో చెరగని ముద్ర వేసింది. ఆ స్వప్నం ఎప్పుడు గుర్తుకు వచ్చినా ఆ అనుభూతి నన్నానందంలో ముంచెత్తుతుంది. నా తీరని కోరికను శ్రీస్వామివారు అలా తీర్చారు. ఆ తర్వాత కూడా శ్రీస్వామివారు నన్నేకసార్లు ఆదుకున్నారు. 1983 లో జరిగిన ఒక విచిత్రమైన స్వామిలీల చెబుతాను.

నాకు గొల్లకందుకూరుకు రెండు మైళ్ళ దూరంలో సేద్యపు భూములున్నాయి. ఒకసారి పొలాలకు నీరు పెట్టవలసివచ్చి కనుపూరు కాలువకు ఆయిల్ ఇంజన్ బిగించి వుంచి, అవసరమైనప్పుడు నీరుకొద్తున్నాను. ఒకరోజు రాత్రి ఇంజన్‌కు గల ఆయిల్ పైపు, ఆటోమైజరూ దొంగలు అపహరించారు. నాకున్న ఎన్నో పనులలో ప్రతిరోజూ ఇంజనుకు కాపలా కాస్తూ వుండడం నాకసంభవమైంది. ఇలా దొంగలు పడి ప్రతిరోజూ ఇంజను సామానులు కొన్ని ఎత్తుకుపోతుంటే ఇక సేద్యం చేయలేనని అనుకున్నాను. నాకు వారానికి ఒక పర్యాయమైనా గొలగమూడి వెళ్ళి శ్రీ వెంకయ్యస్వామివారి సమాధిని సేవించుకొని రావటం అలవాటు. అలాగే గొలగమూడి వెళ్ళి నాకు జరిగిన నష్టాన్ని అక్కడ శ్రీస్వామి భక్తులకు చెప్పాను. అది విన్న పూజారి నాగయ్యగారు శ్రీస్వామివారి దారం ఒకటి నాచేతికిచ్చి 'ఈ స్వామివారి దారం తీసుకువెళ్ళి నమ్మకంతో నీ ఆయిల్ ఇంజనుకు కట్టవయ్యా! దొంగలు రారు, వస్తే వాళ్ళే పోతారు' అన్నారు. ఆ ప్రకారమే వెళ్ళి 'స్వామీ! ఈ ఇంజను సంరక్షణ భారం నీదే! మరలా దొంగల చేయి పడితే ఆ నష్టానికి నేను తట్టుకోలేను. నీదే భారం' అని మనస్ఫూర్తిగా ప్రార్థించుకొని దారం ఇంజనుకు కట్టాను.

ఆ తర్వాత కొద్ది రోజులు నేను ఇంజను ఛాయలకే పోలేదు. డిసెంబరు 84 లో నాతోటి రైతులు నా వద్దకు వచ్చి ' రెండు రోజులు బట్టి పొలంలో నీ ఇంజను సామానులన్నీ విప్పదీసి పడేసి వున్నాయి. వెళ్ళి చూచుకోమ'న్నారు. నా గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి. త్వరగా వెళ్ళి చూచుకున్నాను. ఇంజను సామానులన్నీ విప్పదీసి పడేసి వున్నాయి గాని, విప్పదీసిన వారెవరో ఒక్క

పార్టు కూడా తీసుకువెళ్ళలేదు. ఆ రక్షకుడు శ్రీస్వామివారు కాక మరెవ్వరు?

శ్రీస్వామివారు మననుండి కోరే దక్షిణ మన కాలము, మనస్సు మాత్రమే. వాటిని లౌకిక వ్యవహారాలలో వ్యర్థం చేయక మన కాలాన్నంతటినీ శ్రీస్వామివారి స్మరణలో గడిపితే వెంటనే శ్రీస్వామివారి రక్షణ మనకు ఎలా కలుగుతుందో చూడండి.

మనుబోలు గ్రామం నట్టేటి లక్ష్మమ్మకు స్వప్నంలో రోజూ యమకింకరులు కనిపించి భయపడేది. పగలు కూడా చెప్పలేనంత భయం. ఎప్పుడూ ప్రక్కన మనిషి ఉండాలి. శ్రీస్వామివారి సమాధిని దర్శించి ఉదయం 5, సాయంత్రం 5 ప్రదక్షిణలు చేసి మిగతా కాలం మామూలు కబుర్లతో గడిపేది. 20 రోజులైనా ఫలితం కలగలేదు. ఒక భక్తుని సలహాపై ఉదయం 108, సాయంత్రం 108 ప్రదక్షిణలు చేస్తూ తన కాలాన్నంతా శ్రీస్వామివారి స్మరణలో గడపసాగింది. 3వ రోజు మధ్యాహ్నం శ్రీస్వామివారి అగ్నిగుండం దగ్గర 12 సంవత్సరముల పిల్లవాడు కనిపించి ఆమె చేతిలో విభూతి పెట్టాడు. అది నోటిలో వేసుకున్న తక్షణం ఆ పిల్లవాడు అదృశ్యమైనాడు. ఆ క్షణం నుంచే ఆమెకు ఆ భయం లేకుండా పోయింది. ఆ పిల్లవాని రూపంలో శ్రీస్వామివారు ఆమెను అనుగ్రహించారన్నమాట. ఆమెకు హమేషా మైలకావటం, కాలుడొక్క నొప్పి వుండేది. శ్రీస్వామివారు స్వప్నంలో కనిపించి 3 నెలలు టైం ఉంది. విశ్వాసంతో శ్రద్ధగా నన్ను స్మరించు' అని చెప్పారట. శ్రీస్వామిస్మరణ, మౌనం ఈమెను గట్టెక్కించాయి.

కోవూరు ఐ.టి.ఐ.లో పనిచేసే వైద్యుల సుధాకర్‌గారి అనుభవమిలా వుంది. "1983 జనవరిలో నాకు 240/89 బి.పి. ఉండేది. మామూలుగా అంతటి రక్తపోటు వుంటే పక్షవాతం గానీ, లేక మరేదైనా ప్రమాదకరమైన వ్యాధిగానీ సంభవిస్తుంది. కానీ నాకు అలాంటిదేదీ లేకపోవడం చూచి డాక్టరు ఆశ్చర్యపోయాడు. దానికి తోడు డాక్టరుగారి అసిస్టెంట్ త్వరలో కంటిచూపు పోతుందని, ఆపరేషన్ చేసినా లాభం లేదని గూడా చెప్పారు. మద్రాసు వెళ్ళి వైద్యం చేయించినారు. జీవితాంతం మందులు తింటూ ఉప్పు కారం లేని ఆహారం తీసుకుంటూ జాగ్రత్తగా ఉండాలని మద్రాసు డాక్టర్లు సలహా చెప్పారు.

"అట్టి సంకట పరిస్థితిలో సాయిలీలామృతం, గురుచరిత్రతోపాటు అవధూతలీల అను శ్రీ వెంకయ్యస్వామివారి చరిత్ర చదవడం జరిగింది.

వెంటనే గొలగమూడిలో శ్రీస్వామివారి సమాధి దర్శించాను. నాటి రాత్రి మా మిత్రుని ఇంట్లో ఒక సాధువు నాకు తీర్థం ఇచ్చినట్లు కల వచ్చింది. మెలకువ వచ్చి లేచాను. ఉదయం 4 గం॥లు అవుతుంది. శ్రీస్వామివారి పూజకు వెళ్ళేందుకు లేవబోతుంటే సమాధి మందిరమునకు పడమర వైపు ఆకాశంలో ఎఱ్ఱగా గుండ్రంగా పెద్ద వెలుగు దర్శనమైంది. ఆ వెలుగును నా భార్యకు కూడా చూపాను. ఆ వెలుగు ఏమిటా అని మేము ఎంత ఆలోచించినా అంతు పట్టలేదు. పూజానంతరం వచ్చి చూస్తే ఆ వెలుగు లేదు. శ్రీస్వామివారే అలా దర్శనమిచ్చారని తలచి ఆనందించాము. అది మొదలుకొని క్రమేణా బి.పి. తగ్గి మామూలు ఆరోగ్యం చేకూరింది. ఉప్పు, కారం కూడా తినగల్గుతున్నాను.

"కానీ డాక్టర్లు చెప్పినట్లు పథ్యం ఉండక ఆహార విహారాదుల నియమము తప్పినందున మరలా డిసెంబరు 85లో బి.పి. వచ్చింది. చాలా ప్రమాదమైంది. డాక్టర్లు '24 గం॥లు దాటితే చెప్పగలమ'న్నారు. నా భార్య శ్రీస్వామివారిని అనన్యంగా శరణు వేడింది. శ్రీస్వామివారి కృప వలన గండం గడిచి మరలా ఆరోగ్యం చేకూరింది. ఇక మీదట పథ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలని చెంపలేసుకున్నాను."

పొదలకూరు గ్రామస్థుడైన చిరమన వెంకయ్య 1984 సం॥ డిసెంబరు నుండి రెండు నెలలు అన్నం తినలేక శల్యమై మనుషులు పట్టుకుంటే రెండడుగులు నడిచేవాడు. దగ్గు, ఆయాసం, గల్ల(కఫం) తోటి రక్తం కూడా స్వల్పంగా పడేది. పొదలకూరు, బుచ్చిరెడ్డిపాళెంలో యం.బి.బి.యస్. వైద్యులు ఏమీ చేయలేకపోయారు. వారి బంధువుల సలహాపై శ్రీస్వామివారి సమాధిని దర్శించాడు. మరునాటి నుండి కాస్త నెమ్మదించి అన్నం తిని నడవసాగాడు. 5వ రోజు రాత్రి శ్రీస్వామివారు కలలో అతని ఊపిరితిత్తులలోని పెద్దగడ్డను చేత్తో నలిపి వేస్తున్నట్లు, దాని నుండి వచ్చే చీము, రక్తము నోటి నుండి కారుతున్నట్లు దర్శనమైంది. వెంటనే మెలకువ వచ్చింది. పెద్దగా దగ్గు వచ్చింది. ఎప్పుడూ పడనంత గల్ల, రక్తం, చీము పడిపోయింది. 90% ఆరోగ్యవంతుడయ్యాడు. 8వ రోజు స్వప్నంలో మళ్ళీ స్వామి ఆ గడ్డను పాలు పితికినట్లు పితికి కొంత చెడ్డ పదార్థాన్ని ఒక ఆకులోకి తీసి చూపించారు. తెల్లవారినప్పటి నుండి నాలుగు రోజులలో సంపూర్ణ ఆరోగ్యవంతుడైనాడు.

నేటికీ శ్రీస్వామివారి సమాధిని సేవిస్తుంటాడు.

నెల్లూరు యస్.పి. బంగ్లా ప్రక్కన కాపురమున్న శ్రీ పట్నం ఖాదర్ మస్తాన్‌గారు ఇలా తెలిపారు. 'ఫిబ్రవరి 1985 సం॥లో నాకు రక్త విరేచనాలు అయ్యేవి. మద్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి వాళ్ళు నాకు క్యాన్సర్ అని నిర్ధారణచేసి వెంటనే ఆపరేషన్ చేసి మలంప్రేగు బయటకు పెడతాము. డబ్బాలోకి మలమొస్తూంటుంది. శుభ్రం చేసుకుంటుండాలి. అలా 10 నెలలు ఆసుపత్రిలో ఉంటే బాగుకావచ్చు లేకపోతే మరణం తథ్యం' అన్నారు. ఆస్పత్రిలో ఆ బాధలు పడే కంటే మరణమే మేలని ఇంటికి వచ్చేశాము. ఒంగోలులో నాటు మందు తిన్నాను. కానీ నయం కాలేదు. శ్రీస్వామివారు శరీరంతో ఉండగా వారిని దర్శించిన విషయం గుర్తు వచ్చి ఒకనాటి రాత్రి శ్రీస్వామివారిని తలచుకొని ఏడ్చాను.

అదేరాత్రి శ్రీస్వామివారు నాకు స్వప్నంలో కనిపించి మంచంలోవున్న నాకు వెల్‌వెట్ గుడ్డతో విసురుతున్నారు. మెలుకువ వచ్చి చూచాను. శ్రీస్వామివారు నిజంగానే నా మంచం దగ్గర నుండి వెళ్ళిపోతున్నారు. ఆ దిగ్భ్రమతో పిలవడానికి నోరురాలేదు, కాళ్ళాడలేదు. తెల్లవారి నుండి నాకు రక్తం పడడం పూర్తిగా ఆగిపోయింది. వారం రోజులలో పూర్తి ఆరోగ్యవంతుడనయ్యాను. శ్రీస్వామి వారి ఋణం నేనెలా తీర్చుకోవాలో!

నిజమైన ఆర్తితో కంటతడిపెట్టిన భక్తుల కష్టాలెంతటివైనా శ్రీస్వామివారు వారి కష్టాలను వెంటనే బాపి వారికి శాంతి చేకూర్చడం ఎందరి అనుభవాలలోనో కనిపిస్తున్నది. ఆర్తితో కన్నీరు లేని ప్రార్థనలు వ్యర్థములని శ్రీరామకృష్ణ పరమహంసగారు సెలవిచ్చియున్నారు గదా!

నెల్లూరు వాస్తవ్యులు చెరుకూరు రాజమ్మగార్కి ఒకప్పుడు అపెండిసైటిస్ ఆపరేషన్, అటు తర్వాత కొన్ని సంవత్సరములకు ట్యూబెక్టమీ ఆపరేషన్ (బిడ్డలు లేకుండా) చేశారు. 1985 లో కడుపులో మంట, అన్నం తింటే డోకు, ఎప్పుడూ తలనొప్పి. 'కడుపులో గడ్డ వుంది. ఆపరేషన్ చేయాల'న్నారు డాక్టర్లు. మూడోసారి పొట్ట కోయడమంటే భయపడి బంధువుల సలహా మీద శ్రీస్వామివారి సమాధిని దర్శించి దీక్షగా రోజుకు 108 ప్రదక్షిణలు చేస్తూ తన కాలాన్ని లౌకికమైన కబుర్లతో గడపకుండా శ్రద్ధగా శ్రీస్వామివారిని స్మరిస్తూ ఆశ్రమ పనులలో సహకరిస్తూ సేవించింది. అన్నం చూస్తేనే వాంతివచ్చే

ఆమె సమాధి దర్శనం చేసినది మొదలు మామూలుగా అన్నం తినటం మొదలు పెట్టింది. ఐదవరోజు శ్రీస్వామివారి సేవకురాలు స్వర్గీయతులశమ్మగారు స్వప్నంలో కనిపించి ఆల్వారుగడ్డ తినమని చెప్పింది. అమె అలానే తినింది. ఆరోగ్యం బాగుపడింది. కానీ శ్రీస్వామివారు ఇంటికి పొమ్మని చెప్పలేదు, కనుక పోలేదు. ఒకరోజు శ్రీస్వామివారి సమాధిని పూజించే నాగయ్యగారు ఆమెకు స్వప్నంలో 'నీకు జబ్బులేదు. ఎప్పటికీ ఆరోగ్యంగా వుంటావు' అని చెప్పారు. కానీ ఇంటికి వెళ్ళమని చెప్పలేదని ఆమె పోలేదు. అటు తర్వాత రెండు రోజులకు మరొక స్వామి సేవకుడు స్వప్నంలో కన్పించి 'నీకు జబ్బులేదు. ఈ మందాకు నీవు ఎవరికి ఇచ్చినా వారి జబ్బు కూడా పోతుంది' అని ఒక ఆకును ఆమెకు ఇచ్చారు. అంతటితో ఆమె ఇంటికి వెళ్ళింది. వెంటనే అంబేద్కర్ సంస్థలో ఆమెకు నెలకు రూ.500/- లు సంపాదించుకొనే గుడ్డలు కుట్టే ఉద్యోగం లభించింది. ఆమెకు ఆరోగ్యమేకాకుండా భుక్తిని కూడా ప్రసాదించారు శ్రీస్వామివారు.

గొలగమూడి నివాసి గొడ్డటి శేషయ్య ఇలా చెబుతున్నారు. నా చేను పంట పండింది. చేలో మనిషి కాపలా లేకుంటే రాత్రిపూట అడవి పందులు పడి ధ్వంసం చేస్తున్నవి. చేలో పడుకుంటే దోమలబాధ, చలి, సన్నని వాన - పదిరోజులు కాపలా కాచి నిద్రలేనందున ఆరోగ్యం పాడయి మంచాన పడతానని భయపడి చేలో ఉండలేక నేరుగా శ్రీస్వామివారి సమాధి చెంతకు వచ్చి 'ఏమి చేసినా నీదే భారం, ఆ చేను పందులు తినేస్తే ఏటా ఇచ్చే రెండుతూముల వడ్లు కూడా ఇవ్వలేను. నీ ఇష్టం' అని విన్నవించి ఇంటికి వెళ్ళి పడుకున్నాను. వెంటనే స్వప్నంలో ఖాకీనిక్కరు, పచ్చబనీను, పచ్చటోపి ధరించిన 20 సంవత్సరాల యువకుడు శ్రీస్వామివారి సమాధి దగ్గర నుండి చకచకా వచ్చి 'ఏది ఆ పంది ఇంకా వస్తూ వుందా' అంటూ నా చేతిలోని వెదురు కర్ర లాక్కొని పోతూ వున్నాడు. ఈ మనిషి మన చేను కాపలా కాసేటట్లులేదే! వేరే మార్గాన పోతున్నాడని నేను మా చేను వైపు నడిచాను. ఆ యువకుడు మరో త్రోవన నాకంటే ముందుగానే మా చేలోకి పోతున్నాడు. నిజంగానే ఈయన కాపలా కాస్తున్నాడని అనుకున్నాను. ఇంతలో స్వప్నం ముగిసింది. ఆ రోజు నుండి ఒక్క రాత్రి కూడా నేను కాపలాకు పోలేదు. చేలో పందులు పడలేదు.

మ్రొక్కు ప్రకారం, రేపు ఉదయం వడ్లు శ్రీస్వామివారికి ఇస్తామనుకున్న నాటి రాత్రి స్వప్నంలో నేను తూమెడు వడ్లమూట సమాధి ముందు వేశాను. వెంటనే స్వామి సేవకులు బుజ్జయ్యగారు కన్పించి నీవు ఎన్ని బాకీయున్నావు? ఎన్ని ఇచ్చావు? అని అడుగుతున్నారు. వెంటనే పూజచేసే బరిగెల నాగయ్య 'ఆయన నాలుగు తూములు బాకీ. ఇస్తాడు జమ రాసుకో' అన్నాడు. స్వప్నం ముగిసింది. నా చేలో పందులకు కాపలా కాసినందుకు రెండు తూములు ఎక్కువగా స్వామి అడిగారని గుర్తించి నాలుగు తూముల వడ్లు శ్రీస్వామివారికి సమర్పించాను.

నిజమైన భక్తి విశ్వాసాలు – హృదయపూర్వకంగా కన్నీటితో చేసిన ప్రార్థన శ్రీస్వామివారి హృదయాన్నెలా కదిలించి మనకు ప్రసన్నులను చేస్తాయో అక్షరజ్ఞానం లేని ఒక భక్తురాలి అనుభవం నిరూపిస్తుంది.

గొలగమూడి ఎరుకల పాళెం వాస్తవ్యులు నలుబాయి సుబ్బరామయ్య భార్య సిద్ధమ్మకు వివాహమైన 8 సం॥ల వరకు సంతానం లేదు. సంతానం కొరకు ఎన్నో భూతవైద్యాలు, తాయెత్తులు, ఇంగ్లీషు డాక్టర్లు, దేవతల మ్రొక్కులు అన్నీ నిష్ఫలమయ్యాయి. తరుణవాయిలోని మస్తాను ఔలియా సమాధిని దర్శిస్తే 3 సం॥లు అక్కడనే ఉండి సేవిస్తే ఫలితముంటుందన్నారు. ఈమెను నెల్లూరు ఇందిరమ్మ డాక్టరు దగ్గర చేర్పించారు. వారం రోజులు గడిచినా ఒక డిగ్రీ కూడా జ్వరం తగ్గలేదు. ఆహారం లేనందున చనిపోతుందని భయపడి ఇంటికి వచ్చేసింది. శ్రీ వెంకయ్యస్వామివారు గుర్తొచ్చి వారి దగ్గరకు వెళ్తానన్నది. ఇంట్లో వాళ్ళు వేడినీళ్ళు కాస్తాము స్నానం చేసి పొమ్మన్నారు. ఒక్క అగ్గి పెట్టంతా అయిపోయినా పొయ్యి మాత్రం వెలగలేదు. ఇది చూచి 'నేను చచ్చినా సరే కోనేటిలో మునిగి స్వామికి ప్రదక్షిణ చేస్తాన'ని చిన్నగా వచ్చి అలాగే చేసి నాటిరాత్రి ఆంజనేయస్వామి మందిరంలో పడుకున్నది. తెల్లవారేసరికి అన్ని రోజులుగా బాధించిన జ్వరం ఏమైందోగానీ మామూలుగా అన్నం తెప్పించుకుని భోంచేసింది.

దాంతో ఆమెకు స్వామి ఎడల దృఢ విశ్వాసం కలిగి 'స్వామివారు నాకు సంతానం ఇచ్చేదాకా నేను స్వామిని సేవిస్తాన'ని దీక్షగా తన అన్నం తానే తయారుచేసుకొని తింటూ, శ్రీస్వామివారి ఆశ్రమంలోని చెట్ల క్రిందనే నివసిస్తూ మనుషులతో కలవకుండా నిరంతరం శ్రీస్వామివారిని స్మరిస్తూ,

ప్రతినిత్యం 108 ప్రదక్షిణలు చేయసాగింది. ఒక రోజు ఈమె స్వప్నంలో వీళ్ళ చాకుడుపంది చేలలో పడితే రైతులు దాన్ని కొట్టుతున్నట్లు దాన్ని హింసించవద్దని ఈమె వారిని బ్రతిమాలుతున్నట్లు – అప్పుడు శ్రీవెంకయ్య స్వామివారు వచ్చి 'దీని వల్లనే నీకీ కష్టాలన్నీ వచ్చాయమ్మా, దీన్ని బ్రతకనివ్వకూడదు' అని చెప్పి శ్రీస్వామివారే ఆ పందిని తీసుకువెళ్ళి సముద్రంలో పారేసినట్లు దర్శనమైంది. 35 రోజులు గడిచినా సంతానం ఇచ్చానని స్వామి చెప్పలేదని ఈమెకు తీవ్రమైన హృదయ వేదన గల్గి రోజంతా తనలో తాను దుఃఖిస్తూ అన్నం తినేందుకు గానీ పాలు త్రాగేందుకు గానీ ఆ బాధలో వీలుకాలేదట. నాటి రాత్రి స్వామి భక్తుడు కొట్టకూటి బుజ్జయ్యగారు వచ్చి ఈమెకు గాజులు తొడిగినట్లు స్వప్న దర్శనమైంది. కానీ నాకు స్వామి తన నిజరూపంతో దర్శనమిచ్చి ఒక మాటకూడా చెప్పలేదే, నేను ఇన్ని రోజులు చేసిన సేవ వ్యర్ధం గదా? ఈ బ్రతుకెందుకు? అని తీవ్రమైన ఆవేదనతో మరురోజు కూడా ఆహారం తీసుకోలేకపోయింది. వెంటనే నాటిరాత్రి శ్రీస్వామివారు స్వప్న దర్శనమిచ్చి పిడికెడు వక్కలు ఈమె పవిట కొంగులో వేస్తూ 'సంతానం ఇచ్చాను. ఇక అన్నం తినవమ్మా' అని ప్రేమగా పలికారు. అంతటితో దీక్ష విరమించింది. స్వామి చెప్పినట్లే సంతానం కలిగారు. ఆ బిడ్డకు శ్రీస్వామివారి పేరు పెట్టాలనుకుంటే మరలా శ్రీస్వామివారు స్వప్న దర్శనమిచ్చి మొదటి సంతానమునకు మీ కులదైవం పేరు పెట్టుకొని రెండవ సంతానమునకు నా పేరు పెట్టుకోమని సెలవిచ్చారు. నేటికీ ఈమెకేబాధ కలిగినా శ్రీస్వామివారి సమాధి దగ్గర నిద్రచేసి వారితో మొర పెట్టుకుంటే వెంటనే ఆ రాత్రికే శ్రీస్వామివారు ఈమెకు దర్శనమిచ్చి ఊరడిస్తారట. ఆమె విశ్వాసాన్ని మనమేమని వ్రాయగలం!

1985 లో వల్లపురెడ్డి ఆదినారాయణరెడ్డిగారికి కష్టాలన్నీ ఒకేసారి వచ్చాయి. ఆయన ట్రాక్టరుకు 2 సార్లు యాక్సిడెంటు జరిగింది. భార్యకు అనారోగ్యం వల్ల ఆపరేషన్ చేశారు. పంటలలో విపరీతంగా నష్టమొచ్చింది. 'ఏమిస్వామీ! ఈ కష్టాలకు అంతులేదా' అని స్వామితో మొరపెట్టుకున్నారు. ఆనాటి రాత్రి ఆయనకొక చిత్రమైన స్వప్నమొచ్చింది. ఆయనతోపాటు మరిద్దరు నిండుగా ప్రవహించే ఒక నది ఒడ్డున వున్నారు. ఒకరు నదిలో దిగి కొట్టుకుపోతున్నారు. ఆయనను గట్టుకు లాగడానికి మరొకాయన

దిగుతున్నారు. నారాయణరెడ్డి ఆయనను వద్దని వారిస్తున్నా వినకుండా దిగారు. ఆయన, ఈయన ఇద్దరూ కొట్టుకుపోయారు. రెడ్డిగారు క్షేమంగా గట్టున వుండి చూస్తూ ఉన్నారు.

**కర్మఫలం బలంగా ప్రవహించే నదీ ప్రవాహము వంటిది. ఆ** 131
**మనుషుల వలె తొందరపడి ప్రవర్తిస్తే కొట్టుకుపోయి ప్రాణాలు పోగొట్టుకుంటావు. ఓర్పు గల్గి నిరంతర నామస్మరణ ద్వారా కర్మఫలితం కాల ప్రవాహంలో కొట్టుకుపోయే వరకు, చెడ్డకర్మ యొక్క ప్రవాహబలం తగ్గే వరకు ఓర్పుగా ఉంటే సులభంగా సంసారమనే నదిని దాటగలవని రెడ్డిగార్కి ఆత్మబోధ చేశారు శ్రీస్వామివారు.**

వీరి భార్యకు నెల్లూరులో చేసిన ఆపరేషన్ పొరపాటయినందున ఆపరేషన్ కొరకు మరలా మద్రాసు తీసుకువెళ్ళారు. రెడ్డిగారు శ్రీస్వామివారిని ప్రార్థించారు. ఆనాటి రాత్రి స్వప్నంలో వాళ్ళ గ్రామస్థుడైన చిన్న మెకానిక్ అనే ఆయన వచ్చి 'నీ కొరకు పెనవర్తి పోయాను. అక్కడలేవు, ఇక్కడికి వచ్చాను. శిబిచక్రవర్తి వంటి వారికి విభూతినిచ్చి 3 నెలలలో నయం చేయాలనుకున్నాను. కానీ 7 నెలలు పట్టేటట్లు ఉంది' అని అనడంతో 'నా దయవల్ల నీ కర్మక్షాళనం చేస్తాను. కానీ టైం పడుతుంది. ఓర్పు వహించు' అని శ్రీస్వామివారు చెప్పినట్లు వుంది.

డబ్బు ఖర్చు పెట్టటం గురించి రోశిరెడ్డితో అన్నారు **'అయ్యా ఒక్క రూపాయి సంపాదించాలంటే ఎంత కష్టపడాలి. కాబట్టి దాన్ని మనం ఎంత జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి'.** ఇది ఒక వంక లౌకికమైన
ధనానికి, మరొకవంక పారమార్థిక ధనానికి సంకేతము. **ఎంతో శ్రమించి** 132
**పుణ్యం చేసినందువల్ల సద్గురు సన్నిధి లభిస్తుందని, దాన్ని వ్యర్థం చేసుకోకుండా జాగ్రత్తగా 'ఇది సన్నిధి' అనే ఎరుకతో నిరంతరం జీవిస్తూ ఆ సన్నిధిని సార్థకం చేసుకోండి** అని శ్రీస్వామివారు హెచ్చరించారన్నమాట. ధర్మాధర్మాలను గూర్చి శ్రీస్వామివారు ఎంత చక్కగా సెలవిచ్చారో చూడండి. స్వామి సేవకులలో ఇద్దరికి తగవులాటవచ్చింది. ఒకరిది ధర్మం మరియొకరిది అధర్మం. ధర్మాత్మునకు మద్దత్తునిస్తూ రోశిరెడ్డి 'నీవిలా మాట్లాడడం మంచిదికాదు' అని గట్టిగా అధర్మపరుని హెచ్చరించారు. మనకెందుకొచ్చిన గొడవలే అని అంటూ ఊరకుండలేదు. ఆరోజు రోశిరెడ్డితో

శ్రీస్వామివారు "రోశిరెడ్డీ! నీకీరోజు ఒక లోకం వచ్చిందయ్యా" అన్నారు.

**అంటే అధర్మాన్ని ఖండించి ధర్మానికి మద్దత్తునివ్వటం మన ధర్మం**
133 **అన్నమాట. ఇలా చేసినందున అనంతమైన పుణ్యం ప్రాప్తిస్తుందన్నమాట. అలాగే అధర్మాన్ని యథాశక్తి ఎదుర్కోకుండా నిగ్రహించేందుకు కృషి చేయకుండా వుంటే పాపము అనికూడా అర్థం.**

నెల్లూరు సంతపేట వాస్తవ్యులు కొణిదల నాగేశ్వరరావు చాలా సంవత్సరముల నుండి శ్రీస్వామివారిని సేవిస్తున్నారు. శ్రీస్వామివారి కార్యక్రమములకు తన లారీగానీ, ట్రాక్టరుగానీ తీసుకువచ్చి తానే స్వయంగా డ్రైవ్ చేస్తూ సేవను సమర్పించుకొనేవారు. వారు తన అనుభవాన్నిలా చెప్తున్నారు. "1985 ఆగష్టు 21 నుండి శ్రీస్వామివారి ఆరాధన మహోత్సవమునకు మట్టి, చవకలు, షామియానాలు, పాత్రసామానులు రాత్రింబవళ్ళు తోలుతూ వున్నాను. 23వ తేది రాత్రి నెల్లూరు నుండి పూలమాలలు, అరటి పిలకలు మొదలగు సామానులు ట్రాక్టరుతో తోలుకొస్తున్నాను. గత రెండురోజులుగా నిద్రలేదు. కనుక రాత్రి 12 గంటల అప్పుడు కల్లూరుపల్లె బ్రిడ్జి దాటిన తదుపరి ట్రాక్టర్ నడుపుతూనే నాకు తెలియకనే నిద్రపోయాను. తరువాత కొంతసేపటికి మెలుకువ వచ్చేసరికి నా ముందు 20 గజాల దూరంలో పెద్ద రంధ్రం పడియున్న గొలగమూడి బ్రిడ్జి ప్రత్యక్షమైనందున అదిరిపోయాను. శక్తినంతా కూడగట్టుకొని జాగ్రత్తగా బ్రిడ్జి దాటించాను. సుమారు 3 కి.మీ. దూరం అనేక మలుపులు తిరిగి ట్రాక్టరు, నేను, గొలగమూడి బ్రిడ్జి వరకు ఎలా చేరామా అన్న విషయం నన్ను దిగ్భ్రమగొలిపింది. ఈ మూడు కిలోమీటర్ల దూరం ట్రాక్టరు నడపడమే కాకుండా నిద్రపోయే నన్ను పడిపోకుండా కాపాడిన రక్షకుడు నా హృదయ నివాసి కరుణామయుడైన శ్రీ వెంకయ్య స్వామివారికి నేను ఆజన్మాంతం
134 ఋణపడి ఉన్నాను. **నిజంగా మన శరీరం స్వామికి సమర్పిస్తే దాని రక్షణ భారం వారెల నిర్వహిస్తారో ఈ లీల ద్వారా మనకు ఋజువు అవుతుంది.**

నెల్లూరు, సంతపేట తాళ్ళూరు శ్రీనివాసులు తనకు శ్రీస్వామివారు ప్రాణభిక్ష పెట్టిన విషయం ఇలా తెలుపుతున్నారు.

1986 సంవత్సరం మే నెలలో మా మిద్దెపైన రెండు గదులు, వరండా

నిర్మించాము. క్రింది భాగంలో బాడుగకున్న వారి గదిలో నుండి, తీసిపారేసిన పాత కరెంటు వైరుతో టెంపరరీగా ప్లగ్గురంధ్రాలలో వైర్లుదోపి మిద్దె మీదకు కరెంటు తీసుకువచ్చి ఆ వైర్ల నుండి ఒక బల్బు ఒక గదిలోను మరొక బల్బు వరండాలోను వేశాము. వరండాలో బల్బు తీసేసినందున హోల్డరు మాత్రం కట్టివున్నాము. మే నెల 3వ తేది మంచిరోజని క్రొత్త గదులలో పాలు పొంగించాలని వేకువజామున 3 గం॥లకు మా మరదలు గదులు, వరండా కడిగి, క్రిందమెట్లు కడుగుతున్నది. నా భార్య కుళాయి నుండి నీళ్ళు తెచ్చి అందిస్తున్నది. నేను స్నానం చేసి తడిగుడ్డ కట్టుకొని మిద్దెపైకి వచ్చాను. ఒక గదిలో లైటు వెలుగుతుంది. వరండాలో ఉన్న బల్బు లేని హోల్డరును లైటులేని గదిలో తగిలించాలి, వైరుతో సహా విప్పాను. ఆ వైరును ఎలుక కొరికి ఒక చోట ఇన్సులేషన్ పోయియున్న విషయం చూడక వైరును అక్కడనే పట్టుకున్నాను. పెద్దకేక వేశాను. కరెంటు వైరును చేతి నుండి తప్పించాలని నేచేసిన ప్రయత్నం విఫలమైంది. నవనాడులు క్రుంగిపోయాయి. నిలువునా క్రిందపడిపోయి గిల గిల తన్నుకులాడుతున్నాను. నేలంతా చెమ్మ, నీళ్ళు. వైరు చేతిని పట్టేసి వుంది.

ఈలోగా నా అరుపు విని మా మరదలు మెట్లెక్కి పైకివచ్చి నేను క్రిందపడి గిల గిల తన్నుకులాడడం చూచింది. అదే సమయంలో ఇల్లంతా నీటి చెమ్మ వుంది గనుక కరెంటు ఎర్తయి ఆమె కాళ్ళకు ఝల్లున షాకు కొట్టింది. “బావను కరెంటు పట్టుకుంది” అని అరుస్తూ ఆమె క్రిందకు పరుగెత్తి గోల చేస్తోంది. ఈ మాటవిన్న నా భార్య కరెంటు తీసుకున్న గదిలో నిద్రపోయే వాళ్ళను తలుపులు బాది లేపి భయకంపితురాలై పడిపోయింది. గదిలోని వాళ్ళు నిద్రలేచారుగానీ విషయం అర్థంగాక ముందు పడిపోయిన నా భార్యను లేవదీసి మంచం మీద పండబెట్టారు. ఈలోగా నా మరదలు అరిచే అరుపులలోని భావం గ్రహించి ప్లగ్గులో నుండి వైర్లు లాగేశారు.

పై గలబా అంతా ఒక ఐదు నిమిషాలలో జరిగిపోయింది. ఈలోగా నా పరిస్థితి ఎలా వుందో ఊహించలేము. కొన ఊపిరితో ఉన్నాను. కానీ స్పృహ వుంది. “స్వామీ! నాకిలాంటి చావు ప్రసాదించారా” అని మనసులో వాపోయాను. అంతే వెంటనే నా చేతిలోని వైరును మరొకరు పెరికేస్తే వదలిపోయినట్లు క్రిందపడిపోయింది. సతాయించుకొని లేచి నాలుగడుగులు

వేశాను. అప్పుడు ప్రక్కగదిలోని లైటు ఆరిపోయింది. క్రింది వాళ్ళు పైకి వచ్చారు.

చిత్రమేమంటే 1. అప్పటిదాకా వదలని కరెంటు వైరు దానంతటదే మనిషి లాగినట్లుగా వదలిపోవడం.

2. అంతకంటే ఆశ్చర్యమేమంటే ఇన్సులేషన్ పోయి కరెంటు పాసవుతున్న వైరు ఇల్లు కడిగి చెదురు మదురుగా నున్న నీటిలో పడినందున ఇల్లంతా కరెంటు వ్యాపించియున్నాగానీ, నేను లేచి నాలుగడుగులు వేయగల్గడం. నేను లేచి నాలుగడుగులు వేశాకనే పైనున్న మరియొక లైటు ఆరిపోయింది. అంటే అప్పుడు క్రిందివారు వైర్లను ప్లగ్గు నుండి లాగేశారన్నమాట.

కరెంటు షాకు వల్ల నల్లగా కమిలిపోయిన నా చేతిని చూచి డాక్టరుగారు ఆశ్చర్యపోయి 'ఈ విధంగా కమిలిపోతే కండరాలు,చర్మం నుండి నీసు నీళ్ళు కారాలి. అలా జరుగలేదంటే నిన్నేదో దైవశక్తి రక్షించింది. నీ చెయ్యి 3 నెలలు మొదలు 6 నెలల లోపల క్రమేణా స్వాధీనంలోకి రావచ్చు' అని చెప్పారు.

ఇంజక్షన్లు చేస్తూ ఎముక విరిగిందని పిండికట్టు కూడా కట్టారు. వేసవి కాలమైనందున జిల (దురద) భరించలేక కట్టు తీసివేసి సర్వభారం శ్రీస్వామివారికి అప్పగించి మే 14వ తేదీన గొలగమూడి వచ్చి శ్రీస్వామివారి చెంత కూర్చున్నాను. నాటి రాత్రి ఆ స్వప్నంలో నా స్నేహితులు నాకాలి బొటన వ్రేలి దగ్గర ఆపరేషన్ చేసి చిక్కని పసుపు పచ్చని ద్రవం తీసినట్లు దర్శనమైంది. డాక్టరుగారు 6 నెలలు గడువు చెపితే చిత్రంగా నెల తిరగకుండానే నా చెయ్యి స్వాధీనంలోకి వచ్చేసింది.

ఈ గండంలో నేను మరణించవలసి వుంది. కానీ శ్రీస్వామివారు నాకు ప్రాణదానం చేశారని చెప్పేందుకు ఒక నిదర్శనం ఉంది. అంతకు 19 రోజుల ముందు నాకిచ్చిన స్వప్నాదేశమే ఆధారము. ఒక చోట సినీగాయకుడు మహమ్మద్ రఫిగారి గాన కచేరి జరుగుతుంది. వేదికపై గాంధీ మహాత్ముడు కూర్చొనియున్నారు. ఆయన ముఖం శ్రీస్వామివారి ముఖంవలె వుంది. వారికి ఇరుప్రక్కల రాజేంద్రప్రసాద్, నెహ్రూ, లాల్‌బహదూర్‌శాస్త్రి, రాధాకృష్ణన్,

టంగుటూరు ప్రకాశం పంతులు మొదలగు నాయకులు, కేవలం పరమపదించిన వారంతా, కూర్చొనియున్నారు. ఒక్కరు కూడా ప్రస్తుతం జీవించి యున్నవారు లేరు. నేను వెళ్ళి ఈయన శ్రీవెంకయ్యస్వామివారే అని మనసులో అనుకొనుచూ గాంధీజీకి నమస్కరిస్తున్నాను. వారులేచి నా దగ్గరకొచ్చి ఇక్కడకెందుకొచ్చావు వెళ్ళిపో అన్నారు. "నేను వెంకయ్య స్వామివారి భక్తుడను. గొలగమూడి పోయి వస్తుంటాను" అని అన్నాను. ఈ విషయం నాకు తెలుసు ఇంతకు ముందు రెండుసార్లు చెప్పానుగదా అంటూ ఐదు పాకెట్ సైజు శిరిడి సాయిబాబా ఫోటోలు నా చేతిలో ఉంచి నన్నక్కడ నుండి పంపేశారు. స్వప్నం ముగిసింది.

శ్రీస్వామివారు ప్రసాదించిన 5 ఫోటోలు నా పంచప్రాణములకు సంకేతం. ఆ మహానాయకులు చేరిన పరలోకాలకు నేను కూడా చేరవలసియుండెను. కానీ కరుణామయుడు నా పంచప్రాణములు తిరిగి నాకు ప్రసాదించి ఈ లోకంలో ఇంకా కొంత కాలముండమని పంపారు. గనుకనే పై గండంలో బ్రతికాను. నేను, నా భార్యాపిల్లలు శ్రీస్వామివారి ఋణం ఏ విధంగా కూడా తీర్చుకోలేము.

నెల్లూరు తాలూకా విడంపల్లి గ్రామస్థురాలు యామాల చెంచయ్య భార్య వనమ్మ తన బిడ్డను శ్రీస్వామివారు రక్షించిన విధం వివరిస్తుంది.

మా ఐదవ బిడ్డకు 3వ నెల వయస్సులో ఎడమ చెవి క్రింద వాపు, నొప్పి వచ్చింది. డాక్టర్ల ఇంజక్షన్లు, మందులేగాక మంత్రాలు, నాటు వైద్యాలకు గూడా తగ్గలేదు. అది అంచెలంచెలుగా క్రిందకు దిగి, చివరకు ఎడమకాలు పిక్కమీద గడ్డ తేలి పగిలి చీముగారడం మొదలు పెట్టింది. చీముకారే రంధ్రాల గుండా 2 అం॥ల పొడవుగల సన్న ఎముక పలుకులు ఆరుమార్లు ఆరు ముక్కలు బయటికి వచ్చాయి. కాలు దుర్వాసన పట్టినందున పాప దగ్గర నిలువ లేకున్నాము. డా॥ పి.సి.శాస్త్రి ఎక్స్రే ఫోటో తీసి పరీక్షలు చేసి కాలు తీసివేస్తే సరి, లేకుంటే పాప చనిపోతుందని చెప్పారు. దానికి గూడా మద్రాస్ గానీ నెల్లూరు రామచంద్రారెడ్డి ఆసుపత్రికిగానీ పొమ్మన్నారు. ఇంకా ఇద్దరు ముగ్గురు డాక్టర్లకు చూపినా ఇదేవిధంగా కాలు తీసెయ్యాలని చెప్పి మందులు వ్రాయలేదు.

ఆడపిల్లను అవిటి పిల్లగా వుంచుకునే కంటే చనిపోయినా పరవాలేదని

మా తండ్రి బెల్లంకొండ పుల్లయ్య ఆపరేషనుకు సుతరాము ఒప్పుకోలేదు.

తేది 19-4-86 న ఒక స్నేహితురాలి సలహాపై గొలగమూడి శ్రీవెంకయ్యస్వామివారి సమాధి దగ్గరకు మా తండ్రిగారు, నేను బిడ్డను తీసుకువచ్చాము. "స్వామీ! ఈ బిడ్డకు కాలు బాగుపడితే మీ కీర్తిని మూడు వారములు మైకులో ప్రకటిస్తాను" అని మా తండ్రిగారు, పొంగలి సమర్పిస్తానని నేను మ్రొక్కుకొని శ్రీస్వామివారి అఖండ దీపంలోని నూనె తీసుకువెళ్ళి విభూతిలో కలిపి పూయసాగాము. మరుసటి వారానికి మూడు రంధ్రాలు మానాయి. ఒక ఎముక ముక్క 2 అం॥ల పొడవున కండలో అడ్డం తిరిగి 1/2 అంగుళం బయటికి వచ్చియుండెను.

2వ వారం జనం రద్దీవలన మాకు నూనె కూడా అందలేదు. పాత నూనె వాడుతున్నాము. శ్రీస్వామివారు ఒక స్వప్న సందేశమిచ్చి ఆశీర్వదించారు. నా స్వప్నంలో మా పాపకాలు విరిగి క్రింద పడిపోయింది. నేను బాధపడుతున్నాను. ఇంతలో ఒక ముసలాయన వచ్చి "కాలు ఊడిపోయిందని బాధపడుతున్నావా? ఏమీ ఫరవాలేదు. సూది, దారం ఉంటే తెమ్మ"ని చెప్పి ఆ కాలు అతుకుపెట్టి కుట్టివేసారు. నాకు మెలుకువ వచ్చింది.

తర్వాత ఆ గాయంలోని ఎముకముక్క దానంతటదే బయటికి వచ్చేసింది. ఏ మందులు, డాక్టర్లు లేకుండా శ్రీస్వామివారి విభూతి, నూనెతోనే క్రమేణా కాలు గాయం మానిపోవడమేగాక విరిగిపోయిన ఎముక మరల దానంతటదే పెరిగి అతుకుబడిపోయింది. కేవలం శ్రీస్వామివారి కృప వలన నేడు మా పాప ఏ మాత్రమూ కుంటులేకుండా చక్కగా నడవగల్గుతుంది. నేను, నా బిడ్డ ఆజన్మాంతము శ్రీస్వామివారికి ఎంతో ఋణపడియున్నాము.

నెల్లూరు జిల్లా కోవూరు జెడ్.పి.హైస్కూల్‌లో కుట్టు టీచరు పి. కోటేశ్వరమ్మ ఇలా చెపుతుంది.

మా తల్లిగారికి 1982, 1986 మధ్య 3 దఫాలు రక్త విరేచనాలు మొదలై నీరసపడి అస్థిపంజరంగా తయారైంది. ఎలాంటి ఆహారము కడుపులోకి పోయినా ఎక్కువగా రక్తవిరేచనమై శరీరమంతా విపరీతమైన బాధకు లోనయ్యేది. గనుక కొన్ని ఉగ్గిన్నెలు ద్రవాహారం మాత్రం ఇస్తున్నాము. నెల్లూరు అమెరికన్ ఆస్పత్రిలో నాల్గురోజులు చికిత్స చేసినా తగ్గలేదు.

'ఎనిమా' ఇచ్చి పరీక్ష చేయాలని డాక్టర్‌గారే స్వయంగా ప్రయత్నించినారు. కానీ 3 రోజులు ఎనిమా గొట్టం ప్రేగులోనికి ఎక్కలేదు. అప్పుడు కొన్ని ప్రత్యేక పరీక్షల ద్వారా పరీక్షించి "పొట్టలో పెద్ద కాన్సరు గడ్డ బాగా పండి ఉంది. ఏ క్షణాన్నయినా అది పగిలి ఆమె మరణిస్తుంది. ఇది ఆమె చివరిదశ ఇంటికి తీసుకు వెళ్ళి ఆమె చివరి కోరికలన్నీ తీర్చండి" అని చెప్పి డిస్‌చార్జి చేశారు. ఎంత బ్రతిమిలాడినా 'ఇది ఆశలేని కేసు. మా ఆసుపత్రిలో చనిపోవడం ఎందుకు' అని పంపేశారు. మేము చికిత్స మానలేక వారి దగ్గర లెటరు తీసుకొని మద్రాసులోని కాన్సరు ఆసుపత్రికి వెళ్ళేందుకు ప్రయాణమవుతున్నాము.

మా ఇంటి యజమానురాలు మా ప్రయాణం చూచి పైసా ఖర్చు కాకుండా నయం చేసే అద్భుతమైన డాక్టరును వదలి మద్రాసుకెందుకుపోతారు అని శ్రీ వెంకయ్యస్వామివారిని నమ్ముకొని అక్కడికి పొమ్మని చాలా దూరం చెప్పింది.

ఆ ఆపద సమయంలో నేను "స్వామీ!మద్రాసు పోకుండా మీ దగ్గరకొస్తే డబ్బు ఖర్చవుతుందని నేను వైద్యం చేయించలేదని మా నాన్నగారితో సహా అందరూ నిందిస్తారు. నేను కాన్సరు ఆస్పత్రికి పోతాను. కానీ అచ్చట కాన్సరులేదని చెప్పి మా అమ్మకు ఆరోగ్యం బాగుంటే నీ పటం పెట్టి పూజించుకుంటాను అని పట్టరాని దుఃఖముతో కన్నీటితో ప్రార్థించాను. మేము రైలులో సగం దూరం వెళ్ళగానే అంతవరకు ఏమీ తినని మా అమ్మ తానే స్వయంగా నాకు అన్నం పెట్టమని బలవంతం చేసింది. చివరి క్షణాలని పెరుగన్నం పెడితే బాగా భోంచేసింది. అది మొదలు పండ్లు, బిస్కెట్లు అన్నీ తినసాగింది. చిత్రంగా మరలా రక్తమే పడలేదు. సెంట్రల్ స్టేషన్‌లో దిగి నాకు ఆరోగ్యం బాగుంది. ఆస్పత్రికి ఎందుకు ఇంటికి పోదామని తొందరచేయసాగింది. ఎట్లాగో నచ్చజెప్పి అడయారు కాన్సరు ఆస్పత్రిలో రు॥ 1600 ఖర్చుచేసి ఎన్ని పరీక్షలు చేయించినా ఏ జబ్బూ లేదని తేలింది. పోతే ఆమెకు ఈ వయస్సులో బి.పి., గుండె, మూత్రపిండములు అన్నీ ఇంత చక్కగా పనిచేస్తున్నాయంటే చాలా అదృష్టవంతురాలని డాక్టర్లు పెద్ద సర్టిఫికేటు ఇచ్చారు. నేటికీ ఏ మందులూ మాకులూ లేకుండా హాయిగా ఉంది. శ్రీస్వామివారితో నాకు అంతకు ముందు ఏ పరిచయము లేకపోయినా

స్మరించిన వెంటనే నన్నాదుకొని మా బాధలు తీర్చిన ఆ కరుణామయునకు మాకుటుంబమంతా ఋణపడియున్నాము.

నోటి మాటలతో గాకుండా ఆత్మలో పూర్ణ విశ్వాసముంచిన వారికి శ్రీస్వామివారు ఎలా రక్షిస్తున్నారో చూడండి. గూడూరు తాలూకా ఓజిలి కాపురస్థుడు బాబు అనే ముస్లిం కుర్రవాని వయస్సు ఇరవై సంవత్సరములు. 1988 సం॥ జనవరి నెలలో అకస్మాత్తుగా విపరీతమైన పిచ్చివానివలె ప్రవర్తించసాగాడు. వంటి మీద గుడ్డలు పూర్తిగా తీసేసేవాడు. స్త్రీలు కనిపిస్తే వెంటబడి తరుముకునేవాడు. అతడి కాళ్ళు, చేతులు కలిపి గుదికట్టి రకరకాల వైద్యాలు చేయించారు. కూలి చేసుకొని జీవించేవారు గనుక రెండు వేల రూపాయలు అప్పు చేసి అన్ని రకాలైన వైద్యాలుచేసి నయంగాక అశక్తతతో నిస్సహాయులై శ్రీస్వామివారిని శరణు పొందారు.

అతడు రాత్రింబవళ్ళు నిద్రపోడు, భయంకరంగా అరుస్తూ వెల్లికిలా పడుకొని కాళ్ళు చేతులు గుదిగట్టియున్న తాళ్ళను నోటితో కొరికి తెంచేవాడు. అలా కాళ్ళుచేతులు నోటికి అందకుండా చేయాలని చేతులను రెండు కాళ్ళ సందున కట్టిపెట్టి కాళ్ళకొంకెల్లో ఒక కర్రను దోపారు. చూచేవారికి అది భయంకరమైన పరిస్థితి.

శ్రీస్వామివారి సన్నిధిలో ఉన్న కొందరు అమాయకులు ఆయన్ను కాకుపల్లెకు, పాల్చూరికి తీసుకుపోతే బాగౌతుందని రకరకాల సలహాలు చెప్పేవారు. నిస్సహాయుడైన వీళ్ళన్నగారు అందరికీ ఒకేమాటచెప్పేవాడు. 'మావాడు చనిపోతే ఇక్కడే పూడ్చేసిపోతాను. **బ్రతికి బాగుంటే**
135 **శ్రీస్వామివారికొక టెంకాయ కొడతాను. అంతకుమించి నాకు వేరే శక్తిలేదు. ఎక్కడికి వెళ్ళేదిలేదు' అని తన దృఢ నిశ్చయాన్ని వెల్లడించేవాడు. పూర్ణ విశ్వాసమునకు మించిన భక్తి కంటే వేరే సాధనేమున్నది.**

మూడవ రోజుకు ఆ కుర్రవాని అరుపులు పెనుగులాట తగ్గి కట్టు విప్పేస్తే అలాగే కూర్చొనుండేవాడు. వారం రోజులకు మామూలు మనిషైపోయాడు. పదిహేను రోజులు చూచారు. నెల రోజులు చూచారు. శ్రీస్వామివారు సెలవిస్తే ఇంటికి వెళ్ళాలని పట్టుపట్టారు. రెండు నెలల తర్వాత శ్రీస్వామివారి ఆజ్ఞ పొంది ఇంటికి వెళ్ళిపోయారు. ప్రతి శనివారము వచ్చి నిండైన ప్రేమతో శ్రీస్వామివారిని దర్శించి సేవించి వెళుతుంటారు.

ఆత్మకూరు తాలూకా బొమ్మవరం గ్రామస్థుడు పార్లపల్లి వెంకటేశ్వర్లు చెపుతున్నారు.

1970 వ సం॥ మా మేకలు జబ్బుచేసి చనిపోతుంటే శ్రీస్వామివారి ఆశీస్సుల కొరకు చిలకలమర్రి గ్రామం వెళ్ళాను. శ్రీస్వామివారి చుట్టూరా వందల మంది గుమిగూడి యున్నందున దూరంగానే వుండి మనసులో బాధపడుతున్నాను. ఇంతలో శ్రీస్వామివారి శిష్యుడొచ్చి బొమ్మారం అబ్బాయిని శ్రీస్వామివారు పిలుస్తున్నారని నన్ను దగ్గరకు తీసుకువెళ్ళడం నన్నాశ్చర్యంలో ముంచెత్తింది. "ఇక జీవాలు నష్టంగావు, ఇక అన్నీ బాగుంటాయి" అని చీటీ వ్రాయించి నాకు ప్రసాదించి పంపారు. అది మొదలు ఒక్క మేక కూడా చనిపోలేదు. వారు పర్యటనలో ఉంటారు కనుక మరలా వారిని దర్శించలేదు. కానీ ఆ కరుణామయుడు నేను పిలువకున్నను నన్ను కాపాడుతున్నాడు. 1978లో తుఫాను వల్ల మేకలను కొండకు తోలేశాము. అవి తిరిగి వస్తాయని ఆశలేదు. నాటి రాత్రి శ్రీస్వామివారు స్వప్న దర్శనమిచ్చి "మన జీవాలన్నీ బాగుండ్లాయ్యా" అన్నారు. గ్రామంలో అందరివీ చాలా చనిపోయాయి. మావి మాత్రం ఒక్క మేక కూడా చనిపోలేదు.

నాకు 1984 లో గుండెదడతో ప్రమాదం చేసి నన్ను ఆత్మకూరులో సుందరరామిరెడ్డి డాక్టరు దగ్గర చేర్చారు. రెండు రోజులకు రెండువేల రూపాయలు ఖర్చు అయింది. కానీ నేను చనిపోయానని నన్ను కారులో ఇంటికి తీసుకు వచ్చారు. అందరూ ఏడ్చి ఏడ్చి కూర్చొనే నిద్ర పోతున్నారు. మా తల్లిదండ్రులకు శ్రీస్వామివారు స్వప్నదర్శనమిచ్చి 'నా భక్తుని నేను రక్షించుకుంటాను' అని చెప్పారట. తెల్లవారి నుండి నేను కళ్ళు తెరచి క్రమేణా 2 నెలల్లో ఏ మందులూ లేకుండా పూర్ణ ఆరోగ్యవంతుడనయ్యాను. ఈ వింత చూచిన జనులెల్లరు శ్రీస్వామివారి మహిమను వేనోళ్ళ కొనియాడారు.

1984లో శ్రీస్వామివారి ఆరాధనకు వచ్చి శ్రీస్వామివారు సశరీరులుగా ఉన్నప్పుడు నన్ను వారి సేవలో ఉంచుకోకుండా దూరం చేశారని బాధపడ్డాను. నాటి రాత్రి శ్రీస్వామివారు అగ్నిగుండంలో కూర్చొనియున్నట్లు స్వప్న దర్శనమిచ్చారు. అదే రోజు మరొక దృశ్యంలో స్వామివారి శరీరంపై అసంఖ్యాకంగా కర్పూరం బిళ్ళలు వెల్గుతున్నట్లు దర్శనమైంది. దీనితో 'నేను

అందరిలాగా చనిపోలేదు. ఈ అగ్నిలాగా శాశ్వతంగా వెలుగుతుంటా'నని శ్రీస్వామివారు నాకు గుర్తుచేశారని తెలుసుకున్నాను.

నేనింటికి వెళ్ళిన నాలుగవ నాటి నుండి రక్త విరేచనాల వలన ఎన్నో గుడ్డలు తడిసిపోతున్నవి. 'వద్దంటే ఆరాధనకు వెళ్ళి కొని తెచ్చుకున్నాడు ఇక లాభం లేదు, చనిపోతాడ'ని అందరూ నోటికొచ్చినట్లు మాట్లాడారు. శ్రీస్వామివారు నాయందు వుంటే కాపాడుతాడు లేకుంటే ఆయనలో ఐక్యం చేసుకుంటాడని చెప్పి మందు కూడా తీసుకోలేదు. నాటి రాత్రి శ్రీస్వామివారు మూతలేని తన సమాధిలో నిల్చొని అభయహస్తంతో దర్శనమిచ్చారు. తెల్లవారి నుండి నేను హాయిగా నడవడం చూచి అందరూ ఆశ్చర్యపోయారు. శ్రీస్వామివారిని పూర్ణంగా నమ్మికోవడమే నాకు తెలిసినది. అవతల ఆయన దయ.

136 **సద్గురువును 'భుక్తి, ముక్తి ప్రదాత'యని స్తోత్రం చేస్తాము. మహా సమాధి అనంతరం కూడా శ్రీస్వామివారు తన భక్తులనెలా కాపాడుతున్నారో చూస్తే వారు నిత్యసత్యులని గ్రహించగలము.**

రాపూరు తాలూకా ముదిగేడు గ్రామస్తుడు కోడూరు యానాదిరెడ్డిగారు తన 16వ సం॥ వయస్సు నుండి శ్రీస్వామివారి భక్తులు. వీరి ఉబ్బసం వ్యాధిని పోగొట్టి శ్రీస్వామివారు వీరిని గొప్ప భాగ్యవంతుని చేశారు. కానీ ఈయన ఎల్లప్పుడూ ఆర్థిక తాపత్రయంలో పడి శ్రీస్వామివారు తన గ్రామం వస్తే తప్ప మిగిలినప్పుడు వారిని తలచేవాడుగాదు.

1985 జూన్ నెలలో జబ్బున పడి ఎంతో కష్టంతో రోజుకొక కప్పు కాఫీ మాత్రం బలవంతంగా త్రాగేవారు. ఏ ఆహారం చూచినా విషంతో సమానంగా ఉండేది. రెండు నెలలుగా ఎన్నో ఇంజక్షన్లూ మందులూ వాడినా తగ్గక ఎముకల గూడువలె తయారైనాడు. ఆగష్టు నెలలో రోజుకు 30 విరోచనాలు అవుతున్నాయి. డాక్టరుకు జబ్బు అంతుపట్టలేదు. ఈయన ప్రాణంపై ఆశ వదిలేసుకున్నాడు.

ఆగష్టు 22న వీరి మిత్రుడు అక్కిం వెంకట్రామిరెడ్డి వీరిని గొలగమూడికి వచ్చి శ్రీస్వామివారి ఆరాధనోత్సవంలో దర్శనం చేసుకుంటే జబ్బు నయమవుతుందని, వస్తానని చెపితే రెండెడ్ల బండికట్టి బస్సుదాకా తీసుకువెళ్ళి, తర్వాత బస్సులో తీసుకువెడతానని బలవంతం చేశాడు. మనిషి

సహాయంలేనిదే లేవలేని యానాదిరెడ్డి ఆయన ప్రోత్సాహం చూచి సరే వస్తానని చెప్పాడు. బండి తీసుకువచ్చేందుకు వెంకట్రామిరెడ్డి ఇంటికి వెళ్ళారు.

ఆ తర్వాత యానాదిరెడ్డి తన అనుభవం ఇలా చెప్పారు. 'నేను శ్రీస్వామివారి దర్శనానికి వస్తానని చెప్పిన మరుక్షణంలో నాలో చెప్పలేని మార్పు కల్గింది. ఎవరి సహాయమూ లేకుండానే నడచి ఇంట్లోకి వెళ్ళి అన్నం పెట్టమని చాలా ఆకలిగా వుందని తొందరచేశాను. నా ప్రవర్తనకు ఇంట్లో వాళ్ళంతా దిగ్భ్రమ చెంది 'ఇది చావుబలం, మరణానికే ఈ ఆకలి' అని దుఃఖించసాగారు. నేను మామూలుగానే అన్నం తిని, చన్నీటి స్నానం చేసి ఉతికిన గుడ్డలు ధరించి గొలగమూడికి ప్రయాణమై కూర్చుంటే అందరూ వింతగా చూస్తున్నారు. వెంకట్రామిరెడ్డి చూచి 'చచ్చేవాడిగా ఉంటివిగదా, మరి ఇంతలో పెండ్లి కొడుకులాగా తయారయ్యావే' అని చెప్పి 'అదంతా శ్రీస్వామివారి మహిమగదా' అన్నారు.

బండి లేకుండానే, రెండు నెలలుగా అన్నంలేని నేను ఒక్కమైలు నడిచి వచ్చి బస్సు ఎక్కి గొలగమూడి చేరి సర్వం భోంచేశాను. అది మొదలు ఏ మందులేదు. ఆరోగ్యముగా ఉన్నాను. ఇది మానవులు ఊహించలేని వర్ణనాతీతమైన అనుభూతి. శ్రీస్వామివారి కృపకు నేను అర్హుడనుకాను. కానీ ఆ కరుణామయుడు నన్నెందుకు ఆదుకున్నారో అది వారి మాతృ ప్రేమకే తెలియాలి.

బిట్రగుంట వెంకట్రామిరెడ్డి భార్య కౌసల్యమ్మ, కాపువీధి, కోవూరు, నెల్లూరు జిల్లా. తన అనుభవాన్నిలా వివరిస్తున్నారు. 1991 మే నెల 1వ తేదీన అకారణంగా నా కుడికన్ను విపరీతమైన బాధ పెట్టసాగింది. కోవూరులో కంటి డాక్టరు లేనందున అర్ధరాత్రివేళ నెల్లూరు తీసుకుపోలేక మత్తు ఇంజక్షను చేసి నిద్రపుచ్చారు. తెల్లవారి నెల్లూరులో కంటి డాక్టరుకు చూపిస్తే రాయవేలూరు పొమ్మన్నారు. ప్రస్తుతం కంటి నుండి చిక్కని నీసు నీళ్లు కారుతూ దుర్వాసన, భరించలేని బాధ. రాయవేలూరులో మూడు రోజులు వైద్యం చేసినా నెమ్మదించనందున ఆ బాధ భరించలేక చిత్తూరులోని స్పెషలిస్టు దగ్గర చూపించాము. కానీ ప్రయోజనం లేక మద్రాసు వెళ్ళి ముద్దు కృష్ణారెడ్డిగారి ఆస్పత్రిలో పదిరోజులున్నాగానీ అణుమాత్రం కూడా బాధ తగ్గలేదు. ఇక భరించలేక ఒంగోలు దగ్గర చీమకుర్తిలోని కంటి డాక్టరు దగ్గర నాలుగు

రోజులు వైద్యం చేయించినా ప్రయోజనం లేకపోయింది. ఇప్పుడు కంటి గ్రుడ్డు బాగా లోపలికి పోయి రెప్ప మూతపడి గ్రుడ్డు కనిపించడంలేదు. నా బాధ చూడలేక మావాళ్ళు నన్ను ఎక్కడ స్పెషలిష్టులున్నారంటే అక్కడికి కారులో తీసుకుపోతున్నారు. చివరకు తిరుపతిలో మంజులమ్మగారికి చూపిస్తే 'ఇక కన్ను కనిపించదు. రెండవకంటికి కూడా ఈ జబ్బు వచ్చే ప్రమాదముంది. వెంటనే కంటి గ్రుడ్డు తీసేసి పింగాణి కన్ను అమరుస్తాము. ఒక్క కంటి చూపుతో సరిపెట్టుకోవలసిందే'నని తీర్పు చెప్పేసింది.

ఈ మాట విని అంతులేని దుఃఖముతో ఏడ్చి ఏడ్చి నిద్రపోయాను. నా స్వప్నంలో ఏనాడో చనిపోయిన మా నాన్నగారు కనిపించి 'ఆడకురా, ఆడకురా, ఆడకురా' అని ముమ్మారు పలికారు. మెలకువ వచ్చింది. మా నాన్న చనిపోయాడు గనుక నన్ను కూడా తన చెంతకు రమ్మంటున్నాడని అంటే నేను కూడా చనిపోతానని దుఃఖించాను. కన్నుదీసి పింగాణి కన్ను పెట్టేందుకు నేను సుతరామూ అంగీకరించక ఇంటికి వచ్చేశాను.

నేనంతవరకు శ్రీ వెంకయ్యస్వామిగారిని గూర్చి వినియున్నానేగానీ ఎప్పుడూ గొలగమూడి చూచియుండలేదు. కానీ నా అంతరాత్మలో 'వెంటనే గొలగమూడి వెళ్ళు' అని ఒక అదృశ్య శక్తి బలంగా తొందర పెట్టసాగింది. గొలగమూడి తీసుకు వెళ్ళేందుకు ఇంట్లోవాళ్ళు సుతరామూ అంగీకరించలేదు. ఇక నిలువలేక ఎవ్వరికీ చెప్పకుండా అర్ధరాత్రి కట్టుబట్టలతో గొలగమూడికి వచ్చేశాను. సమాధి మందిరము యొక్క కుడి ప్రక్క వరండాలో పడుకున్నాను. ముఖానికి గుడ్డ కప్పుకొని పుట్టెడు దుఃఖముతో కుమిలిపోతూ మూడు రోజులు గడిపాను. బాధ ఏమీ తగ్గలేదు. మూడవనాడు శనివారం. విపరీతమైన రద్దీ. అగ్నిగుండం నుండి పొగ విపరీతంగా చుట్టేస్తుంది. ఆ పొగ బాధ భరించలేక శ్రీస్వామివారిని నిష్టూరాలాడాను. 'ఏమీ స్వామీ నన్ను నీ సన్నిధికి ఎందుకు తీసుకొచ్చావు. ఈ పొగలో నన్నెందుకిలా చంపుతున్నావు. నీ వైభవం చూపించేటందుకా, లేక నామీద కసి తీర్చుకునేందుకా' అని ఏమేమో అనుకున్నాను. తిన్నగా నిద్రపట్టింది. ఆ నిద్రలో ఒక దివ్య స్వప్నం వచ్చింది. పింగాణి డీసులో నీరు తీసుకొని ఒక తెల్లచీర కట్టుకున్న యువతి, మందులపెట్టె పట్టుకొని నల్లకోటు వేసుకున్న ఒక వైద్యుడు నన్ను సమీపించారు. వాళ్ళిద్దరూ ఏదో మాట్లాడుకొన్నాక ఆ వైద్యుడు నీటిలో దూది తడిపి నా కన్ను తుడిచి

వెంటనే చిత్రంగా తన చేతివేళ్ళతోనే నాకన్ను చిటికలో పెరికి డీసులోని నీళ్ళలో పడేశాడు. నీళ్ళు చిమ్మడం కూడా కనిపించింది. దూదిని ఎర్రటి మందులో తడిపి నా కన్ను తుడిచి ఆ దూదిని కంటికి కరిపించి వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు. నాకు వెంటనే మెలకువ వచ్చి 'నా కన్ను వచ్చింది. నా కన్ను కనిపిస్తుంది' అని అరుస్తూ లేచి కూర్చున్నాను. నా ప్రక్కనున్న వాళ్ళందరూ నిద్రలేచి నా కంటి గ్రుడ్డు మామూలుగా పైకి వచ్చియుండి నేను స్పష్టంగా చూడగల్గడం చూచి శ్రీస్వామివారి దివ్య మహిమను తన్మయత్వంతో కొనియాడారు.

అది మొదలు నా కన్ను నొప్పిలేకుండా స్పష్టంగా కనిపిస్తుంది. అన్నాళ్ళుగా బాధించిన ఆ బాధంతా రెప్పపాటు కాలంలో మటుమాయం చేయడమంటే అది ఒక్క స్వామివారికే సాధ్యంగదా. ఒకనాడు శ్రీస్వామివారి శిష్యుడొకరు కనిపించి 'అమ్మా వయసు ముదిరి నీ రెండవ కన్ను కనబడకున్నా నేనిచ్చిన కంటికి ఢోకా లేకుండా కనబడుతుందిలే' అని శెలవిచ్చారు. ఇదంతా అనంత కరుణామయుడైన శ్రీస్వామివారి దయకు నిదర్శనమేకానీ నేను చేసిన సాధనంటూ ఏమీలేదు.

**ఈ విషయములో పూర్వ పుణ్యము, శ్రీస్వామివారితో ఆమెకు** 137
**గల ఋణానుబంధము ముఖ్యముగా శ్రీస్వామివారి కృపకు కారణమని తలవాలి. గనుక మనకెలాంటి సమస్యలు లేకున్నా నిస్వార్థమైన ప్రేమతో శ్రీస్వామివారిని మనమీ జన్మలో సేవిస్తే అది మనభవిష్యత్తులో మనకు శ్రీస్వామివారి కృపను అనాయాచితంగా ప్రసాదిస్తుంది.**

నేను కృతజ్ఞతతో శ్రీస్వామివారిని ఆరుమాసముల పాటు విడవకుండా సేవించాను. నా ఐదవ సం॥ వయసు నుండి బాధించుచుండిన ఇస్నోఫీలియా పూర్తిగా నివారణై ప్రస్తుతం మంచులో పడుకున్నా, చన్నీటి స్నానంచేసినా ఏ మాత్రము ఆయాసం రావడం లేదు. అంతేగాక ఎన్నో సంవత్సరాలుగా నన్ను బాధించుచుండిన నా కుటుంబ సమస్య కూడా పరిష్కరించారు.

పరమ కారుణ్యమూర్తియైన శ్రీస్వామివారెంత గొప్పగా తన కరుణా రసాన్ని నాపై వర్షింపచేసినా మానవ నైజమైన నా వక్రబుద్ధిని నేను విడువలేకపోయాను. ఆ కరుణామయుడు నా వక్రబుద్ధిని గూడ ఎలా సరిచేశారో చూడండి.

అందరూ శ్రీస్వామివారికి తల నీలాలు సమర్పిస్తుంటే నేను కూడా సమర్పించాలని తలచాను. కానీ ఆ తర్వాత బోడిగుండుతో ఉండడం ఇష్టంలేక తలనీలాలు ఇవ్వలేదు. రెండు రోజులలో నా తలంతా కురుపుల మయమైపోయింది. ఒకవారం రోజులు ఇంజక్షన్లు వేసుకుంటూ బాధపడ్డాను. కానీ కురుపులు ఏ మాత్రం తగ్గలేదు. చివరకిది శ్రీస్వామివారి మహిమేనని ఎరిగి అభిషేకజలం తలకు పూసి కురుపులు తగ్గితే తప్పక తలనీలాలు సమర్పిస్తానని చెంపలేసుకున్నాను. ఎంత చిత్రంగా కురుపులొచ్చాయో అంత చిత్రంగాను ఒక్క రోజులో కురుపులు మాయమైనాయి. అంతటితో చెంపలేసుకొని వెంటనే తలనీలాలు సమర్పించాను. ఇందుకే గాబోలు పెద్దలు '**దాసుని దండనం ముండనం**' అన్నారు.

నగరి శ్రీరాములు, తెలుగు పండిట్, ఆదోని తన అనుభవాలను ఇలా తెలుపుతున్నారు.

"1991 జులై నెల వరకు శ్రీ వెంకయ్యస్వామిగారిని గురించి నాకెంత మాత్రము తెలియదు. శ్రీ శిరిడీసాయిబాబాగారి పరమ భక్తాగ్రేసరులలో ఒకరైన శ్రీ యం.కె. ఆనంద వెంకటేశ్వర్లు (స్పెషల్ ఏ.సి.టి.ఓ. ఆదోని) గారు శ్రీ వెంకయ్యస్వామివారి జీవిత చరిత్రకు సంబంధించిన 'అవధూత లీల' అను నాలుగు భాగములు గల పుస్తకము నాకు చదువమని ఇచ్చిరి. నేను దానిని 19-8-91 నాటికి నాలుగు భాగములు చదివి ఆ రాత్రి నిదురించు సమయమున భక్త్యావేశముతో శ్రీస్వామివారి నీవిధముగ ప్రార్థించితిని. 'స్వామీ! తమరు సమాధి అనంతరము కూడా అనేక మందికి ప్రత్యక్ష, స్వప్న దర్శనములనిచ్చి, అనేక శుభముల నొడ గూర్చి దివ్యలీలల నెన్నింటినో ప్రదర్శించితిరి. ఇవి వాస్తవమైనచో నాకు గూడ ఏదైనా నొక సంకేతము నొసంగి మీ సమాధి చెంతకు పిలిపించుకొమ్మని మనసారా ప్రార్థించి శయనించితిని. ఆ రాత్రి నాకొక స్వప్నము వచ్చినది. అందులో ఒకానొక అపరిచిత వ్యక్తి నన్ను తన ఇంటికాహ్వానించి, శ్రీస్వామివారిని నా పైకి ఉసికొల్పెను. శ్రీస్వామివారు మహాబలవంతుడైన పహిల్వానువలె శరీరమంతయు చెమటలు పట్టినట్లు, ఒక పహిల్వాను మరొక పహిల్వాను పైకి కుస్తీకి పోయెడి పోజులో నా మీదకు వచ్చుచుండిరి. భయమనిన ఎట్టిదో ఎరుగని నాకు శ్రీస్వామివారు పైకి వచ్చుచుండగా భయము వేసింది. నేనప్పుడు

చేతులు జోడించి స్వామితో 'స్వామీ! నాకు చక్కెరవ్యాధి (షుగర్) యున్నది. రక్తపోటు వున్నది. గుండె జబ్బు కూడా ఉన్నది. మీరు ఒక్క దెబ్బ వేసినను నేను బ్రతుకజాలను. దయచేసి నన్ను కొట్టవద్దు' అని బ్రతిమాలుచుంటిని. ఐనను స్వామి నా మీదకు భయపెట్టుచు పహిల్వాను నడకతో వచ్చుచునే యుండెను, చివరకు ఆ కల ఎట్లో అంతమైనది.

"మరుసటిరోజు అనగా 20-8-91 న నాకు శ్రీస్వామివారి 'అవధూతలీల' ను ప్రసాదించిన శ్రీ యం.కె.ఆనంద వెంకటేశ్వర్లుగారి దగ్గరకు వెళ్ళి, స్వప్న వృత్తాంతమును వివరించితిని. వారు 'అట్టి స్వప్నము మంచిదే. శ్రీస్వామివారు మిమ్ములను కరుణించినారు. స్వప్నములో ఆయన భయపెట్టినది మీలోనున్న జబ్బులనే కానీ, మిమ్ములను కాదు' అని సెలవిచ్చారు. నేను వెంటనే ప్రయోగశాలకు వెళ్ళి మూత్రము, రక్తము పరీక్ష చేయించితిని. ఆశ్చర్యకరముగ రెండింటిలో చక్కరలేదని తేలినది. రక్తపోటు (బ్లడ్ ప్రెషర్) పరీక్ష చేయించగా అది కూడా మామూలుగానే ఉండినది. నాకు తృప్తి కలుగలేదు. ఆ జబ్బులకు సంబంధించిన మాత్రలను తినుట ఆపివేసి, బెల్లము, నెయ్యి కలిపి రొట్టెలతో తింటిని, తేనె త్రాగితిని, పండ్లు, మిఠాయిలు, చక్కెర కాఫీ, వరి అన్నము, ఏ పదార్థములు ఆ జబ్బులకు నిషిద్ధములో అవి అన్నియు తింటూ మరల పరీక్ష చేయించితిని. అప్పుడు కూడా ఆ జబ్బులు జాడలైనను లేవు. ఒకే నెలలో వేరు వేరు ప్రయోగశాలలో, వేరు వేరు డాక్టర్ల దగ్గర 5, 6 సార్లు పరీక్షలు చేయించితిని. శ్రీస్వామివారి మహిమ ఎటువంటిదో కాని ఈనాటికి ఆ జబ్బుల జాడలైనను లేవు. చివరిసారిగా ఆదోనిలోకాక 30-10-91 న కర్నూలులోని ఒకానొక ప్రసిద్ధ ప్రయోగశాలలో మరియొకమారు రక్త, మూత్రముల యందలి చక్కెరను పరీక్ష చేయించగా చక్కెర జాడలు కూడా లేవని తేలినది. బి.పి. కూడా నార్మల్‌గా ఉన్నదని ఇరువురు డాక్టర్లు పరీక్షించి తెల్పిరి. ఇది శ్రీస్వామివారి మొదటి స్వప్న దర్శన వృత్తాంతము.

శ్రీస్వామివారి రెండవ స్వప్న దర్శన వృత్తాంతము:

"20-9-91 వ తేది రాత్రి స్వప్నంలో శ్రీస్వామివారు పల్లకిలో ఊరేగింపుగా వస్తున్నారు. పల్లకి చుట్టూ జనం విశేష సంఖ్యలో చేరి శ్రీస్వామివారిని దర్శిస్తూ

ప్రార్థిస్తున్నారు. నేను దూరమున నిలుచుండి స్వామివారితో 'స్వామీ! నేను ఈ జన సందోహమును తొలగద్రోసికొని మీ దరికి రాలేను. నా నమస్కారమును ఇచ్చట నుండియే స్వీకరింపుడని ప్రార్థించితిని. వారు వెంటనే ఆ జన సందోహమును తొలగద్రోసికొని 'ఆయనతో నాకు పని ఉన్నది ప్రక్కకు తొలగండయ్యా' అనుకుంటూ నన్ను సమీపించారు. పల్లకిపై శ్రీస్వామివారు, ఆయన ప్రక్కన మరొకరున్నారు. శ్రీస్వామివారు ప్రక్కనున్న స్వామివారిని డబ్బులిమ్మని అడిగారు. ఆ స్వామి శ్రీస్వామివారి చేతికి ఆ పల్లకి మీదపడియున్న డబ్బులో నుండి ఒక వందరూపాయలనోటు, ఒక పది రూపాయల నోటు, మరికొన్ని రూపాయలు ఇచ్చారు. శ్రీస్వామివారు వాటిని తీసికొని 'నూటపదహార్లు తీసుకోవయ్యా' అన్నారు. 'ఈ డబ్బు నాకెందుకు స్వామి!' అని నేనన్నాను. స్వామి 'తీసుకోవయ్యా!' అని దోసిట్లో పోశారు. నేను దానిని నా జేబులో వేసుకొన్నాను.

"మరుసటి రోజు అనగా 21-9-91న నేను ఏదో పనిమీద కర్నూలు వెళ్ళాను. అచ్చట డాక్టరు సుదర్శనంగారు 'స్వామికృప' అను పుస్తకమొసంగి చదువుమనిరి. నేను దానిని చదివి, మా చెల్లెలుకిచ్చి చదువమని చెప్పి 22-9-91 ఆదోనికి వచ్చితిని. 2-10-91 గాంధీ జయంతినాడు కర్నూలు, సెయింట్‌జోసఫ్ కాలేజ్ శ్రీమతి రోజమ్మగారి విద్యాలయంలో జరుగనున్న అష్టావధాన కార్యక్రమములో పృచ్ఛకుడుగా పాల్గొనవలసినదిగా ఆహ్వానము వచ్చినది. దానికి నేనంగీకరించి, అవధానములో పాల్గొంటిని. మహా ఉదారస్వభావి, సారస్వతాభిమానియైన శ్రీమతి రోజమ్మగారు స్రక్చందన తాంబూల ఫలాదులతోపాటు స్వచ్ఛమైన ఉన్నిశాలువ, నారికేళము, ఒక కవరు, ఒకస్టెయిన్‌లెస్‌స్టీలు పళ్ళెములోఉంచి పృచ్ఛకులను,అవధానిని, అధ్యక్షులవారిని సన్మానించి పళ్ళెముతో సహా ఇచ్చి వేసినది. నేనప్పుడు కవరులో ఏమున్నది చూడలేదు. తర్వాత ఎప్పుడో దానిని విప్పిచూడగా అందులో 100, 10, 5, 1 రూపాయి నోట్లు ఉన్నవి. మొత్తం నూట పదార్లు శ్రీస్వామివారు 20-9-91 న స్వప్నములో ప్రసాదించిన నూట పదార్లు 2-10-91 న లభించినవి.

"నేను 3-10-91 న కర్నూలు నుండి ఆదోనికి వచ్చి, ఆనాటి రాత్రి శ్రీస్వామివారితో 'స్వామీ! మీ దివ్యలీలలను ప్రదర్శించితిరి. అవి సత్యములైనవి. నన్ను గొలగమూడికి పిలిపించు కొనవలసినది. ఆ ప్రయాణమునకు కావలసిన

అనుకూలములను కల్పింపవలసినద'ని ప్రార్థించితిని. మాకు 9-10-91 నుండి దసరా సెలవులు మొదలైనవి. నాకప్పటికి ఆ నెల జీతము రాలేదు. గొలగమూడికి ముగ్గురు ప్రయాణము చేయుటకు చార్జీలు లేని ఉచిత రవాణా సౌకర్యము, దానితోపాటు ఖర్చులకు కావలసిన 550 రూ॥లు పైకము స్నేహితుల ద్వారా శ్రీస్వామివారు సమకూర్చినారు. 12-10-91 నేను, మా తల్లి, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు మొత్తము 6 మంది గొలగమూడికి వెళ్ళి శ్రీస్వామివారిని దర్శించి, ఆనందించితిమి. 16-10-91 రాత్రి 1 గంటకు ఆదోని చేరి విజయదశమి పండుగ జరుపుకొని, పూజ్యులగు గురువులకు, మిత్రులకు శమీ పత్రముల నొసంగి వారి ఆశీస్సులందుకొంటిని.

మేము గొలగమూడికి బయలుదేరిన రోజు అనగా 12-10-91 న శ్రీస్వామివారు నా భార్యకు స్వప్న దర్శన మొసంగుటయేగాక ఆనాడు శనివారము శ్రీస్వామివారి దివ్యక్షేత్రమును, అచట జరుగు కార్యకలాపములను స్వప్నమందే దర్శింపజేసిరి. ఈ విషయమును నా భార్య శ్రీమతి నాగలక్ష్మమ్మ నేను గొలగమూడి నుండి ఇల్లు చేరిన వెంటనే నాకు తెలుపగా 'స్వామివారి కృప నీపై ప్రసరించినద'ని తెలిపి మరుసటిరోజు అనగా 18-10-91న నా భార్య, నా పెద్ద కుమారుడు చిరంజీవి రాఘవేంద్ర, నా చిన్న కుమారుడు చి॥ సీతారామానుజం వీరిని వెంట తీసికొని ఉచిత రవాణా సౌకర్యములతో ఆరోజు రాత్రి 10 గంటలకు గొలగమూడి చేరితిమి.

నా భార్య కుమారులతో గొలగమూడికి చేరినంతనే, ఆ క్షేత్రమును, అందువెలిసిన శ్రీస్వామివారిని, అన్న సత్రమును, వంటశాల, అచ్చట శనివారము శ్రీస్వామివారిని దర్శింప వచ్చిన భక్తజన సందోహమును గాంచి, నా భార్య ఆశ్చర్యచకితయైనది. తాను 12-10-91 రాత్రి గాంచిన స్వప్నములో వీటినన్నింటిని యథాతథముగ ఆమె శ్రీస్వామివారి కృపావిశేషముచే చూచానని చెప్పినది.

కామసాని చంద్రశేఖరరెడ్డి, సరోజినీదేవి రోడ్డు, తిరుపతి 5-1-75బి (కట్టెల డిపో) ఇలా చెబుతున్నారు.

1991 సం॥ లో నాకు ముఖమంతా కదుములు కదుములుగా తయారై వాటి నుండి చీము కూడా వస్తూంది. మొదట మొదట మొటిమల వలె ఉంటే

అశ్రద్ధ చేశాను. ముఖమంతా అల్లుకొని రాత్రింబవళ్ళు చివ్వు, చివ్వున భరించలేని నొప్పిగా ఉంది. మందులు తింటూ చీము పదార్థాలు తినకుండా పథ్యము కూడా ఉన్నాను. కానీ చీము కారుతూనే ఉంది. చేత్తోరుద్ది నీళ్ళు పోసి కడుగుకొనేందుకు వీలులేదు. మద్రాసు జర్మనీ హాస్పిటల్, బెంగుళూరు కె.ఎస్. ప్రకాశ్ డాక్టరుగారు, తిరుపతి రుయా హాస్పిటల్ మొదలగు అన్నిచోట్ల స్పెషలిస్టుల దగ్గర వైద్యం చేయించి పదివేల రూపాయలకు పైన ఖర్చు పెట్టాను. మంత్రతంత్రాలు, నాటు వైద్యాలు, భూత వైద్యాలు అన్నీ చేయించాను. కానీ ఫలితం శూన్యం. 1991వ సం॥ నాటికి బాధలు భరించలేనంతగా ఉన్నాయి. నిద్ర మాత్రలు మ్రింగినా కొంతసేపే కానీ మరలా బాధ వలన నిద్రపట్టేదికాదు.

నా మిత్రులకు ముఖము చూపించేందుకు మనస్కరించక చీకటిపడ్డాక బయటకు వచ్చేవాడిని. ముఖము అంత అసహ్యకరంగా తయారైంది. ఈ బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకోదలచాను. అట్టి విషమ పరిస్థితిలో కృపాకరుడైన శ్రీస్వామివారిని నేను శరణు వేడుకోనప్పటికీ నాపై కృప జూపుటయే విశేషము.

మా ఇంటికి ఎదురుగా ఉన్న సరోజనమ్మగారు శ్రీస్వామివారి భక్తులు. వాళ్ళ అమ్మగారు నన్ను పలకరించి శ్రీస్వామివారి నూనె ఇచ్చి పూసుకోమన్నది. తీర్థము, దారం ఇచ్చి మెడలో ధరించమన్నది. నూనె పూసుకున్న నాటి రాత్రికే బాధ తగ్గి నిద్రపట్టింది. క్రమేణా రెండు రోజులలో నా బాధ చాలా వరకు తగ్గింది. వెంటనే గొలగమూడి వెళ్ళి శ్రీస్వామివారిని సేవించాలని ఆరాటపడ్డాను. సరోజనమ్మగారు నా మీద దయతో కొన్నాళ్ళు నన్ను ఆశ్రమంలో ఉంచుకోమని అర్థిస్తూ ఆశ్రమవాసులకు లెటరు ఇచ్చారు. శ్రీస్వామివారి కృప వలన నేను గొలగమూడి చేరేసరికి నా కొరకే ఎదురు చూస్తున్నట్లు బిల్డింగులకు నీరు పట్టే క్యూరింగు పని ఎదురు చూస్తుంది. శ్రీస్వామివారి ప్రసాదం తింటూ క్యూరింగు పని చేస్తూ కొన్నాళ్ళు గడిపాను. పని వత్తిడి వలన ప్రదక్షిణలు కూడా నామమాత్రంగా చేసేవాణ్ణి. ప్రస్తుతం ఆ గడ్డలు, కదుములు, చీము అంతా ఎలా వచ్చినవి అలా పోయి మామూలు ముఖమయింది. ఆత్మహత్య చేసుకోదలచిన నన్ను ఈ విధంగా తమ సమాధి చెంతకు తీసుకువచ్చి నా బాధలు తీర్చిన శ్రీస్వామివారి ఋణం నేను ఏ సేవ చేసినా తీరదు. జీవితాంతం వారికి ఋణపడి ఉంటాను.

కోరిన వారికి కోరిన విధంగా తన కృపను వర్షింపజేసే కృపాకరుడు శ్రీస్వామివారు. శ్రీ వి.బాలక్రిష్ణయ్య అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ (నెల్లూరు) గారి భార్య విమలమ్మగారు తన దివ్యానుభవాన్ని ఇలా వివరిస్తున్నారు.

శ్రీస్వామివారిని గూర్చి శ్రీ భరద్వాజ మాస్టర్‌గారి ద్వారా తెలుసుకున్నాను. కానీ నేనప్పటికి గొలగమూడి రాలేదు. 1989 వ సం॥లో నేను శ్రీస్వామివారికి ఇలా విన్నవించుకున్నాను. "స్వామీ నేను మీ 'అవధూత లీల' గ్రంథాన్ని శ్రద్ధగా మూడు పారాయణలు చేసుకుంటాను. నా పారాయణ అనంతరం మా ఇంటిలోని పారిజాత చెట్టు దగ్గర అలికి ముగ్గులు పెట్టిన స్థలంలో కూర్చొని తమరు నా పిలుపు లేకుండానే నా ఆతిథ్యం స్వీకరించాలి. అది ఖచ్చితంగా 12.30 నుండి 1.30 గం॥ల మధ్యనే రావాలి" అని విన్నవించుకొని పారాయణ పూర్తిచేసి వంట చేసి వారి రాకకోసం ఎదురు చూస్తున్నాను. 1 గం॥ అయినా వారి జాడేలేదు. నాకు చాలా బాధేసి 'ఏమి స్వామీ! నా పారాయణంతా వ్యర్థమేనా? నా తప్పేమి తండ్రీ' అని బాధపడ్డాను. నా బాధ చూచి మా ప్రక్కింటామె ఎవరైనా భిక్షగాళ్ళను పిలుచుకు వస్తానన్నది. కానీ నేనే అంగీకరించలేదు. ఇంటిలోని పటాల దగ్గర కూర్చోగానే 'అమ్మా' అన్న కమ్మని పిలుపు వీధి గుమ్మం దగ్గర వినిపించి ఆత్రుతగా వెళ్ళాను. మోకాళ్ళ వరకు ధోవతి, చిన్నతువ్వాలు, ఖాకిచొక్కా వేసుకొని, చేతిలో కర్ర, మరొక చేతిలో అల్యూమినియం దబర పట్టుకున్న వ్యక్తి 'అమ్మా అంత అన్నం పెడతావా' అంటూ కమ్మని కంఠంతో అర్థిస్తున్న స్వామిని చూడగానే ఆనందాశ్చర్యాలు ముప్పిరిగొనగా నా శరీరం అదుపు తప్పిపోయింది. 'రండి స్వామీ భోంచేస్తురు' అని స్వాగతం పలుకుతూ వారిని లోనికి ఆహ్వానించాను. నేను ముందు, వారు వెనుక నడుస్తున్నాము. ఆ ఆనందపారవశ్యంలో నేను భూమి మీద నడుస్తున్నానా లేక గాలిలో తేలిపోతున్నానో తెలియడం లేదు. పరుగున ఇంట్లోకి వెళ్ళి పొంగలి, అన్నం, కూర వగైరా తెచ్చేలోగా శ్రీస్వామివారు మరొక్కసారి నన్నాశ్చర్యంలో ముంచేశారు. శ్రీస్వామివారు చిత్రంగా పారిజాత చెట్టుదగ్గర నేను అలికి ముగ్గులు పెట్టిన తావులోనే హాయిగా కూర్చొనియున్నారు. మామూలు భిక్షకుడైతే అక్కడ కూర్చునేందుకు సాహసించడుగదా? అన్నం దబరలో పెట్టమన్నారు. కానీ నా ప్రార్థన మన్నించి విస్తరలోనే వడ్డించుకున్నారు. అరచేతిని గుంటగా పట్టి నెయ్యి

పోయించుకున్నారు. తన చేతిని అన్నం మీద చిత్రంగా అలా ఇలా రెండు సార్లు త్రిప్పి ఎక్కువ అన్నం విస్తరి చుట్టూ కట్టగా నిలిపారు. మధ్యలో అన్నం ఒక్క క్షణంలో తినేసి చేయి కడిగేశారు. పోతూ పోతూ వెనక్కు తిరిగి 'దక్షిణ కుక్షిణ ఏమైనా ఇస్తావమ్మా'అనడిగారు. నేను ఆనందాశ్చర్యాలలో ఓలలాడుతూ దక్షిణ సమర్పించి సాష్టాంగ నమస్కారం చేసుకున్నాను. అప్పుడు వారు నా తలపై చేయిపెట్టి నన్నాశీర్వదించారు. దాంతో నా తలంతా దిమ్మెక్కి ఆనందానుభూతితో నిండి బాహ్య ప్రపంచమే తెలియకుండా పోయింది. ఆ ఆనందపారవశ్యం కొన్నాళ్ళ వరకు అలాగే వుండి క్రమేణా మామూలు స్థితికి వచ్చాను. నేను వారికి వీడ్కోలు చెబుతూ వారి వెనకాలే మూడిండ్లు దాటినంత వరకు రోడ్డున వెళ్ళాను. నా కళ్ళముందే చిత్రంగా మాయమయ్యారు.

పారిజాత చెట్టు దగ్గరే కూర్చోవాలని 12.30 నుండి 1.30 గంటల మధ్య రావాలని నేను పెట్టిన షరతులన్నీ జరిగినా ఈ వచ్చినవారు శ్రీస్వామివారిని పోలిన మరొకరై వుండవచ్చేమోనని నేను అనుమానపడే ప్రమాదముంది. అది గుర్తెరిగి వచ్చినది స్వయంగా శ్రీస్వామివారేనని నిరూపించుటకే ఆ విధంగా అదృశ్యమయ్యారని నా విశ్వాసము. రెండవది వారు ప్రసాదించిన ఆనందానుభూతి. పిలిచిన వెంటనే నన్నునుగ్రహించిన ప్రేమమూర్తికి ఆజన్మాంతం ఋణపడియున్నాను.

'వాళ్ళుండే దాన్ని బట్టి గదయ్యా మనముండేది' అని సెలవిచ్చిన శ్రీస్వామివారు తమ మహాసమాధి అనంతరం కూడా తన అభయం అక్షరాలా నిజమని నిరూపిస్తున్నారు.

డా॥ సుభాషిణి, పాండిచ్చేరి తమ దివ్యానుభవాన్ని ఇలా తెలియ చేస్తున్నారు:

శ్రీస్వామివారి విభూతి, దారముల మహాత్మ్యమును గూర్చి ఒక చిన్న పుస్తకములో చదివి గొలగమూడి దర్శించి వాటిని తీసుకువెళ్ళి 'పాండిచ్చేరి' లోని మా ఇంటిలో ఉంచుకొని నిత్యం పూజ చేసుకొనుచున్నాను. శ్రీస్వామివారు స్వప్న దర్శనమిచ్చి 'అబ్బాయి పుడితే నా పేరు పెట్టుకో'మని ఆదేశించి ఆశీర్వదించారు.

నాకు నవమాసములు నిండినవి. శ్రీస్వామివారి పటం నా దగ్గర లేదు. ప్రతిరోజూ పూజానంతరం శ్రీస్వామివారి విభూతి సేవిస్తూ 'స్వామీ

నాభారమంతయూ నీదే' నని ప్రార్థన చేసుకునేదాన్ని. రెండు మూడు రోజుల్లో ప్రసవము కానున్నదనగా నాకు ఆందోళన, భయము ఎక్కువయ్యాయి. నేను, మా శ్రీవారు ఇద్దరమూ ఎం.బి.బి.యస్. డాక్టర్లమయినా నాకు అది మొదటి ప్రసవమైనందున భయమెక్కువై రాత్రంతా ఏడ్చుకుంటూ నిద్రపోయాను.

ఆ రాత్రి 3 గ॥ల సమయంలో నాకు శ్రీస్వామివారు స్వప్న దర్శనమిచ్చారు. మా ఇంటిలోని దేవుని పటాలకు అడుగు భాగమున గల ఒక అగ్నిగుండములో శ్రీస్వామివారు దేదీప్యమానంగా వెలిగిపోతూ కూర్చొనియున్నారు. 'నీకు భయమెందుకమ్మా, నేను నీతో కూడానే ఉళ్ళా' అని శెలవిచ్చారు. అప్పటి నుండి నాకు ధైర్యం వచ్చి ప్రతి గంటకొకసారి శ్రీస్వామివారి విభూతిని నీటిలో కలుపుకొని త్రాగుచుంటిని. శ్రీస్వామివారి దయవల్ల నాకు సుఖప్రసవమై బాబు పుట్టాడు. వానికి శ్రీస్వామివారి ఆజ్ఞానుసారం 'హరిత్' అని పేరు పెట్టుకున్నాము. మా అన్నదమ్ములకు కూడా అవసర సమయాలలో శ్రీస్వామివారు దర్శనమిచ్చి తగు సందేశములిస్తున్నారు. నమ్మినవారిని ఆదుకునే శ్రీ మహావిష్ణువే భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారు.

## రైలు క్రింద పడ్డ మనిషి బ్రతికి బట్టకట్టడం సాధ్యమా?

శ్రీస్వామివారి భక్తునికది సాధ్యమని శ్రీస్వామివారు నిరూపించారు. శ్రీస్వామివారి ఆశీస్సుల ఫలితంగా రైల్వే ఉద్యోగంలో చేరిన ఉడతా రమణయ్య ఎంతో కృతజ్ఞతాభావంతో, భక్తి శ్రద్ధలతో శ్రీస్వామివారిని స్మరిస్తూ సేవిస్తున్నాడు. చేతి వ్రేలికి ఎప్పుడూ శ్రీస్వామివారి ఉంగరముంటుంది. వీరి అద్భుతానుభవం తెలుసుకుందాము.

16-6-92న నేను 'కీ' మేన్ పని చేస్తూ వేదాయపాళెం - వెంకటాచలం మధ్యన లైను చెక్ చేసుకుంటూ నెల్లూరు వైపు వస్తున్నాను. ఆ సమయంలో మద్రాసువెళ్ళే ఒక బండిని తిరిగి నెల్లూరు రమ్మని పిలిపించినందున ఆ బండిని డ్రైవరు వేదాయపాళెం వరకు రివర్స్ తీసుకు వస్తున్నాడు. అలా రివర్స్ తీసుకువచ్చేటప్పుడు విజిల్ వేస్తూ 15 కి.మీ. వేగంలో రావాలి. కానీ ఇంజనులో ఏదో పనిచేసుకుంటూ విజిల్ వేయకుండా వస్తున్న డ్రైవర్, లైను మీద వెళ్ళేనన్ను చూడలేదు. అదే సమయంలో ప్రక్కలైను మీద మరొక బండి వస్తున్నందున నా వెనుక వచ్చే బండి శబ్దం నాకు వినిపించలేదు. 15 కి.మీ. వేగంతో రివర్స్ వస్తున్న బండి నా వెనుక నుండి నన్ను గుద్దింది.

బండి గుద్దినదని తెలుస్తూనే తత్తర పాటున నాకు తెలియకుండానే 'స్వామీ' అనే కేకతో రెండు రైలు పట్టాలకు మధ్య బోర్లాపడ్డాను. రైలు నాపై నుంచి వెళ్ళిపోతూ నా చొక్క, పంచ, బనీను తీసుకెళ్ళి పోయింది. నా ముఖాన, గవద మీద, గులకరాళ్ళు గుచ్చుకొని చిన్న గాయాలైనాయి. నా కుడి కాలి మడిమ కండ తెగిపోయింది. నన్ను రైల్వే హాస్పిటల్‌లో అడ్మిట్ చేశారు. డ్రైవరును అరెస్టు చేశారు. పది రోజులలో నన్ను డిస్‌ఛార్జ్ చేశారు. ఎన్నో పరీక్షలు చేసి నాకెలాంటి బాధ లేదని నిర్ధారణ చేసి తిరిగి డ్యూటిలో చేరమన్నారు. కానీ నీకు రెస్టు కావాలంటే జీతం మీద సెలవు ఇస్తాము, రెస్టు తీసుకోమన్నారు. ఆరోగ్యముగా ఉండి సెలవు తీసుకోవడము అధర్మమని తలచి నేను డ్యూటీలో చేరాను.

ఈ ప్రాణ గండం నుండి నన్ను శ్రీస్వామివారే రక్షించారు. లేకుంటే ప్రాణాపాయమో, అంగవైకల్యమో తప్పక జరిగి ఉండాలి. రైల్వే చరిత్రలోనే ఇలా బ్రతకడం చిత్రమన్నారందరూ. ఆజన్మాంతం నేను, నా కుటుంబం శ్రీస్వామివారికి ఋణపడియున్నాము.

శ్రీస్వామివారి నోటి వెంట వచ్చిన ప్రతీమాట ఏనాటికైనా నూటికి నూరు పాళ్ళు జరిగి తీరుతుంది. అది వేదవాక్కు. వారి ఆశీస్సులు అమోఘంగా ఫలిస్తాయి అని తన అనుభవాన్ని తెలుపుతున్నారు శ్రీ ఉడతా రమణయ్యగారు (గొలగమూడి).

నాకు పందొమ్మిది సంవత్సరాల వయస్సులో రోజుకు 1 రూ॥ 4 అణాలు (రూ॥ 1.25 పైసలు) కూలికి రైల్వే గ్యాంగ్ పనికి పోయేవాణ్ణి. నాలుగు సంవత్సరాలు అలా చేశాక మా అత్తగారు నేను రూపాయ పావలా కూలికి రోజంతా పనిచేస్తున్నానని హేళన చేశారు. దాంతో రైల్వే పని మానేసి ఒకరికి సేద్యానికి పోతున్నాను. ఆ విధంగా సుమారొక సంవత్సరం సేద్యం చేశాక ఒకరోజు నీళ్ళ కావిడి మోస్తూ ఆంజనేయస్వామి గుడి దగ్గరున్న శ్రీస్వామివారి దగ్గరకొచ్చాను. నేనేమి అడగకుండానే శ్రీస్వామివారు నాతో 'అయ్యా! పదిరూపాయలు ఖర్చుపెడితే నూరు రూపాయలు ఆదాయముంటుండ్లాయ్యా. నీకు గవర్నమెంటు వాళ్ళు ఉద్యోగమిస్తారు. నీ చేతి గుండా ఎంతో అన్నదానముండ్లాయ్యా – నిన్ను గవర్నమెంటు వాళ్ళు పిలుస్తారు, ఉద్యోగానికి పోయ్యా' అని అన్నారు. 'పో స్వామి, నీదొక పిచ్చి.

నేను రైలు పనికి పోకుండా ముగించి కూలిచేసుకొని బ్రతుకుతుంటే' అంటూ వెళ్ళిపోయాను. శ్రీస్వామివారి మాటలకు పైసా ఎత్తు విలువనివ్వలేదు.

అటు తర్వాత కొన్నాళ్ళకు రైల్వే ప్రభుత్వం కొన్ని ఆర్డర్లు పాస్ చేశారు. 1960 సం॥నకు ముందు ఆబ్సెంట్ లేకుండా ఆరు నెలలు పనిచేసినవారికి పోస్టు టెంపరరీగా పెట్టి పర్మినెంట్ వారికిచ్చే 170 రూ॥ జీతం ఇవ్వమన్నారు. దాని ప్రకారం నాకు కూడా 170 రూ॥ జీతమునకు అర్హత వచ్చింది. ఆ లిస్టులో నా పేరు వచ్చేసరికి నా స్నేహితులు మా అమ్మకు చెప్పి నన్ను తిరిగి రైల్వే గ్యాంగ్ పనికి పంపమన్నారు. మా ఇన్‌స్పెక్టర్ నామీద అభిమానంతో నన్ను తిరిగి ఉద్యోగములో చేరమని మనిషిని పంపారు. ఉద్యోగంలో చేరితే 5,000 రూ॥ లు అరియర్స్ వచ్చాయి. దాంతో 7 ఎకరాల పొలము కొన్నాను. శ్రీస్వామివారి ఆశ్రమ అన్నదానమునకు ప్రస్తుతము సంవత్సరమునకు 4 తూముల వడ్లు సమర్పిస్తున్నాను. ప్రస్తుతము నాకు 3,000 రూ॥ జీతము, ఆలిండియా పాస్, పి.టి.ఒ. లు అన్ని రైల్వే వసతులు - పెన్షన్‌కు అర్హత పొందియున్నాను. శ్రీస్వామివారి మాటలన్నీ అక్షరాల జరిగి తీరవలసినదే. వారి వాక్కు బ్రహ్మవాక్కు.

శ్రీ గుద్దేటి ఆంజనేయులుగారు - ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటు, కోవూరు, తనకు శ్రీస్వామివారు ప్రాణభిక్ష పెట్టిన వివరం ఇలా వివరిస్తున్నారు.

1985 వ సంవత్సరము, నవంబరు నెలలో నేను, నా భార్య, మరికొందరు ఒక జట్కాబండిలో పోతుండగా అనికేపల్లి బస్సు మా జట్కాను వెనుకనుండి గుద్దింది. బండిలోని వారందరమూ చెల్లాచెదరుగా పడిపోయాము. గుఱ్ఱముతో సహా ఎవరికీ పెద్ద దెబ్బలేమీ తగలలేదు. బండి మాత్రము గుల్ల, గుల్ల అయిపోయింది. నా వెన్నెముకలో ఎక్కడ ఏమైందో తెలియదు. విపరీతమైన నొప్పి, పడుకొనేందుకు వీలులేదు. మద్రాసు, హైదరాబాదు, గుంటూరులోని డాక్టర్లందరూ వైద్యం చేశారు. సుమారు లక్ష రూపాయలు ఖర్చయింది. కానీ వీసమంత మార్పులేదు. ఈ విధంగా రెండు సంవత్సరాలు చిత్రహింస పడ్డాను. చివరికి డాక్టర్లు నేను ఎక్కువ రోజులు జీవించనని చెప్పారు. ఆ దిగులుతో అన్నం సహించక తినకపోయేసరికి కుటుంబమంతా అన్నం ముట్టడంలేదు. వారి కొరకు మనసు రాయి చేసుకొని అన్నం తినసాగాను. నా శరీర బాధకు తోడు మానసిక బాధ నన్ను అనుక్షణం

దహించివేస్తుంది. నా బాధ వర్ణించవీలుకానిది. ఇట్టి విపత్కర పరిస్థితులలో పరమ కారుణ్యమూర్తి అయిన శ్రీస్వామివారు నా స్నేహితుల ద్వారా తమ దివ్య తపో భూమికి రమ్మని కబురంపారు.

మిత్రుల సలహాపై గొలగమూడి దివ్యక్షేత్రం సందర్శించాను. మహాద్భుతమూ, మహిమాన్వితమైన శ్రీస్వామివారి కరుణా కటాక్ష వీక్షణము ఈ దీనునిపై ప్రసరించినది. ఊహించలేని విధంగా 75% బాధ మాయమైపోయింది. ఇది ఎవరూ ఊహించలేని మార్పు. మృత్యుముఖంలో పెనుగులాడుచున్న నాకు కరుణామయుడైన శ్రీస్వామివారు పునర్జీవితం ప్రసాదించారు. వారికి కృతజ్ఞత ఎలా చెప్పాలో తెలియడంలేదు. అది మొదలు నియమంగా వారానికి ఒక రోజు వచ్చి శ్రీస్వామివారిని సేవించుచున్నాను. క్రమంగా 95% బాధ తగ్గింది. నా ప్రారబ్ధం దృష్ట్యా 5% అనుభవించడమే మేలని శ్రీస్వామివారిని అడగరాదని భావించి, దాన్ని తగ్గించమని ఎప్పటికీ అడుగదలచలేదు.

శ్రీస్వామివారి కృపవలన తన కుమారునికి స్వస్థత చేకూరడంతో, శ్రీస్వామివారు పిలిచిన పలికే దైవమని మరొకసారి తనకు నిరూపించారని గుద్దేటి ఆంజనేయులుగారు చెబుతున్నారు.

1988 సం॥ లో నాగార్జునసాగరుకు నాకు డ్యూటీ వేసారు. టిక్కెట్లు రిజర్వు చేసుకున్నాను. ఐదవరోజు నా ప్రయాణమనగా ఆరు సంవత్సరముల వయస్సు గల నా కుమారునకు జబ్బు చేసింది. చచ్చులాగా వచ్చి, అకస్మాత్తుగా పడిపోతున్నాడు. తిరిగి కొంత సేపటికి బాగుంటుంది. ఈ విధంగా రోజుకు నాలుగుసార్లు కూడా వస్తుంది. సాగర్ వెళ్ళేలోగా పిల్లవానికి ఆరోగ్యం చక్కపడాలని ముగ్గురు డాక్టర్లను మార్చి వైద్యం చేయించినా ఏమీ నయంలేదు. డ్యూటీకి పోవడమా లేక మానడమా అనే డోలాయమానంలో మదనపడ్డాను. చివరకు శ్రీస్వామివారినే శరణు వేడాను. 'స్వామి! మీ ఆజ్ఞ ఏమిటి? ఏం చేయమంటారు' అని మనస్సులో బాధతో అర్థించాను. ఆనాటి రాత్రి శ్రీస్వామివారు నా స్వప్నంలో కనిపించి 'అయ్యా! అబ్బయ్యకు బాగుంటుంది. నీవు మాత్రం క్యాంపుకెళ్ళు, సుబ్బారావును పంపవద్దు' అని సెలవిచ్చారు. శ్రీస్వామివారి ఆజ్ఞమేరకు క్యాంపుకు వెళ్ళాను. నేను తిరిగి వచ్చేసరికి పిల్లవాని ఆరోగ్యం పూర్తిగా చక్కబడింది. శ్రీస్వామివారు స్వప్నంలో అలా చెప్పకుంటే

పిల్లవానికి మందు వల్లనే నయమయిందని భావించేవాళ్ళము. ఇది తెలిసే శ్రీస్వామివారు మన భక్తిశ్రద్ధలు పెంచేందుకు స్వప్న దర్శనమిచ్చి బిడ్డకు నయం చేశారు.

నాకు షుగర్ వ్యాధి ఉంది. శ్రీస్వామివారి ఊధీ మాత్రం వాడుతూ వారిని సేవిస్తూ మందులు మానేశాను. శ్రీస్వామివారి కృప వల్ల నా ఆరోగ్యం చక్కగా ఉంది. నాకు ఎలాంటి శారీరక బాధలు లేవు.

వనస్థలిపురం వాస్తవ్యులు శ్రీమతి శోభగారి అమోఘమైన అనుభవం:

నాకు 1992 సంవత్సరములో చర్మవ్యాధి వచ్చి, ముఖమంతా కాలిన మచ్చల మాదిరిగా చాలా వికారంగా ఉండేది. ముఖమంతా దురద, ఇంకా వంటి మీద అక్కడక్కడ మచ్చలు వచ్చినాయి. ఎక్కడెక్కడి మందులో వాడినాను. పోగా, చర్మవ్యాధి డాక్టర్ వద్దకు వెళ్ళి జెల్లీగా ఉండే మందు తెచ్చి దాన్ని నెలరోజులు ఏమారకుండా పూశాను. అయినా తగ్గలేదు, సరికదా ఒళ్ళంతా పాకిపోయింది. మా అన్నయ్యలు ఇద్దరూ యం.బి.బి.యస్ డాక్టర్లే. వాళ్ళే ఎలా తగ్గుతుందోనని ఫీలయ్యారు. ఇక విసిగి నేను అన్ని మందులు మానేసి, శ్రీస్వామివారిని వేడుకొన్నాను. 'స్వామీ! నా పాప ఫలమేమైనా ఉంటే దాన్ని పరిహరింపచేసి నాకు దీన్ని తగ్గించి మీ మీద సంపూర్ణ విశ్వాసం ఉండేటట్లు అనుగ్రహించు తండ్రీ! ఒక వారం రోజులు మీ విభూతిని రాస్తాను' అని చెప్పుకొని, రాయడం మొదలుపెట్టాను. ఆ కరుణామయుడు నా కర్మను తీసేసి, నాలుగు రోజులలో ముఖమే కాకుండా వళ్ళంతా ఉన్న మచ్చలు మళ్ళీ చూద్దామన్నా లేకుండా పోవునట్లు అనుగ్రహించారు. ఈ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకయ్య స్వామి.

శ్రీ పాబోలు పిచ్చయ్యగారు - జ్యోతినగర్, రెండవ వీధి, నెల్లూరు. ఇలా వ్రాస్తున్నారు.

నాకు 1982 సంవత్సరములో కుడికాలు జబ్బమీద పెసర గింజంత వాపు మొదలైంది. అది క్రమేణా పెద్దదై టెన్నిస్ బాలంత లావైంది. క్రమేణా ఇంకా పెరుగుతూంది. నెల్లూరులో రెండుమార్లు ఆపరేషన్ చేయించినా మూడవసారి కూడా అదే విధంగా పెరిగింది. ఈసారి క్యాన్సర్ అని అనుమానించి తిరుపతికి శాంపిల్ పంపితే వారు క్యాన్సర్ అని దృఢపరిచారు. మద్రాస్, అడయారు క్యాన్సరు ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించి కరెంటు పెట్టించి

రెండు నెలలకు సుమారు 30,000 రూ॥ల ఖర్చుతో బయటపడ్డాను. 'రెండవసారి శరీరం మీద ఎక్కడైనా అలాగే వస్తే డబ్బు పోవడం తప్ప ప్రయోజనం లేదు. ప్రాణహాని' అని ఆసుపత్రి వారు చెప్పారు.

ఆ తరువాత ఒక్క సంవత్సరానికి అదే కాలియొక్క బొటనవేలు దాని ప్రక్కవేలి మధ్య మరలా అదేవిధంగా వాపు మొదలై క్రమేణా పెరగ నారంభించింది. పెద్ద కొండరేగికాయకంటే పెద్దదై చెప్పులు వేసుకోలేకున్నాను. పూర్వం అడయారు ఆసుపత్రివారు చెప్పిన మాటప్రకారం నాకు ప్రాణభీతిచే, మానసికంగా తీవ్రమైన బాధ అయింది. నాకు ఇంకా ఇద్దరు వివాహం కావలసిన అమ్మాయిలున్నారు. ఈ సంకట పరిస్థితులలో నేను ప్రతి శనివారం గొలగమూడి వెళ్ళి శ్రీవెంకయ్యస్వామివారిని దర్శించేవాడిని. ఒకరోజు ఆ గ్రామములోని మా కుమార్తె సలహాపై శ్రీస్వామివారికి ఒక చిన్న మ్రొక్కుబడి చెప్పుకొని ప్రార్థించాము. చిత్రంగా మరుసటి శనివారమునకు నేను ఎలాంటి వైద్యాలు చేయకున్ననూ ఆ క్యాన్సరు గడ్డ సంపూర్ణంగా లేకుండా పోయింది. ఇది శ్రీస్వామివారి అనంత కరుణకు నిదర్శనమని హృదయపూర్వకంగా విశ్వసిస్తున్నాను.

నేను వారు బోధించిన ధర్మమార్గములో నడుచుకుంటూ నా శేష జీవితమును వారి పాదపద్మములకు సమర్పించుకొనుచున్నాను.

నెల్లూరు, గాంధీనగర్ నివాసి ఐతా నారాయణగారి అనుభవమూ, వారి విశ్వాసమూ మనందరికీ గుణపాఠంగా నిలుస్తున్నాయి. సాధారణంగా ఒక మండలం రోజులు శ్రీస్వామివారి సన్నిధిలో సేవచేయాలంటేనే చాలా బాధపడిపోయే మనస్తత్వం మానవులది. నెలల తరబడి అకుంఠిత విశ్వాసంతో శ్రీస్వామివారిని సేవిస్తూ వారి దయ కొరకు వేచియున్న అద్భుతగాథ ఇది.

1992 సం॥లో ఒక పెండ్లికి పోయి వచ్చిన నా భార్యకు కుడిప్రక్క నడుములో నొప్పిచేసింది. ఆ తర్వాత వంటేలుకు వెళ్ళిన చోట పడి పోయింది. అది మొదలు కాలు ముడుస్తుంది గానీ చాపలేదు. నడుములు నొప్పి. నెల్లూరు గవర్నమెంటు ఆస్పత్రికి పోయాము. మరొక స్పెషలిస్టుకు చూపాము. వెన్నుపూసలో ద్రవం పరీక్షించి వైద్యాలు చేశారు. ఏమాత్రం నయం కాలేదు. ఇక ఆ వైద్య ఖర్చులు భరించలేకపోయాము. ఆ తర్వాత ఆయుర్వేద వైద్యం చేయించాము కాలిలో రక్తప్రసరణ వచ్చింది కానీ కాలు చాపలేదు నొప్పి

తగ్గలేదు. శరీరంలో కూడా మంటలు ఉండేవి. ఆయుర్వేద వైద్యుడు కొంతకాలం వైద్యం చేసి 'ఇక నా వల్లకాదు తిరుపతి రుయా ఆసుపత్రికి పొమ్మ'న్నాడు. ఆర్థిక ఇబ్బంది వలన ఎక్కడకూ పోలేను. మంత్ర తంత్రాలు కూడా ప్రయత్నించి విఫలమయ్యాము. ఇక నిస్సహాయ స్థితిలో గొలగమూడి వచ్చాము. గొలగమూడి వచ్చేసరికి ఆమె బొత్తిగా నడవలేదు. నేనే పసిబిడ్డను ఎత్తుకున్నట్లు చేతుల మీద ఎత్తుకొని మందిరానికి ప్రదక్షిణలు చేయించేవాడిని. చాలా బలహీనంగా ఎముకలగూడై ఉండేది. మొట్టమొదట అగ్ని హెూత్రము దగ్గరకు కూడా రాలేకపోయాము. తీరా ఒకటి రెండు ప్రదక్షిణలు చేయించేసరికి తన ప్రయత్నము లేకుండా ఒంటేలు పొయ్యేది. ఇక ఆ పవిత్ర స్థలంలో ఉండలేక బయట కూర్చోబెట్టి ఆమె బదులు నేనే ప్రదక్షిణలు చేసేవాణ్ణి. శ్రీస్వామివారి సన్నిధిలో నలభైరోజులు సేవ చేయాలంటే మూడు నెలలు పట్టింది. నెలకొకసారి కాకుండా ముందుగానే ఇంటికి దూరమయ్యేది. అయితే శ్రీస్వామివారి దయతో వచ్చిన మూడు నాలుగు రోజులకే ఒంటిలో మంటలు తగ్గిపోయాయి. ఇంటికి వెళ్ళినా శ్రీస్వామివారి సేవ చేసేవాణ్ణి. గొలగమూడి వచ్చి వీలైనన్ని రోజులుండడం ఇంటికి దూరమయితే వెళ్ళిపోవడం, ఇట్లా ఒక సంవత్సరకాలం మొండిగా తిరిగాను. అప్పుడు శ్రీస్వామివారు మాపై కరుణించి నా భార్య తనకై తానే కర్ర పట్టుకొని నడిచేటట్లు చేశారు. ప్రస్తుతం తన పనులు తాను చేసుకోవటమేకాక మాకు కూడా వంటపనికి సహాయపడుతుంది. ఆ కారుణ్యమూర్తి యొక్క శక్తిసామర్థ్యాలు, దయ, ప్రేమ వర్ణించ ఎవ్వరి తరముగాదు.

శ్రీస్వామివారి ఎడల మనకు గల విశ్వాసమే శ్రీస్వామివారి కృపను మనపై కురిపిస్తుంది.

నెల్లూరు జిల్లా క్రిష్ణాపట్నం వాస్తవ్యుడైన చల్లా శ్రీరాములుశెట్టిగారు గత పదిహేను సంవత్సరముల నుండి గొలగమూడిలో శ్రీస్వామివారి సేవలో ఉండి అనికేపల్లి నుండి భిక్షాన్నం తెస్తున్నాడు. 2002 వ సం॥లో ఇతనికి పక్షవాతం వచ్చి మూతి ప్రక్కకు లాగింది. కాలు, చెయ్యి స్పర్శ కోల్పోయి నడువలేకున్నాడు. ఇతని కుమార్తె, అల్లునికి కబురు పంపారు. ఇతనిని వారి ఇంటికి తీసుకు వెళ్ళేందుకు వచ్చారు. కానీ ఇతడు 'నేను శ్రీస్వామివారిని వదలిరాను. ఈ పుణ్యభూమిలోనే మరణిస్తాన'ని మొండి పట్టుతో

గొలగమూడిలో ఉండిపోయాడు. పక్షవాతానికి ఎవరో ఏదో ఆకు నూరి ఇస్తే తిన్నాడు. కానీ గుణం చూపలేదు. ఒక వారం తిరగకుండానే ఇతని స్వప్నంలో ఎవరో ఒక వ్యక్తి వచ్చి ఇతని ముందు కూర్చొని 'ఏమయ్యా బాగలేదా? బాగుంటుందిలే. ఇదిగో చక్కెర పట్టు' అని శ్రీరాములుశెట్టిగారు పట్టిన ప్లాస్టిక్ సంచిలో వేశాడు. చక్కెర సంచిలో పడిందా క్రింద పడిందా అని నేలపై తడిమి చూచాడు. అక్కడ గరుకులేదు. తల ఎత్తి చూస్తే ఆ వ్యక్తి అక్కడ లేడు. తెల్లవారే సరికి చేయి, కాలు తిరిగి స్పర్శను పొంది, మూతి చక్కగా వచ్చి – నడవడం, మాట్లాడడం మొదలుపెట్టాడు.

మే నెల ఎండలు తీవ్రంగా ఉన్నాయి. 'పదిరోజులు భిక్షాన్నానికి అనికేపల్లి పోవద్దు. విశ్రాంతి తీసుకోమ'న్నారు. ఇతడలానే ఉన్నాడు. ఒకనాటి స్వప్నంలో తాను అనికేపల్లిలో భిక్షాన్నం దండుతున్నట్లు స్వప్నం వచ్చింది. నన్ను భిక్షాన్నానికి వెళ్ళమని శ్రీస్వామివారి ఆజ్ఞ అని తలచి తెల్లవారి నుండి అంతటి ఎండలలో కూడా భిక్షాన్నానికి అనికేపల్లి పోతున్నాడు.

శ్రీస్వామివారే ఇతనిని ఈ ఆపద నుండి రక్షించారనడానికి ఒక స్వప్న నిదర్శనమిచ్చారు. పక్షవాతం తెల్లవారి వస్తుందనగా నాటి రాత్రి స్వప్నంలో చాలా పెద్ద విమానం ఆకాశంలో వస్తుందట. తాటిమాను ఎత్తు గల పెద్ద పొడవైన వెదురు గడను నిలబెట్టి పట్టుకొని శ్రీస్వామివారు నిలబడి యున్నారట. అది చూచి ఆ విమానం వెళ్ళిపోయిందట. దీనిని బట్టి శ్రీస్వామివారే ఇతనికి రాబోయే ఆ గొప్ప ఆపద నుండి రక్షించారని తెలుస్తుంది. ఇతడు ఈ ఆపద నుండి రక్షించబడేందుకు కారణం "**ఈ పుణ్యభూమి నుండి నేను కదలను**" అన్న విశ్వాసముతో కూడిన మాటే కారణమని మనం గుర్తించాలి. విశ్వాసం కొండలను కదలిస్తుందంటారు. ఇదే గదా!

శ్రీస్వామివారి మాటకు అర్థం ఎంతలోతు ఉంటుందో ఆ మాట ఎంత సూక్ష్మంగా ఉంటుందో తెలుసుకోవడం సామాన్య మానవులకు సాధ్యంకాదు. వారు మనకొక మాట చెప్పినప్పుడు అది అర్థం కాకుంటే దమ్మపేట – డి.నాగేశ్వరరావుగారి వలె ఆ మాట యొక్క అర్థం మనకు తెలిసేటట్లు చెప్పమని శ్రీస్వామివారిని కన్నీటితో ప్రార్థించాలి. లేకుంటే రోశిరెడ్డివలె "ఓ ప్రభూ మీ మాట యొక్క నిజమైన అర్థం తెలుసుకొని మీకు ప్రీతికరంగా నేను ఆచరించలేను. తమరే నాలో ప్రేరణపెట్టి మీకు ప్రీతి

కలిగేటట్లు నేను మీ మాటను ఆచరించేటట్లు చేయండి స్వామీ" అని వారిని హృదయ పూర్వకంగా కన్నీటితో ప్రార్థించాలి. శ్రీస్వామివారు చెప్పారు, అది అర్థంకాలేదు అని వదిలేస్తే నష్టపోయేది మనమే.

నా స్నేహితునికి శ్రీస్వామివారు – "అయ్యా! నీవు ఉండే ఇల్లు వదిలి పెడితే నీకు కష్టాలు వస్తాయి" అని చెప్పారు. ఈ మాట చెప్పిన కొన్ని సంవత్సరాలకు నా స్నేహితుడు ఆ ఇల్లు వదిలి కాపురం నెల్లూరు మార్చాడు. వెంటనే నాలుగు వేల రూపాయలు విలువ చేసే ఎద్దు చనిపోయింది. శ్రీస్వామివారి మాట గుర్తువచ్చి తిరిగి తన పాతింటికి కాపురం మార్చాడు. కొన్ని సంవత్సరాలు హాయిగా ఉన్నాడు. తన పూరింటి స్థానంలో మిద్దె కట్టాలని కాపురం మరొక ఇంటికి మార్చాడు. తనకు కుడిభుజంగా ఉంటూ ఇంట్లో అన్ని పనులూ చూస్తున్న మనిషి చనిపోయాడు. అది మొదలు అతనికి కష్టాలే సంప్రాప్తమైనాయి. ఎంత కష్టమైనా సరే ఆ ఆవరణం దాటి పోకుంటే ఎంత బాగుండునో గదా!

## కన్నీటికి కరిగిపోయే స్వామి

హృదయ పూర్వకమైన ఆర్తితో ఎవరైనా కన్నీరు కారిస్తే వెన్న వంటి హృదయం గల శ్రీస్వామివారు వెంటనే వారి బాధలు తీరుస్తున్నారు.

సూళ్ళూరు పేట సమీపాన గల ఉచ్చూరు నివాసి శ్రీ వై.శివరామయ్యకు రెండు కిడ్నీలు చెడిపోయి మద్రాసు డాక్టరుకు వీలుగాక వదిలేసిన కాలంలో గొలగమూడిలో శ్రీస్వామివారిని ఆశ్రయించి మందిరానికి అందరూ ప్రదక్షిణలు చేస్తుంటే చూచి తాను ప్రదక్షిణలు చేయలేని స్థితిలోనున్నానని కంటతడి పెట్టాడు. ఆనాటి రాత్రికే శ్రీస్వామివారు ఆయన స్వప్నంలో కనిపించి "ఉప్పు లేకుండా ఒక్క పూట తినయ్యా" అని చెప్పారు. అలాచేయగానే అతడు సంపూర్ణ ఆరోగ్యవంతుడయ్యాడు.

ఒంగోలు–పద్మగారు భరించరాని నడుముల నొప్పితో గొలగమూడి వచ్చి కన్నీటితో ప్రార్థన చేయగానే శ్రీస్వామివారు ఆ బాధ తొలగించారు. శ్రీస్వామివారు చెప్పినది తనకు అర్థంకాలేదని డి.నాగేశ్వరరావు (దమ్మపేట) కన్నీటితో ప్రార్థించగానే తిరిగి స్వప్న దర్శనమిచ్చి తాము చెప్పదల్చినది స్పష్టంగా చెప్పారు.

గొలగమూడి నివాసి తన మోకాలు నొప్పి భరించలేక కన్నీటితో విన్నవిస్తే ఏ మ్రొక్కుబడి లేకుండానే ఆమెకు స్వప్నంలో శ్రీస్వామివారు ఆకు పసరు పూసి ఆ నొప్పి తొలగించారు. గొలగమూడి ఎరుకలపాళెం నలబోయి సిద్ధమ్మ కన్నీటికి కరిగిన శ్రీస్వామివారు ఆమెకు సంతానం ప్రసాదించారు. **హృదయ పూర్వకమైన ఆర్తి-విశ్వాసము మాత్రమే శ్రీస్వామివారు మన నుండి కోరే దక్షిణ.**

## బోధయజ్ఞాయనమః

తన దివ్య బోధనందించడంలో శ్రీస్వామివారు వారికి వారే సాటి. పూజ అంటే నాకు సదభిప్రాయం లేని రోజులవి. 'నిర్గుణ నిరాకారుడైన శ్రీస్వామివారు మన నైవేద్యాలు స్వీకరిస్తారా? మన తృప్తికి అలా చేస్తున్నాము' అని అనుకొని నేను యాంత్రికము, లాంఛనప్రాయమైన పూజ సాగిస్తున్న సమయం అది. హరిబాబు (గూడూరు) అనే మిత్రునికి శ్రాద్ధ కర్మలు, సంవత్సరిక కర్మలు, తద్దినాలు, పూజలను గూర్చి నాలాగే శంకతో ఉండి శ్రీ భరద్వాజ మాస్టారుగార్ని అనేక మార్లు ఈ విషయాలు అడగాలనుకునేవాడు. కానీ వారి దగ్గరకెళ్ళినాక మరిచిపోయేవాడు. ఒకరోజు శిరిడీకి వెళ్ళి శ్రీ శివనేశన్ స్వామివారిని దర్శించి నమస్కరించి కూర్చున్నాడట. ఇతనేమీ నోరువిప్పి అడగకుండానే శ్రీ శివనేశన్ స్వామివారు యథాలాపంగా చెప్పసాగారట. "ఒక కోటీశ్వరునకు ఒక్కడే కొడుకు, యుక్త వయస్సుకు రాగానే ఆ కుమారుడు మరణించాడు. తనకు నమ్మకం లేకున్నా కుమారుని కొరకు కర్మక్రతువులు, 40వ రోజు చేయవలసిన తంతు, సంవత్సరిక తద్దినం వగైరా చేస్తున్నాడు. ఒకసారి ఈ తండ్రిగారి మెలుకువలో పట్టపగలే చనిపోయిన కుమారుడు కనిపించి దూరపు నగరంలోని వారి ఫ్యాక్టరీలో ఎంత డబ్బు ఎవరెవరు తిన్నదీ, దాన్ని కప్పిపుచ్చుటకు వాళ్ళెలా తప్పుడు లెక్కలు వ్రాసిందీ చెప్పాడట. అది ఆ తండ్రి పట్టించుకోలేదు. తిరిగి రెండు మూడుసార్లు మరికొన్ని చెప్పాడు. 'చనిపోయినవాడొచ్చి చెప్పడమేమిటి?' అని తోసి వేశాడు.

"చివరకు సంవత్సరికం రోజు అన్ని పదార్థాలు నివేదనకు పెట్టి దండం పెట్టే సమయంలో మరలా కుమారుడు గాలిలో కనిపించి ఆ పాయసంలో చక్కెర తక్కువగా వేశారు చూడమన్నాడు. చూస్తే నిజంగానే చక్కెర తక్కువగా ఉంది. 'నీకిది ఎలా తెలిసింది?' అని ఆ తండ్రి తన కుమారుణ్ణి అడిగాడు.

మేము సూక్ష్మరూపంలో వచ్చి ఆ పదార్థాలలోని సూక్ష్మాన్ని గ్రహిస్తాము అని చెప్పాడట. ఆ తర్వాత ఆ తండ్రి తన ఫ్యాక్టరీలలో తన కుమారుడు చెప్పినట్లు విచారించి అన్నీ నిజమేనని తెలుసుకున్నాడు" అని శ్రీ శివనేశన్ స్వామి రూపంలో శ్రీస్వామివారే హరిబాబుగారి సందేహం తీర్చడమేగాక యాంత్రికము, లాంఛనప్రాయంగా సాగించే నా పూజా విధానాన్ని సరైన మార్గానికి మార్చారన్నమాట. శ్రీస్వామివారు ఆ విషయం హరిబాబుగారి ద్వారా నాకు చెప్పించి నన్ను సరైన మార్గానికి మార్చారు. అందుకే శ్రీ మాష్టారు సిద్ధపురుషులను మాత్రమే గురువుగా సేవించి తరించమని నొక్కి నొక్కి చెప్పారు.

## మానవునికి నిరంతరము అంటుకునే పాపము

శ్రీ వెంకయ్య స్వామివారు "నీవు మనుషుల్లోకి పోయి వచ్చావు నీవు పోసే గంజి వద్దుపో" అని నిత్యము తనకు గంజి పోసే సేవను మరొకరి ద్వారా చేయించుకునేవారు. "మనుషుల్లోకి పోయివచ్చావు" అంటే బాహ్యంగా మనుషులను తాకి వచ్చాడని అర్థంకాదు. ఆ సేవకుడు ఎవ్వరినీ తాకి రాలేదు. గొలగమూడిలోని కోనేటి వద్ద గాలం వేసి చేపలు పట్టే వాళ్ళు రాజకీయ విమర్శలు చేస్తూ ఇందిరాగాంధి, రాజీవ్‌గాంధీలను గూర్చి విమర్శిస్తుంటే ఈ సేవకుడు కూడా వారి సంభాషణలో పాల్గొన్నాడు. అలా విమర్శలలో పాల్గొని ఇతరులను గూర్చి మాట్లాడడమే అతను చేసిన పాపమని శ్రీస్వామివారి భావం.

'పాపం' అంటే ఏమిటి? 'పుణ్యం' అంటే ఏమిటి? **'పరపీడనం' పాపం – 'పరోపకారం' పుణ్యం** అన్నారు మహనీయులు. ఈ భక్తుడుగాని చేపలు పట్టేవారుగాని తమ సంభాషణలో ఇందిరాగాంధిగారిని, రాజీవ్‌గాంధీగారిని విమర్శిస్తూ వారి ఖ్యాతిపై దెబ్బ తీస్తున్నారు. అది ఇందిరాగాంధీగారికి వీరు కలుగజేసే పరపీడన మన్నమాట. అదే పాపము. ఇది ప్రతి మానవునకు వర్తిస్తుంది. నిత్యం అనుక్షణం చేసే ఈ పాపం నుండి మనం బయటపడనిదే శ్రీస్వామివారి బోధ మనకు హృదయగతం కాదు. గనుక పరులను విమర్శించే దుర్గుణం పూర్తిగా మానమంటున్నారు. పరమ పవిత్రమైన శ్రీస్వామివారి సన్నిధికి వచ్చి కూడా ఇతరులను విమర్శించడం అనే పాపం చేయడం ఎంత అపచారమో యోచించండి.

# పూజ

'మనం చేసే పూజలు యాంత్రికము, లాంఛనప్రాయముగా ఉంటున్నాయి' అంటారు శ్రీ భరద్వాజ మాష్టరుగారు. అందుచేతే అవి వెంటనే ఫలితము చూపడం లేదంటారు. మన పూజలు యాంత్రికము, లాంఛన ప్రాయము కాకుండా ఎలా చేయాలో చెప్పడమే కాకుండా వారు పూజను చేసి చూపారు. 'శ్రీ మాష్టరుగారి దివ్య స్మృతులు' అనే పుస్తకములో కొత్తూరు ప్రసాద్ అనేవారు శ్రీ మాష్టరుగారు పూజ చేయడం చూచి దాన్ని వర్ణిస్తారు. ఒక్కొక్క నామాన్ని నెమ్మదిగా అనేక సార్లు చెప్పేవారట. అప్పుడు మానసికంగా వారేమి చేసేవారో అనేక చోట్ల చెప్పారు. అట్లాగే మనమూ చేస్తే మన పూజ యాంత్రికము, లాంఛనప్రాయము కాకుండా సజీవమైన పూజ చేయగల్గుతాము. ప్రతి నామము యొక్క అర్థం తెలుసుకొని దానికి సంబంధించిన లీలలన్నీ నెమ్మదిగా మనసులో మెదలాలంటారు. గనుక ఒక నామంతోనే చాలా కాలం కదిలిపోతుంది. ఉదాహరణకు – సర్వసమర్థ శ్రీస్వామి నాథాయనమః అన్నప్పుడు – సర్వసమర్థుడుగా శ్రీస్వామివారు చేసిన లీలలను నెమ్మదిగా స్మరించడం. ఒక్క క్షణంలో ఒక వ్యక్తి ముగ్గురిని చంపాడు. ఆ చంపినవాడు శ్రీస్వామివారిని శరణువేడాడు. అతనిని రక్షించేందుకు కోర్టు రికార్డు రూములోని అతని ఫైలును చెదలు రూపంలో తినేశారు శ్రీస్వామివారు. ముగ్గురుని చంపిన వాణ్ణి రక్షించవచ్చా అని మీరడుగవచ్చు. పూర్వ జన్మలో వీళ్ళు ముగ్గురు కలసి ఇతనిని చంపి ఉండవచ్చు. అది సర్వజ్ఞుడైన శ్రీస్వామివారికి తెలుసు గనుక అలా చేశారు. ఇలాగే మరికొన్ని లీలలు సంక్షిప్తంగా స్మరించడం. ప్రాణలింగస్వరూపాయనమః అన్నాము – ప్రాణము గల వాటికి చలనం ఒక లక్షణంగా చెప్పబడింది. గనుక భూమి, గ్రహాలు, నెబ్యులాస్ అనే నక్షత్ర కూటములూ నిరంతరం చలిస్తూనే ఉన్నాయి. ఇంతేగాక ప్రతి పదార్థంలోనూ గల ఎలక్ట్రాన్‌లు నిరంతరము తిరుగుతూనే ఉన్నాయి. కనుక విశ్వమంతా ప్రాణమయంగా ఉంది.

స్మృతి మాత్ర ప్రసన్నాయనమః అన్నాము. తలచిన వెంటనే ఎవరెవరికి కష్టాలు తీర్చారు? అనే లీలల్ని మనసులో ఎంతసేపైనా మెదలవచ్చు. స్మృతి రహిత ప్రసన్నాయనమః అన్నామనుకోండి. రోశిరెడ్డి కుమారుడు మామిడికాయల బండితో సహా కొండమీద నుండి వాగులో పడ్డప్పుడు ఆయన

శ్రీస్వామివారిని పిలువకపోయినా రక్షించారు.

కస్తూరి అంకయ్య మనవడు బావిలో పడ్డప్పుడు ఎవ్వరూ శ్రీస్వామివారిని ప్రార్థించకుండానే ఆ బిడ్డను కాపాడారు. తూపిలి పిచ్చెమ్మ కుమార్తె అగ్ని గుండంలో పడ్డప్పుడు అలానే రక్షించారు. ఇలాంటి లీలలెన్నయినా మననం చేయవచ్చు.

ఇదే విధంగా ప్రతినామానికి సంబంధించిన లీలలు నెమ్మదిగా మనసులో మెదులుతూ ఉంటే అది సజీవమైన పూజ అవుతుంది. ఇది ఆచార్య భరద్వాజ మాష్టరుగారు చేసి ఆచరించి చూపిన పూజ. అలానే మనందరినీ చేసి తరించమన్నారు.

మనం పనితొందరలో అరగంటలోనే పూజ ముగించాలంటే ముగించవచ్చు. కానీ అన్ని నామాలు చదవలేదనే అసంతృప్తి ఉండనక్కరలేదు. లేదంటే చివరి ఐదు నిమిషాల్లో నామాలన్నీ చదివేయవచ్చు. చేసిన కొద్దిసేపైనా యాంత్రికము, లాంఛన ప్రాయము కాని సజీవమైన పూజ చేసి వారి మహిమను తలచుకొని పులకరించమంటారు.

## కాకబలి

శ్రీస్వామివారు మనకు తమ ఆచరణ ద్వారా బోధించిన బోధలలో ముఖ్యమైనది కాకబలి. మనం తినే ఆహారమంతా భగవంతునిచే ప్రసాదించబడిందే. ఒక బియ్యపు గింజ రావాలంటే ఎన్నిజీవులు శ్రమపడాలో ఆలోచించండి. పొలం దున్నాలంటే నాగలికి ఇనుము కావాలి. ఇనుము గనిలోనించి తీసి పొలం దున్నే ట్రాక్టరు రూపం ధరించాలంటే ఎంత మంది శ్రమ చేయాలో యోచించండి. ట్రాక్టరును నడిపించే ఆయిల్ కావాలంటే ఎందరు శ్రమ చేయాలోగదా! అలాగే బావి, బక్కెట్టు, తాడు, మన వంటపాత్రలు, వంటచేసే పొయ్యి, గ్యాసు, మనం నివసించే ఇల్లు వీటినన్నింటినీ తయారు చేయాలంటే ఎన్ని జీవుల కృషి అవసరమో చూడండి. ఎక్కడెక్కడో ఉన్న చెత్తను కృళ్ళింపజేసి ఎరువు తయారు చేయాలంటే ఎన్ని కోట్ల సూక్ష్మజీవులవసరమో! అలాగే మనం తిన్న ఆహారంలోని పిప్పిని కృళ్ళచేసి మలరూపంగా మార్చాలంటే మన పెద్ద ప్రేగులలోని అసంఖ్యాకములైన సూక్ష్మజీవుల పాత్ర చాలా ముఖ్యమైనది. ఇలాగే పాలు, నెయ్యి, పప్పు, కూరలు,

మన బట్టలు ఇవన్నీ మనకు కావాలంటే ఎన్ని జీవులు కృషి చేయాలో ఆలోచించాలి. ఇవి మాత్రమే కాక పంచభూతాలు నిరంతరము సహకరించాలి. పంచభూతాలంటే భూమి, సూర్యుడు, నీరు, గాలి, ఆకాశము, జీవుల రూపంలోను, పంచభూతాల రూపంలోను ఆ పరమాత్మే పనిచేసి మనకు ఆహారము, ఇల్లు, గుడ్డ సమకూరుస్తున్నాడు. దీనికి కృతజ్ఞతా పూర్వకంగా ఆ పరమాత్మకు మనం నిండైన ప్రేమతో సమర్పించేదే కాకబలి. **'ఓ ప్రభూ! అసంఖ్యాకమైన జీవుల రూపంలోను, పంచభూతాల రూపంలోను అనుక్షణం కృషిచేసి నాకీ ఆహారం సమకూర్చావు. నేను తమకు సమర్పించే ఈ ఆహారం స్వీకరించి నన్ను ఋణవిముక్తుని చేయండి తండ్రీ' అని మనస్ఫూర్తిగా చెప్పుకొని ప్రేమ, కృతజ్ఞతలతో సమర్పించేదే కాకబలి.** మనకుంది గనుక పిడికెడు మెతుకులు బయట పడవేయడం తగదంటారు పెద్దలు. 'కాకబలి సమర్పించడంలో హృదయం ఉప్పొంగే కృతజ్ఞతా భావం అవసరమ'ంటారు పెద్దలు. అలా ఆచరించి చూపారు శ్రీస్వామివారు. మనలను కూడ అలా ఆచరించి ఋణవిముక్తులు కమ్మంటున్నారు.

## దానం చేసిన వస్తువులపై పేర్లు వేయించుట

ఏ విషయములోనైనా సిద్ధపురుషుల మాట మనకు శిరోధార్యము. శ్రీ జ్ఞానేశ్వర్ మహరాజ్ అను వారు గొప్ప సిద్ధపురుషులు. కట్టెలు దొరకలేదని ప్రక్కింటి ఆమెను కట్టెలు అడిగితే ఆమె తిట్టిందని ఏడుస్తున్న తన చెల్లెల్ని చూచి తన యోగశక్తిచే తన వీపును దోశెల పెనము వలె పొగలు వచ్చేటట్లు చేసి దోశలు పోయించారు. తన స్నేహితుడు మరణించి అందరూ దుఃఖసాగరములో ఉన్నప్పుడు జ్ఞానేశ్వర్ మహరాజ్ వెళ్ళి ఆ మృతజీవి చేయి పట్టుకొని ఆడుకుందాము రమ్మని పిలువగానే ఆ చనిపోయిన పిల్లవాడు లేచి మహరాజ్‌తో వెళ్ళాడు. మహరాజ్ ఎప్పుడూ, అంతా బ్రహ్మమే అని చెప్పేవాడు. అంతా బ్రహ్మమయితే నీవు వేదం వల్లించగలవు కదా! ఆ దున్నపోతు వేదం చెప్పగలదా? అన్న బ్రాహ్మణునితో – అది కూడా వేదం చెప్పగలదు అని చెప్పి మహరాజ్ ఆ దున్నపోతును తాకి వేదం చెప్పమని ఆజ్ఞాపించారు. వెంటనే ఆ దున్నపోతు నాలుగున్నర గంటలసేపు సుస్వరముగా వేదగానము చేసింది.

ఈ లీలతో మహరాజ్ ఖ్యాతి నాలుగు మూలలా వ్యాపించింది. ఆ ప్రాంతములోనున్న చాంగ్‌దేవుడు పులిని వాహనముగా, త్రాచుపామును

కంఠహారముగా ధరించి గొప్ప పేరుప్రతిష్ఠలు గలవాడు. అతడు పులివాహనమెక్కి జ్ఞానేశ్వర్ మహరాజ్‌ను చూడవచ్చుచుండెను. పైఠాన్ గ్రామ ప్రజలందరు చాంగ్‌దేవునకు స్వాగతము పలుకడానికి గ్రామపొలిమేరకు వెళ్ళారు. శ్రీ జ్ఞానేశ్వర మహరాజ్ మరియు అతని స్నేహితులు ఆడుకొంటూ అపుడు గ్రామములోనే ఉన్నారు. స్నేహితులందరూ 'మనము కూడా చాంగ్ దేవుని చూచేందుకు పోదామ'న్నారు. శ్రీ జ్ఞానేశ్వర్ మహరాజ్ తన స్నేహితులందరిని ఒక మొండి గోడపై నెక్కించుకొని ఆ మొండి గోడను కదలమని ఆజ్ఞాపించారు. గుఱ్ఱమువలె ఆ మొండి గోడ వారినెక్కించుకొని బయలు దేరినది. అది చూచిన చాంగ్‌దేవుడు తన శక్తి సామర్థ్యముల ఎడ తనకున్న గర్వమునకు సిగ్గుపడ్డాడు. జీవము గల పులిని నడిపించుట గొప్పగాదు. జీవములేని గోడను నడిపించినదే గొప్పయోగశక్తి అనే జ్ఞానము కల్గి శ్రీ జ్ఞానదేవులకు పాదాక్రాంతుడయ్యాడు.

ఇలాంటివి లెక్కలేనన్ని దివ్యలీలలు చేసిన శ్రీ జ్ఞానదేవ్ మహరాజ్ వయస్సు పన్నెండు సంవత్సరములే. ఈ మహనీయుడు శ్రీ భగవద్గీతకు వ్రాసిన వ్యాఖ్యకు జ్ఞానేశ్వరీ భగవద్గీత అని పేరు. పదహారవ అధ్యాయములో శ్రీ జ్ఞానేశ్వర్ మహరాజ్‌గారు ఇలా చెప్పారు.

'ఈ లోకమునందును, పరలోకమునందును మనకు స్నేహ పూర్ణుడుగా నుండు ధర్మము-అభిమానముతో మేము ధర్మాచరణమొనర్చుచున్నామని చెప్పుకొనుచున్నచో మనను తరింపజేయు ధర్మము కూడా మనకు దోషము కలుగ జేయుచున్నది. కావున ఓ అర్జునా! మనము చేసిన ధర్మ కార్యమును ఆడంబరముగా నలుదిక్కులకు ప్రచారము చేసుకొన ఆరంభించినచో ఆ ధర్మము కూడా అధర్మమే అగును.' గనుకనే విద్యానగర్ (నెల్లూరు జిల్లా) లో పూజ్యశ్రీ భరద్వాజగారి ఆధ్వర్యములో నిర్మించిన శ్రీ శిరిడీ సాయి మందిరంలో వస్తువులపై పేర్లుగానీ, మందిర నిర్మాణమునకు సహకరించిన వారి పేర్లుగానీ వ్రాయబడలేదు. ఇందుకే కాబోలు పెద్దలు 'గుప్తదానం' అన్నారు. కుడిచేత్తో దానం చేస్తే ఎడమ చేతికి తెలియకూడదన్నారు.

**ముఖ్య గమనిక:-** గొలగమూడిలో అనేక మంది మోసగాళ్ళు చిన్న చిన్న చిట్కాలు చేసి మీ కష్టాలు పోగొడతామని క్రొత్త వారిని మోసం చేస్తున్నారు. శ్రీ స్వామివారిని తప్ప ఇతరులెవ్వరినీ నమ్మవద్దని మనవి.

## పాఠముల పట్టిక


| పాఠం నెం. | పేజి నెం. | పాఠం నెం. | పేజి నెం. | పాఠం నెం. | పేజి నెం. | పాఠం నెం. | పేజి నెం. |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 19 | 35 | 127 | 70 | 172 | 104 | 186 |
| 2 | 33 | 36 | 128 | 71 | 172 | 105 | 188 |
| 3 | 37 | 37 | 128 | 72 | 173 | 106 | 188 |
| 4 | 40 | 38 | 128 | 73 | 173 | 107 | 190 |
| 5 | 40 | 39 | 136 | 74 | 174 | 108 | 192 |
| 6 | 42 | 40 | 137 | 75 | 174 | 109 | 193 |
| 7 | 45 | 41 | 140 | 76 | 175 | 110 | 193 |
| 8 | 46 | 42 | 147 | 77 | 176 | 111 | 193 |
| 9 | 47 | 43 | 148 | 78 | 176 | 112 | 194 |
| 10 | 49 | 44 | 148 | 79 | 176 | 113 | 195 |
| 11 | 50 | 45 | 150 | 80 | 176 | 114 | 197 |
| 12 | 50 | 46 | 150 | 81 | 177 | 115 | 211 |
| 13 | 55 | 47 | 156 | 82 | 177 | 116 | 212 |
| 14 | 56 | 48 | 156 | 83 | 178 | 117 | 212 |
| 15 | 61 | 49 | 157 | 84 | 178 | 118 | 213 |
| 16 | 65 | 50 | 157 | 85 | 178 | 119 | 213 |
| 17 | 66 | 51 | 157 | 86 | 178 | 120 | 216 |
| 18 | 68 | 52 | 160 | 87 | 178 | 121 | 218 |
| 19 | 68 | 53 | 160 | 88 | 178 | 122 | 220 |
| 20 | 74 | 54 | 162 | 89 | 179 | 123 | 221 |
| 21 | 74 | 55 | 162 | 90 | 179 | 124 | 225 |
| 22 | 75 | 56 | 163 | 91 | 179 | 125 | 227 |
| 23 | 77 | 57 | 163 | 92 | 179 | 126 | 235 |
| 24 | 78 | 58 | 165 | 93 | 180 | 127 | 240 |
| 25 | 80 | 59 | 165 | 94 | 180 | 128 | 242 |
| 26 | 82 | 60 | 166 | 95 | 180 | 129 | 244 |
| 27 | 88 | 61 | 166 | 96 | 181 | 130 | 245 |
| 28 | 99 | 62 | 167 | 97 | 181 | 131 | 255 |
| 29 | 103 | 63 | 167 | 98 | 182 | 132 | 255 |
| 30 | 104 | 64 | 168 | 98A | 182 | 133 | 256 |
| 31 | 109 | 65 | 170 | 99 | 183 | 134 | 256 |
| 32 | 115 | 66 | 171 | 100 | 184 | 135 | 262 |
| 33 | 116 | 67 | 171 | 101 | 184 | 136 | 264 |
| 33A | 116 | 68 | 172 | 102 | 185 | 137 | 267 |
| 34 | 119 | 69 | 172 | 103 | 186 | | |